UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD ( A. P. )

Cl. No. ______ Acc No. 312

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

# క థా స రి త్సా గ ర ము

## నా లు గ వ భా గ ము.

వేదము వేంకటరాయశాస్త్రి ప్రణీతము.



వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్

4. మల్లికేశ్వరస్వామిగుడి సందు, లింగిసెట్టివీథి,

జి. టి. మదరాస్.

తృతీయముద్రణము

చంద్రికా ముద్రణాలయము, చాకలపేట,

మదరాసు, మార్చి 1953.

# కథాసరిత్సాగరము

## నాలుగవభాగము, విషయానుక్రమణిక.

### శక్తియశోలంబకము


| విషయము. | | పుట. | విషయము. | | పుట. |
|---|---|---|---|---|---|
| భారికరత్నదత్తుల | కథ | 1017 | మూఁడుచేపల | కథ | 1082 |
| భద్రఘటము | ,, | 1019 | సూచీముఖ | ,, | 1085 |
| ఆలజాల | ,, | 1022 | ధర్మబుద్ధి దుష్టబుద్ధుల | ,, | ,, |
| కుముదికయను వేశ్య | ,, | 1034 | కొంగయు పామును | ,, | 1087 |
| చంద్రశ్రీ | ,, | 1039 | ఇనుపకాటా | ,, | 1088 |
| దేవదాసుని | ,, | 1040 | మూర్ఖుల కథలు | | 1090 |
| వజ్రసారుని | ,, | 1041 | అగరుదాహి | | 1090 |
| కల్యాణవతి | ,, | 1044 | తిలకార్షికుఁడు | | 1091 |
| శక్తియశ | ,, | 1047 | అగ్నికుంభుఁడు | | ,, |
| మకరందిక | ,, | 1049 | నాసికారోపణుఁడు | | 1092 |
| సింహవృషభాదిక | ,, | 1065 | పశుపాలుఁడు | | ,, |
| మేకుపెఱికిన కోఁతి | ,, | 1066 | అలంకారలంబకుఁడు | | 1093 |
| భేరీజంబుక | ,, | 1069 | తూలికుఁడు | | ,, |
| కొంగనుచంపినయెండ్రి | ,, | 1071 | ఖర్జూరీచ్ఛేదకుఁడు | | 1094 |
| సింహశశక | ,, | 1073 | నిధ్యాలోకనుఁడు | | ,, |
| నల్లియు చీరపేనును | ,, | 1076 | లవణాశనుఁడు | | 1095 |
| మదోత్కటము | ,, | 1078 | గోదోహకుఁడు | | ,, |
| లకుముకి | ,, | 1080 | పథికఖల్వాటులు | | 1096 |
| కంబుగ్రీవము | ,, | 1081 | | | |

| విషయము. | పుట. |
|---|---|
| కాక మూషక కూర్మ మృగ ములకథ | 1097 |
| హిరణ్యుని పూర్వవృత్తాంతము | 1100 |
| అతిసంచయేచ్ఛాదోషము | 1101 |
| లోభినక్క | ,, |
| చిత్రాంగాగమనము | 1103 |
| ఈర్ష్యాళుపతి | 1105 |
| స్త్రీలకు రహస్యము | 1108 |
| ఖల్వాటుఁడు, కేశముగ్ధుఁడు | 1109 |
| తైలముగ్ధుఁడు | 1110 |
| అస్థిముగ్ధుఁడు | ,, |
| చండాలకన్య | 1111 |
| మూర్ఖరాజు | 1112 |
| మిత్రద్వయము | 1113 |
| జలభీతుఁడు; పుత్త్రఘాతి; భ్రాతృమూఘుఁడు | 1115 |
| బ్రహ్మచారిసుతుఁడు | 1116 |
| గణకుఁడు | ,, |
| కోపి, కన్యావరయిత | 1117 |
| అర్థపణుఁడు | 1118 |
| అభిజ్ఞానకర్త | 1119 |
| ప్రతిమాంసప్రదుఁడు | ,, |
| పుత్త్రాంతరకాంక్షిణి | 1120 |
| ఆమలకానేత | 1121 |
| భ్రాతృద్వయము | ,, |
| నాపితార్థి | 1123 |
| నకించిన్మార్గణుఁడు | 1124 |
| కాకోలూకీయము | 1125 |
| గర్దభాఖ్యాయిక | 1127 |
| వ్యపదేశమువలనిసిద్ధి | 1128 |
| శశకపింజలకథ | 1130 |
| సంఘముజయించును | 1131 |
| అరక్షణీయుని ఉపకారిని | 1133 |
| చోరరాక్షసులు | 1134 |
| వడ్రంగియు వానిచేడియు | 1136 |
| ఎలుకపిల్లయు మునియు | 1138 |
| ముసలిపామును కప్పలును | 1140 |
| మూఢుఁడైనభృత్యుఁడు | 1142 |
| అన్నదమ్ములు వేఱుపోవుట | ,, |
| అసంతుష్టి చెఱుపు | 1143 |
| సువర్ణముగ్ధుఁడు | 1144 |
| మహామూర్ఖులు | 1145 |
| అపూపికాముగ్ధుఁడు | 1146 |
| మహిషముగ్ధుఁడు | 1147 |
| వైద్యుఁడు, మఱుగుజ్జు | 1149 |

| విషయము. | పుట. |
|---|---|
| యశోధర లక్ష్మీధరులకథ | 1150 |
| కోఁతియు, మొసలియు | 1159 |
| గర్దభాఖ్యాయిక | 1161 |
| గాంధర్వ పరితోషకునికథ | 1164 |
| మూర్ఖశిష్యద్వయకథ | 1165 |
| ఇరుదలపాము | 1166 |
| తండులభక్షకుఁడు | 1167 |
| బాలురు, మగగాడిద | ,, |
| గ్రామమునకు పోయివచ్చిన | 1168 |
| బ్రాహ్మణకులము | ,, |
| విధివిరుద్ధకృతము | 1170 |
| జడుఁడును కోఁతులును | ,, |
| దరిద్రుఁడును నాణెములు | 1171 |
| జడుఁడును బాలచంద్రుఁడును | ,, |
| ప్రాజ్ఞుల కథలు | ,, |
| అసాధ్యసాధనము ప్రజ్ఞ | 1172 |
| ఘటకర్పరుల కథ | 1173 |
| ధనదేవభార్య కథ | 1177 |
| రుద్రసోమునిభార్య కథ | 1179 |
| శశిభార్య కథ | 1180 |
| నాగభార్య కథ | 1183 |
| బోధిసత్వాంశభవుఁడు | 1184 |
| భిక్షుమూర్ఖుఁడు | 1196 |
| టక్కుమూర్ఖుఁడు | 1197 |

| విషయము. | పుట. |
|---|---|
| మార్జారమూఢుఁడు | 11!9 |
| కొలను త్రవ్వించినమూఢు | 1201 |
| చెట్టుమీఁదుగాపోయిన | 1203 |
| మృగాంక లేఖా హిరణ్యాక్షులు | 1204 |
| విద్యాభిమానియతి | 1207 |
| పాటలీపుత్త్రస్త్రీలు | 1210 |
| ఏకాదశమారిణి | 1213 |
| ఏకవృషభుఁడు | 1214 |
| పరవంచనజీవుఁడు | 1215 |
| హేమప్రభా లక్ష్మీసేనులు | 1217 |

---

వేలాలంబకము

| | |
|---|---|
| వేలకథ | 1224 |

---

| | |
|---|---|
| శశాంకవతీలంబకము | 1235 |
| నక్కపిడియేనుఁగుకథ | 1237 |
| లలితలోచనాజననవృత్తాంత | 1238 |
| లలితలోచనా నరవాహనదత్తుల యెడఁబాపు | 1243 |
| మృగాంకదత్తుని కథ | 1245 |
| అనంగలీలాభద్రబాహులు | 1248 |
| వినయవతీపుష్కరాక్షులు | 1251 |
| విద్యుల్లేఖాధర్మసేనులు | 1256 |

| విషయము. | పుట. | విషయము. | పుట. |
|---|---|---|---|
| లావణ్యమంజరి | 1259 | వరాహాబోధిసత్త్వునికథ | 1318 |
| మృగాంకదత్తుఁడుతరలుట | 1262 | వినీతమతి బోధిసత్త్వచర్య | 1321 |
| శ్రుతధివృత్తాంతము | 1265 | బ్రాహ్మణరజక కథ | 1326 |
| రసాయన నీరాశనులు | 1266 | దానపారమిత | 1327 |
| మృగాంక-కిరాతపతి | 1267 | శీలపారమిత | 1329 |
| పారావతనాగుఁడు | 1268 | క్షమాంపారమిత | 1331 |
| విమలబుద్ధికథ | 1271 | ధైర్యపారమిత | 1333 |
| సంసారచక్రము | ,, | ధ్యానపారమిత | 1334 |
| నీటిలోని యరణ్యదర్శన | 1272 | ప్రజ్ఞాపారమిత | 1337 |
| మాయాంనటుపుతో చెలిమి | 1276 | విచిత్రకథకుని కథ | 1346 |
| చండకేతునికథ | 1278 | శ్రీదర్శనుని కథ | 1348-1363 |
| భీమపరాక్రముని కథ | 1282 | భూనందనుని కథ | 1354 |
| హంసావళీ కమలాకరులు | 1283 | ప్రచండశక్తి కథ | 1388 |
| కనకమంజరి చేసినవంచన | 1289 | వారణ కథ | 1390-1409 |
| కనకమంజరికి శాస్తి | 1299 | అక్షక్షపణకుని కథ | |
| హంసావళీకమలాకర వివాహము | 1301 | ఒంటె,అత్తాకోడండ్ర కథ | 1403 |
| | | శంఖదత్తుని చేఁపమ్రింగుట | 1406 |
| గుణాకరుని కథ | 1306 | విక్రమకేసరి కథ | 1419 |
| వినీతమతి కథ | 1309 | త్రివిక్రమసేనునికథ | 1421 |

# శక్తియశోలంబకము

## ౧-వ తరంగము.

క. శ్రీరుచిరము సిందూర వి
నీరంధ్ర మరాత్యవారణీయమహిమ మా
హైరంబవారణీయము
దూరముగా విసరుఁ గరము దురితౌఘములన్.

క. పురములపై హరునకును
శరసంధానమున రెండుసక్తము లగుడున్
ఖరవిస్ఫురణోల్బణ సం
భర మగు నిటలాక్షి దురితపాళిం గాల్చున్.

క. అరివధమున రక్తారుణ
ఖర కుటిల నృసింహుదృష్టి కరరుహతతియున్
హరియించును గావుత మీ
దురితవ్రాతంబు పుణ్యదోహన మగుచున్.

### ఖారికరత్నదత్తులకథ.

ఈ రీతిని నరవాహనదత్తుఁడు సభార్యుఁడై కౌశాంబి యందు సుఖముండెను. ఒకనాఁడు అతఁడు తండ్రితోఁగూడ

ఆస్థానమం దుండఁగా ఒక వర్తకుఁడు రత్నదత్తుఁ డనువాఁడు ప్రతిహార నివేదితుఁడై రాజానుజ్ఞాతుఁడై వచ్చి రాజునకు ప్రణమిల్లి ఇట్లు విన్నపము చేసికొనెను. "దేవా, వసుధరుఁడని ఈనగరములో దరిద్రుఁడు బరువులు మోచువాఁడు ఒకఁడు కలఁడు. వాఁడు ఇప్పుడు ఆకస్మికముగా త్రాగుచు భుజించుచు సుఖముగా నున్నాఁడు. దానిని చూడఁగా కౌతుకమై వానిని మాయింటికిఁ గొనిపోయి మత్తెక్కఁ ద్రాగించి యడుగఁగా వాఁడు చెప్పిన దేమనఁగా 'రాచనగరిద్వారమున రత్నఖచితమైన కడియము నాకు దొరకినది. అందునుండి ఒక రత్నము పెకలించి విక్రయించితిని. లక్ష దీనారములు వెల యొసఁగి దానిని హిరణ్యగుప్తుఁ డను వణిజుఁడు కొన్నాఁడు. అందువలన నేను సుఖముగా జీవించుచున్నాను.' ఇట్లు పలికి వాఁడు ఏలినవారిపేరు చెక్కిన యాకడియమును చూపినాఁడు. నేను ఏలినవారికి విన్నవించితిని." వత్సరాజు విని కడియము తోఁ గూడ భారికుని, రత్నముతోఁ గూడ వణిజుని రప్పించెను.

'ఆహా! జ్ఞప్తికలిగినది! ఇది నాచేతినుండి ఊరేగింపులో జాఱిపడిపోయినది!' అని ఆకటకమును రాజు జ్ఞప్తిచేసికొని పలికెను. రాజునెదుట సభ్యులు 'ఓరీ, రాజుపేరుచెక్కిన యీ కడియము నీకు దొరకిన నీవు దానిని ఎట్లు ఉంచుకొన్నావు?' అని యడుగఁగా, 'బాబూ, బరువులుమోచు కూలివాఁడను, నాకు రాజనామాక్షరములు ఎట్లు తెలియును, దారిద్ర్యదుఃఖ

దగ్ధుఁడను నేను ఇది దొరకఁగానే పుచ్చుకొంటిని.' అని భారి కుఁడు పలికెను. అంత సభ్యులు రత్నమును గుఱించి వణిజుని ఆక్షేపించిరి. 'నేను వెల యిచ్చి బజారులో కొంటిని, దానిపై రాజుగారి గుఱుతు లేదు. దానివెలలో వీఁడు అయిదువేలు కొనిపోయినాఁడు; మిగత నాయొద్దనే ఉన్నది.' అని హిరణ్య గుప్తుఁడు చెప్పెను. ఈ మాటవిని యౌగంధరాయణుఁడు 'ఈ విషయములో ఎవరిదియు దోషము గాదు. పేదవాఁడు అక్షర మెఱుఁగనివాఁడు ఈకూలివాఁడు. దారిద్ర్యముచే దొంగతనము కూడ చేయుదురు. దొరకినదానిని ఎవరు వదలుదురు! ఈ వణిజుఁడు వెల యిచ్చి రత్నమును గ్రహించినాఁడు. కనుక ఇతని యందును తప్పు లేదు.' అని చెప్పెను. ఆ మహామంత్రి వచనమును వత్సరాజు అంగీకరించెను. భారికుఁడు వ్యయము చేసికొన్న యైదువేలను ఇచ్చి రాజు హిరణ్యగుప్తునివలన ఆరత్న మును పుచ్చుకొని భారికునివలన కడియమును పుచ్చుకొని వారిని పంపెను. అయిదువేలు వ్యయము చేసికొన్న వాఁడై భయము తీఱి భారికుఁడు పోయెను. 'నమ్మినవానిని ద్రోహము చేసినవాఁడు వీఁడు పాపాత్ముఁడు.' అని రాజు మనస్సులో రత్నదత్తుని ద్వేషించుచునే కార్యగౌరవముచే ఆదరించెను.

## భ ద్ర ఘ ట ము క థ.

వారు పోయినపిమ్మట రాజుమ్రోల వసంతకుఁడు ఇ ట్లనియె: ఆహా! దైవనిహతులకు అర్థము దొరకినను నిలువదు.

ఈ కూలివాని గతి భద్రఘట వృత్తాంత మయినది. వినుఁడు.-

పూర్వము పాటలిపుత్త్రకంబున శుభదత్తుఁ డని యొక కట్టెల మోపువాఁడు ఉండెను. వాఁడు దినదినము ఒకమోపు కట్టెలు అడవినుండి తెచ్చి అమ్ముకొని జీవించుచుండెను. ఒకనాఁడు వాఁడు చాలదూరము వనములో పోయి అచట నలుగురు యక్షులను దివ్యాభరణాంబరులను చూచి బెదరి పోయెను. వారు వీనిబెదరును చూచి ప్రీతులై, అందఱును అడిగి, పేద వాఁ డని ఎఱిఁగి, కృప గలిగి, 'ఓయి నీవు ఇచ్చటనే మాయొద్ద పనులు చేయుచుండుము. నీకుటుంబమును మేము అశ్రమము గా భరించెదము.' అని పలికిరి. వల్లె యని శుభదత్తుఁడు వారికి స్నానాది పరిచర్యలు చేయుచు వారికడనే యుండెను. భోజనవేళ కాఁగా యక్షులు వానితో 'ఓయి ఈభద్రఘటము నుండి మాకు ఆహారములు ఎత్తిపెట్టుము.' అని ఘటము చూపిరి. వాఁడు ఆవట్టికుండను చూచి సందేహించుచుండఁగా గుహ్యకులు నవ్వుచు, "శుభదత్త, నీకు తెలియదు. కుండ లోపల చేయి పెట్టుము. కోరిన దెల్ల దొరకును. ఈఘటము కామప్రదము సుమా.' అని బోధించిరి. అట్లే అతఁడు చేయి పెట్టఁగా కోరిన యాహారపానాదిక మెల్ల అందు సిద్ధముగా నుండెను. శుభదత్తుఁడు వారికి పెట్టి పిమ్మట తాను భుజించెను. ఈరీతిని యక్షులను భయభక్తులతో కొలుచుచు వారికడనే

కుటుంబ చింతార్తుఁడై యుండెను. దుఃఖార్త మయినయతని కుటుంబమును గుహ్యకులు కలలో ఓదార్చిరి.

నెలకాఁగానే యక్షులు శుభదత్తునితో 'నీ భక్తికి మెచ్చితిమి. ఇచ్ఛేదమ ఆడుగుము ఏ మయిన.' అని పలికిరి. 'నిజముగా నాపై తుష్టియేని ఈ భద్రఘటమును నాకు దయ సేయుఁడు.' అని శుభదత్తుఁడు వేఁడెను. 'దీనిని నీవు కాపాడు కొనలేవు; ఇది పగిలిపోయిన మఱి నిలువదు. కనుక వేఱు వరము వేఁడుము' అని యక్షులు చెప్పిరి. శుభదత్తుఁడు మఱి యొండువరము నొల్లనందున యక్షులు దానినే వాని కిచ్చిరి. అంతట శుభదత్తుఁడు వారికి ప్రణమిల్లి ఆఘటమును పుచ్చుకొని యింటికిఁ బోయెను. అతనిం గని బంధువులు సంతసించిరి. ఇంట ఆఘటమునుండి భోజనాదికమును గ్రహించి, దానిని పదిలము గా ఇతరభాండములనడుమ దాఁచిపెట్టి, బంధుసమేతుఁడై శుభ దత్తుఁడు భోజనము చేసెను. ఇట్లు ఆతఁడు భారముక్తుఁడై భోగము లనుభవించుచు ఒకనాఁడు పానమత్తుఁడై యుండఁగా బంధువులు వానిని, 'నీకు ఈభోగశ్రీ ఎట్లు గలిగినది?' అని యడిగిరి. మూఢుఁడు గర్వముచే మాటగా చెప్పక, ఘటమును బుజమునఁ బెట్టుకొని నర్తనము చేయనారంభించెను. కైపుచే కాళ్లు తడఁబడుచు నృత్యము చేయుచుండఁగా బుజమునుండి ఘటము నేలఁ బడి ముక్కలయి పోయెను. వెంటనే ముక్క లన్నియుచేరి అక్షతఘటమై యక్షులయొద్దకుఁ బోయి చేరెను.

శుభదత్తుఁడు మరల యథాప్రకారము విషాదాక్రాంతుఁడై దరిద్రుఁడాయెను. ఈరీతిగా అదృష్టహీనులు చేతికి అబ్బినసిరిని గూడ పానాదిదోషములచే పోఁగొట్టుకొందురే గాని కాపాడుకోఁజాలరు.

ఇట్లు వసంతకునివలన భద్రఘటాఖ్యానమును విని వత్సేశ్వరుఁడు గోష్ఠిచాలించి స్నానాహారాది కృత్యములకు లేచెను. నరవాహనదత్తుఁడును తండ్రితోఁగూడనే స్నానమాడి భుజించి సాయంకాలమున చెలికాండ్రతోఁగూడ తన మందిరమునకుఁ బోయెను. ఆరాత్రి అతఁడు నిద్ర పట్టక మేలుకొని యుండఁగా మరుభూతి ఇతర సచివులు గూడ విన నిట్లనియె.—'దేవా, నీవు దాసీసంగేచ్ఛచే అంతఃపురమును పిలువవైతివి, దాసిని కూడ పిలువకుంటివి, అందుచేత నీకు ఇప్పుడు నిద్రపట్టకున్నది. ఇప్పటికిని ఎఱిఁగియు వేశ్యలను కామించెదవు! వీరికి సద్భావము లేదు. అందులకు ఈకథను వినుము.

### ఆలజాలకథ.

చిత్రకూట మని లక్ష్మీసమృద్ధ మయిన మహానగరము కలదు. అందు రత్నవర్మ యని మహాధనుఁడు ఒక వర్తకుఁడు ఉండెను. అతనికి ఈశ్వరారాధనచేత కొమారుఁడు కలిగెను. వానికి ఆ కారణమున ఈశ్వరవర్మ యని యాతఁడు పేరు పెట్టెను. ఆచిన్నవానికి విద్యాభ్యాసము ముగిసి యౌవనము ప్రవేశింపఁగా ఏకపుత్త్రుఁడైన రత్నవర్మ యిట్లు తలపోసెను.

'వేశ్య యనఁగా లోకములో యావనాంధుల ధనప్రాణములను హరింపు మని బ్రహ్మదేవుఁడు మూర్తిమతిగా చేసిన నికృతి కనుక ఈ కుమారుని ఒకకుట్టనికి అప్పగించి, వేశ్యలకు వీఁడు లోఁబడ కుండునట్లు వారిమాయలను నేర్పించెదను.' ఇట్లాలోచించి రత్నవర్మ కుమారునిఁ దోడ్కొని యమజిహ్వ యను పేరి కుట్టని యింటికి పోయెను. అచట కొమారితకు ఆట నేర్పుచున్న యా కుట్టనిని, లావు లైన చెక్కిళ్లు పెద్ద దంతములు చప్పిముక్కు గలదానిని, కనెను. ఆ ముసలిది కొమారితకు 'పుత్త్రీ, వేశ్యాజన మెల్ల ధనముచే గౌరవము పొందును, అనురాగము గలదానికి ధనము దొరకదు. కనుక వేశ్య రాగము మానవలయు, రాగము వేశ్యకును పశ్చిమసంధ్యకును దోషాగ్రదూతగా నున్నది. సుశిక్షిత యైన నటివలె వేశ్య మిథ్యారాగమునే చూపును. ఆ మిథ్యారాగముచే అది ముందుగా కాముకుని రంజించి, పిమ్మట రంజితుని ధనము నెల్లను పిదికి వేయును. రిక్తుఁ డైన వెంటనే వానిని త్యజించును. మరల పూర్ణుఁ డాయెనా మరల వానిని గ్రహించును. యువ శిశు విరూప వృద్ధ రూపవంతులయందు వేశ్యాజనము మునివలె సమముగానుండి అర్థమునే పరముగా గ్రహించుచుండును.' అని నేర్పు చుండెను. అట్లున్నట్టి యాఁకుట్టనియొద్దకుఁ బోయి రత్నవర్మ సత్కృతుఁడై కూర్చుండి 'ఆర్యా, ఈ నాపుత్త్రునికి వేశ్యాకళలను నేర్పుము, అందువలన వీనికి తెలివి గలుగును

గాక. ఇందులకు నీకు వేయి దీనారము లిచ్చెదను.' అనెను. కుట్టనియు అంగీకరించెను. అంతట రత్నవర్మ కుట్టనికి వేయి దీనారములు ఇచ్చి పుత్త్రుని అప్పగించి ఇంటికి పోయెను. పిమ్మట ఈశ్వరవర్మ ఒక సంవత్సరములో వేశ్యాకళలను నేర్చి తండ్రియింటికిఁ బోయెను.

తనకు పది యాఱేండ్లు రాఁగా ఈశ్వరవర్మ తండ్రితో 'మనకు ధర్మకామములు అర్థమువలన కలుగును. అర్థమువలన గౌరవము, అర్థమువలన కీర్తి.' అనెను. ఆవచనము నంగీకరించి కుమారునికి వ్యాపారార్థము మూలధనముగా అయిదు కోటు లిచ్చెను. దానిని గైకొని ఈశ్వరవర్మ మంచిదినమున బిడారుతోఁ స్వర్ణద్వీపమునకు పయన మాయెను. దారిలో అతఁడు కాంచనపుర మను నగరమునొద్ద బాహ్యోద్యానములో బస చేసి స్నానమైై భుజించి ఆ నగరము సొచ్చి వింతలు చూచుటకై ఒక దేవళమునకు పోయెను. అచట యౌవనసమీరణముచే లేచిన రూపాబ్ధిలహరింబోని దానిని సుందరి యనుపేరి యాటకత్తెను ఆడుచుండఁగా చూచి, చూచియుఁ జూడక ముందే తదేకగతమానసుఁ డాయెను. కుట్టనీశిక్ష కోపగించినదియుం బోలె దూరముగా పోయెను. అంత నతఁడు వయస్య ముఖమున ఆ లాసికకు తన కోరికం దెలిపెను. లాసికయు ధన్యనయితి నని అంగీకరించెను. అంతట ఈశ్వరవర్మ తనయింట మూలధనమును రక్షించుటకు తగినవారిని నియమించి, తాను

సుందరియింటికిఁ బోయెను. అచట ఆలాసికతల్లి మకరకటి యనునది వానిని సముయోచితము లయిన గృహోచారములచే సమ్మానించి, రాత్రి పడఁగానే, కెంపులమేలుకట్టు గలదియు సరత్నపర్యంక శయనమును అయిన పడుకటింట సుందరితోఁ గూడ ప్రవేశపెట్టెను. నృత్యకరణములలోను సురతకరణముల లోను విదగ్ధ యైన యాసుందరితో నతఁడు క్రీడించుచుండెను. తెల్లవాఱఁగానే గాఢరాగమును చూపి తనప్రక్కనుండి ఎడఁ బాయఁజాల కున్న యాసుందరిని ఈశ్వరవర్మ విడిచి పోనేర కుండెను. దానికి ఇరువదియైదు లక్షల హేమరత్నాదికమును ఆ వణిక్కుమారుఁడు ఆ దిన మిచ్చెను. సుందరి 'నాకు ధనము విస్తారము దొరకియే యున్నది, నీబోటి సరసుఁడు ఇంత వఱకు దొరక లేదు. నీవే దొరకినపిమ్మట నాకు ధన మేల?' అని యసత్యములు పలుకుచు గ్రహింపక యుండఁగా, తదేకపుత్త్రి మకరకటి వచ్చి దానిని ఇట్లు మందలించెను:— 'ఇప్పుడు మనదిగా నున్న ధనమెల్ల ఇతనిదే. దానినడుమ ఈధనమును కూడ ఉంచి పుచ్చుకో నిమ్ము, పిల్లా, దోష మేమి?' ఇట్లు తల్లి పలుకఁగా సుందరి చేయునది లేక ఎట్టకేలకు దానిని గ్రహించెను. మూర్ఖుఁ డయిన యీశ్వరవర్మ దాని ప్రేమ సత్య మనియే తలంచెను. దాని రూప నృత్య గీతములచేత హృతమానసుఁ డై ఆ వణిక్కుమారుఁడు దానియింట రెండు

మాసము లుండెను. అప్పటికి అతఁడు సుందరికి రెండుకోట్ల ధన మిచ్చెను.

ఇంతలో అర్థదత్తుఁ డని ఇతని చెలికాఁడు ఒకఁడు వచ్చి యితనితో ని ట్లనియె: 'మిత్త్రమా, ఏమి, కుట్టని నేర్పిన విద్య భీతుని యస్త్రవిద్యవలె సమయమున నిష్ప్రయోజనమై పోయి నది? వేశ్యప్రేమ వాస్తవ మని నీవు తలంచితివి గదా, ఎండ మావులలోని నీళ్లను నమ్మితివి; కావున నీ ధన మెల్ల ఇక్కడనే క్షయింపకముందే పోదము రమ్ము. ఈ వృత్తాంత మెఱిఁగిన నీ తండ్రి క్షమింపఁడు.' ఇట్లు మిత్త్రుఁడు పలుకఁగా, ఈశ్వరవర్మ 'సత్యము, వేశ్యలకు అనురాగ ముండదు. సుందరి మాత్రము అట్టిది గాదు; క్షణము నన్నుఁ జూడకున్న ప్రాణములు వదలును. మనము వెడలక తప్పదేని నీవే పోయి దానిని బోధింపుము.' అని యుత్తర మిచ్చెను. అంత నర్థదత్తుఁడు ఈతనియెదుట మఱియొకటి యెదుట సుందరితో ని ట్లనియె:— 'సుందరి, నీకు ఈశ్వరవర్మ మీఁద అసాధారణప్రీతి; ఇతఁ డిపుడు అవశ్యముగా స్వర్ణద్వీపమునకు వాణిజ్యమునకై పోవలసి యున్నాఁడు. అచట లక్ష్మిని సంపాదించుకొని వచ్చి దానితో నీయొద్ద యావ త్కాలము ఉండును. ఇప్పుడు సెల విమ్ము.' అంతట సుందరి కన్నుల నీళ్లు నించుకొని విషాదముతో ఈశ్వరవర్మ మొగము చూచి 'మీకే తెలియును, నే నేమి చెప్పుదును? అంతము చూడక ఎవరిని నమ్మ వచ్చును? చాలు! మీ యిచ్ఛ వచ్చి

నట్లు చేయుఁడు. నాకు కాఁగలది అగును.' అని పలికెను. 'పిల్లా, ఏడువకు; ధైర్య మవలంబింపుము. నీ ప్రియుఁడు కార్యము తీర్చుకొని మరల నీయొద్దకు వచ్చును. పిమ్మట నిన్ను వదలఁడు.' అని తల్లి ఓదార్చెను. సుందరి పిమ్మట తల్లితో కలియఁబలికికొన్నదై ఈశ్వరవర్మ పోవుదారిలో ఒక నూతిలో వల పన్నించెను. ఈశ్వరవర్మ దుఃఖముచే ఏమియు తోఁపక యుండెను. సుందరియు దుఃఖముచేతనుంబోలె ఆహార పానములను కొంచెకొంచెముగా గ్రహించెను, గీతవాద్యనృత్య ములను మానెను. ఈశ్వరవర్మ దానిని నానాప్రణయములచే ఓదార్చెను.

పిమ్మట మిత్త్రుఁ డేర్పఱిచిన దినమున ఈశ్వరవర్మ కుట్టని చేసిన మంగళముతో సుందరీ గృహమునుండి తరలెను. తల్లిని దోడ్కొని సుందరియు కన్నీళ్లువిడుచుచు ఊరి వెలుపల వల పన్నిన నూతివఱకు సాగ నంపి, అచట తాను ఆ బావిలో దుమికెను. 'అయ్యో! సుందరీ, అయ్యో! పుత్త్రీ' అని భృత్యవర్గమును తల్లియు మొఱ పెట్ట సాగిరి. ఆ కోలాహల మునకు ఈశ్వరవర్మ మిత్త్రులతోఁగూడ మరలి వచ్చి నూతిలోఁ బడియున్న సుందరిని చూచి మూర్ఛితుఁ డాయెను. తెలివి రాఁగానే మకరకటి పలవించుచు తన నౌకరులను తన రహస్య మెఱిఁగినవారిని ఆప్తులను నూతిలో దింపి సుందరిని వెలికి తీయించెను. వారును త్రాళ్లతో దానిని 'ఆహా బ్రదికియున్నది!

బ్రదికియున్నది!' అని పలుకుచు బయటికి ఎత్తిరి. అదియు చచ్చినదానివలె కొంచెముసేపు ఉండి పిమ్మట ఎట్టకేలకు వణిక్పుత్రుని ప్రశ్నలకు ఉత్తర మిచ్చెను. దానిని ఓదార్చి ఈశ్వరవర్మ పయనము మాని దానియింటికే పోయెను. సుందరీప్రేమ నిజ మని నిశ్చయించుకొని, అది మరల తనకు దక్కుటయే జన్మఫల మని తలఁచి, అతఁడు ప్రయాణమును మరల తలంపఁడాయెను. అట్లు అచటనే అతఁడు నిలువఁగా చెలికాఁడు అర్థదత్తుఁడు 'మిత్రమా, అజ్ఞానముచే ఏల యిట్లు చెడిపోయెదవు? నూతిలో పడినమాత్రాన సుందరీస్నేహమును నీవు నమ్మకుము. కుట్టనీకూటరచనలు బ్రహ్మకుఁ గూడ దురూహములు. ధనమెల్ల నాశము చేసి తండ్రి కేమి సమాధానము చెప్పెదవు? ఎచటికిఁ బోఁగలవు? కనుక ఇప్పటికైన వివేకము తెచ్చుకొని ఇచటినుండి వెడలుము.' అని బోధించెను. ఈ వచనమును లక్ష్యపెట్టక వణిక్పుత్త్రుఁడు ఆ నెలలో ఆ మూఁడు కోటుల ధనమును వ్యయము చేసెను. అంతట ఆ ధన మెల్ల హరించి మకరకటి అతనిని సుందరీగృహమునుండి అర్ధచంద్ర మిచ్చి తఱిమి వైచినది.

అర్థదత్తాదులు త్వరగా నిజనగరమునకుఁ బోయి ఆ వృత్తాంత మెల్ల రత్నవర్మకు నివేదించిరి. రత్నవర్మయు విని దుఃఖించి యమజిహ్వకడకుఁ బోయి యిట్లనియె: 'జీతము పుచ్చుకొని నీవు నాసుతునికి నేర్పిన విద్యకు ఫల మిది, వాని

ధనమెల్ల మకరకటి సులువుగా హరించినది!' ఇట్లని అతఁడు తన కుమారుని వృత్తాంత మంతయు వివరించెను. అంత నా వృద్ధకుట్టని యి ట్లనియె: ' పుత్త్రు నిచటికి పిలిపింపుము. మకర కటియొక్క సర్వధనమును అతఁడు హరించునట్లు చేసెదను ' అంత రత్నవర్మ కుమారుని తోడ్కొని ర మ్మని మరల మంచి మాటలతో ధనముతో హితైషిని అర్థదత్తునిఁ బంపెను. అర్థ దత్తుఁడు కాంచనపురమునకుఁ బోయి సర్వ వృత్తాంతమును ఈశ్వరవర్మతో చెప్పి ఇ ట్లనియె:— 'మిత్త్రా, నా మాట విన వయితివి. వేశ్యాసద్భావమును ఇప్పటికి ప్రత్యక్షముగా కంటివి గదా. అయిదుకోట్ల ధనమునకు ఒక యర్ధచంద్రమును పొంది నాఁడవు. వేశ్యలయందును ఇసుకయందును ప్రాజ్ఞుఁడు విశ్వాస ముంచునా? వి న్ననవేల, వస్తుధర్మ మిట్టిదే. రామావిభ్రమ భూములయందు పడకున్నంత సేపే పురుషుఁడు విదగ్ధుఁడు, వీరుఁడు, భాగ్యవంతుఁడును. తండ్రియొద్దకు వచ్చి కోపశాంతి చేయుము ' ఇట్లు బోధించి అర్థదత్తుఁడు వానిని త్వరగా తండ్రి యొద్దకు కొని వచ్చెను. ఈశ్వరవర్మ దుఃఖాక్రాంతుఁడై తన యపరాధమును క్షమింపు మని తండ్రిపాదములలో వ్రాలెను. తండ్రియు ఏకపుత్త్ర స్నేహముచేత వానిని ఓదార్చి యమ జిహ్వాకడకు తోడ్కొని పోయెను

అది యడుగఁగా ఈశ్వరవర్మ అర్థదత్తముఖమున తన ధననాశవృత్తాంతమును సుందరి కూపములో పడుట తుదిగా

చెప్పెను. 'నాదే తప్పు, ఈమాయను నేను నేర్ప మఱచితిని. మకరకటి కూపములో వల కట్టినది. దానిమీఁద సుందరి పడి చావక హాయిగా నుండినది. దీనికి ప్రతీకారము కలదు.' అని పలికి యమజిహ్వ తన కోఁతిని ఆల మనుపేరి దానిని అచటికి తెప్పించి దానియెదుట రెండువేల దీనారములను పెట్టి మ్రింగు మనెను. కోఁతి మ్రింగెను. ఓరీ, అబ్బాయీ, వీనికి ఇరువది ఇమ్ము, వీనికి ఇరువదిగైదిమ్ము. వీనికి అఱువది, వీనికి నూఱు.' అని నానావ్యయములకు ఆజ్ఞాపింపఁగా ఆకోఁతి ఆ ప్రకారమే లెక్క తప్పక క్రక్కి యిచ్చెను. ఆలముయొక్క యీ శక్తిని చూపి యమజిహ్వ వణిక్పుత్రునితో 'ఈ కోఁతిపిల్లను తోడు కొని మరల సుందరియింటికిఁ బొమ్ము. ముందుగా ఇది మ్రింగిన దీనారములను వ్యయార్థము. దానియెదుట ఇప్పించుచుండుము. సుందరి తన సర్వస్వమును నీ కిచ్చి చింతామణీ సదృశమును ఈకపిని నిర్బంధప్రార్థన చేసి గ్రహించును. దీనిని ముందుగా రెండుదినముల వ్యయమునకు ధనము మ్రింగించి ఇచ్చి, దాని ధన మెల్లఁ గొని తత్క్షణమే ఆ నగరము వదలి దూరముగా పొమ్ము.' అని చెప్పి, ఆతనికి ఆ కోఁతిని ఇచ్చెను. తండ్రియు వానికి రెండుకోట్ల ధన మిచ్చెను.

అది యెల్లఁ గొని అతఁడు మరల కాంచన నగరమునకుఁ బోయి, ముందుగా దూతముఖముగా తనరాకను తెలిపి, సుందరీ గృహము ప్రవేశించెను. అదియు సర్వసాధనములతో వచ్చిన

యతనిని సమిత్రుని కంఠాశ్లేషాది సంభ్రమ విభ్రమములతో సంతోష పెట్టెను. దానికి స్నేహము చూపి యీశ్వరవర్మ అప్పుడే అర్థదత్తుని పంపి ఆలమును తెప్పించి 'ఓరి ఆలపుత్రా, ఇప్పుడు, మున్నూఱు దీనారములు భోజనపానములకు ఇమ్ము, తాంబూలాదికమునకై నూఱు దీనారములు ఇమ్ము, అమ్మకు మకరకటికి నూఱు దీనారములు ఇమ్ము, బ్రాహ్మణులకు నూఱు ఇమ్ము. సహస్రములో మిగిలి యుండుదానిని సుందరికి ఇమ్ము.' అని యాజ్ఞాపించెను. ముందుగ వేయి దీనారములు మ్రింగి యున్న యా మర్కటము ఆప్రకారమే దీనారములను క్రక్కి క్రక్కి వ్యయసమయములయం దిచ్చుచుండెను. ఈప్రకారము ఒకపక్షకాలము ప్రతిదినము ఈశ్వరవర్మ వ్యయమునకై కోతిచే దీనారములు ఇప్పించెను. ఇంతలో మకరకటియు సుందరియు ఆలోచించిరి. 'అహో! చింతామణి కోతిరూపమున సిద్ధించి యున్నది. దినమునకు ఇది సహస్ర దీనారములు ఇచ్చును. దీనిని ఇతఁడు మన కిచ్చిన ఇఁక కోరవలసిన దేమియు నుండదు.' ఇట్లు ఏకాంతమున తల్లితోఁగూడి ఆలోచించుకొని సుందరి ఈశ్వర వర్మను భోజనానంతరము సుఖముగా నున్నప్పుడు 'నాయందు నీకు స్నేహము నిజమేని, ఈ యాలమును నాకిమ్ము.' అని యడిగెను. ఈశ్వరవర్మ యనియె: 'ఇది మా తండ్రియొక్క సర్వధనము, దీనిని ఇయ్య వలనుపడదు.' 'మా యైదు కోట్లను ఇచ్చెదను, దీనిని ఇమ్ము.' అని సుందరి పలికెను. ఈశ్వరవర్మ

నీ సర్వస్వము ఇత్తువేని, ఈ నగర మెల్ల నిత్తువేనియు, దీని నీయ సాధ్యపడదు. కోఁతిసంగతి తలఁప నేల?' అని దృఢముగ పలికెను. సుందరియు 'నా సర్వధనమును ఇచ్చెదను. కోఁతిని నా కిమ్ము. అమ్మకు నాపై కోపము వచ్చిన రానిమ్ము.' అని ఈశ్వరవర్మ పాదములు పట్టుకొనెను. అర్థదత్తాది మిత్రులు 'ఇమ్ము, ఏ మయిన నగును గాక.' అనిరి.

అంత నీశ్వరవర్మ కోఁతిని ఇయ్య నంగీకరించినవాఁడై, హృష్టురా లయిన సుందరితో ఆదినమును గడపి, తెల్లవాఱఁగానే మరల సుందరి నిర్బంధింపఁగా ఆమర్కటముచే ముందుగా రెండువేల దీనారములను మ్రింగించి, దానిని సుందరికి ఇచ్చి, దానివెలగా సుందరియొక్క సర్వస్వమును కైకొని తత్క్షణమే వాణిజ్యముకై స్వర్ణద్వీపమునకు పోయెను. సుందరి సంతుష్టయై యాచింపఁగా ఆలము రెండుదినములు వేయేసి దీనారములు ఇచ్చెను. మూఁడవనాఁడు ఎన్నిమాఱులు అడిగినను ఆలము ఏమియు ఇయ్యకుండుడు, సుందరి దానిని పిడికిట గ్రుద్దెను. కోఁతి తన్నుకొట్టుచున్న సుందరీ మకరకటుల ముఖములను కోపమున ఎగిరి దంతములతోను గోళ్లతోను గీఱి గాయములు చేసెను. అంత ముసలిది మోమున రక్తధార లోలుకుచుండ దుడ్డుఁగఱ్ఱలతో ఆలమును కొట్టెను. ఆ దెబ్బలకు ఆలము చచ్చెను. అది చచ్చుటయు సర్వధనము పోవుటయు తలఁచి దుఃఖిత లై సుందరియు తల్లితోఁగూడ ప్రాణత్యాగమునకు

నిశ్చయించుకొనిరి. ఈ వృత్తాంతమును విన్నజనులు 'మకర కటి జాలముచే ఎవని ధనము నెల్ల హరించినదో, వాఁడు బుద్ధిమంతుఁడై ఆలముచే దాని సర్వస్వమును హరించినాఁడు. అది ఇతరులమీఁద జాలము చేయ నేర్చినదిగాని తనమీఁద ఇతరుఁడు చేసినయాలమును తెలిసికొన నేరక పోయినది.' అని పలుకుచు నవ్వుచుండిరి. నష్టార్థయు పాటితాననయు నైన సుందరిని దాని జననిని ప్రాణత్యాగమునుండి స్వజనులు ఎట్టకేలకు నివారించిరి. ఈశ్వరవర్మ మహాధనమును ఆర్జించి స్వర్ణద్వీపమునుండి మరలి చిత్రకూటమున తండ్రియింటికిఁ బోయెను. కుమారుఁడు ఇట్లు అమితధనము నార్జించి రాఁగా రత్నవర్మ సంతోషించి ఆతని నభినందించి యమజిహ్వకు ధనము లిచ్చి మహోత్సవము చేసెను. ఈశ్వరవర్మయు సకలమాయ లెఱింగి, వారవిలాసినీ సంగమందు విరక్తుఁడై, వివాహము చేసికొని ఇంట సుఖముగా నుండెను.

రాజేంద్రా, ఈరీతిని వార వనితా హృదయమందు కపటమే గాని సత్యము లేశ మయినను ఉండదు. కనుక సార్థ సాధ్యగమన లైన వారస్త్రీలయందు శూన్యాటవులయందుం బోలె భూతికాముఁడు గమింపఁ గూడదు.

ఇట్లని మరుభూతివలన ఈ యాలజాలకథను విని నరవాహనదత్తుఁడును గోముఖాదులును అంగీకరించి సంతసించిరి.

---

## ౨-వ తరంగము.

### కుముదిక యను వేశ్య కథ.

ఇట్లు మరుభూతి వేశ్యల యసద్భావమును గుఱించి చెప్పఁగా బుద్ధిమంతుఁడు గోముఖుఁడు అట్లే కుముదికకథను చెప్పెను. ప్రతిష్ఠాననగరములో విక్రమసింహుఁ డని సింహతుల్యవిక్రముఁడు అన్వర్థనాముఁడు రా జుండెను. ఆప్రభువునకు శశిలేఖ యని సుందరి అలంకారతనువు నదీనప్రభవ దేవేరి యుండెను. అతని నొకప్పుడు తననగరముం దుండఁగానే ఏవురు దాయాదులు, మహాభటుఁడు వీరబాహువు సుబాహువు సుభటుఁడు ప్రతాపాదిత్యుఁడు అనువారు, అందఱును మహాబలులు దండెత్తివచ్చి ముట్టడించిరి. వారితో సామాదికమును ప్రయోగించుచున్న మంత్రిని నిరాకరించి విక్రమసింహుఁడు యుద్ధమునకు వెలువడెను. రెండుసేనలకు శస్త్రాస్త్ర సంపాత ఘోరముగా యుద్ధము జరుగుచుండఁగా, విక్రమసింహుఁడు శౌర్యదర్పముచేత తాను ఏనుఁగు నెక్కి స్వయముగా యుద్ధము చేయ నారంభించెను. ఆతఁడు ధనుర్ద్వితీయుఁడై బలములను చీల్చివేయుచుండఁగా చూచి, మహాభటాది రాజులు అయిదుగురును కలసి, అతనిని ఒక్కమొగి నెదుర్కొనిరి. వారి బలమెల్ల కలసి మీఁదికి రాఁగా విక్రమతుంగునిదండు తక్కువ యగుటచే

విఱిగి పోయెను. ఆసమయమందు అనంతగుణుఁ డను నామంత్రి విక్రమసింహుని చెంతకు వచ్చి 'మనబల మెల్ల పగిలి పోయినది, మనకు జయము లేదు. నామాట వినక బలవంతులతో పోరు పెట్టుకొంటివి. ఇప్పటి కైన నామాట విని మేలు పొందుము. ఏనుఁగును దిగి గుఱ్ఱ మెక్కి పరదేశమునకు పోదము రమ్ము. బ్రతికియుండిన వీరిని మరల జయింప వచ్చును.' అని పలికెను. ఆతని మాట విని రాజు ఏనుఁగును దిగి గుఱ్ఱమెక్కి ఆతనితోఁ గూడ తన బలమునుండి బయలు వెడలెను. మాఱువేషము వేసికొని ఆమంత్రితోఁ గూడ విక్రమసింహుఁడు క్రమముగా ఉజ్జయినికిఁ బోయి అచట మహాధనసమృద్ధ మయిన కుముదిక యను వేశ్యాంగన యింటికి మంత్రిద్వితీయుఁ డై చనియెను.

ఆకస్మికముగా వచ్చిన యతనిని చూచి ఆవేశ్య యిట్లు చింతించెను.-'ఇతఁ డెవఁడో మహాపురుషుఁడు; తేజముచేతను ఇతఁడు రాజని తెలియుచున్నది. ఇతనిని స్వీకరింతునేని నా యభీష్టము సిద్ధించును!' ఇట్లాలోచించి కుముదిక సమంత్రిని రాజును కుశల మడిగి గొప్పగా ఆతిథ్యము చేసి, విశ్రాంతుఁ డైన పిమ్మట రాజుతో నిట్లనియె.-'నేను ఇప్పుడు ధన్యురాల నయితిని. నా పూర్వ సుకృతము ఇప్పటికి ఫలించినది. ఏలిన వారు వచ్చి మా యింటిని పవిత్రము చేసినారు ; కావున ఈ ప్రసాదముచే కొనఁబడిన దాసిని నేను. నా దయిన యీ

హ_స్తిశతము ఇరువదివేల గుఱ్ఱములు పూర్ణరత్న మయిన యీ మందిరమును సర్వమును తమదే.' ఇట్లు పలికి కుముదిక మహార్హ_మము లయిన స్నానాద్యుపచారములతో సమంత్రిని రాజును ఉపచరించెను. విక్రమసింహరాజు ఖిన్నుఁ డయ్యును కుముదిక చేయుచున్న యుపచారములు గ్రహించుచు సామాత్యుఁ డై అట నుండెను. దాని ధనమును రాజు స్వేచ్ఛగా వ్యయము చేసెను; యాచకుల కిచ్చెను. కుముదిక అందులకు వికృతి పొందక సంతసించుచునే యుండెను. 'అహో! దీనికి నా యందు ఎంతప్రేమ!' అని సంతోషించుచున్న రాజును చెంత నున్న మంత్రి ఏకాంతమున నిట్లనియె.

'దేవా, వేశ్యలకు సద్భావము లేదు. ఈ కుముదిక నీయందు చూపెడు భ_క్తికి కారణము తెలియకున్నాను!' 'ఇట్లు కాదు, కుముదిక నాకై ప్రాణములను కూడ ఇచ్చును, నీకు నమ్మకము లేదేని నిదర్శనము చూపెదను.' అని పలికి రాజు ఈకపటమును పన్నెను. ఆహారపానాదికములు తగ్గించి తనదేహమును క్రమక్రమముగా కృశము చేసి అవయవములు శిథిలము లగునట్లును చేసికొని, చచ్చినట్లును పడి యుండెను. పరిజనులు అతనిని శిబికలో పెట్టి శ్మశానమునకుఁ గొనిపోయిరి. అనంతగుణుఁడు శోకమును అభినయించుచు కూడఁ బోయెను. కుముదికయు శోకాకుల యై బంధువులు ఎంత వారించినను నిలువక తానును వచ్చి తేనిచిత యెక్కెను. నిప్పు పెట్టఁ

బోవు నవసరమున కుముదిక వచ్చియున్న దని తెలిసికొని రాజు ఆవులించి లేచెను. 'ఆహా! మహారాజు బ్రదికినాఁడు!' అని పలుకుచు పరిజనులు అతనిని మరల ఇంటికిఁ గొనిపోయిరి. ఆసంతసమునకు కుముదిక ఉత్సవము చేయఁగా, రాజు మంత్రిని ఏకాంతమున 'ఏమి కుముదికయొక్క స్నేహమును చూచితివా?' అని యడిగెను. 'ఇప్పటికిని ఈప్రేమను నేను నమ్మను. దీని కారణమును కనిపట్ట లేకున్నాను. మనలను దీనికి తెలియఁ బఱుచుకొని దీని బలమును తోడ్కొని పోయి శత్రువులను క్షణములో ఓడింతము.' అని మంత్రి పలికెను.

ఆ సమయములో చారుఁడు వచ్చి ఇట్లు చెప్పెను. 'శత్రువులు దేశము నాక్రమించినారు. లోకులవలన రాజు మృతిఁ బొందె నని విని శశిలేఖాదేవి అగ్నిప్రవేశము చేసినది' చారునివలన ఈమాట విని రాజు శోకాశనిహతుఁడై 'హా దేవీ! హా పతివ్రతా!' అని ఏడువఁ దొడంగెను. క్రమముగా వృత్తాంత మెఱిఁగి కుముదిక వచ్చి విక్రమసింహుని ఓదార్చెను. 'ముందే నేను చెప్పలేదా? ఏల తామసించెదవు! నా దండుతోఁ బోయి శత్రువులను ఉన్మూలింపుము.' అని అది పలుకఁగా రాజు దాని ధనములతో మఱియు ఎక్కువదండు సంపాదించి, ఆ దండుతో తనమిత్త్రుఁడును బలవంతుఁడు నయిన యొక రాజుకడకు పోయి, అతని బలములను తనబలమును చేర్చి తోడ్కొని, యా యైదుగురు శత్రువులమీఁదికి నడచి, వారిని

యుద్ధములో ఓడించి, తన రాజ్యముతో వారి రాజ్యములను సయితము గ్రహించెను. పిమ్మట కుముదికను 'నీ యెడల నేను ప్రీతుఁడను. నీ కోరిక యేమి ? చెప్పుము, తీర్చెదను.' అని యడిగెను 'ప్రభూ, నీవు నిజముగా తుష్టుఁడవేని నా హృదయమందు చిరకాలమునుండి యున్న యీ శల్యమును తీసివేయుము. ఉజ్జయినిలో నా ప్రియుని శ్రీధరుఁ డను ద్విజ కుమారుని స్వల్పాపరాధమునకు రాజు చెఱలో వేసినాఁడు. నిన్ను ఉత్తమరాజలక్షణములచే కల్యాణము పొందువానినిగా నెఱిఁగి ఈకోరిక తీర్పఁగలవాఁడ వని, భక్తితో సేవించితిని. నీవు మృతిఁ బొందితి వని, నాకోరిక తీఱదనెడి దుఃఖముచే, ఆవిప్రకుమారుఁడు లేని నాజీవిత మేల యని వైరాగ్యముచే, ప్రాణత్యాగార్థము నీచితను కూడ ఎక్కితిని.' అని కుముదిక చెప్పెను. విక్రమసింహుఁడు 'నీకోరిక తీర్చెద; ధైర్య మవలంబించియుండుము.' అని పలికి, మంత్రి వచనమును స్మరించి, 'వేశ్యలకు సద్భావము లే దని అనంతగుణుఁడు చెప్పినమాట తప్ప లేదు. అయినను ఈ వరాంగియొక్క కోరికను నేను తీర్ప వలసినది.' అని నిశ్చయించుకొని ఉజ్జయినికి తరలి శ్రీధరుని విడిపించి, కుముదికను బహుధనము లిచ్చి ప్రియసంగమ సుస్థితను గావించెను. విక్రమసింహుఁడు మరల తన నగరమునకు వచ్చి మంత్రివచనమును దాఁటక రాజ్య మేలుచు సుఖముగా

నుండెను. ఈప్రకారము వేశ్యాంగనల హృదయము అగాధము, తెలియ రానిది.

## చంద్రశ్రీకథ.

ఇట్లు కథ చెప్పి గోముఖుఁడు విరమింపఁగా, నరవాహన దత్తునిమ్రోల తపంతకుఁడు పలికెను.— దేవా, చపలమతు లయిన స్త్రీలకు విశ్వాస ముండదు. వేశ్యలకుంబోలె కుల స్త్రీలకుఁ గూడ కొందఱకు విశ్వాస ముండదు. ఇచటనే నే నెఱిఁగిన యాశ్చర్యమును చెప్పెదను వినుము. ఈనగరమందే బలవర్మ యని యొక వణిజుఁ డుండెను. చంద్రశ్రీ యని యతని భార్య ఒకనాఁడు మేడకిటికీనుండి అంగగానిని శీలహరుఁ డను వణిక్కుమారుని కని, కామించి, తత్క్షణమే తనచెలి యింటికి రప్పించుకొని ప్రచ్ఛన్నముగా వానితో క్రీడించెను. ప్రతిదినము అట్లే చేయుచుండెను. ఈవృత్తాంతము భృత్యులకు బంధులకు ఎల్లవారలకును తెలిసినది. బలవర్మ యొక్కఁడు మాత్రము ఎఱుఁగఁడు, సాధారణముగా స్నేహాంధులగు పురుషులు భార్యల దురాచారమును కనిపట్టరు. ఇట్లుండఁగా బలవర్మకు దాహ జ్వరము వచ్చి క్రమముగా ముమూర్షావస్థ సంభవించెను. అతఁ డిట్టి యవస్థలో నున్నను అతనిభార్య ప్రతిదినము తనచెలికత్తె యింట ఉపపతిని గూడుచుండెను. ఒకనాఁడు జారునితో ఆమె యుండఁగా బలవర్మ మృతిఁ బొందెను. అంత నామె ఆ కాముకుని వీడ్కొని యింటికి పోయి దుఃఖార్తయై దీని శీలము

దండించి మఱి యొకతెను పెండ్లి చేసికొనుము.' ఇట్లు పలికి క్రోధనుఁడు పోఁగా, వజ్రసారుఁడు ఏమియుఁ దోఁపక కొంత సే వుండి 'ఇది సత్యమే అని తోఁచుచున్నది. కాదేని మాని సిని పంపినను అది రా దేమి ? కనుక నేనే పోయి తోడ్కొని వచ్చెదను, ఏమి జరుగుచున్నదో కనిపట్టెదను.' అని సంకల్పించి మాళవమునకుఁ బోయి అత్తమామలయనుమతిని భార్యను వెంటఁ బెట్టుకొని బయలువెడలెను.

చాల దూరము నడచి అతఁడు అనుచరులను యుక్తిగా వంచించి తప్పుదారిని బడి భార్యతోఁ గూడ మహారణ్యము చొచ్చి, అచట విజనమందు దానిని కూర్చుండఁబెట్టి దానితో ని ట్లనియె. 'నీవు అన్యపురుషాసక్త వని నాకు ఆప్తమిత్రుఁ డొకఁడు చెప్పినాఁడు. నేను అక్కడనే యుండి పిలిపింపఁగా రావయితివి. సత్యము చెప్పుము. చెప్పవేని నిన్ను దండించెదను.' ఆమాటకు అది 'నీ కిదే నిశ్చయమేని, న న్నేల యడిగెదవు ? నీకు తోఁచినట్లు చేయుము.' అని తిరస్కారముగా పలికెను. అంత వజ్రసారుఁడు కోపముతో దానిని చెట్టునకు కట్టి తీఁగల తో కొట్టి వస్త్రమును ఊడ్చి వేసెను. నగ్నను చూడఁగా రిరంస గలిగి దానితో కట్టువిప్పకయే క్రీడింపఁగోర వాఁడు వేఁడు కొనఁగా అది ఒప్పక 'న న్నెట్లు నీవు కట్టి తీఁగలతో కొట్టితివో ఆప్రకారము నిన్ను నేను కట్టి తీఁగలతో కొట్టితినేని అప్పుడు

నిన్ను క్రీడింప నిత్తును; మఱి యెట్లును సమ్మతింపను.' అనెను. ఆ మూఢుఁడు వజ్రసారుఁడు మనోభవుని ప్రభావముచేత తృణసారుఁడై అందుల కంగీకరించెను. అంత నా చెడిప వానిని కాలుసేతులు గట్టిగా చెట్టునకు కట్టి కొట్టి, వానికత్తితోనే వాని ముక్కుచెవులను చెక్కివేసి, కత్తిని కైకొని, వాని వస్త్రములతో తాను పురుషవేషము వేసికొని, పాపాత్మురాలు తన యిచ్చ చొప్పున పోయెను. వజ్రసారుఁడు శ్రవణ నాసికలు కోలు పోయి, రక్తము కాఱుచుండ, మానము పోఁగా, అచటనే ఉండెను.

ఇట్లుండఁగా అచటికి ఒకవైద్యుఁడు ఏదో యోషధి కొఱకు వచ్చి, అతనిని కనికరించి విడిపించి తన యింటికి కొని పోయెను. అచట కొంతయుపచారములు వడసి కొంతబాధ తీఱి వజ్రసారుఁడు ఆపాడుపెండ్లమును అక్కడక్కడ వెదకియు కనిపట్టఁ జాలక వృత్తాంతమును క్రోధనునికి చెప్పెను. వాఁడు వత్సరాజు మ్రోల నవిస్తరముగా వర్ణించెను. వీఁడు పౌరుష హీనుఁడు స్త్రీ భూతుఁ డని వీనిభార్య వీని పురుషవేషమును హరించి, వీనికి తగిన దండన చేసినది.' అని రాజకులములో అందఱును పరిహాసించినను వజ్రసారుఁడు వజ్రసార మగు మనస్సుతో ఇచటనే ఉన్నాఁడు. దేవా, ఇట్లుండఁగా స్త్రీలను ఎవఁడు నమ్మవచ్చును !

## కల్యాణవతి కథ.

ఇట్లు గోముఖుఁడు పలుకఁగా మరుభూతి యి ట్లనియె. స్త్రీల మనస్సునకు నిలుకడ లేదు. అయినను ఈకథను వినుఁడు. పూర్వము దక్షిణాపథమున సింహాబలుఁ డని రా జుండెను. అతనికి సకలాంతఃపుర స్త్రీలలోను అధికప్రియ మాలవరాజు కూఁతురు కల్యాణవతి యని యొక భార్య యుండెను. రాజు ఆమెతోఁ గూడ రాజ్యము ఏలుచుండి ఒకప్పుడు తనమీఁదికి కలసి దం డెత్తి వచ్చిన బలవంతు లైన దాయాదులచే దేశమునుండి నిష్కాసితుఁ డై, ఆ ప్రియతమను తోడ్కొని ప్రచ్ఛన్నముగా ఆయుధ మాత్ర సహాయుఁ డై అల్ప పరిచ్ఛదముతో మాలవమునకు మామగారియింటికి పోయెను. దారిలో అడవిలో సింహము మీఁద దుముకఁగా ఆ శూరుఁడు అవలీలగా కత్తితోఁ గొట్టి రెండు తుండెములు చేసెను. అడవియేనుఁగు గిఱగిఱ తిరుగుచు మీఁదికి రాఁగా కత్తితో దాని పాదములు తెగనఱికి నేలఁగూల్చెను. దొంగలదండులను అడవియేనుఁగు కమలములను బోలె నాశము కావించెను. ఇట్లు దారిని అద్భుత విక్రమములను చూపుచుఁ గడచి మహాసత్త్వుఁడు మాళవము చేరి దేవితో ఇ ట్లనియె. 'నా మార్గ విక్రమమును నీవు నీతండ్రియింట ప్రశంసింపకుము. అట్లు చేయుట లజ్జాకరము, క్షత్రియుని పరాక్రమమునకు శ్లాఘ యేమి!' ఇట్లు బోధించి ఆమెతోఁ గూడ మామగారి యింటికిఁ

బోయి, ఆయన దిగులుపడి యడుగఁగా, జరిగినవృత్తాంతము చెప్పెను. ఆయన అల్లుని సమ్మానించి గుఱ్ఱములను ఏనుఁగును ఇచ్చి పంపెను.

అంతట సింహబలుఁడు శత్రు విజయోద్యతుఁడై, కల్యాణవతిని అచటనే ఆమె తండ్రియింట ఉంచి, ప్రబలుఁడయిన గజానీకరాజునొద్దకుఁ బోయెను. అతఁడు పోయిన కొంతకాలమునకు ఒకనాఁడు దేవి కల్యాణవతి కిటికీలోనుండి ఒక పురుషుని చూచి, చూచినమాత్రమున వానిచే హృతచిత్తయై మదనాకృష్టయై యిట్లు తలఁచెను:— 'ఆర్యపుత్రుని కంటె అందగానిని శూరుని ఎఱుఁగను. అయినను ఈపురుషుని యందు నామనస్సు ఆసక్తమై యున్నది. కనుక ఏమయినఁగానిమ్ము. వీనిని సేవించెదను.' ఇట్లు నిశ్చయించుకొని ఆమె తన యభిప్రాయమును రహస్యధారిణి యయిన చెలికి చెప్పెను. అదియే వానిని రాత్రి కొని వచ్చి కిటికీగుండ త్రాటిమీఁదుగా ఎక్కించి అంతిపురిలో ప్రవేశపెట్టెను. వాఁడు ఆమెయొక్క తేజమునకు భయపడి ఆమెమంచము నెక్క ధైర్యము లేక ప్రక్కను మఱియొక యాసనమున కూర్చుండెను. దానిం గని రాణి 'అయ్యో! వీఁడు నీచుఁడు!' అని చింతించుచుండఁగా, పైనుండి పామొకటి వచ్చెను. దానిం గని ఆపురుషుఁడు భయపడి లేచి ధనుస్సు కొని కోలం గూర్చి వచ్చినదానిని కిటికీ గుండ వెలికి పాఱవేసి భయము తీఱి హర్షముతో నర్తనము

చేయసాగెను. ఆడుచున్న వానిని చూచి కల్యాణవతి చింతాక్రాంతురాలై 'ఛీ! ఛీ! నిస్సత్త్వుఁడు ఈయధముఁడు నాకేల?' అని విరక్తి చెందెను. ఆభావము ముఖవికారమువలన నెఱిఁగి సఖి వెలువడి మరల తొట్రుపాటుతో వచ్చి 'దేవీ, మీ నాయనగారు వచ్చుచున్నారు, ఇతఁడు ఇప్పటికి వచ్చినదారినే తన యింటికి పోవును గాక.' అనెను. అంత వాఁడు భయాకులుఁడై ఆ వాతాయనమార్గమున త్రాటిమీఁదుగా దిగి దుబ్బున పడెను గాని చావ లేదు.

వాఁడు పోఁగానే కల్యాణవతి సఖితో 'సఖి, నీవు ఈ నీచుని తఱిమి మంచి పని చేసితివి. నీవు నా హృదయమును తెలిసికొంటివి. నా చిత్తము దుఃఖపడుచున్నది. నా భర్త వ్యాఘ్రసింహాదులను కూల్చి లజ్జచే బైట చెప్పఁడు. ఈ సత్త్వహీనుఁడు పామును కొట్టి నర్తనము చేసినాఁడు. అట్టి మహాసత్త్వుని వదలి ఈ ప్రాకృతునితో నా కేమి గతి? చపలమతినైన నా బ్రదు కేల! శుచి యైనకర్పూరమును ఈఁగలు వోలె పతిని వదలిపోవునట్టి స్త్రీల బ్రదు కేల?' అని యిట్లు పశ్చాత్తప్తురాలై ఆరాణి ఆరాత్రి గడపి భర్తను ఎదురు సూచుచు, తండ్రియింట నుండెను

ఇంతలో, సింహబలుఁడు గజానీకుని తోడ్పాటుతోఁ బోయి, ఆపాపాత్ములను దాయాదులను ఏవురను కూల్చి, తన రాజ్యమును మరల వశపఱుచుకొని, కల్యాణవతిని మామగారి

యింటనుండి రప్పించుకొని, ఆతనిని ధనరాసులతో నించించి, నిష్కంటకముగా చిరకాలము రాజ్య మేలెను.

ఇట్లు, దేవా, వివేకవతులకుఁ గూడ పతి వీరుఁడును అందగాఁడును అయినను, మతి చలించును. విశుద్ధ సత్త్వలు లోకములో అరుదు. ఇట్లు మరుభూతి చెప్పనకథను విని నర వాహనదత్తుఁడు సుఖనిద్రం బొంది రాత్రి గడపెను.

---

## 3-వ త ర ం గ ము.

---

### శ క్తి య శ క థ.

ప్రాతఃకాలమందు అవశ్యకార్యములు తీర్చుకొని నర వాహనదత్తుఁడు సచివ సమేతుఁడై విహారార్థమై యుద్యాన మునకుఁ బోఁగా, అచట ఆకసమందు మొదట ప్రభాపుంజమును వెంటనే దిగుచున్న పలువురు విద్యాధరాంగనలును అగపడిరి. వారినడుమ దేదీప్యమాన యొక కన్యక, తారలలో చంద్ర రేఖ వలె, వికసత్పద్మవదన లోలలోచనషట్పద సలీలహంసగమన వహదుత్పలసౌరభ తరంగహారి త్రివళీ ల తాలంకృత మధ్యమ సాక్షాత్కరించిన స్మరోద్యాన వాపీ శోభాధిదేవతయో యన, స్మరసంజీవని, అగపడి అతనిమనస్సును సముద్రమును చంద్ర మూర్తివోలె క్షోభిల్లఁ జేసెను. 'ఆహా! విధియొక్క సుందరీ నిర్మాణ మహిమ యెట్లున్నది?' అని పలుకుచు, అతఁడు ఆశ్చర్య

పడి మంత్రులతోఁ గూడ నామెచెంతకు పోయెను. కడగంటి చూపుల నతనిని ప్రేమార్ద్రముగాఁ గాంచుచున్న యా కన్యను అతఁడు 'ఓ కల్యాణీ, నీ వెవ్వతెవు? ఇచటి కేల వచ్చితివి?' అని అడిగెను. ఆమె వినుఁ డని యిట్లు చెప్పెను.

హిమాచలములో కాంచనశృంగ మని యొక బంగారు నగరము కలదు. అందు ధార్మికుఁడు కృపణానాథ శరణాగత వత్సలుఁడు స్ఫటికయశుఁ డను పేరి విద్యాధరరాజు కలఁడు. నేను అయనకు గౌరివరమువలన హేమప్రభాదేవియందు కలిగితిని. నాపేరు శక్తియశ. నేను తండ్రికి ప్రాణప్రియను. అయిదుగురు అన్నల చెల్లెలను. వారి యాదేశమున వ్రతస్తోత్రములచేత నేను గౌరిని తనియించితిని. దేవి ప్రసన్నయై నాకు సకల విద్యలు ఇచ్చి 'పుత్త్రీ, నీకు తండ్రికంటె పదియింతల విద్యా మహిమ కలుగును. నరవాహనదత్తుఁడు వత్సరాజ సుతుఁడు భావివిద్యాధరచక్రవర్తి నీకు భర్త యగును.' అని యానతిచ్చి అంతర్హితురాలాయెను. ఆ ప్రసాదముచేత నాకు సకల విద్యలు వచ్చినవి. నేను క్రమముగా ప్రాప్తయౌవనను కాఁగా కడచినరాత్రి దేవి నాకు స్వప్నములో దర్శన మిచ్చి 'పుత్త్రీ, తెల్లవాఱఁగానే నీవు నీపతియొద్దకు పోయి ఈదినమే మరల ఇచటికి రావలసినది. నీతండ్రి మాసములోపల మీకు వివాహము జరుపును.' అని యానతిచ్చి అంతర్ధానము పొందెను.

ఇంతలో తెల్లవారెను. అంత నేను ఆర్యపుత్త్రా, నిన్ను చూడ నిచటికి వచ్చితిని. ఇఁకను పోయెదను.

ఇట్లు పలికి ఆమె మింటి కెగసి చెలులతోఁగూడ తండ్రి నగరమునకుఁ బోయెను. నరవాహనదత్తుఁడు ఆవివాహమును ఎదురు సూచుచు ఆ మాసమును యుగోపమముగాఁ గడపు చుండెను. అతఁ డట్లుత్కంఠితుఁ డై యుండఁగా గోముఖుఁడు తద్వినోదార్థము ఈకథను చెప్పెను.

## మ క ర ం ది క క థ.

పూర్వము కాంచనపురి యని యొక నగర ముండెను. అందు సుమనసుఁ డని గొప్పవాఁడు రాజు ఉండెను. ఆక్రాంత దుర్గకాంతారభూమి యై విరాజమానుఁ డైన యతఁడు చిత్ర ముగా శత్రునృపులనుకూడ అస్తవారినిగానే చేసెను. ఒకనాఁడు ఆయన యాస్థానియం దుండఁగా ప్రతీహారుఁడు వచ్చి 'దేవా, నిషాదరాజుకూఁతురు ముక్తాలత యనునది ఏలినవారి దర్శింపఁ గోరి చిలుకతోడి పంజరమును చేతఁ గొని ద్వారభూమిలో వచ్చి యున్నది. వీరప్రభుఁ డనెడి తద్భ్రాత కూడ వచ్చి యున్నాఁడు.' అని విన్నవించెను. రానిమ్ము, అని రాజు సెల వీయఁగా, ఆమె వచ్చెను. ఆమె యద్భుతరూపమును చూచి అచటి వారెల్ల 'ఈమె మనుష్యస్త్రీ గాదు, ఎవతెయో దివ్యాంగన!' అని తలంచిరి. ఆమెయు రాజులకు ప్రణమిల్లి 'దేవా, ఇది శాస్త్రగంజ మను పేరిటి చిలుక. నాలుగు

బడి మంత్రులతోఁ గూడ నా మెచెంతకు పోయెను. కడగంటి చూపుల నతనిని ప్రేమార్ద్రముగాఁ గాంచుచున్న యా కన్యను అతఁడు 'ఓ కల్యాణీ, నీ వెవ్వతెవు? ఇచట కేల వచ్చితివి?' అని అడిగెను. ఆమె వినుఁ డని యిట్లు చెప్పెను.

హిమాచలములో కాంచనశృంగ మని యొక బంగారు నగరము కలదు. అందు ధార్మికుఁడు కృప ణానాథ శరణాగత వత్సలుఁడు స్ఫటికయశుఁ డను పేరి విద్యాధరరాజు కలఁడు. నేను అయనకు గౌరివరమువలన హేమప్రభాదేవియందు కలిగితిని. నా పేరు శక్తియశ. నేను తండ్రికి ప్రాణప్రియను. ఆయిదగురు అన్నల చెల్లెలను. వారి యాదేశమున వ్రతస్తోత్రములచేత నేను గౌరిని తనియించితిని. దేవి ప్రసన్నయై నాకు సకల విద్యలు ఇచ్చి 'పుత్త్రీ, నీకు తండ్రికంటె పదియింతల విద్యా మహిమ కలుగును. నరవాహనదత్తుఁడు వత్సరాజ సుతుఁడు భావివిద్యాధరచక్రవర్తి నీకు భర్త యగును.' అని యానతిచ్చి అంతర్హితురాలాయెను. ఆ ప్రసాదముచేత నాకు సకల విద్యలు వచ్చినవి. నేను క్రమముగా ప్రాప్తయౌవనను కాఁగా కడచినరాత్రి దేవి నాకు స్వప్నములో దర్శన మిచ్చి 'పుత్త్రీ, తెల్లవాఱఁగానే నీవు నీపతియొద్దకు పోయి ఈనమే మరల ఇచటికి రావలసినది. నీతండ్రి మాసములోపల మీకు వివాహ మును జరుపును.' అని యానతిచ్చి అంతర్ధానము పొందెను.

ఇంతలో తెల్లవాఱెను. అంత నేను ఆర్యపుత్త్రా, నిన్ను చూడ నిచటికి వచ్చితిని. ఇఁకను పోయెదను.

ఇట్లు పలికి ఆమె మింటి కెగసి చెలులతోఁగూడ తండ్రి నగరమునకుఁ బోయెను. నరవాహనదత్తుఁడు ఆవివాహమును ఎదురు సూచుచు ఆ మాసమును యుగోపమముగాఁ గడపు చుండెను. అతఁ డట్లుత్కంఠితుఁ డై యుండఁగా గోముఖుఁడు తద్వినోదార్థము ఈకథను చెప్పెను.

## మకరందికకథ.

పూర్వము కాంచనపురి యని యొక నగర ముండెను. అందు సుమనసుఁ డని గొప్పవాఁడు రాజు ఉండెను. ఆక్రాంత దుర్గకాంతారభూమి యై విరాజమానుఁ డైన యతఁడు చిత్రముగా శత్రువులనుకూడ అట్టి వారినిగానే చేసెను. ఒకనాఁడు ఆతఁ డాస్థానమం దుండఁగా ప్రతీహారుఁడు వచ్చి 'దేవా, నిషాదరాజకూఁతురు ముక్తాలత యనునది ఏలినవారి దర్శింపఁ గోరి చిలుకతోఁడి పంజరమును చేతఁ గొని ద్వారభూమిలో వచ్చి యున్నది. వీరప్రభుఁ డనెడి తద్భ్రాత కూడ వచ్చి యున్నాఁడు.' అని విన్నవించెను. రానిమ్ము, అని రాజు సెల వీయఁగా, ఆమె వచ్చెను. ఆమె యద్భుతరూపమును చూచి అచటి వా రెల్ల 'ఈమె మనుష్యస్త్రీ గాదు, ఎవతెయో దివ్యాంగన!' అని తలంచిరి. ఆమెయు రాజునకు ప్రణమిల్లి 'దేవా, ఇది శాస్త్రగంజ మను పేరిటి చిలుక. నాలుగు

శాస్త్రములు నేర్చినది, కవి, సకల విద్యలయందును కలల యందును నేర్పరి. ఏలినవారికి ఉపయోగించు నని యిచటికి తెచ్చితిని. కైకొనుఁడు.' అని చిలుకను అర్పించెను. ప్రతీహారుఁడు దానిని గొని రాజునొద్దకు తేఁగా అది ఇట్లు చదివెను.

'రాజన్, యుక్త మిదం సదైవ యదయం దేవస్య సంధుక్ష్యతే
ధూమశ్యామముఖో ద్విష ద్విరహిణీ నిశ్వాస వాతోద్గమైః;
ఏత త్త్వద్భుత మేవ యత్పరిభవా ద్బాష్పాంబుపూరప్లవై
రాసాం ప్రజ్వల తీహ దిక్షు దశసు ప్రాజ్యః ప్రతాపానలః.'

[ఓరాజా, ధూమశ్యామల ముఖమైన నీప్రతాపానలము సదా శత్రువిరహిణీ నిశ్వాసవాతోద్గమములచే ప్రజ్వలించుట యుక్తమే గాని వారి బాష్పాంబు పూరాసారములచేత పది దిక్కులయందును తడిసిన కొలఁదియు అధికముగా ప్రజ్వలించుటమాత్రము అద్భుతముగా నున్నది.]

ఇట్లు చదివి అర్థము చెప్పి శుకము మరల 'ఏమి ప్రమేయము ? ఏశాస్త్రమునుండి చెప్పుదును ? దేవా అనతిమ్ము.' అని పలికెను. రాజు అందునకు మిగుల ఆశ్చర్యపడుచుండఁగా, మంత్రి 'దేవా, ఇతఁ డెవఁడో పూర్వము ఋషిగా నుండి శాపమువలన శుక మాయినాఁ డని తలఁచెదను. ఇతఁడు ధర్మవశమున జన్మాంతరస్మరణ కలవాఁడై పూర్వము చదివినదాని జ్ఞప్తి కలిగియున్నాఁడు.' అనెను. అంతట రాజు 'అయ్యా చెప్పుము; నీవృత్తాంత మేమి? శుకమ వయిన నీకు ఈ శాస్త్ర

విజ్ఞాన మెట్లు కలిగినది ? నీవు ఎవఁడవు ? అని యడిగెను.' అంత శుకము బాష్పములు గార్చి 'దేవా, ఇది చెప్పరానిది, అయినను నీ యాజ్ఞచేత చెప్పెదను, వినుము.' అని యిట్లు చెప్పసాగెను.

ఓరాజా, హిమవత్పర్వతము చెంత ఒకరోహిణవృక్షము వేదమువలె భూరిశాఖాశ్రితద్విజము దిగ్వ్యాపి కలదు. అందు చిలుక యొకటి పెంటితో గూఁడు కట్టుకొని జీవించుచుండెను. నేను ఆమె కడుపునఁ బుట్టితిని. దుష్కర్మయోగమున నాతల్లి ఆశకి నేను బుట్టినవెంటనే మృతిఁబొందెను. తండ్రియే నన్ను తెక్కలలోఁ బెట్టుకొని కాపాడు చుండెను. దగ్గఱ చిలుకలు తెచ్చుకొని తినఁగా మిగిలిన పండ్లను నాతండ్రి నాకు తెచ్చి పెట్టుచు తానును తినుచు అచటనే కాలము గడపుచుండెను. ఒకప్పుడు అచటికి వాద్యములు వాదించుచు బుఱ్ఱట కొమ్ములు ఊఁదుచు భయంకరమైన భిల్లసేన వేటకు వచ్చెను. నానా ప్రాణి హననమునకై పుళిందబృందము పరు గెత్తుకొని వచ్చి నంత నా మహాటవి విత్రస్తకృష్ణసారాక్షియు ధూళివ్యాలులి తాంశుకయు సంభ్రమోద్వేల చమరీ విస్రస్తకబరీభరయు నై భయపలాయన వ్యాకులయుంబోలె నొప్పెను. పగలెల్ల వేట భూములలో యమక్రీడితము కావించి సాయంకాలమున శబర సైన్యము మాంసపుఁగావళ్లతో ఆ చెట్టుకడకు వచ్చెను. అందులో ఒకముసలి శబరుఁడు మాంస మేమియు సంపాదించు

కొనలేక ఆచెట్టును చూచి ఎక్కి గూండ్లలోనుండి శుకములను ఇతర పక్షులను వెలికిఁ తీసి మెడనులిమి చంపి క్రిందపాఱవైచు చుండెను. యమకింకరుఁడో యన చెంతకు వచ్చుచున్న వానిని కని నేను నాయన ఱెక్కల దాఁగితిని. ఇంతలోపల పాపాత్ముఁడు మాగూఁటికి వచ్చి నాయనను మెడ నులిమి చెట్టు మొదట పాఱవేసెను. నేనును నాయనతోఁగూడ నేలఁ బడి ఆయనఱెక్కలనుండి వెలువడి భయముతో ఆకులనడుమఁ దూఱితిని. భిల్లుఁడు చెట్టు దిగి కొన్ని చిలుకలను నిప్పుతో కాలిచి భక్షించి కడమవానిని కొని పల్లికి పోయెను.

అంత నేను భయము తీఱి దుఃఖదీర్ఘము నా రాత్రిని ఎట్లో గడపి సూర్యోదయము కాఁగానే ఱెక్కలు నేలకుఁ దగుల ప్రాకుచు, దప్పి గలిగి, చెంత నున్న సరోవరమునకు పోయితిని. అచట స్నాతుఁడై ఇసుకతిన్నెయందు నా పూర్వ పుణ్యరాశియో యన నున్న మరీచిమహార్షిని కంటిని. ఆయన నన్ను చూచి ఓదార్చి, నానోట నీటిబొట్లు పోసి సేద దేర్చి, కనికరముతో నన్ను ఆకుపుటములో పెట్టి ఆశ్రమమునకుఁ గొని పోయెను. అచట కులపతి పులస్త్యుఁడు నన్నుఁ జూచి నవ్వెను. ఇతరమునులు అడుగఁగా దివ్యదర్శనుఁడు పులస్త్య ముని యి ట్లనియె. 'శాపచ్యుతుఁడై శుక మయిన వీనిని గని నేను నవ్వితిని. వీనికథను ఆహ్నికమైన పిమ్మట చెప్పెదను. దానిని విని వీఁడు పూర్వజన్మ వృత్తాంతమును స్మరించును.

ఇట్లు పలికి మహర్షి ఆహ్నికమున కై లేచెను. ఆహ్నికము తీఱఁగానే మునులు మరల అడుఁగగా నా కథను మహర్షి యిట్లు వర్ణించెను.

జ్యోతిష్ప్రభుఁ డని రత్నాకరపురమందు రాజు ఆసముద్రాంతము పుడమి నేలుచుండెను. అతనికి తీవ్ర తపస్సునకు మెచ్చిన గౌరీపతివరముచేత హర్షవతీదేవియందు కుమారుఁడు కలిగెను. ఆమె తననోట చంద్రుఁడు ప్రవేశించినట్లు కల గని నందున రాజు ఆతనయునికి సోమప్రభుఁ డని పేరు పెట్టెను. ఆ కుమారుఁడు అమృతమయము లైన గుణముచే లోకులకు నయనోత్సవము చేయుచు క్రమముగా ఎదిగెను. శూరుఁడు ధరణీభరణక్షముఁడు వయసువాఁడు జనప్రియుఁడు నయిన యాకుమారుని రాజు ప్రేమతో యువరాజును చేసి తన మంత్రి ప్రభాకరునికుమారుని ప్రియంకరుఁ డనెడి సద్గుణుని అతనికి మంత్రినిగా ఇచ్చెను. ఆసమయమున ఆకాశమునుండి దివ్యాశ్వము నొకదానిని తెచ్చి మాతలి సోమప్రభునితో ని ట్లనియె. 'నీవు ఇంద్రుని చెలికాఁడవు విద్యాధరుఁడవు; ఈ లోకమున అవతరించితివి. నీకు ఉచ్చైఃశ్రవము కొడుకు ఆశుశ్రవ మను హయోత్తమమును ఇంద్రుఁడు పూర్వ స్నేహముచే పంపినాఁడు. దాని నెక్కిన నిన్ను శత్రువులు జయింప నేరరు.' ఇట్లు పలికి సోమప్రభునికి గుఱ్ఱము నొప్పగించి సత్కృతుఁ డై మాతలి ఎగసి స్వర్గమునకు పోయెను. సోమప్రభుఁడు ఆదినము

ఉత్సవ మనోహరముగాఁ గడపి మఱునాఁడు తండ్రితో ని ట్లనియె— 'నాయనా జయింపఁ దలంప కుండుట క్షత్త్రియ ధర్మము కాదు. కాన నా కనుజ్ఞ ఇమ్ము, నేను దిగ్విజయార్థము తరలెదను.' తండ్రి జ్యోతిష్ప్రభుఁడు సంతోషించి జైత్ర యాత్రార్థము సరంజామా చేసెను.

సోమప్రభుఁడు మంచిదినమున తండ్రికి నమస్కరించి చక్రదత్తమైన యాయశ్వమునెక్కి బలసమేతుఁడై తరలెను. అశ్వప్రభావముచే మహావిక్రమశాలి యతఁడు రాజుల నెల్ల గెలిచి రత్నములను గ్రహించెను. అతఁడు శత్రువుల తలలతోఁ గూడ తనధనుస్సును వంచెను ; ఆ ధనుస్సు మరల ఉన్నత మాయెనుగాని, శత్రువుల శిరములుమాత్రము ఉన్నతములు కాలేదు. ఇట్లు కృతార్థుఁడై మరలి వచ్చుచు హిమవత్సమీప మార్గమున దండును విడియించి, వేఁట ఆడుచుండే, దైవ వశమున రత్నఖచిత మైన యొకకిన్నరమును చూచి దానిని పట్టుకొనుటకై ఆ యింద్రాశ్వము నెక్కి వెంటఁ దఱిమెను. ఆ కిన్నరము కొండగుహాలోపలఁ దూఱి అదృశ్య మాయెను. ఇప్పటికి సోమప్రభుఁడు దండును బాసి చాలదూరము పోయి యుండెను. సూర్యుఁడు సకలదిక్కులను తన తేజము వెదచల్లి సంధ్యాసంగమకారిణి యైన పడమటి దిక్కును చేరెను. సోమ ప్రభుఁడు బడలి ఎట్టకేలకు నిలిచి యొక మహాసరస్సును గని దానితీరమున ఆరాత్రి గడపువాఁడై గుఱ్ఱమును దిగి, దానికి

తృణోదకములు ఇచ్చి, తాను ఫలములు భక్షించి, నీరుత్రాగి విశ్రమించెను. ఇంతలో ఆకస్మికముగా గీతధ్వని వినఁబడెను. కుతూహలముచే దాని ననుసరించి పోయి సోమప్రభుఁడు సమీపముననే శివలింగము నెదుట పాడుచున్న యొక దివ్యాంగనను చూచెను. ఈ యద్భుతరూప యెవతెయోయని ఆశ్చర్య పడుచున్న యతనిని ఉదారాకారుని చూచి ఆమెయు అతిథి సత్కారము చేసి 'ఎవరవునీవు! ఈదుర్గమభూమికి ఒంటరిగా నేల వచ్చితివి?' అని యడిగెను. అంత నతఁడు తన వృత్తాంతమును చెప్పి ఆమెను 'నీవెవ్వతెవు? ఈవనములో ఏల యున్నావు?' అని యడిగెను. అంత నా దివ్యకన్య 'మహానుభావా కౌతుక మేని నావృత్తాంతమును చెప్పెదను వినుము.' అని బాష్పపూరాకులనేత్రయై యిట్లు చెప్పసాగెను.

ఇచట హిమాద్రినెత్తమున కాంచనాభ మని నగరము కలదు. అందు పద్మకూటుఁ డని విద్యాధరేశ్వరుఁడు కలఁడు. నేను అయనకు హేమప్రభాదేవియందు కలిగిన తనయను, పుత్త్రాధిక ప్రియను, మనోరథప్రభ యనుదానను. నేను విద్యాప్రభావముచే చెలికత్తెలతోఁగూడి మూఁడుజాములకాలములో ఆశ్రమములందును ద్వీపములందును కుల పర్వతములందును వనోపవనములయందును విహరించుచు ప్రతిదినము నాయన భోజనవేళకు ఇంటికి వచ్చుచుందును. ఒకనాఁడు ఇచట సరస్సీమను విహరించుచుండి నేను వయస్యసమేతుని ఒకముని

పుత్త్రుని కని అతని రూప శోభచేత దూతిచేతనుం బోలె ఆకృష్ట నై అతనిచెంతకు పోయితిని. అతఁడు సాభిప్రాయ మయిన చూపుచేతనే నన్ను స్వాగతము అడిగెను. నేను కూర్చుండఁగా నాసఖి మాయిరువుర యభిప్రాయము నెఱిఁగి 'ఈ మహానుభావుఁ డెవఁడు?' అని యతని చెలికాని నడిగెను. ఆచెలికాఁడు ఇట్లనియె. "ఇచటికి సమీపముననే ఆశ్రమములో దీధితిమంతుఁ డని ముని యొకఁడు కలఁడు. ఆయన బ్రహ్మచారి. స్నానార్థము ఒకనాఁడు ఈసరస్సునకు రాఁగా అప్పుడు ఇచటికి వచ్చియున్న శ్రీ అతనిని చూచి కామించి, శరీరముతో ఆ దివ్యసుందరుని కలయ నేరక, మనస్సుననే కలసి మానసపుత్త్రుని కనియెను. 'నీ దర్శనముచేత నాకు కలిగినాఁడు ఈకుమారుఁడు. కావున నీవు వీనిని కైకొన వలసినది' అని పలికి ఆమె ఆ సుతుని దీధితిమంతునికి ఒప్పగించి తిరోధాన మైనది. అతఁడు అనాయాస లబ్ధుఁ డైన యాకొమారుని సంతోషముతో గ్రహించి వానికి రశ్మిమంతుఁ డని పేరు పెట్టి పెంచి ఉపనయనము కావించి ప్రేమతో సకలవిద్యలు నేర్పెను. ఆ రశ్మిమంతుఁడే ఈముని కుమారుఁడు శ్రీపుత్త్రుఁడు నాతోఁగూడ విహరించుచుండువాఁడు."—

ఇట్లు పలికి ఆ వయస్యుఁడు నా సఖిని నా వృత్తాంత మడిగెను. ఆమెయు పేరు వంశము సకలమును చెప్పెను. అంతట పరస్పరాన్వయ నామాదిజ్ఞానము కలిగి అత్యంతాను

రక్షుల పై ఆమునిపుత్త్రుఁడును నేనును అచట నుండఁగా నే నా రెండవచెలి మాయింటినుండి వచ్చి 'మీనాయన నిన్ను భోజన శాలయందు ఎదురుసూచుచున్నాఁడు' అనెను. అంతట నేను మునిపుత్త్రునితో త్వరగా మరల వచ్చెద నని పలికి అతనిని అచటనే నిలిపి భయపడుచు మానాయన యొద్దకు పోయితిని. అచట కొంచెము ఆరగించి నేను వెలువడునంతలో నా మొదటి సఖి వచ్చి నాతో ని ట్లనియె. "ఆమునిపుత్త్రుని సఖుఁడు త్వరితము గా వచ్చినాఁడు. ఇచట ముంగిట ద్వారమం దున్నాఁడు, నాతో నిట్లు చెప్పినాఁడు: 'నన్ను మనోరథప్రభయొద్దకు రక్షింపంతుఁడు తనతండ్రివలన తాను నేర్చిన దైన యాకాశగమనవిద్యను ఇచ్చి పంపినాఁడు. 'ఆ ప్రాణేశ్వరిని బాసిన నన్ను మదనుఁడు అతి దారుణదశకు తెచ్చినాఁడు. ఇఁక క్షణ మయినను ప్రాణములను నిలుపుకోఁ జాలను.' అని చెప్పు మని పంపినాఁడు." ఆ మాట విన్న వెంటనే నేను, ఆ వయస్యుఁడే దారి నడుపఁగా, సఖితోఁ గూడ ఇచటికి వచ్చి, ఇచట నేను లేనందుకై చంద్రోదయము చేత గతప్రాణుఁ డయిన మునిపుత్త్రుని కంటిని. అంతట నేను వియోగార్తచే నన్ను నిందించుకొనుచు అతని కళేబరమును కొని దానితోడ అగ్నిప్రవేశము చేయుటకు నిశ్చయించుకొని యుండఁగా ఆకాశమునుండి తేజఃపుంజాకృతి యొక పురుషుఁడు ఆ దేహమును కొని ఆకాశమున కెగిరి పోయెను. అంత నేను మాత్రమే నిప్పులో పడుటకు ఉద్యమించునంతలో ఆకాశవాణి

యిట్లు పలికెను : 'మనోరథప్రభా, ఇట్లు సేయకుము. ఈ ముని పుత్త్రునితో యథాకాలమున నీకు మరల సంగమము కలుగును.' అది మొదలు నేను మరణము మాని ఇచటనే బద్ధాశనై అతని నెదురుసూచుచున్నశంకరార్చన సేయుచున్నాను. ముని పుత్త్రుని చెలికాఁడును ఎచటికో నాకు అగపడక పోయెను.

ఇట్లు ఆమె పలుకఁగా, సోమప్రభుఁడు 'నీవు ఏకాకినివై యున్నావేమి? నీచెలి యెక్కడ?' అని యడుగఁగా, ఆ విద్యాధరి మరల నిట్లనియె :— 'సింహవిక్రముఁ డని విద్యాధరేశ్వరుఁడు కలఁడు. అతనికి అనన్య సమాన మకరందికయని తనయ కలదు. ఆమె నా ప్రాణసఖి, నాదుఃఖముచే దుఃఖితయై నావార్తను తెలిసికొని రమ్మని నాయొద్దకు ఒక సఖిని పంపెను. అంత నేను ఆ సఖితోఁగూడ నా సఖిని పంపి ఒంటరిగా నున్నాను.'– ఇట్లు ఆమె పలుకుచుండఁగానే ఆ చెలి ఆకాశమునుండి దిగెను. ఆమెను మనోరథప్రభ సోమప్రభునికి చూపి ఎఱుకపఱిచెను. ఆమెయు మకరందికాకుశలమును చెప్పెను. అంత నామెచే మనోరథప్రభ సోమప్రభునికి పర్ణశయ్య చేయించి గుఱ్ఱమునకు గడ్డి వేయించెను. అందఱును రాత్రి నిద్రించి తెల్లవాఱఁగానే మేల్కాని, ఆకాశమునుండి దిగుచున్న విద్యాధరు నొకనిం గాంచిరి. అతఁడు దేవజయుఁ డను వాఁడు మనోరథప్రభకు నమస్కరించి కూర్చుండి యిట్లు పలికెను: " మనోరథప్రభా, సింహవిక్రమ మహారాజు చెప్పుచున్నాఁడు: 'నీకు వరుఁడు నిశ్చి

తుఁడు గాక నాకూఁతురు మకరందిక వివాహమాడదఁట. కనుక నీవే వచ్చి యీ మెను వివాహార్థము బోధింపుము.' ఈ మాట విని సఖీస్నేహముచే అచటికి మనోరథప్రభ బయలు వెడలఁగా సోమప్రభుఁడు 'ఓ మహానుభావురాలా, విద్యాధర లోకము చూచుటకు కుతూహలముగా నున్నది. నన్నుఁ గూడ కొని పొమ్ము. అశ్వము ఇక్కడనే గడ్డి మేయు చుండును గాక.' అని యడిగెను. ఆమెయు అంగీకరించి సోమప్రభుని దేవజయుని యొడిలో కూర్చుండఁ బెట్టి సఖీయుక్తయై అందఱితోను ఆకాశ మార్గమున మకరందికయొద్దకుఁ బోయెను. ఆమె ఆతిథ్యము చేసి మనోరథప్రభను, ఇతఁ డెవ రని సోమప్రభునిఁ గూర్చి యడిగెను. ఆమె యాతని వృత్తాంతమును చెప్పెను. మకరందికా మానసమును సోమప్రభుఁడు దర్శనమాత్రముననే హరించెను. అతఁడును ఆమెను రూపవంతురా లయిన లక్ష్మినిగా మనస్సునఁ నెంచి, ఈమెకు తగినవరుఁడు ధన్యుఁ డెవఁడు, అని తలంచెను. పిమ్మట స్వైరాలాపములతో మనోరథప్రభ మకరందికను 'ఓ చండీ, వివాహ మేల ఒల్లవు?' అని యడిగెను. 'నీవు వరుని అంగీకరింపక యుండఁగా, ప్రాణాధిక వయిన నిన్ను అతిక్రమించి నేనుమాత్ర మెట్లు వివాహ మగుదును?' అని మకరందిక సప్రణయముగా పలికెను. మనోరథప్రభ అనియె.–'ముగ్ధరాలా, నేను వరుని వరించితిని, అతని సంగమము నెదురు సూచుచు ఇచట నున్నాను.' అంత మకరందిక 'అట్లయిన నీమాటప్రకా

రము నడుచుకొనియెదను.' అనియెను. అంత మనోరథప్రభ మకరందిక యభిప్రాయము నెఱిఁగి యిట్లనియె.—

'సఖీ, ఇతఁడు సోమప్రభుఁడు, లోక మెల్లఁ గ్రుమ్మరి ఇపుడు నీకు అతిథిగా వచ్చి యున్నాఁడు. ఓ సుందరీ, ఇతనికి నీవు ఇప్పుడు అతిథిసత్కారమును చేయవలసినది.' మకరందిక పలికెను. 'శరీరము మొదలు నాది సర్వమును ఈయనకు ఇప్పుడు అర్ఘ్యముగా ఇచ్చితిని. ఇచ్చుయేని కొనును గాక.' ఇట్లు ఆమె పలుకఁగా మనోరథప్రభ ఆ ప్రీతిని క్రమముగా ఆమె తండ్రికి తెలిపి ఆ యిరువురకు వివాహనిశ్చయము చేయించెను. సోమప్రభుఁడు సంతోషించి మనోరథప్రభతో నిట్లనియె. 'నీయాశ్రమమునకు నే నిప్పుడు పోయెదను. ఒకవేళ నామంత్రియు సైన్యమును నన్ను వెదకుచు అచటికి వచ్చియుందురు. కనుక అచటికి పోయి సైన్యవృత్తాంతము నెఱిఁగి పిమ్మట మంచి దినమందు మకరందికను వివాహ మయ్యెదను.' వల్లె యని మనోరథప్రభ అతనిని మరల దేవజయుని యొడిలో కూర్చుండఁబెట్టి తన యాశ్రమమునకు కొనిపోయెను. అప్పటికి మంత్రి ప్రియంకరుఁ డను వాఁడు అతని దారిని వెదకుచు దండుతోఁ గూడ అచటికి వచ్చి కలసికొనెను. సోమప్రభుఁడు అందులకు సంతోషించి అతనికి తన వృత్తాంతము నెల్ల వివరించుచుండెను. అంతలో తండ్రియొద్దనుండి సోమప్రభుని శీఘ్రముగా రమ్మని జాబు కొని దూత వచ్చెను. అంతట దండును వెంటఁగొని

మంత్రియొక్క యనుమతిని సోమప్రభుఁడు తండ్రియాజ్ఞను మీఱక 'నాయనను చూచి త్వరగానే వచ్చెదను.' అని మనో గథప్రభతోను దేవజయునితోను పలికి వెడలిపోయెను. దేవ జయుఁడు పోయి ఆ వృత్తాంతమును అప్పుడే మకరందికకు తెలిపెను. ఆమె విరహాతురయై ఉద్యానములలో ప్రీతినొంద దాయెను, గీతమందును సఖీజనమందును ప్రీతి నొందదాయెను; శుకముల వినోద వాక్యములను సయితము విన నొల్లదాయెను; ఆహారమునుకూడ మానెను. భూషణాదులమాట చెప్పనేల? తల్లిదండ్రులు ప్రయత్నపూర్వకముగా ఎంత తెలివి చెప్పినను దుఃఖము మాన కుండెను. తామరాకుఁ బొన్నును క్షణములో వదలి ఉన్మాదినిగా తిరుగుచు తల్లిదండ్రులకు దిగులు కలిగించు చుండెను. వారు పలికినట్టి యోదార్పు వచనములను ఆమె గ్రహింపకుండఁగా వారు ఆమెను ఇట్లు శపించిరి:-'నిర్ఘృణకులైన బోయల నడుమ ఈ దేహముతోనే నీజన్మమును మఱచి కొంత కాలము పడియుందువు.' ఆశాపముచే ఆమె వెంటనే నిషాదుల యింట నిషాదకన్యక యాయెను. ఆ దుఃఖముచే పశ్చాత్తప్తులై తల్లిదండ్రులు మృతిఁ బొందిరి. ఆవిద్యాధరేంద్రుఁడు పూర్వము సర్వశాస్త్రవిదుఁడై ఋషియై యుండెను. పూర్వ దోష శేషముచేత చిలుక యయినాడు. అట్లే అతని భార్యయు అడవిపంది యాయెను. ఆ చిలుకయే ఇతఁడు, చదివినదానిని తపోబలముచే స్మరించుచున్నాఁడు. వీనికర్మగతివైచిత్ర్యమునకు

నేను నవ్వితిని. ఈకథను రాజసభలో చెప్పి ఇతఁడు విముక్తుఁడగును. సోమప్రభుఁడు ఇతనికూఁతును మకరందికను ఇప్పుడు నిషాదియైన దానిని ఇఁకను విద్యాధరజన్మమందు పొందఁగలఁడు. మనోరథప్రభయు ఇప్పుడు రాజుగా పుట్టి యున్న రశ్మిమంతుని అప్పుడే పతినిగా పొందఁగలదు. సోమప్రభుఁడు తండ్రినిదర్శించి యిప్పుడు ఆశ్రమమునకుఁ బోయి ప్రియాప్రాప్తికై ఈశ్వరుని గూర్చి తపస్సు చేయుచున్నాఁడు.

ఇట్లు పలికి పులస్త్య మహాముని విరమించెను. నేనును పూర్వ వృత్తాంతమును జ్ఞప్తికి తెచ్చుకొని హర్ష శోక పర్యాకులుఁడ నైతిని. నన్ను ఆశ్రమమునకుఁ గొని పోయిన యా మరీచిముని పెంచుచుండెను. నాకు రెక్కలు రాఁగానే పక్షిజాతి సులభ మయిన చాపలముచేత నేను అచట నచట తిరుగుచు విద్యామహిమలను ప్రకటించుచు కడపట నిషాద హస్తగతుఁడ నై యిప్పుడు నీ సన్నిధికి వచ్చితిని. ఇప్పుడు నాకు పక్షిజన్మ కారణ మయిన పాపము తీఱినది.

ఇట్లు చిత్రవాక్కులతో సభలో కథ చెప్పి ఆ శుకము విరమించెను. ఆ రాజు ప్రమోదభరితాంతరంగుఁ డాయెను. ఈలోపల సోమప్రభునితో తపస్తుష్టుఁడైన మహేశ్వరుఁడు, స్వప్నమందు దర్శన మొసంగి యిట్లాన తిచ్చెను: "రాజా, లేలెమ్ము ; సుమనోరాజుకడకుం జనుము, అట నీప్రాణప్రియను గూడెదవు. తండ్రిశాపంబుచే ముక్తాలత యను పేర నిషాది యై మకరందిక

చిలుకతనువుం బొందినతండ్రిం గైకొని ఆ రాజునొద్దకుం బోయి యున్నది. నిన్నుఁ గన్నంతనే యావిద్యాధరి శాపవిముక్తయై పూర్వజన్మమును స్మరించుకొనును. అచ్చట మీ కిరువురకు నొండొరులం దెలిసికొన్న హర్షాతిరేకంబున సంగమంబు శోభిల్లును." ఇట్లని రాజును కరుణించి భక్తవరదుండగు గిరిజాపతి తనయాశ్రమమం దున్నట్టి యా రెండవదానిని మనోరథప్రభను ఇట్లు హెచ్చరించెను. "పుత్త్రీ, నీవు గోరిన వరుఁడు ఆ ముని సుతుఁడు రశ్మిమంతుఁడు ఇపుడు సుమనసుఁ డను పేర రాజుగా జన్మించియున్నాఁడు. కల్యాణీ, నీవు వేగి యాతనిం గూడుము, నిన్నుఁ గన్నంత నతఁడు తన పూర్వజన్మమును స్మరించును." ఇత్తెఱంగున పరమేశ్వరునిచేత నానతి వొంది యయ్యిరువురు విద్యాధరకన్యయు సోమప్రభుఁడును వెంటనే సుమనోరాజు నాస్థానికిం జనిరి. అచట మకరందిక సోమప్రభునిఁ గాంచి శాపముక్తయై తొలిజన్మమును స్మరించికొని దివ్యమైన తనవిద్యాధరీ దేహమును బొంది అతనిని కంఠాలింగనము చేసికొనెను. అతఁడును గిరిజాపతిప్రసాదముచే మూర్తీభవించిన దివ్యభోగలక్ష్మినింబోలె మకరందికను కౌఁగిలించుకొని తృప్తినొందెను. సుమనోమహారాజు కూడ మనోరథప్రభను చూడఁగానే పూర్వజన్మమును స్మరించుకొని అప్పుడె ఆకాశమునుండి రాలిన తన పూర్వదేహమును చొచ్చి మరల నా మునీంద్రపుత్త్రుఁడే రశ్మిమంతుఁడే అయి ఆ స్వకాంతతోఁ గూడి తన యాశ్రమమునకుఁ

బోయెను. సోమప్రభభూపతియు ప్రియాసమేతుఁడై తన నగరమునకుఁ బోయెను. చిలుకయు పక్షిదేహమును త్యజించి తపోర్జితమయిన లోకమునకు పోయెను. ఈరీతిని కాలవిలంబ మైనను ప్రాణులకు విహితసమాగమము కలుగుచుండును.

ఇట్లు నరవాహనదత్తుఁడు గోముఖునివలన అద్భుతకథను విని శక్తియశయందు ఉత్సుకుఁడై సంతోషించెను.

---

## ౪-వ తరంగము.

---

ఇట్లు విద్యాధరీయుగళకథను వర్ణించి మంత్రిపుంగవుఁడు గోముఖుఁడు మరల నరవాహనదత్తునితో నిట్లనియె. దేవా! ఈ లోకములో సామాన్యజనులు కూడ కొందఱు వివేకవంతులు ఇహపరములు కోరినవారైన కామావేగమును సహింతురు. అందులకు ఒకకథ కలదు, వినుము.

కులధరుఁ డను రాజునకు శూరవర్మ యను సేవకుఁడు పౌరుషశాలి కులపుత్త్రుఁడు ఉండెను. అతఁడు ఒకప్పుడు గ్రామాంతరమునుండి వచ్చి నిశ్శంకముగా ఇల్లు సొచ్చినవాఁడై అచట తనమిత్త్రునితోనే సంగత యైన తనభార్యను గాంచెను. కాంచి యతఁడు ధైర్యముచే క్రోధమును ఆఁపుకొని తనలో తాను 'పశుప్రాయుఁ డైన యీ మిత్త్రద్రోహిని చంపిన నేమి ప్రయోజనము ? దుశ్చారిణిని ఈ పాపాత్మురాలిని దండించిన

ఏమి ఫలము? పాపభాజనమ నైన నన్ను నే నేమి చేకొందును?' అని తలపోసి ఇరువురతోను 'మీరు మరల నాకంటికి కగపడిన చంపివేసెదను, నాకంటికి అగపడక పొండి.' అని పలికి తఱిమి వేసెను. వా రెచటికో పోయిరి. శూరవర్మ మఱి యొకతెను వివాహమై సుఖ ముండెను. క్రోధమును జయించినవాఁడు దుఃఖభాజనము గాఁడు. తెలివి గలవానిని విపత్తు బాధింపదు. తిర్యగ్జంతువులకుఁ గూడ ప్రజ్ఞవలన నేమముగాని పరాక్రమము వలనఁ గాదు. అందులకు ఈసింహవృషభాదిక కథను వినుము.

## సింహవృషభాదిక కథ.

పూర్వము ఒకానొకనగరమున ఒక వణిక్కుమారుఁడు ఉండెను. అతఁడు ఒకప్పుడు బేరమునకై మథురాపురమునకు పోవుచుండఁగా బండియెద్దు సంజీవక మనునది బండి లాగుచు దారిలో బరువుచే కాఁడి విఱిగిపోఁగా కొండయూటబురదలో కాలు జాఱి పడి దేహ మెల్ల చూర్ణప్రాయముగా నలుఁగుడు పొందెను. ఆదెబ్బకు ఒడ లెఱుఁగక పడి యున్న సంజీవకమును ఎంత ప్రయాస పడియు లేప లేక వణిక్కుమారుఁడు నిరాశ చేసికొని దానిని వదలి తాను మాత్రము పోయెను. కొంత సేపటికి సంజీవకము దైవానుగ్రహమున సేద దేఱి లేచి మంచి గఱికమేయుచు మెల్లగా యమునాతీరము చేరి క్రమక్రమముగా మంచి మేతచే బలిసి కోలుకొనెను. మూఁపురము పెరిగి శివునిగిత్తవోలె పుట్టలను కోరాడుచు మదించి అంకెలు వేయు

చుండెను. ఆసమీపమున ఒక సింహము పింగళక మనునది పరాక్రమముచే అడవినెల్ల ఆక్రమించి యేలుచు ఒక గుహలో నివసించి యుండెను. ఆ మృగరాజునకు ఇరువురు నక్కమంత్రు లుండిరి. ఒకనిపేరు కరటకుఁడు, రెండవవాఁడు దమనకుఁడు. ఆసింహమే ఒకప్పుడు జల పానార్థము యమునాతటమునకు వచ్చి చెంతనుండి పర్విన సంజీవకునిఱంకెను వినెను. అశ్రుత పూర్వమై దిక్కులు పిక్కటిల్ల వ్యాపించుచున్న యానాదమును విని సింహము 'ఆహాహా! నాదమే యీవిధముగా నున్నది? నిశ్చయముగా ఈచెంత నేదో గొప్పజంతువు ఉన్నది. అది నన్ను చూచిన, తత్క్షణము చంపును. లేదా, ఈయడవినుండి తఱుమును.' అని తలపోసి జలము త్రాగకయే మరలి అడవి చొచ్చి తనచింతను అనుచరులకు తెలుపక భయముచే దాఁగి యుండెను. అంత నతనిమంత్రి ప్రాజ్ఞుఁడు దమనకుఁడు రెండవ మంత్రి యగు కరటకునితో 'భద్రా, మనదొర జలపానార్థము పోయి త్రాగకయే వడివడిగా వచ్చినాఁడు. ఇందుల కారణ మును మనము అడిగి తెలిసికోవలయును.' అనెను. అంతట, కరటకుఁడు 'ఇ దేమి మనపనియా ? నీవు మేకు పెఱికిన కోఁతి కథను వినలేదా ?' అని యాకథను చెప్పఁదొడంగెను.

## మే కు పె ఱి కి న కోఁ తి క థ.

ఒకానొకనగరములో వర్తకుఁ డొకఁడు విస్తారము కలప తెప్పించి దేవాలయము కట్టించుచుండెను. అచట పనివాండ్రు

ఒకదూలమును అంపముతో సగము కోసి సందులో గూటము దిగఁగొట్టి యుంచి యింటికిఁ బోయిరి. అంతలో నచటికి ఒక కోఁతి వచ్చి గూటము దించి యుండిన యా సందులో చాపలముచే మృత్యుముఖంబునంబోలె కూర్చుండి కాలచోదిత మై రెండుచేతులతోను ఆ గూటమును పెఱికి వేసెను. గూటము లేచి పోఁగానే దూలముయొక్క చీలికలు రెండును కలసికొనఁగా నడుమ నున్న యా కోఁతి చిదిగి చచ్చిపోయెను. ఈ రీతిని జోలిమాలినపనికిఁ బోవువాఁడు నశించును. కావున మృగరాజు స్థితి ఏ మయిన మన కేమి?

ఇట్లు కరటకునివలన విని దమనకుఁ డనియె: 'ప్రభు చిత్తములో చొరఁబడి తెలివి గలవాండ్రు సర్వదా విశేష భోగములు పొందుదురు. ఉదరపూరణమాత్రము చేసికొనని వాఁ డెవఁడు?' అంతట కరటకుఁడు 'సేవకునికి తనంతట తాను దొరయం దధికముగా ప్రవేశించుట ధర్మము గాదు.' అనెను. దమనకుఁడు 'అట్లుగాదు. ఎల్లవారును తమసత్త్వమునకు తగిన ఫలము కోరుదురు. కుక్క ఎముకకు తృప్తిపొందును. సింహము ఏనుఁగుమీఁది కెగురును.' అనెను. 'ఇట్లు చేయుదుమేని దొర సంతసించుటకు బదులు కోపగించినయెడల మన కేమి ఫలము? దొరలు పర్వతములవలె మిక్కిలి కర్కశులు, స్తబ్ధులు, ఘాతుక జంత్వావృతులు, దురాసదులు, విషములు.' అని కరటకుఁడు పలికెను. దమనకుఁడు 'అది సత్యమే, తెలివి

గలవాఁడు ప్రభువును చిత్త మెఱిఁగి స్వాధీన పఱుచుకొనును.' అనెను.

అంతట కరటకుఁడు అట్లే చేయు మనఁగా దమనకుఁడు సింహామునొద్దకు పోయి నమస్కరించి కూర్చుండె యతనిచేత మన్నన వడసి యిట్లు విన్నవించుకొనెను. 'దేవా, నేను నీకు కులాగతుఁడను, భృత్యుఁడను, హితుఁడను. పరు నయినను హితుని చేర్పవలయును. తనవానినైనను అహితుని తొలఁగింప వలయును. హిత మయిన పిల్లిని వెల యిడి యయినను తెచ్చి పెంతురు. అహిత మయిన మూషకమును ఇంటఁబుట్టిన దానినైనను శ్రమపడి గ్రైనను చంపివేయుదురు. సేమము కోరిన యేలిక తన మేలు కోరు భృత్యుల మాటను విన వలయును. దొర యడుగ కున్నను వారు సమయమందు దొరకు హితము చెప్పవలయును. కనుక, దొరా! నాయందు నమ్మకము గలవేని కోపింపక దాఁపక చెప్పెద వేనియు ఒకవిషయ మడిగెదను.' ఇట్లు దమనకుఁడు పలుకఁగా, పింగళక మహారాజు చిత్తగించి 'ఓయి, నీవు నమ్మక మయినవాఁడవు. మాయందు భక్తి గల వాఁడవు. కాన నిశ్శంకముగా అడుగుము.' అనియె. దమనకుఁడు 'దేవా, నీవు దప్పిచే జలపానార్థము ఏటికి పోయి జలము త్రాగకయే మరలి చింతాక్రాంతుఁడ వై వచ్చినందులకు కారణ మేమి?' అని యడిగెను. ఆమాట విని మృగరాజు 'వీఁడు నన్ను కనిపట్టినాఁడు. వీఁడు నాయందు భక్తుఁడు. వీనియొద్ద దాఁప

నేల?' అని తలంచి వానితో ని ట్లనియె. 'వినుము నీకు చెప్పక నేను దాఁచునది యేమియు లేదు. నీటియొద్ద నుండఁగా నాకు ఒకగొప్పగర్జన యపూర్వ మైనది వినఁబడినది. ఆ యుగ్రనాదము నాకంటె గొప్ప దయిన యొకసత్త్వము దని తలంచుచున్నాను. ప్రాయికముగా జంతువు శబ్దానురూపముగా నుండును. బ్రహ్మ యొక్క జంతుసృష్టి అధికాధికముగా విచిత్రముగా నున్నది. ఆ జంతువు ఇచట ప్రవేశించినందున ఇఁక ఈ దేహము నాది గాదు, ఈవనమును నాది గాదు. కనుక నేను ఇచటినుండి మఱే యే యడవి కేనియుఁ బోవలయును.' ఇట్లు పలికిన దొరకు దమనకుఁ డి ట్లనియె. శూరుఁడవు దేవా, ఈ మాత్రా న కే యడవి వదలి బోయెద ననియెదవు. నీటిచేత అనకట్టును, కొండెముచే స్నేహమును, దాఁపమిచే రహస్యాలోచనయు, శబ్ద మాత్రముచే పిఱికి వాఁడును భంగపడుట తెల్లము. యంత్రాది శబ్దములుకూడ భయంకరము లగును. ప్రభూ, తత్త్వ మెఱుఁగక భయపడఁ గూడదు. భేరీజంబుక కథను వినుము.

### భే రీ జం బు క క థ.

ఒక యడవిలో నొకనక్క ఆహారార్థము తిరుగుచు ఒక చోట యుద్ధము జరిగిన క్షేత్రమును చూచి దఱిసి అచట నొక గంభీరధ్వనిని విని అదివచ్చినవైపు చూడ్కులు నిగిడించి అచట అదృష్టపూర్వ మయిన యొక భేరిని కని 'ఏమి యిది! ఇదే మయిన జంతువా, ఇట్లు పరున్నదా?' అని చింతించుచు, అది కదలక

ఉండుట గని చెంత కేఁగి చూచి జంతువు కాదని తెలిసికొనెను. దానికి ఆడుచున్న తెల్లుకాఁడ తగులఁ దగుల భేరీముఖముతోలు శబ్దించుచుండెను. దాని నెఱిఁగి గోమాయువు, భయము తీఱి, ఇందులో తిండి కేమయిన దొరకునా, యని తోలును కొఱికి లోనఁ జొచ్చి చూడ కేవలము కొయ్యయు తోలును ఉండెను.

ఇట్లు, మీవంటివారు శబ్దమాత్రమునకు వెఱతురా? సెల విచ్చిన నేనుపోయి దానినెఱిఁగి వచ్చెదను." సింహము 'శక్తుఁడ వేని పోయిరమ్ము.' అని సెల విచ్చెను. అంతట నక్క యమునా తటమునకు శబ్దానుసారముగా పోయి చూడఁగా అచట నొక యెద్దు మేయుచుండెను. దమనకుఁడు సమీపించి దానితో నొడంబడిక చేసికొని మరలి పోయి సింహములో ఉన్నది యున్నట్లే చెప్పెను.

అంతట పింగళకము సంతుష్టితో 'దమనకా, నీవు ఆ గొప్పయెద్దును పరిచయము చేసికొంటివేని దానిని యుక్తిగా ఇచటికి తోడ్కొని రమ్ము, ఎట్టిదో చూచెదను.' అని చెప్పి దమనకుని మరల సంజీవకమునొద్దకు పంపెను. దమనకుఁడు పోయి ఎద్దును 'రారమ్ము, మాదొర నీపై సంతోషించినాఁడు. నిన్ను పిలుచుచున్నాఁడు.' అని పిలువఁగా ఎద్దు భయముచే రా దాయెను. అంతట దమనకుఁడు మరల వనమునకుఁ బోయి తన దొరచే సంజీవకునికి అభయ మిప్పించి, మరల సంజీవకునొద్దకు వచ్చి అభయము తెలిపి ఓదార్చి సింగముకడకు కొనిపోయెను,

ప్రణామిల్లిన సంజీవకమునకు సింహము 'రా, నాయొద్దనే యిచ్చట నిర్భయముగా ఉండుము.' అని సత్కరించెను. అట్లే ఎద్దు అచటనే యుండెను ; క్రమక్రమముగా ఆయిరువురమైత్రియు బలపడి, మృగరాజు ఇతరులయందు విముఖుఁ డయి సంజీవక తత్పరుఁ డై యుండెను.

ఆ స్థితిని గని ఖిన్నుఁ డై దమనకుఁడు కరటకునితో ని ట్లనియె. "చూచితివా, మనదొర కేవలము సంజీవకుని వస మైనాఁడు, మనవైపు చూడను గూడ చూడఁడు. తాను ఒంటి గానే మాంసము భక్షించుచున్నాఁడు, మనకు పాలు ఇచ్చుట లేదు. ఈ ప్రభువు మూర్ఖుఁడు. వీనికి ఎద్దు నేర్పుచున్నది. ఈ యెద్దును తెచ్చుటయే నా తప్పు, కనుక ఈ యెద్దునకు ముప్పు కలుగునట్లు ప్రయోగము చెసెదను. మనప్రభువు ఈ యనర్థాని వదలునట్లు చేసెదను." కరటకుఁడు 'చెలికాఁడా, ఇప్పుడు ఇట్లు చేయుటకు నీకుఁ గూడ శక్యము గాదు.'అనెను. అందులకు దమ నకుఁడు 'చేసెదను చూడు నాప్రజ్ఞ, ప్రజ్ఞగలవాఁడు ఏమిచేయ లేఁడు! ఇందుల నిదర్శనము, వినుము.' అని చెప్పఁదొడంగెను.

### కొంగను చంపిన యెండ్రి కథ.

పూర్వము మత్స్యసమృద్ధ మయిన యొకసరసులో ఒక కొంగ యుండెను. దానికంట పడక భయముచే మత్స్యములు దాఁగుచుండినవి. వానిని పట్టుకొన లేక కొంగ వానితో నిట్లు బొంకెను.— ఓ చేపలారా ఇచటికి జాలరి ఒకఁడు వచ్చి

యున్నాఁడు. మిమ్ము క్షణములో వలలో పట్టి చంప నున్నాఁడు. నాయందు మీకు నమ్మక మున్నయెడల నా మాటప్రకారము రండు. ఒకానొక మాలుమూల జాలరులు ఎఱుఁగనిది, స్వచ్ఛ జలసమృద్ధము ఒకసరస్సు, కలదు. మిమ్ము ఒక్కొక్కరినిగా కొనిపోయి అందు వేసెదను. అక్కడ నివసింపుదురు గాక.' ఆ మాట విని ఆ పిఱికి జంతువులు జడమతులు మత్స్యములు అయ్యో అయ్యో కొంగయ్యా, అట్లే చేయుము, 'మేము, నిన్ను నమ్ముకొని యున్నాము.' అని మొఱ పెట్టినవి. అంత నా కొంగ ఒకటొకటిగా చేఁపలను కొనిపోయి ఒకగుంటమీఁదఁ బెట్టుకొని భక్షించుచుండెను. చేఁపలను అట్లు కొనిపోవుచున్న యాకొంగను ఆసరస్సులో నున్న యొకయెండ్రి కని, 'ఎక్కడికి చేఁపలను కొనిపోయెదవు?' అని యడిగెను. చేఁపలతోఁ జెప్పి నట్లే కొంగ యెండ్రితోఁ కూడ చెప్పెను. ఎండ్రి భయపడి తన్నుఁగూడ కొనిపోయి కాపాడు మని కొంగను వేఁడెను. కొంగయు దానిమాంసమునకు నోరూర దానిని కఱచుకొని ఆతిండిగుంటకి కొని పోవుచుండఁగా, ఎండ్రి అచట భక్షితము లైన మత్స్యములను అస్థిశేషములను కని 'ఆహా! ఈ కొంగ చేఁపలను నమ్మించి భక్షించుచున్నది గదా?' అని తెలిసికొని, తన్ను అది రాతిపైఁ బెట్టఁగానే దానిమెడను తెగువతో తన రెండుగోళ్లతోను కత్తిరించి వేసినది. పిమ్మట నాయెండ్రి కడమ

మత్స్యములకడకుఁ బోయి జరిగినవృత్తాంతమును వానికి చెప్పి వాని ప్రాణములను రక్షించెను. అవియును మిగుల సంతసిల్లినవి.

కావున ప్రజ్ఞయే బలము, ప్రజ్ఞ లేనివానికి బలమువలన ప్రయోజనము లేదు. సింహశశక కథను వినుము.

## సింహశశకకథ.

పూర్వ మొక యడవిలో మహాపరాక్రమశాలి ఓటు లేనిది సింహ మొకటి ఆగపడిన జంతువు నెల్ల సంహరించుచు ఉండెను. అంత నడవిలో మృగము లెల్ల కలయఁ బలికికొని దానితో 'ఓ మృగేంద్రా, నీకు దినమున కొక్కజంతువును ఆహారార్థము పంపెదము, ఒక్కమాటే జంతువుల నెల్లఁ గూల్చి ఏల స్వార్థహాని చేసికొనియెదవు?' అని విన్నవించు కొన్నవి. అందులకు సింహము అంగీకరించెను. నాఁటనుండియు దినమున కొకజంతువును సింహము ఆరగించుచుండఁగా, ఒక నాఁడు ఒక చెవులపిల్లికి వంతు వచ్చినది. మృగము లెల్లను పంపఁగా తరలి వచ్చుచు బుద్ధిశాలి యా శశకము తనలో తా ని ట్లాలోచించెను. 'ఆపత్కాలమందు తెలివి కోలుపోని వాఁడే గదా ధీరుఁడు. కావున మృత్యువు ఆసన్న మై యున్న నేను ఒకయుపాయము పన్నెదను.' ఇ ట్లాలోచించి శశకము సింగమునొద్దకు ఆలస్యముగా పోయి చేరెను. అట్లు తామసించి వచ్చిన శశకముతో సింహము 'ఓరీ శశుఁడా, నా భోజన వేళను దాఁటి వచ్చితి వేమి! నీకు చావుకంటె ఎక్కువ బాధ

కలిగించెదను. చూడుము.' అనెను. శశకము వినయముతో 'దేవా, అది నా తప్పు గాదు. ఏల యనఁగా ఇప్పుడు నేను నా వశములో లేను. నన్ను దారిలో మఱి యొక సింహము పట్టుకొని చాల సేపటికి విడిచి పెట్టినది.' అని విన్నవించెను. ఆ మాట విని సింహము తోఁకతో నేల తాటించుచు క్రోధారుణేక్షణ మై 'ఆ సింహము ఎక్కడ నున్నదో చూపుము.' అని శశకమున కాజ్ఞాపించెను. 'దేవా విజయంచేసి చూడుఁడు.' అని శశకము సింహమును ఒక నూతియొద్దకు కొనిపోయి 'ఇందు లో నున్నది చూడు' మనెను. సింహము గర్జించుచు నూతి లోనికి చూచి అందు తేటనీటిలోని తన ప్రతిబింబమును కని, దానిని రెండవసింహముగాను, తనగర్జనకు ఆనూతిలోన కలిగిన ప్రతిధ్వనిని ఆ రెండవసింహముయొక్క ప్రతిగర్జనగాను, తలంచి, యా సింహమును సంహరించుటకై కోపముతో నూతిలోనికి దుమికి చచ్చెను. ఇట్లు శశకము ప్రజ్ఞచేత తాను బ్రదికి, ఎల్ల మృగములను ఆ వృత్తాంతము చెప్పి సంతోషపెట్టెను. ఇట్లు ప్రజ్ఞయే బలముగాని పరాక్రమము బలము గాదు. అట్లే నేనును ప్రజ్ఞచేత నా కోరికలను సాధించెదను:—

ఇట్లు దమనకుఁడు పలుకఁగా కరటకుఁడు ఊరక ఉండెను. అంతట దమనకుఁడు పోయి తనదొర పింగళకుని మ్రోల చింతాక్రాంతుఁడుగా నిలిచెను ప్రభువు కారణమును అడుగఁగా రహస్యముగా నతనితో "దేవా, ఎఱిఁగి యూర

కుండ రాదు, గావున చెప్పెదను వినుము ; స్వామికి మేలు కోరు వాఁడు అనాజ్ఞాతుఁ డయ్యును హితమును చెప్పవలయును. కాన, దేవా, వేఱుబుద్ధి మాని నావిజ్ఞాపనను సావధానముగా వినవలయును. ఈ సంజీవకము నిన్నుఁ గూల్చి నీరాజ్యమును ఉపహరింపఁ గోరియున్నది. ఇది నీ మంత్రి యై నీవు పిఱికి వని నిశ్చయించుకొని యున్నది. నిన్ను చంపఁ గోరి తన కొమ్ములను చిమ్ముచు ఉండును. 'గడ్డిమేఁపరిని నేను రాజనుగా మీరు సుఖముగా నుందురు గాక, రండు మాంసభోజనుని ఈతని యుక్తిగా చంపివేయుదము.' అని యడవిలోని జంతువుల నెల్ల పిలుచుచున్నది. కావున ఈయెద్దును నీవు నివారింపవలయును ; ఇది యున్నంతసేపు నీకు క్షేమము లేదు." అని పలికెను. ఇట్లు దమనకుఁడు చెప్పఁగా విని పింగళకుఁడు 'గడ్డిమేయునది యీ యెద్దు, తుచ్ఛజంతువు, న న్నేమి చేయఁగలదు? నన్ను శరణుఁ జొచ్చి నాచేత నభయప్రతిజ్ఞ పొందిన దీనిని నే నెట్లు చంపుదును!' అని మాఱు చెప్పెను.

దమనకుఁడు చెప్పుచున్నాఁడు—దేవా, అట్లనకు ; రాజు ఎవనిని తనకు సమానుని చేయునో వాఁడు రాచసిరి గలవాఁ డగును. ఆ సిరి ఉచ్ఛ్రితు లైన యీ యిరువురయందును పాద మూని చాలసేపు అట్లు నిలువ లేక వారిలో ఒకని వదలును. దుష్టరోగిని వైద్యుఁడువోలె హితమును ఈసడించుచు సదా అహితమునే సేవించు ప్రభువును బుద్ధిమంతుఁడు వదలవలయు.

UNIVERSITY OF HYDERABAD.

తొలుత అప్రియ మయినను పిదప హితముగా పరిణమించు దానిని చెప్పువాఁడును వినువాఁడును ఎచట నుందురో అచట సిరి నెలకొనును. యోగ్యుల యాలోచనను వినక అయోగ్యుల బోధనలను వినువాఁడు త్వరలోనే ఆపద పొంది దుఃఖపడును. కావున, దేవా, ఈ యెద్దుమీఁద నీకు స్నేహ మనఁగా నేమి? నీకు ద్రోహము చేయ నున్న దీనికి అభయదాన మనఁగా నేమి? ఇది శరణుఁ జొచ్చుట యనఁగా నేమి ? మఱి నిత్యము నీచెంత నుండు నీయెద్దుయొక్క ఉచ్చయందును పేఁడయందును పుట్టు పురుగులు నీ దేహమందలి మత్తేభ దంతాఘాత వ్రణములలో ప్రవేశించినయెడల యుక్తిగా నీవధ జరుగదా. బుద్ధిమంతుఁడు దుర్మార్గుఁ డగునేని స్వయముగా కీడు చేయఁడు, వాని సంగము వలన కీడు గలుగును. ఇందులకు ఈకథను వినుము.—

## నల్లియు చీరపేనును.

ఒకానొక రాజుసెజ్జలో మందవిసర్పిణి యను చీరపేను చిరకాలము నివసించియుండెను. ఆకస్మికముగా గాలికి కొట్టుకొని వచ్చి టిట్టిభ మను నల్లి యొకటి ఆసెజ్జలోనే చేరెను. దానిని చూచి మందవిసర్పిణి 'నల్లీ, నానివాసమునకు నీ వేల వచ్చితివి ? మఱి యెచటి కైనను పొమ్ము.' అనెను. నల్లియు ఇంతవఱకు నే నెన్నఁడును త్రాగి యెఱుఁగని రాజరక్తమును త్రాగెద, దయ చేసి నన్ను ఇచట నుండ నిమ్ము.' అని వేఁడెను. మందవిసర్పిణి కనికరించి దాని నుండ నిచ్చి 'అట్టయిన నీవు

అకాలమందు రాజును కఱవఁగూడదు, అతఁడు నిద్రలో నున్న పుడుగాని రతాసక్తుఁడై యున్నప్పుడు|గాని, మృదువుగా కఱవవలయును.' అనెను. టిట్టిభము అందుల కంగీకరించి అచటనే యుండి రాత్రి శయ్యాగతుని ప్రభువును అవసరపడి కఱచెను. అతఁడు 'అబ్బా! ఏదో కఱచినది!' అని అఱచుచు లేచెను. అంతట మత్కుణము శరము పాఱి పోయినది; రాజభృత్యులు వెదకి మందవిసర్పిణి దొరకఁగా దానిని నలిపి వేసిరి. ఇట్లు టిట్టిభముతోడి సహవాసమువలన మందవిసర్పిణి మరణము నొందినది. అట్లే సంజీవకుని సహవాసముచేత నీకును ప్రాణగోడ్డము కలుగును. నా మాటను నమ్మవేని ఆ సంజీవకము నీయొద్దకు వచ్చినప్పుడు అది శూలములవలె వాఁడు లయిన తనకొమ్ములను చిమ్ముటను నీవే ప్రత్యక్షముగా చూడఁగలవు.

ఇట్లు దమనకుఁడు బోధింపఁగా లోఁబడి పింగళకుఁడు సంజీవకమును చంప నిశ్చయించుకొనెను. పింగళకుని యభిప్రాయమును తెలిసికొని దమనకుఁడు క్షణములో సంజీవకుని యొద్దకు చింతాక్రాంతుఁడుంబోలె పోయెను. 'మిత్రమా, దమనకుఁడా, ఏమి యిట్లున్నావు? నీకు ఆరోగ్యమా?' అని సంజీవకుఁ డడిగెను. 'మిత్రమా, ఏల యడిగెదవు. సేవకుఁ డయిన వానికి కుశల మెందయినం గలదా? రాజుల కెవఁడు సదా ప్రియుఁ డగును? యాచకునికి లాఘవము తప్పునా? కాల గోచరము కానివాఁ డెవఁడు?' అని దమనకుఁడు పలికెను.

'వయస్యా, ఏమి యిట్లు దిగులు పడినట్టులు పలుకుచున్నావు? కారణము చెప్పుము.' అని సంజీవకుఁడడుగఁగా దమనకుఁడు 'మిత్త్రుఁడా, వినుము, నీయందలి ప్రీతిచేత నీకు చెప్పుచున్నాను. మృగరాజు పింగళకుఁడు ఇప్పుడు నీకు విరోధియై యున్నాఁడు. నిరపేక్షుఁడు అస్థిరస్నేహుఁడు నిన్ను వధించి భక్షింపఁ దలఁచి యున్నాఁడు. ఇతని పరివారమువారు ఘాతుకులు సదా ఇతనిని ప్రేరించుచున్నారు.' అనెను. మునుపటి నమ్మికచేత సంజీవకుఁడు దమనకుని యీమాటను విశ్వసించి చింతాకులుఁడై అతనితో నిట్లనియె:—ఇసీ! ఎంత సేవచేసినను క్షుద్రపరివృతుఁడైన క్షుద్రప్రభువు వైరమునే పొందును. నిదర్శనము విను.

## మదోత్కటము కథ.

ఒకానొక యడవిలో మదోత్కటుఁడని యొక సింహము ఉండెను. దానికి పులి కాకి నక్కయు ముగ్గురు అనుచరులు ఉండిరి. సింహము ఆయడవిలో నొకప్పుడు ఒక లొట్టియ బిడారునుండి చీలి ఏకాకిగా హాస్యకరమైన యాకృతితో తిరుగుచుండఁగా చూచి 'ఇదేమి జంతువు?' అని ఆశ్చర్యముతో తన యనుచరులను అడిగెను. నానాదేశములు తిరిగినదైన కాకి 'అది లొట్టియ' అని తెలిపెను. అంతట సింగము కౌతుకముచేత లొట్టియకు అభయమిచ్చి తన యనుచరులలో చేర్చుకొని తనయొద్ద నుంచుకొనెను. ఒకప్పుడు ఆసింగము గజయుద్ధములో గొప్ప గాయములు పొంది అస్వస్థమై అనేకోప

వాసము లు చేసెను. అనుచరులును అస్వస్థముగానే యుండిరి. అంతట సింహము ఆహారార్థము తిరిగితిరిగి ఎక్కడను దొరకక లొట్టిపిట్ట లేని సమయమున కడమ యనుచరులను రహస్యముగా ఉపాయ మడిగెను. వారు చెప్పిరి:— "ప్రభూ, ఆపత్సమయ మందు మేము ఉచిత కార్యమును చెప్ప వలసినది. ఏలినవారికి లొట్టియతో స్నేహ మనఁగా నెట్టిది? దానినే యేల భక్షింపఁ గూడదు? అది గడ్డి మేయునది న్యాయముగా మాంసభోజనులకు మనకు ఆహారము. అనేకులకు ఆశ్రితులకు మాంసము పెట్టుట కొఱకు ఒకదానిని చంపుటయందు ప్రభువునకు శంక యేల? 'దానికి అభయ మిచ్చితిని, ఎట్లు చంపుదును?' అని యేలినవారు చెప్పుదురేని, అదే తన్ను మీకు సమర్పించుకొనునట్లు మేము ఉపాయము పన్నెదము." ఇట్లు వారు పలుకఁగా సింహము అంగీకరించెను. అంతట సింహమునాజ్ఞ పొంది కాకి లొట్టియను చంపుటకు యుక్తిపన్ని దానితో నిట్లు చెప్పెను:—'మనదొర క్షుత్పీడితుఁ డయ్యును మనతో ఏమియు చెప్పకున్నాఁడు, కనుక ఇతనికి మేము మమ్ము అర్పించుకొన్నట్లు పలికి మెప్పు వడసెదము. నీవు నట్లే చేయుము, నీయందును అతఁడు సంప్రీతుఁ డగును.' లొట్టియయు అట్లే చేయ నంగీకరించి కాకితోఁగూడ సింగము నొద్దకు వచ్చెను. అంతట కాకి సింహముతో 'దేవరా, నేను నీ స్వాధీనుఁడను, నన్ను భక్షింపుము.' అనెను. 'నీదేహము రవంత, నీవలన నేమి ప్రయోజనము?' అని సింగము నిరాకరించెను.

అంతట నక్క 'ప్రభూ, నన్ను భక్షింపుము.' అనెను. సింగము దానిని కూడ అట్లే నిరాకరించెను. అంతట పులి తన్ను తిను మని సింగముతో విన్నవించుకొనెను. సింగము దానిని అట్లే నిరాకరించెను. అంతట లొట్టియ తన్ను తిను మని సింగముతో మనవి చేసికొనెను. ఆ మాటమిషచేత సింహము దానిమీఁద పడి దానిని చించి చీల్చి వాయసాదులతోఁ గూడి భక్షించెను.

ఈప్రకారమే కొండీఁడెవఁడో నా మీఁద అబద్ధములు చెప్పి రాజునకు నాపై కోపము తెప్పించినాఁడు. హంసలచే పరివృత మయిన గద్ద నయినను రాజునుగాఁ గొలువ వచ్చును గాని గృధ్రపరివృత మయిన హంస నయినను గొలువఁగూడదు. ఇతరుల మాట చెప్ప వలయునా?—

ఇట్లు సంజీవకుఁడు పలుకఁగా కుత్సితుఁడు దమనకుఁడు ఇట్లు పలికెను:—సర్వము ధైర్యముచే సాధ్యపడును; అందులకు నిదర్శనము వినుము.

### లకుముకి కథ.

కడలియొార లకుముకి భార్యతో నివసించు చుండెను. భార్య గర్భిణి యై భర్తతో 'మఱి యొచటి కేని పోదము రమ్ము, ఇక్కడనే ప్రసవ మైన యెడల సముద్రుఁడు ఒకవేళ నాపిల్లలను కరడములతో అపహరించును.' అనెను. అందులకు టిట్టిభము 'ఏమి! నాతో విరోధించుటకు సముద్రునికి గుండెలా ? భయ పడకు.' అనెను. టిట్టిభి యనెను:—ఇట్లు పలుకకు, నీ వెక్కడ

సముద్రుఁ డెక్కడ? హితోపదేశమును గ్రహింప వలసినది. గ్రహింపని యెడల వినాశము కలుగును. నిదర్శనము వినుముః-

కంబుగ్రీవము కథ.

పూర్వము ఒకసరస్సులో కంబుగ్రీవ మని ఒకతాఁబేలును సంకట వికటము లని దాని మిత్రములు రెండు హంసములును ఉండినవి. ఒకప్పుడు వఱపుచేత సరస్సు ఎండిపోయినది. అంతట ఆ హంసలు మఱియొక సరస్సునకు పోవుటకు యత్నించుచు ఉండఁగా, కూర్మము తన్ను సైతము వారు పోవుచోటికి కొని పొమ్మని వారిని వేఁడెను. వారు కూర్మముతో నిట్లనిరి- 'మేము పోనున్న చెఱువు బహుదూరము. అచటికి రాఁ గోరుదువేని నీవు మేము చెప్పునట్లు చేయవలసినది. మేము ఇద్దఱము నోట నొక కట్టెను కఱచి పట్టుకొనియెదము. నీవు దానిని నడుమ కఱచి మాట లాడక యుండవలయును. నోరు తెఱతువేని క్రిందఁ బడి నశింతువు.' తాఁబేలు ఒప్పుకోఁగా హంసలు ఒక కట్టెను తాము ఇరుగడను తాఁబేలు నడుమను కఱచుకొని ఆకాశమున ఎగిరిపోవుచుండినవి. అవి క్రమముగా తాఁబేటిని మోచికొని సరస్సమీపమునకు వచ్చుచుండఁగా అచట క్రింద నున్న నగరజనులు వీనిని చూచి 'ఏమి ఈ చిత్రము! రెండు హంసలు దేనినో మోచుకొని పోవుచున్నవి!' అని కలకలము చేసిరి. విని చపలమతి ఆ తాఁబేలు 'క్రింద ఏమి యీగోల్లు?' అని యడుగుచు, నోరు తెఱవఁగానే, కట్టెనుండి జాఱి నేలఁబడి

జనులచేత మోఁదులు వడి మడిసెను. ఈరీతిగా హితము వినని వాఁడు కట్టెను విడిచిన కూర్మమువలె చెడిపోవును.

### మూఁడుచేఁపలకథ.

ఇట్లు భార్య పలుకగా టిట్టిభము బదులు చెప్పెను:— "ప్రేయసీ, నీవు చెప్పినమాట సత్యమే. అయినను నీవును ఈకథ వినుము. ఒకనగరిలో ఒకచోట మడుఁగులో మూఁడు చేఁపలు ఉండినవి; అనాగతవిధాత, యద్భవిష్యకము, ప్రత్యుత్పన్నమతి అని వానిపేరులు; మూఁడును సహవాసగాండ్రు. ఒకనాఁడు జాలరులు ఆదారిని పోవుచు 'ఆహా! ఈ మడుఁగులో చేఁపలు విశేషముగా నున్నవి!' అని ఒకరితో నొకరు చెప్పుకొనఁగా, ఈ మూఁడు చేఁపలు విన్నవి. అంతట బుద్ధిమంతుఁడనాగతవిధాత జాలరులవలన తనకు చావు అగు నని తెలిసి ప్రవాహములోఁ బడి మఱియొకచోటికిపోయెను. ప్రత్యుత్పన్నమతి 'అపాయము కలిగిన యెడల, నేను ఉపాయముచే తప్పించుకొనియెదను.' అని అచటనే యుండెను. 'నా కేమి కలుగును?' అని యద్భవిష్యుఁడు అచటనే యుండెను. ఇట్లుండఁగా జాలరులు వచ్చి వలలు వేసిరి. వారు వలలోఁబట్టి యెత్తఁగా ప్రత్యుత్పన్నమతి కదలక మెదలక చచ్చినట్లు పడి యుండెను. అది స్వయముగానే చచ్చిన దనుకొని జాలరులు దానిని కొట్టక విడిచి పెట్టిరి. అంతట నాచేఁప నదీప్రవాహములో తప్పించుకొని పోయినది. యద్భవిష్యము వలలోనే ఎగురుచు దొరలుచు ఉండెను. దానిని

జాలరులు పట్టుకొని చంపివేసిరి. కావున నేనును నా ప్రజ్ఞచేత సముద్రమువలని యాపదను తప్పించెదను గాని భయపడి అవలికి పోఁజాలను." అని పలికి టిట్టిభము ఆ చోటనే యుండెను.

సముద్రుఁడు ఆ లకుముకి యహంకార వచనములను వినెను. టిట్టిభియు కొన్నాళ్లకు పిమ్మట గ్రుడ్లు పెట్టెను. అంతట సముద్రుఁడు 'చూతము. ఈ టిట్టిభము ఏమి చేయఁగలదో!' అని కుతూహలముచేత ఆ గ్రుడ్లను అపహరించెను. అంతట టిట్టిభి ఏడ్చుచు, 'నేను ముందే చెప్పిన యుపాయము కలుగనే కలిగినది, చూచితివా?' అని పతితో మొఱ పెట్టెను. ధీర మయిన యా టిట్టిభము భార్యతో "పాపాత్ముని ఈసముద్రుని ఏమి చేసెదనో, చూడుము.' అని, పక్షుల నన్నిటిని సభ కూర్చి తనకుఁ గలిగిన పరాభవమును తెలిపెను. అంతట పక్షు లన్నియు గుంపుగాఁ బోయి గరుడునితో 'దేవా, నీవు మాయేలిక వై యుండ, సముద్రుఁడు మా గ్రుడ్లను హరించి మమ్ము అవమానపఱిచినాఁడు.' అని మొఱ పెట్టినవి. గరుడుఁడు కోపగించి విష్ణుదేవునితో చెప్పుకొనెను. దేవుఁడు ఆగ్నేయాస్త్రప్రయోగముచే సముద్రమును ఇగురఁగొట్టి సముద్రునిచే టిట్టిభికి అండములను ఇప్పించెను.

కావున ఆపత్కాలమందు బుద్ధిమంతుఁడు ధైర్యమును వదలఁగూడదు. ఇప్పుడు నీకు పింగళకునితో పోరు పొసఁగినది. పింగళకుఁడు ఎప్పుడు తోక నిక్కఁబెట్టుకొని నాలుగుపాదముల తోను సమముగా లేచునో అప్పుడే అతఁడు నిన్నుఁ గొట్టు నని

యొలుంగుము. నీవు సిద్ధముగా తల వంచుకొని యుండి వానిని కడుపులో కొమ్ములతో పొడిచి ప్రేగులు చల్లి వేయుము.

ఇట్లు దమనకుఁడు సంజీవకమునకు బోధించి, కరటకుని కడకుఁబోయి, ఆయిరువురకును భేదము సిద్ధించిన దని పలికెను.

సంజీవకుఁడు ఇంగితాకారములచే పింగళకుని చిత్తమును తెలిసికొనఁగోరి మెల్లగా నతని కడ కేఁగెను. అచట తోఁక నిక్కఁబెట్టికొని నాల్గు పాదములమీఁదను సమముగా లేచుచు యుద్ధమునకు సిద్ధముగా నున్న పింగళకుని చూచి శంకచేత తలను పైకి ఎత్తి ఊఁచుచుండెను. పింగళకుఁడు దానిని గని ఎగిరి దుమికి గోళ్లతో ఎద్దును కొట్టెను. ఎద్దు సింహమును కొమ్ములతో పొడిచెను. ఇట్లు ఆయిరువురకును ఘోరయుద్ధము ప్రారంభ మాయెను. దానిని గని కరటకుఁడు దమనకునితో నిట్లనియె:— "ఏమి యిట్లు నీవు స్వార్థసిద్ధికై ప్రభువునకు మహాపాయమును తెచ్చి పెట్టితివి. పారుష్యముతో తెచ్చిన కామినియుఁ బ్రజానుతాపముచే సంపాదించిన సంపదయు, శాఠ్యముగా చేసిన మైత్త్రియు, చిరకాలము ఉండవు. చాలుఁ జాలును. హితవాక్యమును తిరస్కరించు వానికి ఎవఁడు విశేషించి యుపదేశించునో వాఁడు వానివలన సూచీముఖపక్షి క్రోఁతివలనం బోలె కీడు వొందును.

## సూచీముఖకథ.

పూర్వము ఒకయడవిలో క్రోఁతులు గుంపుగా చరించు చుండినవి. అవి చలిలో మిడుఁగురుంబురువులం గని నిప్పని భ్రమసినవి. ఒకక్రోఁతి ఆ పురుగులమీఁద ఆకలములు వేసి ఊఁద సాగినది. దానిం గని ఒక పక్షి సూచీముఖ మను పేరిది దానితో 'ఇది నిప్పు గాదు, మిడుఁగురుఁబురువులు, ఏల వృథా క్లేశపడెదవు?' అని బోధించెను. ఆమాట పాటింపక ఆ క్రోఁతి ఊఁదుచునే యుండుటం గని ఆపక్షి చెట్టు దిగి వచ్చి నివారించెను. ఆ నిర్బంధమునకు కోపగించి క్రోఁతి రాతితో సూచీముఖమును చూర్ణము చేసెను. కాఁబట్టి వినని వానికి హితము చెప్పఁగూడదు. మఱియు ఏమి చెప్పుదును! నీవు చేసిన భేదము వలన కీడే గలుగును. దుర్బుద్ధిచే చేసినపనివలన మేలు కాదు.

## ధర్మబుద్ధి దుష్టబుద్ధుల కథ.

పూర్వము ఒకపట్టణములో ఇద్దఱు అన్నదమ్ములు వర్తకకుమారులు ధర్మబుద్ధి దుష్టబుద్ధియు నను వారు ఉండిరి. వారు ధనముకొఱకు కలసి దేశాంతరము పోయి ఎట్లో రెండు వేల బంగారుదీనారములు సంపాదించిరి. దానిం గైకొని తమ పురమునకు మరలి వచ్చి ఒకచోట చెట్టుక్రింద ఆధనమును పాఁతి పెట్టిరి. అందునుండి నూఱుదీనారములుమాత్రము తీసి, ఇద్దఱు సమముగా పంచుకొని, సుఖముగా తండ్రియింట నుండిరి. ఒక నాఁడు దుష్టబుద్ధి దుర్వ్యయములు గలవాఁడు ఒంటిగా పోయి

చెట్టుక్రిందినుండి ఆ దీనారముల నెల్ల త్రవ్వి పుచ్చుకొనెను. పిమ్మట ఒకనెల గడపి ధర్మబుద్ధిని 'అన్నా, రమ్ము, దీనారములను తెచ్చికొందము, నాకు వ్యయ మున్నది.' అని పిలిచెను. ధర్మబుద్ధి వానితోఁ బోయి పాఁతినచోట వానితోఁగూడ త్రవ్వెను. దీనారములు లేవు. అంతట శఠుఁడు దుష్టబుద్ధి ధర్మబుద్ధితో 'నీవే ఆదీనారముల నెల్ల నెప్పుడో నాకు తెలియకుండ త్రవ్వుకొని పోయితివి. కావున నాకు వానిలో సగ మిమ్ము.' అనెను. 'నేను కొనిపో లేదు, నీవే కొనిపోయినాఁడవు.' అని ధర్మబుద్ధి పలికెను. ఇట్లు కలహము కలుగఁగా దుష్టబుద్ధి రాతితో తలఁ గొట్టుకొని ధర్మబుద్ధిని రాజకులమునకుఁ గొనిపోయెను. ఆచట నిరువురును తమవాదములను తెలుపుకొనిరి. రాజాధికారులు నిర్ణయము గానక నిరువురను సాయంకాలమువఱకు అచటనే యుంచిరి. 'ఏచెట్టుక్రింద దీనారములు పాఁతితిమో ఆ చెట్టే, ఈ ధర్మబుద్ధి వాని నపహరించె నని, సాక్ష్యము చెప్పును.' అని దుష్టబుద్ధి రాజాధికారులతోఁ దెల్పుకొనెను. వా రత్యంత మాశ్చర్యపడి 'రేపు ప్రాతఃకాలమందు, పోయి ఆ సాక్ష్యము వినియెదము.' అని పలికి వారి నిరువురను జామీను మీఁద విడిచిపెట్టిరి. ఇరువురును వేఱువేఱుగా ఇంటికి పోయిరి. దుష్టబుద్ధి తండ్రికి రహస్యముగా వృత్తాంతము చెప్పి ధన మిచ్చి 'నీవు చెట్టుతొఱ్ఱలో చేరి నా పక్షముగా సాక్ష్యము చెప్పవలసినది.' అని యడిగెను. వాఁడు అంగీకరించెను, వెంటనే

దుష్టబుద్ధి వానిని కొనిపోయి ఆ రాత్రియందే ఆ చెట్టులో పెద్దతొఱ్ఱలో ఉంచి యింటికి వచ్చెను. తెల్లవాఱఁగానే అధికృతులతో ఈయన్నదమ్ములు పోయి అచెట్టును 'ఓవృక్షరాజా, ఎవఁడు మా దీనారములను కొనిపోయెనో చెప్పుము' అని యడిగిరి. 'ధర్మబుద్ధి దీనారములను కొనిపోయెను.' అని స్ఫుటముగా చెట్టు తొఱ్ఱనుండి తండ్రి పలికెను. అసంభావ్యమైన యామాటను విని అధికృతులు 'నిశ్చయముగా ఇచట తొఱ్ఱలో ఎవనినో దుష్టబుద్ధి పెట్టినాఁడు.' అని తలఁచి ఆతొఱ్ఱలో గడ్డి పెట్టి నిప్పంటెంచిరి. ఆపొగ చుట్టుకొని ఒడలు కాలఁగా దుష్టబుద్ధి తండ్రి తలక్రిందుగా నేలఁ బడి కాలధర్మము నొందెను. దానింగని యధికృతులు నిజ మెఱిఁగి, దుష్టబుద్ధిచేత ఆదీనారములు ధర్మబుద్ధి కిప్పించి, దుష్టబుద్ధిని చేతులు నాలుకయు కోయించి, దేశము వెడలఁ గొట్టి, యథార్థము చెప్పిన ధర్మబుద్ధిని సమ్మానించిరి. ఈప్రకారము అన్యాయ్యబుద్ధిచేత చేసిన పని శుభావహము కానేరదు. కావున పామునకు కొంగ చేసినట్లు న్యాయ్యబుద్ధితోఁ జేయవలయును.

## కొంగయు పాము ను.

పూర్వము ఒకానొక కొంగయొక్క పిల్లలను పుట్టినప్పుడెల్ల ఒకపాము తినుచుండెను. అందులకు దుఃఖించి కొంగ యొక ఝషముతో చెప్పుకొని దాని యుపదేశము ప్రకారము మత్స్యమాంసఖండములను ముంగిస నివాసముండి పాము

బొక్కవఱకు చల్లెను. ముంగిస లేచి ఆ మాంసఖండములను తినుచు క్రమముగా పాము బొక్క కడకు వచ్చి అందుఁ దూఱి పామును పాముపిల్లలతోఁగూడ చంపి వేసెను. ఈప్రకారము మంచియుపాయముచేత పనిని నెఱవేర్చుకొనవలయును. మఱి యొక కథ వినుము.—

## ఇనుపకాటా.

పూర్వము ఒక వణిక్కుమారుఁడు పైతృకధన మెల్ల కోలుపోయి దరిద్రుఁ డాయెను. ఒక యినుపకాటామాత్రము మిగిలి యుండెను. ఆ కాటా వేయి పలముల యినుముతో చేసినది. దానిని అతఁడు మఱియొక వర్తకునియొద్ద దాఁచుకొని దేశాంతరము పోయెను. మరల వచ్చి అడుగఁగా, దానిని ఎలుకలు భక్షించిన వని ఆ వర్తకుఁడు చెప్పెను. 'సత్యము ఆ లోహము మిగుల తీపు, కనుకనే దానిని ఎలుకలు భక్షించినవి.' అని మనస్సులో నవ్వుకొనుచు చెప్పి, వణిక్కుమారుఁడు ఆ దినము ఆ వర్తకుని యింటనే భోజన మడిగెను. వర్తకుఁడు సంతోషించి యతనిని భోజనమునకు నిలువు మనెను. పిమ్మట వణిక్కుమారుఁడు వర్తకుని కొమరునిచేతిలో అటకలిపాత్రము నుంచి, వానిని వెంటఁ గొని స్నానమునకు పోయెను. స్నానము చేసి పిల్లవానిని రహస్యముగా తన స్నేహితునియింట దాఁచి తాను ఒంటిగా వర్తకునియింటికి భోజనమునకుఁ బోయెను. పిల్లవాఁ డెక్కడ నని వర్తకుఁ డడుగఁగా, 'పిల్లవానిని గ్రద్ద

తన్నుకొని పోయె నని యుత్తరము చెప్పెను. 'నా పిల్లవానిని ఎక్కడనో దాఁచినాఁడవు.' అని కోపగించి వర్తకుఁడు అతనిని ఈడ్చుకొని రాజకులమునకు పోఁగా అక్కడఁ గూడ అతఁడు వర్తకునితో మునుపు చెప్పిన యుత్తరమునే చెప్పెను. 'అది యసంభావ్యము. గ్రద్ద యేమి! పిల్లవానిని తన్నుకొని పోవుట యేమి!' అని అచట సభ్యులు పలుకఁగా, వణిక్కుమారుఁడు 'ఏ దేశములో ఎలుకలు గొప్ప యినుపతులను భక్షించునో, ఆ దేశములో గ్రద్ద ఏనుఁగును కూడ తన్నుకొని పోవును, పిల్ల వానిని తన్నుకొని పోవుట ఆశ్చర్యమా!' అనెను. దానిని విని కౌతుకపడి సభ్యులు వృత్తాంత మడిగి తెలిసికొని వర్తకుని చేత తులను తెప్పించి వణిక్కుమారునికి ఇప్పించిరి. అతఁడును పిల్లవానిని తెచ్చి యిచ్చెను. ఇట్లు ఉపాయముచే బుద్ధిమంతులు కార్యమును సాధింతురు. నీవు సాహసము చేసి ప్రభువును ప్రాణసందేహములో వైచితివి.

కరటకుఁ డిట్లు చెప్పఁగా దమనకుఁడు నవ్వుచు ననెను:- 'మిత్రమా, అట్లు చెప్పకుము, ఎద్దుతోడి యుద్ధమునందు సింహమునకు అపజయము కలుగునా! మదపుటేనుఁగుల దంత కోటి ఘాతముల దట్టపు గాయములే ఆభరణము లయిన సింహ మెక్కడ! కొరడా దెబ్బలతో నలిగిన యెద్దెక్కడ!' ఈ ప్రకారము జంబుకములు రెండును పరస్పరము సంభాషించు చున్నంతలో పింగళకుఁడు సంజీవకమును సంహరించెను. ఇట్లు

సంజీవకుఁడు హతుఁడు కాఁగా, దమనకుఁడు చిరకాలమునకు తుష్టుఁడై కరటకునితోఁ గూడ మృగాధిపునిపార్శ్వము చేరి అప్రతిహతముగా మంత్రిపదవిని అనుభవించుచుండెను.

ఇట్లు నరవాహనదత్తుఁడు నీతిమంతుఁడైన గోముఖమంత్రి వరునివలన బుద్ధివిభవ సంపన్న మగు నీ చిత్రకథను విని మిగుల సంతసించెను.

---

## ౫-వ త రం గ ము.

---

శక్తియశశ్శై ఉవ్విళులూరుచున్న నరవాహనదత్తునికి వినోదార్థము గోముఖుఁడు మరల కథలు చెప్ప సాగెను:—దేవా, ప్రాజ్ఞులకథను వింటివి, మూఢులకథలను వినుము.

### మూ ఢు ల క థ లు.

### అ గ రు దా హి.

పూర్వము ధనికుఁడయిన యొక వణిజునికి ఒక కుమారుఁడుండెను. ఆ కుమారుఁడు ఒకప్పుడు వర్తకముకొఱకు కటాహ ద్వీపమునకుఁ బోయెను. అతనిసరకులో గొప్ప భాగము అగరు చందనము. తక్కిన సర కంతయు అమ్ముడు పోయెను, అగరువును మాత్రము ఎవరును కొనరైరి. ఆ దీవిలోనివారు దాని యుప యోగము నెఱుఁగరు. అంతట వణిక్కుమారుఁడు వంట చెఱకమ్ముువారివలన జనులు బొగ్గులు కొనుట్టం జూచి, తన యగరు

చందనము నంతయు కాల్చి బొగ్గు చేసి బొగ్గువెలకు విక్రయించి, స్వదేశమునకు వచ్చి, అట్లు విక్రయించిన తనప్రజ్ఞను ఇతరులతో చెప్పుకొని పరిహాసము పొందెను.

### తి ల కా ర్షి కుఁ డు.

అగరుదాహికథను వింటివి, తిలకార్షికుని కథను వినుము. గ్రామ్యుఁ డొకఁడు జడుఁడు పంటకాఁ పుండెను. వాఁడు ఒక నాఁడు వేఁచిన నువ్వులు తిని, అవి మిగుల రుచిగా నుండుటం గని, అట్టి రుచి గలవిగానే నువ్వులు పండుటకై వేఁచిననువ్వులనే చల్లెను. అవి మొలవక పోఁగా, నష్టి పొందిన యా కాఁపును చూచి లోకులు పరిహాసించిరి.

### అ గ్ని కు ం భుఁ డు.

తిలకార్షికుని వింటివి, నీళ్లలో నిప్పు దాఁచిన వానిని వినుము. ఒక మూర్ఖుఁడు తేపు తెల్లవాఱఁగానే దేవతాపూజ చేయుదును గాక యని కోరి, ఆ ముందురాత్రి మఱునాఁటికి స్నాన పానాదికములకు వలసిన జలానలములను ఒకచోటనే సులువుగా దొరకునట్లుగా ఉంచుకొనఁ దలఁచి, నీళ్లకుండలో నిప్పు ఉంచి నిద్రించెను. తెల్లవాఱఁగానే పోయి చూచుకొను నప్పటికి నిప్పు ఆఱి బొగ్గయి యుండెను, నీళ్లు చెడి పోయినవి. బొగ్గులచే నల్లఁబడిన జలమును చూడఁగానే వానిముఖము కూడ అట్టిదే ఆయెను. ఆవృత్తాంతము నెఱింగిన లోకుల ముఖ ములు మాత్రము తెల్ల నాయెను,

### నా సి కా రో ప ణుఁ డు.

అగ్నికుంభునికథ వింటివి, నాసికారోపణునికథ వినుము. మూఢమతి యొకపురుషుఁ డుండెను. వాఁడు తనభార్య చప్పిముక్కు ది అగుటయు తండ్రి పొడుగు ముక్కువాఁ డగుటయుం గని, తండ్రి నిద్రించు చుండఁగా అతని ముక్కు కోసి కైకొని పోయి, అట్లే భార్యముక్కును కోసి దానిముఖమున తండ్రి ముక్కును అంటించెను. ఆముక్కు అచట నిలువదాయెను. ఈరీతిగా వాఁడు భార్యను తండ్రిని ఇద్దఱను ముక్కిఁడులను చేసెను.

### ప శు పా లుఁ డు.

పశుపాలునికథను విను. మహామూఢుఁడు ధనవంతుఁడు పశుపాలుఁడు ఒకవనములో నుండెను. వానిని ధూర్తు లనేకులు మిత్రవ్యాజమున ఆమిశ్రయించిరి. 'నీకు పిల్ల నిమ్మని నగరవాసిని ఒకధనికుని అడిగినారము, అతఁడును ఇచ్చెద నని వాగ్దానము చేసినాఁడు.' అని వానితో చెప్పిరి. అందులకు సంతోషించి వాఁడు వారికి ధన మిచ్చెను. కొన్నాళ్లు పోనిచ్చి వారు మరల వానితో 'నీకు వివాహముకూడ అయినది.' అనిరి. అందులకు అతఁడు మఱియు సంతోషించి వారికి విశేషధన మిచ్చెను. మరల కొన్నాళ్లకు 'నీకు కుమారుఁడు గలిగినాఁడు.' అని చెప్పిరి. ఆమూఢుఁడు అందులకు మఱియు సంతోషించి తన సర్వ ధనమును వారి కిచ్చి వేసి 'కుమారునికోసము బెంగపెట్టు

కొన్నాఁడను.' అని ఆమఱునాఁడు ఏడువఁ దొడంగెను. ఈ ప్రకారము ధూర్తులచే వంచితుఁడై పశువులనుండి జడత్వమును స్వీకరించినవాఁడుం బోలె మూర్ఖుఁ డయిన యాపశుపాలుఁడు ఏడ్చుచు, లోకులకు హాసము పుట్టించెను.

### అలంకారలంబకుఁడు.

దేవా, పశుపాలుని వింటివి, అలంకారలంబకుని వినుము. పల్లెటూరివాఁ డొకఁడు భూమిని త్రవ్వుచుండఁగా గొప్ప యలంకారముల మూఁటదొరకెను. దానిని ముంపురాత్రి దొంగలు రాచనగరినుండి దొంగలించి అచట పాఁతిపెట్టి కొనిరి. దానిం గొని వాఁడు ఇంటికి పోయి ఆనగలతో భార్య నలంకరించెను. తలకు మొలనూలు చుట్టి జఘనస్థలమునకు హారము కట్టెను. చేతులకు అందెలు తొడిగి చెవులకు కంకణములు పెట్టెను. దానిం గని లోకులు పరిహాసములతో ప్రకటింపఁగా రాజు తెలిసికొని ఆయాభరణములను పుచ్చుకొని ఆమూర్ఖుని విడిచి పెట్టెను.

### తూలికుఁడు.

అలంకారిని వచించితిని, ఇఁక తూలికుని వినుము. ఒక మూర్ఖుఁడు దూది అమ్ముకొనుటకు బజారునకుఁ బోయెను. దానిని శుద్ధము చేయనిదని ఎవ్వరు కొనరైరి. ఇట్లుండఁగా అచట కంసాలి యొకఁడు నిప్పులో బంగారమును కాల్చి శుద్ధి చేసి అమ్ముటయు ఎవరో పుచ్చుకొనుటయు మూర్ఖుఁడు చూచి

తన దూదిని కూడ ఆప్రకారమే శుద్ధిచేయఁ గోరి. దానిని అగ్ని లో వేసెను. అది దగ్ధ మాయెను. లోకులు వాని తెలివికి నవ్విరి.

### ఖర్జూరీచ్ఛేదకులు.

తూలికుని వింటివి. దేవా, ఖర్జూరీచ్ఛేదకులను వినుము. దివాణమువారి యాజ్ఞప్రకారము గ్రామ్యులను కొందఱను ఆ రామాధికారులు ఖర్జూరపు మొలకలు తెమ్మని యాజ్ఞాపించిరి. వారు సులువుగా పండ్లు కోసికొనుటకు అనుకూలముగా పండ్లతోఁ విఱిగిపడి యున్న యొక ఖర్జూరవృక్షమును చూచి తమ గ్రామములోని ఖర్జూరవృక్షముల నన్నిటిని కొట్టి వేసి పండ్లతోను కాయలతోను ఉన్నట్టి యా వృక్షముల నన్నిటిని తెచ్చి నగరి తోఁటలో నాటిరి. అవి సిద్ధింప లేదు. రాజు ఆ వృత్తాంత మెఱిఁగి ఖర్జూరముల నన్నిటిని నాశము చేసినందులకు వారిని దండించెను.

### నిధ్యాలోకనుఁడు.

ఖర్జూరహాసు లయినారు, నిధ్యాలోకనుని వినుము. ఒకానొకరాజు నిధానములు కనఁగలవాని నొకని తెప్పించెను. వీఁడు మఱె యెచటికిని పాఱిపోకుండును గాక యని మంత్రి కన్నులు పెఱికి వేయించెను. భూమియొక్క లక్షణములను కన లేక రాకకు పోకకు భేదము కనలేక యున్న యా నిధాన దర్శిని చూచి లోకులు మంత్రి తెలివికి మిక్కిలి నవ్విరి.

## ల వ ణా శ నుఁ డు.

లవణాశనుని వినుము. పూర్వము గ్రామవాసి యైన గహ్వరు నొకని నగరవాసి యయిన మిత్త్రుఁడు ఒకప్పుడు తన యింటికిఁ గొనిపోయి ఉప్పుచేత రుచ్యము లయిన వ్యంజనముల తోను ఇంక నితరభోజ్యములతోను భోజనము పెట్టించెను. ఈ భోజ్యవ్యంజనాదులకు ఇంతరుచి దేనివలనఁ గలిగిన దని గహ్వరుఁడు మిత్త్రుని అడిగెను. ఉప్పుచేత కలిగిన దని మిత్త్రుఁడు చెప్పెను. 'అట్లయిన దానినే భక్షింపవలసినది' అని నూఱిన యుప్పు పిడికెఁడు ఎత్తి వాఁడు నోటఁ బోసికొనెను. ఆ పొడి ఆ మూఢుని పెదవులకు మీసలకును అంటుకొని ధవళిమం గలిగించెను; దానిం గని పరిహసించిన జనుల మొగములును ధవళము లాయెను.

## గో దో హ కుఁ డు.

గోదోహకుని వినుము. మూఢుఁ డైన యొక గ్రామ్యునికి ఒక గో వుండెను. అది వానికి దినమునకు నూఱు పలముల పాలు ఇచ్చుచుండెను. ఇట్లుండఁగా వానికి ఒకప్పుడు పండు గొకటి సంప్రాప్త మైనది. అంతట పండుగునాఁడు పా లన్నియు ఒక మాఱుగానే గ్రహింతునుగాక యని ఆలోచించుకొని ఆ మూర్ఖుఁడు నెలదినములు ఆవును పిదుకక యుండి పండుగు నాఁడు పిదుకఁగా ఒక బొట్టయినను పాలు రావు. లోకులు అమితముగా పరిహసించిరి.

### పథికఖల్వాటులు.

ఖలతి కథను వినుము. రాగిచెంబును బోలిన బట్టతల వాఁడు ఒక మూర్ఖుఁడు ఉండెను. వాఁడు వెలఁగచెట్టు క్రింద కూర్చుండఁగా, ఒకబాటసారి వయసువాఁడు మార్గాయాస ముచే ఆఁకలిగొని అచటికి వచ్చి వెలఁగపం డొకటి కోసి క్రీడఁగా వాని నెత్తిమీఁద వేసెను. ఖలతి దానిని సహించెను గాని తరుణుని ఏమియు అన లేదు. క్రమముగా వాఁడు చెట్టు లోని పండ్ల నన్నిటిని కోసి ఒక టొకటిగా ఖల్వాటుని తల మీఁదనే వేయు చుండెను. ఖల్వాటుఁడు తల పగిలి రక్తము ధారలు ధారలుగా కాఱుచు ఉన్నను ఊరక యుండెను. మూర్ఖతరుఁడు బాటసారి పండ్లన్నియు ఈప్రకారము చిద్రుపలై పోఁగా తినుట కేమియు లేక ఆఁకటితోనే వచ్చినట్లే పోయెను. ఖల్వాటుఁడు 'తియ్యని వెలగపండ్లతో దెబ్బలు ఎన్నియేనియు తిందును.' అని యనుకొనుచు నెత్తినుండి కాఱుచున్న రక్త ధారలతో ఇంటికిఁ బోయెను. మూర్ఖ సామ్రాజ్య పట్టము చేతనుండబోలె నెత్తుటి పట్టముతో వేష్టిత మైన వాని శిరమును గని లోకులు మిగుల పరిహాసించిరి.

దేవా, ఈరీతిని లోకములో బుద్ధిహీనులు అపహాస్యు లగుదురు, కార్యమును చెఱుచుకొందురు; బుద్ధిమంతులు గౌరవము పొందుదురు. ఇట్లు గోముఖుఁడు చెప్పిన మూర్ఖుల తెలివి తక్కువ కథలను విని నరవాహనదత్తుఁడు ఆహ్నిక

కృత్యములకై లేచెను. మరల సముత్సుకుఁడై నరవాహన దత్తుఁడు ఆజ్ఞాపింపఁగా, గోముఖుఁడు ప్రజ్ఞావంతులకథలను ఈరీతిగా చెప్పసాగెను.

## కాక మూషక కూర్మ మృగముల కథ.

ఒకానొక యరణ్యములో గొప్పబూరుగు చెట్టుండెను. దానిమీఁద లఘుపాతి యను కాకి గూఁడు కట్టుకొని నివసించి యుండెను. ఒకనాఁడు ఆ కాకి చూచుచుండఁగా నచటికి క్రూరాకారుఁడైన పురుషుఁ డొకఁడు చేత వల పట్టుకొని వచ్చి ఆ చెట్టు క్రింద నేలపై వలను పఱచి ఎరగా వడ్లుచల్లి కనుపెట్టుకొని యుండెను. అంతలో పావురముల రాజు చిత్రగ్రీవు డనువాఁడు నూఱుకొలఁది పావురముల పరివారముతో ఆకాశమార్గమున వచ్చి ఆవడ్లను చూచి ఆహారార్థము వ్రాలి సపరివారముగా వలలో పట్టుపడెను. అంతట చిత్రగ్రీవుఁడు ఆయాపదను కని పరివారమునకు 'ఓరోరి, వలను ముక్కులతో కఱచుకొని ఒక్కుమ్మడిగా అందఱును పైకి ఎగురుఁడు.' అని ఉపాయము బోధించెను. పావురము లన్నియు అట్లే ఎగిరి భీతిచే ఆకాశమున మఱియు వేగముగా పోవుచుండినవి. వ్యాధుఁడును పైని చూచి విషణ్ణుఁడై మరలి పోయెను. అంతట చిత్రగ్రీవుఁడు భయము తీఱి తనపరివారముతో 'నామిత్రుఁడు హిరణ్యుఁడు మూషక రాజు ఈసమీపమున నున్నాఁడు గదా, అతఁడు పాశములను తెగఁగొఱికి మనలను రక్షించును, అటకు పోదము రండు.'

అనెను. అంతట ఆవలతోనే సపరివారుఁడుగా చిత్రగ్రీవుఁడు ఆ యెలుక కలుగునొద్దకు పోయి నేలను వ్రాలి 'మిత్త్రుఁడా హిరణ్యా, బయటికిరా, చిత్రగ్రీవుఁడను వచ్చి యున్నాఁడను.' అని పిలిచెను. ఎలుక విని ద్వారముగుండ చూచి మిత్త్రునిఁ గని తన శతముఖబిలమునుండి వెలువడి చెంత చేరి వృత్తాంత మడిగి తెలిసికొని త్వరగా చిత్రగ్రీవునికిని పరివారమునకును పాశములను తెగఁగొఱికెను. పాశములు తొలఁగఁగా చిత్రగ్రీవుఁడు మూషకరాజును ప్రియవచనములచే నలరించి సపరివారముగా సెలవు పుచ్చుకొని వెడలి పోయెను.

ఆకాకి వెంబడిగానే వచ్చి ఇది యెల్లఁ గని ఆశ్చర్యపడి, బిలప్రవిష్టుని హిరణ్యుని పిలిచి 'అయ్యా, నేను కాకిని, నాపేరు లఘుపాతి; మిత్త్రవత్సలుని నిన్ను ఇట్టి విపత్తులో మిత్త్రులను రక్షించువానిని మిత్త్రునిఁగా వరింప వచ్చినాఁడను.' అనెను. ఆమాట విని బిలమునుండియే కాకిని చూచి యెలుక 'హాహా, భక్ష్యభక్షకములకు మైత్త్రి యనఁగా నేటిది?' అనెను. వాయసము చెప్పెను:— 'అట్లు చెప్పకు, నిన్ను భక్షించిన, క్షణకాలము ఆఁకలి తీఱును. నీవు మిత్త్రుఁడవుగా నుండిన మాటిమాటికి ప్రాణమును కాపాడుదువు.' కాకి ఇట్టి మంచిమాటలు చెప్పి ప్రమాణము చేసి నమ్మికపుట్టించి బిలము నుండి వెలుపలికి ఎలుకను రప్పించి దానితో సఖ్యము చేసెను.

అది మొదలు కాకి మాంసపేశములను తెచ్చుచును, ఎలుక వడ్లు తెచ్చుచును, రెండును కలసి భుజించుచు, సుఖముగానుండె నవి. ఒకనాఁడు కాకి హిరణ్యునితో 'మిత్త్రా, ఇచట అడవిలో దూరమున నది యొకటికలదు, అందు మంథరకుఁ డని నా స్నేహితుఁడు కూర్మము కలఁడు, వానికై అచటికి పోయెదను, అచట మాంసభోజనము సులభముగా దొరకును, ఇచట ఆహారము సులువుగా దొరకుట లేదు; నిత్యము నిచట వ్యాధ భయము కూడ కలదు.' అనెను. అంతట మూషకము 'మిత్త్రా, నన్నుఁగూడ అక్కడికే కొని పొమ్ము, అందఱము అచటనే కలసి నివసింతము, ఈచోటి మీఁద నాకును విరక్తి గలిగి యున్నది, అందులకారణము అచట నీకు చెప్పెదను.' అనెను. అంతట కాకి ఎలుకను నోటఁ గఱచుకొని ఆకాశమార్గ మున త్వరగా ఆ వననదీతటమునకు పోయి, అచట మంథరకుని కని, సమూషకునికి తనకు అతఁడు విందు చేయఁగా, భుజించి సుఖముగా నుండెను. ప్రసంగవశమున కూర్మమునకు తాను వచ్చిన కారణమును, ఎలుకతోడి స్నేహ మయిన వృత్తాంత మును చెప్పెను. మంథరకుఁడు వాయసముచే ఇట్లు తెలుపఁ బడిన హిరణ్యుని మిత్త్రుని చేసికొని అతఁడు స్వదేశముమీఁద విరక్తి గొన్న కారణము నడిగెను. హిరణ్యుఁడు కాకకూర్మ ములకు తనవృత్తాంతము నిట్లు వర్ణింపఁ దొడంగెను.

బోయి యంత్రపుబిస వదలఁగా బాణము తగిలి చచ్చెను. కావున అతిసంచయము కూడదు.

ఇట్లు బ్రాహ్మణుఁడు చెప్పఁగా భార్య ఒప్పుకొన్నదై పులగము చేయుటకై నువ్వులు ఎండ బోసెను. ఆమె యింటి లోనికి పోఁగా వానిని కుక్క తిని మైల చేసెను. వానిని వెలఁ బెట్టి ఎవ్వరును కొనరైరి. ఈరీతిగా లోభమువలన భోగము కలుగదు, కేవలము క్లేశమే కలుగును.

ఇట్లు పలికి ఆగంతుక సన్న్యాసి స్థానిసన్న్యాసితో 'గుద్దలి తెమ్ము, ఈ మూషకోపద్రవమును నివారించెద.' అనెను. స్థాని గుద్దలి తెచ్చెను. నేను చాటున దాఁగియుండి దానిం గని బిలములోఁ దూఱితిని. అంత నాగంతుకుఁడు నేను తిఱుగు చుండిన కలుగును చూచి గుద్దలితో త్రవ్వ సాగెను. చాల దూరము త్రవ్వఁగా అతనికి నా హారము దొరకినది. నేను పాఱి పోయితిని. అంత నాగంతుకసన్న్యాసి స్థానిసన్న్యాసితో 'ఈ హారంపుఁ దేజస్సుచేత ఆ యెలుకకు అట్టిబలము కలిగినది.' అని పలికి నా సర్వస్వ మయిన యాహారమును హరించి నెత్తిని పెట్టుకొని ఇరువురు సన్న్యాసులును సుఖముగా నిద్రపోయిరి. వారు నిద్రించుచుండఁగా నేను నాహారమును హరించి తెచ్చు కొనుటకు మగల పోఁగా స్థాయిసన్న్యాసి మేలుకొని నన్ను నెత్తిమీఁద కఱ్ఱతోఁ గొట్టెను. అంత నాకు గాయ మైె దైవ వశమున చావక బిలము చొచ్చితిని. మరల మునుపటివలె

అన్నార్థమై దుముకుటకు శక్తి కలుగ లేదు. పురుషులకు ధనమే యౌవనము, ధనాభావమే ముసలితనము. ధననాశముచే పురుషునికి తేజస్సు, బలము, ఉత్సాహమును నశించిపోవును. అది మొదలు నా పొట్టమాత్రము నిండించు కొనుటకు యత్నించుచున్న నన్నుఁ గని నా పరివారపు టెలుక లెల్ల నన్ను వదలి వెడలి పోయినవి. అన్నము పెట్టని ప్రభువును భృత్యులును, పువ్వులు లేని చెట్టును తుమ్మెదలును, నీరు లేని సరస్సును హంసలును, చిరకాలసేవితము నయినను వదలుట నిక్కము. ఈప్రకార మచట చిరకాలము దుఃఖితుండనై ఈ లఘుపాతిని మిత్రునిగాఁ బొంది చివరకు, ఓ కూర్మరాజా, నీసన్నిధికి వచ్చితిని.

హిరణ్యకుఁడు ఇట్లు చెప్పఁగా మంథరకుఁ డనియె:—మిత్రమా, ఈచోటు నీదే, అసంతుష్టిగా నుండకు. గుణవంతునికి విదేశము లేదు, సంతుష్టునికి అసుఖము లేదు, ధీరునికి విపత్తు లేదు, సప్రయత్నునికి అసాధ్యము లేదు.

## చిత్రాంగాగమనము.

ఇట్లు కూర్మము పలుకు చుండఁగా, చిత్రాంగ మను లేడి దూరమునుండి వ్యాధుఁడు వెంటఁ దఱుమఁగా ఆ యడవికి వచ్చెను. దాని రాకను, దాని వెంట రాక వ్యాధుఁడు నిలిచి పోవుటను, గని కూర్మాదులు దాని నోదార్చి దానితో సఖ్యము చేసినవి, కాక కూర్మ మృగాఖువులు అన్నియు అచటనే

పరస్పరోపచారములు చేసికొనుచు మిత్త్రములుగా నివసించి యుండినవి.

ఒకనాఁడు చిత్రాంగుఁడు ఎంతసేపటికిని రాకుండఁగా వెదకుటకై లఘుపాతి చెట్టెక్కి చూచెను. చిత్రాంగుఁడు నదీతీరమందు యంత్రప్రవలలో తగులుకొని పడియుండెను. వానిం గని వాయసము కూర్మాఖువులకు తెలిపెను. అంతట కలయఁ బలికికొని కాకి ఎలుకను నోటఁ గఱచుకొని చిత్రాంగుని యొద్దకు కొనిపోయెను. హిరణ్యకుఁడు బంధనములో నున్న చిత్రాంగుని ఓదార్చి వలను తనదంతములతో క్షణములో తెగఁగొఱికి విడిపించెను. ఇంతలో మంథరుఁడును మిత్త్రవాత్సల్యముచేత నదీప్రవాహముగుండ వచ్చి తానును గట్టెక్కి వారిం గలసెను. ఆక్షణమందే వల పన్నిన వ్యాధుఁడు వచ్చి, మృగాదులు పలాయితములుగా కాఁగా మంథరకమును పట్టుకొని ఆవలలోనే చుట్టిపెట్టుకొని, మృగము పాఱిపోయినందులకు ఆకులుఁడై పోవుచుండఁగా, దీర్ఘదర్శియైన యెలుక బోధించినప్రకారము లేడి వానిదారిలో ముందు పోయి చచ్చినట్లు పడియుండెను. కాకి దానినెత్తిమీఁద వ్రాలి కన్నులు పొడుచుచున్నట్టు అభినయించుచుండెను. దానిం గని వ్యాధుఁడు మృతమైన యా మృగమును కైకొనుటకై నదిగట్టున తాఁబేటిని ఉంచి పోయెను. వాఁడవలికి పోఁ జూచి ఎలుక వలను కొఱికి కూర్మమును విడిపించెను. కూర్మము మెల్లఁగా నడచి నదిలో పడెను. లేడియు

కచ్ఛపము లేకుండ వ్యాధుఁడు సమీపింపఁగానే లేచి పారిపో యెను, కాకి చెట్టెక్కెను. వ్యాధుఁడు మరలి వచ్చి, కూర్మము పాశములు తెగి పలాయిత మయి పోయినందున, ఉభయ భ్రష్టుఁ డై విధిని దూరుచు ఇంటికి పోయెను. పిమ్మట అన్నియు ఒకచోట చేరి సంతోషించినవి. లేడి ప్రీతిచే ఇతరులను 'మీ ప్రాణాపాయములను లక్ష్యపెట్టక నా ప్రాణమును రక్షించినట్టి మీరు నాకు మిత్త్రములయితిరి, నాకన్న ధన్యు లెవ్వరు?' అని ప్రశంసించెను. ఇట్లు అవి అన్యోన్యప్రీతిసుఖితము లై వసించి యుండినవి.

ఈప్రకారము తిర్యగ్జంతువులు కూడ ఇష్టమును నెఱవేర్చుకొనును, ఆపత్కాలమందు తమ ప్రాణమైనను ఇచ్చి మిత్త్రమును రక్షించును. ఈరీతిగా, 'మిత్త్రులయం దాసక్తి శ్రేయము; ఈర్ష్య కలిగించును గాన స్త్రీలయం దాసక్తి మేలు గాదు' అని పెద్దలు చెప్పుదురు. ఈకథను వినుము.

## ఈ ర్ష్యా ళు ప తి.

పూర్వము ఒకనగరములో ఈర్ష్యాళువు ఒక పురుషుఁ డుండెను. వానికి రూపవంతురాలు ప్రియభార్య యుండెను. అతఁడు ఆమెయందు నమ్మకము లేక ఎప్పుడును ఆమెను ఒంటరిగ వదలఁ డాయెను; చిత్తరువుల యందలి పురుషప్రతిమలవలనఁ గూడ ఆమెకు శీలభంగము కలుగు నని శంకించుచుండెను. ఒకానొకప్పుడు అతఁడు తప్పని పని కలిగి భార్యను వెంటఁబెట్టు

కొని దేశాంతరము బయలు దేఱెను. దారిలో భిల్ల భూయిష్ఠమైన యడవిని కని భయముచేత భార్యను ఒక గ్రామములో ఒక ముసలి బ్రాహ్మణునియింటఁ బెట్టి పోయెను. ఆమె అచ్చటనే యుండి ఆదారిని వచ్చిన యొక భిల్లుని తగులుకొని పోయెను. వానితోఁగూడ వానిపల్లెకుఁ బోయి ఈర్ష్యాళుపతి యను పీడ వదలి, ఆనకట్టు తెగిన నదివలె యథేచ్ఛముగా విహరించు చుండెను. ఇంతలో పతి పని ముగించుకొని మరల ఆదారిని వచ్చి బ్రాహ్మణునియింటికిఁ బోయి 'నాభార్యయెక్కడ?' అని అడిగెను. బ్రాహ్మణుఁడు 'అది ఎక్కడికి పోయెనో ఎఱుఁగను, ఇక్కడికి భిల్లులు వచ్చిరి, వారు దానిం గొనిపోయి యుందురు, వారిపల్లెయు దగ్గఱనే యున్నది. అచటికి త్వరగా పొమ్ము, అక్కడ అది దొరకును. వేఱాలోచన చేయకుము.' అనెను.

వెంటనే అతఁడు ఏడ్చుచు తెలివి లోపమునకు తన్ను తిట్టుకొనుచు ఆ భిల్లపల్లికి పోయి భార్యను గనియెను. ఆ పాపాత్మురాలు వానిం గని దగ్గఱకు వచ్చి 'నావలన దోషము లేదు, నన్ను భిల్లుఁడు బలాత్కారము చేసి తెచ్చినాఁడు.' అని పలికెను. 'అటయిన రా రమ్ము. ఎవఁడును చూడక ముందే పోదము.' అని రాగాంధుఁడు ఈర్ష్యాళువు పిలిచెను. 'నన్ను తెచ్చినభిల్లుఁడు వేఁటనుండి వచ్చెడువేళ యిది, రాఁగానే మన పోక యెఱిఁగి వాఁడు తఱుముకొని వచ్చి మనలను పట్టుకొని చంపి వేయును; కనుక ఇచట ఈగుహలో దాఁగి యుండుము,

రాత్రి వాఁడు నిద్రింపఁగానే వానిని చంపి వేసి నిర్భయముగా పోదము.' అని యాశిత చెప్పెను. వాఁడును గుహలో దాఁగి యుండెను. కామాంధులహృదయములో వివేకమునకు అవకాశ మెక్కడిది? ఆ దుశ్శీల వ్యసనముచేత అచటికి వచ్చిన యాపతిని గుహాంతః స్థితుని సాయంకాలమున ఇంటికి వచ్చిన భిల్లునికి చూపెను. క్రూరుఁడు పరాక్రమవంతుఁడా భిల్లుఁడు ఈర్ష్యాళువును గుహనుండి వెలికి ఈడ్చి మఱునాఁడు ప్రాతః కాలమున దేవికి బలివేయుటకై దృఢముగా నొకచెట్టునఁ గట్టి పెట్టెను. రాత్రి భోజనము చేసి ఈర్ష్యాళునికన్నులయెదుటనే వానిభార్యతో క్రీడలం దేలి దానితోఁగూడ నిద్ర చెందెను.

వాఁడు నిద్రించిన పిమ్మట చెట్టునకు కట్టఁబడి యున్నట్టి యీర్ష్యాళువు చండికాదేవిని స్తుతించి శరణుఁ జొచ్చెను. దేవి ప్రత్యక్షమై వానికి వర మిచ్చెను. వరప్రభావముచేత నతఁడు బంధము లూడి భిల్లునితలను వాని కత్తితోనే నఱికి వేసెను. 'ఇఁక రా పోదము, పాపి చచ్చినాఁడు.' అని భార్యను పిలువఁగా ఆదుశ్శీల అత్యంతదుఃఖముతో లేచి, భిల్లునిశిరమును భర్తకు తెలియ నీయక కైకొని పతితోఁగూడ పయనమై పోయెను. తెల్లవాఱఁగా ఒకనగరము చేరి అచట ఆ శిరమును జనులకు చూపి 'ఇతఁడు నాభర్తను చంపివేసినాఁడు.' అని భర్తను చూపుచు విలపించెను. అంతట నగరరక్షకులు వారి నిరువురను గొనిపోయి రాజునెదుట నిలిపి వారి వృత్తాంతమును తెలిపిరి.

రా జడుగఁగా ఈర్ష్యాళువు యథార్థమును తెలుపుకొనెను. రాజు తత్త్వ మెఱిఁగి ఆ పాపాత్మురాలిని ముక్కు సెవులు కోయించి వెడలఁగొట్టెను, దానిపతిని విడిచి పెట్టెను, వాఁడును కుస్త్రీ స్నేహాగ్రహము తొలఁగి తనయింటికిఁ బోయెను. దేవా, ఈర్ష్యయే స్త్రీలకు అన్యపురుషసంగమును నేర్పును. కావున బుద్ధిమంతుఁడు ఈర్ష్యను చూపకయే స్త్రీని కాపాడుకో వలసినది.

## స్త్రీలకు రహస్యము చెప్పఁగూడదు.

మఱియు మేలు గోరినవాఁడు స్త్రీలకు రహస్యమును చెప్పఁగూడదు, వినుము. నాగుఁ డొకఁడు గరుడభయమున పలాయితుఁడై వచ్చి భూలోకములో మనుష్య రూపమును ధరించి ఒకానొక వారయువతి యింట దాఁగియుండెను. ఆగణిక రాత్రికి ఏనూఱు ఏనుఁగులను బాడిగ పుచ్చుకొనును. నాగుఁడు దినదినము తనప్రభావముచే అంతబాడిగను ఇచ్చుచుండెను. 'నీకు ప్రతిదినము ఇన్ని ఏనుఁగులు ఎట్లు కలుగును? నీ వెవరవు చెప్పుము.' అని యావిలాసిని నిర్బంధింపఁగా మదనమోహితుఁడై నాగుఁడు 'ప్రేయసీ, ఎవరితోను చెప్పకుము, నేను గరుడభయమున వచ్చి ఇచట దాఁగి యున్నాఁడను, నాగుఁడను.' అని చెప్పెను. గణిక యీ రహస్యమును, కుట్టినికి చెప్పెను. ఇంతలో గరుడుఁడు లోకమంతయు వెదకుచు పురుషాకృతితో వచ్చి కుట్టినిని 'ఈ దినము నేను నీకూఁతుతో నుండెదను, బాడిగకై కొమ్ము' అనెను. 'ఇచట నాగుఁడు ఉన్నాఁడు, దిన

మునకు ఏనూ తేనుఁగుల నిచ్చుచున్నాఁడు, ఒకనాఁటి బాడిగ నా కేల?' అని కుట్టిని పలికెను. అచట నాగుఁ డున్నాఁ డని గరుడుఁడు తెలిసి ఆయింట అతిథిగా ప్రవేశించి మేడడాబా మీఁద నున్న నాగునిఁ గని పట్టి నిజరూపమును ప్రకటించి దుమికి భక్షించెను. కావున ప్రాజ్ఞుఁడు స్త్రీలతో అనర్గళముగా రహస్యము చెప్పఁగూడదు.

## ఖల్వాటుని కథ.

ఇట్లు పలికి గోముఖుఁడు మఱల ముగ్ధుల కథను చెప్పఁ దొడంగెను. ఒకమూర్ఖుఁడు ధనవంతుఁడు రాగిచెంబువంటి బట్టతల గలాఁడు, తనకు జుట్టు లేనందులకు మిగుల అవమానము సహించుచుండెను. ఒక ధూర్తుఁడు వాని యాశ్రితుఁడు వచ్చి 'అయ్యా, తలవెండ్రుకలు మొలపించు నౌషధ మెఱిఁగినవాఁడు వైద్యుఁడొకఁడున్నాఁడు.' అని చెప్పెను. 'అతనిని నాయొద్దకు తెత్తువేని నీకును వానికిని ధన మిచ్చెదను.' అని ఖల్వాటుఁడు అడిగెను. చిరకాలము వాని ధనమును అనుభవించి ఆ

## కేశముగ్ధుఁడు.

ధూర్తుఁడు ఆమూర్ఖునియొద్దకు ఒకధూర్తవైద్యుని తోడ్కొని వచ్చెను. వైద్యుఁడును చిరకాలము మూర్ఖునిధనము అనుభవించుచు తనతలపాగ తీసివేసి ఆమూర్ఖునికి చూపుచుండెను. దానిం గనియు విమర్శించుకో లేక, ఆ జడుఁడు వైద్యుని కేశౌషధము అడుగుచునే యుండెను. వైద్యుఁడు వానితో 'ఓయి

మూర్ఖా, బట్టతలవాఁడను నేను బట్టతలవానికి నీకు జుట్టు ఎట్లు మొలపింప నేర్తును? అని నీకు స్వయముగా నా బట్టతలను చూపితిని. అప్పటికిని నీవు కనుంగొననేరవు! ఇసీ!' అని వెడలి పోయెను. ఈ రీతిగా, దేవరా, ధూర్తులు జడమతులతోడ క్రీడించుచుందురు.

## తైలముగ్ధుఁడు.

కేశముగ్ధుని వింటివి, తైలముగ్ధుని వినుము. ఒకశిష్టునికి సేవకుఁడు ముగ్ధుఁడొకఁడుండెను. ఒకనాఁడు స్వామి నూనె తెమ్మని దుకాణమునకు పంపఁగా సేవకుఁడు నూనెను గిన్నెలో తెచ్చుచుండెను. దారిలో మిత్త్రుఁడొకఁడు 'నూనె గిన్నె క్రింద కారుచున్నది, పదిలపఱుచుకో.' అని బోధించెను. అంత, గిన్నెయడుగును పరీక్షించుటకై వాఁడు తల క్రిందు చేసెను' నూనె యంతయు నేలపాలాయెను. సేవకుఁడు లోకహాస్యుఁ డాయెను. ఆవృత్తాంతము నెఱిఁగి స్వామి వానిని ఇల్లు వెడలఁ గొట్టెను. కావున మూఢునికి స్వబుద్ధి వలయుఁగాని బోధన పనికి రాదు.

## అస్థిముగ్ధుఁడు.

అస్థిముగ్ధునికథను వినుము. పూర్వము మూఢుఁడొక డుండెను. వానిభార్య అసతి. అతఁడు పనిమీఁద దేశాంతరము పోఁగా, ఆ యసతి చేయవలసిన దెల్ల నేర్పి తన యాప్తురాలిని పనికత్తెను ఇంట నుంచి ఏకాంతముగా ఉపపతియింటికి నిరర్గళ

సుఖార్థమై పోయెను. ఇట్లుండఁగా పతి దేశాంతరమునుండి వచ్చెను. వానితో పూర్వశిక్షితురా లయిన యా దాసి బాష్ప గద్గద స్వరముతో 'అయ్యా, నీభార్య కాలధర్మము నొందినది, దహనము కూడ అయి పోయినది.' అని, వానిని శ్మశానమునకు కొనిపోయి ఒకసొదలోని యెముకలు, చూపించెను. వాఁడు వెంటనే భార్యకు ఉదకక్రియలు చేసి, అస్థులను తీర్థములో వేసి వచ్చి, భార్యకు శ్రాద్ధము చేయ నారంభించెను. ఆ దాసియే సద్బ్రాహ్మణుఁ డని భార్యోపపతినే తేఁగా, వానినే మూర్ఖుఁడు శ్రాద్ధ బ్రాహ్మణునిఁగా నిమంత్రించెను. ఆ యుప పతితోడ ప్రతిమాసికమునందును భార్యకూడ ఉదారవేషా భరణయై వచ్చి భోజనము చేసి పోవుచుండినది. 'ఓ ప్రభూ, చూడు నీభార్య పాతివ్రత్యప్రభావముచే పరలోకమునుండి ప్రత్యక్షముగా వచ్చి బ్రాహ్మణునితో కూడ భోజనము చేయు చున్నది!' అని దాసి చెప్పెను. ఆ మూర్ఖశిరోమణి ఆ మాటను యథార్థముగా నమ్మి ఆనందించెను. ఈ ప్రకారము కుస్త్రీలచే ఋజుబుద్ధులు వంచితు లగుదురు

## చండాలకన్య.

చండాలకన్య కథను వినుము. రూపవంతురాలు ముగ్ధ చండాలకన్యక యొకతె సార్వభౌముని వరునిఁగాఁ బడయ సం కల్పించుకొని యుండెను. ఒకనాఁడు రాజు ఊరేఁగుచుండఁగా కని సర్వోత్తము నతని భర్తృబుద్ధిచే వెంబడించెను. ఇంతలో

ఆదారినిముని ఒకఁడు రాఁగా, రాజు అతనిపాదములకు ప్రణమిల్లి మరల నేనుఁగు నెక్కి తన యింటికి పోయెను. దానిం గని రాజుకంటె మునియే ఉత్కృష్టుఁడని తలఁచి చండాలకన్య ముని వెంటఁ బడెను. మునియు పోవుచు దారిలో శూన్యశివాలయము గని నేల మోఁకాళ్లూఁది శివవందనము చేసి నడచెను. దానం గన్నియ మునికంటె శివుఁడే అధికుఁడని తలఁచి మునిని మాని భక్తిబుద్ధితో శివునే ఆశ్రయించి అచటనే యుండెను. క్షణములో అచటికి కుక్క యొకటి వచ్చి దేవునిపీఠము నెక్కి శివలింగము మీఁద కాలెత్తి తన జాత్యుచితము చేసి పోయెను. అంతట చండాలకన్యక దేవునికంటె కుక్కయే యుత్తమ మని పతిబుద్ధిచే ఆ కుక్కవెంటఁ బోయెను. కుక్కయు ఒక చండాలగృహమునకుఁ బోయి అచట పరిచితుఁడయిన చండాలతరుణుని పాదములలోఁ బడి ప్రేమచే పొరల సాగెను. అంతట చండాలకన్య కుక్కకంటె చండాలకుమారుఁడే ఉత్తముఁడని స్వజాతితుష్టయై వానిని పతిగా వరించెను. ఈప్రకారము దూరమున అడుగు పెట్టు మూర్ఖులు తమచోటనే పడుదురు.

## మూర్ఖరాజు.

మూర్ఖరాజుకథ వినుము. మూర్ఖుఁడు రాజొకఁడు ధనవంతుఁడైనను లోభియై యుండెను. మంత్రులు ఒకనాఁడు హితార్థము అతనిని 'దేవా, దానము పరలోకదుర్గతిని పోఁగొట్టు నని పెద్దలు చెప్పుదురు. కావున దానములు చేయుము.

అయుస్సు ధనములును శాశ్వతములు గావు.' అని బోధించిరి. 'మంచిది, నేను చచ్చి పరలోకమందు దుర్గతిని పొందినయెడల అటుతర్వాత దానము చేసెదను.' అని యాతఁడు చెప్పెను. మంత్రులు తమలో తాము నవ్వుకొని ఊరకుండిరి. మూర్ఖుఁడు తన్ను ధనము వదలువఱకు తాను ధనమును వదలఁడు.

## మి త్ర ద్వ య ము.

మిత్రద్వయమును వినుము. చంద్రాపీడుఁ డని కన్యాకుబ్జమున ప్రభు వుండెను. ఆయనయొద్ద ధవళముఖుఁ డని సేవకుఁ డుండెను. వాఁడు నిత్యము బయటనే భుజించి రాత్రి యిల్లు చేరు చుండెను. 'నిత్యము భోజనము చేసి రాత్రి వచ్చెదవు, ఎక్కడనుండి?' అని భార్య యడుగఁగా 'సుందరి, నేను నిత్యము మిత్రులయొద్ద భోజనము చేసి రాత్రి వచ్చుచున్నాను. నాకు ఈలోకములో ఇద్దఱు మిత్రు లున్నారు ఒకఁడు కల్యాణవర్మ, నాకు భోజనాదికముచే ఉపకరించువాఁడు, రెండవవాఁడు వీర బాహువు ప్రాణము లయిన నిచ్చి యుపకరించువాఁడు.' అని చెప్పెను. ఆమాట వినిన యంతట భార్య కుతూహలముచే ఆ మిత్రుల నిరువురను తనకు చూపు మని వేఁడెను. అంత ధవళ ముఖుఁడు భార్యతోఁగూడ కల్యాణవర్మ యింటికి పోయెను. అతఁడును వారిని మహోపచారములతోడ సత్కరించెను. మఱునాఁడు వారిరువురును వీరబాహువు నింటికి పోయిరి. అతఁడు జూద మాడుచుండి వారికి స్వాగతము పలికి వదలెను.

అంతట భార్య కౌతుకముచేత ధవళముఖుని 'ఆర్యపుత్రా, కల్యాణవర్మ నీకు గొప్పసత్కారము చేసినాఁడు, వీరబాహువు నీకు స్వాగతముమాత్రము పలికినాఁడు. అతనికంటె ఇతఁ డెక్కువమిత్రుఁ డని తలంతు వెట్లు?' అని అడిగెను. 'ప్రేయసీ, అట్లయిన, నీవు పోయి అబద్ధమే వా రిరువురతోను రాజు మా మీఁద కోపగించినాఁడని చెప్పుము. అంతట నీవు స్వయముగా ఇరువుర తారతమ్యమును ఎఱుఁగుదువు.' అని ధవళముఖుఁడు చెప్పెను. భార్యయు పోయి కల్యాణవర్మతో అట్లు చెప్పఁగా, 'అమ్మా, నేను వణిక్కుమారుఁడను, రాజున కేమి చేయఁగలను చెప్పుము.' అని కల్యాణవర్మ పలికెను. పమ్మట ఆసుందరి వీర బాహువునొద్దకు పోయి అట్లే చెప్పెను. అతఁడు విన్న వెంటనే డాలు కత్తియు చేతఁగొని వీరియింటికి వచ్చెను. అంతట ధవళ ముఖుఁడు వానిని 'మిత్రమా, రాజు మంత్రులమాటవలన అలుక మానినాఁడు, కనుక మఱి యేమియు విశేషము లేదు. ఇంటికి పొమ్ము.' అని ఇంటికి పంపి వేసి, 'చూచితివా? ఇది ఆయిరువురలోను భేదము.' అని భార్యను హెచ్చరించెను. ఆమెయు సంతోషించెను. ఇట్లు ఉపచారమిత్రము వేఱు, సత్యమిత్రము వేఱు, జిడ్డు సమానమే అయినను, నూనె నూనె, నేయి నేయి, మరల గోముఖమంత్రి నరవాహన దత్తునికి మూర్ఖులకథలను చెప్పసాగెను.

## జలభీతుఁడు.

ఒకమూర్ఖుఁడు బాటసారి దప్పిగొని మహాప్రయాసతో అడవిని దాఁటి నదిని చేరియు జలమును త్రాగక చూచుచు ఉండెను. 'దప్పి గొనియు త్రాగ వేమి?' అని అచట నెవఁడో అడుగఁగా, 'ఇంత నీ రెట్లు త్రాగుదు?' నని జడమతి ఉత్తరము చెప్పెను. 'ఈ నీ రంతయు త్రాగినగాని రా జేమి నిన్ను దండించునా?' అని అతఁడు పరిహాసము చేసెను. ఐనను ఆ మూర్ఖుఁడు జలము త్రాగనే లేదు. ఇట్లు మూఢులు ఏపనిని గాని పూర్తిగా చేయ లేరో దానిలో యథాశక్తిగా ఒక భాగము నైనను చేయరు.

## పుత్రఘాతి.

జలభీతునికథ యయినది. పుత్రఘాతి కథను వినుము. మూర్ఖుఁ డొకఁడు బహుపుత్త్రుఁడు దరిద్రుఁ డుండెను. వాఁడు తనకొడు కొకఁడు చచ్చి పోఁగా, రెండవకొడుకును అన్న లేక ఒంటిగా దూరప్రయాణము నడవ లేఁ డని తాను చంపివేసెను. అందులకు జనులు వానిని పరిహసించి దేశము వెడలఁ గొట్టిరి. ఈరీతిగా నిర్వివేకమతులు పశుతుల్యులుగా నుందురు.

## భ్రాతృమూఢుఁడు.

భ్రాతృమూఢుని వినుము. మూఢుఁ డొకఁడు జనుల నడుమ మాటలాడుచు ఉండెను. వాఁడు భవ్యాకారుని ఒక పురుషుని కని 'వీఁడు నాయన్న, వీనిసొత్తును హరించెదను,

నేను వీనికి ఏమియుఁ గాను, కావున నాకు ఇది ఋణము గాదు' అని పలికి, అచట వారలను గూడ నవ్వించెను. ఇట్లు స్వార్థాంధుఁడైన మూర్ఖుని మూర్ఖత్వము అతిచిత్రముగా నున్నది.

## బ్రహ్మచారిసుతుఁడు.

బ్రహ్మచారిసుతుని వినుము. ఒకమూర్ఖుఁడు తమతమ తండ్రుల గుణవిశేషములను చెప్పుకొనుచున్న జనుల గోష్ఠిలో ఉండి తన తండ్రి మహిమను 'మానాయన బాల్యమునుండి బ్రహ్మచారి, ఆయనకు తుల్యుఁడు లేఁడు' అని వర్ణించెను. 'అట్లయిన నీ వెట్లు పుట్టితివి?' అని మిత్రులు వాని నడిగిరి. నేను ఆయనకు మానసపుత్త్రుఁడను' అని పలికి జడశిరోమణి వారిని మఱియు నవ్వించెను. జడమతులు ఎట్టియత్యంతాసంబద్ధము లైనను చెప్పుదురు.

## గణకుఁడు.

గణకుఁ డొకఁడు విజ్ఞానహీనుఁడు ఉండెను. వాఁడు జీవనము లేక భార్యాపుత్త్రులతో స్వదేశమునుండి పరదేశము పోయి, లేని విజ్ఞానము ప్రకటించుకొని జనుల నమ్మకముచేత ధనసత్కారము పొందుటకు యత్నించెను. సకలజనుల యెదుట తనపిల్లవాని నొకనిం గౌఁగలించికొని యేడవసాగెను. జనులు కారణ మడుగఁగా, 'అయ్యా, నేను భూత భవ్య భవిష్యత్తు లెఱుఁగుదును; ఈశిశువు నేఁటికి ఏడవనాఁడు చచ్చి పోవును.' అని జనుల నందఱను ఆశ్చర్యపెట్టి, ఏడవనాఁడు తెల్లవాఱు

జామున నిద్రించుచున్న యా శిశువును చంపెను. చచ్చిన శిశువుం గని జనులు నమ్మకము కలిగి గణకుని ధన మిచ్చి సత్కరించిరి. ఆ ధనము కైకొని వాఁడు స్వదేశమునకుఁ బోయెను. ఇట్లు ధనలోపముచే విజ్ఞానము ప్రకటింపఁ గోరు మూర్ఖులు పుత్త్రు నయినను చంపుకొందురు.

కో పి.

కోపధారి మూర్ఖుని కథ.—వెలుపల నున్న పురుషుఁ డొకఁడు వినుచుండఁగా, ఇంట నొకఁడు తనబంధువులతో అతని గుణములను చెప్పు చుండెను. శ్రోతలలో నొకఁడు 'మిత్త్రా, అతఁడు గుణవంతుఁడే ; అయినను వానియందు రెండు దోషము లున్నవి, సాహసమును క్రోధమును.' అనెను. వెలు పల నున్నవాఁడు విని తటాలున ఇల్లు సొచ్చి ఆపలికినవానిని మెడకు గుడ్డచుట్టి పట్టుకొని 'ఓరి మూర్ఖా, చెప్పు, నా సాహస మేమో, నాకు కోప మెక్కడిదో.' అని క్రోధాగ్నిచే జ్వలించుచు అడిగెను. అంతట ఇతరులు నవ్వుచు ' నీ సాహసక్రోధములు ప్రత్యక్షముగానే అగపడుచున్నవి, వేఱె చెప్పవలయునా ?' అనిరి. ఇట్లు స్వదోషము ఎంతప్రకట మయినను అజ్ఞులకు తెలియదు.

క న్యా వ ర్ధ యి త.

కన్యావర్ధయితకథను వినుము.—ఒకరాజునకు సురూప కన్య పుట్టెను. ఆపిల్లను అతిప్రేమచేత ఆరాజు ఒక్కమాఱు

గానే పెద్దదానిని చేయుటకై వైద్యులను రప్పించి ప్రీతితో వారిని 'మంచివరుని పెండ్లి యాడుటకు తగినట్లుగా నా కొమారిత ఇప్పుడే పెద్దది యగునట్లుగా మంచి యౌషధము చేయుడు.' అని ఆజ్ఞాపించెను. ఆజడుని ధనమును స్వీకరింప వైద్యులు 'ప్రభూ, ఇందులకు ఓషధి బహు దూరదేశమున నున్నది. దానిని మేము తెప్పించెదము. అది వచ్చువఱకు నీ కొమారితను అదృశ్యురాలిని గా నుంపవలసినది. ఇది ఆ వైద్యమునకు విధానము.' అని తెలిపిరి. రాజు అందులకు అంగీకరించెను. వారు పిల్లను కొనిపోయి పెక్కు వత్సరములు, 'ఇంక ఔషధము రా లేదు' అని చెప్పుచు తమయొద్దనే ఉంచు కొనిరి. ఆమెకు యౌవనము రాఁగానే ఔషధము వచ్చిన దనియు దానిమహిమచే పెద్ద దయిన దనియు చెప్పి ఆమెను కొనిపోయి రాజున కొప్పగించిరి. రాజు వారిని ధనములలో ముంచెను. ఇట్లు ధూర్తులు మూర్ఖు లయిన యీశ్వరులను వ్యాజమున భుజింతురు.

### అర్ధపణుఁడు.

అర్ధపణునికథ వినుము:— నగరవాసి యొకఁడు ప్రజ్ఞా గర్వము కలవాఁ డుండెను. వానియొద్ద పల్లెటూరివాఁ డొకఁడు ఒకవత్సరకాలము కొలువుచేసి జీతము చాలక సెలవు పుచ్చు కొని స్వగ్రామమునకుఁ బోయెను. వాఁడు పోఁగానే అతఁడు భార్యను 'నీయొద్ద నేమియు వాఁడు పుచ్చుకొనలేదు గదా,'

యని యడిగెను. అరపణము పుచ్చుకొని పోయె నని ఆమె చెప్పెను. అంత నతఁడు పదిపణములబత్తెము వ్యయపఱుచుకొని నదీతటమార్గముగా పోయి యాభృత్యునివలన ఆ యరపణమును పుచ్చుకొని మరలి వచ్చి, ఆప్రజ్ఞను లోకులతో చెప్పుకొని పరిహాసాస్పద మాయెను. ఈరీతిగా ధనాంధబుద్ధి స్వల్పముకొఱకు విస్తారము వ్యయము చేసికొనును.

## అభిజ్ఞానకర్త.

అభిజ్ఞానకర్త కథను వినుము:—ఒకమూర్ఖుఁడు ఓడలో సముద్రమార్గమున పోవు చుండఁగా వానిచేతినుండి వెండిగిన్నె సముద్రములో పడిపోయెను. అంత నా మూర్ఖుఁడు మరల ఆ దారిని వచ్చునప్పుడు మునిఁగి తీసికొందునుగాక యని గిన్నె పడినచోటికి సుడులు బుడగలు లో నగువానిని గుర్తు పెట్టుకొనెను. సముద్రము దాఁటి దిగునప్పుడు నీళ్లలో సుడులు మొద లగువానిని కని ఆగుర్తును బట్టి వెండిగిన్నెను ఎత్తుకొనుటకు పలుమాఱు నీళ్లలో మునుఁగు చుండెను. లోకులు అడుగఁగా జరిగిన వృత్తాంతమును చెప్పి మిగుల పరిహాస్యుఁడాయెను.

## ప్రతిమాంసప్రదుఁడు.

ప్రతిమాంసప్రదుఁ డయిన రాజుకథ వినుము. మూఢుఁడొకరాజు మేడనుండి క్రింద ఇరువురు పురుషులను, వారిలో నొకఁడు మహానసమునుండి అయిదుపలముల మాంసమును

హరించి చేతఁబెట్టుకొని యుండుటనుం, గని, వానిదేహమునుండి అయిదుపలముల మాంసమును కోయించివేసెను. మాంసము దేహమునుండి కోయఁగానే వాఁడు నొప్పికి ఏడ్చుచు నేలఁ గూలెను. రాజు కనికరించి ప్రతీహారునితో 'అయిదుపలముల మాంసము వీనిదేహమునుండి కోసినందులకు వీనికి ఇట్టినొప్పి కలిగినది; కనుక వీనికి అంతకంటె ఎక్కువమాంసమును ఇమ్ము.' అనెను. 'తల తెగఁగొట్టినవాఁడు నూఱు తలలను ఇచ్చిన మాత్రమున బ్రదుకునా? అయినను ఇచ్చెదను.' అని చెప్పి ప్రతిహారుఁడు నవ్వుకొనుచు వెలుపలికిం బోయి ఆపురుషుని ఓదార్చి వైద్యుల కొప్పగించెను. ఈరీతిగా, నిగ్రహమును గాని అనుగ్రహమును గాని ఎట్లు చేయ వలయునో మూఢ ప్రభువు ఎఱుంగఁడు.

## పుత్రాంతరకాంక్షిణి.

పుత్రాంతరకాంక్షిణికథ వినుము. ఒకానొకతెకు ఒకఁడే కొడుకు. అది ఇంక నొక కొడుకును కోరి యుపాయ మడుగఁగా పాషండురాలు క్షుద్రతాపసి యొకతె 'అమ్మా, నీ కుమారుని చంపి దేవతకు బలివేయుదువేని, నిశ్చయముగా నీకు మఱియొక కుమారుఁడు కలుగును.' అని బోధించెను. ఆ మూఢురాలు అట్లే చేయ నుద్యోగించు చుండఁగా ఒక వృద్ధ ఎఱిఁగి రహస్యముగా దానితో 'ఓసి, పాపాత్మురాలా, లేని కుమారుని కోరి ఉన్న కుమారుని చంపెదవు! వాఁడును

పుట్టనియెడల అప్పు డేమి చేయుదువు!' అని బెదరించి వారించెను. ఈరీతిగా స్త్రీలు శాకినీసంగతలై అకార్యములం జొత్తురు; వృద్ధోపదేశముచేత నివారితలై బాగుపడుదురు.

ఆమలకానేత.

ఆమలకానేతకథనువినుము:— ఒకానొక గృహస్థునికి భృత్యుఁడు మూఢుఁ డొకఁ డుండెను. గృహస్థుఁడు భృత్యుని 'ఓరీ, తోఁటకు పోయి మంచి తీయని యుసిరికపండ్లు నాకు కోసికొని రమ్ము.' అని యాజ్ఞాపించెను. ఆమూఢుఁడు ఒక్కొక ఫలమును పండ్లతో కొఱికి రుచి చూచి తీయగా నున్న దని నిశ్చయించుకొని తెచ్చి 'ప్రభూ, ఈ పండ్లు, మధురములు, నేను రుచి చూచి తెచ్చినాఁడను.' అని యెదుట నుంచెను. గృహపతియు సగముగొఱికిన యాపండ్లను గని రోసి వానిని ఆభృత్యునితోఁ గూడ సమముగా వదలివేసెను. ఇట్లు ప్రజ్ఞాహీనుఁడు ప్రభుకార్యమును తన కార్యమును రెంటిని నాశము చేయును.

భ్రాతృద్వయము.

భ్రాతృద్వయకథను వినుము. పాటలీపుత్రనగరమందు ఇరువురు బ్రాహ్మణులు యజ్ఞసోముఁడు కీర్తిసోముఁడు అని అన్నదమ్ములు ఉండిరి. వారి పిత్రార్జితధనము విస్తారము ఉండెను. కీర్తిసోముఁడు తనభాగమును సత్కృతముచే వృద్ధిచేసెను. యజ్ఞసోముఁడు తనధనము నెల్ల అనుభవించి ఇచ్చి వ్యయపఱిచెను.

'అతఁడు నిర్ధనుఁడై తనభార్యతో:— 'ఓసి, ప్రేయసీ, నేను ఇంత వఱకు ధనాఢ్యుఁడనై యుండి ఇప్పుడు బంధువుల నడుమ నిర్ధనుఁడనుగా నెట్లు బ్రదుకుదును? రమ్ము దేశాంతరము పోవుదము.' అనియె. 'బత్తెము లేక యెక్కడికి పోఁగలము?' అని భార్య పలికెను. అతఁడు నిర్బంధింప భార్య అవశ్యముగా పోవలయు నేని, మీ తమ్ముడు కీర్తిసోమునియొద్దనుండి బత్తెముకొఱకు కొంచెము ద్రవ్యము తెచ్చుకొమ్ము.' అని చెప్పెను. అతఁడును పోయి తమ్ముని పాథేయ మడుగునంతలో తద్భార్య యిట్లనియె: 'ఇతఁడు స్వధనమును పోఁగొట్టుకొన్నాఁడు, ఇతనికి ధనము మన మేల ఈవలయును? దరిద్రుఁడయినవాఁడెల్ల మన కడకే వచ్చును.' కీర్తిసోముఁడు విని అన్నయందు స్నేహము కల వాఁడయ్యును అతనికి ఏమియు ఈఁజాలఁడాయెను. దుష్టస్త్రీల వశములో నుండు పురుషులకష్ట మిది. అంత యజ్ఞసోముఁడు ఊరకయే ఇంటికిఁ బోయి ఆ వృత్తాంతమును భార్యతో చెప్పి దైవైకశరణముగా బయలు వెడలి పోవుచుండఁగా అడవిలో ఆ బ్రాహ్మణుని అజగరము మ్రింగెను. అతనిభార్య దానిం గని నేలఁ బడి యేడువ సాగెను. 'అమ్మా. ఏల ఏడ్చెదవు?' అని మనుష్యభాషలో అజగర మడుగఁగా బ్రాహ్మణి యిట్లనియె. 'మహానుభావా, విదేశములో నా భిక్షాభాజనమును నీవు హరించితివి, నే నెట్లు ఏడువకుందును?' ఆమాట విని అజగరము తననోటినుండి క్రక్కి ఒక గొప్పబంగారు పాత్రమును 'ఇదిగో,

నీభిక్షాపాత్రముకొమ్ము.' అని ఆమె కిచ్చెను. 'మహానుభావా, స్త్రీకి నాకు ఇందులో భిక్ష ఎవరు పెట్టుదురు?' అని యామె యడుగఁగా, అజగరము 'నీ వడుగఁగా ఈపాత్రములో ఎవఁడు భిక్ష పెట్టఁడో వానితల నూఱు వ్రక్క లగును. నా మాట యిది నిక్కము.' అని చెప్పెను. అంత నా బ్రాహ్మణి పతివ్రత అజగరమును 'ఆయార్యా, అట్లయినయెడల నీవు ఇందు నా కిప్పుడు పతిభిక్ష పెట్టుము.' అని యడిగెను. ఆమెనోట ఈమాట రాఁగానే అజగరము తననోటినుండి ఆబ్రాహ్మణుని సజీవుని వెడలఁ గ్రక్కి ఆమెకు ఇచ్చి, దివ్యపురుషుఁడై తుష్టు లయిన యాదంపతులతో 'నేను విద్యాధరరాజను, నాపేరు కాంచన వేగుఁడు, గౌతమశాపముచేత నజగరమ నైతిని. పతివ్రతతో సంవాదము కలుగువఱకు నాకు శాపము.' అని పలికి ఆపైఁడి పాత్రమును రత్నములతో నిండించి యిచ్చి తత్క్షణమే హర్ష ముతో ఆకాశ మార్గమునఁ బోయెను. ఆదంపతులు ఆరత్న రాశినిఁ గైకొని యింటికిఁ బోయిరి. ఇట్లు యజ్ఞసోముఁడు అక్షయ ధనుఁడై సుఖముండెను. బ్రహ్మ ఎల్లవారికిని సత్త్వానురూప ముగా సర్వమును ఇచ్చును.

## నా పి తా ర్థి.

నాపితార్థి కథను వినుము.—కర్ణాటదేశీయుఁడు ఒక భటుఁడు రాజునొద్ద కొలువుండి యుద్ధములో ఆతని మెప్పిం చెను. ప్రభువు వానిని ఇష్ట మయిన కోరిక కోరుకొ మ్మనెను.

అంతట నపుంసకప్రాయుఁ డాభటుఁడు 'ప్రభూ, నీ మంగలవానిని నాకిచ్చి వేయుము' అని యడిగెను. ఎల్లవారును వారి సత్త్వమునకు తగినట్లు ఫలము వేఁడుదురు.

## నకించిన్మార్గణుఁడు.

నకించిన్మార్గణుని వినుము. ఒక మూర్ఖుఁడు దారిని పోవుచుండఁగా బండివాఁ డొకఁడు వానిని తనబండి కొంచెము సరిగా పెట్టి పొమ్మని యడిగెను. అందులకు నాకేమి యిచ్చెద వని మూర్ఖుఁ డడిగెను. '(నకించిత్ దదామి) ఏమియు ఇయ్యను (నకించిత్ ఇచ్చెదను)' అని బండియాసామి చెప్పెను. అంత మూర్ఖుఁడు బండిని చక్కఁగా నిలిపి బండివానిని 'ఇయ్యవోయి నాకు నకించిత్' అని యడిగెను. అతఁడు పరిహసింపసాగెను. దేవా, ఈరీతిగా మూర్ఖులు జనులచే పరిహాసమును పొంది నింద్యు లయి ఆపదల పాలగుదురు. యోగ్యు లెప్పుడును పూజనీయులుగా నుందురు.

ఇట్లు నరవాహనదత్తుఁడు రాత్రి గోముఖునివలన ఇట్టి వినోదకథలను విని జగత్త్రయ విశ్రాంతి హేతు వైన నిద్రాసుఖమును భజించెను.

## ౮-వ తరంగము.

---

మఱునాఁడు సూర్యోదయమున నరవాహనదత్తుఁడు తండ్రిగారి దర్శనమునకు పోయెను. అచటికి పద్మావతీదేవి భ్రాత మగధేశకుమారుఁడు సింహావర్మ స్వనగరమునుండి వచ్చియుండ నరవాహనదత్తుఁడు ఆయనను కుశల మడుగుట మొద లయిన గోష్ఠియందు ఉండి అచటనే భుజించి సాయంకాలమున తన యింటికిఁ బోయెను. అచట శక్తియశనే తలఁచుకొని ఉత్కంఠితుఁడై యుండెను. అంత నతనిని వినోదపఱుచువాఁడై మరల గోముఖుఁడు చెప్పసాగెను.

### కాకోలూకీయము.

ఒకానొకచోట విశేషము నీడ గలది గొప్ప మఱ్ఱిచెట్టు పక్షుల కలకలముచేత పథికులను విశ్రామార్థము పిలుచునదివోలె నొప్పుచుండెను; అందు మేఘవర్ణుఁ డను కాకరాజు గూఁడు కట్టుకొని నివసించియుండెను. దానికి అవమర్దుఁ డను పేరి గ్రుడ్లగూబరాజు శత్రు వుండెను. అది రాత్రి కాకిసేని పరివారమైన కాకుల ననేకములను సంహరించి పోయెను. తెల్లవాఱఁగానే కాకరాజు మంత్రులను ఉడ్డీవ్యాడీవి సండీవి ప్రడీవి చిరజీవులనువారిని రప్పించి సగౌరవముగా 'మంత్రిపుంగవులారా, మన శత్రువు ఈరీతిగా వచ్చి మనలను ఓడఁ గొట్టి పోవుచున్నాఁడు.

ఇందులకు ఏమి యుపాయము ? ఆలోచించి చెప్పుఁడు.' అని యడిగెను. ఉడ్డీవి 'ప్రభూ, శత్రువు బలవంతుఁడై యుండఁగా అన్యదేశమునకుఁ బోవుట గాని వానినే ఆశ్రయించుట గాని ఉపాయము.' అనెను. ఆమాట విని ఆడీవి ఇప్పుడు మనకు భయము లేదు. శత్రువుల యభిప్రాయమును మనబలమును చక్కఁగా విచారించుకొని కర్తవ్యమును జేయుదము.' అనెను. సండీవి 'దేవా, మరణ మయినను మేలు, శత్రువును శరణుఁ జొచ్చుటగాని దేశాంతరము పోవుటగాని తగదు. మనకు అపకారి యైన యీశత్రువుతో మనము పోరవలసినది. సహాయవంతుఁడు శూరుఁడు నగు రాజు ఉత్సాహవంతుడేని శత్రువులను జయించును.' అని పలికెను. ప్రడీవి అనియె:— 'అతఁడు బలవంతుఁడు మనకు జయింప నలవి కాదు. వానితో మనము సంధి చేసికొని కనుపెట్టుకొనియుండి సమయము వచ్చినప్పుడు కొట్టవలసినది.' అంతట చిరజీవి 'ఓ నీతికోవిదులారా, వినుఁడు, వారికిని మనకును సంధికి నిబంధన లేమి? దూత ఎవఁడు. సృష్ట్యాది నుండి కాకులకును ఉలూకములకును వైరము. అచటికి దూతగా నెవఁడు పోవును ? ఇది మంత్రసాధ్యము, రాజ్యమునకు మంత్రమే మూలము.' అని వాక్రుచ్చెను. కాకరాజు చిరజీవిని 'మంత్రివరా, నీవు ముసలివి, నీకు తెలిసి యుండును, ఏ హేతువుచేత కాకోలూకమునకు వైరము కలిగినది ? దానిని చెప్పి పిమ్మట మంత్రము చెప్పుదువు గాక.' అని యడిగెను. చిరజీవి

చెప్పసాగెను:— ఈవైరము వాగ్దోషముచేత కలిగినది. గర్ద భాఖ్యాయికను వినలేదా.

## గర్దభాఖ్యాయిక.

పూర్వము చాకలివాఁడు ఒకఁడు తనగాడిద కృశముగా నుండుటఁ గని దానిని బలిపించుటకు ఇతరుల పొలములలోనికి పెద్దపులితోలు కప్పి తోలెను. అచట సస్యములను భక్షించు చుండినను పులి యనుభయముచేత గాడిదను ఎవరును నివా రింపరైరి. ఇట్లుండఁగా సేద్యగాఁ డొకఁడు ధనుష్పాణి యై ఆ దారిని చనుచు దానిం గని పులి యని వెఱచి వంగి కంబళి కప్పు కొని పోవుచుండెను. అట్లు వచ్చుచున్న యతనిని గని గాడిద యని తలఁచి సస్యభక్షణముచేత బలిసిన యా గాడిద ఓండ్ర పెట్టెను. అంతట వాఁడు దానిని గాడిదనుగా నెఱింగి లేచి వి ల్లెక్కు పెట్టి బాణము ప్రయోగించి మడియించెను. ఇట్లు గాడిద తనవాగ్దోషముచేతనే కార్షికునితో వైరము కలుగఁ జేసికొనెను. ఈ ప్రకారమే మనకును వాగ్దోషముచేత ఉలూక ములతో ద్వేషము గలిగినది.

పూర్వము పక్షులకు ఒకప్పుడు రాజు లేక పోఁగా అన్ని పక్షులును తమ కొకపక్షిని రాజునుగా పట్టాభిషేకము చేయు టను ఆరంభించినవి. అన్నియు గ్రుడ్లగూబను రాజును చేయ నుద్దేశించి దానికి ఛత్త్రచామరములు ఇచ్చుటకు సిద్ధముగా నుండినవి. ఆసమయములో వాయసము ఎక్కడనుండియో

వచ్చి ఆపక్షులను 'ఓమూర్ఖులారా, హంసకోకిలాది పక్షులు లేవా ? క్రూరదృష్టిని అమంగళదర్శనుని పాపుని ఈయులూకుని అభిషేకము చేసెద రేమి ? ప్రభావవంతుని రాజును చేసికోవలయును ; అతఁడు తన పేరివలననే మనకు సిద్ధి కలుగువాఁడుగా నుండవలయును.

### వ్యపదేశమువలన సిద్ధి.

చంద్రసరస్సని మహాజలము గొప్ప చెఱు వొక చోట నుండెను. దానితీరమున శిలీముఖుఁ డని శశకరాజు ఒకఁడు ఉండెను. వఱపుచే కడమ జలాశయము లెల్ల ఎండిపోఁగా ఇది మాత్రము జలసమృద్ధముగానే యుండెను. ఇచటికి ఏనుఁగుల మందతో యూథపతి చతుర్దంత మనునది జలపానార్థము వచ్చెను. ఆయూథము జలము దఱియు నలజడిచే శిలీముఖుని స్వజనములు శశము లనేకములు చదిసి చచ్చినవి. గజపతి మరలి పోయినపిమ్మట శశరాజు శిలీముఖుఁడు దుఃఖితుఁడై ఇతరశశములు గూడ విను చుండఁగా 'విజయ మను శశముతో నిట్లనియె:—'ఈయేనుఁగు ఇచట నీటిరుచి కన్నది. ఇఁక మరల మరల ఇచటికి వచ్చుచునే యుండును, మనలను నిశ్శేషము చేసి వేయును. నీవు దానియొద్దకు పోయి ఏ దయిన నుపాయము చేయుము, నీవు మిగుల నుపాయ శాలివి, నీవు పోయిన కార్య మెల్ల శుభముగా నెఱవేఱినది.' ఇట్లు రాజు పంపఁగా కుందేలు తరలి పోయెను. మార్గానుసారముగా ఆ యేనుఁగును కని,

బలవంతు డగు శత్రువుతో సంగము ఎట్లు గలిగిన అట్లెల్ల మేలు గాదు, అని యాలోచించి, కొండశిఖర మెక్కి, అచటనుండి గజపతితో ని ట్లనియె: 'ఓయి, నేను చంద్రదేవుని దూతను. ఆయన నీకు ఇట్లు చెప్పుచున్నాడు: 'చల్లనిది చంద్రసర స్సని నా నివాసము సరస్సు కలదు. అచట శశములు కలవు. నేను వానికి రాజను. అవి నాకు ప్రియ మయినవి. కావుననే నాకు శీతాంశుఁ డనియు, శశి యనియు ప్రసిద్ధి. నా సరస్సును నీవు నాశము చేసినాఁడవు, నాశశములను చంపినాఁడవు. ఇట్లు మరల చేయుదు వేని, నావలన అందుల ఫలము ననుభవించెదవు.' దూతయగు కుందేటివలన ఈమాటను విని గజేంద్రుఁడు భయ ముతో 'అయ్యా, ఇఁక నిట్లు చేయను. నాకు చంద్ర దేవుఁడు పూజ్యుఁడు.' అనెను. అంత, 'మిత్రమా, చంద్రునితో సరస్సులో స్వయముగా చెప్పుకొందువు.' అని కుందేలు ఏనుఁగును తెచ్చి సరస్సులోని చంద్రప్రతిబింబమును చూపెను. దానిం గని గజపతి దూరమునుండియె ప్రణమిల్లి భయముచే వణఁకుచు అడవికిఁ బోయెను, మరల నచటికి రాలేదు. ఆ వృత్తాంతమును శశరాజు శిలీముఖుఁడు చూచి ఆదూతను కుందేటిని సమ్మానించి నిర్భయముగా వసించి యుండెను.

ఇట్లు పలికి వాయసము మరల ననియె:— 'ఇట్టివాఁడు, అనఁగా, ఎవనిపేరు విన్న మాత్రాన ఎవరును ఏమియు బాధ చేయ వెఱతురో అట్టివాఁడు ప్రభువు, ఈయులూకమునకు

పగలు కన్నులగపడవు, ఇది యొక మ్రుక్కడి పక్షి, ఇది రాజ్యమున కెట్లర్హ మగును ? క్షుద్రునియందు విశ్వాస ముంపరాదు. ఈకథను వినుఁడు.

శశకపింజల కథ.

ఒకప్పుడు నే నొకచెట్టున నివసించి యుండఁగా అందులోనే క్రింద కపింజల మొకటి గూఁడు కట్టుకొని నివసించి ఉండెను. ఒకప్పుడు అది దేశాంతరము పోయి బహుదినములు రాదాయెను. ఈలోపల కుందేలు ఆగూఁట కాపురము చేరెను. కొన్నాళ్లకు కపింజలము వచ్చెను. అంత నా రెంటికి 'ఈగూఁడు నాది, నాది.' యని వివాదము సంభవించెను. అంత నా రెండును తీర్పుకొఱకు సభ్యునియొద్దకు పోవు చుండినవి. నేను వాని వగ పడక వానివెంబడి పోయితిని. అవి కొంచెము దూరమున ఒక చెఱువుగట్టున నొకపిల్లి మాయికముగా అహింసా వ్రతము ధరించి ధ్యానముచే కన్నులు అర మోడ్చి యుంటం గాంచి, ధార్మికుఁ డని యెంచి, దానినే న్యాయ మడుగ నిశ్చయించుకొని దగ్గఱకు పోయి యిట్లు చెప్పుకొన్నవి. 'స్వామీ, నీవు తపస్వివి, ధార్మికుఁడవు, మాకు న్యాయము దీర్పు చేయుము.' పిల్లి హీన స్వరమున ఇట్లనియె:— ' దూరముచే మీమాట చక్కఁగ వినఁబడదు, తపఃకృశుఁడను, దగ్గఱకు రండి. ధర్మము చక్కఁగా నిర్ణయింపనివానికి ఉభయలోకహాని కలుగును.' ఇట్లు పలికి నమ్మించి వానిని రెంటెని దగ్గఱకు రప్పించుకొని ఆపిల్లి

ఒక్కమారుగానే చంపివేసెను. ఇట్లు క్షుద్రుఁ డగు దుర్జాతి యందు విశ్వాస ముంపఁగూడదు, కనుక అతిదుర్జాతి యగు నీయులూకమును రాజును చేయఁదగదు.

వాయసము చేసిన యీ బోధనవలన పక్షు లన్నియు ఉలూకమున కభిషేకము మానినవి. 'ఇదిమొదలు మీరును మేమును అన్యోన్యశత్రువులము సుమా, మఱచిపోకుము.' అని ఉలూకము కోపముతో కాకిని బెదరించి వెడలిపోయెను. కాకి 'అయుక్తము పలికితిని గదా' అని దుఃఖిత మాయెను. మాట మాత్రముననే కలిగినవైరమునకు ఎవరు అనుతాపము పొందరు! ఈరీతిని మనకు గూబలకు వైరము వాక్పారుష్యము వలనఁ గలిగినది. కాక రాజుతో ఇట్లు చెప్ప చిరజీవి మరల పలికెను. ఉలూకములు అనేకములు, బలసమన్విత ములు. వానిని జయించుట మన కసాధ్యము.

## సంఘమి జయించును.

పలువురుసంఘము ఎప్పుడును జయింతురు. నిదర్శనము వినుము. ఒక బ్రాహ్మణుఁడు ఒకమేఁకను కొని బుజముమీఁద పెట్టుకొని గ్రామమునుండి తన నగరమునకు పోవు చుండెను. దారిలో ధూర్తు లనేకులు దానిని చూచి భక్షింపఁ గోరి, ఒకఁడు త్వర త్వరగా అతనికడకు వచ్చి 'అయ్యా బ్రాహ్మణా, ఏమి! భుజము మీఁద కుక్కను మోచుచున్నావు! క్రిందపాఱవేయవయ్యా!' అనెను. ఆ మాట విని లక్ష్యపెట్టక బ్రాహ్మణుఁడు పోవుచుండఁ

గామఱి యిరువురు అతనికి ముందుగా పోయి అతనితో అట్లు పలికిరి. అంత నతఁడు సందేహపడుచు మేఁకను చూచుకొనుచు పోవుచుండఁగా, మఱిముగ్గురు వచ్చి 'అయ్యా, ఏమి యజ్ఞోపవీతమును కుక్కను సమముగా మోచుచున్నావు, నిజముగా బోయవు గాని బ్రాహ్మణుఁడవు గావు, ఈకుక్కతో మృగములను వేఁట యాడుదువా?' అనిరి. ఆమాట కతఁడు 'నిశ్చయముగా ఏదో భూతము నన్నుపట్టి ఈరీతిని మోసపుచ్చుచున్నది. అందఱ కన్నులకును లేనిదే అగపడునా యేమి ?' అని తలంచి మేఁకను పాఱవైచి యింటికి పోయెను. ధూర్తులు దానిం గొని పోయి యథేచ్ఛముగా భక్షించిరి. ఈరీతిగా, దేవా, అనేకులు బలవంతులు దుర్జయు లగుదురు. కావున ఈబలవద్విరోధములో నేను చెప్పు నుపాయము చేయవలయును. నన్ను కొంచెము ఱెక్కలు చింపి ఈచెట్టుక్రింద వదలి, నేను కృతార్థుఁడనై వచ్చుదాఁక ఈకొండలోఁ దూఱి యుండుఁడు:— అంతట వాయసరాజు కోపము చేతనుంబోలె చిరజీవిని ఱెక్కలు చింపించి విడిచి తాను స్వానుచరులతో ఆకొండకుఁ బోయెను. చిరజీవి ఆచెట్టు క్రిందనే పడి యుండెను.

అంతలో నచటికి రాత్రి ఉలూకరాజు అవమర్దుఁడు వచ్చి అచట ఒక కాకి నయినను కానక అరయు చుండెను. దానిం గని చిరజీవి మెల్ల మెల్లగా చెట్టుక్రింద కూయసాగెను. ఆకూఁత విని అవమర్దుఁడు చెట్టు దిగి ' నీవెవరవు? ఏల యిట్లయి

తివి?' అని ఆశ్చర్యపడి యడుగ చిరజీవి నొప్పిచేతనుంబోలె అల్పస్వరమున ఇట్లనియె:— "అయ్యా, నేను వాయసరాజు మంత్రిని, నాపేరు చిరజీవి, అతఁడు మంత్రుల యనుమతిని నీపై దాడి వెడల యత్నించెను. నేను అతని కడను మంత్రులను బెదరించి అతనితో, 'దేవా, నీవు నన్ను ఆలోచన యడిగెద వేని, నా మాట నీకు పథ్యమేనియు, బలవంతుఁడగు కౌశికేంద్రునితో పోరు పెట్టుకొనకుము. నీతిమార్గమును పాటింతు వేని, అతనిని ఆశ్రయింపవలసినది.' అని బోధించితిని. ఆబోధనకు ఆ మూర్ఖుఁడు నన్ను శత్రుపక్షమువాఁడ నని తానును తన మిత్రులును ఈదశకు తెచ్చినాఁడు. నన్ను ఈచెట్టుక్రింద వైచి ఎక్కడికో అతఁడు అనుచరసమేతుఁడై పోయెను." ఇట్లు పలికి చిరజీవి తల వ్రాల్చి రోఁజుచుండెను. 'ఇతనికి మన మేమి చేయవలసినది ?' అని అవమర్దుఁడు తనమంత్రుల నడిగెను. వారిలో దీప్తనయనుఁ డనుమంత్రి పలికెను.

### అరక్షణీయుని ఉపకారిని రక్షింతురు.

రక్షణీయుఁడు గాని దొంగను కూడ ఉపకారి యేని సజ్జనులు రక్షింపుదురు. వర్తకుఁ డొకఁడు ముసలి అయ్యును ధనప్రభావముచే ఒక వణిక్కన్యను వివాహము చేసికొనెను. పుష్పకాలము గడచి పోయినపిమ్మట చెట్టునకు భ్రమరి వోలె ఆభార్య శయనమునందు ముసలివానికి నిత్యము పరాఙ్ముఖిగా నుండెను. ఒకనాఁడు రాత్రి దొంగ యొకఁడు వారు శయ్యా

గతులై యుండఁగా ఇల్లు సొచ్చెను. వానిం గని భయముచే ఆతరుణి మరలి పతిని కౌఁగిలించుకొనెను. ఆ యభ్యుదయమునకు ఆశ్చర్యపడి వృద్ధు వణిజుఁడు కారణ మరయుచు దిక్కులు చూడఁగా ఒకమూల చోరుఁ డగపడెను. 'నీవు నాకు ఉపకారివి, కనుక నాభృత్యులచే నిన్నుఁ గొట్టింపను.' అని పలికి వణిజుఁడు చోరుని పంపివేసెను. ఈ ప్రకారము మనకు ఉపకారి గావున ఈచిరజీవి రక్షణీయుఁడు.

ఇట్లు పలికి దీప్తనయనుఁడు విరమింపఁగా ఉలూకరాజు మఱియొకమంత్రిని వక్రనాసుని కర్తవ్యము చెప్పు మని యడిగెను. అతఁ డిట్లనియె.—ఇతఁడు మనకు రక్షణీయుఁడు. ఇతఁడు పరమర్మజ్ఞుఁడు. ఈమంత్రికిని ఇతనిస్వామికిని కలిగిన వైరము వలన మనకు శ్రేయస్సు కలుగును. నిదర్శనము వినుము.—

### చోరరాక్షసులు.

ఒకద్విజుఁడు రెండుగోవులను దానము పుచ్చుకొని తెచ్చి కట్టివేసికొనెను. వాని నపహరింప దొంగ యొకఁడు కోరెను. ఆసమయమందే రాక్షసుఁ డొకఁడు ఆబ్రాహ్మణుని భక్షింపఁ గోరెను. అందులకై రాత్రి ఆబ్రాహ్మణుని యింటికి పోవుచు చోరరాక్షసులు దారిలో కలసికొని ఒకరియుద్దేశ్యము నొకరికి చెప్పికొనిరి. అచట దొంగ 'నేను ముందుగా గోవులను హరించెదను. ముందు నీవు పట్టుకొందువేని ఈబ్రాహ్మణుఁడు మేలు

కొనును, అంతట గోవులను హరించుట నాకు శక్యము గానే రదు.' అని రాక్షసునితోఁ బలికెను. 'అట్లు కూడదు, నేనే ముందుగా బ్రాహ్మణుని హరించెదను. గోవుల గొరిజల చప్పుడు వలన అతఁడు మేలుకొనినఁ నా ప్రయాసము వ్యర్థ మగును.' అని రాక్షసుఁడు చెప్పెను. ఇట్లు వారు కలహించుటవలన ఆబ్రాహ్మణుఁడు మేల్కాని కత్తిచేతఁ బూని రక్షోఘ్న మంత్రములు జపింప సాగెను. అంతట దొంగయు రాక్షసుఁడును ఇరువురును పలాయితు లైరి. వారిభేదము ఎట్లు ద్విజునికి హిత మైనదో, అట్లే కాకేంద్ర చిరజీవుల భేదము మనకు హిత మగును.

అంతట అవమర్దుఁడు ప్రాకారకర్ణుఁ డను మంత్రిని ఆలోచన యడిగెను. అతఁ డిట్లనియె:—'శరణాగతుఁడు ఈచిరజీవి ఆపన్నుఁడు. ఇతనిపై జాలి వహింపవలసినది. శరణాగత రక్షణార్థము పూర్వము శిబి తనమాంసము నిచ్చి వేసెను.' అంతట ఉలూకరాజు క్రూరలోచనుఁ డను మంత్రిని అడిగెను.—అతఁడును అట్లే పలికెను. అంతట కౌశికరాజు రక్తాక్షుఁ డను మంత్రి నడిగెను. ఆ ప్రాజ్ఞుఁ డిట్లుఁ వచించెను.—

రాజా, దుర్నయముచేత ఈమంత్రులు నిన్ను నాశము చేసినారు. నీతిజ్ఞులు అపరాధి యైన వైరిని ఎప్పుడును నమ్మరు. మూర్ఖుఁడు పరునిదోషము నెఱింగియు నాలి బుజ్జనములచే తుష్టి నొందును.

## వడ్రంగియు వాని శిష్యుడు.

పూర్వము వడ్లంగియొకఁడు తన ప్రియభార్యను లోకుల వలన అన్యపురుషాసక్తనుగా విని నిజ మెఱుఁగఁగోరి దానితో ఒకనాఁడు 'ప్రేయసీ, నేను రాజాజ్ఞచే దూరదేశము నావ్యాపారముమీఁద పోయెదను. నాకు దారికి సామగ్రి కట్టి యిమ్ము.' అని యడిగెను. అదియు బత్తెము కట్టి యీయఁగా అతఁడు ఇల్లు వెడలి శిష్యుని తోడ్కొని మరల ఇంటికి వచ్చి అదృష్టుఁడై మంచముక్రింద శిష్యునితోఁగూడ దాఁగి యుండెను. ఇంతలో అదియును బోయి తన ప్రియుని పరపురుషుని తోడ్కొని వచ్చెను. వానితో మంచమందు క్రీడించుచు ఆపాపాత్మురాలు తన పాదము మగనికి తగులఁగా క్రింద మగఁ డున్నాఁడని తెలిసికొని ఆక్షణములో వ్యాకుల యాయెను. అంత ఆదుశ్చారిణిని ఉపపతి 'ప్రాణేశ్వరీ, చెప్పుము. నీకు నేను ప్రియుఁడనా నీపతి ప్రియుఁడా?' అని యడిగెను. కపటకుశల యాజారిణి 'నాకు మగఁడే ప్రియుఁడు, అతనికొఱకు నేను ప్రాణము నైన ఇచ్చివేసెదను. ఇది స్త్రీలకు సహజచాపల్యము ఇందుల కేమి చేయఁగలము?' అని పలికెను. భార్య పల్కిన యీకపటవచనములను విని తుష్టుఁడైన వడ్లంగి శిష్యసమేతముగా మంచము క్రిందినుండి వెలువడి 'చూచితివి గదా, నీవు సాక్షివి, ఇది నాయందు ఇంత భక్తురాలు. దీనిని దీని యీకాంతునితోఁగూడ నెత్తిని పెట్టుకొని మోసెదను.' అని చెప్పి శిష్యుఁ

డొకవైపు తా నొక్కవైపు మంచము నెత్తి నెత్తిని బెట్టుకొని ఆ జడుఁడు వారి నూరేఁగించెను. ఈప్రకారము దోషము ప్రత్యక్షదృష్ట మైనను మూర్ఖుఁడు కపటసాంత్వనమువలన సంతోషించి పరిహాసాస్పద మగును. కావున శత్రుపరిగ్రహ మయిన యీచిరజీవిని నీవు రక్షింపఁ గూడదు, వీనిని ఉపేక్షించినను గూడ రోగమువలె శీఘ్రముగా వీఁడు చంపును.

ఇట్లు రక్తాక్షునివచనము విని కౌశికరాజు 'పాపము! మనకు హితము చేసి యీయవస్థను పొందినాఁడు! ఇట్టివాఁడు రక్షణీయుఁ డేల గాఁడు! ఏకాకి యితఁడు మన కేమి కీడు చేయఁ గలఁడు?' అని ఆమంత్రి వచనములను తిరస్కరించి కాకిని చిరజీవిని ఓదార్చెను. అంతట చిరజీవి ఉలూకరాజుతో చెప్పుకొనెను. "ఈదురవస్థతో నేను జీవించి యేమి ప్రయోజనము? నాకొఱకు కట్టియలు తెప్పింపుము, నేను అగ్ని ప్రవేశము చేసెదను. ఆవాయసరాజుమీఁద పగను దీర్చుకొనుటకై ఉలూకజన్మము నా కొసంగు మని అగ్నిదేవుని నేను వర మడిగెదను.'

అందులకు రక్తాక్షుఁడు నవ్వుచు నిట్లనియె:—మాప్రభువు యొక్క ప్రసాదమువలన నీవు స్వస్థుఁడవే, ఇఁక ని ప్పేల, నీకు కాకితన మున్నంతకాలము గ్రుడ్లగూబతనము రాదు. బ్రహ్మ ఎవని ఎట్టివానినిగా సృజించెనో, వాఁడు అట్టివాఁడుగానే యుండును. అందులకు నిదర్శనము వినుము.

## ఎలుకపిల్లయు మునియు.

ఒకముని డేగకాళ్లనుండి పడిన యెలుకపిల్లను కృపచే తపోబలముచే మనుష్యకన్యగా చేసి ఆశ్రమములో పెంచెను. ఆపిల్లకు యౌవనము రాఁగానే ముని దానిని బలవంతుని కియ్యఁగోరి సూర్యుని పిలిచి 'నేను ఈకన్యను బలవంతుని కీఁదలంచితిని. నీవు దీనిని వివాహమాడుము' అనెను. సూర్యుఁడు 'నాకన్న మేఘుఁడు బలవంతుఁడు, అతఁడు నన్ను క్షణములో కప్పును.' అనెను. ఆయుత్తరము విని ముని సూర్యుని పొమ్మని మేఘుని పిలిచి అట్లే పిల్లను వివాహ మాడు మనెను. మేఘుఁడును అట్లే 'నాకన్న వాయువు బలవంతుఁడు, నన్ను దిక్కులకు విసరివేయును.' అనెను. అంతట ముని వాయువును పిలిచి అడిగెను. అతఁడును అట్లే 'అయ్యా, నాకన్న బల్లిదములు కొండలు, నేను వానిని కదలింపలేను.' అనెను. విని మునిసత్తముఁడు ఒక కొండలరాయని పిలిచి పిల్లను పెండ్లిచేసికొమ్మనఁగా, 'అయ్యా, నాకన్నను ఎలుకలు బలవంతములు, అవి నాదేహ మెల్ల రంధ్రములు చేయుచున్నవి' అని కొండ చెప్పెను. ఇట్లు క్రమముగా జ్ఞానప్రభావముగల యాదేవతలచే ఉత్తరము పొంది యాముని అడవినుండి ఒకయెలుకను పిలిచి ఆపిల్లను పెండ్లిచేసికొమ్మనఁగా 'ఈకన్య నా కలుగులో ఎట్లు ప్రవేశించును?' అని యెలుక యడిగెను. 'మునుపటివలె ఇది ఎలుకయే యగునుగాక' అని ముని దానిని మరల ఎలుకనుగా

మార్చి ఆయొలుకకు ఇచ్చి వేసెను. ఇట్లు ఎంతదూరము పోయి నను ఎవఁడు ఎట్టివాఁడో వాఁడు అట్టివాఁడుగానే యుండును, కనుక చిరజీవీ, నీవును ఎన్నఁటికిని గ్రుడ్లగూబవు కానేరవు.

రక్తాక్షుని యామాట విని చిరజీవి, 'నీతిజ్ఞుఁ డయిన యితనిమాటను ఈ రాజు పాటి చేయ లేదు. కడమ వీ రెల్ల మూర్ఖులే, కనుక నాకార్యము సిద్ధమే.' అని తలపోయుచుండఁగా, దానిని తోడ్కొని రక్తాక్షువాక్యమును లక్ష్యపెట్టక బల గర్వితుఁడు ఉలూకరాజు తనతావునకుఁ బోయెను. చిరజీవియు అవమర్దునికి పార్శ్వస్థుఁ డయి అతఁడు పెట్టిన మాంసాది భోజనములచే త్వరలో ఱెక్కలు చక్కఁగా మొలచి బలిసి నెమలివలె నాయెను.

ఒకనాఁడు చిరజీవి ఉలూకరాజుతో 'దేవా, నేను పోయి కాకరాజును ఓదార్చి తనచోటికి తెచ్చెదను, తరువాత రాత్రి మీరు పోయి అతనిని కొట్టి వేసి రావచ్చును. నేనును నీప్రసాదమునకు అనృణుఁడ నయ్యెదను. మీరు గడ్డి మొదలగు సాధనములచేత ద్వారమును గప్పి గూండ్లలో పగలు అతఁడు వచ్చి మీఁద పడకుండ రక్షితులై సుఖముగా నుండుఁడు.' అని బోధించి, గ్రుడ్లగూబల గుహాద్వారమును తృణపర్ణాదికములచే కప్పించి, తన దొరకడకుఁ బోయి, అతనిం దోడ్కొని తానును ఇతర కాకములును మండుచున్న కొఱవులు తల కొకటి నోటఁ గఱచుకొని, ఆగుహయొద్దకు వచ్చి, దివాంధము లయిన యా

గ్రుడ్లగూబల గుహాద్వారమును ఆ నిప్పుతో తగులఁబెట్టెను. ఒక్కొక్క కాకియు మండు చున్నట్టి కొఱవి నొకటిని ఆద్వారమున పెట్టెను. ఇట్లు చిరజీవి ఉలూకములను రాజుతోఁగూడ నిశ్శేషముగా తగులఁబెట్టివేసి, తమవారి నందఱం దోడ్కొని మునుపటిమఱ్ఱిచెట్టుకడకు పోయెను. అచట శత్రువులనడుమ తాను నివసించిన వృత్తాంతము చెప్పి తన దొరను మేఘవర్ణుని సంతోషపెట్టి మరల నిట్లనియె:—

దేవా, నీశత్రువునకు మంచి మంత్రి ఒకఁడే రక్తాక్షుఁడు కలఁడు. వానిమాట లక్ష్యపెట్టక అతఁడు మదాంధుఁడై నన్ను ఉపేక్షించినాఁడు. అతని మాటను అకారణముగా తలఁచి ఆ మూర్ఖుఁడు లక్ష్యపెట్టనందువలన నేను వానిని నమ్మించి వంచించితిని. వ్యాజముగా అనువర్తించి మండూకములను సర్పము వంచించిన విధముగా నేనును చేసితిని.

### ముసలిపామును కప్పలును.

ఒక ముసలిపాము కప్పలను సుఖముగా సంపాదించుటకై ఒక సరస్తీరమున నిశ్చలముగా నుండెను. అట్లున్న యాసర్పమును దూరమునుండియే కప్పలు 'అయ్యా మమ్ము మునుపటివలె తినవేమి యిప్పుడు?' అని యడిగెను. 'నేను ఒక కప్పను తలుచుకొని పోవుచు పొరఁబాటుచే ఒక బ్రాహ్మణ పుత్త్రుని కాలిబొట్టన వ్రేలిని కఱచితిని; అతఁడు నన్ను కప్పలకు వాహనమగునట్లుగా శాపము పెట్టెను. కనుక ఇఁక నేను మిమ్ము ఎట్లు

భక్షింతును? మీకు వాహన మగుదును.' అని పాము నుడివెను. కప్పరాజు వాహనోత్సుకుఁడై సచివసమేతుఁడై నీటినుండి నిర్భయముగా వెలువడి వచ్చి పామువీఁపుపై సంతోషముతో స్వారి చేసెను. అతనిని మంత్రిసమేతముగా కొంతసేపు మోసి బడలి పాము 'దేవా, ఆహారము లేమిచే నిఁక నేను తిరుగఁజాల కున్నాను, కావున నాకు ఆహారము పెట్టుము; జీతము లేక భృత్యుఁడు ఎట్లు పని చేయును? అనెను. ఆమాట విని భేక రాజు వాహనప్రియుఁడు 'నాపరిజనములలో కొందఱను భక్షింపుము.' అనెను. అంతట పాము క్రమముగా స్వేచ్ఛముగా కప్పలను కాఁజేసివేసెను. భేకపతియు వాహనాభిమానాంధతచే అందులకు సహించి యుండెను. కడపట పాము భేకరాజును కూడ భక్షించెను.

ఈరీతిగా ప్రాజ్ఞుఁడు మధ్యలో ప్రవేశించి మూర్ఖుని వంచించును. నేను నిట్లు ప్రవేశించి ఆమూర్ఖుని నాశము చేసితిని. కనుక రాజు నీతివేత్త గాఁవలయును. మూర్ఖుని యథేచ్ఛముగా భృత్యులు భక్షింతురు, శత్రువులు నాశనము చేయుదురు, సిరి ద్యూతలీలవలె వ్యాజసమన్విత, నీటియలవలె చంచల, సురవలె మైకము కలుగఁజేయునది. ఆమె ధీరుఁడును మంచి మంత్రాంగము కలవాఁడును వ్యసనవిహీనుఁడును విశేషజ్ఞుఁడును అగు రాజునొద్ద త్రాటఁ గట్టఁబడినదియుం బోలె నిలుకడగా నుండును. నీవు బుద్ధిమంతుఁడవు, విద్వద్వచనముప్రకారము

నడచుకొనుచు శత్రునాశము చేసితివి, ఇఁక నీరాజ్యమును ని ష్కంటకముగా నేలుచుండుము.

ఇట్లు చిరజీవి పలుకఁగా మేఘవర్ణుఁడు అతనిని సమ్మానించి, అట్లే సుఖముగా చక్కఁగా రాజ్యము సేయుచుండెను. ఇట్లు పలికి గోముఖుఁడు వత్సరాజపుత్త్రునితో మరల ననియెను. ఈరీతిగా, దేవా, తిర్యగ్జంతువులు గూడ ప్రజ్ఞచే రాజ్యాధికారమును అనుభవించును. ప్రజ్ఞాహీనులు సదా లోకోపహాసితులై నశించిపోవుదురు.

## మూఢుఁడైన భృత్యుఁడు.

ఒక ధనికునియొద్ద జడుఁడు భృత్యుఁడొకఁడుండెను. వాఁడు తనచేతఁగాకపోయినను మాంద్యబలముచే చేత నగునని దొరకు స్వీకార మిచ్చి అతనిచర్మము పగులఁజేసెను. అంత నాస్వామి వానిని తలుమఁగొట్టెను. వాఁడును జీవనము లేక శ్రమపడెను. చేతఁగాక బలాత్కారముగా చేయు ప్రజ్ఞమాని చెడిపోవును.

## అన్నదమ్ములు వేఱులు పోవుట.

మాళవదేశములో ఇద్దఱు అన్నదమ్ములు బ్రాహ్మణపుత్త్రులు ఉండిరి. వారికి అవిభక్తము పిత్ర్యధన ముండెను. పంపకములో వారిరువురును ఎక్కువతక్కువభేదములచే కలహించి, ఛాందసుఁడగు తమయుపాధ్యాయుని మధ్యవర్తిని చేసికొనఁగా అతఁడు ప్రతివస్తువును రెండుసమభాగములుగా పగులఁగొట్టె

చెఱిరియొక భాగము పుచ్చుకొం డనియు, అట్లు చేసిన ఎక్కువ తక్కువల కలహ ముండ దనియు చెప్పెను. అంతట వారు ఆప్రకారమే ఇల్లు పడుక మంచము మొదలగు సకలవస్తువులను పశువులను కూడ ఒక్కొక్క దానిని సమ మైన రెండు తుండె ములుగా చేసి పంచుకొనిరి. వారికి ఒకదాసి యుండెను. దానిని కూడ సమ మయిన రెండుతుండెములు చేసి చెఱి యొక తుండెము పుచ్చుకొనిరి. ఈవృత్తాంతము తెలిసి రాజు వారికి దండనగా వారి సర్వధనమును హరించెను. మూర్ఖులు మూర్ఖోప దేశము విని ఇహపరములకుఁ గాక చెడుదురు. కావున తెలివి గలవాఁడు మూర్ఖులతోఁ జేరఁగూడదు, పండితులసాంగత్య మును సంపాదించుకొన వలసినది.

## అసంతుష్టి చెఱుపు.

అసంతుష్టియు చెఱుపే, ఇందులకు కథవినుము. భిక్షచే సంతుష్టు లై బలిసిన ప్రవ్రాజకులు కొందఱు ఉండిరి. వారిని చూచి కొందఱు తమలో 'ఆహా! ఈ ప్రవ్రాజకులు భిక్షాశను లయినను బలిసియున్నారు?' అని చెప్పుకొనిరి. వారిలో నొకఁడు ఆమిత్రులతో 'చూడుఁడు యథాశ్ప్రకారము లోప మేమియు లేకయే వీరు భోజనము సేయుచున్నను కృశించునట్లు నేను చేసెదను.' అని ప్రతిజ్ఞ చేసి ఆప్రవ్రాజకులను ఒకనాఁడు తనయింటికి భోజనమునకు పిలిచి వారికి ఉత్తమమైన షడ్ర సాహారము పెట్టెను. ఆమూర్ఖులు అది మొదలుకొని ఆ

భోజనముయొక్క ఆస్వాదమును స్మరింపుచు భైక్షభోజనముచే యథాపూర్వముగా ప్రీతి నొందక కృశించిరి. అంత నతఁడు వారిని తనమిత్రులకు చూపి మిత్రులయెదుట వారి నడిగి యిట్లనియె:— పూర్వము వీరు భైక్షముచే సంతుష్టులై హృష్టపుష్టులై యుండిరి, ఇప్పుడు అసంతోష దోషముచేత చిక్కి దుర్బలులైనారు. కావున బుద్ధిమంతుఁడు సుఖార్థియై సంతుష్టితో నుండవలయును. అసంతుష్టి ఇహపర సుఖ భంజకము. ఇట్లు మిత్రుఁడు ఉపదేశింపఁగా ఆయితరులు అసంతుష్టి దోషమును త్యజించి సుఖముగా నుండిరి. సత్సంగమువలన ఎవరికి మేలు కలుగదు?

## సువర్ణముగ్ధుఁడు.

దేవా, సువర్ణముగ్ధునికథను వినుము. ఒకపడుచువాఁడు నీళ్లు త్రాగుటకు తటాకమునకుఁ బోయెను. ఆమూఢుఁడు చెట్టుమీదనున్న పైఁడితల యను పక్షియొక్కతలను బంగారువన్నె దానిని నీటిలో ప్రతిబింబింపం గని, బంగార మని తలఁచి దానిని గ్రహించుటకై నీటిలో ప్రవేశించెను, గాని అది జలము కదలఁగానే అగపడక పోయినది, చేతికి దొరకదాయెను. అది ఉండిన చోటు చక్కఁగా నిశ్చయించుకొనుటకై మరల మరల గట్టెక్కి ఆమూర్ఖుఁడు మరలమరల నీటిలో దిగి వెదకుచుండెను. ఎన్ని మార్లు అట్లు చేసినను అది దొరకదాయెను. ఇట్లుండఁగా వానితండ్రి అచటికి వచ్చి చూచి అడిగి తెలిసి నీటిలోని యా

ప్రతిబింబమును గని చెట్టుమీఁది పక్షిని ఎగురఁగొట్టి వానికి దానిస్వరూపమును బోధించి యింటికిఁ గొనిపోయెను. విమర్శ లేని మూర్ఖులు ఇట్లు అజ్ఞానముచే భ్రాంతు లగుదురు, ఇతరు లకు అపహాసమును స్వజనులకు శోకమును కలిగింతురు.

## మ హా మూ ర్ఖ లు.

మఱియొక మహామూర్ఖ వృత్తాంతమును వినుము. ఒక వర్తకుఁడు సరకుతో పయనము చేయుచుండఁగా దారిలో వానిలొట్టియ బరువు మోయలేక చదికిలఁబడెను. అతఁడు భృత్యులతో 'నేను పోయి మఱి యొక లొట్టియను కొని తెచ్చెదను, దీనిమీఁది సరకు సగము దానిమీఁద నెక్కించెదను. ఈ లోపల వర్షము వచ్చెనా, ఈ వస్త్రముల పెట్టెలమీఁద తోలు తడియకుండునట్లు మీరు జాగ్రత్త పుచ్చుకొన వలయును.' అని యాజ్ఞాపించి పోయెను. పిమ్మట ఆకస్మికముగా గొప్ప వాన వచ్చెను 'పెట్టెలతోలు నీటిచే తడియకుండ జాగ్రత్త పెట్ట వలసిన దని గదా మనదొర ఆజ్ఞాపించెను.' అని యా భృతులు మూర్ఖులు ఆలోచించి పెట్టెలలోని వస్త్రములను తీసి పెట్టెలమీఁద గప్పిరి. అందువలన వస్త్రము లన్నియుఁ దడిసి చెడిపోయినవి. అతఁడు వచ్చి 'ఓరి పాపాత్ములారా, ఏమి! వస్త్రముల నన్నిటిని నాన్చి నాశము చేసితిరి!' అని కోపించి యడుగఁగా వారు 'నీవే పెట్టెలతోలు దడియనీయ వల దని మాకు ఆజ్ఞాపించితివి, మేము అట్లే చేసితిమి, మాయందు

త ప్పేమి?' అని ఉత్తరము చెప్పిరి. 'తోలు తడిసిన వస్త్రములు చెడు నని వస్త్రరక్షణార్థము నేను చెప్పితిని గాని చర్మరక్షార్థము నేను చెప్ప లేదు.' అని పల్కి వర్తకుఁడు రెండవ లొట్టియ మీఁద సర కెక్కించి తరలి స్వగృహము చేరి ఆభృత్యులను సర్వస్వమును హరించి తఱిమివేసెను. ఈ ప్రకారము మూర్ఖులు తాత్పర్య మెఱుఁగక విపరీతము చేసి తమకార్యమును ఇతరుల కార్యమునుం గూడ నాశము చేయుదురు.

## అపూపికాముగ్ధుఁడు.

అపూపికాముగ్ధుని కథను వినుము. ఒకబాటసారి ఒక పణమునకు ఎనిమిది యపూపములను కొని ఒక టొకటిగా ఆఱు భక్షించెను. అప్పటికిని వానికి ఆఁకిలి తీఱలేదు. ఏడవ యపూపము తినఁగానే తృప్తి యాయెను. అంత నా మూర్ఖుఁడు 'అయ్యో, చెడితిని, ఈయపూపమునే మొదల నేల తిన నైతిని? వృథాగా కడమవాని నెల్ల ఏల నాశముచేసితిని? వానిని అట్లే చేత ఏల ఉంచుకొననైతిని?' అని ఏడువ సాగెను. ఆ వృత్తాంతము నెఱింగి ఎల్లవారును వానిని పరిహసించిరి.

ఒక మూర్ఖభృత్యుని వానిదొర వణిజుఁడు 'ఓరీ అంగడి ద్వారమును రక్షించుచుండుము, రవంతసేపు లోపలికి పోయి వచ్చెదను.' అని నియమించి పోయెను. వెంటనే భృత్యుఁడు ద్వారబంధమును అంగడినుండి పెకలించి భుజముమీఁద పెట్టు కొని నాట్యము చూడఁ బోయెను. వణిజుఁడు వచ్చి చూచి 'ఏమి

రా, యిట్లు చేసితివి?' అని యదలింపఁగా వాఁడు 'ఇదిగో నీవు చెప్పినట్లు ద్వారమును నేను కాపాడితిని, చూచుకొమ్ము.' అనెను. ఇట్లు శబ్దమాత్రపరులై తాత్పర్య మెఱుఁగని మను ష్యులు అనర్థము కలిగింతురు.

## మ హి ష ము గ్ధు ( డు.

మహిషముగ్ధుని కథను వినుము. ఒకని మహిషమును కొందఱు గ్రామ్యులు ఊరివెలుపలికి తోలుకొని పోయి బోయ గూడెములో మఱ్ఱిక్రింద చంపి భక్షించిరి. అంతట మహిష స్వామి పోయి రాజుతో చెప్పుకొనఁగా రాజు ఆగ్రామ్యులను మహిష భక్షకులను పిలిపించెను. వారి యెదుట మహిష స్వామి 'దేవా, వీరు చెఱువుగట్టున మఱ్ఱిచెట్టుక్రింద నేను చూచుచుండఁగా నామహిషమును చంపి భక్షించిరి.' అని తె లుపుకొనెను. దానిని విని వారిలో వృద్ధమూర్ఖుఁ డొకఁడు 'దేవా, మాగ్రామములో చెఱువే లేదు, మఱ్ఱిచెట్టే లేదు. వీఁడు అబద్ధములు చెప్పుచున్నాఁడు, వీని మహిషమును ఎక్కడ చంపినారు, ఎప్పుడు భక్షించినారు?' అని పలికెను. దానిని విని మహిషస్వామి 'ఏమీ, మీగ్రామమునకు తూర్పున తటా కము లేదా, దానిగట్టున మఱ్ఱిచెట్టు లేదా? మీరు నామహి షమును అష్టమినాఁడు భక్షించితిరి.' అని ఆక్షేపించెను. అంత నావృద్ధమూర్ఖుఁడు 'మా గ్రామములో అష్టమియే లేదు, తూ ర్పుదిక్కే లేనే లేదు.' అని యుత్తర మిచ్చెను. ఈమాట విని

రాజు ఆజడుని ఉత్సాహపెట్టుచు 'అవునోయి, నీవు సత్యవాదివి, అసత్యము చెప్పవు. కనుక నాతో నిజముచెప్పుము. మీరు ఆమహిషమును భక్షించితిరా లేదా ?' అని యడిగెను. అంత నాజడుఁడు పలికెను:— 'నేను తండ్రి చనిపోయిన మూఁడు సంవత్సరములకు పుట్టితిని, నాకు మాటనేర్పు తండ్రియే నేర్పినాఁడు. కావున, ఓ మహారాజా, నే నెప్పుడును అసత్యము పలుకను, మేము ఈమహిషమును భక్షించితిమి. ఇతఁడు చెప్పినట్టి కడమయెల్లను అసత్యము.' విని రాజు అనుచరులతోఁగూడ నవ్వు పట్టలేక నవ్వి మహిషస్వామికి గ్రామ్యులచేత మహిషము నిప్పించి వారిని దండించెను. ఇట్లు మూర్ఖులు తమమాటయందు నమ్మకము పుట్టించుటకై దాఁపరాని దానిని దాఁపుదురు, దాఁపవలసిన దానిని ప్రకటింతురు.

ఒకానొక దరిద్రునితో మూర్ఖురాలు వానిభార్య చండి 'నేను తెల్లవాఱఁగానే మా పుట్టినింటికిఁ బోయెదను, ఉత్సవమునకు నన్ను పిలిచినారు. నీవు నా కొఱకు కలువదండను ఎట్లులైనను తెచ్చి యీయవేని ఇఁక నేను భార్యనుగాను, నీవు భర్తవు గావు.' అనెను. అంత నతఁడు రాజుగారి చెఱువునకు పోయి అందుఁ జొచ్చి కలువలను కోయుచుండెను. కావలివారు 'ఎవ రక్కడ?' అని యదలింపఁగా, 'చక్రవాకుఁడను.' అని వాఁడు ఉత్తరము చెప్పెను. వారు వానిని పట్టి కావలిలో నుంచి తెల్లవాఱఁగానే తేని యెదుటికి కొనిపోయి అడిగిరి.

అచట వాఁడు చక్రవాకమువలె కూయసాగెను. రాజు వానిని స్వయముగా మంచిమాటగా అడుగఁగా ఆ మూర్ఖుఁడు నిజవృత్తాంతమును చెప్పెను. రాజు కనికరించి విడిచిపెట్టెను.

## వైద్యుఁడు, మఱుగుజ్జు.

ఒక బ్రాహ్మణునికి మఱుగుజ్జువాఁడు కుమారుఁ డొకఁడుండెను. ఆయన వైద్యు నొకని మూర్ఖుని పిలిచి తనకుమారుని గూనును లోపలికి త్రోసివేయు మని యడిగెను. 'నాకు పదిపణములు ఇమ్ము, దీనిని సాధింపలేనేని పది రెట్లు నీ కిచ్చెదను.' అని వైద్యుఁడు ప్రతిజ్ఞ చేసెను. అనంతరము పదిపణములు బ్రాహ్మణునివలన పుచ్చుకొని వైద్యుఁడు ఆపిల్లవానిని స్వేదనాది వైద్యక్రియలచేత మిక్కిలి గాసిపెట్టెను. ఏమి చేసినను వంపు తీఱదాయెను. అంతట వైద్యుఁడు పదిరెట్ల ధనమును బ్రాహ్మణుని కిచ్చివేసెను. గూను తీర్చుట ఎవనితరము ? ఈరీతిగా అసాధ్యకృత్యమును సాధింపఁబూనువారు పరిహాసమును పొందుదురు. ఇట్టి మూఢమానవులతో బుద్ధిమంతుఁడు సహవాసము చేయఁగూడదు.

ఇట్లు గోముఖ సచివునివలన రాత్రి కథలను విని నరవాహనదత్తుఁడు సంతోషించి శక్తియశస్సముత్సుకుఁడైనను తత్కథావినోదముచేత మిత్రసమేతముగా నిద్రాభిముఖుఁడై శయనీయము భజించెను.

## ౭-వ తరంగము.

---

పిమ్మట తెల్లవాఱఁగానే మేల్కొని నరవాహనదత్తుఁడు ప్రియతమను శక్తియశను ధ్యానించుచు వ్యాకులుఁడై యుండెను. ఆమెతోడి వివాహమునకు ఏర్పడి యున్న నెలగడువులో శేషించిన దినములను యుగసమానముగా భావించుచు మిగుల క్లేశపడుచుండెను. ఆవిషయమును గోముఖునివలన విని వత్సరాజు పుత్త్రస్నేహముచే తన మంత్రులను వసంతకసమేతముగా నరవాహనదత్తుని యొద్దకు అతని వినోదముకై పంపెను. వారి యందలి గౌరవముచే నరవాహనదత్తుఁడు కొంచెము ధైర్యము తెచ్చుకొని యుండఁగా బుద్ధిమంతుఁడు గోముఖమంత్రి వసంతకుని యువరాజుమనస్సునకు తుష్టి యగునట్లుగా మంచి క్రొత్త కథను చెప్పు మనెను. వసంతకుఁడు కథ చెప్ప నారంభించెను.

### యశోధరలక్ష్మీధరుల కథ.

మాళవదేశములో శ్రీధరుఁ డని ప్రసిద్ధుఁడు బ్రాహ్మణోత్తముఁ డుండెను. ఆయనకు ఇద్దఱు కవలవాండ్రు పుట్టిరి. పెద్దవాని పేరు యశోధరుఁడు, చిన్నవానిపేరు లక్ష్మీధరుఁడు. ఆయిరువురును యౌవనవంతులై విద్యాగ్రహణార్థము తండ్రియనుజ్ఞ వడసి కలసి దేశాంతరము పోవుచుండిరి. క్రమముగా దారి నడచుచు వారు నీరు గాని చెట్టునీడ గాని లేక సర్వము కాలు

చున్న యిసుకయెడారిలో ప్రవేశించిరి. అందు నడచుచు ఎండ చేతను దప్పిచేతను బడలి, వారు సాయంకాలమున ఫలచ్ఛాయా సమృద్ధ మైన యొకచెట్టును గనిరి. దానిమూలమునకు కొంచెము ఎడగా నొకబావి చల్లని తేట నీటితోను నెత్తావులు వెదచల్లు తామరలతోను కన్నుల పండువుగా నుండెను. అందు స్నాన మాడి ఆహారముగొని చల్లనిజలము త్రావి సుఖముగా రాతిబల్ల మీఁద క్షణము విశ్రమించిరి. ఇంతలో సూర్యుఁడు అస్తమిం పఁగా నిరువురును సంధ్యావందనము చేసికొని జంతుభయముచే ఆరేయి గడపుటకు ఆచెట్టెక్కిరి. రాత్రిముఖమున వారు సూచు చుండఁగా ఆవాపీజలమునుండి అనేకులు పురుషులు వెడలి వచ్చిరి. వారిలో నొకఁడు నేలను తుడిచెను, ఒకఁడు అలికెను, మఱియొకఁడు ఐదువన్నెల పువ్వులను చల్లెను. ఒకఁడు బంగా రపు మంచమును తెచ్చి అచట వ్రాల్చెను. మఱి యొకఁడు దానిమీఁద హంసతూలికాతల్పమును పఱచి దానిపై దుప్పట్లు గప్పెను. కొందఱు ఉత్తమమైన పువ్వులు మైపూఁతలు పానము బోనమును తెచ్చి చెట్టుక్రింద నొకచోటఁ బెట్టిరి. అంతట దిగ్గియ నుండి మదనునికంటె అందగాఁ డొకపురుషుఁడు కత్తి దాల్చిన వాఁడు దివ్యాభరణభూషితుఁడు వెడలి వచ్చెను. అతఁడు అచట ఆసనమునఁ గూర్చుండఁగానే అతనిని మాల్యానులేపనముల నలంకరించి ఆపురుషు లెల్ల బావిలో మునిఁగి అదృశ్యు లైరి.

ఆ పురుషుఁడు తన నోటినుండి వినీతవేష నొకచెలువను మంగళ మాల్యాభరణశోభితను వెడలఁ గ్రక్కెను. మఱియొక తెను మహారూపశాలినిని మంచి వస్త్రాభరణములచే వెలుఁ గొందుచున్న దానిని అట్లే క్రక్కెను. ఆయిరువురును అతని భార్యలు. అందు రెండవదానిమీఁద అతనికి మక్కువ ఎక్కువ. మొదటిభార్య రెండురత్నపాత్రములు పెట్టి రెండింటిలోను భర్త కును సవతికిని అన్నపానములు వడ్డించెను. వారు భుజించినపిమ్మట తాను భుజించెను. అంతట భర్త రెండవభార్యతో శయనము భజించి క్రీడాసుఖ మనుభవించి నిద్రపోయెను. మొదటిభార్య అతనికి పాదములు ఒత్తుచుండెను. రెండవది ప్రేయసి సెజ్జలో నిద్ర లేకయే పడుండెను. విప్రకుమారులు దీని నెల్లఁ గని చెట్టు నందు తమలో 'ఇతఁ డెవరో, పోయి ఇతని పాదము లొత్తు నీవనిత నడుగుదము, వీ రెల్ల యోగ్యులుగా నగపడుచున్నా రు.' అని పలికికొని చెట్టు దిగి అతని పెద్దభార్యయొద్దకు పోయిరి. అంతలో, రెండవది యశోధరుని సుందరుని చూచి తనభర్త నిద్రించు చుండుట యెఱిఁగి, శయనమునుండి లేచి, ఆవిప్రకు మారుని తన్నుంగవయు మని పిలిచెను. 'పాపాత్మురాలా, నీవు పరభార్యవు, నేను పరపురుషుఁడను, ఏమి యిట్లు పలికెదవు?' అని యతఁ డడుగఁగా 'నీవంటివారిని నూర్గురను నేను పొంది యున్నాను, నమ్మవేని ఈ నూ ఱుంగరములు చూడు. ఒక్కొ క్కయుంగరము ఒక్కొక్కనివలన నేను గ్రహించితిని.' అని

పలికి ఆమె తన చీరచెఱంగున ముడిచియున్న నూఱు ఉంగరము లను చూపెను. యశోధరుఁడు 'నీవు నూర్గురను కలయుదువు గాక, లక్షమందిని కలయుదువు గాక, నాకు మాత్రము నీవు తల్లివి.' అని నిరాకరించెను.

అంత నాశత ఏడ్చుచు పతిని లేపి యశోధరుని చూపి 'నీవు నిద్రించుచుండుఁడు, ఈపాపాత్ముఁడు నన్ను ధ్వంసము చేసి నాఁడు.' అని మొఱపెట్టెను. అది విని పతి కత్తి దూసి యశో ధరునిమీఁదికి పెడలెను. అంతట పెద్దభార్య పతివ్రత భర్త పాదముల వ్రాలి 'ఆర్యపుత్త్రా, వృథాగా పాపము గట్టుకొనకుము, నామాట వినుము. ఈపాపాత్మురాలు ఇతనిం గని నీ పార్శ్వమునుండి లేచి ఇతనిని బలవంతముగా వేఁడినది. ఈ సాధువు అంగీకరింపలేదు. 'నీవు నాతల్లివి' అని యితఁడు నిరా కరించినందున ఇది ఈసుచే ఇతనిని చంపించుటకై నిన్ను మేలు కొలిపినది. ఇది నాకన్నులయెదుట ప్రతిరాత్రియు ఈ చెట్టున నున్నవారిని నూర్గురను పొందియున్నది, వారివలన నూఱు ఉంగ రములు పుచ్చుకొనియున్నది. ద్వేషముచే చెప్పితి నని నీవు తలఁతు వని ఎప్పుడును దీనిదురాచారమును నీతో చెప్పనైతిని. ఇప్పుడు నీకు పాపము కలుగునని భయపడి చెప్పితిని. నామాటను నమ్మవేని దీని చీరచెఱఁగున నూఱు ఉంగరము లున్నవి చూడుు. భర్తతో అసత్యము చెప్పుట పతివ్రతా ధర్మము కాదు. నా పాతివ్రత్యమున నమ్మకము కలుగుటకై ఈ నా ప్రభావమును

కనుము."—ఇట్లు పలికి ఆమె ఆచెట్టును కోపముతో చూచి భస్మము చేసెను; మరల దానినే దయతోఁ గని మును పటికంటె చక్కనిదానినిగాఁ జేసెను. అది గని భర్త సంతోషించి ఆమెను కౌఁగిలించుకొనెను. రెండవదానిని చెనఁటియాలిని ముక్కుకోసి తఱిమివేసెను. దానివస్త్రమునుండి యుంగరములను కైకొని, అధ్యయనపారకుని యశోధరుని భ్రాతృసమేతుని మంచిమాటల క్షమ వేఁడి, నిర్విణ్ణుఁడై అతనితో పలికెను. 'అయ్యా, ఈద్వేషవశమున ఈభార్యల నిరువురును హృదయములో దాఁచుకొని రక్షించుచుంటిని. అటయినను ఈపాపాత్మురాలిని రక్షింపనేరనైతిని, మెఱుపుఁదీఁగను ఎవఁడు కదలకుండఁజేయును? చపలస్త్రీని ఎవఁడు రక్షించును! పతివ్రత తన శీలముచేత తన్ను తాను రక్షించుకొనవలయును గాని!' ఇట్లు పలికి యశోధరుని కూర్చుండఁబెట్టి 'ఎచటినుండి వచ్చుచున్నారు? ఎచటికి పోవుచున్నారు?' అని యడిగెను. యశోధరుఁడు తనవృత్తాంతము చెప్పి విశ్వాసము కలుగుడు అతని వృత్తాంత మడిగెను. 'అయ్యా, మహానుభావుఁడా రహస్యము గాదేని చెప్పుము. నీవు ఎవరవు? నీకు ఇట్టి భోగము కలిగియు ఈజలవాస మేమి?' చెప్పెదను వినుమని జలవాసి యిట్లు తనవృత్తాంతమును చెప్పసాగెను.

హిమవంతమునకు దక్షిణమందు కాశ్మీర మని దేశము మనుష్యులకు స్వర్గసౌఖ్యము కలిగించుటకు బ్రహ్మ సృజించి

నదియుంబోలె నొకటి వెలుఁగుచుండును. అందు కైలాసశ్వేత ద్వీపముల యందలి తమనివాసమును మఱచి శివాచ్యుతులు నూర్లకొలఁది పుణ్యక్షేత్రములయందు నివసించియున్నారు. ఆదేశము వితస్తానదీజలముచే పవిత్రమై శూరవిద్వజ్జనసమృద్ధమై ఎట్టిబలవంతుల కైనను శత్రువులకు జయింపరానిదై యున్నది. అచట పూర్వజన్మమున నే నొకగ్రామమున సామాన్యబ్రాహ్మణపుత్త్రుఁడనుగా నుంటిని! నాకు ఇరువురుభార్య లుండిరి. నాకు ఒకప్పుడు శ్రమణులతో సాంగత్యము కలుగఁగా వారు తమశాస్త్రమందు చెప్పఁబడిన యుపోషణ వ్రతమును నాకు నేర్పిరి. ఆవ్రతమును నేను ఇంచుమించుగా ముగింపనుండఁగా నాభార్యలలో నొకతె పాపాత్ముురాలు బలాత్కారముగా వచ్చి నాశయనమందు పరుండి నిద్రించెను. నాలవజామున నేను ఆవ్రతమును మఱచి నిద్రామోహముచే దానితో సురత మనుభవించితిని. ఆవ్రతమునకు అంతమాత్రమే భంగము కలిగినందున నే నిట్లు జలపూరుషుఁడనుగా జనించితిని. ఆయిరువురును ఈనాభార్యలుగా జనించినారు. ఆకులట పాపాత్మురాలు ఒకతె, రెండవది ఈతరుణి. నావ్రతము ఖండితమైనను దానిప్రభావమున పూర్వజన్మజ్ఞానమును, రాత్రిరాత్రి యిట్టి భోగములును కలిగినవి. వ్రతమునకు భంగమే రాక యుండిన నాకు ఇట్టియల్పజన్మము వచ్చి యుండదు.—

ఇట్లతఁడు తన వృత్తాంతమును చెప్పి యన్నదమ్ముల నిరువురను ఇష్టమృష్టాన్నములతో పూజించి సత్కరించెను. అంత నతనిభార్య పతివ్రత పూర్వవృత్తాంతము స్మరించి నేల మోఁకాళ్లపై నిలిచి చంద్రుని చూచుచు నిట్లు పలికెను. 'ఓ లోకపాలకులారా, సత్యముగా నేను పతివ్రతనేని, నాపతి యితఁడు జలవాసజన్మము మాని స్వర్గమునకు పోవునుగాక.' ఇట్లు ఆమె పలుకఁగానే ఆకాశమున విమానము వచ్చెను. దాని నెక్కి ఆదంపతులు స్వర్గమునకుఁ బోయిరి. పతివ్రతలకు ఈ మూఁడు లోకములలోను అసాధ్యమే మున్నది!

దానిం గని విప్రకుమారులు ఆశ్చర్యపడి రాత్రి అక్కడనే గడపి తెల్లవాఱఁగా బయలు వెడలిరి. సాయంకాలమునకు నిర్జనారణ్యములో నొకచెట్టు గని జల మెచట నయినం గలదా యని వెదకు చుండఁగా చెట్టునుండి యొకశబ్దము వినఁబడెను. 'ఓ బ్రాహ్మణులారా, ఉండుఁడు, నే నిప్పుడ మీకు స్నానాన్నపానములతో ఆతిథ్యము చేసెదను. మీరిపుడు నాయింటికి వచ్చితిరిగదా.' ఇట్లని ఆవాక్కు విరమించెను. అంతట అచట జలపూర్ణ మయిన యొకబావి పుట్టెను. దానిగట్టున విచిత్ర మైన పానభోజనములును ఉద్భవించెను. 'ఏమి యిది!' అని యాశ్చర్య పడుచు ఆ బ్రాహ్మణ కుమారులు బావిలో స్నానముచేసి యథేచ్ఛముగా భోజన మారగించిరి. పిమ్మట సంధ్యావందనము చేసి వారు చెట్టుక్రింద వచ్చి కూర్చుండఁగా, చెట్టునుండి సుందరుఁ

డొక పురుషుఁడు దిగి వచ్చెను. అతనికి వారు నమస్కరించిరి. అతఁడు వారిని కుశల మడిగి కూర్చుండెను. నీ వెవర వని వార తని నడిగిరి. అంత నాపురుషుఁడు పలికెను:—'పూర్వము నేను బ్రాహ్మణుఁడను దరిద్రుఁడనుగా నుంటిని. నాకు దైవవశమున శ్రమణులతో సాంగత్యముగలిగి వారిశాస్త్రమందలి యుపోషణ వ్రతమును ఆదరించు చుంటిని. ఒకనాఁడు సాయంకాలమున శరుఁడొకఁడు నన్ను బలవంత పెట్టి భోజనము చేయించెను. అందువలన నా వ్రతము ఖండిత మైనేను యక్షుఁడ నైతిని. నా వ్రతమే పూర్ణ మై యుండెనేని స్వర్గమందు దేవతనుగాఁ బుట్టి యుందును. నాకథను చెప్పితిని. మీకథ యేమి? మీరు ఎచటినుండి యెచటికి బయలు వెడలినారు? ఈమరుభూమి కేల వచ్చినారు?'— యశోధరుఁడు తమ వృత్తాంతము చెప్పెను. యక్షుఁడు వారితో మరల ననియె.—'అటయిన, నేను మీకు నా ప్రభావము చేత విద్యల నిచ్చెదను. విద్యలు గ్రహించి స్వదేశమునకు పొండు, ఊరక విదేశభ్రమణ మేల చేసెదరు?' ఇట్లు పలికి అతఁడు వారికి అప్పుడే విద్యల నిచ్చెను. వారును అతని ప్రభావముచేత విద్యలను తత్క్షణమే గ్రహించిరి. అంత నతఁడు వారితో 'మిమ్ము గురుదక్షిణగా ఒకటి యడిగెదను. ఏ మనఁగా మీరు నాకొఱకు ఉపోషణవ్రతము చేయవలయును. సత్యము, బ్రహ్మచర్యము, దేవప్రదక్షిణము, భిక్షువేళయందు భోజనము, మనస్సంయమము, క్షమయు ఒకదినము జరిపి ఆఫలము నాక

ర్పింప వలయును. అందువలన నేను పూర్ణవ్రతఫల మైన దివ్యత్వమును పొందుదును.' అని తెలిపెను. వారును నమ్రులై అంగీకరింపఁగా యక్షుఁడు చెట్టెక్కి యంతర్ధానము పొందెను. ఆభ్రాత లీరీతిని అప్రయాససిద్ధార్థు లై రాత్రి గడపి తెల్లవాఱఁగానే బయలు వెడలి స్వగృహము చేరిరి. అచట తమ వృత్తాంతము చెప్పి తల్లిదండ్రులను సంతోషపెట్టి యక్షుని కొఱకు ఉపోషణవ్రత మాచరించిరి. అంత గురువు యక్షుఁడు విమానమున వచ్చి వారితో 'మీదయచే యక్షత్వము తొలఁగి దేవత నైతిని. మీరు ఇఁక నీవ్రతమును మీ క్షేమముకొఱకు చేసికొనుఁడు. ఇందువలన మీకు దేహాంతమున దేవత్వము కలుగును. నా వరముచే మీకు అక్షయధనము కలుగును.' అని చెప్పి ఆ కామగముఁడు విమానమున స్వర్గమునకుఁ బోయెను. యశోధర లక్ష్మీధరులును ఆవ్రతము చేసి విద్యాధన సమృద్ధులై సుఖ ముండిరి. ఇట్లు కష్టములయం దైనను సదాచారము వదలని ధర్మపరులను దేవతలు రక్షించి యిష్టార్థము లొసంగుదురు.

ఇట్లు వసంతకుఁడు చెప్పిన యీయద్భుతకథను విని వత్సరాజసుతుఁడు శక్తియశఃప్రాప్త్యుత్కంఠను కొంతవఱకు సహించి యుండెను. భోజనకాలమున తండ్రి పిలువ నంపఁగా నరవాహనదత్తుఁడు తనమంత్రులతోఁ గూడ తండ్రియొద్దకుఁ బోయెను. అచట అనురూపముగా భుజించి సాయంకాలమున తన వయస్యులతోఁగూడి తన నగరికి వచ్చెను. అచ్చట నతనిని

మరల వినోదపఱుచుటకు గోముఖుఁడు మఱియొక కథ చెప్పె దను విను మని యిట్లు వచించెను.

### కోఁతియు మొసలియు.

వలీముఖ మని యొక వానరము తనగుంపునుండి చెదరి సముద్రతీరమున అత్తియడవిలో నుండెను. అది అత్తిపండ్లను తినుచుండఁగా దానిచేతినుండి ఒకపండుజాఱి సముద్రజలములో పడఁగా ఒక మొసలి దానిని భక్షించి ఆయాస్వాదమునకు హర్షించి మధురముగా ధ్వని చేసెను. ఆ మధురధ్వనిని మరల మరల వినఁ గోరి కపి పెక్కు ఫలములను మొసలికి వేయు చుండెను. ఇట్లు దినదినము జరుగు చుండెను. ఆ రెంటికి స్నేహ మాయెను. అంత ప్రత్యహము చెట్టుపైనున్న కోఁతితో భాషిం చుచు మొసలి గట్టుదగ్గఱ జలములో దినమెల్లను ఉండి సాయంకాలమున ఇంటికి బోవుచుండెను. ఈవృత్తాంత మెఱిఁగి దానిభార్య తన కెప్పుడును పగలెల్ల విరహము నిడుచున్న యీ కపి సఖ్యము నొల్లనిదై మాంద్యవ్యాధిని అభినయించెను. 'ప్రేయసీ, చెప్పుము నీకేమి జబ్బు? ఎట్లు శమించును?' అని దుఃఖితమై మొసలి నిర్బంధపూర్వకముగా అడిగినను, అది చెప్ప దాయెను. దానిసఖి రహస్యజ్ఞురాలు ఉత్తరము చెప్పెను. 'నీవు చేయవు, ఈమెయుఁ గోరదు, అయినను ఎఱిఁగియుండి వివేకి దుఃఖకారణము నెట్లు దాఁచును? నీభార్యకు కలిగిన యీమహా వ్యాధి కోఁతిగుండెచేరువలనఁ గాని కుదురదు.' ప్రియాసఖి

యిట్లు చెప్పఁగా మొసలి తలపోసెను: - 'అయ్యో! కోతిగుండెఁ ఎట్లు దొరకును, మిత్త్రమునకు కపికి ద్రోహముచేయుట నాకు తగునా ? అయినను మిత్త్రుఁ డన నేపాటి ? ప్రాణములకన్నను భార్య ఎక్కువగదా.' ఇట్లాలోచించుకొని మొసలి భార్యను 'ప్రాణేశ్వరీ, ఏల ఆయాసపడియెదవు? కపిని సంపూర్ణముగానే తెచ్చియిచ్చెదను.' అని ఓదార్చి కపియొద్దకుఁబోయెను. మాటల వరుసను కపితో ని ట్లనియె. 'మిత్త్రమా, ఇప్పటికిని నీవు మాయింటిని నాభార్యను చూడ వైతివి. రా రమ్ము, ఒకదిన మయినను అక్కడ విశ్రమింతువుగాని, ఒకరియింట ఒకరు భుజింపక భార్యనుచూపక యుండుట కపటమేగాని మైత్త్రియా?' ఇట్లు కపిని మోసపుచ్చి సముద్రములోనికి దింపి వెంటఁబెట్టు కొని పోవుచుండెను.

కోఁతియు మొసలితోడ కూడఁ బోవుచు, మొసలి భయపడి వ్యాకులమై యుండుటఁ గని, 'మిత్త్రమా, ఇప్పుడు నీవు ఎప్పటియట్లు లేవేమి?' అని నిర్బంధ పూర్వకముగా నడిగెను. జడమతి యా మొసలి కోఁతి తనచేతిలో నున్న దనియు ఇఁక నెట్లును తప్పించుకొని పోలే దనియు తలఁచి, ఇట్లనియె. 'నాభార్య అస్వస్థముగా నున్నది. రోగశాంతి కై కపిహృత్పద్మము తెమ్మని కోరినది. అందుచేత నేను చింతాకులుఁడ నై యున్నాఁడను.' ఆమాట విని వివేకి యాకపి 'ఔరా! ఈపాపి యిందులకా నన్ను గొనిపోవుచున్నాఁడు! ఓహో, స్త్రీవ్యస

నాక్రాంతుఁడై వీఁడు మిత్రద్రోహమునకు ఒడిగట్టినాఁడు ! ఆశ్చర్య మేమి? భూతగ్రస్తుఁడు తనమాంసమును తానే కఱచు కొనుటలేదా!' అని యాలోచించుకొని మొసలితో 'మిత్రమా, అ ట్టయినయెడల ఆమాట నాతో మొదటనే వేల చెప్పలేదు ? చెప్పియున్నయెడల నీప్రియకొఱకు హృత్పద్మమును తెచ్చియే యుందును. అది యిప్పుడు నేను కాఁపుర మున్న చెట్టుమీఁద నున్నది.' అనెను. ఆమాట విని యా మొఱకు మొసలి ఖేదపడి 'అ ట్టయిన పోయి తెమ్ము అ త్తిచెట్టునుండి నీగుండెను. ' అని ఆకపిని మఱల సముద్రమునొడ్డునకు తెచ్చి విడిచెను. అచట కపి మొసలినుండి యమునివలననుండియుం బోలె తప్పించుకొని గట్టెక్కి ఎగిరి చెట్టుకొన కెక్కి మొసలితో 'పోరా, మూర్ఖుఁడా, హృదయము దేహమునఁ గాక వెలిగా నుండునా? నేను ఈయు పాయముచే నీవలననుండి నాప్రాణములను తప్పించుకొంటిని. ఇఁక రాను పో ? మూర్ఖా, గర్దభాఖ్యాయికను వినలేదా?' అని యిట్లు చెప్పసాగెను.

## గర్దభాఖ్యాయిక.

ఒక వనములో ఒకసింహ ముండెను. దానికి ఒకనక్క మంత్రి యుండెను. ఒకప్పుడు రా జొకఁడు వేఁటకు వచ్చి ఆసింహ మును ఆయుధములచే విశేషముగా గాయపఱిచెను. అంత నా సింహము ఎట్లో ఒక గుహలో ప్రవేశించి వెలికి రాక అచటనే యుండెను. అంత మంత్రి నక్క తేనినియోగరమున మిగతను

భుజించుచున్నది. జేనితో ని ట్లనియె: 'ప్రభూ, వెలువడి ఏల యథా శక్తి ఆహారము సంపాదించుకొనవు ? నీశరీరమును పరిజనమును కృశించుచుండఁగా ఊరకున్నావు.' సింహ మనెను. 'మిత్రమా, నేను గాయములచేత ఎక్కడికిని గదలలేకున్నాను. గాడిద యొక్క చెవులును గుండెయు నాకు తినుటకు దొరకిన, నా గాయములు మాని బలము కలుగును ; కనుక నీవు పోయి త్వరగా ఎచటినుండియేని ఒకగాడిదను కొని రమ్ము.' వెంటనే సరియే యని నక్క వెడలి పోయి తిరిగి నీటియొడ్డున నొక చాకలివానిగాడిదను చూచి ప్రీతిచేతఁబోలె దానితో 'ఏమి ఇంత దుర్బలముగా నున్నావు ?' అని యడిగెను. 'ఈచాకలి వాని మూటలు సదా మోసి కృశించితిని.' అని గాడిద చెప్పెను. నక్క యి ట్లనియె: 'ఇక్కడ నేల క్లేశ పడి యెదవు ? నే నొకవనమునకు కొనిపోయెదను, నాతో రమ్ము, అచట నీవు గాడిద సుందరితో కూడ స్వర్గ సుఖము ననుభ వింపగలవు.' గాడిద భోగలోభముచే నక్కతోఁగూడి ఆ సిం హముయొక్క వనమునకుఁ బోయెను. గాడిదను చూచుచునే సింహము బలము లేమిచే దానివెనుకకువచ్చి చేతితో ఒకదెబ్బ కొట్టెను. గాడిద సింహమునకు దొరకియు తప్పించుకొని పాఱిపోయెను. దుర్బల మగుటచే సింహము దానిని తఱిమి కొట్టలేక ఊరకుండెను. ఇట్లు సింహము కార్యము చెడి త్వరి తముగా తన గుహ సొచ్చెను. నక్కమంత్రి సింహమును ఇట్లు

ఆక్షేపించెను. 'క్షుద్రమును గాడిదను కూడ కొట్ట లేవైతివి, హరిణాదులను కొట్టవలసిన నేమి చేయుదువు!' సింహము మంత్రితో 'అంతయు నీ వెఱుఁగుదువు, మరల ఆగాడిదను తోడ్కొని రమ్ము, సిద్ధముగా నుండి కొట్టెదను.' అనెను.

అంతట నక్క మరల గాడిదయొద్దకుఁ బోయి 'ఏమి? మామా, పలాయన మైతివేఁ?' అని యడిగెను. 'నన్ను ఏదో జంతువు కొట్టినది.' అని గాడిద చెప్పెను. నక్క నవ్వి 'నీకు వట్టి భ్రమ కలిగినది. అచట అట్టిసత్త్వమే లేదు. నేను కూడ నిచట నిర్భయముగా నున్నాఁడను. రా నాతోఁగూడ నిర్బాధ మయిన యీయడవిలోనికి.' అని పలిచెను. అట్లే గాడిద మరల దాని తో వచ్చెను. రాఁగానే గాడిదను చూచి సింహము గుహ వెలు వడి వీఁపుపైఁ బడి గోళ్లతో చీల్చివేసెను. ఇట్లు గాడిదను చీల్చి పడ వేసి నక్కను కావలి యుంచి సింహము బడలిక తీర్చుకొను టకై స్నానము చేయఁ బోయెను. అది మరల వచ్చు నంతలో మాయావి నక్క గాడిదయొక్క చెవులను గుండెను తినెను. సింహము స్నాన మై వచ్చి గాడిదను చూచి 'చెవులును గుండెయు నేవీ?' అని నక్క నడిగెను. నక్కయు 'ప్రభూ, ఇది పూర్వమే కర్ణహృదయ హీనముగా నుండెను, కా దేని ఇది పోయి మరల వచ్చునా?' అనెను. సింహము అట్లేయుండు నని తలఁచి ఉన్నమాంసమును భక్షించెను. నక్క తచ్ఛేషము భక్షించెను.—

కోఁతి ఇట్లు చెప్పి మొసలితో 'నేను ఇఁక మరల రాను, గాడిదవలె చేయను.' అనెను. ఇట్లు కోఁతి చెప్పఁగా విని మొసలి దుఃఖించుచు ఇంటికి పోయెను. ఇట్లు మొసలికి అవివేకముచే భార్యకార్యమును చెడినది, మిత్రమును పోయినది. ఈసఖ్యము పోయినందున దానిభార్య తిన్నగాఁనుండెను. కపియు సముద్ర తీరమున సుఖముగా సంచరించుచుండెను. కనుక దుర్జనుల యందు విశ్వాసముంపఁగూడదు. దుర్జనుని నల్లత్రాచును నమ్మిన వానికి సుఖ మెక్కడిది ?

## గాంధర్వపరితోషకునికథ.

ఈకథ ముగించి గోముఖమంత్రి మరల నరవాహన దత్తుని కిట్లనియె: దేవా, జడులకథలను మఱికొన్నిటిని వినుము.

ఒకవైణికుఁడు ఒకధనికుని గీతవాద్యములచే సంతోష పెట్టెను. ప్రభువు సరాబును పిలిచి వైణికుఁడు వినుచుండఁగా 'ఈగాంధర్వికునికి రెండువేల పణములు ఇమ్ము.' అని యాజ్ఞా పించెను. అట్లే ఇచ్చెద నని సరాబు చెప్పి వెడలి పోయెను. వైణికుఁడు కూడఁ బోయి పైక మడుగఁగా సరాబు ప్రభు చిత్తము నెఱిఁగినవాఁడు ధనము ఇయ్యలేదు. అంత వైణికుఁడు మరల ప్రభువును గని సరాబు పైక మియ్య లే దని చెప్పుకోఁగా 'నీవు నా కేమి యిచ్చితివి, నేను నీకు ఇచ్చుటకు ? నీవు వీణ వాయించి నాకు శ్రోత్రసుఖము కలిగించితివి. అట్లే నేనును దానవాక్యముచే నీకు శ్రోత్రసుఖము చేసితిని.' అనెను. ఆ

మాట విని వైణికుఁడు ఆశాభంగము పొందియు నవ్వుచు వెడలి పోయెను. పిసిడిఁవాని యిట్టి మాటవలన రాతికిఁ గూడ హాసము కలుగును.

## మూర్ఖశిష్యద్వయ కథ.

మూర్ఖశిష్యద్వయకథ వినుము. ఒకగురువునొద్ద పరస్పరమత్సరులు ఇద్దఱు శిష్యు లుండిరి. వారిలో నొకఁడు ప్రతి దినము గురువుగారి కుడిపాదమును, రెండవవాఁడు ఎడమపాదమును, నూనె రాచి మర్దించి కడుగుచుండిరి. ఒకప్పుడు గురువు దక్షిణపాదాభ్యంజకుని గ్రామాంతరము పంపి ద్వితీయశిష్యునే వామపాదాభ్యంజన మొనర్చిమ్మట దక్షిణపాదమునకు అభ్యంజనము చేయు మనెను. ఆమూర్ఖుఁడు గురువుతో 'నాయెదిరిపాదమునకు నే నేల నూనె రాతును?' అనెను. గురువు నిర్బంధించెను. అంతట ఆ మూర్ఖశిష్యుఁడు రెండవ శిష్యునిమీఁది ద్వేషముచేత రాయి యొకటి తెచ్చి యుపాధ్యాయుని రెండవ పాదమును గొట్టెను. గురువు గట్టిగా ఏడువఁగా పలువురు వచ్చి ఆమూర్ఖశిష్యుని కొట్టసాగిరి. దుఃఖితుఁ డయ్యును గురువే వానిని వారినుండి తప్పించెను. మఱునాఁడు రెండవశిష్యుఁడు గ్రామము నుండి వచ్చెను. వాఁడు గురువుయొక్క కాలికట్టును చూచి కారణ మడుగఁగా గురువు చెప్పెను. అంతట వాఁడు 'నేను మాత్రము వానిపాదమును పగులఁగొట్టలేనా యేమి?' అని రాయి తెచ్చి గురుని యితరపాదమును ళాగి పగులఁగొట్టెను.

గురువు సేసిన హాహాకారమునకు లోకులు వచ్చి ఆదుశ్శిష్యుని తన్నసాగిరి. రెండుపాదములు విఱిగి యేడ్చుచు గురువే వానిని కూడ వారినుండి తప్పించెను. శిష్యు లిద్దఱును ఇట్లు సర్వ ద్వేష్యులును అపహాస్యులు నై వెడలిపోయిరి. గురువు తన యోర్పునకు పొగడ్త పొంది క్రమముగా స్వస్థుఁ డాయెను. ఇట్లు మూర్ఖపరిజనము పరస్పర ద్వేషము చేత స్వామికార్యమును చెఱుచును, తానును చెడును.

### ఇరుదలపాము.

రెండుతలలపాముకథను అవధరింపుము. ఒకపామునకు తోఁకయందు సయితము తల ఒకటియుండెను. తోఁకతల గ్రుడ్డి దాయెను. రెండవతలకు కన్ను లుండినవి. నేను ముఖ్యమను నేను ముఖ్యమను అని యీ రెండుతలలకు జగడము కలిగినది. పాము ముందఱితలవైపు ప్రాకుచుండెను. ఒకనాఁడు తోఁక తలకు ఎదో కొయ్య తగిలెను. అంత నాతల దానిని చుట్టుకొని పర్వమును మఱి జరుగనీ కుండెను. అంత నాసర్పము తోఁక తలయే ఇతరశిరమునకంటె బలవంతము శ్రేష్ఠము నని తలఁచి ఆ గ్రుడ్డితలవైపే సంచరించుచుండి దారి తప్పి యొకగోతిలో నిప్పులో పడి కాలిపోయెను. ఇట్లు అల్పగుణమునకును మహా గుణమునకును భేదము నెఱుఁగనివారు అల్పగుణమును చేరుట చేత పరాభవము పొందుదురు.

## తండులభక్షకుఁడు.

తండులభక్షకునికథ వినుము. మూర్ఖుఁ డొకఁడు తొలి మాఱు, మామగారియింటికిఁ బోయి, అచట అత్తగారు వంటకై కడిగిపెట్టిన తెల్లనిబియ్యము పిడికెఁడు ఎత్తి తినుటకు నోటఁ బోసికొనెను. తత్క్షణమే అత్త రాఁగా మూర్ఖుఁడు బియ్యమును మ్రింగుటకేని అవమానభయముచే ఉమియుటకునేని శక్తుఁడు గాఁడాయెను. అంతట వాని యుబ్బినదవుడలను మౌనమును కని యామె అది ఏదో గొప్ప రోగ మని తలఁచి, మగనిం బిలిచి చూపెను. ఆతఁడును తత్క్షణమే పోయి వైద్యుని తెచ్చెను. వైద్యుఁడు చూచి అది శోఫ మని ఎంచి ఆ మూఢునితలను పట్టుకొని దవుడలు కోసెను. అంతట లోకోపహాసముతోఁ గూడ బియ్యము వానిదవుడనుండి బయలు వెడలెను. ఇట్లు మూఢుఁడు అకార్యము చేయును, దానిని కప్పుకొనుటకు సమర్థుఁడు గాఁడు.

## బాలురు మగగాడిదను పాలు పిదుకుట.

కొందఱు పిల్లవాండ్రు మూఢులు ఆవు మొదలగు వానిని వారువారు పాలు పిదుకుటం గని ఆశతో నొక మగ గాడిదను పాలు పిదుక సాగిరి. ఒకఁడు పిదికెను, ఒకఁడు పాల కుండను పట్టుకొనెను. ఇతరులు పాలు త్రాగుటకు మిగుల నోరూరు చుండిరి. ఎంతపాటుపడినను పాలు రావాయెను. అవస్తువునందు ప్రయాసపడు మూర్ఖుఁడు అపహాసాస్పద మగును.

### గ్రామమునకు పోయివచ్చినవాఁడు.

ఒక బ్రాహ్మణ పుత్త్రుఁడు మూర్ఖుఁ డుండెను. వానితో తండ్రి 'నాయనా నీవు సాయంకాలమున గ్రామమునకు పోయి రావలయును.' అనెను. కుమారుఁడు విని తండ్రిని పని యేమో అడుగక, మఱునాఁడు తెల్లవాఱఁగానే వృథాగా గ్రామమునకుఁ బోయి శ్రమపడి సాయంకాలము ఇంటికి వచ్చి 'గ్రామమునకు పోయి వచ్చితిని.' అని తండ్రితో చెప్పెను. 'నీవు పోయిన ఏ కార్యము కాదు?' అని తండ్రి వచించెను. ఇట్లు అభిప్రాయ మెఱుఁగక పని చేయు మూర్ఖుఁడు వృథాక్లేశపడును, లోకోపహాస్యుఁ డగును.

ఇట్లు ముఖ్యసచివుఁడు గోముఖుఁడు చెప్పిన కథలను విని శక్తియశస్సంప్రాప్తిని ధ్యానించుచు నరవాహనదత్తుఁడు రాత్రి చాలఁ గడపి క్రమముగా నిద్రానిమీలితాక్షుఁడాయెను.

---

## ౮-వ తరంగము.

---

### బ్రాహ్మణనకులము.

మఱునాఁడు రాత్రి తనపడుకయింట దయితాప్రాప్త్యుత్సుకుఁడై చింతించుచున్న నరవాహనదత్తునికి వినోదార్థము మరల గోముఖమంత్రి యిట్లు కథలు చెప్పఁ దొడంగెను. 'దేవా, ఒకనగరమున దేవశర్మ అని యొక బ్రాహ్మణుఁడును అతనికి దేవ

దత్త యని భార్యయు నుండిరి. ఆమె గర్భిణియై యథాకాలము పుత్త్రునిఁ గనియెను. ద్విజుఁడు దరిద్రుఁ డయ్యును ఆ సుతునిఁ గని పెన్నిధిఁ గన్నట్లు సంతోషించెను. పురుడు తీఱినతర్వాత భార్య స్నానార్థము నదికిఁ బోయెను. దేవశర్మ ఇంట సుతుని చూచుకొను చుండెను. ఇంతలోపల రాజాంతఃపురమునుండి చేటి వచ్చి స్వస్తివాచనముకొఱకు రమ్మని ఆతనిని పిలిచెను. అతఁడు శిశురక్షణార్థము ఇంట ఆబాల్య వర్ధిత మైన ముంగిసను ఉంచి దక్షిణార్థము రాజాంతఃపురమునకుఁ బోయెను. అతఁడు పోఁగా ఆకస్మికముగా శిశువుకడకు పాము రాఁగా నకులము దానిని స్వామిభక్తిచే చంపెను. ఇంతలో దేవశర్మ ఇంటికి రాఁగా నకులము పామునెత్తుటఁ దోఁగుచు సంతోషముతో అతని కెదురుపోయెను. అతఁడు ఆరూపున నున్న యాముంగిసను గని అది నిశ్చయముగా తన కుమారుని చంపిన దని తలఁచి రాతితోఁ గొట్టి చంపెను. లోనికి పోయి చూడఁగా బాలుఁడు నవ్వుచు ఆడుకొను చుండెను. చెంత పాము తుండెము లై పడియుండెను. కని బ్రాహ్మణుఁడు పశ్చాత్తాపదుఃఖితుఁ డాయెను. భార్య వచ్చి 'ఇట్లు ఏమియు విచారింపక మహోపకారిని నకులమును చంపితి వేమి?' అని యతనిని ఆక్షేపించెను. కావున బుద్ధిమంతుఁడు అవిచారితముగా ఏమియు చేయఁ గూడదు. అట్లు చేయువాఁడు ఇహపరములకుఁ గాక చెడును.

## విధివిరుద్ధ కృతము.

విధివిరుద్ధముగా పని చేయువాఁడు విరుద్ధఫలము ననుభవించును. ఒకఁడు వాయుదోషముచేత బాధపడు చుండెను. వైద్యుఁడు వానికి వస్త్ర్యౌషధ మిచ్చి తాను వచ్చునప్పటికి దానిని నూఱి యుంపు మనెను. వైద్యుఁడు వచ్చుటకు తడవు కాఁగా ఆరోగి మూర్ఖుఁడు ఆయౌషధమును నూఱి నీళ్లలోఁ గలుపుకొని త్రాగి, అది వికటించి, వైద్యుఁడు వచ్చునప్పటికి గుదు గుదుజీవముతో నుండెను. వైద్యుఁడు వచ్చి 'తత్క్షణము వమనౌషధము త్రాగించి వానిచావును తప్పించి 'ఓయి మూర్ఖుఁడా, వస్త్ర్యౌషధము గుదమందు పెట్టవలసినది, త్రాగవలసినది కాదు.' అని మందలించెను. ఇట్లు ఇష్టమయినను అవిధిగా చేసినయెడల అనిష్ట మగును. కావున ప్రాజ్ఞుఁడు అవిధిగా ఏమియు చేయఁగూడదు.

### జడుఁడును కోఁతులును.

ఆలోచింపక పొంఁబొట్లు చేయువానిని అందఱు నిందింతురు. ఒకజడుఁడు ఒకప్పుడు బిడారుతో దేశాంతరము పోవుచు, బిడారు అడవిలో దిగఁగా, తాను అచట ఇటునటు విహరించుచుండెను. వానిని కోఁతులు గని పీఁకి చీఱినవి. కోఁతి నెఱుఁగనియా జడుఁడు బిడారు చేరి తండ్రితో అడవిలో తన్ను ఎవరో రోమశులు ఫలభక్షకులు చీఱి బాధించి రని చెప్పుకొనెను. అంతట తండ్రి కత్తిదూసికొని వనములోనికి పోయి

పండ్లు కోసికొనుచున్న జటాధరులను తాపసులను చూచి 'వీరే రోమశులు నాకుమారుని చీఱినవారు' అని వారిని చంపఁ బోయెను. అచట బాటసారి ఒకఁ డుండి 'ఓయి, నీకుమారుని కోఁతులు కఱచినవి, ఈతాపసుల మీఁది కేల పోయెదవు?' అని వానిని తాపసవధనుండి మాన్పించెను. ఇట్లు వాఁడు దైవ వశమున పాపము తప్పి బిడారునకు మరలి వచ్చెను. కావున తెలివిగలవాఁడు అవిచారితముగా ఏమియు చేయఁగూడదు. సర్వదా మనుష్యుఁడు తెలివి సంపాదించుకోవలసినది. బుద్ధి హీనులు పరిహాసాస్పద మై చెడిపోవుదురు.

## దరిద్రుఁడును నాణెములసంచియు.

దరిద్రుఁ డొకఁడు దారి నడచుచు బంగారు నాణెముల సంచి ఎవనిదో ఒక సార్థవాహునిది దారిని పడియుండఁగా కని పుచ్చుకొనెను. వాఁడు దానిం గొని ఆవలికిఁ బోక అచటనే కూర్చుండి నాణెములను లెక్కపెట్టుకొనుచుండెను. అప్పటికి సార్థవాహుఁడు సంచిని జ్ఞప్తి చేసికొని గుఱ్ఱముమీఁద వచ్చి సంచిని పుచ్చుకొనెను. దరిద్రుఁడు దృష్టనష్టార్థుఁ డై దుఃఖించుచు తల వ్రేల వేసికొని తనదారిని పోయెను. మూఢుఁడు ధనము దొరకినను క్షణములో కోలుపోవును.

## జడుఁడును బాలచంద్రుఁడును.

ఒకజడుఁడు బాలచంద్రుని చూడఁగోరెను. మఱి యొకఁడు తాను చూచి తన వ్రేలిమీఁదుగా చూడు మని ఆజడునికి

బోధించెను. జడుఁడు ఆకాశమున చూచుట మాని వాని వ్రేలినే చూడసాగెను. చంద్రుఁడు కనబడఁడాయెను, నవ్వు చున్న జనులు అగపడిరి.

ప్రాజ్ఞులకథలు:— అసాధ్యసాధనము ప్రజ్ఞ.

అసాధ్య మయినను ప్రజ్ఞచే సాధ్య మగును. ఒక స్త్రీ ఒంటరిగా గ్రామాంతరము పోవుచుండెను. దారిలో ఆకస్మిక ముగా కోఁతి ఒకటి వచ్చి ఆమెను పట్టుకొనెను. దానిని వం చించుచు ఆమె ఒకచెట్టుచుట్టును తిరుగు చుండెను. అంత నా కోఁతి మూఢమతి తనభుజములతో ఆచెట్టును కౌఁగలించు కొనెను. ఆమెయు తనబాహువులతో కోఁతిని చెట్టునందే గట్టి గా పట్టుకొనెను. అందువలన కోఁతి కదల లేక యుండెను. ఇంతలో ఆదారిని గొల్లవాఁ డొకఁడు రాఁగా వానితో ఆమె 'ఓయిమహానుభావుఁడా, క్షణము సేపు ఈకోఁతిని పట్టుకొనుము, జడయు వస్త్రమును ఊడినవి, రవంత సవరించుకొనియెదను;' అని యడిగెను. 'నన్నుఁ గూడెదవేని అట్లే పట్టుకొనియెదను.' అని వాఁడు పలికెను. ఆమె ఒప్పుకొనెను. వాఁడు పట్టుకొనెను. అంత నామె సవరించుకొని వానిసురెకత్తితో కోఁతిని చంపి వానిని ఏకాంతమునకు రమ్మని దూరముగా తీసికొనిపోయెను. ఇంతలో బిడారు వచ్చి కలసికొనఁగా ఆమె వానిని పొమ్మని దానితోఁ గలసి ప్రజ్ఞారక్షితశీల యై తనగ్రామాంతరమునకుఁ

బోఁడును. ఇట్లు లోకవర్తనమున ప్రజ్ఞయే ప్రధానసాధనము. ధనదరిద్రుఁడు జీవించును గాని బుద్ధిదరిద్రుఁడు జీవింపనేరఁడు.

## ఘట కర్పరుల కథ.

ఈ యద్భుతకథను వినుము. ఘటుఁడు కర్పరుఁడు నని ఒకనగరములో ఇద్దఱు దొంగ లుండిరి. వారిలో ఒకరాత్రి కర్పరుఁడు ఘటుని వీథిలో ఉంచి రాజసుతయొక్క పడుకగది లోనికి కన్నము త్రవ్వి ప్రవేశించెను. వాఁడు మూలలలో దాఁగి యుండఁగా రాజకన్య మేల్కాని కామాతుర యై వానిని పిలిచెను. ఆమె వానితో క్రీడించి వానికి ధన మిచ్చి మరల వత్తువేని ఇంక ధన మిచ్చెద నని చెప్పెను. అంత కర్పరుఁడు వెలువడి ఘటునిచేతికి ఆధన మిచ్చి ఇంటికి పంపి తాను మరల అంతః పురము సొచ్చెను. కామలోభాకృష్టుఁడు అపాయమును కన నేర్చునా? మరల రాజపుత్రితోఁ గలసి సురతశ్రాంతుఁ డై పానమత్తుఁ డై ఆమెతో నిద్రించెను. తెల్లవాఱినను మేలుకొన లేదు. తెల్లవాఱఁగానే అంతఃపురరక్షకులు వచ్చి అట్లున్న కర్పరుని కొని పోయి రాజునెదుటఁ బెట్టిరి. రాజు కోపముచే వానిని ఉరికి ఆజ్ఞ చేసెను. వధ్యభూమికి తలవరులు కొనిపోవుచుండ వీనితోడుదొంగ ఘటుఁడు వీఁడు రాత్రి యింటికి రానందున వీనిని వెదకుకొని వచ్చెను. వానిం గని కర్పరకుఁడు 'రాజసుతను కొనిపోయి కాపాడుము.' అని సంజ్ఞ చేసెను. ఘటుఁడు అంగీకరించెను. సంజ్ఞచే తలవరులు కర్పరకుని చెట్టున ఉరిఁ

దీసిరి. ఘటుఁడు ఇంటికిఁ బోయి దుఃఖించి రాత్రి కన్నము త్రవ్వి రాజకన్యాగృహము సొచ్చి అట ఒంటిగా బంధనములో నున్న యా కన్నియం గని 'నేను కర్పరకుని చెలికాఁడను, నీకొఱకు వచ్చితిని, వానిని ఉరిఁదీసినారు. నేను వానిపై చెలిమిచేత నిన్ను ఇచ్చటనుండి కొనిపోయి రక్షించుటకు వచ్చితిని. నీ తండ్రి నీ కేమియు అనిష్టము చేయకముందే పోవుదము రమ్ము.' అని పిలిచెను. రాజసుత సంతోషముతో అంగీకరించెను. ఆ సొరంగముగుండ ఆమెను తోడుకొని ఆచోరుఁడు వెలువడి తన యింటికిఁ బోయెను. తెల్లవాఱఁగా రాజు కన్నముగుండ ఎవఁడో కొమరితను కొనిపోయె నని తెలిసికొని 'నిక్కముగా ఆ పాపాత్మునికి ఎవఁడో బంధువు సాహసికుఁడు ఉన్నాఁడు, వాఁడు నాకూఁతును కొనిపోయినాఁడు.' అని నిశ్చయించుకొని, కర్పరకళేబరమును జాగ్రత్తగా కాపాడుఁ డని భృత్యులను కొందఱను నియమించి, 'ఇక్కడికి వీనికై యేడ్చుచు దాహాదికర్మలు చేయుటకు ఎవఁడు వచ్చునో వానిని పట్టుకొనుఁడు. వానివలన పాపాత్మురాలిని కులపాంసనిని సాధించెదను. అని ఆజ్ఞాపించెను. వారును అట్లే అహర్నిశము జాగ్రత్తగా కర్పరకళేబరమును రక్షించు చుండిరి. ఘటుఁడు దానిని వెదకి కనిపట్టి వృత్తాంత మెఱిఁగి వచ్చి రాజపుత్త్రితో 'ప్రేయసీ, నాకు పరమాప్తుఁడు సహాయుఁడు కర్పరుఁడు, వానిదయచే నీవు రత్న సంచయము తోఁగూడ నాకు దొరకితివి. వాని స్నేహాఋణమును తీర్చ

కోనేని నాకు సుఖము లేదు కనుక నేను పోయి వానికై యేడ్చి భటులకనులయెదుటనే నాయుక్తిచేత అగ్నిసంస్కారము కూడ చేసి యస్థులను తీర్థములో వేసెదను. నానిమిత్తమై నీవు భయ పడవలదు, నేను కర్పరునివలె బుద్ధిహీనుఁడను గాను.' అని బోధించి తత్క్షణమే మహావ్రతివేషము వేసికొని కర్పరములోఁ బెరుఁగన్నము పెట్టుకొని బాటసారివలె కర్పరునియొద్దకుఁ బోయి అచట కాలు జారినట్లు నటించి తనచేతి యాపెరుఁగన్నపుఁబెంకును క్రిందఁ బడఁ జేసి పగిలించి 'అయ్యో! కర్పరా! పోయితివే! పోయితివే!' అని యేడువ సాగెను. రక్షకులు వాఁడు పెంకు పగిలిపోయినందులకు ఏడ్చె నని తలంచిరి. క్షణ ములో వాఁడు ఇంటికిఁ బోయి జరిగిన వృత్తాంతమును రాజ పుత్రికి చెప్పెను.

మఱునాఁడు వాఁడు తనభృత్యుని కొకనికి వధూవేషము వేసి ముం దుంచుకొని, మఱియొకభృత్యునిబుజమున ఉమ్మెత్త కలిపిన యప్పములకుండను బెట్టి వానిని వెనుక నుంచుకొని, తాను కై పెక్కిన గ్రామీణుని వేషము ధరించి సాయంకాల మున కాళ్లు తడబడ కర్పరరక్షకు లున్న దారిని పోవుచుం డెను. వారు 'అన్నా, నీ వెవరవు? ఈచిన్న దెవతె? ఎక్కడికి పోవుచున్నావు?' అని యడుఁగ 'నేను గ్రామ్యుఁడను, ఇది నాభార్య, మామగారి యింటికిఁ బోవుచున్నాను. అందుకై భక్ష్యముల సూడిదకూడ కొనిపోవుచున్నాను. మీతో సంభా

షణ కలిగినందున మీరు నాకు మిత్త్రుల రైతిరి. కనుక భక్ష్య ములు సగము అచటికి కొనిపోయెద, సగము మీరు భక్షింపుఁడు అని రక్షకులకు తలకొక యప్ప మిచ్చెను. వారు నవ్వుచు పుచ్చుకొని అంఱలు భక్షించిరి. ఇట్లు రక్షకులు ఉన్మత్తమైక ములో పడియుండఁగా వాఁడు రాత్రి కట్టెలు తెచ్చి కర్పరుని దేహమును దహనము చేసెను. వాఁడుపోయిన పిమ్మట తెల్లవాఱఁగా రాజు వృత్తాంత మెఱిఁగి ఆమూఢులను తొలఁగించి వేఱు రక్షకులను పెట్టి వారితో 'ఈ యస్థులను జాగ్రత్తగా కాపాడుఁడు, వానిని గొన వచ్చువానిని పట్టుకొనుఁడు. ఎవరివలనను ఏభక్ష్యమును గ్రహింపకుఁడు.' అని యాజ్ఞాపించెను. అట్లే రక్షకులు రేయుంబవలు మిక్కిలి జాగరూకతతో నుండిరి.

ఘటుఁడు ఈవృత్తాంతము తెలిసికొని చండికావరలబ్ధమైన మోహ మంత్రముచే కార్యము సాధించువాఁడై తనమిత్త్రుని ప్రవ్రాజకు నొకని సహాయునిఁగాఁ గొని అతని మంత్రజపముచే రక్షులను తెలివి తప్పించి తాను కర్పరునియస్థులను కొని గంగలో వైచి ప్రవ్రాజకునితోఁ గూడ ఇంటికి వచ్చి ఆవృత్తాంతము రాజపుత్త్రికిఁ జెప్పి సుఖ ముండెను. రాజు అస్థిహారణము రక్షిమోహమును విని సుతాహరణము మొదలు సమస్తము యోగిచే నను స్థితమని ఎంచి 'ఏయోగి నాతనయను హరించుట మొదలగు కార్యములు చేసెనో అతఁడు బయటికి వచ్చునెడల నతనికి అర్ధరాజ్య మిచ్చెద' నని నగరమున చాటిం

పించెను. ఆచాటింపు విని ఘటుఁడు బయలు వడఁగోరెను. 'వలదు, రాజును నమ్మవలదు మోసమున నమ్మించి రాజు నిన్ను చంపును.' అని రాజపుత్త్రి బోధింపఁగా ఘటుఁడు మానుకొనెను. పిమ్మట తనరహస్యము బయలువడు నని వెఱచి ఘటుఁడు రాజపుత్త్రితోను ప్రవ్రాజకునితోను దేశాంతరము పోయెను. దారిలో రాజపుత్త్రి ప్రవ్రాజకునితో రహస్యమున ని ట్లనియె: 'ఒకఁడు, నన్ను ధ్వంసము చేసెను. ఈ రెండవవాఁడు నన్ను నాచోటినుండి వెలికి తెచ్చెను, ఆదొంగ చచ్చెను. వీఁడు ఇంక చావలేదు. నీవు నాకు కడుం బ్రియుఁడవు.' ఇట్లు సెలవిచ్చి వానితోఁగూడ ఘటుని విషము పెట్టి చంపెను.

## ధ న దే వ భా ర్యా క థ.

పిమ్మట ఆపాపాత్మురాలు ప్రవ్రాజకునితో పోవుచు ధనదేవుఁ డనువర్తకుని దారిలోఁ గలసి 'వీఁ డేల కాపాలికుఁడు? నాకు నీవు ప్రియుఁడవు.' అని వణిజుని బోధించి నిద్రించుచున్న ప్రవ్రాజకుని వదలి వణిజునితో పోయెను. ప్రవ్రాజకుఁడు తెల్లవాఱఁగానే మేల్కొని రాజకన్య పోయిన దని యెఱిఁగి 'స్త్రీలకు చాపలము తప్ప స్నేహము గాని విశ్వాసము గాని లేదు. ఈ పాపాత్మురాలు నన్ను నమ్మించి నాధనమును కూడ హరించి పలాయిత యైనది. ఘటునివలె చంపక నన్ను వదలుటయే నాకు లాభము.' అని యాలోచించుకొని తన దేశమునకుఁ బోయెను. రాజసుతయు వణిజునితోఁగూడ అతని దేశమునకుఁ బోయెను.

'ఈబంధకిని ఎట్లు ఇంటికి కొనిపోదును. అని తలపోసి ధనదేవుఁడు దానితోఁగూడ సాయంకాలమున నొక ముసలిదాని యింట బస చేసి రాత్రి ఆముసలిని 'అమ్మా, ధనదేవ వర్తకుని యింటి వృత్తాంత మే మయిన నెఱుఁగుదువా?' యని అడిగెను. ముసలిది చెప్పెను:—'ఏమివార్త! వానిభార్య దొరకిన క్రొత్త వాని నెల్లఁ గూడుచున్నది. రాత్రి కిటికీగుండ తోలుపెట్టె యొకటి త్రాట వ్రేల వేయుదురు. అందులో ఎవఁడు కూర్చుం డునో వానిని లోనికి చేదుదురు. అగ్లే తెల్లవాఱు జామున వెలుపలికి వదలుదురు. అది పానమత్త యై ఏమియు చూడదు. దాని యీస్థితి యీ నగరములో అతివిఖ్యాతము. దానిపతి చిరకాల మయినది పోయి, ఇంకను రాలేదు.'

ముసలిది చెప్పిన యీ వృత్తాంతము విని ధనదేవుఁడు తత్క్షణమే యుక్తిగా వెలువడి దుఃఖించుచు నచటికిఁ బోయెను. దాసీజనములు కిటికీనుండి పెట్టెను దించిరి. అతఁడును అందులో కూర్చుండెను. వారు పైకి చేదిరి. అతని భార్యయు అతని నెఱుఁగక మధాంధ యై అతనిని బిగువుగాఁ గౌఁగిలించి శయనమునకుఁ దార్చెను. దానిదోషము స్పష్టమె నందున వానికి క్రీడాభిలాష కలుగదాయెను. భార్యయు కైపుచేత నిద్ర పోయెను. వేఁకువను చేటికలు గవాక్షముగుండ త్వరత్వరగా అతనిని వెలువరించిరి. వెలువడి వణిజుఁడు ఖిన్నుఁడై 'నాకు ఇంటియాస చాలును. ఇంటికి స్త్రీలు కారణము ; వారిచరిత్ర

మిట్టిది. కావున వనము మేలు.' అని నిశ్చయించుకొని రాజును తను గూడ త్యజించి దూరముగా అడవికిఁ బోయెను.

## రు ద్ర సో ము ని భా ర్య క థ.

దారిలో రుద్రసోముఁ డను బ్రాహ్మణుఁడు చిరప్రవాస నివృత్తుఁడు మిత్త్ర మాయెను. వణిజునివలన వణిగ్భార్యకథను విని బ్రాహ్మణుఁడు తనభార్యయందు శంకగలవాఁడై సాయంకాల మున తన గ్రామము చేరెను. అచట తనయింటిచెంత ఏటియొ డ్డున కైపుచేతనుంబోలె పాడుచున్న యొకగొల్లవానిని కని బ్రాహ్మణుఁడు 'గొల్లవాఁడా నిన్ను కామించిన తరుణి యెవ తెయో నీకు కలదు. ఆగాగ వలన లోకమును తృణప్రాయ ముగా తలఁచుచు కై పెక్కి పాడుచున్నావు.' అనెను. గొల్ల నవ్వుచు చెప్పెను:—'నాకు దాఁపవలసిన దే మున్నది? రుద్ర సోముఁడు బ్రాహ్మణుఁడు గ్రామాధికారి చిరకాలమైనది దేశాం తరము పోయి. నేను అతనిభార్యను సదా కూడుదును. ఆమె దాసి నన్ను స్త్రీ వేషమున లోపల ప్రవేశపెట్టును' గోపాలుని వలన ఈ మాట విని దుఃఖమును మనస్సులో అణఁచుకొని రుద్ర సోముఁడు తత్త్వము నిశ్చయించుకొనఁ గోరి 'అట్లయిన, నీకు నేను అతిథిని, నీ యీవేషమును నా కిమ్ము. నేను నీవేషమునఁ బోయెదను. నాకు కౌతుకముగా నున్నది.' అని యడిగెను. 'అట్లే కా నిమ్ము. ఇదిగో నానల్లకంబళి. ఇదిగో నాదుడ్డుఁగఱ్ఱ, పుచ్చుకొమ్ము. దాసి వచ్చువఱకు ఇచటనే యుండుము. నన్నుఁ

గా భావించి అది స్వయముగా నిన్ను పిలిచి నీకు స్త్రీవేషము నిచ్చును. ఈరాత్రి నీ వచటికి పొమ్ము నేను విశ్రమించెదను.' అని గోపాలుఁడు చెప్పఁగా రుద్రసోముఁడు లగుడకంబళములను పుచ్చుకొని వానివేషమున అచట నుండెను. గోపుఁడు వణిజుని తోఁగూడ కొంచెముదూరమున నుండెను. దాసియు వచ్చి పలుకకుండనే చీఁకటిలో రుద్రసోముని గొల్లవాఁ డని తలఁచి స్త్రీవేషము వేసి రమ్మని వెంటఁ గొని పోయెను. అతఁడు ఇంటికి పోయి తనభార్య గోపాలుఁ డను తలంపునఁ తన్నుఁగని లేచి కౌఁగిలించుకొనఁగా నిట్లు తలపోసెను: 'నికృష్టు నైనను దగ్గఱ నున్న వానిని దుష్టస్త్రీలు కామింపుదురు. ఈ పాపాత్మురాలు ఆసన్నవర్తిని గొల్లవానిని కామించుటయే నిదర్శనము.' ఇట్లు తలంచుచు అస్ఫుటవాక్కుగా ఏదో మిష చెప్పి వెంటనే వెలువడి ధనదేవునికడకు వచ్చి, తన యింటివృత్తాంతము తెల్పి, 'నీతోఁగూడ నేనును వనమునకు వచ్చెదను. ఇల్లు నాశమై పోవునుగాక' అని పలికెను. అట్లే యిరువురును గలసి వనమునకు పోవుచుండిరి.

## శశిభార్యకథ.

అనంతరము దారిలో వారిని ధనదేవునిచెలికాఁడు శశి యను నతఁడు కలసికొనెను. మాటలవరుసను వారు అతనితో తమగృహావృత్తాంతమును చెప్పిరి. ఈర్ష్యాళు వైన శశి చిరకాలమునకు దేశాంతరమునుండి వచ్చినవాఁడు తన భార్యను

తాను నేలమాళిగలో పెట్టి పోయియు వారివృత్తాంతములవలన ఆమెయందు శంకగలవాఁడై వారితోఁగూడ పోవుచు సాయంకాలమునకు తనయింటి చెంతకు వచ్చెను. వారికి తనయింట ఆతిథ్యము చేయ నుద్దేశించెను. ఇంతలో నచట దుర్గంధవహుఁడును కుష్ఠశీర్ణకరపాదుఁడును అగు నొకఁడు పాడుచుండెను. ఆశ్చర్యపడి శశి వానిని 'ఇట్లున్నావు, ఎవఁడవు నీవు?' అని యడిగెను. నేను కామదేవుఁడను, అని కుష్ఠి పలికెను. 'సందేహమేమి ? నీ రూపశోభయే నీవు కామదేవుఁడ వని చెప్పుచున్నది.' అని శశి పలుకఁగా వాఁడు మరల నిట్లనియె.—'ఇట శశి యని ఒక ధూర్తుఁడు ఈర్ష్యాళువు ఒక పరిచారికను మాత్రము ఇచ్చి భార్యను భూగృహములో ఉంచి దేశాంతరము పోయినాఁడు. విధివశమున ఆభార్య నన్నుఁ గని మదనాకృష్టచిత్తయై తన్ను నా కర్పించుకొన్నది. అది మొదలు నేను దానితో రాత్రిరాత్రియు క్రీడించుచున్నాను. దాసి నన్ను వీఁపునఁ గొని లోపలికి మోచుకొని పోవును. చెప్పుము అన్యస్త్రీలను పొందు నేను కామదేవుఁడను గానా ? చిత్రాకారధారిణికి శశిభార్యకుఁ గూడ నేను ప్రియుఁడను గదా.' పిడుగువలె దారుణ మయిన యీకుష్ఠివచనము విని శశి దుఃఖమును దాఁచుకొని వానితో నిట్లనియె.-'నిజముగా నీవు కాముఁడవు. ని న్నొకటి వేఁడెదను. నీవు చెప్పఁగా ఆ చెలువపై నాకును కౌతూహలము కలుగుచున్నది. నీవేషమున ఈరాత్రి దానికడకు నేను బోయెదను,

నాయందు దయచేయుము, నీకు ప్రతిదినము కలుగువిషయమున ఒకనాఁటి కేమి నష్టి!' కుష్ఠి 'అట్లే కానిమ్ము, నా వేషమును నీవు గైకొని నీవేషమును నాకిమ్ము. నావలె కాలుసేతులు గుడ్డతోఁ గప్పుకొని ఇచటఁ గూర్చుండుము. చీఁకటి ప్రబలఁగానే దాసి వచ్చును. నన్నుఁగా నెంచి నిన్ను వీఁపునఁ గొనిపోవును. నేను పాదవైకల్యముచే సదా ఆతీరున అచటికి పోవుదును.' అని చెప్పెను. శశియు వానివేషము వేసికొని యచట నుండెను. అతనిసహాయు లిరువురును కుష్ఠియు దూరమున నుండిరి. ఇంతలో దాసివచ్చి కుష్ఠివేషుని శశిని కని కుష్ఠినిగాఁ దలంచి రమ్మని వీఁపున నెక్కించుకొని తన దొరసానికడకు కొనిపోయెను. ఆమెయుఁ భూగృహాంతరమున కుష్ఠిజారుని ఎదురు సూచుచుండెను. అచట అంధకారములో దుఃఖించుచుండిన యామెను అంగస్పర్శచేత తనభార్యయే అని తెలిసికొని శశి వైరాగ్యము పొందెను. ఆమె నిద్రించినపిమ్మట శశి అలక్షితముగా వెలువడి ధనదేవ రుద్రసోముల కడకు వచ్చి వారికి తన వృత్తాంతమును తెలిపి ఖిన్నుఁడై 'అయ్యో! అయ్యో! స్త్రీలు నీచాభిపాతినులు, లోలలు, దూరమున మనోరమలు, సుక్షోభ్యలు, శ్వభ్రాపగల వలె రక్షింప శక్యలుగారు. భూగృహములలో నుంచినను నా భార్య కుష్ఠిని పొందినది కావున నాకుఁ గూడ వనమే మేలు. ఇసీ! ఇట్లేల!' అని సముదుఃఖులైన యావిప్రవణిజులతోఁ గూడ ఆ రాత్రి గడపెను.

## నాగభార్య కథ.

తెల్లవాఱఁగా ముప్పురును వనమునకు తరలిరి. సాయం కాలమున దారితో చెట్టును బావియు నున్నచోట బస చేసిరి. భోజనము కావించి జలము త్రాగి రాత్రి ఆ చెట్టెక్కి యుండిరి. వారు చూచుచుండఁగా ఒక బాటసారి వచ్చి చెట్టు క్రింద పరుండి నిద్రించెను. క్షణములో బావినుండి యొక పురుషుఁడు వెలువడి నోటినుండి ఒక స్త్రీని పానుపును వెలువరించెను. అతఁడు దాని తో క్రీడించి శయనీయమందు నిద్రించెను. ఆ స్త్రీ ఆపాంథునితో గూడెను. క్రీడాంతమందు వాఁడు మీరెవరని దాని నడుగఁగా అది 'ఇతఁడు నాగుఁడు, నేను ఇతనిభార్యను నాగకన్యను. భయపడకు, నేను నీవంటిపాంథులు తొంబదితొమ్మండుగురతో కూడి యున్నాను. ఇప్పుడు నీవలన శత సంఖ్యాపూర్తి అయినది.' అని చెప్పెను. ఇట్లు నాగాంగన పలుకు చుండఁగా దైవవశమున నాగుఁడు మేల్కొని కని నోటినుండి జ్వాలలను నెఱపి ఆయిరువురను భస్మము చేసి బావిలో మునింగి పోయెను. 'స్త్రీలను దేహమందే దాఁచుకొన్నను రక్షింప శక్యము గాదు, ఇంట నుంచి రక్షింప శక్యమా!' అని యాముప్పురును తమలో తాము చెప్పుకొనుచు రాత్రి గడపి సుఖితులై తెల్లవాఱఁగానే వనమునకు తరలిరి.

వనమున ముప్పురును మైత్ర్యాదిభావనల నభ్యసించి చిత్తశాంతి చేసికొని నియతులై సర్వభూతసౌమ్యులై నిరుపమ

పరానందభూమి యగు సమాధియందు సిద్ధిఁబొంది క్రమముగా తమస్సును నాశముచేసి మోక్షము పొందిరి. వారి యా దుష్ట స్త్రీలు నిజపాపపరిణామ మైన కష్టదశలను అనుభవించి త్వరలో నష్ట లై లోకద్వయభ్రష్ట లై పోయిరి. ఈ ప్రకారము స్త్రీల యందు మోహప్రభవ మైనరాగము ఎవరికి దుఃఖమును కలిగింపదు! వారివిషయ మై వివేకము వహించినవారికి వైరాగ్యము మోక్షము నొసంగును. శక్తియశక్తై ఉవ్విళ్లూరుచున్న నరవాహన దత్తుఁడు ఇట్లు గోముఖుఁడు చెప్పిన కథవలన వినోదము పొంది రాత్రి మెల్లగా సుఖనిద్రం జెందెను.

---

## ౯-వ త ర ం గ ము.

### బో ధి స త్త్వా ం శ భ వు ని క థ.

మఱుసటిరాత్రి గోముఖుఁడు నరవాహనదత్తుని వినోద పఱుచువాఁ డై ఈకథ చెప్పెను:—ఒక నగరములో బోధి సత్త్వాంశసంభవుఁడు ఒక గొప్ప వర్తకుని కొమరుఁడు మాతృహీనుఁడు ఉండెను. తండ్రి మరల పెండ్లియాడి రెండవ భార్య మాటలు విని ఈకుమారుని ఇంటినుండి తఱుమఁగా ఇతఁడు భార్యతోఁగూడ వనవాసమునకుఁ బోయెను. తనతమ్ముఁడును, తన్నుంబోలె తండ్రి తఱుముడు, తనతోఁ గూడ వచ్చుచుండఁగా అశాంతచిత్తు నతని విడిచి తాను వేఱుమార్గమునఁ

బోవుచు, జలతృణావృక్షశూన్య మై ఎండకు కాలుచున్న యొక గొప్ప మరుమహారణ్యము చేరెను. చేత ఆహార మేమియు లేదు. అందు ఏడుదినములు ఆఁకటికి డప్పికి డస్సినభార్యను బుజము మీఁద ఎక్కించుకొని నడచుచు, తన రక్తమాంసములతో పోషించుచుండెను. ఆ పాపాత్మురాలు వానిని ఆప్రకారము భక్షించుచుండెను. ఎనిమిదవ దినమున నదీతరంగవాచాలమును సత్ఫల సచ్ఛాయవృక్షము నగు గిరికాననము చేరెను. ఆచట బడలియున్న భార్యను మూలఫలాంబువులతో సేదదేర్చి తాను స్నానార్థము కల్లోలమాలారమణీయ మైన కొండవాకలోనికి దిగెను. అందు ఒక పురుషుఁడు కాలు సేతులు తఱిగిన మొండెము కొట్టుకొనిపోవుచు ఇతనిని గని రక్షింపు మని అంగలార్చెను. బహూపవాసక్లాంతుఁ డయ్యును ఈమహాసత్త్వుఁడు లోఁతునకు బోయి వానినిబట్టి గట్టు చేర్చెను. 'తమ్ముఁడా, నీకు ఇట్టి య పాయమును ఎవరు చేసినారు?' అని ఈతఁడు కరుణచే అడుగఁగా ఆమొండెము 'అన్నా, నాకు దుఃఖమరణము కలిగించుటకై శత్రువులు కాలుసేతులు తఱిగి నదిలో పాఱవైచిరి, నీవు రక్షించితివి.' అని చెప్పెను. వానికి ఆబోధిసత్త్వుఁడు గాయములు కట్టి ఆహారము పెట్టి తరువాత తాను స్నానాదికము చేసెను. పిమ్మట ఆయడవిలోనే వణిక్పుత్త్రుఁడు సభార్యుఁ డై మూలఫలాహారుఁ డై తపస్సు చేసికొను చుండెను.

ఒకనాఁడు అతఁడు ఫలమూలములకై పోఁగా భార్య ఈలోపల గాయములు కుదిరి యున్న యా మొండెముతో కామాతుర యై క్రీడించెను. పిమ్మట అది వానియం దనురక్త యై వానితో కలయఁ బలికికొని భర్తను చంప నిశ్చయించుకొని మఱునాఁడు తనకు మాంద్యవ్యాధిగలిగినట్లు అభినయించెను. దాఁటరాని నదిలో దిగరాని గోతిలో నున్న యొక తీఁగను పతికి చూపి పాపాత్మురాలు ఇట్లనియె: 'ఈమహౌషధిని నీవు నా కొఱకు తెచ్చిన నేను బ్రదుకుదును. ఈయోషధిని ఇచట నున్న దని దేవత నాకు స్వప్నములో చెప్పినది.' సరియే యని యితఁడు ఒకత్రాటికి గడ్డిచుట్టి చెట్టునకు వ్రేలఁగట్టి దానినిపట్టుకొని ఓషధికొఱకు గోతిలోనికి దిగెను. దిగఁగానే భార్య త్రాటిని విప్పి వేసెను. అంత నతఁడు నదిలో పడి ప్రవాహముబడి బలు దూరమునకుఁ గొట్టుకొనిపోయి ఒక నగరమున గట్టెక్కి స్త్రీమాయను తలపోయుచు నీటం దడిసిన బడలికచేత నొకచెట్టు క్రింత పరుండి నిద్రపోయెను. ఆ సమయమున ఆనగరమున రాజు మృతిఁ బొందెను. ఆదేశమున రాజు మృతి నొందినప్పుడు జరుగునాచారము ఏ మన, మంగళగజమును పురజనులు ఊరఁద్రిప్పుదురు, అది ఎవరిని తుండముతో ఎత్తి తనపై నెక్కించుకొనునో అతఁడు రాజగును. ఇప్పుడు మంగళగజము వణిక్సుతుని కడకు అతనిధైర్యమునకు సంతోషించిన బ్రహ్మదేవుఁడోయన వచ్చి తొండముతో నతని నెత్తి తనవీఁపుపై నెక్కించుకొనెను.

వెంటనే బోధిసత్త్వాంశసంభవు నా వణిక్పుత్త్రుని ప్రకృతులు నగరిలోనికి కొనిపోయి రాజునుగా అభిషేకము చేసిరి. అతఁడు రాజ్యము పొంది కరుణాశాంతులతో క్రీడించు చుండెనే గాని చపలమతు లగు స్త్రీలను గూడ లేదు.

అతనిభార్యయో అతఁడు నదిలో చచ్చె నని తలఁచి, నిశ్శంకముగా ఆజారుని వీఁపుమీఁద నెక్కించుకొని, తిరుగుచు 'నేను పతివ్రతను, నాపతి నితనిని వైరులు కాలునేతులు కొట్టినారు. ఇతనిని భిక్ష మెత్తి రక్షించుచున్నాను, నాకు భిక్షము పెట్టుఁడు.' అని గ్రామగ్రామమునను నగరనగరమునను బిచ్చ మెత్తుచు క్రమక్రమముగా తనపతి యేలుచున్న యా నగరమునకు వచ్చెను. అచటను ఎప్పటియట్లు బిచ్చ మెత్తుచు పౌరులచే పతివ్రత యని పూజలు పొందుచు క్రమముగా అతనిచెవిని పడినది. అంత నతఁడు దానిని పిలిపించెను. అదియును వీఁపున మొండెమును మోచుకొని వచ్చెను. రాజు దానిని 'నీవా ఆపతివ్రతవు ?' అని యడిగెను. అదియు రాజశ్రీతేజస్సుచే పరివృతుఁ డైనయాతని తనభర్తనుగా నెఱుంగ నేరక 'దేవా, నేనే ఆపతివ్రతను.' అని పలికెను. రాజు నవ్వుచు ని ట్లనియె: 'నీపాతివ్రత్యమును నేనుఫలముచే తెలిసికొంటిని. చేతులు చక్కనున్న భర్త స్వరక్తమాంసములతో పోషించినను అతనికి స్వీకరింప శక్యవు కాని మానుషరాక్షసివి! సర్వదా నారక్త మాంసములు హరించియు వికలునికి ఈ మొండెమునకు స్వా

ధీనపడి వాహానము వయితి వది ఎట్లు? నిరపరాధుని పెండ్లి యాడిన భర్తను ఏటిలోఁ ద్రోచితివి! ఆపాపమున ఈ మొండె మును మోచుచున్నావు.' ఇట్లు వృత్తాంతము అతఁడు బయలు పెట్టఁగా అది పతిని తెలిసికొని భయముచే మూర్ఛితవలెను వ్రాసినబొమ్మవలెను, చచ్చినదానివలెను ఆయెను. అంత అమా త్యులు 'దేవా, ఏమి ఈ యాశ్చర్యము? అని కుతూహలముచే నడుగఁగా రాజు యథావృత్తము వారికి చెప్పెను. వారు భర్తృద్రోహిణి యని దాని నెఱిఁగి ముక్కుచెవులు కోసి అంకము చేసి మొండెముతోఁ గూడ దేశము వెడలఁగొట్టిరి. ముక్కుపోయినదానికి రుండునితోను, బోధిసత్త్వునికి రాజ్య శ్రీతోను తగిన యోగమును ఇప్పటికి విధి చూపించెను. ఇట్లు నీచైకాభిముఖమును అవిచారము నగు దైవచిత్తముఁం బోలె స్త్రీచిత్తము ఎఱుఁగరానిదిగా నున్నది. ఇట్లు శీలము వద లక క్రోధమును జయించిన సత్త్వవంతులకు మెచ్చుకొన్నది బోలె అప్రార్థితముగానే సంపద స్వయముగా వచ్చును. ఇట్లు కథను ముగించి గోముఖమంత్రి మరల నరవాహానదత్తునికి చెప్పం దొడంగెను.

బోధిసత్త్వాంశుఁడు మహాసత్త్వుఁ డొకానొకఁడు ఒక వనములో గుడిసె వేసికొని కరుణైకాగ్రహృదయుఁడై తపస్సు చేయుచు ఆపత్ప్రాప్తము లయిన జంతువులను పిశాచములను గూడ రక్షించుచు ఇతరములను తనప్రభావముచేత అన్నపాన

ములతో కాపాడుచు ఉండెను. ఒకప్పుడు పరోపకారార్థము అతఁడు అడవిలో తిరుగుచు ఒకగొప్పబావిని కని లోపలికి తొంగి చూచెను. అందు ఒకస్త్రీ ఉండి అతనిం గని బిగ్గరగ, 'ఓమహాత్ముఁడా, నేను స్త్రీని ; నేను, స్వర్ణశిఖపక్షి, సింహము, పాము, నలువురమును రాత్రి ఈనూతిలోపల పడితిమి. అనుగ్రహించి మమ్ము ఈకష్టమునుండి రక్షింపుము.' అని యంగలార్చెను. బోధిసత్త్వుఁడు 'మీరు ముగ్గురును చీఁకటివలన నూతిలో పడితిరేని పక్షి పడుట యెట్లు?' అని అడిగెను. 'అది బోయవానివలలోఁ దగులుకొని పడినది.' అని స్త్రీ పలికెను. అంత నతఁడు తనతపశ్శక్తిచే వారిని ఎత్తుటకు యత్నింపఁగా అతని సిద్ధి పోయినది, ఎత్తలేఁడాయెను. ఈ స్త్రీ నిశ్చయముగా పాపాత్మురాలు, కావుననే దీనితో మాటలాడినందున నాసిద్ధి పోయినది, కావున మఱి యే మయిన యుక్తి చేసెదను.' అని మహాసత్త్వుఁడు వారి నందఱను కూపమునుండి గడ్డివెంటి త్రాటితో ఉద్ధరించెను. వారును అతనిని స్తుతించుచు వెలువడిరి. అతఁడు ఆశ్చర్యపడి సింహ పక్షి భుజంగములను 'ఇట్టి వ్యక్త వాక్కు మీకు ఎట్లు గలిగినది? మీ వృత్తాంత మేమి? చెప్పుఁడు' అని యడిగెను.

సింహము చెప్పెను:— మేము వ్యక్తవాక్కులము, పూర్వజన్మజ్ఞానవంతులము, అన్యోన్య ఘాతకులము, మా వృత్తాంతమును వినుము. హిమవత్పర్వతమందు వైదూర్య శృంగ

మని నగర మొకటి కలదు' అందు పద్మవేగుఁ డనువిద్యాధ రేశ్వ రుఁడు కలఁడు. అతనికి వజ్రవేగుఁడని కుమారుఁడు కలిగెను. వజ్ర వేగుఁడు విద్యాధరలోకమున నివసించుచు ఎవరితోనో శౌర్య మదముచే విరోధము చేసికొనెను. వల దని వారించినతండ్రి మాట లక్ష్యపెట్టకయుండఁగా తండ్రి మర్త్యలోకములో పుట్టు మని వానిని శపించెను. అంత పొగరణఁగి విద్యలు పోయి శాప హతుఁడై ఏడ్చుచు వజ్రవేగుఁడు తండ్రిని శాపాంతము యాచిం చెను. అంతట తండ్రి పద్మవేగుఁడు క్షణముధ్యానించి 'భూ మిలో బ్రాహ్మణపుత్రుఁడవై మరల ఇట్టి మదకృత్యములు చేసి తండ్రిశాపమున సింహమవై నూతిలో పడుదువు. మహాసత్త్వుఁ డొకఁడు నిన్ను ఉద్ధరించును. అతనికి ఆపదయందు ప్రత్యుపకా రముచేసి ఈ శాపమునుండి మోక్షముపొందుదువు.' అని వానికి శాపాంతము ననుగ్రహించెను. అంతట వజ్రవేగుఁడు మాళవ దేశములో హరఘోషుఁ డను బ్రాహ్మణునికి సుతుఁడుగా దేవ ఘోషుఁడనుపేర జనించెను. అచటను వాఁడు శౌర్యగర్వితుఁడై పలువురతో వైరము చేసికొనెను. పలువురతో వైరము వలదు, అని వారించిన విననందున తండ్రి 'ఓరి దుర్బుద్ధీ, నీవు శౌర్యాభి మానివి కావున ఇప్పుడే సింహమవు గమ్ము.' అని శపించెను. ఆశాపముచేత దేవఘోషుఁడు విద్యాధరావతారుఁ డయ్యును మరల అడవిలో సింహమై ఉండెను. నేనే ఆసింహమను. నేను రాత్రి తిరుగుచు దైవవశమున ఈ కూపములో పడితిని. ఓ

మహాసత్త్వా, నీవు న న్నుద్ధరించితివి. నేను పోయెదను. నీ కెప్పు డయిన నాపద గలిగిన నన్ను తలంచుకొనుము. వచ్చి నీకు ఉపకారము చేసి నేను శాపమోక్షము పొందెదను.—

ఇట్లు పలికి సింహము పోఁగా బోధిసత్త్వుఁ డడుగఁగా సువర్ణచూడము తనవృత్తాంతము చెప్పసాగెను.—హిమాచలములో విద్యాధరాధీశుఁడు వజ్రదంష్ట్రుఁడు కలఁడు. అతనికి దేవియందు వరుసగా నైదుగురు కన్యలు పుట్టిరి. అంత నతఁడు శివునిఁగూర్చి తపస్సు చేసి రజతదంష్ట్రుఁ డను కొమరుని ప్రాణాధిక ప్రియుని పొందెను. వాఁడు బాల్యముననే స్నేహముచే తండ్రిచేత దత్తవిద్యుఁ డై బంధునేత్రోత్సవముగా వర్ధిల్లుచుండెను. ఒకనాఁడు రజతదంష్ట్రుఁడు తనజ్యేష్ఠసోదరి గౌరి యెదుట పింజరక మను వాద్యమును వాయించుచుండఁగా చూచి 'నా చేతికిమ్ము, పింజరకమును నేను వాయించెదను.' అని బాల్యచాపలముచేత నిర్బంధముగా అడిగెను. ఆమె ఈయలేదు. అంత నతఁడు చాపలముచే స్వయముగా ఆమెచేతినుండి ఒడిసి కైకొని పక్షివలె మింటి కెగసెను. అంత నామె 'నాచేతిపింజరకమును హరమున హరించి ఎగిరితివి గాన నీవు స్వర్ణచూడపక్షి వౌదువు.' అని శపించెను. రజతదంష్ట్రుఁడు ఆమెపాదములఁ బడి వేఁడుకొనఁగా కరుణించి 'మూఢ, నీవు పక్షివై చీఁకటినూతిలో పడుదువు, అప్పుడు కరుణాపరుఁ డొకండు నిన్ను ఉద్ధరించును. అతనికి ఉపకారముచేసి శాపాంతము పొందుదువు.' అని యామె

శాపాంత మేర్పఱిచెను. అంతట తమ్ముఁడు స్వర్ణచూడపక్షిగాఁ బుట్టెను. నేనే ఆపక్షిని, రాత్రి గోతిలోఁ బడితిని. నీవు నన్ను ఉద్ధరించితివి. ఇప్పుడు నేను పోయెదను. ఆపత్కాలమందు నన్ను తలఁపుము, నేను వచ్చి నీకు ఉపకారము చేసి శాపమోక్షము పొందెదను.—

ఇట్లు చెప్పి పక్షి పోయెను. బోధిసత్త్వుఁ డడుగఁగా పాము తన వృత్తాంతమును చెప్పసాగెను. —పూర్వము నేను కశ్యపాశ్రమములో నొకమునికుమారుఁడనుగా నుంటిని. నాకు అచట నొకమునికుమారుఁడు చెలికాఁ డుండెను. ఒకనాఁడు నావయస్యుఁడు స్నానార్థము సరస్సులో దిగెను. నేను గట్టున ఉంటిని. ఆసమయమున అచటికి మూఁడుపడగల పా మొకటి వచ్చెను. నేను నాచెలికానిని నవ్వులాలకు భయపెట్టుటకై ఆ పామునకు మంత్రబలముచే కట్టు వేసితిని. క్షణములో నతఁడు స్నానమై గట్టెక్కి మహాసర్పమును ఆకస్మికముగాఁ గని భయపడి మూర్ఛితుఁ డాయెను. చాల సేపటికి నాప్రయత్నములవలన తేఱి, నేను చేసిన కుచోద్యమును ధ్యానదృష్టిచే నెఱిఁగి కోపముచే నన్ను 'ఇట్లే నీవు మూఁడుపడగల పామవు గమ్ము.' అని శపించెను. అంత నే ననునయింపఁగా ఋషి పుత్త్రుఁడు 'సర్పమవై నూతిలో పడిన నిన్ను ఒకఁడు దయచే ఉద్ధరించును. అతనికి ఉపకారము చేసి ఈశాపమును ఉత్తరింతువు.' అని శాపాంతము చెప్పి పోయెను. నేను సర్పమనైతిని, నూతిలోఁ బడితిని, నీవు

రక్షించితివి. ఇఁక పోయెదను. నీవు నన్నుఁ దలఁచుకొన్న వచ్చి నీకు ఉపకారము చేసి శాపమునుండి మోక్షము పొందెదను.

ఇట్లు పలికి పాము పోఁగానే స్త్రీ తనవృత్తాంతము చెప్పసాగెను. నేను ఒకక్షత్త్రియపుత్త్రునిభార్యను. అతఁడు శూరుఁడు, అందగాఁడు, దాత, మానవంతుఁడు, రాజునొద్ద కొలువు గలవాఁడు. భర్త అట్టివాఁ డయినను పాపాత్మురాలను నేను పరపురుష సంగమము కావించు చుంటిని. దాని నెఱిఁగి భర్త నన్ను దండింపఁదలఁచెను. సఖీముఖమున ఆయుద్యమము నెఱిఁగి నేను రాత్రి పలాయిత నై ఈవనము సొచ్చి నూతిలోఁ బడితిని, నీవు ఉద్ధరించితివి. నీ యనుగ్రహముచేత ఎచటికైనను బోయి జీవించెదను. నీకు నేను ప్రత్యుపకారము చేయుదినము కలుగును గాక.

ఇట్లు పలికి ఆ కులట బోధిసత్త్వునియొద్ద సెలవు పుచ్చుకొని గోత్రవర్ధనుఁడను పేరి రాజునగరమునకుఁ బోయి, అతనిపరివారజనముతో చెలిమి చేసికొని పట్టపుదేవియొద్ద దాసిగా చేరి జీవించుచుండెను. ఆ స్త్రీతో సంభాషించినదోషముచే బోధిసత్త్వునికి సిద్ధులు పోయి అడవిలో కందమూలఫలాదులు కూడ దొరకవాయెను. అతఁడు ఆఁకటికిని దప్పికిని తాళలేక ముందుగా సింహమును తలంచుకొనెను. వెంటనే సింహము వచ్చి అతనికి మృగమాంసము తెచ్చిపెట్టి పోషించెను. కొంతకాలము అతనిని మాంసాహారములచేత స్వస్థపఱిచి, సింహము

తన శాపముతీఱిన దని చెప్పి సింహరూపము మాని విద్యాధర రూపము దాలిచి బోధిసత్త్వునియొద్ద సెలవు పుచ్చుకొని తన యథాస్థానమునకుఁ బోయెను.

అంత బోధిసత్త్వుఁడు జీవనక్లేశము పొంది స్వర్ణచూడ పక్షిని తలంచుకొనెను. పక్షియు వచ్చి వృత్తాంత మడిగి తెలిసి కొని క్షణములో ఎటకో పోయి రత్నాభరణపూర్ణ మయిన బరణి యొకటి తెచ్చి అతని కిచ్చి 'ఈధనముతో నీవు శాశ్వ తముగా జీవింప వచ్చును, నాకును శాపము తీఱినది. నీకు క్షేమ మగును గాక. నేను పోయి వచ్చెదను.' అని చెప్పి విద్యాధర కుమారుఁడై స్వలోకమునకు ఆకాశమార్గమునఁ బోయి తన తండ్రియొద్దకు నేఁగి అతనివలన రాజ్యాధికారము పొందెను. బోధిసత్త్వుఁడును ఆరత్నములను అమ్ముటకై తిరుగుచు క్రమ ముగా కూపోద్ధృత యైన యా కులట యున్న నగరమునకుఁ బోయెను! అందు విజన మైన యొక ముసలి బ్రాహ్మణియింట ఆభరణకరండమును ఉంచి బజారునకు పోఁగా అచట కూపో ద్ధృత కులట యుండెను. ఇరువురును ఒండొరులం గనిరి. సంభాషణలో కులట తాను రాజమహిషియొద్ద నున్నట్లు తెలిపెను. అది యాతని వృత్తాంత మడుగఁగా నిష్కపటుఁడు అతఁడును స్వర్ణచూడపక్షివలన తనకు రత్నాభరణకరండకము లభించినవిధముం దెలిపి దానిని ముసలిదానియింటికి వెంటఁ బెట్టుకొని పోయి రత్నాభరణమును చూపెను. ఆశఠ పోయి

యావృత్తాంతము తనదొరసానికి రాణికి చెప్పెను. స్వర్ణచూడ పక్షి రాణి యింటినుండి రాణి చూచుచుండఁగానే యుక్తిగా ఆభరణకరండమును మున్ను కొనిపోయినది. ఇప్పుడు రాణి ఆయాభరణము మరల తననగరమునకు వచ్చియున్న వృత్తాంత మును ఆస్త్రీవలన విన్నదై, రాజుతో చెప్పెను. రాజు ఆశరయే కొన్పింపఁగా బోధిసత్త్వ నాతని సాభరణుని బంటులం బంపి ముసలి యామెయింటినుండి కట్టించి తెప్పించెను. రాజు అతని మాట నిజమ యని తలంచియు ఆభరణమును హరించియు కట్లు విప్పింపకయే యుంచెను.

అట్లు బంధనస్థుఁడై యాతఁడు మునికుమారావతార మైన యాపామును తలఁచుకొనెను. పాము వచ్చి వృత్తాంత మడిగి తెలిసికొని బోధిసత్త్వునితో "ఓయి సాధూ, నేనుపోయి సిగవఱకు ఈ రాజును చుట్టుకొనియెదను, నీవు వచ్చి విడువు మను వఱకు విడువను. 'సర్పమునుండి రాజును నేను విడిపించెదను.' అని నీ విటం బలుకుము. నీవు రాఁగానే నీమాటమీఁద నేను రాజును విడిచెదను నేను విడిచినంతట ఈ రాజు నీకు తన రాజ్యము సగ మిచ్చి వేయును." అని చెప్పి వెంటనే పోయి పామై రాజును చుట్టుకొని యాతనినెత్తిపై మూఁడుపడగలం బెట్టుకొని యుండినది. 'అయ్యో! అయ్యో! రాజును పాము కఱచినది!' అని జనులు ఘోషపెట్టసాగిరి. 'నేను పామునుండి రాజును రక్షించెదను.' అని బోధిసత్త్వుఁడు వచించెను.

ఆమాట పరిజనులు పోయి ఎఱింగింపఁగా రాజు అతని రావించి 'ఓయి సాధూ, నన్ను నీవు ఈపామునుండి రక్షింతువేని నీకు నా రాజ్యములో సగ మిచ్చెదను. ఇందులకు ఈనామంత్రులు పూఁటకాఁపులు.' అని పలికెను. మంత్రులును అంగీకారము పలికిరి. అంతట బోధిసత్త్వుఁడు 'రాజును తత్క్షణము విడువు' మని పామున కాజ్ఞాపించెను. పాము విడిచెను. రా జాతనికి సగము రాజ్య మిచ్చెను. అతఁడును క్షణములో స్వస్థుఁ డాయెను. పాము శాపము తీఱి మునికుమారరూపము పొంది సభలోన తన వృత్తాంతము చెప్పి తనయాశ్రమమునకుం బోయెను.

ఈతీరున, శుభాత్ములకు శుభము తప్పక కలుగును, గొప్పవారి కేనియు తప్పుచేత కీడు గలిగించును, స్త్రీల హృదయము మాత్రము విశ్వాసమునకు చోటొల్లదు, వారిఁ ప్రాణ మిచ్చి యుపకరించినను వారి హృదయమునకు నెనరు తగులదు.

ఇట్లు గోముఖుఁడు కథ చెప్పి వత్సరాజ సుతునితో 'దేవా, ముగ్ధులకథలను మరల కొన్నిటిని చెప్పెదను వినుము.' అని యి ట్లారంభించెను.

### భిక్షు మూర్ఖుఁడు.

ఒకానొక బౌద్ధ దేవాలయమునందు మూర్ఖుఁడు యతి యొకఁ డుండెను. వానిని ఒకనాఁడు వీథిం దిరుగుచుండ కుక్క మోఁకాలఁ గఱచెను. అంత నాతఁడు మరలి మఠమున కేతెంచి

తనలో 'ఎవ్వరేని నాకాలి గాయమును జూచి యిది యేమి యని యడిగిన, ఒక్కొకనికిని జెప్పుట చాల కష్టము, కనుక ఒక్క మాఱుగానే అందఱను రప్పించి యీవృత్తాంతముం దెలిపెదను.' అని తలపోసి మఠముపై నెక్కి డప్పు వాయింప దొడంగెను. అంత నచ్చటిభిక్షులు 'ఏల యిట్లు ఆకస్మికముగా డప్పు వాయించెదవు?' అని ఆశ్చర్యపడుచు అడిగిరి. 'కుక్క మోఁకాలిని కఱచినది, ఈమాట నొక్కొకనికిం జెప్పఁ జాలక మిమ్ము నందఱ నిట్లు కూర్చితిని. కావున, అందఱు నొక్కమాఱుగానే తెలిసికొనుఁడు, నా మోఁకాలిని చూడుఁడు.' అని అతఁడు వారికి మోఁకాలు చూపెను. 'ఈతఁడు ఎంత స్వల్ప విషయమునకై ఎంత యల్లరి చేసినాఁడు!' అని ఆభిక్షువులు ప్రక్కలు పట్టుకొని నవ్విరి.

## టక్కమూర్ఖుఁడు.

శ్రమణమూర్ఖునిఁ జెప్పితిని ; టక్కమూర్ఖుని వినుము. వాహీకదేశమునందు మహాధనికుఁడు లోభి మూర్ఖుఁడు టక్కుఁడుండెను. ఆలోభి భార్యయు తానును ఉప్పు లేక వేలపిండి ఆహారించుచు, ఎన్నఁడును వే అన్నపురుచి నెఱుంగక జీవించుచుండెను. అతఁడు ఒక్కనాఁడు పాయసముపై విధివశంబున నాశగొని భార్యను వండ నియోగించెను, భార్య పాయసము వండుచుండెను. కృపణుఁడును అతిథు లెవ్వరు రాకుండ ఏకతమ పరుండెను. ఇంతలో నాతని మిత్త్రుఁడు ఇంకొకటక్కుఁడు

ధూర్తుఁడు వచ్చి టక్కుని సతిని తలవాకిటం గాంచి, నీమగఁ డెక్కడ నని యడిగెను. ఆమె ప్రత్యుత్తరము చెప్పక మగని పరున్న గదికింబోయి మిత్రుని రాకఁ దెలిపెను. లోభి “ఓసీ, నాపాదములం బట్టుకొని ఏడ్చుచుండుము. మిత్రుఁడు వచ్చి అడిగినయెడ ‘ నాభర్త మృతుఁ డాయె.’ నని చెప్పు. దాని విని ఆతఁడు పోఁగా మన మిద్దఱము హాయిగా పాయసము భక్షింతము.” అని చెప్పెను. భార్య అట్లే చేసెను. వయస్యుఁడు లోపలికి వచ్చి ఇది ఏమి అని ఆమె నడిగెను. తనభర్త మృతుఁ డాయెనని ఆమె ఏడ్చెను. అంత నాధూర్తుఁడు యోచించెను. ‘ఒక నిమిషమునకు మున్ను ఈమె స్వస్థముగా పాయసము వంఁడుచుండినది. ఇంతలో నీమెమగఁడు నీరోగుఁడు మృతుఁ డగుట ఎట్లు ? అతిథిని నన్నుఁ జూచి వీ రిద్దఱును ఈటక్కు చేసినారు కాని వేఱు కాదు. కావున ఈసందు దెలిసికొనియే గాని నేను పోను.’ ఇట్లు నిశ్చయించుకొని యాధూర్తుఁ డచటం గూర్చుండి ‘హా! మిత్రమా! హా! మిత్రమా!’ యని యేడువసాగెను. ఈయేడుపు విని బంధువు లందఱు వచ్చి చచ్చి నట్లు పడి యున్న యాలోభిని కని శ్మశానమునకుం గొనిపోవ సమకట్టిరి. అప్పు డాతని భార్య రహస్యముగా నాతనిచెవిలో ‘ప్రియా, అయ్యో ! వీరు ఇప్పుడు నిన్ను శ్మశానమునకుఁ గొని పోయి దహింతురే! ఇపు డైనను లెమ్ము.’ అని చెప్పెను. ‘నేను లేవను. ఈధూర్తుఁడు నాచెలికాఁడు, నాపాయసమును భక్షింప

వేచి ఉన్నాఁడు, నేను చావ నైనను చత్తునుగాని వీఁ డుండఁగా లేవను. మాబోఁటివారికి ప్రాణముల కన్నను ఒక పిడికెఁడు అన్నము ఎక్కువ.' అని రహస్యముగానే ఆజడుఁడు భార్యతో చెప్పెను. అంత ఆమిత్రుఁడు బంధువులంగూడి ఆకృపణుని పితృవనంబునకుఁ గొనిపోయి యగ్ని సంస్కారముం గావించెను. దేహము కాలుచున్నను టక్కుఁడు ప్రాణ మున్నంతవఱకు పలుకక కదలక యుండెను. ఇట్లు ఆ మూఢుఁడు ప్రాణములఁ గోలుపోయెనే గాని పాయసమును వదలఁ డాయెను. కష్టార్జిత మైన యాతనిధనమును ఇతరులు అవలీలగా అనుభవించిరి.

## మా ర్జా ర మూ ఘు లు.

లోభిని వింటివిగదా, మార్జారమూఘుల కథను విను. ఒక మఠములో మూఢుఁడు ఒక యుపాధ్యాయుఁడు ఉండెను. మఠములో ఎలుకలరాయిడివలన నతనికి రాత్రులు నిద్ర పట్ట దాయెను. ఆదుఃఖము నాతఁడు ఒకమిత్రునితో చెప్పుకొనెను. ఆచెలికాఁడు 'ఒక మార్జారమును దెచ్చుకొనుము, అది ఈ యెలుకలను భక్షించును.' అని చెప్పెను. మూఢుఁడు ఉపాధ్యాయుఁడు, 'మార్జార మన నెట్టిది? నే నెప్పుడునుచూడ లేదు. దానిరూపుం దెలుపుము.' అనఁగా, వయస్యుఁడు 'మిత్రమా, తెలిపెద వినుము, మార్జారమునకు కన్నులు గాజువాఁటియుండును, వర్ణము కపిలధూసరము, చర్మ మెల్ల వెండ్రుకలతో నిండి యుండును. ఇట్టియాకారముతో వీథిబడి మార్జారము తిరుగు

చుండును, వెదకించి తెప్పించుకొమ్ము.' అని చెప్పి పోయెను. అంత నాజడుఁడు ఉపాధ్యాయుఁడు శిష్యులతో 'ఓరీ, ఇచ్చట మీరును మార్జారచిహ్నంబులు వింటిరి కదా, వీథులలో వెదకి తెండు.' అని యాజ్ఞాపించెను. శిష్యులు వల్లె యని వెడలి యిటునటుఁ దిరిగిరి. మార్జారముమాత్ర మెటను దొరకలేదు. కొంతసేపటికి పూర్వోక్త లక్షణ లక్షితుఁ డై వీఁపున జింక తోలు ధరించిన యొకవటువు అగపడెను. వానిని మార్జారం బని యుపాధ్యాయుని కడకుఁ గొనిపోయిరి. ఒజ్జయు మిత్త్రో క్తలక్షణలక్షితుని వటువును మార్జారంబ కాఁ దలఁచి రాత్రి మఠమున నిలిపెను. తెలివిమాలిన యాతఁడుగు తనకు వారు పెట్టిన యా మార్జారనామమును యథార్థమునుగా నెంచి సుఖంబుండెను. అంత నొకనాఁడు మార్జారముయొక్క గుఱు తులు చెప్పిన యుపాధ్యాయ మిత్త్రుఁడు యాదృచ్ఛికముగా నామఠమునకు చని యచ్చటివడుగుఁ జూచి 'ఓ శిష్యులారా, ఈతని నెవ్వరు ఇచ్చటికిఁ గొనివచ్చిరి?' అని యడిగెను. 'మీరు చెప్పిన గుఱుతులంబట్టి యీమార్జారమును మేము తెచ్చినా రము.' అని శిష్యులు నుడివిరి. అందుల కాతఁడు వెఱఁ గంది 'ఓరి మూఢులారా, బ్రాహ్మణుఁ డెక్కడ, తిర్యగ్జంతు వగు మా ర్జార మెక్కడ! నాలుగుకాళ్లు కలిగి యుండునది మార్జారము!' అని చెప్పెను. అంతట శిష్యులు వటువును విడిచిపెట్టి మరల

మార్జారమును వెదకసాగిరి. ఆమూఢులను బరిహసింపనివారు లేరు. మూఢులు ఎవ్వరి పరిహాసమునకు పాత్రులు గారు!

## కొలను త్రవ్వించిన మూఢుఁడు.

ఒకమఠమున పలువురు మూఢులతో మూఢశిఖామణి యొకఁడు ఉండెను. ఒకనాఁడు అతఁడు చెఱువు త్రవ్వించిన వానికి పరలోకమునందు అనంతఫల మని పురాణము విని వచ్చి, తనధన మెల్ల వ్యయించి మఠముచెంత నొక కొలను ద్రవ్వించెను. ఒకనాఁ డతఁడు కొలనిం జూచుకొనఁ బోయినప్పుడు కొల నొక ప్రక్క పగిలియుండెను. ఎవ రట్లు చేసిరో యని చింతిల్లుచు వాఁడు మఱునాఁడు పోయి చూచుకొనఁగా మఱియొక్క గట్టు పగిలి యుండెను. అంత నాతఁడు 'రేపటినుండి వేకువ మొదలు సాయంకాలము దనుక ఇచ్చటనే యుండెద, దీని నిట్లు పగులఁగొట్టువానిం గనుగొనెద.' అని నిశ్చయించుకొని యామఱునాఁడు వఱువాత చెఱువుగట్టు చేరెను. ఎద్దొకటి కొలని దరులను కొమ్ములతో కోరాడుచుండెను. దానిం గని అది కైలాసమునుండి వచ్చిన హరవృషభ మని యెంచి దానితో స్వర్గమునకు పోఁగోరి, యాతడు దానితోఁకను బట్టుకొనెను. నందియు వానిని తనతావునకు కైలాసమునకుఁ గొనిపోయెను. అచ్చట మూఢశిఖామణి మిక్కిలి శ్రేష్ఠము లైన భక్ష్యభోజ్యములం దినుచుఁ గొంతకాలము సుఖం బుండెను. వృషభము ప్రతిదినము భూలోకమునకు పోయి వచ్చు చుండెను. ఒక

నాఁడు ఆమూఢునికి దైవవశంబున భూలోకమునకుం బోయి బంధువులతో నచ్చటి యద్భుతములం జెప్పి మరలి రాఁ గోరిక గల్గెను. అంత నాతఁడు భూతలమునకు వచ్చు నా యెద్దు తోఁకను పట్టుకొని పుడమికిం బోయి మఠమునకుం జనియెను. ఇన్నాళ్లెచ్చటికిఁ బోయితి వని మిత్రు లడిగిరి. అతఁడు తన కైలాస గమనమును మోదకభోజనమును జెప్పెను. అంతట వారు 'మిత్రుఁడా, మమ్ముం గూడ నచ్చటికిఁ గొనిపోయి యచ్చటి భక్ష్యముల భుజించునట్లు చేయుము.' అని వేడిరి. ఆతఁడు సమ్మతించి మఱునాఁడు వారి నందఱను ఆకొలని దరికి తీసికొని పోవునంత నా వృషభము నచ్చటికి వచ్చియుండెను. పూర్వాను భవమున తొలిమూఢుఁడు ఎద్దుతోఁకను పట్టుకొనెను. వాని పాదంబుల మఱియొకఁడు, వానిని మఱియొకఁడును, ఇట్లు గొలుసుగా నొకరి నొకరు పట్టుకొనిరి. అంత నందీశ్వరుఁడు ఆకసమున కెగిరెను. ఇట్లు తోఁకను బట్టిన మూఢపంక్తితో నంది ఆకసమునం జనునప్పుడు వారిలో నొకఁడు తొలిమూఢుని 'మిత్రమా, కైలాసమునందు ఎంతలేసి మోదకములు భక్షించితివి? నిజము చెప్పుము.' అని యడిగెను. అందుల కామూఢ శిరోమణి రెండుచేతులను పద్మాకారంబుగా చేర్చి యింతలేసి యని చూపెను. అట్లు తోఁకను అతఁడు వదలినంతనే అందఱును నేలకు కుప్పగూలి మడిసిరి. నంది కైలాసంబునకుఁ

బోయెను. దీనిం జూచినజనులు వెఱఁ గందిరి. మూఢుల ప్రశ్నోత్తరములు మిక్కిలి కీడు గల్గించును.

## చెట్టుమీఁదుగాఁ బోయిన మూఢుఁడు.

మఱియొక్క మూర్ఖునికథను వినుము. మూఢుఁ డొకఁడుఁ పయనము నడుచుచు దారి తప్పి చేరువ నొకనిం గని దారి యడుగ, నాతఁడు 'ఏటిగట్టున ఆ మ్రానిమీఁదుగా పొమ్ము.' అని చెప్పెను. అంత నా ముగ్ధుఁడు ఆ చెట్టెక్కెను. ఇతని బరువునకు కొనగొమ్మ వంగెను. గట్టిగా పట్టుకొని యితఁడు పడక ఎట్లో తప్పించుకొనెను. ఆసమయమున నచ్చటికి మావటీఁ డెక్కియున్న యొక యేనుఁగు వచ్చి నీరు త్రావి మరలుచుండఁగా, మూఢుఁడు మావటీనితో దీనవదనుఁడై 'మహాత్ముఁడా, నన్ను ఏనుఁగుమీఁదికి తీసికొని కాపాడుము.' అని వేఁడెను. మావటీఁడు వానిని అందుకొనుటకు చేతియంకుశమును పాఱవైచి వానికాళ్లను తన రెండు చేతులతోను పట్టుకొనెను. ఇంతలో ఆ మత్తగజము ఆవలికిం బోయెను. హాస్తికుఁడు చెట్టుమీఁదివాని పాదముల విడువకుండెను. అప్పుడు చెట్టుమీఁదివాఁడు మావటీనితో 'మిత్త్రమా, నీవు పాడఁగలవేని కొంచెము పాడుము, పాట విని ఎవ్వరేని ఇచటికి వచ్చి మనలను దింపుదురు. కానిచో ఈనదిలోఁ బడుదుము, చావు తప్పదు.' అనెను. అంతట ఆవ్యగ్రవాసి మిగుల సంతసించునట్లు మావటీఁడు మంజుల స్వరంబుతో పాడెను, ఆపరమానందంబున

మై మఱచి చెట్టుమీఁది మందమతి చేతుల తాళము చఱచుచు మెచ్చులు అఱచుచు దుముకఁ దొడంగి మూవటీనితోఁగూడ పేటఁ బడి పరలోకమునకు వేంచేసెను. కాఁబట్టి మందమతుల సంగ మెవ్వనికిని మేలు గాదు.

## మృగాంకలేఖా హిరణ్యాక్షుల కథ.

ఇట్లు గోముఖుఁడు వత్సరాజపుత్త్రునికి కథలు సెప్పి వెండియు నొక కథఁ జెప్పసాగెను. ఈలోకమునందు హిమాలయప్రాంతమున విద్యాధరస్థ్సముల కునికిపట్టు భూదేవికి శిరోమణి కశ్మీరమని దేశం బొండు కలదు. అందు హిరణ్యపుర మను రాజధానిలో కనకాక్షుఁ డను రాజు ఏలుచుండెను. ఆతనికి మహేశ్వర ప్రసాదంబున రత్నప్రభాదేవియందు హిరణ్యాక్షుఁ డని యొక పుత్త్రుఁ డుద్భవిల్లెను. ఆ కుమారుఁడు ఒక్కనాఁడు ఆటగా పాపట గొట్టమున నుండ లూఁదుచుండ ఆ దారిని వచ్చిన యొక తాపసికి ఉండ తగిలెను. ఆ యోగీశ్వరి కోపింపక చిఱునగవుతో 'వత్సా, నీకు యౌవనమునకే ఇంత గర్వమేని మృగాంకలేఖం బెండ్లియాడిన నెంతగర్వము కల్గునో!' అనెను. ఆమాట విని రాజపుత్త్రుఁడు 'అమ్మా, మృగాంకలేఖ యెవరు? నాయపరాధమును క్షమించి చెప్పుము.' అని యడిగెను. 'ఈహిమాలయప్రాంతమున శశితేజుఁ డను విద్యాధర రాజు కలఁడు. అతనికి రూపజితాప్సరస మృగాంకలేఖ యని యుత్తమ కన్య కలదు. ఆమె నీకుం దగినభార్య. నీవ ఆమెకుఁ

దగిన వరుఁడవు.' అని యామె వచించెను. 'ఎట్లునా కా సుందరి లభించును?' అని హిరణ్యాక్షుఁ డడుగ 'వత్సా, నేను ఆమెకడకుఁబోయి ఆమెతలఁపు నెఱింగి వచ్చి నిన్నుఁ గొనిపోయె దను. నేను ఈ పట్టణమునందలి యమరేశ్వరుని దర్శింప నెల్ల ప్పుడును వచ్చుచుందును. నన్నచట నీవు చూడవచ్చును.' అని తాపసి పల్కి మృగాంకలేఖకడకు మంచుకొండకు ఆకాశ మార్గంబునం బోయి, మృగాంకలేఖం గలిసి హిరణ్యాక్షుని గుణ ములను వర్ణించెను. మృగాంకలేఖయు అతనిం బొందనిచో తన జీవితము నిష్ఫలముగాఁదలంచి పగ లంతయుం గడపి రాత్రి మఱియు స్మరార్దిత యై తాపసితో నాతని గుణంబులు ముచ్చ టించు చుండెను. ఇట హిరణ్యాక్షుఁడును మృగాంకలేఖమీఁద మోహంబున రాత్రి యెల్ల జాగరమై వేకువను ఇంచుక నిద్రిం చెను. అతనికి కలలో గౌరి యగపడి 'వత్సా, నీవు విద్యాధ రుఁడవు, ఒకానొక మునిశాపమునం జేసి మర్త్యజన్మముం బొంది తివి, తాపసియొక్క కరస్పర్శంబున నీకు మర్త్యత్వము పోయి యమర్త్యత్వము కలుగును. పిదప పూర్వజన్మమున భార్య యగు నామృగాంకలేఖను శీఘ్రముగానే పెండ్లి యగుదువు. కావున ఈవిషయమై చింతిల్లకుము.' అని యానతిచ్చి యంత ర్ధానము నొందెను. హిరణ్యాక్షుఁడు మేల్కని ప్రాతఃకృత్యం బుల నెరవేర్చి పూర్వసంకేతితమైన యమరేశ్వరాలయమునకుఁ బోయి దేవునికిం బ్రణమిల్లి తాపసిరాకను వేచి యుండెను.

మృగాంకలేఖకును గౌరి 'హిరణ్యాక్షుని పెండ్లి యాడుదువు. ఏల దుఃఖించెదవు? అతఁడు విద్యాధరుఁడు. శాపవశంబున నర జన్మము పొందినాఁడు, తాపసికేలు సోఁకినంత నతనికి నర జన్మము తొలంగును.' అని స్వప్నమున చెప్పెను. ఆమెయు మేల్కాంచి స్వప్న వృత్తాంతమును తాపసి కెఱిఁగించెను. ఆ సిద్ధురాలు భూలోకమునకుఁ బోయి యమరేశ్వరునిచెంత హిర ణ్యాక్షునింజూచి 'పుత్రా, విద్యాధరలోకమునకు రమ్ము.' అని యాతని ప్రణతుని తోడ్కొని నింగిం బోయెను.

అప్పుడు హిరణ్యాక్షుఁడు శాపము తీఱి పూర్వజాతిని స్మరించి యామెతో, తాపసీ, నేను హిమాద్రియందు వజ్ర కూటపురమున అమృతతేజసుఁ డను పేరి విద్యాధర రాజను. నేను ఒకమునిని తిరస్కరించి యాయనశాపమువలన మర్త్యుఁ డనుగాఁ బుట్టితిని, అదియు నీకేలుసోఁకువఱకే. తిట్టుఁబడిన నా వియోగముచే శరీరముం దొఱంగిన నా పూర్వభార్యయే ఈమృగాంకలేఖ. ఇప్పుడు నీతోఁ జని దానిం జేపట్టెదను.' అని వాక్రుచ్చి తాపసితోఁగూడ హిమాలయంబునకుం బోయెను. నగరోద్యానమందే మృగాంకలేఖను హిరణ్యాక్షుఁడును హిర ణ్యాక్షుని ఆమెయును జూచిరి. ఇరువురును ఒకరొకరి శ్రుతిమార్గ మున మానసముం జొచ్చి దృష్టిమార్గమునుండి వెడలిరి. 'నీ వీతని వివాహ మాడుదు వని నీతండ్రికిఁ దెలుపు' మని తాపసి చెప్ప నాకన్యయు లజ్జావనతవదనయై సఖీముఖమున నావృత్తాం

తమును తంత్రికిం దెలిపెను. గౌరిచే స్వప్నబోధితుం డై యా రాజు విద్యాధరేంద్రుని రావించి పూజించి మృగాంకలేఖ నాతని కొసంగెను. అమృతతేజసుఁడు అవ్వధూామణిం బరిగ్రహించి వజ్రకూటమునకుఁ బోయెను. అచ్చట మర్త్యత్వము నందు తనకు జనకుండైన కనకాక్షుని సభార్యుం డై పూజించి సర్వసుఖముల ననుభవించుచుండెను. కావున పూర్వకర్మ విహిత శుభాశుభంబులను జనులు అనుభవించుచుందురు. ఇట్లు గోముఖుని చెప్పిన కథను విని శక్తియశయందు ఉత్సుకుం డైన నరవాహనదత్తుఁడు నిద్రాసుఖ మనుభవించెను.

---

## ౧౨-వ తరంగము.

---

### విద్యాభిమానియతికథ.

మఱుసటిరాత్రి వినోదార్థము గోముఖుఁడు నరవాహనదత్తునితో నిట్లు చెప్పసాగెను. ధారేశ్వర మను శైవసిద్ధక్షేత్రమునందు అనేక శిష్యోపాసితుఁడు ఒకమహర్షి యుండెను. అతఁడొకనాఁడు 'మీలో నెవ్వరేని యేదే నపూర్వమును చూచి యున్నను వినియున్నను నివేదింపుఁడు.' అని శిష్యుల నడిగెను. వారిలో నొకఁడు 'నే నొకయపూర్వమును వింటిని. దానిం జెప్పెద.' నని యారంభించెను. కశ్మీరదేశములో విజయ మని శైవమహాక్షేత్రము ఒకటి కలదు. అందు విద్యాభిమాని యతి

యొకఁ డుండెను. అతఁ డొకనాఁడు 'సర్వత్ర జయ మొందెదను గాక' యని శివునికి ప్రదక్షిణము చేసి విద్యావాదము నిమిత్తము పాటలీపుత్రమునకు తరలెను. దారిలో అడవులు, ఏళ్లు, కొండలు నతిక్రమించి కాఁ అడవిలో చెట్టునీడ విశ్రమించెను.

ఇంతలో వాపీశీతల మైన యా నీడకు దూరమార్గ శ్రాంతుఁడు దండకమండలుహస్తుఁడు ఒకథార్మికుఁడు వచ్చెను. యతీంద్రుఁ డాతనిం జూచి, 'ఎందుండి యెచ్చటికిం బోయెద ర'ని యడుగ థార్మికుఁడు 'మిత్రుఁడా, నేను విద్యాక్షేత్ర మైన పాటలీపుత్రమునుండి కశ్మీరదేశమునకు విద్యావాదమున నచ్చటివారిని జయించుటకై పోవుచున్నాను.' అని చెప్పెను. అంత నాపరివ్రాజకుండు 'పాటలీపుత్రవాసి నీతని నొక్కని జయింపఁ జాలనేని అనేకుల నెట్లు జయింపఁ జాలుదు' నని తలంచి థార్మికునితో 'థార్మికుఁడా నీకృత్యము చాల విరుద్ధము. మోక్షార్థివి నీ వెక్కడ? వ్యసనాశ్రయ మీవాద మెక్కడ? వాదపణముచే సంసారమును తరింపఁ గోరెదవు, అగ్నిచే వేఁడిని, మంచుచే శీతమును అడంపఁ గోరెదవు, పాషాణనావచే సముద్రమును దాఁటఁగోరెదవు, మండుచున్న నిప్పును గాలిచే నార్పఁ గోరెదవు. బ్రాహ్మణులకు క్షమయు, క్షత్రియులకు ఆపన్నరక్షయు, ముముక్షువులకు శమనము, రాక్షసులకు కలహమును, శీలములు. కాఁబట్టి సంసారక్లేశభీరు లై సుఖదుఃఖ మును విసర్జించిన ముముక్షువులు శమదమములు గలిగియుండ

వలయును, కనుక సంసార వృక్షమును వాదాభిమాన జలముచేఁ బెనుపక ఓర్పుగొడ్డటిచే నఱకుము.' అని చెప్పెను. అంత నాథార్థికుఁడు సంతసించి యాతనికి నమస్కరించి 'నీవు నాకు ఆచార్యుఁడవు' అని వచించి యథేచ్ఛముగాఁ జనియె. భిక్షువు సంతుష్టుఁడై తరుమూలమునందె యుండెను.

అంతఁ గొంతసేపటికి భిక్షునికి భార్యతో క్రీడించుచున్న యొకానొక యక్షుని యాలాపము విననాయెను. యక్షుఁడు పూదండతో భార్యను గొట్టెను. అంత నామె మృషామరణము నభినయించెను. తత్పరివారజనులు శీఘ్రముగా నాక్రందనము గావించిరి. కొంతసేపటికామె వెండియు ప్రాణవతియైనట్లు కన్నులు దెఱచి చూడఁగా యక్షుఁడు నీ వేమి చూచితి వని యడిగెను. ఆమె యసత్యము నిట్లు చెప్పెను. 'మాలతో నీవు కొట్టఁగానే నాకు పాశహస్తుఁడు మంటలకనులవాఁడు పొడవు వాఁడు భయంకరుఁడు దిక్కుల నిరులుకొనఁ జేయు నీల దేహుఁ డొకపురుషుఁ డగపడి నన్ను యమలోకమునకుం గొనిపోయెను. అచటి యధికారులు వాని నడ్డగించి నన్ను విడిపించిరి.' భార్య పలికిన యీపలుకులకు నవ్వుచు యక్షుఁడు ' స్త్రీల కృత్యములు ఇంద్రజాలములు, పూలదెబ్బచే మృత్యు వెట్లు కలుగును! యమ మందిరమునుండి మరలి వచ్చు టెట్లు?' అని తలపోసి, 'ఓసి మూఢురాలా, పాటలీపుత్త్ర స్త్రీల వృత్తాంతము ననుకరించి తివి!' అని యీకథ చెప్పెను.

## పాటలీపుత్త్ర స్త్రీల వృత్తాంతము.

పాటలీపుత్త్రమును సింహాక్షుఁ డనురాజు ఏలుచుండెను. అతనిభార్య యొక శుక్లపక్ష త్రయోదశియందు మంత్రిపురోహితాదివధూ పరివృతయై సరస్వతీపూజార్థము వెడలెను. మార్గమునందు రోగులు కొందఱు కలసి యిట్లు మొఱవెట్టిరి. 'అమ్మలారా, రోగపీడితులము, దీనులము, మాకు ఔషధ మిప్పించి రక్షింపుఁడు. జీవలోకము కడలియలవలె చంచలము, మెఱపువలె నశ్వరము, యాత్రాద్యుత్సవములచే క్షణసుందరము; అసారమగు నీసంసారమునందు దీనదయ సారము. గుణవంతుఁ డెచ్చట జీవింపఁడు ? ఆఢ్యునికి దానమేల ? తృప్తునికి అన్నమేల ? శీతపీడితునికి చందనమేల ? కావున వ్యాధితులను మమ్ము ఉద్ధరింపుఁడు.' ఇట్లు ప్రార్థితలై రాజాంగనలు 'దీనులు ఈరోగులు యుక్తియుక్తముగానే నుడివిరి, ఎంతటి ధనవ్యయము చేతనైనను వీరిని నీరోగులం గావింపుదము.' అని యొకరితో నొకరు మాటలాడుకొని సరస్వతిం బూజించి మరలిరి. వారిని ఆరోగులు వెంట నంటిరి. ఆయింతులు పట్టణము చేరి తమభర్తలం బ్రేరించి రోగులకు వైద్యము చేయించిరి.

ఆరోగులతోడి సహవాసముచే నాస్త్రీలమనంబులు మన్మథాంధములై తన్మయము లాయెను. వారిసాంగత్యముచేఁ గల్గినదంతక్షతాదులను రాజప్రభృతులు చూచి యొకరితో నొకరు చెప్పుకొనిరి. రాజు అంతఃపురమునకుం బోయి భార్యను

'ఈ నఖక్షతములు దంతక్షతములు నెట్లు గలిగినవి ? నిజముగాఁ జెప్పిన సరి, చెప్పనియెడ కీడు తప్పదు.' అని స్నేహభయంబులం గనఁబఱుచుచు అడిగెను. రాజపత్నియు కృత్రిమముగా 'ఓరాజా చెప్పఁగూడని దైనను ఈ యాశ్చర్యముం జెప్పెదను. ఈయెదుట నుండెడు చిత్రభిత్తినుండి రాత్రులయందు చక్రగదాధరుఁ డొకపురుషుఁడు నిర్గమించి నాతో క్రీడించి ప్రాతఃకాలమునందు దానిలో నంతర్ధానము నొందుచున్నాఁడు.' చంద్రసూర్యులకేనియు కానరాని నాదేహము నీ పురుషుఁ డిట్లొనర్చుచున్నాఁడు, దానం జేసి ఈ యవస్థ సంభవించినది.' అని దుఃఖితయుం బోలె చెప్పెను. దాని విని యామూర్ఖరాజు విష్ణుమాయగాఁదలంచి నమ్మి తన యమాత్యాదులకు వృత్తాంతముం జెప్పెను. వారును విశ్వసించిరి. ఇట్లు దుష్టస్త్రీలు జడమతులను వంచింతురు. నీవు న న్నట్లు వంచింపఁ జాలవు.— ఇట్లు పల్కి యాయక్షుఁడు భార్యను వెలుఁగుపుచ్చెను.

ఆ వృత్తాంతమునంతయు తరుమూలమునుండి యతి విని కృతాంజలి యై యక్షునికి 'ఓ భగవానుఁడా, ఈ యాశ్రమమున నేను నీమాటలను వింటిని, ఆ దోషమును క్షమింపవలయును; అని విన్నవించెను. అంతట ఆపరివ్రాజకుని సత్యవాక్యమునకు సంతుష్టుఁడై యక్షుఁడు, 'నీకు వర మొకటి యిచ్చెదను వేఁడుము.' అనెను. పరివ్రాజకుండు 'ఈనీభార్యపట్ల నీకు కలిగినకోపమును మానుము, ఇదియే ముఖ్య వర'మని చెప్పెను.

యక్షుఁ డంగీకరించి మఱియొక వరము కోరు మనెను. సన్న్యాసి 'ఇది మొదలు నన్ను మీరు పుత్త్రునిగాఁ నంగీకరింప నాకోరిక.' అన నాయక్షదంపతులు ప్రత్యక్షమై, ఆలాగే యగుఁగాక యని చెప్పి 'పుత్త్రుఁడా, మాయనుగ్రహముచం జేసి ఆపదలం బొందవు. జగడములోను, జూదములోను వాదమునందును జయశీలుఁడవు అగుదువు.' అని వర మిచ్చి యంతర్హితు లైరి. పరివ్రాజకుఁడు యక్షునికి నమస్కరించి యావృక్షమూలంబున నారాత్రిఁ గడపి మఱునాఁడు వఱువాత పాటలీపుత్త్రముఁ జేరి, అచ్చట రాజాస్థానమునకుం జని ప్రతీహారనివేదితుఁ డై రాజు సమీపంబునకుం బోయి యచ్చటిపండితులను వాదమున యక్షప్రసాదముచే జయించి మఱల రాజునెదుట పండితులను 'చిత్రభిత్తినుండి చక్రగదాధరుం డైన పురుషుఁడు వెలువడి నన్ను నఖదంతక్షతయుక్తం గావించి మఱల గోడలో లయించుచున్నాఁడు. పండితులారా, దీనివివరముం జెప్పుఁడు.' అని యాక్షేపించెను. ఆపండితులు పరమార్థము నెఱుంగక మొగమొగంబులు సూచి యూరకుండిరి. అంత నారాజు 'నీ వడిగిన ప్రశ్నమునకు ఉత్తరము నీవే చెప్పుము' అని యతి నడిగెను. యతి రాజభార్యయొక్క కపటచరిత్రము నంతయుం జెప్పెను. రాజు స్త్రీసంగమును దూరి తనరాజ్యము నంతయు నొసంగెదను గ్రహింపు మని యతి నడిగెను. యతి స్వదేశవాసాభిలాషచే రాజ్యము కైకొన కుండఁగా, రాజు రత్నరాశిచే

నాతని సమ్మానించెను. గృహీతరత్నుం డై యా భిక్షువు కశ్మీర విషయంబునకుం జని యక్షువరమువలన సుఖంబుండెను.— ఈవృత్తాంతమును ఆ యతివలన వింటిని. అనిన విని యా ఋషి పుంగవుండు శిష్యసహితముగా నాశ్చర్యపడెను.

## ఏ కా ద శ మా రి ణి క థ.

ఇట్లు లోకమున కుస్త్రీచరిత్రములు అనేకములు కల వు. మఱియొకకథ వినుము. అని గోముఖుఁడు మరల నిట్లు చెప్పెను. మాళవదేశమునం దొక గ్రామమున కుటుంబి యొకఁ డుండెను. ఆతనికి ముగ్గురు పుత్రులకు వెనుక నొక్కకూఁతురు కలిగెను. ఆపిల్ల పుట్టిన వెంటనే తల్లి లోకాంతరముం బొందెను. పిమ్మట కొన్నాళ్లకు కుమారులు ఇద్దఱును మృతి నొందిరి. తండ్రి ఆకూఁతునకు త్రిమారిక అని అన్వర్థనామము పెట్టి యౌవనవతి యయినంత తద్గ్రామవాసి కొకధనిక పుత్రుని కిచ్చి వివాహము చేసెను. ఆమె భర్తతోఁగూడి యౌవన సు ఖంబు లనుభవింపఁ గొంతకాలమునకు పతియు మృతిఁబొందెను. ఆచపల త్వరగానే మఱియొకని, పతిం గావించుకొనెను. అతఁ డును మృతుం డాయెను. యౌవనోన్మత్తయై యామె మఱి యొకనిం బొంద, వాఁడును చచ్చెను. ఈక్రమమున నామెకు పతులు పదుగురు విపన్నులగుటం జేసి త్రిమారికా నామము మాఱి దశమారికానామ మేర్పడినది. ఆమె మరల పెండ్లి గో రినది గాని లజ్జితుఁ డైన తండ్రివలని నిరోధమునం జేసి పెండ్లి

మాని తండ్రియింట నుండెను. ఒకరాత్రి సుందరమూర్తి యొకపాంథుఁడు బసకై యాయింటికి వచ్చెను. ఆతనిం జూచి దశమారియు ఆతరుణిం జూచి యాతఁడును అన్యోన్యాభిలాషం బొందిరి. ఆవనిత మదనప్రేరణచే నిర్లజ్జయై తండ్రితో 'నాయనా! ఈపాంథుని నొకని పతిగాఁ జేకొనెదను, ఈతఁడును పూర్వులగతిం బొందెనేని, అంత నేను పాతివ్రత్య వ్రతముం బూనెదను.' అని చెప్పెను. కుమారివాక్యమునకు నాగృహస్థుఁడు 'పుత్త్రీ, ఇప్పటికి పదిమంది పతులు గతించిరి, ఈతఁడు నట్లయినచో లోకులు చాలఁ బరిహసింతురు.' అనెను. ఈమాటలు విని యాపథికుఁడు లజ్జ విడిచి 'క్రమముగా నాకును పదిమంది భార్యలు మృతిఁజెందిరి, కాఁబట్టి మేమిద్దఱమును సమానులము.' అని చెప్పఁగా, నామాటల కాశ్చర్యము నొందనివారు లేరైరి. ఈవృత్తాంతము విని వచ్చిన గ్రామవాసుల సమ్మతిని దశమారిక యాతనిం బెండ్లాడెను. కొన్ని దినంబులకు నాతఁడును శీతజ్వరపీడితుఁడై క్షయముం బొందెను. అంత ఏకాదశమారిణి ఆశ్చర్యపడి గంగాతీరముఁ జేరి తపోనిష్ఠ నుండెను. ఇట్లు కథను విని వత్సరాజపుత్త్రుఁడు సంతోషించెను. గోముఖుఁడు మఱియొక కథ నారంభించెను.

## ఏకవృషభుఁడు.

ఒకానొకగ్రామమున కుటుంబి దరిద్రుఁడొకఁడుండెను. ఆతనికి నొక యెద్దే ధనముగా నుండెను. అతఁడు, ఆహారము

లేక కుటుంబము బాధ పడుచుండినను, ఆయెద్దును అమ్మక విం ధ్యవాసిని మ్రోల దర్భాసనాసీనుండై నిరాహారుఁడై అర్థాసక్తి చేత తపము చేయు చుండెను. ఒకనాఁడు దేవి స్వప్నములో 'వత్సా, లెమ్ము, ఎప్పుడును ఒకయెద్దు నీకు ఆస్తిగా నుండును. దాని విక్రయించి జీవింపుము. అని చెప్పెను. అంత నాతఁడు మేల్కొని ప్రాతఃకాలమున కొంచెము పారణ గావించి యింటికిం బోయెను. ఆయధీరుఁడు ఆయెద్దు నమ్మిన జీవింప లే నని అమ్మఁ జాలకుండెను. పిమ్మట నొకనాఁడు ఈతని మిత్ర మొకఁడు ఉప వాసకృశు నీతని 'మూఢుఁడా, స్వప్నమునందు దేవి నీకు వృ షభము నమ్మి జీవింపు మని చెప్పెను. దానిం దెలిసికొనఁ జాల వైతివి. దాని నమ్మిన యెడల దేవ్యనుగ్రహమున సతతము ఒక వృషభము పుట్టుచుండును.' అని హెచ్చరించెను. ఆమిత్రవా క్యము ప్రకారము జరిపి వాఁడును సుఖం బుండెను. కాన నీప్ర కారము సర్వజనమునకును సత్త్వానుసారముగా కార్యములు సిద్ధించును. సత్త్వహీనుని సిరులు పొందవు.

### పరవంచనజీవుఁడు.

మఱియొక కథం జెప్పెద వినుము. దక్షిణాపథమునందు ఒకపట్టణమున ఒకరాజు కలఁడు. అతనిదేశములో పరవంచన జీవకుఁడు ఒకఁ డుండెను. వాఁడు ఒకప్పుడు అత్యాశచే నిట్లు చింతించెను. 'ఆహారమాత్రమున కుపయోగించు నీధూర్త కృత్యమువలన నేమి ప్రయోజనము ? ఏమిచేసిన చాలినంత

సంపద గల్గునో దానిం జేసెద.' ఇట్లు చింతించి గంభీరమైన వర్తక వేషముం బూని తేని మొగసాలకుం జని ప్రతీహారనివేదితుఁడై లోపలికిఁ బ్రవేశించి కానుక యొసంగి, ఏకాంతమున నొకమనవి యున్న దని రాజుతో జెప్పెను. అతనివేషముచేతను కానుక చేతను భ్రాంతుఁడై రాజు ఏకాంతభాషణము నంగీకరింపఁగా నాథూర్తుఁడు రాజుతో 'దేవా, ప్రతిదినము కొలువుఁగూటంబున నందఱయెదుట క్షణకాలము నాతో నీవు మాటలాఁడ గోరెదను. అందులకై దినమునకు ఏనూఱు పైఁడిటంకములను కానుక యొసంగెదను.' అని విన్నవించెను. రాజు కొంతతడవు తలపోసి 'ప్రతిదినము ఏనూఱు పైఁడిటంకములు ఉపాయన మిచ్చు వర్తకశ్రేష్ఠునితో మాటలాడుటవలన నేమి కొదువ? యని యందులకు సమ్మతించెను. నాటంగోలె నాథూర్తుఁడు రాజునకు కానుకల నొసంగుచుండెను. లోకము అతని ముఖ్య సచివునింగాఁదలంచెను. ఇట్లు కొంతకాలము గడవ, నొకనాఁడు సభలో నొకయధికారిమోమును చూచి ధూర్తుఁడు సాకూతముగా రాజుతో మాటలాడుచుండెను. కొంతసేపటికి ధూర్తుఁడు వెలువడ ఆయధికారి వానిని 'నావిషయమై నీవు రాజుతోఁ జేసిన ప్రస్తావ మేమి? అని యడిగెను. 'నీవు తేని దేశము నపహరింప గోరితి వని అతఁడు కుపితుఁడై యున్నాఁడు. అందుకై నీమోముం జూచితిని. నేను ఈకోపమును శాంతిఁ బొందించెను.' అని చెప్పెను. ఆవంచకుని యామాటలు విని

యాయధికారి వెఱపుతో నింటికిం బోయి, వేయువరహాలు ఆత నికి లంచ మిచ్చెను. మఱునాఁడు యథాప్రకారము రాజుతో క్షణకాలము మాటలాడి పోవునపుడు సమీపమునకు వచ్చిన యాయధికారితో ధూర్తుఁడు యుక్తముగా 'మిత్రమా, యుక్తి పలికి రాజును బ్రసన్నునిం జేసితిని ధైర్యముగా నుండుము, ఏయాపద వాటిల్లినను రక్షించెదను.' అనెను. అది మొదలు ఆయధికారి యాధూర్తుని సేవించుచుండెను. ఇట్లు బుద్ధిమంతుఁ డైన యా మోసగాఁడు సామంతరాజులవలనను సేవకులవలనను పెక్కుదెఱంగుల అయిదుకోట్ల ధనమును ఆర్జించెను. పిమ్మట ఏకాంతమునందు ఆదుర్మంత్రి రాజుతో, 'ప్రభూ, ప్రతిదినమును నీకు ఏనూఱు పైఁడి టంకములు సమర్పించియు ఐదుకోట్ల సువర్ణములను సంపాదించితిని. ఇవిగో కొమ్ము.' అని యాధనమును ఎదుటఁ బోసెను. రాజు దానిలో సగము గైకొని యాతనిముఖ్య మంత్రిం జేసికొనెను. వంచకుఁడును సంపదను బొంది సుఖించుచుండెను. ఇట్లు బావి త్రవ్వువాఁడు ధనరాశిం బడసినట్లు, ప్రాజ్ఞుఁడు ఎక్కుడుపాపము చేయకయే ధనము నార్జించును.

## హేమప్రభా లక్ష్మీసేనుల కథ.

ఇట్లు వక్కాణించి గోముఖుఁడు నరవాహనదత్తునికి మఱియొకకథం జెప్పసాగెను. రత్నాకర మనుపేరి పట్టణమును మదమత్తశత్రుగజములకు సింహము బుద్ధిప్రభుఁ డను రాజు

ఏలుచుండెను. ఆతనికి రత్నరేఖ యను దేవియందు సర్వలోకైకసుందరి హేమప్రభ యనుకూఁతురు జనించెను. ఆ కుమారి శాపముచే భూమియందు జనించిన విద్యాధరి యగుటంజేసి నభోవిహారసంస్కారమదంబున తూఁగుటుయ్యేలలలో పెల్లుగ నూఁగుచుండెను. క్రిందఁబడుదు నని తండ్రి నిషేధించిన వినమందున తండ్రి కినిసి అక్కన్నియం జెంపకాయ గొట్టెను. అంత మాత్రపు టవమానముచేత నారాజపుత్త్రి వనవాసముం గోరి విహారవ్యాజమున బయటి యుద్యానవనమునకుం జనియెను. అచ్చట పరిజనులు మదిరాపానమత్తులై యుండ నాకుమారి దట్టంపుఁజెట్లగుబురుచాటున వారిం గనుబ్రామి పోయి ఒంటరిగా గొప్ప కాఱడవిం జొచ్చి పర్ణశాల నేర్పఱుచుకొని కందమూలాహారయై శివుం గూర్చి తపముం గావించుచుండెను. ఆరాజపుంగవుఁడు కూఁతుం గానక పలుతావుల వెదకి విఫలప్రయత్నుఁడై దుఃఖించుచుండెను. అనంతర మారాజు ఒకనాఁడు వినోదార్థము వేఁటకుం దరలి ఎచ్చట హేమప్రభ తపము గావించుచుండెనో ఆ దూరారణ్యమును ప్రవేశించి అట పర్ణశాలను ఘోరతపము సేయుచున్న తన సుతసుం గాంచెను. తండ్రిం జూచి తనయ లేచి నమస్కరింప తండ్రియు తనయం గౌఁగిలించి కొని, యొడిం గూర్చుండఁ బెట్టుకొనెను. చిరకాలమునకు ఒకరొకరిం జూచుకొని వారు ఆయడవిలోని మృగములు గూడ దుఃఖించునట్లు ఏడ్వసాగిరి. కొంతసేపటికి రాజు కూఁతు నూరార్చి

'పట్టీ, రాజలక్ష్మిని విడిచి అరణ్యావాసము నేల కైకొంటివి, దీని విడిచి మాయమ్మకడకు రమ్ము.' అని పిలిచెను. రాజకన్య తండ్రితో 'నాయనా, దైవము నన్నిట్లు చేసెను. నే నేమియుం జేయఁజాలను, వనవాస సుఖమును వదలి పట్టణవాసము నొల్లను.' అనెను. తండ్రి ఎంత చెప్పినను కూఁతు రంగీకరింపదాయెను. అంత నారాజు కూఁతునకు అడవిలో నివాసభవనము నొకటి కట్టించి అతిథిపూజ నిమిత్తము వలయువస్తువుల నెల్ల పనుపుచుండెను. హేమప్రభయు తండ్రి పనుపువస్తువులతో నతిథుల తృప్తులఁజేయుచు తాను ఫలాహారమే యొనర్చుచుండెను.

ఇట్లు కాలము గడుపుచున్న యాహేమప్రభ యాశ్రమమునకు కుమార బ్రహ్మచారిణి యొక పరివ్రాజిక యేతెంచెను. హేమప్రభసత్కరించి ప్రవ్రజ్యాకారణ మడుగఁగా, పరివ్రాజిక తనవృత్తాంతము నిట్లు నుడివెను. 'నేను కన్యకగా నాతండ్రి యింట నుండఁగా ఆయన నన్ను కాళ్లొత్తు మనెను. నేను పాదము లొత్తుచు తూఁగాడఁగా, నిద్రించెదవా యని ఆయన నన్ను తన్నెను. ఆకారణమున నేను కోపించి యాతనియిల్లు విడిచి యీసన్న్యాసాశ్రమముం బూనితిని.' అని చెప్పెను. ఈకథను విని రాజపుత్త్రి ఆమెను తనతో సమానశీలనుగా నెంచి, వనవాససఖినిగా గ్రహించెను.

ఒకనాఁడు ప్రవ్రాజికతో రాజకన్య 'సఖీ, కడచిన రాత్రి కలలో విశాలమైన నదిని దాఁటి తెల్లకొండ నెక్కి భగవం

తుని అంబికాపతిం జూచితిని. ఆపరమశివు నెదుట వీణ వాయించు చుండి దివ్యసుందరుని ఒక పురుషుని కని నీతోఁగూడ నాకాశ మున కెగసితిని. ఇట్లు కల గని మేల్కాంచితిని, రాత్రియుం గడచెను.' అని చెప్పెను. ఈ ప్రకారము ఆకలను విని పరివ్రాజిక రాజపుత్త్రితో 'కల్యాణీ, నీవు శాపముచే నీలోకమునం దుద యించిన దేవతవు, ఈస్వప్నము నీశాపావసానమును తెలియఁ జే యుచున్నది.' అనెను. రాజపుత్త్రియు సఖివచనము నభినం దించెను. అంత జగద్దీపమగు సూర్యుఁడు పొడుపుగుబ్బలి శిఖ రంబు నలంకరింప, నొక రాజకుమారుఁడు గుఱ్ఱముపై నట కేతెంచి తాపసీవేషను హేమప్రభను జూచి గుఱ్ఱమును దిగి యామెకు వందనము చేసెను. హేమప్రభయు నాతనికి నతిథి సత్కారము గావించి యాసన మిచ్చెను. ఆతఁడు కూర్చున్నం తట యాతనిని, 'మహాత్మా, నీ వెవ్వఁడ?' వని యడిగెను.

ఆ రాజపుత్త్రుఁడును 'మహానుభావులారా, శుభనా ముఁడు ప్రతాపసేనుఁ డని రాజు కలఁడు. ఆతఁడు పుత్త్రార్థి యై శివపూజ చేయుచుండెను. అంతఁ గొంతకాలమునకుఁ బ్రస న్నుఁడై శివుఁడు 'ఓరాజోత్తమా, శాపగ్రస్తుఁడు ఒక విద్యా ధరుఁడు నీకు పుత్త్రుఁడుగా నుద్భవిల్లి, శాపావసానంబున మరలి విద్యాధరలోకంబునకుం బోవును. రెండవ కొడుకు పుట్టి నీవం శమును వర్ధిల్లఁజేయును' అని వర మొసంగెను. అంత నారాజు సంతుష్టాంతరంగుఁడై యథావిధి పారణము సలిపెను, కొంత

కాలమునకు వరుసగా అతనికి లక్ష్మీసేనుఁడు, శూరసేనుఁడు, అని యిద్దఱు కొడుకులు పుట్టిరి. నన్ను వేఁటమెయి నిచ్చటికి వచ్చిన లక్ష్మీసేనునిఁగా నెఱుంగుము.' అని చెప్పెను. హేమప్రభయు తనవృత్తాంతము నాతనికిం జెప్పి జాతిస్మరణము కలదై యాతనితో మరల నిట్లు పల్కెను. 'మహాత్మా, నీదర్శనము వలన నాకు జాతిస్మరణ మయినది. నేను విద్యాధరిని శాపచ్యుతనై నీలోకమునఁ బుట్టితిని. ఈమెయు నాసఖియు, నీవు నీమంత్రియు క్రమముగా నాకును నాసఖికిని పతులును, శాపచ్యుతులరు, విద్యాధరులరు. సఖిసహితకు నాకు శాపము ఇప్పుడు క్షీణించినది. మన కందఱకు విద్యాధరలోకమునందు మరల సమాగమము.' ఇట్లు చెప్పి హేమప్రభ చెలితోడ దివ్యరూపధారిణి యై యాకాశమార్గంబున తనలోకమునకుఁ బోయెను.

అంతట లక్ష్మీసేనుఁడు నివ్వెఱపడి చూచుచుండ నాతని మంత్రియు నచ్చోటికి వచ్చెను. లక్ష్మీసేనుఁడు మంత్రితో నాస్త్రీలవృత్తాంతమును వచించుచుండ, బుద్ధిప్రభుఁడును కుమారిని వెదకుచు నాస్థలమున కేతెంచెను. అతఁడు కూఁతుం గానక రాజపుత్త్రుం జూచి కౌమారితవృత్తాంతము నడుగ, రాజపుత్త్రుఁడా వృత్తాంతమును తాఁ జూచినంతయుఁ జెప్పెను. బుద్ధిప్రభుఁడు దుఃఖించుచుండ, లక్ష్మీసేనుఁడు శాపావసాన మగుటం జేసి జాతిస్మరణము కలవాఁడై మంత్రితో విద్యాధర లోకమునకుఁ బో

యెను. విద్యాధర లోకమున హేమప్రభను భార్యగాఁ గైకొని మరల భూలోకమునకు సభార్యుఁడై వచ్చి బుద్ధిప్రభుని దర్శించి యాతనివలన వీడుకోలు వడసి తన పూర్వపట్టణమునకుం బోయి తండ్రికి ప్రతాపసేనునికి తనవృత్తాంతమును నివేదించెను. తండ్రి యిచ్చిన క్రమప్రాప్తమైన రాజ్యమును తమ్మునికి శూరసేనుని కిచ్చి, లక్ష్మీసేనుఁడు వైద్యాధర లోకంబునకుం బోయెను. అచ్చట హేమప్రభా సహితుఁడై విద్యాధ రైశ్వర్యమును మంత్రియుం దానును చిరకాల మనుభవించుచుండెను. ఇట్లు గోముఖునివలని విచిత్రకథలను వినుచు శక్తియశో వివా హోత్కంఠితుఁ డయ్యును నరవాహన దత్తుఁడు ఆరాత్రిని క్షణముగాఁ గడపెను.

ఇట్లు ఆ రాజపుత్త్రుఁడు దినములు గడపుచు తండ్రికడ నుండ నొకతఱిని ఆకాశమార్గమున విద్యాధర బలము వచ్చెను. సేనామధ్యమున నరవాహనదత్తుని కియ్య దన కొమరితను తోడుకొని విద్యాధరప్రభువు స్ఫటికయశుఁడు వచ్చుచుండెను. ఆతనికి నరవాహన దత్తుఁడు శ్వశుర ప్రీతిచే నతిథి సత్కారము గావించెను. విద్యాధరాధీశుఁడు తన వచ్చిన నిమిత్తము నెఱిం గించి సిద్ధిప్రభావమువలన నిమేషమాత్రంబున సర్వ సన్నా హముం గావించి, నరవాహన దత్తుని నవరత్నాభరణంబుల భూషించి, ఆతనికి పూర్వప్రదిష్టనుతనకొమరితను శక్తియశను

యథావిధి ఇచ్చి వివాహము గావించెను. నరవాహనదత్తుం డును విద్యాధర రాజపుత్రిని శక్తియశను చేపట్టి సూర్య కాంతిని బొందిన పద్మమువలె మిక్కిలి వెలుంగుచుండెను. మామగారు స్ఫటికయశసుండు నిజపట్టణమునకుం బోంగా, శక్తి యశోవదనాంబుజమునకు మత్త మధుకరమై నరవాహన దత్తుండు సుఖం బుండెను.

# వే లా లం బ క ము

## వే ల క థ.

కం. వారణవక్త్రుని విఘ్నుని
వారణసామ్రాజ్యమహితు వరసిద్ధిమహా
కారణభూతు నఘార్ణవ
తారణపారీణు మ్రొక్కెదఁ భక్తి మెయిన్.

ఇట్లు నరవాహనదత్తుఁడు శక్తియశతోను మదనమంచు కాది భార్యలతోను స్నేహితులతోను విహరించుచు కౌశాంబీనగరమునందు తండ్రి చెంత నుండెను. ఒకనాఁడు ఉద్యానవన గతుఁడైన నరవాహనదత్తునికడకు వైదేశికులు ఇద్దఱు అన్నదమ్ములు వచ్చి అతిథిసత్కారము పొంది తమ వృత్తాంతము నిట్లు నివేదించిరి. 'రాజేంద్రా, వైశాఖపురమును పాలించెడు రాజపుత్త్రులము, సవతిసోదరులము, నాపేరు రుచిరదేవుఁడు, ఈతఁడు పోతకుఁడు. జవశీల పిడియేనుఁగొకటి నాకుఁగలదు, ఈతనికి వేగవంతములు రెండు గుఱ్ఱములు కలవు. తన్నిమిత్తము మాకిరువురకు వాదము సంప్రాప్తమయినది. నా పిడి యేనుఁగు వేగమే ఎక్కువ యని నావాదము. తన గుఱ్ఱముల

వేగ మెక్కువ యని యితని వాదము. వాని భేదమును కని పట్టుటకు నీవు దక్క మఱియొక్కరుఁడు శక్తుఁడు కాఁడు. కనుక ఓరాజా, మాయింటికే తెంచి యాపరీక్షం గావింపుము. నీవు యాచకులకు కల్పపాదపమవు, మేము దూరదేశమునుండి వచ్చిన యాచకులము.' ఇట్లు రుచిరదేవుఁడు ప్రార్థింపఁగా వత్సరాజకుమారుఁడు అంగీకరించి రుచిరదేవుఁడు రప్పించిన రథము నెక్కి వారితో వైశాఖపురమునకుం బోయెను. పౌర కాంతామణులు ఈతనిం జూచి రతీదేవిని బొందని మన్మథుఁ డనియు, కలంకరహితుఁడై పగటియందు సంచరించుచున్న చంద్రుఁడనియు, పురుషరూపమును ధరించిన కామ మనియు, స్త్రీలమనంబులను మూలచ్ఛేదము సేయుబాణ మనియు, వర్ణింపసాఁగిరి. అట నరవాహనదత్తుఁడు శృంగారరస స్థానభూతమగు మదనమందిరముం జూచి, రతీదేవితోఁడి యామన్మథునకు నమస్కరించి, విశ్రమించి, మార్గాయాసము నదలెను. అటుపిమ్మట నా సమీపమున రుచిరదేవుని భవనంబునకుం బోయి యాతని సత్కారము లందెను. ఉత్తమగజాశ్వములచే నొప్పెడు నాతని గృహముం జూచి వత్సరాజసుతుఁడు సంతసించెను. అచట పలువగల యుపచారము లొంది యారాజసుతుఁడు లోకసుందరి నాతని చెలియలిం జూచెను. ఆరమణి రమణీయరూపము మానస మపహరింప నరవాహనదత్తుఁడు ప్రవాసకష్టమునుగాని స్వజన విరహమునుగాని తలంప కుండెను. ఆకన్యయు పూచినసల్లగలు

వదండవంటిదియు ప్రేమనిక్షిప్తయు నైన దృష్టి మాలచేత స్వయంవరము గావించెను. అంత నారాజసత్తముఁడు ఇతర స్త్రీలుగాని నిదురగాని తన్ను హరింపలేనియట్లుగా రాత్రియెల్ల జయేన్ద్రసేన యను నాకాంతనే తలంచుచుండెను. మఱునాఁడు పోతకానీత మైనను వాయువేగమైన యా యశ్వరత్నద్వయమును వాహనవిద్యావిశారదుం డారాజు రుచిరదేవుని పిడియేనిక నెక్కి జయించెను. ఇట్లు రుచిరదేవుఁడు అశ్వరత్నయుగళమును జయించిన పిమ్మట రాజసుతుఁడు అభ్యంతరమందిరంబునకుం బోవునంత తంత్రి దగ్గఱనుండి దూత యొకఁడు వచ్చి పాదంబుల కెఱఁగి యిట్లు విన్నవించెను. "స్వామీ, నీ విచటికి వచ్చుటను మాతంత్రిగారు పరివారమువలన విని నాముఖమున నీ కిట్లు తెలియఁజేయుచున్నారు:—'చెప్పక యింతదూరము ఉద్యానవనమునుండి పోయితివి, మా కందఱకు దిగులుగా నున్నది. కావున త్వరగా రావలయును.' అని." ఇట్లు తంత్రిసందేశము విని ప్రియాప్రాప్తిని చింతించుచు నరవాహనదత్తుఁడు దోలారూఢమానసుఁ డాయెను.

ఆసమయమున నచ్చటి కొక వణిక్కుమారుఁడు సంతుష్టాంతరంగుం డై దూరమునుండి నమస్కరించుచు నాయువరాజుం గూర్చి యిట్లు పలికెను. 'ఓ వీరా, జయింపుము; పుష్పబాణములేని మన్మథుఁడా, జయింపుము; భవిష్యద్విద్యాధరచక్రవర్తీ, జయింపుము. బాలుఁడ నయ్యు మనములను

హరించితివి, వృద్ధిఁ బొందుచు శత్రువులకు భీతిని కలిగించితివి. కాఁబట్టి ఓ మహాప్రభూ, సంశయం బేమియు లేక శీఘ్రముగా బలివిజయము చేసి ఆకసము నాక్రమించు నచ్యుతగుణుని నిన్ను ఖేచరుల చూడఁగలరు'. ఇట్లు పొగడి యా వణిజుఁడు యువరాజుచే సత్కృతుఁడై స్వవృత్తాంతము నిట్లు నివేదించెను. భూదేవికి శిరోరత్న మన లంప యను పట్టణము ఒకటి యొప్పుచున్నది. అందు కుసుమసారుఁ డని వర్తకుఁడు ఒకఁడు ఉండెను. ధర్మనిరతుం డగు నాతనికి శంకరానుగ్రహంబున చంద్రసారుఁ డను జనించితిని. నేను ఒకనాఁడు మిత్రులతో నుత్సవదర్శనార్థము ఒక పత్తనమునకుం బోయి యచ్చటి యాచకులకు దానం బొసంగెడు దాతలను జూచితిని. అంతట నాతండ్రి సంపాదించిన యపరిమిత ధనముచే నాకు తనివి తీఱక ఇంకను ధనము గడింపవలయునని తలంపుపొడమెను. పలుదీవుల సంచరింప వేఁడి నేను నవరత్నపూరిత మగు నావ నెక్కితిని. అనుకూలదైవమువలె అనుకూలవాయువు ప్రేరింపఁగా నానావ యొక ద్వీపముం జేరెను. ఆ ద్వీపమునందు రహస్యముగా నమూల్యములగు రత్నములతో వ్యాపారము సేయుచుంటిని. అచ్చటిరాజు అర్థలోభంబున నాధనముం గైకొని నన్ను చెఱసాలయందుంచెను. నరకమువంటి యా కారాగృహమునందు నాఁకలి నీరువట్టులచేత బాధితులై దుష్కృతులైన ప్రేతములవంటి జనుల సంగడిని కొలఁదికాలం బుండితిని.

అంతట నాపట్టణవాస్తవ్యుఁడు మానంశము నెఱింగినవాఁడు మహీధరుఁ డను నొక బేహారి నావిషయమై రాజుతో 'ఓ రాజేంద్రా, లంపానగరవాసి యీ వణిక్కుమారుఁడు దోష రహితుఁడు. ఈతని చెఱసాలయం దుంచుట అయశస్కరము'. అని బోధించెను. ఇట్లు ఆతనిచే బోధితుఁడై యారాజేంద్రుఁడు నన్ను విడిపించి దగ్గఱఁ గూర్చుండఁ బెట్టుకొని గౌరవించెను. ఇట్లు రాజు నాశ్రయంబునను నామిత్రుని సాహాయ్యంబునను ఆపత్తనమున పెక్కండ్లు వ్యాపారము చేయుచు సుఖ ముంటిని.

అంత నొకనాఁడు ఉద్యానవనయాత్రయందు శిఖరుఁ డను నొకసార్థవాహుని కూఁతును బొడగంటిని. కందర్పుని దర్పసాగర లహరివలె నొప్పు నావణిక్కన్యచే నాకర్షింపఁబడి దాని తండ్రిపాలికిం బోయి యాకన్యను యాచించితిని. ఆవణి జుఁడు కొంతవడి తలపోసి 'నేను స్వయముగా నియ్యఁగూడదు. అందుల కొక కారణము గలదు. కావున నీకన్యను సింహళ ద్వీపమునకు మాతామహుని నింటికిం బంపెదను; నీ వచ్చటికిం బోయి యాతనివలన నీకన్యక బెండ్లి యాడుము, ఎట్లు నీకు లభించునో అట్లు సందేశము పంపెదను' అని బదులు పల్కి సమ్మానించి వీడ్కొల్పెను. మఱునాఁడు దాసీజనంబులతో కూఁతును నావపై నెక్కించి సముద్రమార్గంబున సింహళదేశ మునకుఁ బంపెను. నేనును సింహళద్వీపమునకుం బోవ ప్రయ త్నింప ఆ పురంబున పిడుగుదెబ్బవలె క్రూరమయిన వార్త

యొకటి పుట్టెను ; 'శిఖరుని కొమారిత యెక్కిపోవుచుండిన నావ సముద్రంబున మునిఁగినది. అం దొక్క ప్రాణియేనియు బ్రదుకలేదు.' అని. ఆవార్తావాత్యచే ధైర్యమును విడనాడి నిరాధారమగు దుఃఖాబ్ధిలో మునిఁగితిని. అంతట పెద్దలు ఊరార్పఁగా కొంతవడికి మనస్సును సమాధాన పఱుచుకొని యావృత్తాంతము నెఱుంగుటకై యాదీవికింబోవ సమకట్టితిని. రాజప్రియుఁడనైనను ధనపూర్ణుఁడనైనను నావ నెక్కి సముద్రముంజొచ్చితిని. సబురులో వారిదతస్కరుఁడు మహాశబ్దములతో ధారాశరావలుల నడరించుచు నాచెంతకు వచ్చెను. ప్రతికూల దైవమువలె బలవంత మగు గాడ్పు మాటిమాటికి నూటాడింపఁగా నావ పగిలిపోయెను. అంత పరిజనమును ధనమును అంతయుం గోలుపోయి నీటం బడిన నాకు దైవవశంబున నొక కొయ్య దొరకెను. అనుకూల దైవము చాఁచిన బాహువో యన నున్న యాకొయ్యఁ బట్టుకొని వాయువశంబున కడలిదరి చేరితిని. ఆతీరభూమియందు సంచరించుచుండఁగా నాకు దైవవశంబున బంగారుకడ్డీ యొకటి దొరకినది. దానిం గైకొని యాచెంత నున్న యొక పల్లెకుం బోయి దాని నమ్మి యామూల్యమునకు రెండు వస్త్రములను విలిచికొని భోజనముం గావించి సముద్రసంచారమువలనఁ గలిగిన కష్టము నొక కొంతఁ దీర్చుకొంటిని. కొండొకసేపు అట విశ్రమించి ప్రాణసమా వియోగము నోర్వఁ జాలక యిటుఁ నిటుఁ దిరుగుచు సైకత లింగ

ములు గల యొక ప్రదేశముం బొడగంటిని. అం దొకవంక లింగార్చన చేయుచున్న దానిని మునివేషోజ్జ్వల నొక కన్నియం గని యిట్లుతలపోసితిని. 'ఏమి యీయాశ్చర్యము! ఈకన్య నా ప్రేయసివలె నున్నది. ఆచెల్వయే యగునో? అంతటి భాగ్యము నాబోంట్లకెట్లు కలుగును?' ఇట్లు నేను తలపోయుచుండఁగా 'నీప్రియయే యీ వెలది' యని తెలుపునదివోలె నావలకన్ను కడు నదరసాగెను. నే నాకన్నెం దఱిసి 'ఓతన్వీ, మేడలయందు వసింపఁ దగినదానవు, ఇట్లు అరణ్యమున నుండఁ గతం బేమి?' యని యడిగితిని. ఆ చెల్వ యేమియుం బలుక దాయెను. అంత శపించు నేమో యని భయపడి యా చెట్లనడుమ నొకచోఁ గూర్చుండి, యాతన్వంగిం దనివి తీఱక చూచుచుంటిని. అంత నొంతవడికి ఆముచ్చికంటి పూజ చాలించి మరల నావంక చూడ్కులు నిగిడించి మెల్లమెల్లగా నటనుండి తొలంగెను. ఆసుందరి దృష్టిపథంబు దాఁటి చనుడు, నేను తమోంధముల దిశలం జూచుచు రాత్రివేళా చక్రవాకమునవస్థం బొందితిని.

అంత నాక్షణంబున నతర్కితోపనత ఆ బాల్యబ్రహ్మచారిణి తపస్సుచే చిక్కియు సూర్యునివలె వెలుంగుచు జ్ఞానదర్శన మూర్తీభవించిన ధృతియో యన మతంగమహర్షికూఁతురు యమున యను పూబోఁడి నా మ్రోల సాక్షాత్కరించి యిట్లనియె:—"ఓయి చంద్రసారా, ధైర్యము నవలంబించి వినుము. ద్వీపాంతరమునందు శిఖరసంజ్ఞకుఁడు వణిక్కు ఒకఁడు కలఁడు.

అతనికి కొంతకాలమునకు రూపవతి యొక కొమారిత యుద్భ
విల్లెను. ఆకన్య యుద్భవిల్లుడు జినరక్షితుఁ డను నొకజ్ఞాని శిఖర
కునితో ఇట్లు చెప్పెను:—'ఓయి శిఖరకా, ఈకన్య అన్యమా
తృక, దీని నీవు స్వయముగా నియ్యఁగూడదు, అన్యహ స్తముచే
దానము చేయింపుము.'. ఆమాటల కియ్యకొని శిఖరకుఁడు నీవు
కోరిన యాకన్యను మాతామహ హ స్తమున నిప్పింపఁగోరి సము
ద్రమార్గంబున మాతామహగృహంబునకుఁ బంపెను. మార్గ
మున నావ పగిలి యందఱు సముద్రంబున మునిఁగిరి. ఆయుర్బ
లమునం జేసి దైవముం బోని కరుళ్లవలన నామె సముద్రతీర
ముం జేరెను. ఆసమయమున నాతండ్రి మతంగభగవంతుఁడు
శిష్యులతో సముద్రస్నానమునకై యచ్చోటికిం బోయి మృత
కల్పను ఆకన్యను గని కనికరించి తనయాశ్రమమునకుఁ గొనివచ్చి
'యమునా, దీనిం బాలింపుము' అని నాకు నప్పగించెను. వేలా
తటమునుండి తెచ్చినయాకన్యకు వేల యని పేరిడెను. ఆ కన్య
యందు నాచి త్తము కృపాయ త్త మై యున్నది. ఆహా ! బ్రహ్మ
చర్యముచే నిర స్తసంసార నగు నన్ను నీసంసారము బాధించు
చున్నది. పాణిగ్రహణము లేక యౌవనవతి యగు నీ కన్యఁ
జూడఁజూడ నామనము చింతిం బొగులుచున్నది. ఆమె నీకు
పూర్వజన్మపత్ని అని దివ్యజ్ఞానముచేత తెలిసికొని నీసమీప
మున కేతెంచితిని. అస్మదర్పిత యగు నాకన్యను చేపట్టుము.
మీరిరువురు ననుభవించిన క్లేశము సఫలమవుఁ గాక." - ఇట్లు

అకాలవృష్టివంటి యా వాక్యామృతముచేత నన్నుఁ దేర్చి యాయమ మతంగముని సమీపమునుం జేర్చెను. అట నామె ప్రేరణచే నమ్ముని మనోజరాజ్యలక్ష్మింబోని యా వేలను నాకు నిచ్చెను. అట నేను సుఖం బుండి, యొకనాఁడు వేలతోఁగూడ తటాకమునందు జలక్రీడ లాడుచుండి, అందు స్నానము చేయుచున్న మతంగ మహర్షిపై కైతప్పున నీళ్లు చల్లితిని. అంత నాతపసి కుపితుఁడై సభార్యునికి నాకు 'పాపాత్ములారా, మీకు వియోగ మగుఁగాక' అని శాపంబొసంగెను. అంత పాదాక్రాంతయై వేల దీనవాక్యంబుల ప్రార్థింపఁగా నాయోగి శాపాంతము ను ఇట్లు ప్రసాదించెను. 'ఓరి చంద్రసారుఁడా, కరిణీ వేగముచే నశ్వయుగ్మమును గెలిచిన వత్సరాజపుత్త్రుని భావివిద్యాధరచక్రవర్తిని నరవాహనదత్తుని ఎప్పుడు చూతువో అప్పుడు నీశాపము తీఱి యీభార్యం గలసెదవు.' ఇట్లు చెప్పి మతంగ మహర్షి మజ్జనం బాడి వెన్నుని దర్శించుటకు వెల్లదీవికి నాకాశమార్గంబునఁ బోయెను. ఈశ్వరప్రసాదంబునంజేసి విద్యాధరుని కొక్కనికి లభించి యాతనివలన తనకు దొరకిన యీరత్నఖచిత బాలచూతవృక్షమును సభార్యునికి నాకు నిచ్చి తానును యమునయు శ్వేతద్వీపమునకుఁ బోయెను.

అంత నేను దయితతోఁ గొంత కాల మచ్చట నుండి వనవాసము వలన విసిగి ఎడఁబాటునకు భయపడి స్వదేశము నకు తరలితిని. పయనమై కడలిగట్టునకుం బోయి యొకనావం

జూచి అందు మొదట భార్యను ఎక్కించి నేను నెక్కుటకు యత్నించునంతలో మునిశాపవశంబున విసరుగాలి వీచి నావను దూరముగా కొనిపోయెను. భార్యను కోలుపోయిన నా చేతనను లబ్ధావసరయో యన మూర్ఛ హరించెను. అచ్చట నొక తపసి మూర్ఛితుని నన్నుఁజూచి దయతో నూరార్చి తనయాశ్ర మంబునకుఁ గొనిపోయి అడిగి విని శాపాంతసమయము రాఁగా దెలిసికొని నాకు చెప్పెను. అంతట అటనుండి తరలి నేను సము ద్ర ప్రయాణము చేసి, యోడ మునుఁగఁగా, ఒడ్డు చేరి, మిత్రుని ఒకవర్తకుని గూడి ప్రియను వెదకుచు, పెక్కుదుర్గ ప్రదేశ ములను కడచి క్రమముగా ఈవైశాఖపురంబు సొచ్చి యిట వత్సరాజ సద్వంశ ముక్తామణిని హస్తినీజితాశ్వరత్నద్వయుని నిన్నుం జూచితిని. చూచినమాత్రాన నాశాపభారము తొలంగి నది. అంతఁ గొంతపడికి సాధువు లగు నాబేహారులు నాప్రియం గొని వచ్చి నాకిచ్చిరి. ఓరాజేంద్రా, యమునాదత్తసద్రత్న హస్తను ప్రేయసిం గూడి శాపసముద్రము నీఁదిన నేను నీపా దంబుల కెఱఁగి నిన్నామంత్రింపఁ గోరి వచ్చినాఁడను. మహా రాజా, నాకష్టము తీఱినది. నేను సభార్యుఁడనై స్వదేశము నకుం బోయెదను:—

ఇట్లు ఆ వణిగ్వరుండు చంద్రసారుఁడు స్వవృత్తాంతము నివేదించి చరితార్థుఁడై పోయిన తర్వాత రుచిరదేవుఁడు వత్స రాజాత్మజునికి సవినయంబుగ తన చెలియలిని జయేన్ద్రసేనను

ముందే మనోరథదత్తను కరేణుతురగోత్తమ యుగ్మ సమేతముగా నొసంగెను. నరవాహనదత్తుఁడు ప్రియం దోడ్కొని రుచిరదేవుని వీడ్కొని స్వకీయ రాజధాని యగు కౌశాంబికిం జని అందు మదనమంచుకాది దివ్యాంగనలతో విహరించుచు సుఖ ముండెను.

---

# శశాంకవతీలంబకము.

## ౧-వ తరంగము.

కం. కేళీలీన మధువ్రత
పాళీలిపి నొప్పుకరము బ్రత్యూహాభిదా
లీలాకీర్తి స్తంభము
పోలిక నెగఁజూఁచు నాగముఖుని నుతింతున్.

కం. రాగ విహీనుం డయ్యును
రాగాఢ్యరచనలచేత రహిఁ కెక్కెడు నా
భోగివిభూషణుఁ గొల్చెద
నేగికి నాశ్చర్య సర్గచిత్రకరు హరున్.

కం. పవిభృన్ముఖరణవీరుల
పవిముఖ్య ప్రహారణములు భంగము నొందున్
ఎవఁ డల్ల సూటి మీఱెడు
పువుశరములు దగుల నతనిఁ బూజింతు మరున్.

ఈవిధమున వత్సరాజపుత్త్రుఁడు పలువురను పొందియు తొలిభార్యయైన యామదనమంచుకాదేవిని మాధవుఁడు రుక్మిణినిబోలె ప్రాణాధికముగా ప్రేమించుచు కౌశాంబీనగరమందు

వసించియుండెను. ఇట్లుండగా ఒకరాత్రి ఎవతో దివ్యకన్యక ఆకాశమార్గమున వచ్చి తన్నుఁ గొనిపోయినట్లు అతనికి స్వప్నమాయెను. మేలుకొని చూచుకొనునంతట తాను ఒకగొప్ప పర్వతసానువున చెట్లనీడలో గరుడమణి వేదికయం దుండెను. ఆకన్యయు మన్మథునిలోకసమ్మోహనౌషధియుంబోలె ఆరాత్రి వేళ కాననమునెల్ల వెలిఁగించుచు తనపార్శ్వమున నుండెను.

అంత నాతండు త న్నటకుఁ దెచ్చినది యా చెల్వయే గదా యని తలంచి, ఆమెం గని, ఆమె సిగ్గుచేత నిజమనోరథమును నెఱవేర్చుకొనక తామసించిన దనియు నూహించి, తత్త్వము రూఢిసేయువాఁడై కపటనిద్ర నవలంబించి ధౌర్త్యంబున 'చెలియా, మదనమంచుకా, నీ వెచ్చట నున్నావు? రమ్ము ననుఁ గవుంగిలించుకొమ్ము.' అని పలవరింపం దొడంగెను. ఆపల్కు విన్న వెంటనే యాదివ్యాంగన ఆప్రస్తావముచే జ్ఞప్తి చేసికొని, నానవలనియడ్డంకిం దొలంచు సుపాయంబుగా మదనమంచుకారూపముం దాల్చి, నరవాహనదత్తునిం గవుంగిలించెను. ఆతండును కనుఁగవం దెఱచి కేవలము తన ప్రియాస్వరూపముగానే యుండుటం గాంచి, ఆహాహా! ఏమి యీ విద్యానైపుణ్యము! అని మనంబునం దలపోయుచు, మందహాససుందరాననుఁడై యామెకంఠముం గవుంగలించెను. అంత నామె లజ్జం దిగనాడి నిజరూపముం జూపి 'ఆర్యపుత్త్రుఁడా, నిన్ను స్వయముగా వరించిన నన్ను ఇపుడు పరిగ్రహింపుము.' అనెను.

అంతట నరవాహనదత్తుఁడు ఆమెను గాంధర్వవిధిచే వివాహ మాయెను. ఆమెతో నచట నారాత్రి యథోచితముగాఁ గడపి తెల్లవాఱినంతట ఆప్రేయసి కుల మెఱుంగువాఁడై అనియె:—

### నక్క పిడియేనుఁగుకథ.

ప్రాణేశ్వరి, నీకు ఒక యపూర్వకథ చెప్పెద వినుము: ఒకానొకతపోవనమందు బ్రహ్మసిద్ధి అని ముని ఒకఁ డుండెను. అతనియాశ్రమము చెంత నొకముసలినక్క యాఁడుది యొక గుహలో నివసించెను. ఒకనాఁడు ముసురుపట్టి యానక్క యాఁకట నొగులుచు గుహ వెలునడి మేఁత వెదకికొను చుండఁగా, అడవియేనుఁ గొకటి పిడి నెడఁబాసిన యున్మాదములో దానింగని చంపం దలఁచుకొని వచ్చెను. అంతట జ్ఞాని దయాళువు ముని దానిం గని యా రెంటిపై కనికరించి ఆ నక్కను పిడియేనుఁగుగా మార్చెను. ఏనుఁగు పిడిం గని వికారము తీఱి దానిమీఁద మరు లొక్కెను. నక్కకును చావు తప్పెను. పిమ్మట శరదృతువులో ఒకనాఁడు పిడితోఁగూడి విహరించుచు, ఏనుఁగు, దాని కై తామరపూ వొకటి తెచ్చునపై, మడుఁగులోనడుగువెట్టి యడుసులో దిగఁబడి, వజ్రాయుధ నిర్భిన్న పక్షములు పడిపోయిన కొండవోయన, కదలనేరకుండెను. ఏనుఁగు ఆవిధమున నిక్కట్టునం బడి యుండఁగా నానక్కకరిణి యప్పుడే మఱియొకకరిం గూడి వెడలి పోయెను. ఇంతలో ఆ మొదటిపిడి ఈయేనుఁగును పూర్వము ఎడఁబాసినట్టిది దీనిభార్య దీనిని వెదకికొనుచు దైవవశమున

నచ్చోటికే వచ్చెను. భద్రజాతిది ఆపిడి ఆరీతిని అడుసులో తగుల్కొనియున్న పతిం గని తానును సహగమనము సేయునదై మడువుబురదలోనికిఁ జొరఁబడెను. ఆసమయమున నటకు మహా తపస్సంపన్నుఁడైన యాబ్రహ్మసిద్ధిమహాముని శిష్యసమేతుఁడై వచ్చి యీనాగజములయవస్థం గని కనికరించి శిష్యులకు మహాబలము కలుగునట్లు వర మిచ్చి వారిచే నారెంటిని అడుసు నుండి వెలువరింపించెను. అట్లు మృతియు ఎడఁబాపును దప్పి యానాగదంపతులు యథేచ్ఛముగా సుఖ ముండినవి. ప్రేయసీ, ఈప్రకారము గొప్పపుట్టువుగలవి తిర్యగ్జంతువులును ఇక్కట్టునం బడిన పతి నేనియు మిత్త్రు నేనియు విడనాడవు సరిగదా, రక్షిం పనుం గూడ రక్షించును. నీచజాతిని బుట్టిన చంచలాత్మలహృద యమునకు గొప్పతనము గాని స్నేహము గాని తగులనేరదు.

## లలితలోచనా జన్మవృత్తాంతము.

ఇట్లు వత్సేశ్వరుఁడు పల్కఁగా విని యా దివ్య కన్యక యిట్లనియె:-ప్రాణేశ్వరా, నీవు వక్కాణించినది యట్లే, ఈవిషయమందు సంశయము వలదు. ఇట్లు వాక్రుచ్చు నీ చిత్తంబు నా కెఱుకపడినది. ఆర్యపుత్త్రా, నావక్కాణించెడి యీకథను అవధరింపుము. కాన్యకుబ్జనగరమందు బాహుశక్తి యను మహారాజునొద్ద మాన్యుఁడు నూఱుగ్రామముల కొడ యఁడు శూరదత్తుఁ డని బ్రాహ్మణుఁ డొకఁ డుండెను. అతని భార్యపతివ్రత, ఆమెపేరు వసుమతి. వారిరువురకును వామదేవుఁ

డని ఉత్తముఁడు పుత్త్రుఁడొక డుండెను. ఆవామదత్తుఁడు తండ్రికి కడు ననుంగై సకలవిద్యలును చక్కఁగా స్వల్పకాలముననే నేర్చి శశిప్రభయను కన్యం బెండ్లియాడెను. కాలక్రమమున తండ్రి స్వర్గస్థుఁడై తల్లియు సహగమనము సేయఁగా, వామదత్తుఁడు తన భార్యతోఁగూడ గార్హస్థ్యధర్మము నెఱవేర్చుకొను చుండెను. దైవయోగమున అతనిభార్య ఎవరివలననో శాకినీసిద్ధిం బొంది యతని యెఱుక లేక స్వేచ్ఛాచారిణి యై యుండెను. వామ దత్తుఁడు రాజసేవార్థము రాజధానికిఁ బోయి ఉండఁగా గ్రామము నుండి పినతండ్రి వచ్చి యతనితో ఏకాంతంబున 'నాయనా, మన కొంప మాసిపోయినది, నీభార్య నీదున్నలకాపరినే తగులు కొన్నది, నేనే కన్నులారఁ జూచితిని.' అని చెప్పెను.

ఈమాట విని, అతనిని రాజధానిలో తనకు బదులుగా నుంచి వామదత్తుఁడు కత్తియొక్కటియె తోడుగా తనయింటికి వచ్చి పూలతోఁటలో రాత్రి దాఁగి యుండెను. ఆవేళకే అచటికి దున్నలకాపరియు వచ్చెను. క్షణము సేపటికి శశిప్రభయు బాళి మీఱి పెక్కు లారగింపులు కేలఁ గొని తనవిటకాని నా దున్నలకాపరిం దఱిసెను. వాఁ డారగించిన తర్వాత వానితో నామె శయన మొందెను. ఇదియెల్లం గనుచుండి వామదత్తుఁడు 'ఛీ, పాపాత్ములారా, ఎటకు తప్పించికొనిపోయెదరు?' అని యఱచుచు వారిమీఁదికి కత్తి దూసికొని పరువిడెను. భార్య కని లేచి 'ఛీ! ఛీ! నీచుఁడా?' అని యతని మొగమున రవంతఁ

దున్నము విసరెను. అంత నతఁడు మనుష్యుఁడ యయ్యును దున్న
పోతుగా మాఱెను, జ్ఞప్తిమాత్రము పోదాయెను. ఆకూళ
యతనిని దున్నలతోఁ గలిపి తోలి ఆదున్నలకాపరిచేత దుడ్డుఁ
గఱ్ఱతో కొట్టించుచుండెను. అప్పుడే దున్నం గొనుటకు వర్తకుఁ
డొకఁడు రాఁగా ఆవిధమున తిర్యగ్జాతియై వసము దప్పియున్న
యాపతిని ఆక్రూరాత్మురాలు వానికి విక్రయించెను. వర్తకుఁడు
గంగచెంత నున్న తన యూరికి తోలుకొని పోయి బరువులు
మోయించుచుండెను. దున్నయై దుఃఖించుచు బరువుమోఁతచే
కృశించి శల్యావశిష్టుఁడై వామదత్తుఁడు ఇట్లు తలపోయుచుం
డెను. 'నమ్మినమగని వంచించి ఇంట నాలు అతనికిం దెలియ
నీక చెడిపయై పాపము సేయుచుండిన, వానికి సుఖ మెక్కడిది?
వానిగతి చంకలో పాముం బెట్టుకొన్నవాని గతియే గదా.' ఇ
ట్లతఁ డొకప్పుడు దుఃఖించుచు కన్నీళ్లుగురియుచుండఁగా, ఎము
కలబడుగు నతనిని యోగిని యొకతె గని, జ్ఞానప్రభావముచే
తద్వృత్తాంత మెల్ల నెఱింగి, మంత్రోదకములు సల్లి దున్నతన
మును పో నడిచి, మరల మనుజుం జేసెను. పిమ్మట తనయింటికిం
గొనిపోయి, తనకూఁతుం గాంతిమతి యను దాని నతని కిచ్చి
పెండ్లిచేసి, అతనిచేతికి కొన్ని యావాలిచ్చి, 'ఇవి మంత్రిం
చినట్టివి. వీనితో నీ మొదటి పెండ్లామును ఆ పాడుముండను
కొట్టుము, అది గోడిగ యగును.' అని చెప్పెను. అంతట
నతఁడు తన క్రొత్తపెండ్లామును దోడ్కొని ఆవాలు పదిలము

చేసికొని తనయింటికి పోయి దున్నలకాపరిని పరిమార్చి ఆయాం వాలతో ఆ మొదటిపెండ్లామును కొట్టి గోడిగం జేసి లాయములో కట్టించెను. ఆదిమొదలు ప్రతిదినము ఆగోడిగను పగదేఱ ఏడుమోదులు మోది కాని భోజనము చేయ నని ప్రతిజ్ఞ చేసి నిత్య మట్లే చేయుచుండెను.

ఈతీరున వామదత్తుఁడు కాంతిమతితోఁ గూడ గృహస్థాశ్రమధర్మము నెఱవేర్చుచుండఁగా నొకనాఁ డతనియింటికి అతిథి యొకఁడు వచ్చెను. అతిథితో భోజనమునకు కూర్చున్నవాఁడై వామదత్తుఁడు తటాలున జ్ఞప్తితెచ్చుకొని పోయి, గోడిగ పెండ్లామునకు దుష్టదెబ్బలు నియమముబడి నొసంగి, లోనికి వచ్చి స్వస్థచిత్తుఁడై యారగించెను. అతిథి యా వృత్తమున కాశ్చర్యపడి కుతూహలముచే నతనిని 'అయ్యా, ఎక్కడికి నీ వట్లు భోజనము మాని కలగుండుపడి వెడలితివి?' అని యడిగెను. వామదత్తుఁడు పూసగ్రుచ్చినట్లు తన వృత్తాంత మంతయు నాదినుండి వివరించెను. 'నిష్ప్రయోజనమైన యీపగ నీ కేల? నీ దున్న తనమును ఎవతె తొలఁగించినదో ఆమెనే నీయత్తగారిని సేవించి యేదేని గొప్ప విద్యను సాధించుకో రాదా?' యని యతిథి హితము పల్కెను. వామదత్తుఁడు ఆమాటకు సంతసిల్లి యతనిని మఱునాఁడు సూర్యోదయమున సత్కరించి పంపెను.

తర్వాత ఆకస్మికముగా అత్త తన యింటికి రాఁగా వామదత్తుఁడు ఆసిద్ధయోగినిని భక్తిపూర్వకముగా సేవించి వర

మడిగెను. ఆమెయు తనిసి యతనికి సభార్యునికి కాలసంకర్షిణీ విద్యను దీక్షాపూర్వకముగా నుపదేశించెను. అతఁడును సభార్యుఁడై శ్రీపర్వతమునకుం బోయి యచట నావిద్యను సాధించెను. విద్య సిద్ధించి ప్రత్యక్షమై యతనికి ఉత్తమ మగు ఖడ్గమిచ్చెను. కత్తింగొని యతఁడు భార్యతోఁగూడ నప్పుడే విద్యాధరోత్తముఁడై తనసిద్ధిప్రభావముచే మలయపర్వత శృంగమందు రజతకూట మను పేర నగర మొకటి నిర్మించి అందు విద్యాధర రాజ్యము నేలుచుండెను. కాలక్రమమున నా దంపతులకు లలితలోచన:యను పేర కన్య యొకతె జనించెను. 'ఈకన్య విద్యాధర చక్రవర్తికి భార్య కాఁగలదు.' అని యామె జన్మసమయమున నాకాశవాణి పలికెను. ఆర్యపుత్త్రా, నేనే ఆకన్యను, నావిద్యాప్రభావముచే నిన్నెఱింగి వలచి యిచటికి ఈమలయ సానువునకుం గొని వచ్చితిని.

ఇట్లు నరవాహనదత్తుఁడు ఆమెవలననే యామెను విద్యాధరినిగా నెఱింగి గౌరవము సూపి యామెతోనే అచట నుండెను. వత్సరాజాదు లతనివృత్తాంతమును రత్నప్రభాదుల విద్యామహిమచేత నెఱింగిరి.

---

# ౨-వ తరంగము.

## లలితలోచనా నరవాహనదత్తుల యెడఁబాపు.

తర్వాత నరవాహనదత్తుఁడు ఆనూతన భార్యను లలితలోచనం బడసి మలయపర్వతమునందు ఆమని చెలరేఁగుతఱిని ఆమెతోఁ గూడ పూచిన మ్రాఁకులచే వెలుఁగొందు కానలలో విహరించుచు, ఒక చోట పూలుగోయునాటఁ దవిలి చూపుమేర దాఁటి పోయిన యాప్రాణేశ్వరిని తాను వెదకుచుం జని, ఒక తావున తేటనీట వాట మై గట్టుమీఁది చెట్టులనుండి రాలిన పువ్వులచేత చుక్కలతోడి యాకసంబో యన నొప్పారుచున్న యొక మేటిసరోవరముం గాంచినవాఁడై, 'పువ్వులు గోయుతమిం బడి ద వ్వేఁగిన ప్రియకామిని వచ్చులోపల ఈ చెలువున స్నానమాడి దీనిగట్టున క్షణము కూర్చుండెదను గాక.' యని తలంచి, యట్లే సలిపి, దేవతార్చన గావించి. గందపుమ్రాఁకుల నీడం జల్లనైన రాపకలమీఁద కూర్చుండెను. అట నడకసాటిచేత రాయంచచేడియలును, మాటపోల్కిచే కోకిలతరుణులును, కనులపోటిచే లేటిచెలువలును, దవ్వున నున్నప్రేయసిని మదనమంచుకను తలఁపింపఁగా నరవాహనదత్తుఁడు ఆమెనే తలపోసి అంతమాత్రనే యుప్పతిల్లిన వలరాచచిచ్చు సోఁకి సొమ్మసిల్లెను. ఆయదన నటకు స్నానార్థము పిశంగజటుఁ డను మునివరేణ్యుఁడు

వచ్చి ఆతీరున వ్రాలియున్న నరవాహనదత్తుం గాంచి కరుణా పరతంత్రుఁడై మదనమంచుకాస్పర్శతుల్యములయిన గంధపునీళ్ల నతనిపైఁ జల్లెను. నరవాహనదత్తుఁడు మూర్ఛ దేరి నమస్కరింపఁగా దివ్యదృష్టి యామునిపుంగవుఁడు 'పుత్త్రా, నీయిష్టము సిద్ధించును, ధైర్య మూనుము, దాన సకలంబును అబ్బును, అందులకు నిదర్శనముగా మృగాంకదత్తునికథను చెప్పెదను. ఇప్పటికీ విని యుండవేని వినుము.' అని పల్కి, స్నానము చేసి, నరవాహనదత్తుని తన యాశ్రమమునకుం దోడ్కొని పోయి, త్వరగా ఆహ్నికము ముగించి, యతనికి పండ్లు ఆతిథ్య మొసంగి, తానును పండ్లు భుజించి యిట్లని యాకథం జెప్పందొడంగెను.

# మృగాంకదత్తుని కథ.

ముల్లోకములం బ్రఖ్యాతి గాంచినది అయోధ్య యని పట్టణము కలదు. దానిని పూర్వము అమరదత్తుఁ డను రాజేలు చుండెను. తేజముచే వెలుఁ గొందుచున్న యారాజునకు అగ్ని దేవునికి స్వాహాదేవివోలె నిరతానురక్త సురతప్రభ యని భార్య యుండెను. ఆమెయం దా రాజునకు తనధనువుంబోలె కోటి నంటిన గుణముచే వంగినవాఁడు మృగాంకదత్తుఁ డను కుమారుఁడు జనించెను. ఆకుమారునికి ప్రచండశక్తి, స్థూలబాహువు, విక్రమకేసరి, దృఢముష్టి, మేఘబలుఁడు, భీమపరాక్రముఁడు, విమలబుద్ధి, వ్యాఘ్రసేనుఁడు, గుణాకరుఁడు, విచిత్రకథుఁడు, అని పదిమంది కులీనులు పడుచువాండ్రు ప్రాజ్ఞులు ప్రభుహిత పరాయణులు మంత్రులుగా నుండిరి. వారితో రాజకుమారుఁడు మృగాంకదత్తుఁడు తండ్రియింట సుఖ ముండెను గాని, యతనికి తగిన భార్య లేదాయెను. ఒకనాఁడు భీమపరాక్రముఁ డను మంత్రి ఏకాంతమున నతనితో ని ట్లనియె:-"దేవా' రాత్రి నే నెఱింగిన విశేషమును చెప్పెదను వినుము. రాత్రి నేను మేడ యందు నిద్రించుచుంటిని, మెలఁకువ గలిగినది. కన్ను దెఱచి చూడఁగా పిడుగులవంటి గోళ్ల తోడి సింహ మొకటి నామీఁదికి వచ్చినది. నేను సురియం గేలఁ గొని లేవఁగానే అది పఱాయ

మాన మైనది. నేనును దానిం దలుముకొని వడిగా పోయితిని. అది యేటియవలి యొడ్డు చేరి నామీఁదికి నిడుపైన తన నాలుక సాఁచినది. నేనును సురెకత్తితో ఆనాలుకం దెగనఱికి గొప్ప యనకట్టవలెనున్న యానాల్క మీఁదనే యేఱు దాఁటితిని. అంత నాసింహము ఘోరరూపముతోడి మనుష్యుఁడాయెను. ఎవఁడవు నీ వని నేనడుగఁగా, వాఁడు తాను బేతాళుఁ డనియు నాసత్త్వమునకు తాను సంతసించె ననియు పలికెను. ఆమాట విని నేను 'అట్లని మాప్రభువునకు మృగాంకదత్తునికి ఎవ్వతె భార్య యయ్యెడునో చెప్పుము.' అని యడిగితిని. బేతాళుఁ డిట్లనియె: 'ఉజ్జయినిలో కర్మసేనుఁ డను రాజు ప్రసిద్ధుఁ డున్నాఁడు. అతనికి అచ్చరల మెచ్చని తేజు గలది, సౌందర్యసృష్టికై బ్రహ్మదేవుఁడు దాఁచుకొనియున్న నిధానమో యన నొప్పులు గుల్కునది, శశాంకవతి యని కూఁతురు గలదు. ఆమె నీ దొరకు భార్య యగును, ఆమెను బడసి ఆతఁడు ఈ భూమి నెల్ల నేలఁగలఁడు.' ఇట్లు చెప్పి బేతాళుఁడు అంతర్ధాన మాయెను. నేను ఇంటికి వచ్చితిని. దేవా, ఇది నా రాత్రి వృత్తాంతము."

ఈ వృత్తాంతమును మృగాంకదత్తుఁడు తనమంత్రుల నెల్ల రావించి వారికి నివేదించి తాను స్వప్నములోఁ గన్న వృత్తాంతము నిట్లు చెప్పందొడంగెను. "మన మెల్ల నొక కాఱడవిం జొచ్చితిమి. పయనంపుటలయికచే దప్పి గొని ఎట్టకేలకు జలముం గాంచి త్రాగనుండఁగా, దానినుండి యేవురు పురుషులు

ఆయుధపాణులు వెలువడి మనల నడ్డగించిరి. వారిని చంపి మరల త్రాగఁబోవు నంతటికి ఆ పురుషులు అదృశ్యులైరి, ఆజలము మాయ మాయెను. అంతట కష్టములో పడి చింతించుచుండఁగా మనవైపు వృషభవాహనారూఢుఁడై చంద్రోజ్జ్వలుఁడు అరుగుదెంచెను. మన మెల్లరము దండప్రణామ మొనరింపఁగా మహేశ్వరుఁడు తనకుడికంటినుండి యొక కన్నీటిబొట్టును నేలమీఁద రాల్చెను. అది వెంటనే సముద్ర మాయెను. దాన మంగళ్యము ముత్యాలహార మొకటి పుట్టెను. నే నా హారమును కంఠమునం దాల్చి ఆసముద్రమును నెత్తుట్టఁదోఁగిన మానిసిపుఱ్ఱకతో త్రాగితిని; వెంటనే మేలుకొంటిని. తెల్ల వాఱినది.” మృగాంకదత్తుఁడు ఇట్లు స్వప్నాశ్చర్యమును నివేదింపగా విమలబుద్ధి యను మంత్రి యిట్లు పల్కెను. ‘దేవా’ మహేశ్వరుని యనుగ్రహమునకు ఇట్లు పాత్ర మగుటచే నీవు ధన్యుఁడవు. కలలో ముక్తావళిని ధరించుటకు సముద్రమును త్రాగుటకును, శశాంకవతిని పొందుదు వనియు పృథివీచక్రము నెల్ల నేలుదు వనియు నర్థము. కలలోని యితర విషయమునకు కొంచెము క్లేశము కలుగు నని యర్థము.’ అంతట మృగాంకదత్తుఁడు వెండియు మంత్రుల నెల్ల నిట్లు హెచ్చరించెను:—నా స్వప్నమునకు విమలబుద్ధి చెప్పిన ఫలంబును, భీమపరాక్రముఁడు బేతాళునివలన నెఱింగిన వృత్తాంతంబును, అట్లే తప్పక జరుగునవియే యైనను సేనాబలముచేతను దుర్గబలముచేతను గర్వించి

యున్న కర్మసేనునివలన నుండి యతని కొమరితను శశాంకవతిని నేను ప్రజ్ఞాబలముచేత పడయుట సరి. ఎల్లకార్యములకును ప్రజ్ఞాబలము ముఖ్యసాధనము. అందులకు తార్కాణగా నొక కథను వినుఁడు:—

### అనంగలీలాభద్రబాహులకథ - ప్రజ్ఞాబలము.

మగధదేశములో భద్రబాహు వని రా జేలుచుండెను. అతనికి మంత్రగుప్తుఁడని మహాబుద్ధి మంత్రి యుండెను. ఒకనాఁడు ఆ రాజు మంత్రి నేకాంతమునకు పిలిచి యిట్లు పలికెను. 'మిత్రమా, కాశిరాజునకు ధర్మగోపునికి అనంగలీల యని కూఁతురున్నది, ఈ మూఁడులోకములలోను అట్టి మోహనాంగి యింకొకతె లేదు, అతఁడు నేను ప్రార్థించినను ద్వేషముచేత నియ్యలేదు, అతనికి భద్రదంత మని యేనుఁగొకటి యున్నది, దాని ప్రభావముచేత అతఁడు దుర్జయుఁడు. అతనికొమరిత అనంగవతి లేక నేను జీవింపను, ఈవిషయమున నా కేమియు నుపాయ మగపడలేదు, మిత్రమా, ఏమి చేయఁదగును? చెప్పుము.' మంత్రియు 'దేవా, పరాక్రముచేత మాత్రమే సిద్ధిగాని బుద్ధిచేత సిద్ధి కలుగదా? నీవు చింతింపవలదు. నేను నాబుద్ధిబలముచేత నీకార్యమును సాధించెదను, చూడుము.' అని పలికెను. మఱునాఁడు మంత్రి అయిదాఱుగురను అనుచరులనుతోడ్కొని మహావ్రతివేషము దాల్చి కాశికి పోయెను. అచ్చట ఆ యనుచరులు శిష్యవేషము దాల్చి లోకులతో నతఁడు మహాసిద్ధుఁ

డని ప్రకటించుచుండిరి. జనులు భక్తితో వచ్చి ఆతని దర్శించుచుండిరి.

ఒకరాత్రి తాను వచ్చిన కార్యమును నెఱవేర్చుకొనుటకుం దగిన యుక్తి యేమయిన నగపడునా యని యరయుచు, నగరమున శిష్యులతోఁ గూడ సంచరించుచు, దూరము నుండి హస్తిపాలుని భార్యను ఇల్లు వెలువడి భయముచే వడివడిగా నడచుచున్న దానిని ఆయుధపాణులు ముగ్గురు పురుషులు ఎటకో తోడ్కొని పోవు చుండం జూచి, 'ఇది ఎవతెయో నిక్కముగా ఇంటినుండి లేచి పోవుచున్నది.' అని నిశ్చయించి, ఎటకు పోవునో గనం గోరి, దూరమునుండియే అనుచరులతోఁ గూడ దానివెంబడిం బోయి, అది యేయింటఁ బ్రవేశించెనో అయిల్లు గుర్తు పెట్టుకొని, వెంటనే తన యునికిపట్టుం జేరెను. తెల్లవాఱంగానే హస్తిపాలుఁడు తన భార్య ధనము హరించుకొని ఇల్లు వెడలిపోయిన దని యెఱింగి వెదకికొనుచుండఁగా, నతనికడకు యుక్తిగా మహావ్రతి తన యనుచరులను పంపెను. భార్య కనఁబడని దుఃఖముచే హస్తిపాలుఁడు విషము త్రాగెను. ప్రత్యనుచరులు కనికరించినవారుంబోలె తమ విద్యచేత వాని విషవేగమును కుదిర్చి 'రారమ్ము మాగురువుకడకు, ఆయనకు సర్వమును దెలియును.' అని యతనిని మంత్రికడకుం దెచ్చిరి. హస్తిపాలుఁడు ప్రత్యాభరణములతో వెలుఁగొందుచున్న యామంత్రి పాదముల వ్రాలి తనభార్యవృత్తాంత మడిగెను. మంత్రి క్షణము

సేపు ధ్యానము చేసినట్లు అభినయించినవాఁడై రాత్రి యాతని భార్యను ఆపురుషులు ఎటకుఁ గొనిపోయిరో ఆప్రదేశమును గుర్తులతోఁ గూడ స్పష్టముగా చెప్పెను. హస్తిపాలకుఁడు మంత్రికి ప్రణతుఁడై సెల వొంది తత్క్షణమే నగరరక్షకులను వెంటం గొనిపోయి, మహాప్రత్యక్ష మయిన యాగృహమును చుట్టవేసి, తనభార్యను హరించిన యాపురుషులను సంహరించి, ధనముతోఁ గూడ తనభార్యను మరలం బొంది యిల్లు సేరెను.

మఱునాఁడు ఉదయకాలమున నతఁడు వచ్చి భక్తి పూర్వకముగా దండ ప్రణామ మొనర్చి యా మాయవ్రతిని తనయింటికి భోజనమునకు రమ్మని వేఁడుకొనెను. వ్రతియు 'మేము గృహములం బ్రవేశింపము, రాత్రియే భుజింతుము గాని పగటివేళ భుజింపము.' అని పల్కఁగా, హస్తిపాలుఁడు అట్లే అతనికి రాత్రి యేనుఁగుల తబేలాలో భోజనమున కేర్పాటు గావించెను. మంత్రి మంత్రబలముచేత నొకవెదురుగొట్టములో పాము నొకదానిని పెట్టుకొని యుండి ఆగొట్టమును గూడ కొనిపోయి అనుచరసమేతుఁడై భోజనము కావించెను. తమ్ము వీడ్కొని హస్తిపాలుఁడు పోయి నిద్రించిన పిమ్మట, ఇతరులు అందఱును నిద్రించు చుండఁగా, మంత్రి వెదురుగొట్టముతో ఆ పామును నిద్రితమై యున్న యాభద్రదంతగజము చెవిలో చొరఁబెట్టి, యారాత్రిని తబేలాలోనే గడపి, మఱునాఁడు తన దేశమునకుం దరలిపోయెను. ఏనుఁగు మృతినొందెను. ఈరీతిని

ధర్మగోపుని యా భద్రదంతగజమును ఆతనిదర్పమునుం బోలె పొలియించి, మహామంత్రి వచ్చి తన్ను దర్శింపఁగా, భద్రబాహు మహారాజు కరము సంతసించి, కాశికి ధర్మగోపుని కడకు అనంగలీల నడుగుట కొఱకు రాయబారము పంపెను. ధర్మగోపుఁడును ఏనుఁగు మృతి నొందినందున దుర్బలుఁడయి యిపుడు మగధ రాజునకు అనంగలీల నొసంగెను. రాజులకు కాలోచితముగా నీటి ప్రబ్బలినడువడి సిద్ధమే గదా. ఈ ప్రకారము మహామంత్రి మంత్రగుప్తుని ప్రజ్ఞాతిశయముచే భద్రబాహునికి అనంగలీల లభించినది. కావున నేనును ప్రజ్ఞాబలముచేత నాభార్యను సాధింపవలసినది.

ఇట్లు మృగాంకదత్తుఁడు వాక్రువ్వఁగా మహామంత్రి విచిత్రకథకుఁ డిట్లు వక్కాణించెను. కలలోఁ గలిగిన హారము చేతను దేవతానుగ్రహముచేతను నీకును సకలమును సిద్ధించును. దేవతానుగ్రహము నమ్ము గాదు. దాన నేది సిద్ధింపదు! అందులకు నేనొకకథ చెప్పెదను వినుము:—

## వినయవతీ పుష్కరాక్షులకథ.

తక్షశిలా నగరమందు భద్రాక్షుఁ డని రా జుండెను. అతఁడు పుత్త్రార్థియై కత్తిలో మహాలక్ష్మి నావాహన చేసి ప్రతిదినమును నూటయెనిమిది తెల్లదామరలతో మానమునం బూజించు చుండెను. ఒకనాఁడు దైవవశమున నొక్క తామర కొఱవడఁగా నతఁడు మానము మాన నొల్లక తనహృదయకమల

మును కోసి తీసి దానితో పూజ ముగించెను. అంత నతనిభక్తికి మెచ్చి మహాలక్ష్మి ప్రత్యక్షమై యతనికి సార్వభౌముఁడు కాఁగల పుత్త్రుఁడు పుట్టునట్లు వర మిచ్చి, అతని దేహమును వజ్రదేహముగా నొనరించి దివ్యమైన రూపమును బ్రసాదించి యంతర్ధానము నొందెను. పిమ్మట నతనికి పట్టపు దేవియందు సులక్షణుఁడు కుమారుఁడు జనించెను. రాజు అతనికి హృత్పుష్కర ప్రసాదంబునం బుట్టినవాఁ డని పుష్కరాక్షనామధేయ మొసంగెను. కాలక్రమమున యౌవనవంతుఁడును గుణోన్నతుఁడు నైన యాకుమారునికి రాజ్యాభిషేక మొనరించి తాను తపోవనమునకుం బోయెను. పుష్కరాక్షుఁడును రాజై ప్రతిదినము హరుని పూజించుచుండి ఒకనాఁడు తనకు మంచి భార్యను గలిగింపు మని వర మడిగెను. 'బాలకా, నీకోరిక నెఱవేఱును లే.' అని యాసమయమున నాకాశమునుండి వాక్కు వినఁబడెను. అంతం బుష్కరాక్షుఁడు సంతుష్టుఁడై, గగనవాణిని నమ్ముకొని యెదురు సూచుచుండి, యొకనాఁడు వేఁటకై యడవికిం బోయి అందు సంభోగ లంపటంబులై యొండొంటిం బెనఁచికొని యున్న సర్పదంపతుల నొకలొట్టియ భక్షింప నుండఁగా గని, జాలిగొని, లొట్టియం గోలం గూలనేసెను. కూలినమాత్రాన నా లొట్టియ యాదేహము విడిచి విద్యాధరుఁడై హర్షముతో పుష్కరాక్షునిఁగూర్చి యిట్లనియె:-

"రాజా, నీవు నా కుపకార మొనర్చితివి. ఎట్లన్న విను. రంకుమాలి యని విద్యాధరకుమారుఁ డొకఁ డుండెను. అతనిని

రూపసంపదాకృష్టుడైయైన తారావళి యను విద్యాధరేంద్రకన్య వలచి స్వయముగా వరించెను. అట్లు ఇరువురును స్వతంత్రించి వివాహ మాడినందులకు ఆమెతండ్రి కినిసి యిరువురును ఎటనో కానలో ఒండొరుల నెడఁబాయునట్లు శాపము పెట్టెను. అనంతరము తారావళీరంకుమాలు లిరువురును తమ దివ్యభూము లందు తగులము మీఱి విహరించుచు ఒకానొకప్పుడు శాపప్రభావముచేత నొకయడవిలో నొకరికంటె కొకరు దూరమై యెడఁబాసిరి. అది మొదలు తారావళి చెలువుని వెదకికొనుచు పడమటిసంద్రంపుటవలిదరిని సిద్ధమౌనిసేవితమైన యొకానొకవనములో ఒకపెద్దనేరేడుఁజెట్టును తుమ్మెదల తీయని యులివులచేత తన్ను కనికరమున నోదార్చుచున్నదియుం బోలె నొప్పుచున్న దానిని గని తాను తేఁటిబోటిరూపుం దాల్చి యం దొక్కపువ్వున తేనెం గ్రోలుచు అలపుదీర్చుకొను చుండెను. ఆ క్షణమందే అచటికి దైవయోగంబున తత్పతి రంకుమాలియు దాఁగా తారావళీభృంగి ఆకుసుమంబున హర్షాతిశయమున వీర్యము వదలినదై తేఁటిరూపుమాని, తన చెలువుని చిరదృష్టుని, వెన్నెలను వెదకికొనివచ్చిన వెలయుంబోలె నున్న యాతనిఁగూడి, తన యింటికిం బోయెను. అనంతరము, తదీయవీర్యనిషిక్త మయిన యా పువ్వు కాయ కాచి పండై దానిలోపల కాలక్రమమున కన్యక యొకతె పుట్టియుండెను. దివ్యజాతి వారి వీర్యము వమ్ము గాదు గదా. ఒకనాఁ డటకు ఫలమూలములకై విజితాసు వను

మౌని వచ్చెను. ఆయనచెంత నా నేరేడుఁబండు రాలి పగిలి యందుండి దివ్యకన్యక వెలువడి వినయాతిరేకముతో నతని పాదములకుఁ బ్రణమిల్లెను. మునియు యోగదృష్టిచే నామె వృత్తాంత మెల్ల నెఱింగి వింతపడి, యామెను తన యాశ్రమమునకుం గొనిపోయి, వినయవతి యని పేరిడి పెంచుచుండెను. కాలక్రమమున అక్కన్నియ ఎదిగి జవ్వనికాఁగా, నేనొకనాఁడు ఆకాశమార్గమునం బోవుచుఁ గని రూపగర్వముచేతను వలరాయనిచేతను మతి దప్పి, ఆసుందరిని న న్నొల్లకున్నను బలిమిచేత గ్రహింప దొడఁగొంటిని. దాని యేడ్పులకు ముని వచ్చి నన్నుఁగని 'ఓరీ, నీవు రూపగర్వితుఁడవు, కాన కరమురోఁత రూపుతోడి లొట్టియ వగుము, పుష్కరాక్షనృపతిచే మడిసి యీశాపమునుండి ముక్తిం గాంచెదవు. ఈవినయవతికి అతఁడు భర్త యగును.' అని శపించెను. అట్లే నేను నిట లొట్టిపిట్టనై యుండి నీవలన శాపముక్తుఁడ నైతిని. నీవును సంద్రంబునద్దరిని సురభిమారుత మనుపేర నొప్పెడి యాతని యాశ్రమమునకుం బొమ్ము. లక్ష్మికిం గూడ రూపగర్వము నడంచునదైన యా వినయవతిని బొందుము" ఇట్లు పుష్కరాక్షునితోఁ బలికి ఆ విద్యాధరుఁడు ఆకాశమార్గమున నిజస్థానమునకుం బోయెను.

పుష్కరాక్షుండును నిజనగరమునకుం జని, రాజ్యమును మంత్రుల కప్పగించి, గుఱ్ఱ మెక్కి ఒంటిగా తరలి, క్రమముగా పడమటిసముద్రంపుదరికి వచ్చినవాఁడై 'ఈసముద్రము నెట్లు

దాఁటఁగలను.' అని చింతించు చుండెను. అంత నచ్చట నొక చండికాలయము నిర్జనము అగపడెను. రాజు స్నానమాడి వచ్చి యందు దేవికి మ్రొక్కి, అచట నున్న యొకవీణను ఎవరో పెట్టి యున్న దానిని కేలఁ గొని, తాను స్వయముగా రచించిన గీతములచే దేవి మనస్సు వచ్చునట్లు తదీయస్తుతులు ఆవీణమీఁద పాడి అలఁతచే రాత్రి యచటనే నిద్రించెను. వీణావాదనమునకు మెచ్చి చండికాదేవి తనభూతవర్గముచేత నతనిని సముద్రము నవలిగట్టున పెట్టించెను. అంతం దెల్లవాఱఁగానే యతఁడు మేల్కాంచి చూచుకొనునప్పటికి తాను చండికాలయములో లేఁడు, అడవిలో నున్నాఁడు. అతఁ డాశ్చర్యపడి లేచి క్రుమ్మరుచు నొక యాశ్రమముం గాంచెను. పండ్లబరువునకు వంగిన చెట్లచే అతిథిసత్కారముగా ప్రణామిల్లుకరణిని, పులుఁగుల కూయులచే స్వాగతము పల్కునైవడిని, ఒప్పు మీఱిన యాతపోవనమందుఁ జొచ్చి పుష్కరాక్షుఁడు శిష్యపరివృతుని మహాముని నొకనిం గని పాదములకుం బ్రణతుఁ డై నిలిచెను. ముని యితని కాతిథ్యము చేసి జ్ఞానదృష్టిచే నితనివృత్తాంతము నెఱింగి ఓయి పుష్కరాక్షుఁడా, నీవు ఎవతెకొఱకు వచ్చితివో ఆకన్య 'వినయవతి ఇధ్మాద్యాహరణార్థము పోయియున్నది, క్షణములో రాఁగలదు, వేచియుండుము. అది నీ పూర్వభార్య, దానిని ఇపుడే వివాహము కమ్ము.' అని వాక్రుచ్చెను. అంతట పుష్కరాక్షుఁడు మనస్సులో 'ఇతఁడే ఆముని విజితాసువు, ఇదియే

యాసురభిమారుతాశ్రమము, నిశ్చయముగా నన్ను చండికా దేవి సముద్రము దాఁటించినది. ఈచెలువ నా పూర్వభార్య యని ముని పల్కెనుగదా, ఇది చిత్రముగా నున్నది.' అని తలపోసి సంతసము వెల్లి విరియ మునిని 'స్వామీ, ఈ కన్య నాపూర్వభార్య యంటిరి, అది యెట్లో దయచేసి చెప్పుదురు గాక.' యని వేఁడుకొనెను. ముని కౌతుకమేని విను మని యిట్లు వచింప సాగెను.

(విద్యుల్లేఖా ధర్మసేనుల కథ.)

తామ్రలిప్తియందు విద్యుల్లేఖయు ధర్మసేనుఁడు నని వణిగ్దంపతు లుండిరి. ధర్మసేనుఁడు తన్ను దొంగలు కొట్టి దోఁచు కొనఁగా సభార్యుఁడై యగ్నిప్రవేశార్థము వెడలెను. ఆ కాల మున నాకాశమార్గమున నేతెంచిన యందంపు హంసదంపతు లను వా రిరువురుం గాంచిరి. ఆహంసలనే తలపోయుచు వారు చచ్చుం జొచ్చి, పిమ్మటిపుట్టువున హంసియు హంసంబునై, భార్యా పతులుగానే కూడిరి. ఒకానొకప్పుడు ఆయంచలు వర్షాకాల ములో ఖర్జూరవృక్షముమీఁద గూఁటు నివసించు చుండఁగా తుపాను వచ్చి చెట్టు పడిపోయి వానికి వియోగము కలిగెను. గాలి నిలిచిన తర్వాత హంసము హంసిని నీళ్లలోను చెలువు లందును వెదకి కానక, హంసలకు వర్షాకాలసేవ్యమైన మానస సరస్సునకు పోవుచున్న యొకహంసిని దూరమునుండి కని, తన భార్య యని యాస గొని, స్మరాతురమై, వెంటఁ జని, మానసము

చేరి యచట వాస్తవమయిన తనభార్యంగని దానితో క్రీడించుచు వర్షాకాలముం గడపెను. పిమ్మట విహారార్థము ఆ హంసదంపతులు ఒకకొండకొమ్మునం జేరి యుండఁగా వేఁటకాఁ డొకఁడు కని హంసిని కోలం గూల్చెను. దానిం గని హంస వెఱ గొని దిగు లొంది ఎటకో పలాయిత మాయెను. అంత నాబోయ యాఁచచ్చిన యంచను కైకొని ఎవరినో సాయుధులను పలువురను పురుషులను ఆదారిని వచ్చుచున్న వారిని దవ్వులం గని, వారు హరింపకుండ దానిని తొందరతొందరగా కత్తితో పచ్చగడ్డి కోసి యాఁగడ్డిలో దాఁచివేసెను. వారు పోయినపిమ్మట వాఁడు వచ్చి పుచ్చికొనుటకై గడ్డికుప్పను తొలఁగఁ ద్రోయునంత, యాఁగడ్డితోఁగూడ కోఁతపడియున్న హంసి మృతసంజీవనీరసము సోఁకి బ్రతికినదై ఎగిరిపోయెను. ఇంతలో హంసయు ఒకసరస్సు కడఁ గూడియున్న యంచపిండుం గాంచి తనచెల్వ అందుఁగలదని భ్రమసి వానితోఁ జేరెను. ఆవేళ నటకు చెంబడి యొకండు వచ్చి వలపన్ని యాఁహంసల నెల్ల బంధించి కూర్చుండి భుజింపఁ దొడంగెను. ఆక్షణమున నటకు ఆహంసి తనభర్తను వెదకుచు వచ్చి దానియవస్థం గాంచి దిగు లొంది దిక్కులు సూచి గతి గానకుండెను. ఆసమయమున నటకు ఎవఁడో ఒక పురుషుఁడు వచ్చి చెఱువుగట్టున వలువమీఁద తనరతనాల కంటె నుంచి స్నానము సేయుచుండ, హంసి యతనికిం దెలియనీక యాఁకంటెను హరించి తెచ్చి చెంబడికిం జూపుచు దగ్గఱదగ్గఱఁగానే

మింట నెగురుచుండెను. అంతట వాఁడు ఆరగింపు మాని దుడ్డు గుదియను కేలం గొని, పిట్టలను వలతోడ నచటనే యుజ్జగించి, హంసిమీఁదనే కన్ను వెట్టి వెంబడించెను. హంసియుం బోయి దూరమున వాఁడు చూచుచుండ నొకకొండకొమ్మున నా రత్నాలకంఠమును పెట్టెను. వాఁడు దానిం గొన నాకొండ నెక్కం దొడంగెను. అంత హంసి వేగంబునం బోయి వలలోని తన మగనిచెంత చెట్టుపై కునుకుచున్న యొకకోఁతిని ముక్కుతోఁ గంటం బొడిచెను. కోఁతి వెఱచఱిచి వలపై కుఱికి దానిని త్రెంచి వేసెను. అంతట హంస లెల్లను సేమంబున వెలువడినవి. ఈహంసియు దీనిహంసయు ఒం డొంటిం గలసికొని తమతమ వృత్తాంతంబులు చెప్పుకొని యథేచ్ఛము విహరించుచుండినవి. వెంబడివాఁడు కంఠెం గొని మగలి పిట్టలం దిను నాసచే చెఱువు కడకు వచ్చు నంతటికి ఆ పురుషుఁడు కంఠెను వెదకికొని కానక వానిచేతం గాంచి బెదరించి గ్రహించి సురెకత్తితో వాని కుడి చేయి దఱిగివైచెను. ఒకనాఁడు ఆహంసలు రెండును తామర పూ వొకటి గొడుగుఁగాఁగొని నడిపగలింట చెఱువునుండి మింట విహరించుచు క్షణములో నొకయేటియొడ్డున శివపూజాధురంధరుఁడైన యొకమునీంద్రుని యాశ్రమముమీఁదుగాఁ బోవుచుండినవి. బోయ యొకఁ డప్పు డారెంటిని ఒక్కకోలనే కూల్చెను. వానితామరగొడుగు అపు డాముని పూజించుచున్న శివలింగముశిరమునం బడెను. బోయ యారెంటను హంసను

తాఁగైకొని హంసిని ముని కిచ్చెను. మునియు దానిని శివునికి నైవేద్య మొసంగెను, పుష్కరాక్షా, నీవే ఆహంసవు. లింగముపై మీ గొడుగుగఁ దామర వడినపుణ్యముచేత నీవు మహారాజవుగా జన్మించితివి. ఆ హంసియే వినయవతి విద్యాధరి, విశేషముగా దానిపాలచే శివుఁడు పూజలొందెను గాన నది యీవిద్యాధరిగా జన్మించినది. ఇట్లు ఈమె నీకు పూర్వజన్మభార్య..

విజితాసు విట్లు పలుకఁగా పుష్కరాక్షుఁడు వెండియు నతనిని 'స్వామీ, అగ్నిప్రవేశము ఎల్ల పాపములను దహించునది గదా, మా కేల దానివలన పక్షిజన్మము సంభవించినది?' అని ప్రశ్న చేసెను. ముని యి ట్లనియె:—ప్రాణి యేజంతువుం దలపోయుచు మృతిఁ జెందునో ఆజంతువుగాఁ బుట్టును. అందులకు దృష్టాంతము:—

## లావణ్యమంజరి కథ.

పూర్వము ఉజ్జయినీ నగరమందు నైష్ఠిక బ్రహ్మచారిణి లావణ్యమంజరి యని యొక బ్రాహ్మణ కుమారి యుండెను. అట్లుండి యామె యొకతఱిని కమలోదయుఁ డను విప్ర యువంగాంచి యతనిపై తగు లూని విరాళిచిచ్చునం గ్రాఁగుచుండియు వ్రతలోపము నొల్లక గంధవతియొడ్డునకుం బోయి యాతీర్థంబున నతని పొందునే భావించుచు దేహత్యాగము చేసెను. ఆ భావనచేత రూపవతి యనుపేర వేశ్యగా ఏకలవ్య నగరమందు

ఇన్నించి సంభోగలంపటయై యుండెను. తీర్థవ్రత ప్రభావముచేత నాచేడియకు పూర్వజన్మజ్ఞానము కలిగి యుండెను. ఒకనాఁడా వేశ్య మాటల వరుసను చోడకరుఁ డను బ్రాహ్మణునికి జాపకునికి జపకాలమం దేకచిత్తత వలయు నని తెలియఁ జెప్పుచు తనపూర్వజన్మవృత్తాంతమును వర్ణించెను. తుదిని శుద్ధ సంకల్పయై వేశ్య యయ్యును సద్గతిని బొందెను. అట్లే రాజా ఎవఁడు దేనిని చింతించుచు డిందునో వాఁడు అదిగా పుట్టును.

ఇట్లు తెలిపి మునీంద్రుఁడు రాజును స్నానమునకు పోయి రమ్మని పంపి తానును మధ్యాహ్నసవనమును నిర్వర్తించెను. పుష్కరాక్షుండును అడవియేటియొడ్డునకుం బోయెను. అట ఎన్నఁడుం గని యెఱుంగమిం గుతూహలంబుచేత నాకా అడవిం గన వచ్చిన మింటిమానికపు వెల్గో యన నొప్పుచు వినయవతి పువ్వులు గోయుచుండెను. ఆమెం గని యుత్సుకుఁడై యామె యెవతెయో యని యతఁడు జిజ్ఞాసించుచున్నంతలో నామె కూర్చుండి స్వైరముగా సఖితో 'సఖి, పూర్వము నన్నుఁ గోరిన విద్యాధరుఁడు శాపముక్తుఁడై వచ్చి, నేఁడు నాకు భర్త వచ్చు నని చెప్పిపోయినాఁడు.' అని వచించెను. సఖియు,ముని కన్యక కిట్లనియె:—"ఈదినము వేకువను నేను వినుచుండఁగా విజితాసు మునీంద్రుఁడు ముంజకేశుఁ డనెడి శిష్యునిం బిలిచి 'వత్సా, త్వరగా పోయి తారావళీరంకుమాలుల నిటకుం దోడి తెమ్ము. ఈదినము వారికూఁతురు వినయవతికిని పుష్కరాక్షుని

కిని ఇట వివాహము జరుగును.' అని ఆన తిచ్చెను. వల్లె యని ముంజకేశుండును పోయెను. కావున, చెలీ, రమ్ము మనమును ఇప్పుడే ఆశ్రమమునకుం బోవుదము."-ఆమాట విని వినయవతి యాచెలితో కూడ నాశ్రమమున కేఁగెను. పుష్కరాక్షుఁడు ఆసంభాషణయెల్ల దూరముగా చాటున నుండి విని కామాగ్ని సంతాప శాంత్యర్థమో యన ఆయేట స్నానము చేసి విజితాసుని యాశ్రమమునకుం బోయెను. అచటి కప్పటికి తారావళీరంకు మాలులు వచ్చియుండిరి. వారికి రాజు ప్రణమిల్లెను. వారును రాజును సత్కరించిరి. మునులును వివాహకర్మ నెఱవేర్ప వచ్చి యుండిరి. అంతట విజితాసువు మూర్తి దాల్చిన మణియొక హావిర్భుజుఁడో యన నొప్పుచు తన తేజస్సులచే వెలుఁ గొందు చున్న వివాహవేదికయందు ఆ తలిదండ్రులచేత వినయవతిని పుష్కరాక్షునికి దానము చేయించెను. ఆసమయంబున రంకు మాలి యల్లునికి ఆకాశగామి యైన దివ్యరథ మొకటి యొసం గెను. 'ఈమెతోఁగూడ చతుస్సాగరసమేత యైన యీ భూమి నెల్ల నేలుదువు.' అని విజితాసుముని వర మిచ్చెను. అనంతరము పుష్కరాక్షుఁడు మునీంద్రునివలన సెల వొంది పెండ్లికూఁ తుతోఁగూడ గగనగామియైన యాతే రెక్కి సముద్రము దాఁటి తన నగరమునకుఁ బోయి ప్రజల కెల్ల చంద్రోదయమువోలె కన్నుల పండు వొనర్చి, అటనుండి రథప్రభావముచేత భూ

మండల మెల్ల జయించి చక్రవర్తియై వినయవతితోఁ గూడ చిరకాలము సకలభోగము లనుభవించుచుండెను.

దేవా, యిట్లు అలవిమీఱిన పనులు సైతము దేవతానుగ్రహముచే స్వారస్యముగా సిద్ధించును. నీకును కలలో నగపడిన గౌరీవల్లభు కటాక్షముచే అభీష్టము త్వరలోనే నెఱవేఱును.

విచిత్రకథకునివలన ఈ కథను విని మృగాంకదత్తుఁడు శశాంకవతిని బడయ నువ్విళ్లూరుచు మంత్రికుమారులతోఁ గూడ ఉజ్జయినికి పయనము కట్టెను.

---

## 3_వ త ర ం గ ము.

---

### మృగాంకదత్తుఁడు ఉజ్జయినికిం దరలుట.

ఈ వడువున మృగాంకదత్తుఁడు బేతాళుఁడు చెప్పినట్టి యాకర్మసేనరాజు కొమారితను శశాంకవతిని కోరినవాఁడై, రహస్యముగా నగరమునుండి మంత్రు లెల్లరతోడను మహావ్రతికవేషమున నుజ్జయినికిం బోవుటకు కలియఁ బలికికొని, యందులకై మంచపుఁగోడు పునుకలు ఇత్యాదిపరికరములు సమకూర్ప భీమపరాక్రముని నియమించెను. వానినెల్ల నతఁడు నేకరించి, తన యింట నుంచుకొనియుండుటను వేగువాని వలన పెద్దతేని ముఖ్యమంత్రి యెఱింగి యుండెను. ఇట్లుండ నొకనాఁడు మృగాంకదత్తుఁడు మేడమీఁద తాంబూలము వేసి

కొనుచు నడచుచుండి తాంబూలరసమును క్రింది కుమిసెను. అది దైవయోగమున నాసమయమందు ఆదారిని క్రిందఁబోవు చున్న యామంత్రినెత్తిమీఁద బడెను. మృగాంకదత్తుఁ డతనిం జూడలేదు. ఉమిసినవాఁడు మృగాంకదత్తుఁ డని మంత్రి తెలిసికొని స్నానశుద్ధుఁడై ఆ యవమానమునకు మనస్సులో పగఁ బూని యుండెను. ఆమఱునాఁడే యాకస్మికముగా నమరదత్త మహారాజునకు విషూచికావ్యాధి కలిగెను. అదే సందని యామంత్రి ఏకాంతమున రాజును అభయము వేఁడి యిట్లు బోధించెను. 'ప్రభూ, భీమపరాక్రమునియింట నీ కుమారుఁడు మృగాంకదత్తుఁడు నీమీఁద నభిచారప్రయోగము చేయుచున్నాఁడు, ఇది దానం గలిగినవ్యాధి. నేను వేగువలన వింటిని, ప్రత్యక్షముగా కనవచ్చును. కాన వాని నాత్మజుఁ డని కొంకక దేహమునుండి వ్యాధినింబోలె దేశమునుండి వెడలఁగొట్టుము.' ఈమాట విని యమరదత్తుఁడు ఏమియుం దోఁపక తత్క్షణమే ఆ విషయమును కని రమ్మని భీమపరాక్రముని యింటికి తన సేనాపతిని బంపెను. అతఁడు వెంటనే పోయి భీమపరాక్రముని యింట తలవెండ్రుకలకట్టులు లోనగు వస్తువులు దొరకఁగా వానిం గొనివచ్చి రాజునకుఁ జూపెను, అంతట కినుక రెట్టించి రాజు 'నాపుత్త్రుఁడు రాజ్యలుబ్ధుఁడై యిట్లు నాకు ద్రోహ మాచరించినాఁడు, వానిని వానిమంత్రులతోఁగూడ ఇప్పుడే రాజ్యము

[illegible] వలసినది.' యని సేనాపతి కాజ్ఞాపించెను. నమ్మిన [illegible] మంత్రుల కపటప్రయోగము నెల్లెఱుంగనేర్చును?

దళవాయియు పోయి రాజాజ్ఞను నివేదించి మృగాంకదత్తుని మంత్రికుమారులతోఁగూడ నగరమునుండి వెలువరించెను. మృగాంకదత్తుఁడు ఐశ్వర్యమును సరకు గొనక సంతసించి వినాయకుం గొలిచి, మనంబున తల్లి దండ్రులకుం బ్రణమిల్లి, అయోధ్య వెలువడి దూర మేఁగి ఆప్రచండశక్తి ప్రముఖ సహచరులు పదిమందితో ఇట్లనియె:— 'శక్తిరక్షితుఁ డని కిరాత రాజొకఁ డున్నాఁడు, అతఁడు నాకు సహాధ్యాయియు బాల్యమిత్త్రుండును. పూర్వము అతనితండ్రిని మాతండ్రి యుద్ధములో బంధిం జేయఁగా నతఁడు తనకు మాఱుగా తనకుమారు నితనిం బూఁటకాఁపుగా నిడెను. పిమ్మట తండ్రి కాలధర్మము నొందఁగా నావిన్నపమున మాతండ్రి యితనిదాయాదుల నోడఁగొట్టి ఇతనిని తండ్రిరాజ్యమున నిలిపెను. మనము ఇప్పుడు ఆ మిత్త్రునికడకు పోవుదము. పిమ్మట క్రమముగా శశాంకవతికై యుజ్జయినికి పోవుదము.' అంతట మంత్రులును వల్లె యన నతఁడటకే పయనము సేయుచు నడుమ నొక మహారణ్యమునం బడెను. అందెచటను చెట్లు లేవు, నీళ్లు లేవు. అందు వారు తిరిగి తిరిగి వేసరి, యొకతావున నొకసరస్సును దానిగట్టున నొక యొండు మ్రాఁకునుం గనిరి. అందు సాంధ్యవిధు లాచరించి జలము ద్రావి మృగాంకదత్తుఁడు బడలికచే మంత్రులతోఁగూడ

ఆ యెండుమ్రాని క్రిందఁ బరుండి నిద్రపోయెను. రాత్రి వెన్నెల కాయుచుండఁగా మృగాంకదత్తుఁడు మేల్కొని చూచునంత ఆ శుష్క వృక్షము క్రమముగా పత్త్రపుష్పఫలసమృద్ధ మాయెను. పండినపండ్లు నేలకు రాలుచుండెను. అంతట మృగాంకదత్తుఁడు మంత్రులను మేలుకొలిపి ఆయద్భుతముం జూపెను. అందుల కాశ్చర్యమగ్నులైన యాసచివులతోఁగూడ తానును తీయని యాపండ్లను భుజించెను. అందఱును తినఁగానే చూచుచుండఁ గానే ఆమ్రాను క్షణములో నొక బ్రాహ్మణ కుమారుఁడా యెను. అతనిని మృగాంకదత్తుఁడు ఆశ్చర్యపడి యడుగఁగా అతఁడు నిజవృత్తాంతము నిట్లు వక్కాణించెను.

## శ్రుతధి వృత్తాంతము.

అయోధ్యలో దమధి యని ద్విజోత్తముఁ డుండెను. నే నతని పుత్త్రుఁడను శ్రుతధిని. ఒకప్పుడు కఱవు వచ్చి నాతల్లి మృతిం జెందఁగా మే మిరువురము దేశముల వెంటఁ దిరుగుచు ఇచ్చోటికి వచ్చితిమి. ఇట నెవరో మాతండ్రికి అయిదుపం డ్లిచ్చిరి. ఆయన యాకఁట డస్సియు మూఁడు నాకొసంగి రెండు తన కుంచుకొని స్నానార్థము చెఱువుంజొచ్చెను. ఆయన మరలి వచ్చునంతలో నేను ఆ రెండు ఫలములనుంగూడ భక్షించి నిద్రితుఁడను బోలె కొయ్యవలె పరుండియుంటిని. ఆయన స్నానమై వచ్చి నేను కపటంబున కొయ్యవలె నుండుట నెఱింగి, నన్ను 'ఇచటనే చెఱువు గట్టున ఎండుచెట్టవై యుండుము, వెన్నెలరాత్రుల నీకు పువ్వులుం

గాయలుం గలుగును, ఒకప్పుడు అతిథులను పండ్లచే తృప్తులం జేసి ఈశాపమునుండి విముక్తి నొందుదువు' అని శపించెను. అంత నేను శుష్కవృక్షమనై చిరకాలమున కిపుడు నా ఫలములను మీరు భక్షించినపుణ్యాన శాపముక్తి నొందితిని.

రసాయన నీరాశనుల వృత్తాంతము.

ఇట్లతఁడు తనవృత్తాంతము చెప్పి మృగాంకదత్తు నతని వృత్తాంత మడుగఁగా, నతఁడును యథాస్థితముగా వర్ణించెను. నిర్బంధువు నీతిశాస్త్రపారంగతుఁడు నా శ్రుతధి మృగాంకదత్తుని, 'నన్ను నీయనుచరునిఁగా నంగీకరింపు' మని వరము వేఁడెను. మృగాంకదత్తుఁ డంగీకరించి యారాత్రి నటనే గడపి, మఱునాఁడు మంత్రులతోను శ్రుతధితోను తరలి పోయెను. వా రట్లు కరిమండిత మను పేరి యొకయడవిలోఁ బోవుచుండఁగా ఏవురు పురుషులు దురాకారులు కేశభూయిష్ఠులు వచ్చి, తమ్ముం గని యాశ్చర్యపడుచున్న మృగాంకదత్తునితో వినయపూర్వకముగా నిట్లు విన్నవించిరి. 'మేము కాశిలోఁ బుట్టితిమి, బ్రాహ్మణులము, గోధనముచే జీవించు చుంటిమి. అనావృష్టిచే ఆసీమలో పచ్చగడ్డి వేలుతోఁగూడ మాడిపోఁగా, మేము ఆవులం దోలుకొని తృణసమృద్ధ మైన యీ ప్రదేశమునకు వచ్చితిమి. ఇట మాకు బావినీరు రసాయనభూతము, గట్టుమీఁది చెట్లులనుండి రాలు కరక తాడియుసిరికల యూఁటుతోడిది. ఆనీరు త్రాగుచు పాలు సేవించుచు నున్న మాకు ఈనిర్జనవనములో ఐదువందల వత్సర

ములు గడచినవి. అందువలన దేవా, మే మి ట్లున్నారము. మీరును మాపుణ్యమున అతిథులు దయ సేసితిరి, కాన మా యాశ్రమమునకు రండు.' ఇట్లు వారు వేఁడుకొనఁగా మృగాంకదత్తుఁడు అనుయాయి సమేతుఁ డై ఆ యాశ్రమమునకుం బోయి క్షీరాది రూప మయిన వారి యాతిథ్యమును గ్రహించి యాదిన మటఁ గడపెను.

## మృగాంకదత్తుఁడు కిరాతపతిం గలయుట.

మఱునాఁడు వేకువను వెలువడి యతఁడు దారిలో నానావినోదములు సూచుచు క్రమముగా కిరాతదేశము చేరెను. ముందుగా తనరాక నెఱింగింప శ్రుతధిని తనమిత్త్రుఁ డయిన కిరాతపతి శక్తిరక్షితునికడకు పంపెను. కిరాతనాయకుఁడును తెలిసికొని ఎదురువచ్చి ప్రణమిల్లి మృగాంకదత్తుని మంత్రులతోఁ గూడ తన నగరమునకుం గొనిపోయెను. మృగాంకదత్తుఁడు తనరాకకుం గారణముం దెలిపి, యటఁ గొన్నినాళ్లు కిరాతరాజకృతోపచారము లంగీకరించుచుఁ గడపి, యతనిని వలసినప్పుడు తనకు సాహాయ్యము చేయుటకై సన్నద్ధునిం జేసి, యట నిలిపి, మంచిదినమున మరల తనతో పండ్రెండుగురుగా నుజ్జయినికి తరలెను. దారిలో నొక నిర్జనారణ్యము చొచ్చి పోవుచు నొక చెట్టుక్రింద విభూతి కృష్ణాజిన జటాధరుని ఒక తపస్విని గాంచి, అనుచర సహితుఁడై యతని 'స్వామీ, తమ రిట నేల యీనిర్జ

నారణ్యంబున నొంటరిగా నున్నారు? ’ అని యడిగెను. తాప సుఁడు చెప్పం దొడంగెను:—

### పారావతనాగుఁడు మృగాంకదత్తాదులను శపించుట

‘నేను శుద్ధకీర్తి యను మహాగురుని శిష్యుఁడను, నానా మంత్ర సిద్ధులు గలవాఁడను. అట్టి నే నొకనాఁడు సులక్షణుఁ డయిన యొక క్షత్త్రియ కుమారునికి ఆవేశము రప్పించి యడుగ నతఁడు నానావిధముల సిద్ధౌషధులను రసములను క్షేత్రముల నుం జెప్పి వెండియు నిట్లు వక్కాణించెను. ‘ఇచటి కుత్తరమున వింధ్యారణ్యములో నొంటిది శింశుపావృక్షము కలదు. దాని క్రింద నొకగొప్ప నాగేంద్ర గృహము కలదు. అది తడిదుమ్ము గ్రమ్మిన జలముగా నుండును. మధ్యాహ్న కాలమున మాత్రము క్రీడించుచుండు హంసదంపతులతో సరస్సుగానుండును. అందు బలవంతుఁడు పారావత నామధేయుఁడు నాగేంద్రుఁ డున్నాఁడు. వానికి దేవాసుర సంగ్రామలబ్ధము సాటిలేనిది కత్తి యొకటి కలదు. దానిపేరు వైదూర్యకాంతి. దానిని ఏ నరుఁడు సాధిం చునో అతఁడు సిద్ధులరాజై ఓటమి యెఱుంగక సుఖ ముండును. వీరులు సాయ మున్న యెడల ఆ కత్తి దొరకును. ’ ఇట్లని ఆ కుమారుఁడు ఆవేశమునం జెప్పఁగా నే నతనిని ఆవేశము మాన్పి వదల్చి, అది మొదలు లాఁతిచింత లేక ఆకత్తిని సాధించుటకు సహాయులకై యీ భూమండలం బెల్లం బరిభ్రమించుచు చే కూడక బెంగగొని యిటకు చావ వచ్చితిని.’ ఈ వృత్తాంతము

విని మృగాంకదత్తుఁడు 'నేనును నామంత్రులును నీకు తోడు పడెదము' అనెను.

అంత నా తాపసుఁడు కరము సంతసించి అడుగులకు పసరు పూసి తత్ప్రభావముచే సమృగాంకదత్త తదను చరుఁడై యా నాగభవనము కడకుఁ బోయెను. అనంతరము తాపసుఁడు ఆనవాళ్లంబట్టి దానిం గనిపట్టి రాత్రి మంత్రములచే దిక్కులను బంధించి, అందు మృగాంకదత్తాదులను నిలిపి, మంత్రించిన యావాలతో ఆథూళిం గొట్టి, అందుండి జలము బయలువడు నట్లొనర్చి, నాగదమన మంత్రములతో హోమము చేయ నారంభించెను. అప్పు డుప్పతిల్లిన యకాలమేఘాది విఘ్నములను మంత్రశక్తిచే గెలిచెను. అంతట నా శింశుపావృక్షమునుండి యొక దివ్యాంగన వెలువడినదై రతనంపు రవణంబుల రవళిచే మోహమంత్రము పఠించుచున్నదియుం బోలె వచ్చి క్షణములో తాపసునిమనస్సును క్రేఁగంటిచూపుకొనలతో చిల్లులు పుచ్చెను. ఆచొప్పున ధైర్యము హరించి యామె యతనిని గబ్బిగుబ్బలం గవుంగిలించెను. అంత నతఁడు మంత్రము మఱచి హోమంపుఁ గుండను క్రిందపడ నిచ్చెను. ఆ సందు గని పారావతనాగుఁడు ఇల్లు వెలువడి కల్పాంతమున వర్షించుచున్న మేఘమువోలె గర్జించెను. కంటిమంటలచే వెలిఁగొల్పుచు అట్లు గర్జించుచున్న యా నాగునిఁ గన్నమాత్రాన దివ్యాంగనను గోలుపోయి తాపసుఁడు గుండె బ్రద్దలై మృతినొందెను. అతఁడు చావఁగానే నాగుఁడు

కోపావేశము తగ్గి యతని సహాయులను మృగాంకదత్తాదులను 'మీరు నిష్కారణముగా వీనితోఁజేరి యిట్లు చేసితిరి గాన కొంతకాలము ఒండొరుల నెడఁబాయుదురు.' అని శపించి యదృశ్యుఁడాయెను. తత్క్షణమే శాపప్రభావముచేత కన్నులు చీఁకట్లు కొని చెవులు చెవుడ్వడి మృగాంకదత్తాదులు ఒండొరువులం జీరుచు వెదకుచు ఎటకెటకో పోయి నిలిచిరి. అంతట మృగాంకదత్తుఁడు రాత్రిమాయ ముగియఁగా మంత్రులంబాసి యొంటిగా అడవిలో నిటు నటుం గ్రుమ్మరు చుండెను.

ఇవ్విధమున రెండుమూఁడునెలలు కడచిన తర్వాత ఆకస్మికముగా శ్రుతధి వెదకికొనివచ్చి మృగాంకదత్తుని కలసికొనెను. అట్లు వచ్చి హర్షంపుఁ గన్నీళ్లతోఁ బ్రణమిల్లిన యాశ్రుతధిని గౌరవించి మృగాంకదత్తుఁడు మంత్రులవార్త యేమని అడుగఁగా, 'వారిని నేను గనలేదు, కాని వారందఱు ఉజ్జయినికిం బోవుదు రని తలంచెదను, అది గదా మీఁరందఱుం బోవలసిన చోటు' అని శ్రుతధి యూఱడించి ప్రేరేపించెను. అంత నతనిం గూడి మృగాంకదత్తుఁడు క్రమముగా నుజ్జయినికి పయనము సాగింగెను. కొలఁది దినములు నడచినంతట దారిలో నొక నాఁడు ఆకస్మికముగా విమలబుద్ధి వచ్చి కలసి కొని మృగాంకదత్తుని ఆనందబాష్పపూర్ణలోచనుఁడై ప్రణమిల్లెను. అతఁడును సంతసించి ఆ నిజమంత్రిని గవుంగిలించి కూర్చుండ నియమించి

కడమ మంత్రులవార్త యేమని యడిగెను. ప్రియభృత్యుఁడయిన మృగాంకదత్తునితో విమలబుద్ధి యిట్లని చెప్పెను:—

## విమలబుద్ధి కథ.

దేవా, నాగశాపముచే వారెట కేఁగిరో నే నెఱుంగను. కాని వారు నిన్ను మఱలం గూడుదురని మాత్ర మెఱుంగుదును. ఎట్లెఱింగితినో చెప్పెద వినుము — అట్లు నేను నాగశాపముచే ఎటనో పోయి పడి యడవికి తూర్పుభాగములో తిరిగి తిరిగి యలసి యుంటిని. అంతట సజ్జనుఁ డొకఁడు నన్ను బ్రహ్మదండి యను మహర్షి యాశ్రమమునకుం దోడ్కొని పోయెను.

## సంసారచక్రము.

అట నాఋషి యిడిన పండ్లు భుజించి నీరు గ్రోలి సేద దేరి అటనే యిటు నటుం దిరుగుచు ఆయాశ్రమము చెంతనే యొక మహాగుహం గంటిని. అంతట కౌతుకముచేత లోనికి పోఁగా నచట మణిభవన మొకటి యగపడెను. నేను కిటికీల గుండ చూడ దొరఁకొంటిని. అంత నాభవనములోన నొకచెలువ తేండ్లతోడి చక్ర మొకటి త్రిప్పుచుండెను. పిమ్మట తేండ్లు అట నున్న యొకయెద్దును గాడిదను వెవ్వేఱుగా నాశ్రయించినవి. అంతట ఎద్దు పాలను గాడిద నెత్తురును గ్రక్కినవి. దానిమీఁది తేండ్లు ఆపాలను, దీనిమీఁదివి ఈనెత్తుటిని త్రాగి; అవి తెల్లని వియు ఇవి నల్లనివియు నై, అన్నియు సాలెపురుగులై,వలలు పన్న

సాగినవి. అందుకై తమతమ విష్టలచేత ఇరుదెగల త్రాళ్లు రచించినవి. తెల్లవి తమ త్రాళ్లలో మంచిపువ్వులను, నల్లవి తమ త్రాళ్లలో విషపుష్పంబులను చేసికొన్నవి. అంత నాయాయిపాశములలో నా యా సాలె తేంట్లు సుఖం బుండఁగా, పెనుఁబా మొకటి తెల్లపడగయు నల్లపడగయుం గలది వచ్చి ఆయావన్నె తలతో ఆయావన్నె సాలీని కఱచినది. అంత నాచెలువ వాని నెల్ల వెవ్వేఱుకుండలలో వేసినది. అవి యెల్ల అందుండి బయలు వెడలి వెండియు నా పాశములకే తగులుకొన్నవి. విషపుష్పముల వలలలోనివి విషవేగముచేత నేడువఁ దొడంగినవి. దానిం గని లాఁతివలలలోనివి సయితము ఏడువఁ దొడంగినవి. ఆయేడ్పునకు అట సమాధినిష్ఠుఁడై యున్న యొక ముని ధ్యానభంగ మొంది వీనిం గని కనికరించి నుదుటినుండి నిప్పుమంటలు సారించెను. ఆమంటలకు త్రాళ్లన్నియు కాలిపోఁగా నాసాలె తేంట్లు గొట్టముగా నున్న యొకపగడంపు దండములోఁ దూఱి దానినెత్తిని దేదీప్యమాన మైన వెలుఁగులో నడంగి పోయినవి. చక్రవృషగర్దభములతోఁగూడ ఆస్త్రీ అదృశ్య యాయెను.

### నీటిలో నరణ్యాదర్శనము.

దాని కాశ్చర్యపడుచు నే నచటనే త్రిమ్మరుచుండఁగా నట మనోహర మైన పుష్కరిణి యొకటి యగపడెను. అది పద్మ ముఖముతో తేఁటియులివులతో నన్ను, రావోయి, యని పిలుచుచున్న ట్లుండెను. నేను గట్టునం గూర్చుండి దానిసొంపు

పరికించుచుండఁగా నీటిలో మహారణ్య మొకటి కాన వచ్చెను. ఆయరణ్యములో బోయ యొకఁడు, తాను పెంచిన పదిబాహువుల సింగంపుఁగోదమను తనకు లొంగ దాయె నని కోపగించి యడవినుండి తఱిమివేసెను. ఆసింగము మఱియొక యడవి లోనికి సింహిశబ్దమును విని దానికై యేఁగుచు దారిలో పెనుగాలిచేత బాహువుల నెల్ల కోలుపోయెను. అంతట బొజ్జ కడుపువాఁ డొకఁడు వచ్చి సింహమునకు మరల బాహువుల నన్నిటిని గూర్చెను. అనంతరము సింహము సింహికొఱకు దానియడవికిం బోయి, అట దానికై క్లేశ మనుభవించి, దానిని కైకొని దానిం దోడ్కొని తన మొదటియడవికిం బోయెను. భార్యాసమేత మై వచ్చిన యాయేనుఁగుగొంగం గని బోయ అడవిని దాని కప్పగించి తా నటనుండి వెడలి పోయెను. దీనిని కూడ నేను గని యాశ్రమమునకుం బోయి, ఆ రెండు వింతలను మహర్షికి బ్రహ్మదండికి నివేదించితిని. త్రికాలవేది యామహాముని నెన రూని నాతో నిట్లనియె.— 'వత్సా, నీవు ధన్యుఁడవు, పరమేశ్వరుఁ డనుగ్రహించి నీ కిదియెల్ల గనఁబఱచి నాఁడు. అక్కడ నీ కగపడిన యాస్త్రీ మాయ సుమా, ఆమె త్రిప్పుచున్న యాచక్రము సంసారము, అందలి యాతేంట్లు జంతువులు, ఆ వృషభ గర్దభములు ధర్మాధర్మములు, అవి గ్రక్కిన యాపాలును నెత్తురును పుణ్యపాపములు. వానిని సల్పి యా తేంట్లు తెల్లనివియు నల్లనివియు నై ఇరుదెఱంగుల సాలెపురుపు

లై తమతమ శక్తికొలఁది పుత్త్రకళత్త్రాది రూప మయిన వల
త్రాళ్లను మంచిపువ్వులవంటి సుఖములతోను విష పుష్పముల
వంటి నైన దుఃఖములతోను కూడుకొన్న వానిని చేసికొని తమ
తమచేసిన వానియందు తాము తగుల్కొన్న వై పాపరూపుగల
దైనకాలముచేత శుభాశుభము లనెడు నోళ్లచేత యథాక్రమ
ముగా చంపఁబడినవి. పిమ్మట నవి కుండలరూపున నానాజంతు
జాతులయందు, స్త్రీరూపమైన యామాయచేత వేయఁబడినవై,
అట జన్మించి మరల మునుపటియట్లే తమతమకు సమానము
లయిన తెల్లరూపములను నల్లరూపములను పొంది క్రమముగా
సుఖదుఃఖము లొసంగు జాలపాశరూప పుత్త్రాదులం బడసినవి.
అంతట నల్లనివి తమవలలలో తామే తగులుకొని దుఃఖ మను
విషముచే నో వొంది బెంగ గొని పరమేశ్వరుని శరణుకై మొఱ
పెట్ట సాగినవి. దానిం గని విరక్తి వొడమి తెల్లనివి సయితము
తమవలలలోనుండి తమ్ము కావు మని ఆ పరమేశ్వరునికే మొఱ
పెట్టం దొడంగినవి. అంతట నా తాపసుఁడే పరమేశ్వరుఁడు
మేల్కొని జ్ఞానాగ్నిజ్వాలలచేత ఆ యెల్లజంతువులయు వల
త్రాళ్లను కాల్చివేసెను. అంత నవి పగడంపు గొట్టము ననఁగా
సూర్యమండలమును జొచ్చి దానిపై నున్న పరమపదముం జేరి
నవి. అంతట చక్రమువలె తిరుగుచుండు సంసారముతోను
వృషఖరములుగా నగపడిన యాధర్మాధర్మములతోను ఆ మాయ
మాయ మైనది. ఈతీరున సంసారములో మునింగి పుణ్యపాప

ములచే తెల్లనివియు నల్లనివియునై యుండు జంతువులు తుదకు ఈశ్వరారాధనచేతనే విముక్తిం బొందును జుమా, యని నీకు అజ్ఞానముం దొలఁగించువాఁడై యీశ్వరుఁడు పాటి సూపెను.

బావినీట నీ కగపడిన విశేషమును వివరించెద. అందు ప్రతిబింబరూపమున భగవంతుఁడు నీకు ఇది బోధించినాఁడు. ఆకోదమసింగము మృగాంకదత్తుఁడు. దాని పదిబాహువులును అతనిమంత్రులు మీరు పదుగురును. ఆబోయ అమరదత్తుఁడు. ఆ పదిబాహువులసింగంపుఁగోదమను లోఁగదని వాఁడు వనము నుండి తఱిమివేయుటయే మీతోఁగూడ మృగాంకదత్తుని అభిచారము చేసినాఁడని అమరదత్తుఁడు నిజదేశమునుండి వెడలఁగొట్టుట. వనాంతరమున నున్నసింహియొక్క శబ్దమును వినుటయే అవంతిదేశమున నున్న శశాంకవతియొక్క ఖ్యాతిని వినుట. సింహమటకు పోవుటయే సామాత్యుఁడై మృగాంకదత్తుఁడు ఉజ్జయినికి పయనము సేయుట. మహావాయువుచే సింగము బాహువు లెడలుట పారావతనాగునిశాపముచే మంత్రులను మిమ్ము నెడఁబాయుట. బొజ్జకడుపు మానిసి మరల బాహువుల గూర్చుట బొజ్జకడుపువేల్పు మరల మృగాంకదత్తునితో మంత్రుల మిమ్ముం గూర్చుట. సింహము మృగాంకదత్తుఁడు అటనుండి పోయి బెడిదపుటిడుమలం బడి జయించి మఱియొక తావున అనఁగా ఉజ్జయినిలో ఆసింహిని శశాంకవతిని బడసి తత్సమేతముగా తొంటికానకు స్వదేశమునకు రాఁగా, దానిం

పెంచిన యాబోయ యమరదత్తుఁడు ఆవనమును నిజరాష్ట్రమును సింహామునకు మృగాంకదత్తునికి ఇచ్చి పట్టాభిషేకము చేసి, వనాంతరమును తపోవనము నాశ్రయించును. ఇట్లని యీశ్వరుఁడు నీకు తెల్పినాఁడు. కావున మీద్వార మిమ్ము మరలఁ గలసికొని భార్యను నిజరాజ్యమును పొందఁగలఁడు.

ఇట్లు మహాముని చెప్పఁగా, నేను దిగులు తీఱి, సంతసపడి అటనుండి వెడలి నిన్ను వెదకికొని వచ్చుచు, ఇట గలసికొంటిని. కాన పయనంపుఁ దఱిని నీవు గొలిచిన విఘ్నేశ్వరస్వామికృపచే తప్పకుండ నీవు ప్రచండశక్తిప్రముఖ మంత్రులను మరలఁ గలిసికొని నీయభీష్టము సాధింతువు.

ఇవ్విధమున విమలబుద్ధి పలుక మృగాంకదత్తుఁడు ప్రీతుడయ్యును కడమమంత్రు లగపడమికి చింతిల్లుచు వారికొఱకును శశాంకవతికొఱకును ఉజ్జయినికి పయనము సాగించెను.

---

## ౪-వ తరంగము.

---

### మాయావటువుతో చెలిమి.

పిమ్మట శ్రుతధి విమలబుద్ధిసమేతుఁడై మృగాంకదత్తుఁడు శశాంకవతికొఱకు ఉజ్జయిని కేఁగుచు నడుమ నర్మదానదిం జేరెను. ఉప్పొంగు నలలచేతను పర్వుచున్న నుర్వుచేతను నది 'ఆహా! ఇతని నమాత్యులు వచ్చి కలయుదురు, ఇతఁడును నా

కడకు వచ్చినాఁడు!' అను సంతోషమున నృత్యములు సేయుచు నవ్వుచు నున్నదో యన నింపారుచు చపలాశయమై యుండెను. అం దతఁడు స్నానమునకు దిగఁగా నచటికి మాయావటు వను పేరి బోయరాజును స్నానమునకు వచ్చెను. బోయఁడు స్నానము చేయుచుండఁగా తటాలున ముప్వురు నీటిమానిసులు ఒక్కటం బట్టుకొనిరి. అతని పరిజనులు కని వెఱచి పలాయితులైరి. అంత మృగాంకదత్తుఁడు ఆనీటి మనుష్యులను కత్తితో నఱికి బోయను కాచెను. నీటినుండి మృత్యువునుండియు వెడలి బోయరాజు మృగాంకదత్తునిపాదముల వ్రాలి 'మహాత్మా, ఎవరవు నీవు? నిన్ను బ్రహ్మ నాప్రాణములు గావ నిటకు తెచ్చి నాఁడు. ఏవంశమునకు నీ వలంకారమవు ? నీ వెటకు పోవు చున్నావో పుణ్యములచే కటాక్షితమైన యాదేశ మేది?' అని యడిగి, శ్రుతధివలన వృత్తాంతమెల్ల నెఱిఁగి, వెండియు మృగాంకదత్తుని పాదములకుం బ్రణమిల్లి 'అట్లేని నీవుగోరిన యీ కార్యమందు నన్నును నాచెలికాని మాతంగపతిని దుర్గపిశాచనామునిం గూడ సహాయులనుగా ననుగ్రహింపవలయును.' అని వేఁడుకొనెను. మృగాంకదత్తుఁ డంగీకరించెను. అంతట మాయావటువు మృగాంకదత్తుని భక్తి పూర్వకముగా తన పల్లెకుఁ గొనిపోయి తన శక్తికొలఁది రాజోపచారములు సేసి పూజించెను. పల్లిజనులెల్ల నట్లే మృగాంకదత్తునిం బూజించిరి. ఆ మాతంగరాజు కూడ వచ్చి మిత్త్రప్రాణదాత యని మృగాంక

దత్తునికి దాసుఁడై ప్రణమిల్లి కొలువ నారంభించెను. అనంతరము బోయ చేసిన వేడికోలున మృగాంకదత్తుఁడు అచటనే కొన్ని దినములు నిలిచెను.

### చండకేతుని కథ.

ఇట్లుండ నొకనాఁడు మృగాంకదత్తుని మ్రోల మాయావటువు చండకేతు వను తన ప్రతీహారునితో జూదమాడఁ గడంగెను. ఆసమయమున మింట మొయిళులు ఉఱుమఁగా పెంపుడు నెమళులు నటన మారంభింపఁగా మాయావటువు చూడం గౌతుకపడి యాట నిలిపెను. అంతట ద్యూతక్రీడారసజ్ఞుఁడు ఆ ప్రతీహారుఁడు 'ఈనెమళ్ల యాటం గన్న నేమి కుతుకము తీఱును? ఇవి యాటలో శిక్షితములు గావు. నాయింట నున్నది యొక నెమలి, దానికి ఆటలో సాటి యీ భూమండలములో లేదు. మీకు కుతూహలము గలదేని దానిని రేపు తెచ్చి మీయెదుట నాడించెదను.' అనెను. 'అట్లయిన రేపు తప్పక దానిని నాకుం జూపవలసినది' అని పలికి మాయావటువు దినకృత్యశేషము నిర్వర్తించెను. మృగాంకదత్తుఁడును తన యనుచరులతో నా ముదలను విని తానును స్నానాహారాదికృత్యములు నిర్వర్తించెను. తరువాత రాత్రి కాఁగా, కటికిచీఁకటి లోక మెల్లం బొదువు కొనఁగా, అనుచరులు నిద్రం గూర్కుచుండ, మృగాంకదత్తుఁడు మేనం గస్తూరి పూసికొని నల్లవలువలు దాల్చి వీరచర్యా వినోదార్థము ఒంటరిగా ఖడ్గపాణియై బసవెలువడి పోవుచుం

డెను. దారిలో చీఁకటి వసమున నెవనిదో మఱియొక పురుషుని బుజము ఇతని బుజమునకుం దగిలెను. ఆ త్రోపునకుం గినిసి మృగాంకదత్తుఁడు వానిని తనతోఁ బోరాటమునకు రమ్మనెను. ఆపురుషుఁడు ప్రౌఢ సమయోచితముగా నిట్లు మాదలించెను. 'ఏమి ! ఆలోచింపకయే కోపించెదవు. కొంచె మాలోచింతు వేని ఈతప్పు ఈరాత్రిని ఇంకను వెలింగింప కున్న చంద్రునిది ; కాదేని, చంద్రునికి రేయెల్ల వెలుంగ నధికారము నొసంగని బ్రహ్మదేవునిది. వారివలనం గదా ఇట్టి చీఁకటిలో నిష్కారణ ముగా వైరము లిట్లుప్పతిల్లును.' మృగాంకదత్తుఁడు విని 'ఔను, నీచెప్పినది సరియే.' యని యొప్పుకొని యతని నాగరకభాషణ మునకు సంతుష్టుఁడై అతనిని నీ వెవ్వఁడ వని యడిగెను. దొంగ నని యతఁడు పలుకఁగా, మృగాంకదత్తుఁడు 'అట్లేని నీచేయి దెమ్ము, నాకు నీవు సబ్రహ్మచారివి.' అని అతనితో చెలికారము గావించి, జిజ్ఞాసచే నతనితోఁగూడనే పోవుచుండెను.

ఇరువురును గడ్డి మూసికొన్న యొకపాడునూతికి వచ్చిరి. అందుదిగి సొరంగముదాఁటిని ఆ పురుషునివెంబడి పోయి మృగాం కదత్తుఁడు మాయావటువు నంతఃపురము చేరెను. అట మృగాంక దత్తుఁడు దీపపు వెలుఁగునం జూడఁగా ఆపురుషుఁడు ప్రతీహారి చండకేతువుగాని దొంగ కాఁడాయెను. రాజభార్యాప్రచ్ఛన్న కాముకుఁడా ప్రతీహారి వెలుతురు చాలనిమూల మాఱువేష మున నడఁగియున్న మృగాంకదత్తుని ఆనవాలుపట్టఁ డాయెను;

అంత రాజభార్య మంజుమతి యనునది వీనికై నిముసము లెన్ను చుండినది, వీనిం గనఁగానే లేచి కంఠముం గవుంగిలించు కొని, తన మంచముపైఁ గూర్చుండఁ బెట్టుకొన్నదై 'ఇపుడు నీవు వెంటం దెచ్చిన పురుషుఁ డెవరు?' అని యడిగెను. 'భయ పడకు, అతఁడు నాచెలికాఁడు.' అని చండకేతువు చెప్పఁగా మంజుమతి వెలమిాటి 'చెలువుఁడా, ఈమందభాగ్యురాలికి దిగు లెప్పటికి తీఱును ? ఇప్పుడే గదా ఈరాజు మృత్యువువాతం బడియు మృగాంకదత్తునిచేత మరల బ్రతికి వచ్చినాఁడు!' అనెను. 'చెలీ, వగవకుము. త్వరలో రాజును మృగాంకదత్తుని ఇరువు రను నేను బరిమార్చెద.' అని ప్రతీహారుఁడు బదులు పల్కెను. అందులకు బదులుగా మరల నామె దైవచోదితయై యిట్లనియె: 'ఏల ప్రజ్ఞలు నటించెదవు, నర్మదనీట రాజును మొసళ్లు పట్టు కొన్నప్పుడు మృగాంకదత్తుఁ డొక్కఁడే గదా అతనిని రక్షింప వచ్చెను, అప్పుడే నీవు వారి నేల చంపవైతివి, భయపడిగదా నీవు పలాయితుఁడవై వచ్చితివి. కాన ఊరకుండుము. ఈ మాట నెవ్వరేనియు వినఁదురు, అంతట శూరుఁ డగు నామృగాం కదత్తునివలన నీకు కీడు గలిగెడును.' ఆమె యిట్లు పలుకఁగా ఆ విటుఁడు ప్రతీహారుఁడు ఓర్వక 'ఓసి పాపాత్మురాలా, నీవు నిశ్చయముగా మృగాంకదత్తుని పై మనసు పెట్టియున్నావు, కాన ఈ కేరడమునకు ఫల మిప్పుడే యనుభవింపుము.' అని లేచి కత్తితో నామెను నఱుక నుంకించెను. అంతట నట

రహస్యరక్షణార్థము కావలియున్న చేటి పరువున వచ్చి వాని చేతినుండి చురకత్తిని తటాలున ఒడసిపట్టి లాగివేసెను. మంజుమతియు అటనుండక యవలికి పోయెను. ప్రతీహారుఁడు చేటికి చేతివ్రేళులు తెగ కత్తి లాగుకొని వచ్చినదారినే, ఈవృత్తాంతమున కాశ్చర్యమగ్నుఁడైన మృగాంకదత్తుఁడును వెంటరా, నింటికి పోయెను.

'నీ వింటికి వచ్చితివి, ఇఁక నేను పోయెదను.' అని యచట మృగాంకదత్తుఁడు చీఁకటిలోఁ దన్నుఁ దెలియనీయక పలుక, 'అట్లుగాదు నీవును కడు నలసియున్నావు, ఇటనే నిద్రించి సేదదేరి పొమ్ము.' అనెను. మృగాంకదత్తుఁడును వానివృత్తమును ఇంకనుం గన నపేక్షించి యట్లే యంగీకరించెను. అంతం బ్రతీహారుఁడు తనబంటు నొకనిం బిలిచి మృగాంకదత్తునికి తన యాక్రీడామయూర మున్నయింట శయన మమర్పుమని యాజ్ఞాపించెను. అట్లే వాఁడు నమర్చి ఆ యింట దీప ముంచి తాను వెలువడి బయటి ద్వారమునకు తలుపు మూసి గొళ్లెము వేసి పోయెను. అట మృగాంకదత్తుఁడు పంజరమున నానెమలిని గని, ప్రస్తావించిన నెమలి యదియకాఁ దలంచి, కుతూహలముచే పంజరము తెఱచెను. నెమలి బయటికి వచ్చి యతనిని చక్కఁగం బరికించి కన్నీళ్లు నించి యతని పాదముల దొరలసాగెను. అట్లు త్రెళ్లిన దాని మెడను త్రాడొకటి బిగువుగా కట్టియుండఁగా గని మృగాంకదత్తుఁడు దాని నొప్పిచే నది యేడ్చుచున్న

దని యెంచి దానిని విప్పివేసెను. తత్క్షణమే యానెమలి యతని మంత్రి భీమపరాక్రముఁడై అత్యుత్సుకతతో నతని యడుగులకు మ్రొక్కెను. మృగాంకదత్తుఁడు ఆశ్చర్యపడి యతనిని కవుంగిలించి, 'మిత్రమా, ఏమి యిది? వివరింపుము.' అని యడుగఁగా, సంతసంబున భీమపరాక్రముఁ డిట్లు చెప్పసాగెను.

## భీమపరాక్రముని కథ.

దేవా, నావృత్తాంతము నామూలముగా వచించెద వినుము. ఆపుడు నేను నాగశాపముచే నిన్నెడఁబాసి చెదరి పోయి యడవిలో ద్రిమ్మరుచు నొకబూరుగుఁజెట్టును సమీపించితిని. దాన గణేశప్రతిమ యొకటి చెక్కఁబడి యుండెను. నేను దానిం గని నమస్కరించి బడలికచే చెట్టుక్రిందం గూర్చుంటిని. 'అయ్యో! ఈచెట్ట యెల్ల పాపాత్ముఁడనైన నావలనం గలిగినది, నే నేల యపుడు ఏలికకు రాత్రిబేతాళవృత్తాంతమును నివేదించితిని! కావున ద్రోహిని నే నిటనే మృతిం జెందెద.' అని నిశ్చయించుకొని, నేను ఆదేవునిసన్నిధిని నిరాహారుండనై యుంటిని. ఒక కొన్నిదినము లయినంత నా దారిని ముదుసలి తెరువరి యొకఁడు వచ్చి ఆచెట్టునీడనే కూర్చుండెను. అతఁడు నన్నుఁ గని 'వత్సా, నీవు ఇట్లు మోము వాడి యేల యీ నిర్మానుష్యప్రదేశమున నున్నాఁడవు?' అని సస్నేహముగా నడుగఁగా నావృత్తాంత మంతయుం దెల్పితిని. అంత నతఁడు నాకు ధైర్యము చెప్పుచు ని ట్లనియె:— వత్సా, వీరుఁడ వయ్యును

స్త్రీవలె ఏమి యి ట్లాత్మహత్యకుం దొడంగితివి ? స్త్రీలు సయితము ఆపత్కాలమందు తేఁకువను వదలరు గదా. అందు లకు నిదర్శనము చెప్పెద వినుము.

## హంసావళీ కమలాకరుల కథ.

కోసల యను నగరంబున విమలాకరుఁ డని రా జుండెను. అతనికి కమలాకరుఁ డని కుమారుఁ డుండెను. ఆ కుమారుఁడు స్కంద కందర్ప తల్పద్రుమముల గెలుచుటకై బ్రహ్మసృజించెనో యన తేజో రూప దానములయందు వారిని మించి యుండెను. దిగంతములయందు వందులచే పొగడ్త లొందిన యారాజకు మారుని మ్రోల నొకనాఁడు ఒకబట్టు పూర్వపరిచితుఁడు మనో రథసిద్ధుఁ డను వాఁడు అప్పుడప్పుడు ఈగాథం బాడుచుండెను.

క. కమలాసాదనసోత్సవ
సమధికరవణద్విజాళిసంగీతయుతన్
గమలాకరరతిఁ బొందక
రమణన్ హంసావళిక ధరన్ మనఁ గలదే ?

ఇ ట్లాబట్టు పల్మారు పాడఁగా నొకపరి కమలాకరుఁ డిది యే మని యడుగ బట్టు ఇట్లు వివరింపం దొడంగెను:—

దేవా, దేశములు దిమ్మరుచు నొకప్పుడు నేను సిరికి ఆటతోఁట యగు విదిశానగరమునకుఁ బోయితిని. అందు మేఘమాలి యనురాజు ఏలుచున్నాఁడు. నే నచట దర్దురకుఁ డను భరతాచార్యునియింట నుంటిని, ఒకనాఁ డతఁడు మాట

వరుసను నాతో 'ఱేపు పూర్వాహ్ణంబున రాజునోలగంబునందు తత్పుత్రిక హంసావళి క్రొత్తగా నేర్చినన్నృత్తమును ప్రదర్శించును.' అని చెప్పెను. అంతట నేను కుతూహలము వొడమి యతనిని వేఁడగా, నతఁడు మఱునాఁడు ఉపాయముచేసి నన్నుఁ గొనిపోయి యారంగమండపమునం గూర్చుండఁబెట్టెను. అట వాద్యములు మ్రోఁగఁగానే యాతలోదరి హంసావళి రంగము సొచ్చి తంత్రి మ్రోల నర్తన మారంభించెను. అల్లలనాడు పూఁదొడవులతోను కదలికలం బొదలు కైచివుళ్లతోను రాజకన్యక ప్రాయంపుఁ దెమ్మరకు ఊఁగిసలాడు వలరాచవల్లి తొయన విరాజిల్లుచుండెను. అంతట నేను 'ఈహరిణాక్షికి కిమలాకరకుమారుఁడు దప్ప తగినభర్త వే ఱొకఁడు లేఁడు. అట్టి యాతనితో నిట్టి యీమెను గూర్పఁడేని వలరాజు పూలవింటి నెక్కువెట్టుట కేవల దురాగ్రహంబ యగును. కాన అందుకై నేను తగినయుపాయ మొనర్చెదం గాక.' యని తలపోసి యాట ముగియఁగానే రాజద్వారమునం జేరి 'నాతో సరిగా ఎవఁడేని చిత్రకరుఁడు చిత్తరువు వ్రాయఁగలఁడేని వ్రాయుఁగాక.' అని యొక వస్త్రఖండమున వ్రాసి దాని నట వ్రేలఁ గట్టితిని. దాని నొరు లెవ్వరును చింప రైరి.

అది విని రాజు నన్ను తనకొమరితయింట చిత్తరువులు వ్రాయ నియోగించెను. నేను హంసావళిపడుకటింట సపరివారుని నిన్ను వ్రాసితిని. 'ఈమెతో స్పష్టముగా చెప్పుదునేని ఈమె

నన్ను మోసగానిఁగాఁ దలంచును కావున నీరాజకన్యకు ఈ విషయమును యుక్తిగా బోధపఱిచెదఁ గాక.' అని యాలోచించి నాకు నమ్మక మయిన మిత్త్రు నొకనిం గలయఁ బలికికొని వింత యైన వెఱ్ఱివేసము వానికి వేసితిని. వాఁడు వెఱ్ఱివాఁడుగా తిరుగుచు దూరాన నగపడఁగా క్రీడార్థము వానిని రాజకుమారులు తమకడకు రప్పించిరి. తరువాత వేడుకకై హంసావళియు వానిని తనలోఁగిటికి రప్పింపఁగా వాఁ డట నీప్రతిమం గాంచి 'ఆహా! యితఁడే గదా ఆకమలాకరుఁడు, హరివోలె పద్మశంఖాంకితహస్తుఁడు లక్ష్మీవిలాసాస్పదుఁడు అనంతగుణాకరుఁడు!' అని ఇట్టిపలుకుల నిసుం బొగడుచు ఆనందతాండవము సలుపుచుండెను. రాజకన్యయు ఆ పొగడ్త విని నన్నుం గని 'ఏమి వీఁడు పల్కునది? ఎవరి నిట నీవు వ్రాసితివి?' అని అడిగెను. ఆమె నిర్బంధపెట్టఁగా నేను 'ఓసుందరాంగీ, ఈపురుషుని నిశ్చయముగా నీవెఱ్ఱివాఁ డెప్పుడో చూచియున్నాఁడు. ఈయన యొకరాజపుత్త్రుఁడు. నేను చక్కఁదనముపై గారవంబున నిట వ్రాసితిని.' అని చెప్పి నీనామగుణములను వర్ణించితిని. అంతట పొదుపు చున్న నీమీఁదివలపునెడు వానకుం దడిసిన యా హంసావళియెదలో వలరాచవృక్షము అపూర్వము మొలచెను. ఆయదన నచటికి ఆమెతండ్రి మహారాజు వచ్చి, వెఱ్ఱియాటలాడుచున్న మన్మిత్త్రుని నన్నునుం గాంచి కోపగించి, మమ్ము అటనుండి తఱిమించెను. అది మొదలు ఆమె నీకై యుత్కం

తితురా లై నల్ల తెక్క నెలవోలె దినదినము సన్నగిల్లి జగ మె ఱుంగుమాత్రము మిగిలియున్నదై అగ్నిమాంద్య మని నెపము వెట్టి పాపహర మగు హరిమందిరమున నొంటరిగా విజనంబున నుండ తండ్రివలన సెలవొంది నిన్నే తలపోయుచు నిదుర గానక జాబిల్లికిని రేయెండకును ఓర్వక, రే యిది, పవ లిది, యని భేదం బెఱుంగక యుండినది. నేను ఆదేవళముపై నెక్కి యామెకడకుం బోయి యగపడఁగా నన్ను చేరఁ బిలిచి తొడవులు వలువలు నొసంగి సత్కరించినది. ఆమన్నన వడసి నేను వెలువడి అం దొక వలువమీఁద నీకై యామె వ్రాసిన యొక గాథను గంటిని. అదియే యిందాఁక నేను పాడినది. మఱలఁ బాడెద వినుము.

క. కమలాసాదనసోత్సవ
సమధికరవణద్విజాళిసంగీతయుతక్
గమలాకరరతిఁ బొందక
రమణక్ హంసావళిక ధరక్ మనఁ గలదే.

దీనిని నేను చదువుకొని ఆమెమనోనిశ్చయమున కలరి నీకుఁ దెలుప నీకడం బలుమాఱు పాడితిని. ఈగాథ వ్రాసిన వలువ యిదే చూడుము:—

ఇట్లు బట్టు పలుకఁగా విని, వలువపై నాగాథను కని, ఆచెవినో ఈకంటనో హృదయంబు సొచ్చిన యాహంసావళిని ధ్యానించుచు, కమలాకరుఁడు హర్షంబున నుప్పొంగి, ఆమెను బడయ నుపాయ మరయుచుండెను. ఆసమయంబుననే దైవాను

కాలవ్యముచేత విమలాకరుఁడు పుత్త్రుని కమలాకరుని పిలువ నంపి యిట్లు బోధించెను. 'పుత్త్రా, సోమరు లయిన రాజులు మంత్రమునం గట్టువడిన పాములువోలె చేటుం బొందుదురు. సోమరులు కానివారు చేటునం బడినను మరల నభ్యుదయము పొందుదురు. లోకయాత్ర యిట్లుండ నీవేమి యిప్పటికిని సుఖైక పరాయణుఁడ వై జిగీష చూప కున్నావు? ఇది తగదు. నేను ఉండఁగానే అలసత మాని పురుషకారమునకుం గడంగుము. ముందుగా నీవు, మనమీఁదికి వచ్చుచున్నాఁడే స్వదేశము విడిచి మన శత్త్రువు అంగరాజు, అతని నోర్వుము.' ఇట్లు తండ్రి యాదలింప, శూరుఁడు కమలాకరుఁడు తద్దయు హర్షించి, ఆ శత్త్రువుంగూర్చియు ప్రేయసింగూర్చియు తరల సమకట్టెను. అనంతరము తనతో తండ్రి తరలించిన దండుతో వెడలి, పుడమి గ్రక్కదల వైరుల యుల్లంబులు తల్లడిల్ల నడచి, కొలఁదిపయన ములకే అంగరాజుదండును దఱిసి యీయెదురుదాడికి విఱిగిన యతనితో పోరి యతనియాదళమును అగస్త్యుఁడు సముద్ర జలంబునుం బోలె త్రాగి, ఆతనిని ప్రాణముతో పట్టుకొని కట్టి సమర్థుఁ డయిన ప్రతీహారునివశమున కావలిగుమితోడ తండ్రికడకుం బంపెను. ప్రతీహారునిచేతనే తండ్రికి 'నాయనా, నే నింక లాఁతిపగతురం గూలిచి వచ్చెదను.' అని వార్త పంపెను.

అటు తరువాత వరుసగా కడమ రాజులను జయించుచు బల మధికము గూడఁగా విదిశానగర సమీపమునకుం బోయి యట విడిసి తనకై కౌమారితను వేఁడ మేఘమాలికడకు దూతం బంపెను. మేఘమాలియు దూతముఖమున నితఁడు సజ్జనుఁ డనియు కన్యార్థము వచ్చినాఁ డనియు గ్రహించి, కడు సంతసించి, యితనితావునకు వచ్చి యతిథిసత్కారము కావించి, ఇతనితో గారవము మీఱ ని ట్లనియె. "దూత సేయఁదగిన పనికి ఏల స్వయముగా ఇంత శ్రమ పుచ్చుకొంటివి? నీవు కోరిన యీ యర్థము నేను కోరినదే. అందులకారణము వినుము. లేఁబ్రా యము మొదలు హరిపూజాపరాయణను ఈహంసావళిని దిరి సెనపూవుంబోని కోమలాంగిని గని, ఇట్టి యీగుణములు గల యీ కన్యకు తగిన వరుఁ డెవఁడో యని తలపోసి తలపోసి, ఎవనిం గానక, నేను వగగూరి నిద్రపట్టక యుండ, దాననే నాకు మహాజ్వరముకలిగెను. తచ్ఛాంతికొఱకు నేను హరిని పూజించి దీనతతో విన్నవించుకొని రాత్రి ఒకింత కూర్కఁగా హరి కలలో నగపడి యి ట్లనుగ్రహించెను. 'వత్సా, ఎవతకై నీ కీజ్వరము కలిగినదో ఆహంసావళియే చేతితో నిన్నుఁ దాఁకినమాత్రాన నీ జ్వరము శాంతించును. నాపూజచే పావన మయిన చేతితో ఈమె ఎవరినిఁ దాఁకునో వారికి ఎట్టి యసాధ్య జ్వరమైనను శమము నొందును. ఈమె వివాహమునకై నీ కేమియు చింత వలదు. ఈమెకు రాజకుమారుఁడు కమలాకరుఁడు పతి కాఁ

గలఁడు. కొంతకాలము ఈమెకు కొంచెము క్లేశము కలుగును.' ఇట్లు కటాక్షింపగా నేను వేకువను మేల్కొని హంసావళీకర స్పర్శచే శాంతజ్వరుఁడ నైతిని. ఇట్లు మీసంయోగము దేవునిచే నిర్మితము. కాన నీకు హంసావళి నిచ్చితిని." ఇట్లు వాక్రుచ్చి మేఘమాలి అపుడే శుభలగ్నము నిర్ణయించి రాజధాని కేఁగెను.

## కనకమంజరి చేసినవంచన.

తంత్రి చేసిన యా నిశ్చయమును హంసావళి విని కనక మంజరి యనుసఖితో రహస్యజ్ఞతో ని ట్లనియె:—'సఖి, నీవు పోయి కని రమ్ము, ఈరాజపుత్త్రుఁడు ఆముచ్చి వ్రాసిన చిత్త రువున నగపడి నాహృదయమును చోరించినవాఁడో అన్యుఁ డో? నాయన ఒకవేళ అన్యుఁ డెవఁడేని ఆయనపేరివాఁడు ప్ర బలుఁడు వచ్చినచో వానికి తెలిచి నన్ను ఉపాయన మిచ్చినను ఇచ్చును.' ఇట్లు హంసావళి స్వయముగా పంపఁగా కనక మంజరి వెంటనే అక్షసూత్రము అజినము జడలును దాల్చి, తాపసివేస మూని కమలాకరుని విడిదికిం బోయి పరిజనులచే తెలిపించికొనినదై ప్రవేశించి, యాతనిని, వలతేని లోకవిజయ శీల మోహనాస్త్రము నేలెడి వేల్పుం బోలె విరాజిల్లుచున్న వానిం గని, అతనిరూపు తనయెదను మ్రుచ్చిలఁగా, ఆ క్షణమందు సమాధిప్రవిష్టవలె నై 'ఆహా! ఇట్టి వీనిపొందును పొందనేని, ఇసీ! ఈ జన్మ మేల, కాన ఈవిషయంబున నాహిత మొనర్చి

కొనియెదను, తర్వాత నే మయిన నగుం గాక.' అని బాలి మెయిం దలపోసి, రాజకుమారుని చెంగటి కరిగి, మణి యొకటి కానుక పెట్టెను. అతఁడు కానుకరత్నముం బుచ్చుకొని యాదరింపఁగా కనకమంజరి కూర్చుండి యిట్లు పలికెను. 'రాజకుమారా, ఈమణిప్రభావమును నేను పలుమాఱు కనియున్నాను. దీనిని ధరించినయెడల శత్రువుచేతి మేలికత్తి స్తంభన మొందును. గుణానురాగముచే దీనిని నేను నీ కిచ్చితిని, దీనివలన నీకు ఉపయోగము కలదు, నా కేమియుఁ బ్రయోజనము లేదు. అతఁడు సంతసించి భిక్షకు నిలు మని వేఁడఁగా, కనకమంజరి, 'ఒక్కభిక్ష కెక్కువ చేయ.' నని మిష పెట్టి వెడలిపోయెను.

అనంతరము తాపసీవేషము విడిచి, వదనంబున దీనత దోఁప హంసావళికడకుం బోయి, యడిగించికొని యిట్లు బొంకెను:—"సఖి, చెప్పరాని దైనను రాజరహస్యమును నీమీఁది భక్తిచే చెప్పెదను వినుము. ఇట నుండి నేను తాపసీవేషమున ఆరాజకుమారునికడకు పోయి యుండఁగా నొకపురుషుఁడు నాకడకు అల్లన వచ్చి 'అమ్మా, భూతచికిత్స యెఱుఁగుదువా ?' అని యడిగెను. అంతట అతఁడు ప్రతీహారుఁ డని నేను ఊహించి 'ఆహా ! చక్కఁగా నెఱుంగుదును, నాపనియే యది గదా.' అంటిని. అంత నతఁడు నన్ను వెంటఁ గొనిపోయి కమలాకరునికడం జేర్చెను. అట నతని యవస్థం గన నాకు జాలి యయ్యెను. అతనికి దయ్యము సోఁకియుండెను. అనుచరు లతనికి

ఓషధులను భవ్యమణులను కట్టి బలాత్కారమున త్రాళ్లతో బంధించు చుండిరి. నేను కల్లరక్ష యొకటి కట్టి 'రేపు వచ్చి యతనిదోషముం దీర్చెద.' నని చెప్పి తత్క్షణమే అట నుండి వెలువడి వచ్చితిని. ఇట్టి యీయనిష్టమును అశంకిత నై కని నీకు చెప్పవచ్చితిని, ఇటుపయి నీచిత్తము." పిడుగుపాటువంటి యీకపటవచనము విని సరళహృదయ హంసావళి తత్క్షణము సొమ్మసిల్లి తేరి యిట్లనియె:— 'అయ్యో! బ్రహ్మదేవునికి ఉత్తమమైన తనసృష్టియందే ద్వేషము! కానిచో చంద్రునికి గళంకమును, ఈపురుషునికి ఈదోషమును ఏల చేసెను? ఇతనిని నేను భర్తనుగా వరించితిని, చూడం గూడ నళక్యుఁడుగా నున్నాఁడు? కాన నాకు మరణమో కానయో శరణము. కాన నిపుడు ఏమి సేయఁదగునో చెప్పుము.' ఇట్లు ముగ్ధయై యామె పల్కఁగా మాయావిని కనకమంజరి 'సఖి, నీవేషమున నొక చేటికకు ఇతనితో వివాహము కావించి అసమయమున నంద ఱును పెండిలితొందరలో నుండఁగా మనము ఎట కేనియుం బలాయనము సేయుదము.' అని యుపాయము చెప్పెను.

అంతట రాజపుత్త్రి 'చెలీ, అట్లని నీవే నావేసమున ఆరాజసుతునితో వివాహము గావింపుము. నీవంటి యాప్తురాలు నాకు మఱెవతె యున్నది?' అని యాచెడుసఖిని వేఁడెను. అంత పాపాత్మురాలు కనకమంజరి 'మంచిది, దిగులు పడకు, యుక్తిగా అట్లేచేసెదను. అప్పుడు నే నేమి చెప్పుదునో

నీవది యట్లే చేయుము, అని యామె నూఱడించి, పోయి, తనకు విశ్వాసపాత్రమైన చెలికి అశోకకరికి తనరహస్యమును కోరికను సర్వమును తెలిపెను. దానితోఁ గూడుకొనియే ఆ దినము తాను హంసావళిని కొలుచుచుండెను. చేయవలసిన విధానము హంసావళికి చక్కఁగఁ గఱపి బెంగఁబాపెను. వివాహదినము ప్రాప్తింపఁగా పెండ్లికొమరుఁడు కమలాకరుఁడు చతురంగబల సమేతుఁడై సాయంకాలమున రాఁగా, ఎల్లవారును ఉత్సవసంభ్రమంబున మునింగి యుండ, యుక్తిగా కడమ చేటికలను ఎడయించి, అలంకరించుట కని మిష పెట్టి, హంసావళిని గుప్తముగా పడుకటింటికిం గొనిపోయి, అచట తాను హంసావళీ వేషము దాల్చి, హంసావళికి అశోకకరి వేషము వేసి, అశోకకరికి తనవేషము వేసి, రాత్రివేళ లగ్నసమయము కాఁగా హంసావళితో 'చెలీ, నీవు పడమటిద్వారమున పురము వెలువడి బయట కోసుదూరమున తోఁటలోఁడి బూరుగుమ్రాను కలదే అట కేఁగి యారంధ్రంబున దాఁగి పన్నెదురు సూచుచుండుము. ఇక్కడిపని కానిచ్చి నేను తప్పక నట నిన్నుఁ గలసికొనియెదను.' అని బోధించెను. హంసావళియు ఆ వంచకురాలిమాట పాటిసేసి ఆసఖివేషంబున అంతిపురి వెలువడి, పెండ్లికొడుకువారితో నిండియున్న యా పురద్వారమున నెవ్వరికిం దెలియక యేఁగి, యా బూరుగుమ్రానికడం జేరి, చిమ్మచీఁకటి క్రమ్మిన యాతోఁటంగని, వెఱఁగొని, అందుంజొరక, దానిచెంగట

నొకమఱ్ఱి నెక్కి, యాకులజీబులో దాఁగి ఆ కుసుఖని కనక మంజరి నెదురు సూచుచుండెను. ఇంతియ గాని సరళహృదయ దాని కపటకృత్యము గ్రహింప దాయెను. ఇంతలో రాచనగర లగ్నకాలము రాఁగా, హంసావళీవేషమున నున్న యా కనక మంజరిం గొనివచ్చి పెండ్లియరఁగున రాజు కూర్చుండఁబెట్టఁగా. మేలుముసుంగుచేత రాత్రి వేళ ఎవరికిం దెలియరాక యున్న యాతన్వంగిని కమలాకరుఁడు వివాహ మాయెను.

అప్పుడే తనతావునకుం బోవ శుభనక్షత్రముగా నున్నం దున, నతఁడు అపుడే మాయాహంసావళిని మాయాకనకమంజరీ సమేతను తోడ్కొని ఊరి పడమటిద్వారమున తరలి పోవుచు పూర్వోక్తమయిన యాబూరుగుమ్రాని చెంగట నేఁగుచుండెను. ఆతావుం దఱియఁగానే అతనితోఁగూడ నేనుఁగుపై నున్న కనక మంజరి ఆకస్మికముగా వెఱచఱచినదియుంబోలె కమలాకరుం గవుంగలించినదై యతఁ డులికిపడి యడుగఁగా కపటంబున కంటి తడితో ననియె: "ఆర్యపుత్ర, నాకలలో ఈబూరుగుమ్రానినుండి రక్కసి ఒకతె వెలువడి వచ్చి నన్ను భక్షింపఁ బట్టుకొన్నది. ఒక బ్రాహ్మణుఁడు దానిని తఱిమి నన్ను కాచినాఁడు. అతఁడే నన్ను ఓదార్చి 'పిల్లా, ఈచెట్టును కాల్పించి వేయుము, ఇందు నుండి యపుడు ఈస్త్రీ వెలువడునేని దానిని మరల ఆమంటలోనే వేయింపుము, అట్లొనర్చిన నేమ ముగును.' అని చెప్పి మాయ మాయెను. అంత నాకు మెలఁకువ వచ్చినది. ఈచెట్టును గనఁ

గానే ఆవృత్తాంతముజ్ఞప్తిగొని భయపడితిని.” ఆమాట విని కమలాకరుఁడు ఆశాల్మలిని కాల్చివేయుఁడని యనుచరుల కాజ్ఞ యిడెను. వారును తత్క్షణమే దానిం దగులఁ బెట్టిరి. అందునుండి వెడలనందున సత్యహంసావళి అందు కాలిపోయె నని వ్యాజహంసావళి తలంచి స్వస్థ చిత్తురాలాయెను. దానిం దోడ్కొని సత్యహంసావళియే తనకు లభించిన దని సంతసించి కమలాకరుఁడు తన స్కంధావారమున కేఁగెను. మఱునాఁడు ప్రాతఃకాలమున నటనుండి తరలి అతిత్వరిత ప్రయాణంబుల కోసలం జేరెను. ఇతఁ డిట్లు కృతార్థుఁ డయినందులకు సంతుష్టుఁడై తండ్రి యితనికి రాజ్యాభిషేక మొనరించి తాను తపోవనమునకుం బోయెను. ఇతఁడును వ్యాజహంసావళియే తనకు పట్టపుదేవిగా భూమండలము నేలుచుండెను.

ముచ్చి మనోరథసిద్ధుఁడును మాయాహంసావళిని కనకమంజరిని కని, ఆమె తన్నానవాలు పట్టి తలగొట్టించు నని వెఱచి, రాజనగరు వదలి యెటకో పోయెను. హంసావళి యారాత్రి వటద్రుమమునుండి కమలాకరునిం గని కనకమంజరి చేయించిన శాల్మలీదహనముం గని ‘అహో! నన్ను కనకమంజరి మోసగించి నాభర్తను హరించినది. అహో! స్వమనోరథసిద్ధికై నన్ను కాల్పింపనుఁ గూడ యత్నించినది గదా! దుర్జనులను నమ్మినవారికి కీడు మూఁడకుండునా? కావున నానిమిత్తమై దాహ మొందిన యీబూరుగుమ్రాని నిప్పులలోఁ బడి మడిసి

దీనిఋణమును దీర్చు కొనియెదను.' అని యాలోచించి మఱ్ఱి దిగి నిప్పుల నులుకం బోవుచు, దైవయోగమున బుద్ధి మాఱి మరల ని ట్లని తలపోసెను:—'వృథా ప్రాణత్యాగ మేల చేయ వలయు ? బ్రదికి యుండిన నెప్పటికేని యీ సఖిద్రోహిణిమీఁద పగ దీర్చుకొననా ? అప్పుడు నాయనకు జ్వరము రాఁగా శ్రీహరి నాచేతితాఁకుడే మందుగాఁ జెప్పి, నావివాహమును గూర్చిన చింత నాయనకు వల దనియు, నాకు తగినవాఁడు కమలాక రుఁడు భర్త యగు ననియు, నాకు కొంత కాలము మాత్రము కొంచెము క్లేశము కలుగు ననియు, నాన తిచ్చి యుండ లేదా ? కావున నెటకేనియుం బోయి కాల మెదురు సూచు చుండెద.'

ఇట్లు నిశ్చయించుకొని హంసావళి ఒక నిర్జనారణ్యము నకుం బోయెను. ఆమె దూరము నడచి యలసి యడుగులు తడఁబడుచుండఁగా ఆమెపై కనికరించి దారి చూపుటకుం బోలె రాత్రి కడచి పోయెను. ఆమెయవస్థం గని జాలిగొన్నదియుం బోలె నింగి మంచుతుంపురుల కన్నీళ్లను పెల్లుగాఁ గురిసెను. గుణానురక్తుఁ డై ఆమెకన్నీళ్లు తుడుచుటకుం బోలె రవి యుద యించి కరములు సాఁచుచు, ఆశలు సూపి యామె నూఱడిలం జేసెను. అంతట నారాజకన్య యించుక యోదార్చి, జనులకంటఁ బడ నొల్లక, కాఱడవుల నడుమఁ జొచ్చి, నడచి నడచి, దర్భమోసు లకు నడుగులు గాయము లొంద, రమణీయమైన యొకయటవిం

జేరి, యలయికచే కూర్చుండెను. వృక్షము లామెను గాలి కాదు చున్న కొమ్మవీవనలతో వీచి సేద దేర్చినవి. కలయఁ బూచిన తీయమావులపై కోకిలలు ఘోషిల్లు చుండ, మధు వెల్లెడలం గురియు చుండ, నా వనం గని హంసావళి డీలుపడి, 'హా! పుష్పా డి పసిమి పసల యీ జము దెస తెమ్మెరచిచ్చు నన్ను దరికొల్పు చున్నది: మ్రాఁకులనుండి రాలు నీపూలమొత్తములు తేఁటి కూటువుల రొదతోడ వలరాయని యులుఁగుదుటుములో యన నన్ను డగాయుచున్నవి ! అయినను ఈ పువ్వులతోనే రమా పతిని బూజించుచు నిటనే నాపాపము తఱిఁగించు చుండెదను.' అని నిశ్చయించుకొని, అటనే యందలిబావులలో స్నానములు సేయుచు పండ్లే యాహారముగా కమలాకరప్రాప్తికై నిరంత రము హరిపూజ సల్పుచుండెను.

ఈలోపల కోసలయందు కమలాకరమహీనాథునికి దైవ యోగంబున చాతుర్థిక జ్వరము కలిగి చిరకాలము కుదుర కుండెను. అంతట నాపాపాత్మురాలు కపటహంసావళి కనక మంజరి దిగులొంది మదిలో నిట్లు తలపోసెను. 'అశోకకరి యెప్పుడు నాగుట్టును బయట వేయునో యని యిప్పటి కొక భయము నాకు సర్వదా కలిగియే యున్నది. ఇట్లుండ నిపుడు రెండవది ప్రాపించినది. ఎట్లన, పూర్వ మీయనతో జనసన్ని ధిని హంసావళితండ్రి చెప్పియుండెను గదా, హంసావళి చేతితోఁ దాఁకిన నెట్టిజ్వరమేనియు వెంటనే శమిల్లునని. అది గనుక ఈప్ర

భువున కిపుడు జ్ఞప్తికి వచ్చెనా, ఆప్రభావము నాయందు లేమిం జేసి వెంటనే నాగుట్టు బయటం బడి తప్పక నాకు వినాశ మగును. కావున, ఇట్లు చేసెదను. నా కొక సిద్ధయోగిని నేర్పిన జ్వర చేటకుని ఇప్పుడు ఈయనజ్వరము మాన్పుటకై యథావిధిగా సాధించెదను. వానికే యుక్తిగా అశోకకరిని బలివేసి దీని యంగములతో వానిం బూజించెద. అట్లు చేసిన నతఁడు నా యభీష్టమును నెఱవేర్చును. నా రెండుభయంబులును ఒక్కటనే తీఱును. నా సేమమున కిపుడు ఒండు ఉపాయము లేదు.'

ఇట్లు సంకల్పించి అందు నరబలి లోనగు విరుద్ధాంశములను మాని కడమ తన సంకల్ప మెల్ల నశోకకరికి చెప్పి, అదియు ఒప్పుకొని వలసిన సంభారము నెల్ల కూడంగొని రాఁగా, యుక్తి గా పరిజనము నెల్ల కనుమొఱంగి, దానిని మాత్రము వెంటం గొని, మాఱుమూలదారిని ఎవరికిం దెలియనీయక, రాత్రి కేలం గత్తిఁ బూని, లింగముమాత్రము గల యొకశూన్యశివాలయము నకుం బోయెను, అట కత్తితో మేఁకను నఱికి దానిరక్తముతో లింగమునకు స్నానముం గావించి, దాని నెత్తుటితోనే అర్ఘ్య మిడి, దానిప్రేవులు పేరులుగా నలంకరించి, దాని గుండెతామ రతో శిరమునం బూజించి, దానికనులతో ధూపము వేసి, దానితలను నైవేద్యము పెట్టెను. అనంతరము లింగమునెదుట తిన్నెను ఎఱ్ఱగందముతో సలికి అందు గోరోజనముతో ఎనిమిది రేకుల తామర యొకటి వ్రాసి దానిగద్దియమీఁద నెత్తురు

కలిపినపిండితో, బూడిదపిడికిటి పోటుముట్టువాఁడు మూఁడు కాళ్లవాఁడు ముమ్మోముల వాఁడునుంగా జ్వరపురుషుని చేసి పెట్టి, రేకులలో అతని పరివారమును యథావిధిగా సమర్చి, జ్వరపురుషుని నిజమంత్రమున నావాహన చేసెను. అనంతరము కనకమంజరి మునుపటివలె అతనికి స్నానార్ఘ్యాది పూజాంగము లొనరించి నరబలి వేయునదియై యశోకకరితో 'చెలీ, నేలకు ఎనిమిది యవయవములును సోఁకునట్లు దేవునకుం బ్రణమిల్లుము, అట్లు చేసిన నీకు మే లగును.' అని చెప్పెను. వల్లె యని యది నేల దండప్రణామంబు గావింప నాద్రోహిణి కనకమంజరి దానిని కత్తితో వేసెను. దైవయోగమున దెబ్బ యసీఁబోయి బుజమునకుమాత్రము ఇంచుకంత తగులఁగా నశోకకరి అడలి లేచి పలాయిత యాయెను. కనకమంజరి తఱుముకొని వచ్చుటను గని యశోకకరి కుయ్యో మొఱ్ఱో యని మాటిమాటికి నేడ్చుచుం బరుగెత్తెను. అంతట నారెకులు విని యటకు వడిగాఁ బఱతెంచి వచ్చిరి. కత్తిదూసికొని తఱుముకొని వచ్చిన ఘోరమూర్తిని కనకమంజరిని గని రక్కసి యని యాయుధములతోఁ గొట్టి గుడుగుడుజీవముదానిం గావించిరి. అనంతరము అశోకకరివలన వాస్తవవృత్తాంతము నెల్ల నెఱింగి, వారి నిరువురను కొత్వాలు కూడ రా రాజుకడకుం గొనిపోయి వృత్తాంతమును నివేదించిరి.

అంతట కమలాకరుఁడు అబ్బురపోయి ఆ దుష్టభార్యను దానిసఖిని ఇరువురను తనయెదుటికి రప్పించెను. అటుకు వచ్చిన మాత్రాన కనకమంజరి దెబ్బలనొప్పి పెల్లున గతజీవితయై నేలం గూలెను. రాజు కడు వగంగూరుచు వ్రణితను అశోకకరిని అభయమిచ్చి వాస్తవ మడిగెను. అది వ్యాజవివాహము మొదలు కనకమంజరీరచితమయిన సాహసమెల్ల పూసగ్రుచ్చినట్లు వివరించెను. అంత నంతయు నెఱింగి కమలాకరుఁడు తనదళి కిట్లు వందురెను. అయ్యో! ఈ పాడుమిథ్యాహంసావళిచే మోసపోయి నేను నాచేతులార హంసావళిని కాల్చితిని గదా. రాజుపట్టపు దేవి యయ్యు 'నిది యిట్టిదుశ్చరణముపాలగుటచే దీనికి మాత్రము తన పాపకర్మకుఁ దగినశాస్తి యయినది. పాడు విధాత నన్నెల రూపమాత్రముచే మాయలోఁ ద్రోచి చేతినుండి రత్నమును హరించి గాజుపెం కిచ్చినాఁడు. జ్వరశాంతికై హంసావళీజనకునికి విష్ణు వానతిచ్చిన హంసావళీకరస్పర్శ భైషజ్యము నేల జ్ఞప్తి చేసికోనైతిని.' ఇట్లని వనవుచుం గమలాకరుఁడు హంసావళికి పతి గలుగు ననియు స్వల్పకాలము మాత్రము కొంచెము క్లేశము కలుగు ననియు, విష్ణుదేవు నాదేశ మని మేఘమాలి చెప్పిన మాటను స్మరించి, ఆ మాట పొల్లు వోదనియు, హంసావళి యెటనో జీవించి యుండు ననియు, స్త్రీ చిత్తమువోలె దైవచిత్తంబును దురూహమనియు, ఆవంది మనోరథసిద్ధుఁడు ఈ విషయంబున నొకదారి సూపఁగలఁ డనియు,

తలంచి, వానిని రప్పించి 'భద్రుఁడా, నీ వెటను ఈనడుమ అగ పడకుంటి వేమి ? సరి, నిన్నడుగ నేల ? దుష్టులచే మోసపోయిన వారికి మనోరథసిద్ధి యెట్లు గల్గును?' అని ప్రశ్న చేసెను.

'ప్రభూ, గుట్టుబయటఁబడు ననుభయముచేత కనకమంజరి కత్తిపాలుచేసిన యీయశోకకరియే నాయుత్తరము. హంసావళికై యేలినవారు వగవం బనిలేదు. ఆమెకు కొంచెముకాలము ఇమ్ము దప్పు నని హారియే యాన తీయఁడా? ఆమె సేయునిత్య పూజల కలరి హారియే యామెను గాచును, ధర్మ మెప్పుడును పాలి వోమి ప్రత్యక్షమే గదా. కావున, దేవా, నేఁ బోయి యామెవార్తం దెచ్చెదను.' అని యాతఁడు విన్నవించెను. 'హం సావళిని వెదక నేనే పోయెద, నీవు కూడ రావలసినది, అట్లు చేయనేని నాతల్లడము తీఱదు.' అని రాజు బదులు పల్కెను. మఱునాఁడు రాజు ప్రజ్ఞాఢ్యుఁడనుమంత్రికి రాజ్య మప్పగించి, అతని నివారణోక్తుల నంగీకరింపక నగరినుండి గుప్తముగా మనోరథసిద్ధితోఁగూడ వెలువడి తీర్థక్షేత్రములలోను ఋష్యా శ్రమములలోను వనములయందును ఆమెను వెదకుచు తన కాయక్లేశమును సరకు గొనక తిరుగుచుండెను. మనోజాతుని యాన యలంఘనీయముగదా. కాలక్రమమున దైవయోగ మున హంసావళి తపస్సు చేయుచున్న యావనముం జేరి అట నొకరక్తాశోకముక్రింద రేరాయని కడపటికళయుంబోలె పాండు క్షామ మనోరమయై యున్న హంసావళిని గాంచి వందిని 'ఏవ

రీ యంగనామణి మౌనమునఁ గదలక ధ్యాననిష్ఠయై యున్నది. దేవతయా? ఈరూప మమానుషము గదా.' అని యడిగెను. అంతట వంది యామెం గని 'ఆహా! మహారాజా, నీకు శ్రే యము. ఈ మెయే గదా హంసావళి, దొరకినది.' అని నుడివెను. అంతట హంసావళి వారి నిరువురం గని మనోరథసిద్ధిని ఆనవాలు పట్టినదై పూర్వదుఃఖ మెల్ల నొక్కమాటే యిపుడు ముంచు కొని రాఁగా 'అయ్యో; నాయనా, అయ్యో; ఆర్యపుత్రా, కమలాకరా, అయ్యో! మనోరథసిద్ధీ! అయ్యయ్యో! విధీ, విప రీత కారీ!' అని వివశయై విలపించి మూర్ఛిల్లి నేల వ్రాలెను. వినియుం గనియుం గమలాకరుఁడు వనటం బడి నేలఁ గూలెను. మనోరథసిద్ధి యోదార్పఁగా ఇరువురును దేరి, ఒండొరువుల నెఱింగి, కరము వనట దీఱి, విషాదార్ణవము దాఁటి ఏమో చెప్ప నలవిగాని యానంద మనుభవించిరి. తర్వాత ఒండొరులకు తన తన వృత్తాంతముఁను చెప్పుకొనిరి. అనంతరము కమలాక రుఁడు హంసావళిని గైకొని మనోరథసిద్ధిని వెంటఁగొని తన నగ రము కోసలకుం జనియెను. అట హంసావళీజనకుని మేఘమా లిని రప్పించి యథావిధిగా యథావిభవముగా జ్వరహారిని హంసావళీహస్తమును గ్రహించెను. అట్లు విశుద్ధోభయపక్ష యగు నాహంసావళితోఁ గూడుకొన్నవాఁడై కమలాకరుఁడు మునుపటికన్న నతి విమలుఁడై యొప్పెసఁగి ధైర్యముచే కార్య

తలంచి, వానిని రప్పించి 'భద్రుఁడా, నీ వెటను ఈనడుమ అగ పడకుంటి వేమి ? సరి, నిన్నడుగ నేల ? దుష్టులచే మోసపోయిన వారికి మనోరథసిద్ధి యెట్లు గల్గును?' అని ప్రశ్న చేసెను.

'ప్రభూ, గుట్టుబయటఁబడు ననుభయముచేత కనకమంజరి కల్పించిన యీయశోకకరియే నాయుత్తరము. హంసా వళికై యేలినవారు వగపం బని లేదు. ఆమెకు కొంచెముకాలము ఇమ్ము దప్పు నని హరియే యాన తీయఁడా ? ఆమె సేయునిత్య పూజల కలరి హరియే యామెను గాచును, ధర్మ మెప్పుడును పాలి వోమి ప్రత్యక్షమే గదా. కావున, దేవా, నేఁ బోయి యామెవార్త దెచ్చెదను.' అని యాతఁడు విన్నవించెను. 'హం సావళిని వెదక నేనే పోయెద, నీవు కూడ రావలసినది, అట్లు చేయనేని నాతల్లడము తీఱదు.' అని రాజు బదులు పల్కెను. మఱునాఁడు రాజు ప్రజ్ఞాఢ్యుఁడనుమంత్రికి రాజ్య మప్పగించి, అతని నివారణోక్తుల నంగీకరింపక నగరినుండి గుప్తముగా మనోరథసిద్ధితోఁగూడ వెలువడి తీర్థక్షేత్రములలోను ఋష్యా శ్రమములలోను వనములయందును ఆమెను వెదకుచు తన కాయక్లేశమును సరకు గొనక తిరుగుచుండెను. మనోజాతుని యాన యలంఘనీయముగదా. కాలక్రమమున దైవయోగ మున హంసావళి తపస్సు చేయుచున్న యావనముం జేరి అట నొకరక్తాశోకముక్రింద రేరాయని కడపటికళయుంబోలె పాండు క్షామ మనోరమయై యున్న హంసావళిని గాంచి వందిని 'ఏవ

రీ యంగనామణి మౌనమునఁ గదలక ధ్యాననిష్ఠయై యున్నది. దేవతయా? ఈరూప మమానుషము గదా.' అని యడిగెను. అంతట వంది యామెం గని 'ఆహా! మహారాజా, నీకు శ్రేయము. ఈమెయే గదా హంసావళి, దొరకినది.' అని నుడివెను. అంతట హంసావళి వారి నిరువురం గని మనోరథసిద్ధిని ఆనవాలు పట్టినదై పూర్వదుఃఖ మెల్ల నొక్కమాటే యిపుడు ముంచుకొని రాఁగా 'అయ్యో; నాయనా, అయ్యో; ఆర్యపుత్త్రా, కమలాకరా, అయ్యో! మనోరథసిద్ధి! అయ్యయ్యో! విధీ, విపరీత కారీ!' అని వివశయై విలపించి మూర్ఛిల్లి నేల వ్రాలెను. వినియుం గనియుం గమలాకరుఁడు వనటం బడి నేలఁ గూలెను. మనోరథసిద్ధి యోదార్పఁగా ఇరువురును దేరి, ఒండొరువుల నెఱింగి, కరము వనట దీఱి, విషాదార్ణవము దాఁటి ఏమో చెప్ప నలవిగాని యానంద మనుభవించిరి. తర్వాత ఒండొరులకు తన తన వృత్తాంతముఁను చెప్పుకొనిరి. అనంతరము కమలాకరుఁడు హంసావళిని గైకొని మనోరథసిద్ధిని వెంటఁగొని తన నగరము కోసలకుం జనియెను. అట హంసావళీజనకుని మేఘమాలిని రప్పించి యథావిధిగా యథావిభవముగా జ్వరహారిని హంసావళీహస్తమును గ్రహించెను. అట్లు విశుద్ధోభయపక్షయగు నాహంసావళితోఁ గూడుకొన్నవాఁడై కమలాకరుఁడు మునుపటికన్న నతి విమలుఁడై యొప్పెసఁగి ధైర్యముచే కార్య

సిద్ధినొందిన యాదేవితో క్రీడించుచు మనోరథసిద్ధి నెడఁబాయక రాజ్య మేలుచుండెను.

ఈరీతిని ఇడుమలు కలిగినప్పుడు ధైర్యము వదలని వారికి సర్వమును సిద్ధించును. కాన, వత్సా, వృథాగా ప్రాణ మేల వదలెదవు? బ్రదికియుందువేని నీదారను చూతువు. ఇట్లు ఆముసలి బాటసారి కథను చెప్పి నన్ను మరణోద్యోగము నుండి మానిపి తన దారిని పోయెను. ఇట్లు చండకేతుని యింట రాత్రి భీమపరాక్రముఁడు నుడివి మృగాంకదత్తునితో వెండి యి ట్లనియె.

అతని బోధన నంగీకరించి నేను అడవి వెలువడి నీవు పోఁ గోరిన చోటయిన యాయుజ్జయినీ నగరికిం బోయితిని. మీ రెవ్వరును అట లేరు. మిమ్ము వెదకి నే నలసి ఒక వంట పూఁటదానియింటి కేఁగి, భోజనార్థము పయిక మిచ్చి, ఆయింట నా మె యిచ్చిన పడుక మీఁదఁ బరుండి, ఇంచుకంత నిద్రించి, మేల్కాంచి, దొంగతనముగా కుతూహలముచే బరికించుచుండ, వంటపూఁటిది పడికెఁడు యవ లెత్తి ఇంటిలోనే అంతటను మంత్రోచ్చారణచే నవర ముంచుక యదరు చుండ చల్లినది. అవి తత్క్షణమే మొలచి ఎదిగి వెన్ను వేసి పండినవి. అంత వానిని కోసి వేఁచి విసరి పేలపిండి చేసినది. ఆపిండి నామె యొక్క గిన్నెలోఁ బోసి పెట్టి దానిపై నీళ్లు చిలుకరించి ఇంటిని ఎప్పటి య ట్లొనర్చి స్నానమునకు పోయెను. ఆమె శాకిని యని నేను

నెఱిఁగి నిశ్శంకగా లేచి త్వరగా ఆగిన్నెలోని పేలపిండిని మఱి యొక పేలపిండికుండలోఁ బోసి ఆకుండలోని పేలపిండినుండి ఆగిన్నెలో మునుపటియంత పిండి పోసి రెంటిని ఎప్పటియట్లు చేసి యుంచి మరల నెప్పటియట్లు పడుకలో నుంటిని. అంత నామె వచ్చి నన్ను లేపి నాచేసిన మార్పెఱుంగక ఆగిన్నెలోని పేలపిండి నాకు భోజన మిడెను. తాను పిండికుండనుండి ఎత్తి పెట్టుకొని యామంత్రింపఁ బేలపిండిని భుజించెను. ఆపిండి తినుటవలన ఆస్త్రీ ఆఁడుమేక యాయెను. అంత నేను పగచేత దానిని కటికవానికి విక్రయించితిని. కటికవాని పెండ్లాము బయట వచ్చి నాపై నిట్లు కోపగించెను. 'నాసఖిని నీ విట్లు మోసము చేసితివి. అందులఫలము నీవొందుదువు.' నేను ఆబెదరింపు విని పోయి రహస్యముగా ఊరి వెలుపటి యలసి యొకమఱ్ఱిక్రిందఁ బరుండి నిద్ర పోయితిని. నే నట్లుండ నాకటికవాని భార్య పాడు యోగిని వచ్చి నామెడ కీ త్రాడు కట్టిపోయినది. ఆపాపాత్మురాలు పోవుచున్న క్షణమునందే నేను మేల్కొని చూచుకొనునంతటికి నెమలినై యుంటిని, నా మునుపటి స్మృతిమాత్రము పోలేదు. అది మొదలు కొన్నిదినములు దిగులుపడి ఇట నటం ద్రిమ్మరుచు నుండఁగా నన్ను పిట్టలబోయ యొకఁడు ప్రాణముతోఁ బట్టుకొని తెచ్చి బోయరాజని ప్రతీహారుల తలగానికి ఈ చండకేతునికి కానుక పెట్టెను. ప్రతీహారుఁడు నన్ను తన పెండ్లామున కిచ్చెను. అది నన్ను మంటపములో వినోదార్థమై

యుంచెను. ఇపుడు దైవము నిన్నిటకుం దెచ్చి నా మెడ త్రాడు విప్పింపఁగా మరల నేను తొంటినరరూపముం బొంది తిని. ఇఁక మనము శీఘ్రముగా నిటనుండి తప్పించుకొని పోవు దము. పాపాత్ముఁడు ఈ ప్రతీహారుఁడు రాత్రిచర్యాసాక్షులను రహస్యము బయలఁబడు ననుభయమున నెప్పుడును తప్పక చంపి వేయును. ప్రభూ, నీవును వీనిరాత్రిచర్యకు సాక్షివి, నిన్ను వీఁ డింటికిం దెచ్చినాఁడు కావున యోగిని చేసిన యీ సూత్రమును నీవు మెడకుఁ గట్టుకొని నెమలివై యీ కిటికీ దారిని వెలువడుము, అంత నీవు మెడసాఁచిన, నీమెడనుండి యాసూత్రమును నేను చేతులు సాఁచి యందుకొని విప్పి నా మెడకుఁ గట్టుకొని నెమలినై యట్లే వెలుపలికి వచ్చెదను, నా మెడలోని త్రాటిని నీ వంతట విప్పివేసిన ఇరువురము మను ష్యుల మగుదుము. ద్వారమునకు అడ్డుగడియ వేసినారు. ఈ దారిని పోవ వలను లేదు.

ప్రాజ్ఞుఁడు భీమపరాక్రముఁ డిట్లుచెప్పగా అట్లే మృగాంక దత్తుఁడు అతనితోఁ గూడ వెలువడి తనయింటికి పోయి ఆ యి రువురు మంత్రులకును భీమపరాక్రముని చూపెను. అట నంద లును తమ తమ పడినయిడుమలు ఒండ్లకు వర్ణించుచు ఆరాత్రి శేషమును గడపివేసిరి. తెల్లవాఱఁగానే మృగాంకదత్తుని కడకు మాయావటువు వచ్చి రాత్రి సుఖ మడిగి మృగాంకదత్తుని వినో దార్థము పాచిక లాడఁ బిలిచెను. ఆసమయమున నటకు ప్రతీ

హారుఁడు చండకేతువు రాఁగా వానిం గని శ్రుతధి జ్ఞప్తి చేసి
కొని 'ఈపాచిక లేల యిపుడు ? ప్రతీహారుని నెమలియాట
యిపుడు చూడవలసినట్లు నిశ్చయమై యున్నది గదా.' అనెను.
శ్రుతధి యిట్లనఁగా జ్ఞప్తిఁ బొందినవాఁడై శబరరాజు వెంటనే
ప్రతీహారుని నెమలిని తెమ్మని యింటికి పంపెను. అంతట ప్రతీహా
రుఁడు 'ఏమి! యాదొంగను చంప మఱచితిని! వాఁడు నా రాత్రి
వృత్తాంతమును గన్నవాఁడుగదా ! వానిని నెమలియింట వేసి
తినిగదా, ఇపుడు పోయి రెంటినుం గావించెదఁ గాక.' అని
యాసందర్భమున జ్ఞప్తిఁ గొని తలంచుకొని పోయి నెమలియింటఁ
గనఁగా, అట నెమలియు లేదు, దొంగయు లేఁడు. అంతట
వాఁడు భయ మొంఁగి దుఃఖితుఁడై తన రాజుకడ కేఁగి 'మహా
రాజ, నా నెమలి నెవఁడో దొంగ రాత్రి దొంగలించుకొని
పోయినాఁడు.' అని విన్నవించెను. 'నీనెమలిని దొంగలించిన
వాఁ డెవఁడో మిగులఁ బ్రసిద్ధుఁడైన జగదొంగ గావలయు.'
అని చిఱునగవుతో శ్రుతధి పలికెను. అంతట మృగాంకదత్తాదు
లొండొరులం గని నవ్వుకొన సాఁగిరి. అంతట మాయా
వటువు వారిని ఏల నవ్వెదరు చెప్పుఁ డని బలవంతముగా నడి
గెను. అంతట ప్రతీహారుని రాత్రి చీఁకటిలో కలయుట, తద
నంతరము ప్రతీహారుఁడు రాణిమీఁదికి వలపుచే నా మెనగరికిం
బోవుట, అట నామెమీఁదికి కత్తి దూయుట, చేతివ్రేళ్లను
తెగనఱకుట, పిమ్మట తా మిరువురును ప్రతీహారునియింటికి

వచ్చుట, అట నెమలితనమునుండి భీమపరాక్రముఁడు విడువు పొందుట. ఇత్యాదివృత్తాంతము తనకుఁ బ్రతీహారునికి సంబంధించినంతవఱకు సర్వము మృగాంకదత్తుఁడు భిల్లరాజునకు వివరించెను. అంతట మాయావటువు, అంతఃపురచేటికను రప్పించి దానిప్రేళుల గాయములు గాంచి, భీమపరాక్రమునిమెడకు అయోగిసీసూత్రమును కట్టించి యతఁడు ఆమాత్రాన నెమలి యగుటయుంగాంచి, ప్రతీహారుని అంతఃపురదూషకుని సంహరించి, తనభార్య నాదురాచారను మృగాంకదత్తుని మాట విని చంపక స్వర్ణదూరను చేసి దూరమున నుంచెను. మృగాంకదత్తుఁడు ఉజ్జయినికిం బోవ సమకట్టినవాఁడయ్యును భిల్లరాజు వేఁడికోలున అతఁడొనర్చు నుపచారము లంగీకరించుచు కడమమంత్రుల నెదురుచూచుచు ఆపాయపల్లెలోనే కొన్నిదినము లుండెను.

---

## ౫-వ తరంగము.

---

### గుణాకరుని కథ.

ఇవ్విధమువున విమలబుద్ధ్యాదిమంత్రి సమేతుఁడై మృగాంకదత్తుఁడు బోయతేనియింట నుండఁగా నొకనాఁడు బోయసేనాపతి వచ్చి తమదొరతో వేగిరపాటు దోఁప విన్నవించెను. ‘దొరా, నీయాజ్ఞను అమ్మవారికి బలికై యాచెప్పినలక్షణములు

గల పురుషు నొకని సంహరించితిమి. ఆగాఁడు వనమేటి [illegible]ంపు మగలను ఏనూర్గురను లెగఁజార్చినాఁడు. ఆవిధముగా గాయములు తగిలి సొమ్మసిల్లియున్నాఁడు. తెచ్చినాము.' ఆమాట విని భిల్లరాజు ఆపురుషుని దెచ్చి [illegible] సేనాపతి కాన పెట్టెను. దళవాయి యాతనిని [illegible]చెను. [illegible]ంగట్టు బడి [illegible] పెట్టుకొని [illegible] గాయపుగట్టు [illegible]ండి తెరువుగొను క్రమమున [illegible] కష్టమునే [illegible] పటుపడియున్న యా పురుషుఁడు చెక్కుల చెంగిరమున [illegible] నచ్చినిమదవు నీళ్ల యొడికలు గలిగి [illegible] గట్టుపడి [illegible]యున్న మస్త్రీ వోలె నుండెను. అంతలో నచ్చిన మృగాంకదత్తుఁడు తన మంత్రి గుణాకరుని గాంచి [illegible] వచ్చుచు కంఠమునం గౌఁగిలించెను. [illegible] మృగాంక[illegible] పాదముల వ్రాలియున్నయాతని బట్టి [illegible], [illegible] గుణాకరుమంత్రి చూచి [illegible] నోడ చెప్పెను. తన యింటికిం గొనిపోయి స్నానము [illegible] గాయములకు కట్టు కట్టి వైద్యోక్తక్రమముగాం బథ్యము [illegible] లొనరించి స్వస్థులం జేసెను. అనంతము మృగాంకదత్తుఁ డడుగ, గుణాకరుఁడు ఎల్లరు విన నిట్లని స్వవృత్తాంతమును జెప్పెను.

**దేవా,** అప్పుడు నాగపాశములచే నేను మిమ్ముఁ బాసి ఏమియుం దెలియని మూర్ఛావస్థం బొంది దూరమున నొక యొడారిలోఁ బడి చిరకాల మటనే క్రుమ్మరుచుంటిని. అనంతరము

నాకు తెలివి కలిగినది. అంతట ని ట్లని వగచితిని:—'అయ్యో! ఏమి యీ నేరని విధాత్రనిదుండగము. రాచనగర నడచునప్పుడే ఖేద మొందు మృగాంకదత్తుఁడు ఈ కాలెడు నిసుకయెడారిలో నేమి గాఁగలఁడు! ఆ నామిత్రు లే మయిరో, ఎట్లున్నారో?' అని యిట్లు మాటిమాటికిం జింతించుచు దైవవశమున వింధ్య వాసిని చెంత కేఁగితిని. రేయుంబవలు నానా ప్రాణబలులచే యమాలయముం బోని యమ్మవారి దేవళము సొచ్చి ఆమెకు సాష్టాంగప్రణామ మర్పించి లేచి కనఁగా, కంఠమందు పాదు కొని యున్న కత్తితోడి యొక యాత్మబలిదాతశవము అగ పడెను. వానిం గనఁగానే నా మనస్సులో మీ యెడఁబాపు వనట తీఱ, నేను నట్లే దేవికి సంతుష్టిగా నాత్మబలి సమర్పింతుఁ గాక యని యాలోచన గలిగెను. అందుకై నేను పరువునం బోయి యాపురుషశవము చేతికత్తిని బుచ్చుకొనునంతట నొక తాపసి ద్వారదేశమున వచ్చి ముదిమిచే కుడియెడమల కాడు చున్న తన తలచేతనే నా యుద్యమమును నిషేధించుచున్నది యుం బోలె నాకడకు వచ్చి, దయతో నన్ను మాన్పి, నావృ త్తాంత మడిగి విని నా కిట్లు బోధించెను. 'పుత్త్రా, చచ్చిన పిమ్మట మరలం గూడుట యెటనేనియు వింటిమా? బ్రతికి యున్నం గదా పాసినవారిని మరలం కలయ నగును. అందు లకు నిదర్శనము కథ చెప్పెదను వినుము:—

## వినీతమతి కథ.

లోకప్రసిద్ధము అహిచ్ఛత్త్ర మని నగరము కలదు. అందు పూర్వము రాజేంద్రుఁడు ఉదయతుంగుఁ డేలుచుండెను. అతని ప్రతీహారి కమలమిత్త్రుఁ డనువాఁడు గొప్పవాఁడు. కమలమిత్త్రునికి వినీతమతి యని సాటి లేని మేటిపుత్త్రుఁ డుండెను. సరంధ్రం బయినకతన తామరతూఁడు, కుటిలం బగుటచేత విల్లును, గుణవంతము లయ్యును నాతనికి ఈడు గా వాయెను. ఒకనాఁ డాకుమారుఁడు రాత్రి తనమేడపై మంచంబునం బరుండి, వలరాచయీవిమ్రాని చివురుతో రేచామ ఇంద్రదిగ్వనితకు చేసి యిడిన చెవికమ్మయో యనం జెలువారుచున్న జాబిల్లిపొడుపుం గాంచి, క్రమమున వెన్నెలచే వెలుంగొందుచుండుటయుం గని, 'ఆహా! యీవెన్నెలచే దారులన్నియు పాలఁగచ్చుచేసినవి వోలె తేజరిల్లుచున్నవి ; వీనిలో నొక్కండన పోయి ఏలవిహారింప రాదు?' అని కోరిక యీరికలెత్త విలుతోడుగా వెడలెను. కోసు దూరము పోవునప్పటికి ఆకస్మికముగా నేడ్పు వినఁబడెను. ఆసవ్వడిని బోయి యతఁడు ఒకకన్నియను దివ్యరూపను ఒకచెట్టుకడం గూర్చుండి యేడ్చుచున్నదానిం గాంచి, 'ఓకల్యాణీ, నీ వెవ్వతెవు ? కాటుక కన్నీళ్లచేత ఏల నెమ్మొగమును మచ్చతోడి చందురునికి సాటిసేయుచున్నావు?' అని యామె నడిగెను. ఆమె యి ట్లనియె.—

"మహానుభావా, నేను గంధమాలి యను నాగేంద్రుని కూఁతురను నాపేరు విజయవతి, నాతండ్రి పోరం బలాయితుఁడగుటయు, ఆయనను వాసుకి 'పాపాత్ముఁడా, నీవు పగతునికి ఓడి దాసుఁడ వగుదువు పో.' అని శపించెను. ఆశాపంబున మాతండ్రిని పగతుఁడగు కాలజిహ్వుఁడను యక్షుఁడు ఓర్చి తనకు ఎప్పుడును పుష్పములు తెచ్చు కింకరుఁగాఁ జేసికొనెను. ఆపగచే నేను గౌరిని దపస్సున సేవించి యభీష్టము వేఁడితిని. భగవతి ప్రత్యక్షమై యిట్లనియెను:—'పుత్రీ, వినుము. మానససరోవరంబున గొప్పది వేయిరేకుల సువర్ణపుష్పరాజ మను మొకటి కలదు. ప్రొద్దునెలంగులు నయిందవోలయు సహస్రతనంపుఁదేజుల నెల్లెడా లోలయు సకలదిగ్యోమండలము వ్యాపించుచుండును. ఒకనాఁడు కుబేరుఁడు దానిం గని మానసంబున నచ్చిన మాడ్కి భక్తిమెయి నా తామరయందు శివార్చనఁ బ్రారంభించెను. ఆసమయమున ఆతనియనుచరులు యక్షులు ఆసన్నమున జక్కవలు అంచలు లోనగు నీటిపులుఁగుల రూపులఁ దాల్చి విహరించుచుండిరి. అందు మాతండ్రికి వైరియగు నా కాలజిహ్వుని యన్న విద్యుజ్జిహ్వుం డనువాఁడు తన కాంతతోఁ గూడ జక్కవరూపమునఁ గ్రీడించుచుండి దైవయోగంబున రెక్కలు జాడించి కుబేరునిచేతి నుండి యర్ఘ్యపాత్రమును క్రిందం బడఁ జేసెను. అంతట కుబేరుఁడు కోపగించి విద్యుజ్జిహ్వుని వానిభార్యను ఎప్పటికిని జక్కవలుగానే ఆచెఱువున నుండునట్లు శపించెను. అట్లు జక్క

వర్యై రేలయందు పెంటికై విరాళిం గూరు నా విద్యుజ్జిహ్వుని తమ్ముఁడు కాలజిహ్వుఁడు తాను ఆజక్కవపెంటిరూపు గైకొని వినోదపఱుచుచు, పలు నిజయక్షరూపమునే దాల్చుచు, నుం డును. నీతండ్రి వానికి బానిసగ్గా యెప్పుడును కూడనేయుండును. పుత్రీ, అచటికి ప్రతీహారకుమారుని మహాధీరుని అహిచ్ఛత్ర నగరము వానిని పరాక్రమవంతుని కడఁకకానిని వినీతమతిని బంపుము. ఈగుఱ్ఱమును కత్తిని గొనిపొమ్ము. వీనితో నతఁడు ఆయక్షుని గెలిచి నీతండ్రిని విడిపించును. ఈకత్తి కెవఁ డో డయఁ డగునో యతఁడు మార్తురనెల్ల నోడించి భూలోకములో రా జగును.' ఇట్లు ఆనతిచ్చి భగవతి గుఱ్ఱముఁ కత్తిని ఇచ్చి దిచ్చు మొగం బాయెను. అంతట నిన్నుం బ్రేరించుటకు నేను క్రమముగా నిటకు వచ్చి దేవీ కరుణా పాత్రుని నిన్ను రాత్రి వెలికి రాఁగాఁ గాంచి, ఏకప్పు వినిపించి, యుక్తిగా నిటకు ఎలయించితిని. కావున ఓయి సౌబగుఁడా నాకోరికను నెఱవే ర్పుము.” ఇట్లామె ప్రార్థింపఁగా వినీతమతియు నంగీకరించెను.

ఆనాగకన్య పోయి తత్క్షణమే పడిగల యొక తెల్లని కత్తలాని తేజిని దిగంతములకుం బలాయిత మయిన తమస్సు నెల్ల నొక్కుమ్మడిం గెడప నొక్కముద్దయైన జాబిల్లి వెలుల మొత్త మో యనం దేజరిల్లుచున్న దానిని, వీరశ్రీకటాక్షముం బోలె సతాంగగనకాంతి యైన కత్తిని, దెచ్చి రెంటిని వినీతమతి కర్పిం చెను, అతఁడు కత్తిం గేలఁ గొని గుఱ్ఱ మెక్కి ఆమెను కూడ

నెక్కించుకొని గుఱ్ఱము ప్రభావముచే నప్పుడే మానసముం జేరెను. సరస్సు కాలజిహ్వునిమీఁది కనికరముచేత వినీతమతిని రావల దని గాలికిం గదలు తామరచేతులతోను జక్కవ కూఁతలతోను నివారించునదివోలె నుండెను. అచట గంధమాలిని యక్షులవశంబున నుండం గని వానిని విడిపించువాఁడై వినీతమతి యామ్రుక్కడులను కత్తితోఁ గొట్టి తఱిమి వేసెను. దానిం గని సరస్సునడుమ నుండి కాలజిహ్వుఁడు జక్కవనాతి రూపు మాని కాలమేఘమువోలె గర్జించుచు లేచెను. పోరు ఆకసమున కెక్క, కాలజిహ్వుఁడు వినీతమతిపై కెగయ, నతఁడు గుఱ్ఱముతోనే ఎగసి కాలజిహ్వుని జుట్టునం బట్టుకొని కత్తితో తల నఱుక నున్నంతలో, కాలజిహ్వుఁడు దీనముగా జాలి పుట్ట మొఱవెట్టుచు వినీతమతిని శరణుఁ జొచ్చి, విడుపొంది, జేతకు ఈతిబాధలం దొలంచునదైన తనయుంగరమును కానుక యిచ్చి, నమ్రుఁ డయి, గంధమాలిని దాస్యమునుండి విడుదల చేసెను. గంధమాలియు సంతోషాంబుధిం దేలి వినీతమతికి తనకుమారిని విజయవతిని ఇచ్చి యింటికిం బోయెను. అంతట వినీతమతి ఖడ్గాంగుళీయ కాశ్వ కన్యారత్నంబులతో పలపల వేగునప్పటికి ఇల్లు సేరెను. తండ్రి సంతోషించెను. రాజుసయితము వృత్తాంతము విని సంతోషించెను. వినీతమతి యంతట విజయవతిని వివాహ మాడెను.

ఈవడువున నాలుగురత్నంబులతోను సుగుణంబులతోను వర్తిల్లుచున్న కుమారునితో తండ్రి కమలమతి యొకనాఁడు ఏకాంతంబున ని ట్లనియె;—'పుత్రా, ఇట మన యేలిక యుద యతుంగునికి సర్వవిద్యావిశారద కూఁతురు ఉదయవతి కలదు గదా. బ్రాహ్మణుఁడేని క్షత్రియుఁడేని ఆమెను వాదమున నెవఁ డు జయించునో వాని కామె నిచ్చి వివాహము సేయునట్లు తండ్రి శుల్కనియమ మేర్పఱచి యున్నాఁడు. ఆమెచే జగదాశ్చ ర్యకర మయినరూపముచే తెలిగంటి తెలివలుమాత్రము గాక విద్యావాదముచే వాదు లెల్ల నోటువడినారు. నీ వేకవీరుఁడ వయ్యు క్షత్రియకులమందుఁ గల్గినయీవాదము నొప్పరికించి యున్నా వేమి? ఈమెను వాదమున నోడించి వివాహము కమ్ము.' తండ్రి యిట్లు పలుక కుమారుఁడు 'నాయనా, మము బోంట్లకు ప్రకృతి పేశల లయిన స్త్రీలతో వాద మన నెట్టిది? అయినను నీయాజ్ఞను జరిపెదను.' అని యుత్తర మిచ్చెను. అంతట కమలమతి రాజుకడకుం బోయి 'దేవా నా కుమా రుఁడు ఱేపుప్రాతఃకాలమున తమ కొమారితతో వాదము సేయ నున్నాఁడు.' అని విన్నవించెను. రాజు ఒప్పుకొనెను. ఆమాటను తండ్రి వచ్చి వినీతమతికి తెలియఁజేసెను. మఱునాఁడు ప్రాత కాలమున వినీతమతి భాస్వంతుఁడు వచ్చి, రాజహంసాధిష్ఠితమైన విద్వత్సభాకమలినిని అందలి గుణవంతుల కనుదేంట్లు తన్నుఁ జూచుచుండ నలరించెను. మఱుక్షణమున రాజకన్య యుదయ·

మతియు గుణాకృష్టయై కాముని తీవవిల్లువోలె నరుదెంచెను. గుణవంతములై ఆదిలోనే పూర్వపక్షోపన్యాసము సేయునవి వోలె నింపుగా శబ్దించుచున్న తోడవుల చేత నామె వెలుంగు చుండెను. అట్లు వచ్చి మరకతపీఠమునం గూర్చుండిన యామెకు నిర్దోషాంబరంబున నెక్కొన్న నిర్మల చంద్రరేఖ సాటి వచ్చునే మో? అంత నామె పూర్వపక్షము సేయుచు పలువరుస వెలుఁగు దారముల కడుం బ్రియమైన నుడువు మానికముల దండను గ్రుచ్చునదివోలె విరాజిల్లెను. వినీతమతి పదపదంబునను ఆమె వాదమున దోషము సూపి క్షణములో నామెను నిరుత్తరం గావించెను. అంతట సభ్యు లెల్ల వినీతమతిం బొగడుచుండ నామె తనకు పరాజయముచే మంచిభర్త లభించినందున దానిని జయముగానే భావించి సంతసిల్లెను. అంత నుదయతుంగుఁడు వినీతమతికి వాదశుల్కార్జితను తనయను ఇచ్చి వివాహము చేసెను. ఆరాజు అరణ మిచ్చిన రత్నములతో నిండి వినీతమతి యా నాగకన్యా రాజకన్యలతో సుఖ ముండెను.

ఒకనాఁడు వినీతమతి జూదమున ఓడిపోవుచున్న సమయమున బ్రాహ్మణుఁ డొకఁడు వచ్చి భోజనమునకు సామగ్రి యిప్పింపు మని నిర్బంధించెను. వినీతమతి కోపమున బంటు నొకనిం బిలిచి చెవిలో బోధించి ఇసుక నించినపాత్రమును వస్త్రము కప్పి బ్రాహ్మణుని కిప్పించెను. బ్రాహ్మణుఁడు సరళమతి దానిని గ్రహించి బరువుం గని బంగార మున్న దని యెంచి హర్షంబున

నేకాంతమునకుం బోయి తెఱచిచూచి, ఇసుకం గని, 'ఆహా! వానిచే మోసపోయితిని గదా.' యని వగచుచు నింటికిం బోయెను. వినీతమతియు నీవృత్తాంతమును తలపెట్టక జూదము మాని ప్రియాద్వయయుతుఁడై తనయింట యథేచ్ఛముండెను. ఇట్లుండ ఉదయతుంగమహారాజు ముదిమి ముదిరి సంధివిగ్రహములందు పటిమ దప్పి రాజ్యభారమున కక్షముఁడై అపుత్త్రుఁడగుటచే నల్లునికి రాజ్యాభిషేకము చేసి ఆత్మముక్తికై గంగా తీరమునకుం బోయెను. రాజ్యము వచ్చినవెంటనే వినీతమతి అశ్వ ఖడ్గప్రభావంబువలన దశ దిక్కులను జయించెను. అతని రాజ్యము ఆ యాతిథ్యాంగుళీయకము ప్రభావంబున రఘుపతి రాజ్యముం బోలె రోగదుర్భిక్షములు లేక యుండెను.

ఒకనాఁడు వినీతమతికడకు భిక్షు వొకఁడు రత్నచంద్రమతి అనువాఁడు వాదియేనుఁగులసింగము వచ్చి యాతిథ్యము గొని గుణపరాయణుని వినీతమతిని వాదమునకుఁ బిలిచి పందెమివ్విధమున నియమించెను.—'రాజా, నీ వోడుదువేని మదీయమైన బౌద్ధమతము నవలంబింపవలసినది. నే నోడుదు నేని చీవరము మాని బ్రాహ్మణులను శుశ్రూష సేసెద.' ఇందుల కొప్పుకొని రాజు అతనితో ఏడుదినములు వాదించెను. వాదితలబడిత నారాజకన్య నుదయవతిని ఎవఁడు జయించెనో ఆ వినీతమతి యిపు డీ భిక్షువుచేత ఎనిమిదవనాఁడు ఓడిపోయెను. అంత నారాజు ఆభిక్షువునుపదేశంబున సత్త్వోపకారైకపుణ్యాఢ్య మైన

భగవంతుఁ డయిన వరాహబోధిసత్త్వుని చరిత్రమును వినియుండ వేని యిదె వినుము:

### వరాహబోధిసత్త్వుని కథ.

పూర్వము వింధ్యాద్రిగుహలో బుద్ధాంశసంభూత మైన వరాహ మొకటి తనమిత్ర మయిన మర్కటముతోఁ గూడ నివసించి యుండెను. అది ఎల్ల జంతువులకు మేలు సేయుచు తన చెలికానితోఁగూడ అతిథిపూజ సలుపుచు కాలము పుచ్చుచుండెను. ఇట్లుండ నొకప్పుడు అయిదు దినములు ఒక్కటియ ముసురు పట్టి, ఎడతెంపు లేక జడివాన కురియుచుండెను. ఏ ప్రాణియు నిటునటు సంచరింపక యెక్కడి దక్కడనే యడంగి యుండెను. ఐదవనాఁడు ఆవరాహంబును కపియు నిద్రించుచుండఁగా గుహాద్వారమునకు సింహ మొకటి భార్యాపుత్ర సమేత మై వచ్చి భార్యతో 'ప్రియా, ఈఅని యీపెనుముసురునందు ఎక్కడను జంతు వేదియు బయటఁ గానరామిచే ఆఁకట మనము తప్పక చచ్చిపోవుదుము. ఏమి చేయుదము?' అనెను. సింహి యిట్లనియె:— 'మన మందఱము ఆఁకటిచేత చావనున్నారము. కావున మీ రిరువురును నన్ను భక్షించి ప్రాణములం గాపాడుకొనుఁడు. నీవు దొరవు, ఈసుతుఁడు మన సర్వప్రాణములును గదా, నావంటిది నీ కింకొకతె వెంటనే దొరకును, కాన నావలననే మీకు మేలు గల్గును గాక.' దైవవశమున నా సమయమున మేలుకాంచి యావరాహము ఆ సింహ

దంపతుల యీ సంభాషణను విని సంతసించి 'అహో! ఎట్టి భయంకర రాత్రి యిది! ఎట్టి ముసురు! నా కిట్టియతిథులు దొరకినారు! ఏమి నా పుణ్యము! కావున విఘ్న మేమియు కలుగక మున్న క్షణవినాశి యగు నీదేహముతో ఈయతిథులకు సంతర్పణ చేసెదను గాక.' అని సంకల్పించి, లేచి వచ్చి నెయ్యపు మాటల సింహముతో 'కల్యాణుఁడా, దిగు లొందకుము, సపుత్త్రకళత్త్రునకు నీకు ఇదె నేన యోగిరమును. నన్ను ఆరగింపుఁడు.' అని పల్కెను. సింహము సంతసించి భార్యతో 'ప్రేయసీ, ముందుగా మనపుత్త్రుఁడు భుజించును గాక, నే ననంతరము భుజించెదను, నీ వటుతర్వాత భుజింతువు.' అనెను. సింహి వల్లె యన సింగపుఁగొదమ ముందుగా నాపందిమాంసమును భక్షించెను. అనంతరము సింహము తినసాఁగెను. అది తినుచుండ మహాసత్త్వము ఆపంది 'మిత్త్రా, ఈ నానెత్తుటిని నేల నింకకముందే త్వరగా త్రావుము, నామాంసమును తనివి తీఱఁ దినుము. మిగత నీభార్య తినుఁగాక.' అని పలుకుచు క్రమముగా సింగంబుచేత నెమ్ములుమాత్రము మిగుల భక్షిత మాయెను. అట్లయ్యును ధీర మయిన యాపంది సత్త్వవంతము తనధీరతకు తుది యెక్కడనో కని పట్టనో యన నిలిచియున్న ప్రాణములం బాయ దాయెను. ఈ లోపల ఆఁకటి పెల్లున సింహి గతాసు వయినది. అంతట సింహము పిల్లతోఁ గూడ నెటకో పోయినది. రాత్రియు తెల్లవాఱినది. అప్పుడు పంగి చెలికాఁడు కోఁతి మే

ల్కోఁని ఆయవస్థ నున్న పందిం గాంచి దిగు లొంది 'మిత్త్రమా, ఎవరు నీ కిట్టియవస్థం గలిగించిరి ? ఓపిక కలదేని చెప్పుము.' అని యడిగెను. సూకరము ధీరతతో జరిగిన వృత్తాంతముం జెప్పెను. అంతట కోఁతి యేడ్చుచు పందిపాదములం దెళ్లి 'మిత్త్రమా, నీ వెవరవో దేవాంశసంభూతుఁడవు. ఈసుకృతము చేత నీతిర్యక్త్వమును పో నడిచితివి. నీకు కోరిక యేదేని యున్నం జెప్పుము సాధించెద.' అనియెను. వరాహ మనియె : 'మిత్త్రమా, నా కొకకోరిక కలదుగాని, దానిని బ్రహ్మయు తీర్పఁజాలఁడు. నేను కన్నులార చూచుచుండఁగా, పాపము! ఈసింహి ఆఁకటం గుప్పగూలి మడిసినది. నాకు మరల మను పటిదేహము వచ్చి యీమె బ్రతికి నన్ను భుజించి తృప్తి నొందుం గాక యని నాకోరిక' ఇట్లు పలుకుచున్న యాయొంటి గానికి ధర్మదేవుఁడు ప్రత్యక్షమై చేతితో ఒడలిం దాఁకి దానిని దివ్యమంగళ విగ్రహుని ఒక మునీంద్రునిం గావించెను. 'పుత్త్రా, ఒరులకొఱకే తా నని నడికట్టిన నిన్ను జయింపఁ గోరి, ఈ మాయను సింహాదిరూపమున నేనే సృజించితిని. పరులకై ప్రాణమిచ్చిన యఖండసత్త్వుఁడవు, నీవే నన్ను జయించి యిట్లు మునీంద్రుఁడ వైతివి !' అని ధర్మదేవత ఆ మునీంద్రునితో నుడివెను. అంత నాతఁడు మ్రోల నున్న ధర్ముం గని 'స్వామీ, నా చెలికాఁడు ఈకోఁతి ఈతీరున తిర్యక్త్వమునంది యుండఁగా ఈమునీంద్రతయు నాకు ప్రియముగాదు.' అనెను. ధర్ముఁ డంతట

నాకోఁతిం గూడ మునీంద్రునిం గావించెదను. మహాత్ముల సాంగత్యము నిశ్చయముగా మహాఫలమునకుఁ గదా! అంత ధర్ముఁడు అంతర్ధాన మాయెను. సింహీక ళేబరంబును మాయ మాయెను.

## వినీతమతి బోధిసత్త్వచర్య.

ఇట్లు భిక్షువు పలుకఁగా, దానవీరుఁ డా వినీతమతి భూపతి రాత్రి మరల స్వప్నమాణవకుని చేసి కల గని మఱునాఁడు గురువుతో నిట్లు వక్కాణించెను:— 'ఆచార్యా, కలలో ఈమాఱు నన్నెవరో దివ్యముని 'పుత్త్రా, నీపాపము తీఱినది. ఇంక నీవు బోధిసత్త్వచర్యను అవలంబింపుము.' అని బోధించెను. అంతట మేలుకాంచితిని. మనస్సు ఊఱడిల్లినది.' ఇట్లు గురువునకు నివేదించి వినీతమతి శుభదినంబున గుర్వనుజ్ఞచే నామహాచర్యం గైకొనెను. అర్థులకు అవ్వారిగా కోరిన యర్థములు వర్షించుచుండెను. ఇతని ధనంబును అక్షయ మగు చుండెను. సంపదలు ధర్మమూలములు గదా. ఇట్లుండఁగా బ్రాహ్మణుఁడొకఁడు యాచకుఁడు వచ్చి వినీతమతితో నిట్లు విన్నవించెను. 'మహారాజా, నేను పాటలీపురము వాఁడను, బ్రాహ్మణుఁడను. ఒక బ్రహ్మరక్షస్సు నాయగ్నిశాల నాక్రమించి నాకుమారునిఁ గూడ అపహరించినది, ఇందులకు ప్రతీకారము ఏ యుపాయమునను నావలనఁ గా దాయెను. కాన అర్థికల్పమహీజంబును నిన్ను యాచింప వచ్చితిని. నా సేమముకై సర్వదోష హారమును నీ యాయుంగరమును నా కిమ్ము.' అంతట రాజు డీలు పడక

యతనికి ఆ కాలజిహ్వుని యుంగరము నిచ్చివేసెను. బ్రాహ్మణుఁడును దానిం గొనిపోయెను. వినీతమతిబోధిసత్త్వవ్రతయశస్సు సకల దిగంతములకు వ్యాపించుచుండెను. అనంతరము ఒకప్పుడు ఉత్తరదేశమునుండి ఇందుకలశుఁ డను రాజకుమారుఁడు అతిథిగా వినీతమతి కడకు వచ్చెను. ఇతఁడును అతనిని ఉత్తమకులమువానిం గా నెఱింగి సత్కరించి వచ్చిన కార్యమడిగెను. అతఁ డి ట్లనియె:—'దేవా, నీవు యాచకకోటికి భూలోకచింతామణి అని ప్రఖ్యాతుఁడవు. అర్థి నీప్రాణముల నడిగినను నీవలన తనియకపోఁడు. కనకకలశుఁడు నాతమ్ముఁడు నాపై దాడివచ్చి నాతండ్రిదైననారాజ్యమునుండి నన్ను వెడల నడచినాఁడు, కావున నేను నీకడకు అర్థినై వచ్చితిని. వీరవర, నీ యాఖడ్గాశ్వములను నా కిమ్ము. వాని ప్రభావంబున నేను నా దాయాదుని జయించి రాజ్య మొందెదను.' ఆ వేఁడికోలు విని వినీతమతి వెంటనే రాజ్యసర్వస్వము లయినను ఆ ఖడ్గాశ్వములను ఆ రాజపుత్త్రుని కిచ్చివేసెను. మంత్రులు తలలు వాంచి ఉస్సురని నిట్టూర్పులు నిగిడించుచున్నను మఱి మనస్సున ఇంచుకేనియు వికల్ప మూనఁడాయెను. ఇందుకలశుఁడు వానిం గొనిపోయి వాని ప్రభావంబున దాయాదుని పాఱఁద్రోలి రాజ్య మొందెను. అంతట రాజ్యము కోలుపోయిన తద్భ్రాత కనకకలశుఁడు వినీతమతిభూపాలునినగరమునకు వచ్చి, యట దుఃఖాతిరేకంబున చిచ్చునం బడ సమకట్టెను. ఆవృత్తాంతము తెలిసి

వినీతమతి భూపతి తనమంత్రులతో ని ట్లనియె;—'అయ్యో ! పాపము ! ఈసాధువు నాతప్పున నీదశకు వచ్చినాఁడు. కాన నారాజ్య మితని కిచ్చి యీతప్పు దిద్దుకొనియెదను. ఒరుల కుపయోగపడని యీ రాజ్యము నా కేల ? సంతతి లేనినాకు ఇతఁడే పుత్త్రుఁ డై రాజ్యభారము వహించును గాక' ఇట్లు పలికి, వారు ఒప్పకున్నను అతనిని రప్పించి, యతనికి నిజరాజ్య మిచ్చి నిర్వికల్ప చిత్తముతో తత్క్షణమే భార్యలం దోడ్కొని నగరము వెలువడెను. 'అయ్యయ్యో, అమృతకరుఁడు సంపూర్ణుఁ డై లోకము నానందింపం దొడంగెనో లేదో, అకాండ మేఘము వచ్చి మఱుఁగుపఱిచివేసినది! ప్రజాకల్పవృక్ష మీరాజు సకలప్రాణులకును సకలాశాపూరణము సేయందొడంగెనో లేదో విధి యితని నెటకో కొనిపోయెను.' ఇట్లు పలువగల వందురుచు పురజనులు ఇండ్లు విడిచి అతనిదే లోక మని వెంబడించిరి. ఎట్టకేలకు వారిని మరల్చి పట్టు వదలక వినీతమతి మహారాజు కాలినడకనే భార్యలతోఁగూడ కాన కేఁగెను. పోయి పోయి నీళ్లు చెట్లును లేక ఎండకు కాలినయిసుకయెడారిని ఇతని ధైర్యమును పరిశోధింప విధి సృజించినదానిని చేరెను. అందొక చోట దప్పి గొని దూరపుంబయనముచే నలసి కూర్చుండు నంతట భార్యలకును నతనికిని నిద్ర పట్టెను. అతఁడు మేలుకాంచి చూచునంతటికి తన సత్త్వోత్కర్షచే నుప్పతిల్లిన గొప్ప యుద్యానవన మొకటి కాన వచ్చెను. అందు విరిదామరలు చల్లని

తేట నీళ్లను గల బావులును, ఎల్లెడల దట్టంపునల్లనిపచ్చికయు, పండ్లబరువునకు వంగిన చెట్లును, నీడలలో నున్నట్టి గొప్ప రాతిన్నెలును, గలిగి ఆ యుద్యానము దానప్రభావముచే స్వర్గము నుండి యాకర్షింపఁబడిన నందనవనమో యన నొప్పుచుండెను. 'ఇదేమి! కలయో మతిభ్రమయో, ఒండె, నామీఁద వేల్పుల యనుగ్రహమో?' అని దానిం గాంచి యారాజు వింత పడుచున్నంతట నట నాకాశమార్గమున అంచవంపతులై సంచరించుచున్న సిద్ధదంపతు లిట్లు నింగినుండి పల్కిరి: 'రాజా, నీసత్త్వంపు మహిమకు నీకే యేల యింతవింత? కావున, ఎల్లప్పుడు పూవులుఁ గాయలుం గలిగి విరాజిల్లు నీ యుద్యానమందు యథేచ్ఛము నివసింపుము.' ఈ సిద్ధవాక్యము విని రాజు శంక యొడలి ఆకానలో భార్యలతోఁగూడ తపస్సు చేయుచు నివసించెను. ఒకనాఁడు వినీతమతి రాచట్టుపై కూర్చుండి సమీపమున నొకపురుషుని ఉరిఁబోసికొని ప్రాణము వదలఁబోవుచున్న వానిం గని వడివడిగా నతనికడ కేఁగి చావు మాన్పి యతని నాయుద్యమమునకుం గారణ మడిగెను. అతఁడి ట్లారంభించెను.

“అయ్యా, నావృత్తాంతమును ఆమూలము వినుము. నేను నాగశూరుని తనయుఁడను, నాపేరు సోమశూరుఁడు. నేను పుట్టినప్పుడే జ్యోతిషికులు దొంగ నగుదు నని చెప్పిరి. దానం జేసి తర్వాత నాకు మాతండ్రి ధర్మశాస్త్రమును కడుం బట్టుతో

చెప్పించెను. దానిని నేర్చియు నేను దుష్టసహవాసమున దొం
గనే అయితిని. పురాకృతకర్మను మార్చుట కెవ్వరితరము !
ఒకనాఁడు నన్ను దొంగలనడుమం బట్టికొని యారెకులు
గొఱుత వేయ వధ్యస్థానమునకుం గొనిపోయిరి. ఆసమయమున
తేనియేనుఁగు మద మెక్కి కట్టుఁగంబముం దునియలు సేసి జం
తులం జంపుచు నాతావునకు వచ్చెను. ఆ గందరగోళములో
తలవరులు నన్ను వదలి తమప్రాణములు దక్కించుకొనం బలా
యితు లయిరి. నేను ఆయల్లరిలో అటనుండి తప్పించుకొని
పలాయన మైతిని. నన్నుం గొఱుతవేయ గొనిపోయి రన్నమాట
విని యాదుఃఖమున నాతండ్రి ప్రాణములు విడిచెను, అమ్మ
సహగమనము చేసెను. ఆవృత్తాంతము విని నేను దుఃఖభారము
నోర్వఁజాలక తిరిగితిరిగి ప్రాణములు త్యజింప నీ నిర్జనవనమునకు
వచ్చితిని. ఇటఁ జేరినమాత్రాన నా కొకదివ్యాంగన దర్శన మిచ్చి
యోదార్చి 'పుత్రా, ఏల సాహసము చేసెదవు ? నీవు వినీత
మతిరాజర్షి తపోవనమునకు వచ్చితివి. దాన నీపాపము తీఱి
పోయినది. ఆయనవలన నీకు జ్ఞానోపదేశము కలుగును.' అని
బోధించి యదృశ్యురా లాయెను. నేను ఆరాజర్షిని వెదకియుఁ
గానక దుఃఖితుఁడ నై ప్రాణత్యాగమునకుం గడఁగితిని." ఇట్లు
పల్కిన సోమశూరుని వినీతమతి మహారాజు తనపర్ణశాలకుం
గొనిపోయి, తన్నుఁ దెలిపి, యతని కాతిథ్య మొసఁగి, యి ట్ల

నియో:—వత్సా, అజ్ఞానమును వదలవలసినది. విపరీతబుద్ధులను అది యిహపరముల భంగపెట్టును.

## బ్రాహ్మణ రజక కథ.

పాంచాలదేశంబున దేవభూతి యని బ్రాహ్మణుఁ డుండెను, ఆయనభార్య భోగవతి, ఆయన వేదవిదుఁడు, భార్య పతివ్రత. ఆయన స్నానమునకు పోయియుండఁగా, గాడిద యొకటి తమతోఁటకూరమడి మేయుచుండఁగా, ఆమె దుడ్డుఁగఱ్ఱ చేతఁగొని దానిం దఱుమఁ బోయెను. అది తప్పించుకొని పరుగెత్తిపోవుచు దారిలో గోతిలోఁబడి గొరిజ పగులఁ గొట్టుకొనెను. దానిం గని దానిదొర చాకలి కోపమున వచ్చి యా బ్రాహ్మణిని దుడ్డుఁగఱ్ఱతో కొట్టి కాళ్లం దన్నెను. దాన నామెకు అకాలమున గర్భపాత మాయెను. గాడిదను తోలుకొని చాకలి యింటికిం బోయెను. స్నాతుఁడై వచ్చి దేవభూతి ఆమెయవస్థం గాంచి వృత్తాంత మడిగి తెలిసికొని దుఃఖితుఁడై బలాసురుఁడను పేరి గ్రామాధికరణకునికడ నభియోగము చేసెను. అతఁడు తత్క్షణము చాకలిని రప్పించి విచారించి యిట్లు తీర్పు చేసెను. ‘ గాడిదకు గొరిజ కుదురువఱకు ఈ బ్రాహ్మణుఁడు దాని మూటలు మోయవలసినది. చాకలి బ్రాహ్మణికి అట్లే గర్భమిం కొకటి చేయవలసినది. ఇది యిరువురకును దండన.’ అని అధికరణకుఁడు నిర్ణయింపఁగా, బ్రాహ్మణుఁడు సంతాప మొంది, తానును భార్యయు విషము గ్రోలి కాలధర్మము నొందెను,

ఆవార్త విని తేఁడు దురవధారకునికి ఆయధికరణకునికి ఉరిదండన సేయించెను. ఇట్లు అజ్ఞానాంధకారము గ్రమ్మినవారు తమదోష ములచే తప్పుదారులం బడి సచ్ఛాస్త్రదీపములం గైకొనక నిక్కంబుగా నశింతురు. ఇట్లు చెప్పి వినీతమతి మరల ఉపదే శార్థికి సోమశూరునికి ఇట్లు నుడివెను.

## దానపారమిత.

బాలకా, నీకు పారమితల స్వరూపమును వరుసగా వర్ణిం చెదను వినుము. పూర్వము కురుక్షేత్రములో మలయప్రభుఁ డని రా జుండెను. ఒకప్పుడు కఱవులో ప్రజలకు ధనము లిచ్చు చున్న యారాజును మంత్రులు వలదని వారించిరి. అంత నతని కుమారుఁడు ఇందుప్రభుఁడు తండ్రితో 'నాయనా, ఏమి! చెడు మంత్రులమాట విని ప్రజల నుపేక్షించెదవు ? నీవు ప్రజలకు కల్పవృక్షమవును, వారు నీకు కామధేనువులుం గదా.' అని బల వంతపెట్టసాగెను. అంత నతనితో మంత్రివశుఁడై యా రాజు విసుగుతో, 'పుత్రా, నా కేమి యక్షయధనమా ? ధనము లేకయే నేను ప్రజాకల్పద్రుమమును కాఁగలనేని, అది లేక నీవే వారికి కల్పవృక్షమవు కమ్ము' అనెను. అంతట మహాసత్త్వుఁడు కుమారుఁడు 'నాయనా, తపస్సు చేసి కల్పవృక్షమ నయ్యెద, కానేని ప్రాణము వదలెద.' అని ప్రతిజ్ఞ చేసి తపోవనమునకుం బోయెను. ఇతఁడు తపస్సారంభించినంతమాత్రన కఱవు తీఱెను. ఇతనితీవ్రసంవేగమునకు మెచ్చి మహేంద్రుఁడువచ్చి వర మడుగు

మనెను. తన నగరముననే తాను కల్పవృక్షమై యుండున ట్లితఁడు వర మడిగెను. అట్లే అయి, నిడుపులైన శాఖాబాహువులతో దవ్వున నున్న యర్థులను చేరఁ దివియునదియుంబోలె, పక్షులకూఁతలచే పిలుచునదియుం బోలె, నొప్పొంది, అర్థివ్రాతమునకు కోరినకోరికల నెల్ల అశక్యములం గూడ తీర్చుచు, ప్రజలను స్వర్గనివాసులంబోలె తనిసినవారిం గావించెను. కొంతకాలమునకు మహేంద్రుఁడు వచ్చి యతనిని ఆసగొల్పుచు 'వత్సా, నీపరోపకార వ్రతము పూర్ణ మయినది. ఇఁక రమ్ము స్వర్గమునకు' అని పిలిచెను. కల్పద్రుమమై యున్న రాకొమరుఁ డనియె:- 'దేవా, ఎచట ఈలాఁటి మ్రాఁకులు సయితము చక్కని పువ్వులతోను పండ్లతోను సర్వదా స్వార్థము గోరక పరోపకారమే సేయుచున్నవో, అచట నేను కల్పవృక్షమనై యుండి ఇపు డెట్లు ఆత్మసుఖముకై యిందఱయాశల భంగపఱిచి స్వర్గమునకు వత్తును?' అతని యీ యౌదార్యవచనములకు నలరి ఇంద్రుఁడు వెండియు 'బాలకా, అటయిన నీప్రజ యెల్ల నీతోఁగూడ స్వర్గమునకు రావచ్చును.' అనియెను. రాజకుమారుఁడు అప్పటికిని కల్పద్రుమముగనే యుండి 'దేవా, తుష్టుఁడవేని ప్రజను స్వర్గమునకుం గొనిపొమ్ము. దానితో నాకుం బనిలేదు. నేను పరోపకారసిద్ధికై గొప్పతపస్సు చేసెదను.' అని పల్కెను. అంతట నింద్రుఁ డతనిని 'నీవు బుద్ధాంశసంభూతుఁడవు.' అని స్తుతించి యతనిప్రజలం గొని స్వర్గమున కేఁగెను, అంతట రాజపుత్త్రుఁడు

చెట్టురూపము మాని నిజరూపము దాల్చి, వనమందే తపంబులు సల్పి భోధిసత్త్వుఁ డాయెను. ఈవిధమున దానవీరులకు సిద్ధి కలుగును. దానపారమితను చెప్పితిని గదా, ఇఁకను శీలపారమితం జెప్పెద, వినుము.

### శీలపారమిత.

పూర్వము వింధ్యాద్రిలో సుగతాంశసంజాతుఁడు పూర్వజన్మమున శీలమును చక్కఁగాపాటించినవాఁడు జితేంద్రియుఁడు హేమప్రభుఁ డని చిలుకరా జుండెను. అతఁడు పూర్వజన్మజ్ఞానము కలవాఁడై ధర్మము నుపదేశించినను ప్రతీహారుఁడు చారుమతి యను చిలుక రాగమగ్నుఁడు మూర్ఖుఁడుగా నుండెను. ఒకనాఁడు ప్రతీహారశుకముభార్యను వేఁటకాఁ డొకఁడు వల పన్ని పట్టి చంపివేసెను. అంతట ప్రతీహారశుకము విరాళిచే దుఃఖంబున మునింగి పడరాని పాట్లు పడుచుండెను. అంతట శుకరాజు హేమప్రభము యుక్తిగా దానిశోకముం దీర్పనదియై మతివిభవముచే కల్పించి యీబొంకు బొంకెను. 'నీ భార్య పిట్ట వేఁటకానియురులం దవిలి చావ లేదు. అది బ్రతికియే యున్నది, తప్పించుకొనిపోయినది. నేను చూచితిని. నాతో రా, దానిం జూపెదను.' ఇట్లు చెప్పి హేమప్రభము చారుమతిని తోడ్కొని నింగిదారిని ఒక తటాకమునకుం బోయి అందు వాఁకిటికావలి చిలుకకు నీటిలో దాని ప్రతిబింబమునే చూపి, 'ఇదిగో నీభార్య చూడుము.' అనెను. ఆమూఢమతి తన ప్రతిబిం

బము గాంచి తనయిల్లాలిఁగా నెంచి సంతసించి నీటం బ్రవేశించి దానిని కవుంగిలించి ముద్దుగొనియు, ప్రియాస్పర్శమును లేక దానివలన బదులుమాటయు రాక, 'ఏమి యిది! ప్రియ ఇపుడు స్పర్శాలాపములు నాకొసంగదు!' అని తలపోసి, అలుకయో యని సంశయించి, వెంటనే పోయి యుసిరికపండుం గొని వచ్చి బుజ్జనముకై తన ప్రతిబింబమునే చెలి యను భ్రమచే పడవైచెను. ఆపండు మునిఁగి తేలఁగా తనచెలి విసరిపాఱవేసిన దని తలంచి దౌవారికశుకము పోయి రాజుతో 'దేవా, ఆభార్య యిపుడు తాఁకనుం దాఁకదు, మాటయు బదులుపల్కదు. నే నొసంగిన యుసిరికపండు సయితము నాపైనే విసరి పాఱవేసినది.' అని చెప్పుకొనెను. రాజు ఇచ్చ లేమి నభినయించుచు ఎట్టకేలకు 'మిత్రా, ఇది చెప్పఁదగినవిషయముగాదు, అయినను నీమీఁది యనురాగముచే చెప్పెదను. ఇపు డది యింకొకని తగులొకని యున్నది, నీయందు ఎట్లు వలపు గొనును ? రారమ్ము, నీకే ప్రత్యక్షముగాఁ జూపెదను.' అని చెప్పి దాని నాచెలువునకే గొనిపోయి నీటం దమ రెంటి ప్రతిబింబములను ఒండొంటి నొర యుచుండునట్లుగాఁ గానిపించెను. రెంటిం గాంచి యీమూఢ మతి తనభార్య యిపుడు అన్యసంగతయైన దని నిశ్చయించుకొని దానిని రోసి విరక్తి వొంది, రాజుతో 'దేవా, నేను మూఢుఁ డనై నీ ధర్మోపదేశమును వినని ఫల మిది యనుభవించితిని. కాన నిపుడు చేయవలసినది ఉపదేశింపుము,' ఇట్లని విన్నవించు

కొనెను. అంతట రాచచిలుక హేమప్రభము, ఇదియ అవసరము గదా యుపదేశమునకు, అని యెంచి ప్రతీహారశుకముతో నిట్లనియె:— 'కాలకూట మైనం ద్రావవచ్చును, నల్లత్రాచు నేని మెడం గట్టుకొనవచ్చును, స్త్రీలయందు మాత్రము నమ్మక ముంపరాదు, మణిమంత్రౌషధములచే నైనం గలుగదు; పెను గాలి వోలె అతిచంచలలు స్త్రీలు, భూరిరజోభరలు, మంచి మార్గమునం బోవువారిని తప్పం ద్రోచి మలీమసులం జేయు దురు. కావున ధీరమతులు బుద్ధిమంతులు వారియందు సక్తి నుంపరు. వైరాగ్యపదవిం కై శీల మభ్యసించుచుండవలయును.' ఇట్లు రాజు ఉపదేశింపంగా వాంకిటిచిలుక చెలువల కూటమిని రోసి యూర్ధ్వరేతస్కుఁడై చిరము తపం బొనర్చి క్రమముగా బుద్ధసమ మాయెను. శీలాఢ్యు లిట్లు తాము తరించుటమాత్రము గాక యొరులంగూడ తరింపఁ జేయుదురు. శీలపారమితను వర్ణించితిని గదా, క్షమాపారమితం జెప్పెదను వినుము.

## క్షమాపారమిత.

కేదారాద్రియందు శుభనయుం డనుమహాముని సదా మందాకినీతోయస్నాయి దాంతుండు తపఃకృశుఁ డుండెను. ఒకరాత్రి దొంగలు అతం డిపుడున్న తావున పూర్వము తాము పాంతిపెట్టిన బంగారమును వెదక వచ్చిరి, ఎంత వెదకియుం గానరైరి. పోయి యేకాంతమున ఒకరితో నొకరు ఆలోచించు కొని, ఆముని దానిని హరించి యుండు నని తలంచి, వచ్చి

మఠము చొచ్చి ఆయనతో 'ఓరీ, దొంగమునీ, నేలనుండి త్రవ్వి హరించిన మాబంగారమును ఇచ్చివేయుము. బళీ, నీవు దొంగలకుకు దొంగవు సంభవించితివి.' అని యాపాపులు లేని దోషము మోపి బెదరింపఁగా, ముని 'నేను దానిని గైకొనలేదు, నేను దానిని చూడనే లేదు.' అని ప్రత్యుత్తరము చెప్పెను. అంత నాదొంగలు దుడ్డుఁగఱ్ఱలతో నతనిం గొట్టిరి. అప్పటికిని సత్యసంధుఁ డామునీంద్రుఁడు మునుపటి యట్లే పలికెను. అంతం దస్కరులు 'వీఁడు మిగుల గడుసువాఁడు' అని వరుసగా నతనిచేతులను కాళ్లనుం గొట్టివేసి తర్వాత కన్నులు పెఱికివేసిరి. అప్పటికిని ఆమాటయే పలుకుచు నాతఁడు నిర్వికారుఁడగుచు యుంటం గని దొంగలు తమపసిఁడిని మఱియొవరో హరించియుందు రని తలఁచి అతనిని వదలివేసి వచ్చినట్లే పోయిరి. మఱునాఁడు శేఖరజ్యోతి యని రాజకుమారుఁడు ఆమునికి శిష్యుఁడు మునిం గనవచ్చి ఆయవస్థలో నున్నయతనిం గాంచి తద్దయు దుఃఖించి కతమడిగి తెలిసికొని వెదకించి యాదొంగలను తెప్పించి వారిని సంహరింప నుండఁగా, మహాముని యిట్లనియె:— 'రాజా, వీరిని నీవు చంపుదువేని నన్ను నేన చంపికొనియెద. ఈయవస్థ నాకు కర్త్రి చేసినదేని, ఇందు వారి తప్పేమున్నది ? వారు దానికి ప్రేరకు లందువేని, వారికి కోపము ప్రేరకము, ఆకోపమునకు, స్వర్ణనాశము ప్రేరకము, దానికి కారణము నాపురాకృతపాపము, దానికి నాయజ్ఞానము

కారణము, కావున నాయజ్ఞానమే నాకు ఇవ్విషయమున నపకారి, కావున దానినే సంహరింపవలయును. అటుగాక వీరు అపకారు లని వధ్యు లగుదురేని ఉపకారు లని ఏల రక్షణీయులు గారు? వీరు నాకీపాటు సేయరేని మోక్షదాయియగు నోర్పును నే నెట్లు ఎవరివిషయమైయె పూనుదును ? కావున వీరు నాకు సంపూర్ణముగా నుపకార మొనర్చినారు.' ఇత్యాది బహువాక్యములచే క్షమాపరుఁ డామహాముని శేఖరజ్యోతిని శిష్యుని బోధించి దొంగలకు శిక్షను తప్పించెను. అంత నతనికి క్షమా తపోమాహాత్మ్యంబున దేహము ఎప్పటియట్ల అక్షతమై సిద్ధులు కూడ ఆవిర్భవించినవి. ఈతీరున క్షమావంతులు సంసారమును దాఁటుదురు. కావున క్షమాపారమితను వర్ణించితిని. ఇఁక ధైర్యపారమితను వినుము.

## ధైర్యపారమిత.

పూర్వము మాలాధరుఁ డని బ్రాహ్మణకుమారుఁ డొకఁ డుండెను. అతఁ డొకనాఁడు ఆకాశమునం బోవుచున్న సిద్ధకుమారు నొకనిం గని అతనితో పోటికి గడ్డితో రెక్కలు చేసి కట్టుకొని పైకి ఎగసియెగసి గమనాభ్యాసము చేయుచుండెను. ప్రతిదినముం గుమారస్వామి పోవుచుం గని 'పాపము ! ఈబాలుఁడు ధైర్యశాలి, పొంద రాని విషయమందుఁ గూడ కష్టపడుచు జతనము విడకున్నాఁడు. కావున వీఁడు కనికరింపఁదగినవాఁడు. వీనిని నేను నా వానిఁగాఁ గైకొనియెద.' అని తలపోసి,

తనశక్తిచే తనతోఁగూడం గొనిపోయి యావిప్రకుమారుని తన యనుచరుంగాఁ జేసికొనెను. అట్లు దేవతలుసయితము ధీరతకు మెత్తురు. ధైర్యపారమితను చెప్పితినిగదా, ధ్యానపారమితను వినుము.

## ధ్యానపారమిత.

కర్ణాటదేశములో విజయమాలి యని మహాధనుఁడు వణిజుఁ డుండెను. అతనికి మలయమాలి యని కుమారుఁ డుండెను. ఒకనాఁ డాకుమారుఁడు తండ్రితోఁగూడ రాచనగరికిం బోయి యట నిందుకేసరిభూపాలుని తనయను ఇందుయశ యను దానిం గనియెను. ఆ కన్య అగపడినమాత్రాన మదనుని యీఁటెవోలె నతనియెదం గ్రుచ్చుకొని మోహాముం గలిగించెను. అంత నతఁ డింటికి వచ్చి రాత్రులు నిద్ర మాని తెల్లఁబాఱి పగలు ఎటనో సంకుచితుఁడై కలువనోము నోచుచుండెను. ఆమెనే సర్వదా ధ్యానించుచు భోజనాదివ్యాపారములు మానినవాఁడై తనజనులు పల్కరించినప్పుడు మూఁగవలె నేమియు బదులాడక ఉండెను. ఇట్లు విరాళిం గుందుచున్న యాతనిని ఏకతంబున నాప్తమిత్త్రుఁడు మంథరకుఁ డనురాజు చిత్రకరుఁడు 'మిత్త్రమా, ఏమి యిది! నీవు గోడ నంటుకొని రూపైకసారుఁడవై ఆశ్వాసము లేక కనక వినక చిత్తరువువోలె నున్నావు!? అని సనిర్బంధముగా నడిగెను. అంతట వైశ్యకుమారుఁడు మిత్త్రునితో తన వృత్తాంతముం జెప్పెను. అంత

నామిత్రుఁడు 'వణిక్కుమారునికి నీకు రాజకన్యపై యీవలపు తగదు. హంస యితరసరస్సుల తామరలందు సుఖంబుండఁ గోర నగును గాని శ్రీహరినాభికమలభోగము నభిలషింపం దగు నా?' అని యతని నానావిధముల బోధించియు మరల్ప వలంతి గాక, యతనికి ఉత్కంఠావినోదనార్థము ఆరాజకన్యకను పటం బున వ్రాసి యిచ్చెను. అంతట మలయమాలి యాచిత్తరు వునే వాస్తవ మయిన యిందుయశనుగా భావించి, దానిని చూచుచు బతిమాలుచు తాఁకుచు అలంకరించుచు, క్రమముగా తన్మయత్వము పొంది, ఆవాస్తవభావనచేతనే సకలక్రియలు జరుపుకొనుచు నుండెను. భావనాబలముచేత క్రమముగా నాచి త్తరువు తనతో నరససల్లాపము లాడువట్లును, తన్ను ముద్దుఁగొనుచున్నట్లును తలంచి, భావనాసిద్ధ మైన కాంతాసంభోగ మున తృప్తుఁడై, చిత్రపటమాత్రమునందే సకలసంసార వ్యాపార ములను నెఱవేర్చుకొనుచుండెను. ఒకనాఁడు రాత్రి నెల పొడువఁగా ఆచిత్రపటమును కైకొని ప్రియతోఁ గలసి విహ రించుటకై యుద్యానవనమునకుం బోయెను. అట నొక మ్రాని మొదట నాచిత్రపటము నుంచి తాను ప్రియకై పువ్వులు దేర కొంత దవ్వేఁగెను.

ఆ సమయమునందు వినయజ్యోతి యనుమహాముని యొకఁడు ఆకాశమార్గమునం బోవుచు నతనిం గని, కనికరించి, యజ్ఞానమునుండి యుద్ధరింప నుద్యుక్తుఁడై, క్రిందికి దిగి వచ్చి,

యాచిత్రపటమున తన ప్రభావముచేత సజీవ మయిన యొక పామును వ్రాసి, తాను అగపడక యుండెను. ఇంతలో మలయమాలి పూవులు కోసితెచ్చి పటములో పామును గని 'ఇదేమి? ఎక్కడిది ఈపాము? దీనిని రూపనిధాన మయిన యీసుందరీ మణిని కాపాడుటకై బ్రహ్మ నిర్మించినాఁడు గావలయు.' అని తలంచి పూవులతో పటమంతలి ప్రియను అలంకరించి కవుంగిటం బొదువునంతట మునిమహిమచే నామె ఆపాము కఱచి మృతిఁ జెందినది గా నతనికిం దోఁచెను. అంతట మలయమాలి చిత్రపటమును మఱచి హాహాకార మొనర్చి మూర్ఛిల్లి పట సంసిద్ధవిద్యాధరుఁడు వాలె నేలంగూలెను. క్షణములో మరల తెలివి గలిగి ఏడ్చుచు ప్రాణత్యాగము సేయ నిశ్చయించుకొని యొకచెట్టుతుద కెక్కి యటనుండి క్రిందికిఁ బడెను. అంతట ముని బయలుపడి యతనిని నేలఁబడనీయక యంతరాళమంద తనచేతులతోఁ బట్టుకొని నిలిపి యోదార్చి యిట్లనియె:—ఓయి మూఢుఁడా, నీవు వలచిన యా రాజకుమారి తనమందిరమున స్వస్థముగా నుండుట నెఱుంగవా? ఇది చిత్తరువులో నిర్జీవ ప్రతిమ. నీ వెవతెను గవుంగలించుకొనుచున్నావు? ఎవతెను పాము కఱచినది? ఇది యెల్ల రాగాంధుఁడ వయిన నీభావనవలని భ్రమ గాదా. ఇట్టి దృఢధ్యానముతో తత్త్వజ్ఞాన మేల సాధింపరాదు? మఱి యిట్టిదుఃఖము లెన్నఁడును కలుగవు గదా.' ఇట్లు ముని వలుకఁగా మలయమాలి అజ్ఞాన మను రాత్రి

క్షయించి మేలుకొన్నవాఁడై మునిపాదముల వ్రాలి 'స్వామీ, మీయనుగ్రహంబున నిప్పటి కీయాపదను దప్పించుకొంటిని. సంసారము నెట్లు తరింతునో అట్లు నాయం దనుగ్రహింపుఁడు.' అని వేఁడెను. అంతట బోధిసత్త్వుఁ డామౌని మలయమాలికి తనవిజ్ఞానము నుపదేశించి యంతర్హితుఁ డాయెను. అనంతరము మలయమాలి వనమున కేఁగి తపంబు సల్పి హేతుహేయోపాదేయములతోఁ గూడ తత్త్వముఁ నెఱింగి అర్హత్త్వముఁ బొందెను. అనంతరము వచ్చి కనికరముచే ఆయిందుకేసరిమహారాజును జ్ఞానోపదేశముచేత పౌరజనసమేతుని మోక్షసామ్రాజ్య మొందించెను. ఈతీరున లేనిదియుం గూడ దృఢధ్యానులకు సత్యమ యగును. ధ్యానపారమిత యైనది గదా, ఇఁక ప్రజ్ఞాపారమితం జెప్పెద వినుము.

## ప్రజ్ఞాపారమిత.

పూర్వము సింహళద్వీపములో సింహవిక్రముఁ డని దొంగ యొకఁ డుండెను. వాఁడు పుట్టువు మొదలు ఎల్లవారి ధనములను హరించి వానిచేత దేహపోషణము చేసికొనుచుండెను. ముదిమిలో వాఁడు కాలవశమున దొంగతనము మాని యిట్లు ఆలోచించెను:— 'ఈలోకమునం దప్పించుకొంటిని. పరలోకమున నాకేమి యుపాయము ? ఎవరిని శరణుచొత్తును. శివునిం గాని కేశవుని గాని శరణుఁ జొత్తునేని, దేవతలచేతను మహామునులచేతను ఊడిగము లొందుచుండువీరు నన్ను సరకు

గొందురా ? కావున జంతువులసుకృతదుష్కృతములను ఎవఁడు లెక్క వ్రాయునో చిత్రగుప్తుఁడు, అతని నాశ్రయించెదను. అతఁడు యుక్తిచే నన్నుఁ గాపాడును. ఒక్క కాయస్థుఁడు బ్రహ్మ రుద్రుల యిరువుర వ్యాపారముల నొనర్చును, క్షణములో వ్రాయును క్షణములో తుడిచి వేయును, ఈవిశ్వము అతనిచేత నున్నది.' ఇట్లు తలపోసి యావృద్ధతస్కరుఁడు చిత్రగుప్తునికి భక్తుఁడై నిత్యమతనినే పూజించుచు, అతనికిఁ దృప్తిగా నిత్యము బ్రాహ్మణసంతర్పణ సేయుచుండెను. ఇట్లుండ నొకనాఁడు వాని భక్తిని పరీక్షించువాఁడై చిత్రగుప్తుఁడు అతిథిరూపమున వాని యింటికి వచ్చెను. చోరుఁ డతనిం బూజించి భోజనము పెట్టి దక్షిణ యిచ్చి 'చిత్రగుప్తుఁడు నీయందు ప్రీతుఁడగుఁగాక' యని చెప్పుమనెను. అంతట బ్రాహ్మణరూపముననున్న చిత్రగుప్తుఁడు 'ఇదేమి? హరిహరాదులను విడిచి చిత్రగుప్తునిఁ గొలిచెదవు?' అని యడిగెను. సింహవిక్రముఁడు 'నీ కేల యీవిచారము ? నాకు చిత్రగుప్తునికన్న వేఱు దేవతలతోఁ బనిలేదు ' అనెను. అంతట చిత్రగుప్తుఁడు మరల ' అట్లయిన నీభార్యను నాకు నిచ్చెదవేని, నీ పడిగినయట్లామాట నేను పలికెదను.' అని పల్కెను. అందులకు సింహవిక్రముఁడు సంతసించి ' నాయిష్ట దేవత తనియుటకై ఇదె నాభార్యను నీ కిచ్చితిని.' అనెను. చిత్ర గుప్తుఁ డందులకు సంతసించి నిజరూపముం దాల్చి 'ఓయి, నీభక్తికి మెచ్చితిని, నీ కేమి నేఁ జేయవలయునో చెప్పుము'

అని యడిగెను, అంత సింహావిక్రముఁడు అత్యంతానందభరితుఁడై 'స్వామీ, నాకు మృత్యువును తప్పింపవలయును.' అని యడిగెను. చిత్రగుప్తుఁ డనియె:—'మృత్యువును దప్పింపం దరముగాదు, అయినను నే నొకయుక్తి పన్నెదను, వినుము: పూర్వము శ్వేతమునికై కాలుఁడు ఈశ్వరునిచే కోపమున దగ్ధుఁడై మరల కారాగ్రహము నిర్మితుఁ డయినప్పటినుండి శ్వేతముని యెట సుండునో అచ్చటిజంతువులం గూడ ఈశ్వరాజ్ఞాబద్ధుఁడై కాలుఁడు బాధించుటలేదు. ఇప్పుడు ఆ శ్వేతముని సంద్రము నవలిగట్టున తరంగిణి యనునది కవతల తపోవనములో నున్నాఁడు. మృత్యువునకు చొరరాని దైన యాచోట నిన్నుఁ గొనిపోయి విడిచెద. నీ వెప్పుడును ఆయేటి యివలియొడ్డునకు రాకుము. ఒకవేళ నీవు పొరఁబాటున రాఁగా, నిన్ను మృత్యువు బాధించునేని పరలోకమునకు నీవు వచ్చినప్పుడు అట నే నేమేని యుపాయము రచియించెదను.' ఇట్లు పలికి చిత్రగుప్తుఁడు సింహావిక్రమునిం గొనిపోయి శ్వేతమునియాశ్రమమున వదలి యదృశ్యుఁ డాయెను.

తరువాత కాలక్రమమున సింహావిక్రముని తనసభకు గొనిపోవుటకు కాలుఁడు తరంగిణీనది యివతలి యొడ్డునకు వచ్చి యుండెను. అటన యుండి యుపాయాంతరము గానక మాయాప్రభావముచే నొకదివ్యాంగనను సృజించి సింహావిక్రమునికడకుం బంపెను. ఆవిలాసిని పోయి వానిని తన రూపుచే

కైవసము చేసికొని మోహమునం గూల్చెను. కొన్ని దినము లిట్లు వానితోఁ గడపి తర్వాత నామె చుట్టాలం జూచుట కని మిషపెట్టి అల్లకల్లోలమైనయాయేటిని దాఁటం జొచ్చెను. వెంట వచ్చి గట్టుననుండు సింహవిక్రముఁడు చూచుచుండఁగా నడి యేట నామె మునిఁగిపోవునట్లు అభినయించి యేటివడిన కొట్టు కొనిపోవుచున్నదియుంబోలె బిగ్గరగా 'అయ్యో, ఆర్యపుత్రా, నేను మునుఁగుచున్నాను, నీవు చూచుచున్నావు, నన్నుఁ గావవేమి? నీవు సృగాలవిక్రముఁడవు గాని సింహవిక్రముఁడవు గావు.' అని మొఱ యిడెను. దానిని విని తత్క్షణమే సింహవిక్ర ముఁడు దుమికెను. ఆమెయు నేటివడిని కొట్టుకొనిపోయినది యుంబోలె నతని నెలయించుకొని అవలిగట్టునకు క్షణములోఁ గొనిపోయెను. అట నితఁడు చేరఁగానే కాలుఁడు ఇతని మెడకు పాశము తగిలించి 'విషయలోలుభులకు అపాయ మెప్పుడును నెత్తిమీఁద సిద్ధము సుమా' అని వాక్రుచ్చి, తనసభకుం గొని పోయెను. అట నీవిధమున నేమఱి కాలవశగతుఁడైన సింహ విక్రమునితో చిత్రగుప్తుఁడు రహస్యంబుగా నిట్లనియె:-నిన్ను యమధర్మరాజు 'ముందుగా నరక మనుభవించెదవా స్వర్గ మనుభవించెదవా?' యని యడుగును. అపుడు స్వర్గమునే యని నీ వుత్తర మిమ్ము. స్వర్గమునకుం బోయి అచటినివాసము శాశ్వత మగునట్లుగా నచట పుణ్య మొనర్పుము, అనంతరము సర్వపాపక్షయ మగునట్లుగా నచటనే తపస్సుచేయుము.' ఇట్లు

చిత్రగుప్తుఁడు హితము చెప్పఁగా, సింహవిక్రముఁడు ఆశ్చర్య పడి లజ్జపడి తలవాంచి భయముతో అట్లే చేసెద నని యొప్పు కొనెను.

వెంటనే ధర్మరాజు చిత్రగుప్తుని 'ఏమోయి ఈదొంగకు పుణ్యాంశ మేమయినం గలదా లేదా?' అని యడిగెను. 'దేవా, కలదు, వీఁడు అతిథిపూజాపరాయణుఁడు, తనయిష్ట దేవత తనియుటకై యాచకునికి తన భార్యనుం గూడ నిచ్చిన వాఁడు, కాన వీనికి ఒకదివ్యదినము స్వర్గవాసము కలదు.' అని చిత్రగుప్తుఁ డుత్తరము పలికెను. అంతట ధర్మరాజు సింహ విక్రముని 'ఓరీ, నీవు శుభాశుభములు రెంటిలోను ముం దేది యనుభవించెదవు చెప్పుము.' అని యడిగెను. శుభమునే సింహ విక్రముఁడు కోరుకొనెను. అంతట సింహవిక్రముఁడు యమధర్మ రాజాజ్ఞచే వచ్చినట్టివిమాన మెక్కి చిత్రగుప్తుడు చెప్పిన హిత మును తలపోసికొనుచు స్వర్గమునకుం బోయెను. అట భోగ ములు కోరక మందాకినీస్నానజపవ్రత పరాయణుఁడై యుం డఁగా, రెండవదివ్యదినము వచ్చెను. ఇట్లు స్వర్గముం బొంది తీవ్రసంయోగముతో తపస్సుచేసి శంకరుం గొలిచి జ్ఞానముం బొంది పాపముం గాల్చివేసెను. అంతట నరకదూతలు ఇతని మొగమును చూడనేనియు శక్తులు గాకైరి. చిత్రగుప్తుఁడు భూర్జపత్రముతో వీని పాపమును తుడిచివేసెను. యముఁడు ఊరకుండెను. ఈవిధమున దొంగ సింహవిక్రముఁడు సుఖి

తము ప్రజ్ఞాబలముచే సిద్ధిం బొందినాఁడు. నీకుం బ్రజ్ఞాపారమితను చెప్పినాఁడఁ గదా. ఈతీరున బుద్ధదేవుఁ డుపదేశించిన దానాది షట్క పారమిత యను నావ నెక్కి పెద్దలు సంసార సాగరమును దాఁటుదురు.

ఇట్లని యాయరణ్యములో బోధిసత్త్వుఁడు వినీతమతి సోమశూరునికిం జేసిన యాయుపదేశములను వినియుంబోలె సూర్యుఁడు ప్రశమిల్లుచు సంధ్యారాగకాషాయమును గ్రహించి యస్తాద్రికందరము నాశ్రయించెను. అంతట వా రిరువురును వినీతమతిసోమశూరులు యథావిధి సంధ్యోపాసన గావించి యారాత్రి గడపిరి. మఱునాఁడు వినీతమతి సోమశూరునికి బౌద్ధశాసనమును సరహస్యముగా యథావిధి ఉపదేశించెను. అది మొదలు సోమశూరుఁడు గురువు నుపాసించుచు అచటనే చెట్టుక్రింద నాకుటిల్లొకటి కట్టుకొని సమాధినిష్ఠుఁడై యుండెను. క్రమముగా వా రిరువురును గురుశిష్యులు యోగమహాసిద్ధులు వడసి ఉత్కృష్టమైనబోధిని పొందిరి. ఈలోపల కనకకలశుఁడు ఆ యిందుకలశునిచే తనకు వినీతమతిభూపతి యిచ్చిన యా యహిచ్ఛత్త్రరాజ్యమునుండియు ఖడ్గాశ్వప్రభావముచేత తఱుమంబడి ఇరువురుమువ్వురు మంత్రులతోఁ గూడఁ ద్రిమ్మరుచు దైవయోగంబుం నావినీతమతిభూపాలుఁ డున్న యాయాశ్రమవనమునకే వచ్చెను. అచట నతఁడు ఆఁపరాని యాఁకలిదప్పులచే నీడితుఁ డయి పండ్లు మూలములు జలమును గోరునంతట

ఇంద్రుఁడు వినీతమతిని వంచన సేయువాఁడై అతిథిసత్కారమునకు సాధనములు లేకుండఁజేయ నాయరణ్యమును గాల్చివేసి యథాపూర్వము ఇసుకయెడారిం గావించెను. వినీతమతి యాకస్మికముగా కానన మిట్లు ఎడారి యగుట కాశ్చర్యపడి ఇంచుక సేపు ఇటునటు తిరిగెను. అప్పుడే అనుచరులతోఁ గూడ వచ్చి ఆఁకటిచే కంఠగతప్రాణుఁ డయియున్న కనకకలశుని వినీతమతి గాంచి చేరఁబోయి యతనివృత్తాంత మడిగి తెలిసికొని అతిథిహితుఁడు బోధిసత్త్వుఁడా వినీతమతి 'ఈయరణ్యము ఆకస్మికముగా నిర్జలంపు టెడారి యైనది. ఇందు ఆతిథ్యము దొరకదు. అయినను ఆఁకలిగొనియున్న మీకు జీవనోపాయముం జెప్పెద. ఇచ్చటి కరకోసుమేరను గోతిలోఁ బడి లేడి యొకటి చచ్చియున్నది. మీ రచటి కేఁగి దానిమాంసములం బ్రాణములం గాచికొనుఁడు, పొండు.' అని చెప్పెను. అంతట వల్లె యని క్షుధార్తుఁ డయ్యతిథి సచివులతోఁ గూడ పో నుండఁగా, వినీతమతి ముందుగా నా గోతికి పోయి, అందు యోగమాయచేత తాను లేడిగా మాఱి యతిథులకై ప్రాణములు వదలెను. కనకకలశాదులు మెల్లనం బోయి, గోతిలో చచ్చిన లేడిం గని యెత్తి గడ్డిమోడుల నిప్పు చేసి కాల్చి యా మాంసముల నిశ్శేషముగా భక్షించిరి.

ఇంతలో నా బోధిసత్త్వుని సహధర్మచారిణు లిరువురును నాగసుతా రాజసుతలు దిగులొంది యతనిం గానక

ఆశ్రమము మరు వగుటం గాంచినవారై యపుడె దృఢసమాధి నుండి వ్యుత్థానాభిముఖుఁ డైన సోమశూరునితో ఆవృత్తాంత మును నివేదించిరి. అతఁడు యోగదృష్టిచేత గురువృత్తాంతము నెఱింగి గురుభార్యలకు దుఃఖకరమయినను ఆచేష్టితమును వివ రించి, అనంతర మాయిరువురతోను ఆగోత్రికడకుం బోయెను. అచట పతివ్రతలు ఆ నాగసుతా రాజసుతలు కొమ్ములు నెమ్ము లును మిగిలిన మృగాకారమున నున్న పతిం గని శోకించి యా కొమ్ముల నెమ్ములను తెచ్చి తమయాశ్రమమునుండి కొయ్యలు తెచ్చి పేర్చి అగ్నిప్రవేశము చేసిరి. అంత నావృత్తాంత మెల్లను విని దుఃఖితుఁ డై యనుచరులతోఁ గూడ కనకకలశుఁడును అగ్నిప్రవేశము చేసెను. సోమశూరుఁడును గురుమరణమును సహింపఁజాలక దర్భాసనమందు ప్రాయోపవేశము చేసెను. అంత నాక్షణమందు ఇంద్రుఁడు అతనికడకు వచ్చి ప్రత్యక్షు మై 'సోమశూరుఁడా, ఇట్లు చేయకు, నేను నీగురువును పరీక్షించితిని. అస్థిభస్మావశిష్టుఁడై న యాతని సభార్యుని సారథిని నే నమృతముం గురిసి బ్రతికించితిని.' అని బోధించెను. ఇంద్రుని యీమాట విని సోమశూరుఁడు సంతసిల్లి అతనికిం బ్రణమిల్లి లేచి పోయి చూచునంతటికి బోధిసత్త్వుఁడు వినీతమతియు భార్యలును అతిథులును అందఱును బ్రదికియుండిరి. అంత నతఁడు పరలో కమునుండి భార్యలతోఁగూడఁ మరల వచ్చినవాఁడైన గురువు పాదములకు తన శిరము సోఁకం బ్రణమిల్లి, వాక్పుష్పములం

బూజించి, నేత్రములతో పానము చేసెను. కనకకలశాదులును వినీతమతికి భక్తినమ్రు లయిరి. అంతట బ్రహ్మవిష్ణుప్రముఖదేవత లెల్లరు నచటికి వచ్చి యతని సత్త్వమునకు మెచ్చి వరము లడుగు మనిరి. అతఁడును దివ్యానుభావములును పరోపకార రూపములు నయిన వరములనే కోరెను. అన్నియు నిచ్చి వారు దిచ్చు మొగం బయిరి. అంత వినీతమతి సోమశూరాదులతోఁ గూడ దివ్య మయిన మఱియొకతపోవనమునకుఁ బోయెను.

వత్సా, ఈవిధమున బూడిద యయినవారు సయితము మరల కలసికొందురు. బ్రదికి యుండి యిచ్చ వచ్చినట్లు సంచ రించుచుండువారిమాట చెప్పవలయునా ? కావున దేహత్యా గోద్యమము మానుము, వీరుఁడవు గదా. అవశ్యము నీవు మరల మృగాంకదత్తుని కలసికొందువు. ఇట్లు ముదుసలితాపసి చెప్పినపుణ్యకథను విని ఆస్థగొని యామెకు నమస్కరించి, ఖడ్గ హస్తుఁడనై యటనుండి బయలువెడలి క్రమముగా ఈయడవికి వచ్చితిని. ఇట నీశబరులు చండికకు బలివేయ నన్నుఁ బట్టి తెచ్చిరి. వీరితో నేను పోరి గాయములు పడి సొమ్మసిల్లితిని. అంతట నన్ను వీరు ఈసేంచుసేనికడకుఁ దెచ్చిరి. ఇచట, మహారాజ, ఈయిరువురుముగ్గురుమంత్రులతో నిన్నుఁ గంటిని. నీప్రసాదమువలన నాయింటంబోలె నూఱట నొందితిని.

ఇట్లు గుణాకరునివలన నతనివృత్తాంతమును విని మృ గాంకదత్తుఁడు కరము సంతసిల్లి గుణాకరుని గాయములకు

పథ్యమయిన యుపచారములు సేయించి, పగలు తిరుగుడువడఁగా లేచి నిజాహ్నికము తీర్చెను. అచటనే గుణాకరునికి మందు సేయించుచు కొన్ని దినములు ఇతరమంత్రులకొఱకును శశాంక వతికొఱకును ఉజ్జయినికి బోవువాఁడై కడపెను.

---

## ౬-వ తరంగము.

---

### విచిత్రకథకునికథ.

అనంతరము గుణాకరునికి గాయములు కుదిరిన తర్వాత మంచిదినమున బయలువెడలి, మృగాంకదత్తుఁడు తనతో కడు దవ్వు సాగనంప వచ్చిన బోయఱేనిని వానితోఁగూడఁ గలసి వచ్చిన మాతంగపతిని దుర్గపిశాచుని తనకు సమయమునం దోడ్పడ మాటలాడి వీడ్కొని, ఉజ్జయినీమార్గమున పయనము నడచుచుండెను. దారిలో శ్రుతధి విమలబుద్ధి గుణాకర భీమ పరాక్రములతో గలసి పోవుచు ఇతరమంత్రులను వెదకుచు నతఁడు మధ్యారణ్యములో నొకనాఁడు ఒకచెట్టుక్రింద ఈయుం దఱితోను బరుండి నిద్రించుచుండెను. ఆకస్మికముగా కొంత సేపటికి మేల్కొని కన్ను దెఱచి చూచునంతటికి మృగాంక దత్తునికి తనచెంత ఎక్కువగా నింకొకమనుష్యుఁడు నిద్రించుచు అగపడెను. వానిమోముపయిముసుఁగు తీసి చూడ నతఁడు ఇతని మంత్రి విచిత్రకథకుఁడు, రాజు ఆతనిని ఆనవాలు పట్టెను.

అతఁడును మేల్కొని మృగాంకదత్తుగని హర్షమున పాదములకు మ్రొక్కి నిలిచెను. దొర అట్లు ఆకస్మికముగా దొరకిన యావిచిత్రకథకునిం గన్నులు తనియం గాంచుచుఁ గవుంగిలించుకొనెను. ఇంతలో నతని కడను మంత్రులుఁ మేలుకొని సంతసించిరి. విచిత్రకథకునికి వారు తమతమ వృత్తాంతములను చెప్పి యతని వృత్తాంత మడుగ నతఁ డిట్లు చెప్పసాగెను.

అపుడు పారావతనాగునిశాపమువలన నేను మి మ్మెడఁబాసి ఒంటరి నై తెలివి పోయి యచటనే చిరకాలము తిరుగుచుంటిని. మఱునాఁడు దూరము తిరిగి మూర్ఛిల్లి నేలఁ బడితిని. తెలివి వచ్చునప్పటికి అడవియోరను గొప్పదివ్యనగరమం దుంటిని. అచట దివ్యపురుషుఁ డొకఁడు దివ్యరమణీద్వయయుక్తుఁడు న న్నోదార్చి చన్నీళ్లు స్నానము చేయించి లోపలికిం గొనిపోయి నాకు ప్రయత్నపూర్వకముగా దివ్యభోజనము సిద్ధము చేయించి పెట్టించి తరువాత తానును తనభార్యలును భుజించెను. భోజన మయిన తర్వాత విశ్రాంతిఁ బొంది నే నతనిని 'నీ వెవరవు? చావ నున్న న న్నేల రక్షించితివి? నేను నాదేలిక నెడఁబాసితిని, దేహత్యాగము చేయక మానను.' అని యతనికి నావృత్తాంతము నెల్ల వర్ణించితిని. అంత నామహాత్ముఁడు, ప్రీతిపూర్వకముగా ని ట్లనియె:—'నేను యక్షుఁడను, ఈయిరువురును నాభార్యలు, నీవు మాకు అతిథివి లభించితివి. యథాశక్తి అతిథిపూజ గృహస్థులకు విధి కదా, కావున నేను నిన్నుఁ

బూజించితిని. మఱి నీ వేల ప్రాణత్యాగము చేసెదవు? మీకు నాగశాపముచేత కొంచెము కాలమే వియోగము. తప్పకుండ శాపము తీఱినవెనుక మీకు సమాగమము కలుగును. మంచి వాఁడా, ఈసంసారములో దుఃఖము లేనివాఁడు ఎవఁడుపుట్టును! యత్నుఁడ నయ్యును నే నెఱింగినదానిని జెప్పెద వినుము.

### శ్రీదర్శుని కథ.

ఈవసుధారమణికి ధమ్మిల్లమండనమాలిక త్రిగర్త యను నగరి సుమనోగుణములతోఁ గూర్పఁబడినది కలదు. అందొక బ్రాహ్మణకుమారుఁడు పవిత్రధరుఁ డని యుండెను. అతఁడు దరిద్రుఁడు, బంధువులు పలువురు, కులము గొప్పది. అతఁడు ధనవంతులనడుమ నివసించుచు నిట్లు తలంచెను. 'అర్థవంతులయిన వీరినడుమ నేను వృత్తస్థుఁడ నైనను సత్కావ్యశబ్దములనడుమ నిరర్థకశబ్దమువలె ప్రకాశింపఁ జాలక యున్నాను. పరువుగల వాఁడను, సేవను గాని ప్రతిగ్రహమును గాని ఒల్లను. కావున ఎటకేనియు పోయి ఏకాంతమున యక్షిణిని సాధించెదను. నాకు అందులకై గురుముఖలబ్ధమయిన మంత్రోపదేశము కలదు గదా.' ఇట్లు సంకల్పించి వనమునకుం బోయి పవిత్రధరుఁడు భార్యార్థము యక్షిణిని సాధించెను. సౌదామని యనుపేరి యక్షిణి యతనికి లభించెను. ఆమెను గూడి యతఁడు, ఘోరమయినచలిని దాఁటి మధులక్ష్మిం బొదివికొన్నమావిమ్రానివలె, నొప్పారుచుండెను, ఒకప్పుడు పుత్త్రుఁడు లేనందులకు చింతా

క్రాంతుఁ డైన పవిత్రధరునిం గాంచి భార్య యిట్లనియె.—ఆర్య పుత్త్రా, చింత వలదు. మనకు కుమారుఁడు కలుగును. నేను చెప్పెడి యీవృత్తాంతమును వినుము.

దక్షిణదిక్కునందు వర్ధమానపురమునకుం బుట్టినిల్లో యన సూర్యుం గప్పినది ఘనశ్యామము తమాలవాటి ఒకటి కలదు. అందు పృథూదరుఁ డను యక్షుఁడు ప్రఖ్యాతుఁడు వసించును. అతనికి నే నొక్కతెను సౌదామని యనుదానను కొమార్తెను. నన్ను ప్రేమచే మానాయన కులాద్రులకుం గొనిపోవు చుండెను. నేనును సదా ఆ యా దివ్యోద్యానములయందు క్రీడించుచుంటిని. ఒకనాఁడు నేను కపిశభ్రు వను సఖితోఁగూడ క్రీడించుచుండి కైలాసములో అట్టహాసుఁ డనుపేరి యక్షకుమారునిఁ గంటిని. మిత్త్రమధ్యగతుఁ డతఁడును నన్నుం గనియెను. తత్క్షణమే మేము అన్యోన్య సౌందర్యాకృష్టనేత్త్రుల మైతిమి. దానిం గని తుల్యసంయోగ మని యెఱింగి మాతండ్రి తత్క్షణమే మాకిరువురకును వివాహము నిర్ణయించి లగ్నదివస మేర్పఱిచి నన్ను ఇంటికిం గొనిపోయెను. అట్టహాసుఁడును సంతసించి తన యింటికిం బోయెను. మఱునాఁడు నాచెలి కపిశభ్రువు నెవ్వగ నెమ్మోమునం దోఁప నాకడ కేతెంచెను. నేను అడుగఁగా నిర్బంధముమీఁద నిట్లు పలికెను.—"సఖీ, యిది చెప్పరాని విషయము, ప్రియముగాదు. అయినను చెప్పెదను వినుము. నేఁడు నే నిటకు వచ్చుచుండఁగా దారిలో నీవరుని నీమీఁది యుత్కం

ఠచే డస్సియున్న వానిని చిత్రస్థల మను హిమవత్సానూద్యాన మందు చెలికాండ్రు క్రీడావినోదార్థము యక్షరాజునుగాఁ జేసిరి. ఇతని తమ్ముని దీప్తశిఖుని నలకూబరునిఁగాఁ జేసిరి. తా మెల్ల వారికి మంత్రు లయిరి. ఇట్లు నీ ప్రియుని చెలికాండ్రు క్రీడార్థము చేయఁగా ఆకాశమార్గమునం బోవుచు నలకూబరుఁడు చూచి, కోపగించి పిలిచి 'ఓరీ, నీవు దాసుఁడ వయ్యును ఏలికయొక్క లీల నభిలషించితివి గాన, పాపిష్ఠుఁడా, ఈనేరమికి నీవు మనుష్యుఁ డవు గమ్ము. పై పదవి నాసించినందులకు క్రిందికి పొమ్ము.' అని శపించెను. 'దేవా, వినోదార్థము మూర్ఖుఁడ నిట్లు చేసితినిగాని అధికారగర్వముచేతఁ గాదు, కావున, ప్రభూ, నన్ను మన్నిం పుము.' అని యట్టహాసుఁడు భయముచే వడఁకుచుం బ్రార్థిం చెను. అంతట నలకూబరుఁడు యోగదృష్టిచేత వానిమాట వాస్తవమ యని గ్రహించి శాపాంతము నిట్లనుగ్రహించెను. 'నీ వేయువతికై ఉవ్విళ్లూరుచున్నావో, దానియందే మను ష్యుఁడవయ్యు నీతమ్ముని ఈదీప్తశిఖునే పుత్త్రునిఁగాఁ బడసి, ఈశాపము తీఱి ఆనీభార్యతోఁగూడ నీతొంటిపదమును బొం దెదవు. ఈనీభ్రాత నీకు పుత్త్రుఁడై భూలోకములో రాజ్య మేలి శాపముక్తిఁ బొందును.' ఇట్లు నలకూబరుఁడు పలుకఁగా శాపప్రభావమున అట్టహాసుఁ డెటకో అదృశ్యుఁడై పోయెను. దానింగని, నేను దుఃఖావిష్టనై నీకడకు వచ్చితిని." ఇట్లు సఖి పలుకఁగా నేను దుఃఖావేశముచే నెట్లో అయి, నాగతికి

వగచుచుం బోయి యావృత్తాంతమును నా తల్లిదండ్రుల
కెఱుక పఱచి మరల సంగమము గలుగు నని యెదురు
సూచుచు కాలము పుచ్చుచుంటిని. నీవే ఆయట్టహాసుఁడవు,
నేను ఆసౌదామనిని, మన మిరువురము నిట నిట్లు కలసికొం
టిమి. మనకు త్వరలోనే కుమారుఁడు తప్పక పుట్టును.

ఈరీతిని జ్ఞానవంతురాలు సౌదామని పలుకఁగా పవిత్ర
ధరుఁడు పుత్రోత్పత్తి కలుగునుగదా యని సంతసించెను. తర్వాత
కాలక్రమమున నతనికి ఆయక్షిణియందు సుతుఁడు కలిగెను.
ఆశిశువుచే వారియిల్లును వారియుల్లంబును వెలుఁగొందిన వా
యెను. పవిత్రధరుఁడు ఆపుత్రుని మోముం గాంచి తత్క్షణము
అట్టహాసుఁడుగా నిజపూర్వాకృతిం బొందెను. యక్షిణితో
'ప్రియా, మనశాపము తీఱినది. నేను అట్టహాసుఁడ నయితిని,
రమ్ము మన తొంటిగతికి మనము పోవుదము' అని హెచ్చరిం
చెను. ఇట్లతఁడు పలుకఁగా నామె 'ఈశిశువు నీతమ్ముఁడే గదా,
శాపమున నిట్లు మనకు సుతుఁడై నాఁడు. వీఁడే మగునో ఆలో
చింపవలదా ?' అనెను. అంత నట్టహాసుఁడు ధ్యానముచేఁ గని
ఆమెతో నిట్లనియె:— "ప్రేయసీ, ఈనగరమున దేవదర్శనుఁ
డని పంచాగ్ని బ్రాహ్మణుఁ డొకఁడు కలఁడు. ఆయన కరము దరి
ద్రుఁడు, అతనికి తనజఠరంబు తనభార్యజఠరంబు నని మఱి
రెండు అగ్నులు మండుచుండినవి. ఆదరిద్రుఁడు ధనపుత్రకా
ముఁడై తప మొనర్చుచుండఁగా నొకనాఁడు అగ్నిదేవుఁడు నిజా

రాధకుని కతనికి కలలో నిట్లు పలికెను. 'నీకు ఔరసపుత్త్రుఁడు లేఁడు. కృత్రిమపుత్త్రుఁడు గలుగును. వానిమూలమున, ఓ బ్రాహ్మణుఁడా, నిపేదరికము తీరును.' ఇట్లగ్ని దేవుఁడు పల్కఁగా, బ్రాహ్మణుఁ డెదురు సూచుచు సుఖ మున్నాఁడు. అతనికి మన శిశువును ఇయ్యవలసినది. నియతి యి ట్లున్నది."

అట్టహాసుఁడు ప్రేయసితో నిట్లు చెప్పి శిశువును బంగారు కుండమీఁద కూర్చుండఁ బెట్టి వాని మెడకు దివ్యరత్న మాల యొకటి కట్టి వానిని రాత్రి దేవదర్శనుఁడును నతని భార్యయును నిద్ర పోవుచుండఁగా వారి యింటం బెట్టి తాను భార్యతోఁగూడ నిజగతిం బోయెను.

దేవదర్శనుఁడు సభార్యుఁడు మేల్కొని ప్రకాశమానరత్న తారకు నాబాల చంద్రుం గాంచి, అబ్బురపడి బంగారు నాణెములకుండను గని అగ్నిదేవుని వరమును స్మరించి సంతోషించెను. దైవ మిచ్చిన యాతనయునిం గయికొని ధనమునుం గొని తెల్లవాఱఁగానే మహోత్సవము సల్పి, పదునొకొండవ దినమున తనకుఁ దగినట్లుగా బాలకునికి, శ్రీదర్శనుఁ డని నామకరణము చేసెను. అనంతరము దేవదర్శనుఁడు మహాధనుఁడై క్రతువు లొనర్చుచు భోగము లనుభవించుచు పుత్త్రకళత్రములతో సుఖ ముండెను. శ్రీదర్శనుఁడును తండ్రియింట ఎదుగుచు వేదవిద్యలయందే గాక అస్త్రవిద్యలయందును ప్రకర్షముం

బొందెను. కాలక్రమమున నితఁడు యౌవన మొందఁగా, నితని తండ్రి తీర్థయాత్రావశమునం బ్రయాగకుం బోయి యచట ప్రశమం బొందెను. అంతట నితని తల్లి అగ్నిప్రవేశము చేసెను. అంతట శ్రీదర్శనుఁడు దుఃఖితుఁడై వారికై శాస్త్రోక్తమయిన క్రియలు నిర్వర్తించి క్రమముగా శోకము తగ్గి వివాహ మాడక వివేకి యయ్యును జూదమునం దగులు కొనెను. ఆదుర్వ్యసనంబున త్వరలోనే యతని ధనసంపద యెల్ల కొల్లయై యతనికి భోజనమునకుం గూడ గతి లేక పోయెను. ఒకప్పుడు ఇతఁడు జూదపుటింట అన్నము లేక మూఁడు దినము లుండెను. మంచివస్త్రములు లేనందున లజ్జచేత అందుండి వెలువడకుం డెను. ఇతరులు పెట్టిన భుజింపక యిట్లు గోడు గుడుచుచున్న యీతనిం గని ముఖరకుఁడను సఖుఁడి ట్లనియె:-మిత్రమా, ఏల కనవు? ద్యూతవ్యసనపాతక మిట్టిది కదా. పాచిక లన నలక్ష్మికే గంటిచూపు లని నీ వెఱుఁగవా; బ్రహ్మదేవుఁడు జూదగానికి బాహువులు వస్త్రముగాను, దుమ్ము పడుకగాను, బజారు ఇల్లుగాను, దిక్కు-మాలినతనమే భార్యగాను, సృజించినాఁడుగదా. భోజనముం గయికొన వేమి? ప్రాజ్ఞుఁడ వయ్యును నిన్ను నీవే యొప్పరికించెద వేల? బ్రదికియుండిన ధీరుఁడు ఏకోరికలను నెఱవేర్చుకొనఁడు? అందులకు నిదర్శనముగా భూనందన భూపాలుని చిత్రకథను చెప్పెద వినుము.

భూనందనుని కథ.

ఈలోకమున భూమి కలంకారము కాశ్మీర మను దేశము కలదు. అది సుకృతులకొఱకు అదృశ్యభోగముగా బ్రహ్మ స్వర్గమును సృజించి భోగ్యభోగముగా సృజించిన రెండవ స్వర్గమన రాజిల్లుచుండును. ఆదేశము 'ఇట నే నధికురాలను నేనధికురాలను' అని యన్యోన్యము ఈసు వూనియో యనం బ్రవేశించి నెక్కొన్న లక్ష్మీసరస్వతుల కాటపట్టయి యున్నది. ధర్మద్రోహి యగు కలి యిందుఁ జొరరాదని కాపున్నదో యన దానిం జుట్టుకొని మంచుకొండ భాసిల్లుచుండును. అందు దేవతీర్థమయ మైన యిచ్చోటినుండి దూరమునకుం బొమ్మని పాపమును అలచేతులం ద్రోచునదియుంబోలె వితస్తానది ప్రవహించుచుండును. అందు పాలగచ్చుచేసిన పొడుగుపాటియుప్పరిగల వరుసలు చెంగటిమంచుకొండ పాదములో యన నొప్పుచుండును. ఆదేశమును వర్ణాశ్రమగురువు ప్రజానందనచంద్రుఁడు విద్యాగమబుధుఁడు భూనందనుఁ డను రాజు ఏలుచుండెను. అతని విక్రమము నఖరాజి వియుక్తము లయిన యెమ్మెలాఁడుల చనుఁగవలయందును అట్టివ యయిన విద్వన్మండలములందును తేజరిల్లుచుండెను. నీతిమంతుఁ డయిన యతనిరాజ్యమందు జనులు అనీతులై వర్తించుచుండిరి. కృష్ణైకాసక్తచిత్తుఁ డయిన యతని ప్రజలు అకృష్ణతరచిత్తులై సుఖ ముండిరి. ఒక ద్వాదశియందు ఆరాజు యథావిధి శ్రీహరిని పూజించి రాత్రి కలలో తనకడ

కొంకదై త్యకన్యక రాఁ గాంచి యామెతో నిష్ట సంభోగములం దేలి మేల్కాని ఆమెం గానక మేనం దుంటవిల్లుపోరి చిన్నెలం గాంచి యిట్లు తలఁచెను:— 'ఇది కల గాదు, ఇవె సంభోగ చిహ్నములు. కావున ఎవతెయో దివ్యకన్య నన్ను మోసపుచ్చినది' ఇట్లు నిశ్చయించుకొని విరాళిం గుందుచు రాచకార్యము లెల్ల మానివేసెను. ఆమెను మరలం బొంద నుపాయాంతర మగపడమిచే 'అప్పు డాచెలితోడి యాసంభోగక్షణము నాకు హరిప్రసాదమునం గలిగెను గదా, కావున నతని నే తత్ప్రాప్తికై ఏకాంతమున నారాధించెదను. ఆచెలువ లేమిచే నీరస మయిన యీ రాచఱికపుఁ ద్రాటిని విడిచి పెట్టెదను.' అని సంకల్పించి, మంత్రుల రావించి, సునందనుఁ డను తన తమ్మునికి రాజ్య మిచ్చి, తాను మున్ను త్రివిక్రమమూర్తి యడుగిడిన తావునం బుట్టిన క్రమసర స్సను తీర్థమునకుం బోయెను. దానిని పూర్వము త్రివిక్రముఁడే తీర్థము చేసెను. దాని చెంత బ్రహ్మవిష్ణురుద్రులు ముగ్గురును కొండకొమ్ములరూపున నివసించి యున్నారు. అందునుండి వితస్తమిూఁది యసూయచేత నుంబోలె విష్ణుపదము కాశ్మీరదేశములో ఏ దేవనదిని విషువతి యను దానిని నిర్మించెనో అచట నాభూనందనుఁడు నెలకొని అన్యరసనిస్పృహుఁ డై దివ్యరసకాంక్షి యై వేసవివానకోయిల యుం బోలె సోలుచు తప మొందుచుండెను.

పండ్రెం డేండ్లు తపంబు సేయుచు, నాదారిని జ్ఞానివరే ణ్యుఁడు కెంజడలవాఁడు నారవలువదాలుపు చట్టులతోఁగూడ నొకముని, తీర్థశైలంపుఁ గొమ్మునుండి దిగి వచ్చిన సాక్షా దీశ్వరుఁడు వోలె, వచ్చి, యాతనిం గని దయ గలిగి దఱిసి స త్కృతుఁడై వృత్తాంత మడిగి తెలిసికొని క్షణము ధ్యానించి యి ట్లనియె:—'ఓయి రాజా, నీ ప్రాణేశ్వరి యగు నా దైత్య కన్య పాతాళమున నున్నది. ఊఱడిల్లుము, నిన్ను నే నామె కడకుం గొనిపోయెద. నేను, దక్షిణదేశములో యజ్ఞయజ్వ యను సోమయాజి కుమారుఁడను. నాపేరు భూతివసువు. నేను యోగులకు గురువను. నేను మానాయనవలన పాతాళశాస్త్ర ములోని హాటకేశ్వరమంత్ర తంత్ర విధానమును నేర్చుకొని, శ్రీపర్వతమునకుం బోయి యీశ్వరునిఁగూర్చి తప మొనర్చితిని. నాతపస్సునకు మెచ్చి ప్రత్యక్షదర్శన మిచ్చి శివుఁడు ఇట్లాన తిచ్చెను. 'పొమ్ము, పాతాళమున దైత్యాంగనలం గూడి భోగము లనుభవించి తర్వాత నన్నుఁ జెందుదువు. అందుల కుపాయము చెప్పెదను వినుము. ఈభూమిలో పాతాళబిలము లనేకములు గలవు. అందు కాశ్మీరదేశమున ప్రఖ్యాత మైనది మయనిర్మిత మొకటి గొప్పది గలదు. దానిదారిని బాణాసురునికూఁతురు ఉష తనకాంతుని అనిరుద్ధుని గుప్తములయిన దానవోద్యాన భూములందుఁ బ్రవేశపెట్టి వినోదము లొందించెను. అప్పుడు ప్రద్యుమ్నుఁడు తనకొమారుని రక్షించుకొనుటకై కొండ

కొమ్ముతో ప్రసిద్ధమయిన ద్వారమును చేసిపెట్టి దానింగాచుటకు స్తుతిశతకముల శారికానామధారిణి యైన దుర్గను ఎట నుంచెనో, అది మొదలు ఏది ప్రద్యుమ్న శిఖర మనియు శారికాకూట మనియు రెండుపేరులం బరఁగుచున్నదో, ఆబిలమార్గమున పోయి అనుచరులతో సయితము పాతాళము చొరుము. నాప్రసాద ముచేత నీ కంతటను సిద్ధి కలుగును.' ఇట్లానతిచ్చి మహాదేవుఁ డంతర్హితుఁ డాయెను. అంతట నేను తత్ప్రసాద ప్రభావంబున సకలవిజ్ఞానములును పొందినవాఁడనై కాశ్మీరదేశమునకు వచ్చి తిని. కావున రాజా; నీవుకూడ మాతో శారికాకూటమునకు రమ్ము. నిన్ను నీవు కోరినయంగనకడకు పాతాళములో నేను గొనిపోయెదను.' అంతట భూనందనరాజు ఆతపస్వితోఁ గూడ నాశారికాకూటమునకుం బోయెను. అట వరానుగ్రహశాలి యామహాతపస్వి వితస్తానదియందు స్నాన మాడి, వినాయకునిం గొలిచి, దిగ్బంధాదిపూర్వకముగా నాశారికాదేవిని పూజించి విధిప్రకారము ఆవాలు చల్లఁగా బిల మేర్పడ దానం జొచ్చి యారాజు మునిశిష్యులతోఁగూడ పాతాళమార్గమున రేయుం బవలు అయిదుదినములు నడచెను. ఆఱవనాఁడు అందఱును పాతాళగంగను దాఁటిరి. అట నేల యంతయు వెండిగా నుం డెను. అట వా రొకదివ్యవనముం గాంచిరి. నిండార విరిగిన బంగారునేలతామరలు నెత్తావులు వెదచల్ల, మోసు లెత్తుచున్న ప్రవాళకర్పూరచందనాగురుతరువులచే, నావనము ఇంపులు

దళుకొత్తు చుండెను. దానినడుమ మిక్కిలివిశాలమై రతనంపుఁ దాపలు మెఱయు, పసిండిగోడలు, మాణిక్యస్తంభములు, చంద్రకాంతశిలానిర్మితము లయిన పెదపెద్ద యరంగులును, గల యున్నతంపు శివాలయ మొకటి యగపడెను. కని వా రెల్ల సంతోషాశ్చర్యమగ్నులై యుండ మహాముని రాజును శిష్యులను 'ఈతఁడే పాతాళనిలయుఁడు హాటకేశ్వరుఁడు. మూఁడు లోకములను ఈదేవుం బూడుదురు గదా. కావున నీవేల్పుం బూజింపుఁడు.' అని హెచ్చరించెను. అంత నెల్లరును పాతాళ గంగలో స్నాన మాడి పాతాళపుష్పములతో హాటకేశ్వరునిం బూజించిరి. ఆపూజాక్షణమాత్రమే విశ్రాంతిగా వారు మఱలం బయనమై యట పండ్లు పండి క్రిందికి రాలుచున్న యొకగొప్ప నేరేడుఁజెట్టును గనిరి. అంతట నాముని ఇతరులతో దానిఫలములు తినవల దనియు అవి విఘ్నకారు లనియును జెప్పెను. ఆమాట వినియు నొకశిష్యుఁడు ఆఁకట నొకపండు తిని వెంటనే నిశ్చేష్టుడై స్థావరాకృతిం జొందెను. వానియవస్థం గని వెఱచి యితరులు ఆపండ్లపై యాస గొనరైరి. అంత నామహాముని రాజుతోను కడమశిష్యులతోను క్రోశదూరము పోఁగా నచట నొక బంగారపుంబ్రాకారము మణిమయ ద్వార సనాథము అగపడెను. ఆద్వారమున కిరుప్రక్కలను రెండు ఇనుపపొట్టేళ్లు వీరిని చొరనీయక కొమ్ములతోఁ గ్రుమ్మ వచ్చినవి. మునీశ్వరుఁడు వానిని మంత్రసమేత మైన కఱ్ఱతో తలపైఁ గొట్టఁగానే

అవి పిడుగు తగిలినవియుంబోలె నెటకో దూరము పలాయితము లయినవి, అంత నందఱును ఆద్వారమునం బ్రవేశించి లోని కేఁగి కనకరత్నమయము లయిన మందిరములం గాంచిరి. ఒక్కొ క్కదానిద్వారమునను జొడు గఱచుచు భయంకరులు ద్వార పాలకులు ఇనుపరోకండ్లం గేలఁగొని నిలుచుచుండిరి. అంతట ముని దుష్టఘ్ని యనుయోగధారణం గావించెను. ఆ ధారణ ప్రభావంబున నాద్వారరక్షకు లెల్ల పలాయితు లై కానరాకపో యిరి. అంత క్షణములో నాద్వారములనుండి దివ్యాలంకార వస్త్రలు దైత్యకన్యల యూడిగంపు వెలయాండ్రు వెలువడి ఒక్కొక్కనికడకు వచ్చి మునివఱకు ఎల్లవారిని తమతమయే లికసానిమాటగా లోపలికి రమ్మని పిలిచికొని పోయిరి. 'మీరు లోనికి పోయిన తర్వాత మీమీ ప్రేయసిమాటను మీరు దాటఁ గూడదు' అని ముని యితరులను మూదలించి తానును ఒకకొందఱు వారాంగనలతో నొకదివ్యభవనము ప్రవేశించి అందు ఒకదైత్యకన్యామణిని మహాభోగములను బడసెను. ఇత రులు నట్లే ఒక్కొక్కఁడు నితర వారవిలాసినులతో ఒక్కొక్క మందిరములోనికిం బోయి యట దైత్యకన్యాసంభోగపాత్రము లయిరి. భూనందనభూపాలుని ఒకతె వినయమునం బ్రణమిల్లి యొకమణిమయగృహమునకుం గొనిపోయెను. ఆమందిరము ఊడిగంపుఁజెలువల ప్రతిబింబములచేత రత్నకుడ్యములయం దెల్ల జీవముతోడి చిత్తరుబొమ్మలు గలదియుం బోలెనుండెను

కడు నున్నని మహానీలమణిచే రచితమయిన నేలచే నామందిరము దేవవిమానములం గెలుచు తలంపున దివివెన్ను ఎక్కినదివోలె శోభిల్లెను. మదాకులలసద్రామంబును మనోహరప్రద్యుమ్న విహారంబును నై అచ్యుతమహిమాఢ్యంబు నై యా లోఁగిలి వృష్ణికులజులతావలంబోయన నొప్పుచుండెను. లేయెండ నోర్పు విరిసయితము అచటిచెలువలమేని సౌకుమార్యమునకు సాటి రా దాయెను. దివ్యసంగీతముచే ఘూర్ణిల్లుచున్న యాయింటం జొచ్చి యారాజు మున్ను కలలో తాఁ గాంచిన యా ప్రాణేశ్వరి నసురకన్య నిట మరలం గాంచెను. సూర్యచంద్రాదివిరహితమైన పాతాళము ఆమె మేనిజిగిచే వెలుఁగొందుచుండఁగా అట బ్రహ్మదేవుని రత్నాదికాంతిసృష్టి కేవలము పునరుక్తముగా నుండెను, మాటలకందని చక్కఁదనము గల యాకన్నెం గాంచి సంతసంపుఁగన్నీళ్లు జడిగొన నా రాజు లాఁతిపదార్థములం గాంచిన దోషమును కన్నులనుండి కడిగివేయువాఁడువోలె నగపడెను. కుముదిని యనుపేరి యా యసురకన్యయు రాజేంద్రు నాతనిం గని మదాళిగీతములచే తెలుపంబడుచు చెప్ప నలవి గాని హర్షముం బొందెను. ఆమె లేచి యతనిం గేలఁ గొని 'నావలన, కరము శ్రమఁ జెందితివి.' అని యర్మిలిం బలుకుచు నతని నాసనమునం గూర్చుండఁ బెట్టెను. క్షణమునేపు అతనిని సేదదేర నిచ్చి స్నానముసేయించి వస్త్రాలంకారములు తాల్పించి యామె యా పానోత్సవమునకై యుద్యానవనమునకుం గొని

పోయెను. అచట గట్టున నున్న చెట్టున వ్రేలుచున్న పీనుంగు మేని నెత్తురు క్రొవ్వుల కల్లుతో నిండియున్న యొక బావిగట్టున నాతని తోఁగూడ నామె కూర్చుండెను. అంత నామె యాక్రొవ్వుఁగల్లు నించి యొకకోర నతనికిఁ ద్రావ నిచ్చెను. రాజు దానిని ఏవగించెను, గ్రహింపఁ డాయెను 'ఈమూపానమును గైకొనవేని నేమ మొందవు.' అని యామె బలవంత పెట్టఁగా, 'ఏ మయినం గానిమ్ము, త్రాగ రాని దీనిని నేను త్రాగను.' అని రాజు ఆమెతో ననెను. అంత నామె ఆకోర నతని నెత్తిని వేసి అవలికిఁబోయెను. అతఁడు మోము ముడుఁచుకొని కోరచూపులు చూచుచుండ, నామె చేటికలు అతనిని వేఱొకడిగ్గియలో వేసిరి. వేసిన మాత్రాన నతఁడు తనతొంటితపఃస్థాన మైనయాక్రమసరస్తీర్థమందు తన్ను తాఁ గన్గొనియెను. క్రమ్మియున్న మంచుచేత తన్ను నవ్వుచున్నది వోలె నొప్పు నాకొండను గాంచి యతఁడు బెగ్గిలి వింతపడి ఏమియుం దోఁపక మోసపోయి ఇట్లు తలపోసెను:-'ఆ యసుర కన్యయాటతోఁట యెక్కడ! ఈ క్రమసరోగిరి యెక్కడ! ఆహా! ఇ దేమి యాశ్చర్యము. మాయయో మతిభ్రమయో? ఇది మఱి యేమియుఁ గాదు, నేను మునిమాట వినియు ఆకన్నియమాట నుల్లంఘించిన ఫలము. ఆ పానము దూష్యము గాదు. ఆ కన్నె నన్ను పరీక్షించున దై దానిని ఆ రూపమున నొసంగినది, ఏలన, నానెత్తిపయిం బడిన యా పానమునుండి దివ్య మయిన నెత్తావి కదంబించుచున్నది. కాన తప్పకుండ అదృష్టహీనులు ఎంత

పాటుపడినను ఫలముం బొంద నేరరు. వారికి దైవము అంత ప్రతికూలముగా నుండును. '

ఇట్లతఁడు చింతింప నసుఁకన్యాపానముచే తడిసిన యతనిమేని నెత్తావికై తేంట్లు వచ్చి ముసురుకొన్నవి. 'అయ్యో! సత్త్వహీనునికి బేతాళోత్థాపనమువలె నాశ్రమ నాకు ఇష్టసిద్ధికి బదులుగా చేటు దెచ్చినది.' అని వగచుచు నతఁడు ఆతేంట్లు కుట్టను కుట్టను సహింపఁ జాలక ప్రాణత్యాగమునకు నిశ్చయించుకొనెను. అంతలో నాదారిని దైవికంబున నొక ముని కుమారుఁడు ఆ దుర్దశలో నున్న యారాజును గని చెంత కేఁగి కనికరముచే నాతేంట్లను తోలి వృత్తాంత మడిగి తెలిసికొని రాజుతో ని ట్లనియె. 'రాజా, ఎంతవట్టు దేహ ముండునో అంతవట్టు దుఃఖము క్షయించుట యెక్కడిది ? కావున కలఁతఁ జెందక బుద్ధిమంతులు పురుషార్థమును సాధింపవలసినది. ఎంత వఱకు బ్రహ్మవిష్ణ్వీశానులయందు ఏకత్వబుద్ధి యుండదో అంత వఱకును భేదోపాసనలవలనఁ గలిగినసిద్ధులు అశాశ్వతములే. కావున అభేదబుద్ధితో బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ధ్యానించుచు ధైర్యముతో మఱల పండ్రెండు సంవత్సరములు ఇచ్చట తపస్సు చేయుము. అందున ఆ కాంతం బొందుదువు. తుదను శాశ్వత మయినసిద్ధిని బడసెదవు. దివ్యసౌరభము గల దేహము ఇప్పుడే నీకు సిద్ధించి యున్నది. ఈకృష్ణాజినమును మంత్రములతోఁ గూఢం గయికొమ్ము. దీనిని కప్పుకొందువేని నిన్ను తేం ట్లే

మియుం జేయవు.' అని చెప్పి యతనికి అజినమంత్రము లిచ్చి ముని తనదారిం బోయెను. రాజు ధైర్య మూని మరల పండ్రెండుసంవత్సరములు ఈశ్వరుంగూర్చి ఆ తీర్థమున తపంబు సల్పెను. అంతట కుముదిని యతనికడకు తాను స్వయముగానే వచ్చెను. ఆమెతో నతఁ డనంతరము పాతాళమునకుం బోయి భోగము లనుభవించి తుదను సిద్ధిని సయితము పొందెను. ఇట్లు కలఁకపడక ధైర్య మవలంబించువారు దూర మెడలిన నిజపదవిని మరల పొందితురు.

శ్రీదర్శనా, నీవు, కల్యాణ మొందఁగలవాఁడవు, శుభ లక్షణుఁడవు, కలఁతపడి భోజనము మాని నిన్ను ఒప్పరికించు కొనియెద వేమి? ఇట్లు మిత్త్రుఁడు ముఖరకుఁడు ద్యూతశాలలో పలుకఁగా ఆమునుపటిరేయి భోజనము లేకయుండిన శ్రీదర్శనుఁ డి ట్లనియె.—'మిత్త్రుఁడా, నీవు చెప్పిన దెల్ల సరియే, ఐనను కులీనుఁడ నయ్యును ఈవిధముగా జూదమున పేదనై ఈయూర నేను బయట నె ట్లగపడఁగలను. కావున ఈరాత్రియే నన్ను దేశాంతరము పోనిత్తువేని భోజనము చేసెదను.' ఆమాటకు ముఖరకుఁ డంగీకరించి అతనికి భోజనము తెచ్చి పెట్టెను. శ్రీదర్శనుఁడు భుజించెను. భోజనము కాఁగానే శ్రీదర్శనుఁడు, మైత్త్రిచే ముఖరకుఁడును తనతోడ రా, దేశాంతరమునకుం దరలెను. అట్లు పోవుచున్న యతనిని దారిలో దైవవశమున తల్లి దండ్రు లంపిన ఘాయుకు లిరువురును సౌదామన్యట్టహాసులు,

ఇతనిని బుట్టియుఁ బుట్టక మునుపే విప్రునియింట విడిచిపోయిన వారు, కని, జూదమున పేదలై చెడి దేశాంతరము పోవుచున్న వానింగానెఱింగి, స్నేహముచే కంటికగపడకయే మింటనుండి యిట్లు పలికిరి. 'ఓయి శ్రీదర్శనుఁడా, మీతల్లి దేవదర్శనుభార్య పాఁతిపెట్టిన యాభరణములు మీయింట నున్నవి. వానిం బుచ్చుకొని నీవు తప్పక మాళవమున కేఁగుము. అచట మహైశ్వర్యసంపన్నుఁడు శ్రీసేనుఁ డను రాజున్నాఁడు. అతఁడు చిన్న తనమున జూదమున మిక్కిలి చెడి జూదగాండ్రకై గొప్ప మఠము నిర్మించియున్నాఁడు. జూదగాండ్రు అచట నివసించుచు కోరినభోజనములను పొందుచుందురు. పుత్త్రా, నీ వచటికి పొమ్ము. నీకు మేలుకలుగును.' ఈవాక్యము విని శ్రీదర్శనుఁడు ఇంటికిఁ బోయి తానును చెలికాఁడును త్రవ్వి యా తొడవులం గొని సంతసించి దేవతానుగ్రహ మని తలంచి, మరల చెలి కానితోఁ గూడ మాళవమునకుం దరలెను. ఆరాత్రి మఱు నాఁడు పగలును కడు దవ్వరిగి సాయంకాలమున బహుసస్య మనుగ్రామమునుం జేరెను. అలసి చెలికానితోఁ గూడ ఊరివెలు పల దగ్గఱనే తేటనీట విరాజిల్లుచున్న యొక తటాకముదరిసి కూర్చుండెను.

అతఁ డందు కాళులు గడిగికొని జలము త్రావి కూర్చున్న క్షణములో నొకకన్య యనన్యసామాన్యరూప నీళ్లకై వచ్చెను. ఆకన్నియ ముక్కంటికంఠం బడిన తుంట విల్తుని ఫాగచే

పొగ చూరి యొంటికత్తె యైన రతియో యన నల్లగలువఱిగి పిసాళించు మేనితోఁ జెన్నారు చుండెను. ఆమె శ్రీదర్శనునిం గన్న మాత్రాన ప్రేమభరాలసదృష్టియై తన దర్శనంబునం బ్రీతుఁడైన యతనిని సవయస్కుని 'మహానుభావులారా, మీ రపాయమునం బడ నిట కేల వచ్చితిరి? తెలియక మిడుతలవలె పెనుమంట లెగయుచిచ్చున దుమికితి రేల?' అని అడిగెను. అంతట దిగులుపడి యాకన్నియతో ముఖరకుఁడు 'కల్యాణీ, నీ వెవ్వతెవు, నీ వన్నమాట కభిప్రాయ మేమి?' అని యడిగెను.

ఆమె యి ట్లనియె:—సంగ్రహముగాఁ జెప్పెద. ఇట సుఘోష మని ప్రసిద్ధమైన యగ్రహార మొకటి కలదు. అందు పద్మగర్భుఁ డనుబ్రాహ్మణుఁడు వేదవిద్వరుఁ డుండెను. ఆయనకు ఉత్తమకులప్రసూత శశికళ యని భార్య యుండెను. ఆమెయం దాయనకు ముఖరకుఁ డనుపుత్త్రుఁడును పద్మిష్ఠ యను కూఁతురను నేనును జన్మించితిమి. నాయన్న ముఖరకుఁడు జూదగాండ్రసంగడిం బడి చెడి లేఁబ్రాయముననే యిలు వదలి యెటకో దేశాంతరు మేఁగెను. ఆ శోకము చేత మా యమ్మ కాలధర్మము నొందెను. ఆ యిరువురకై వందురి మానాయన ఇల్లు విడిచి ఒంటిగాను నన్ను మాత్రము వెంట గొని నాయన్నను వెదకుచు నానా దేశములు తిరిగి కడకు విధి వశమున ఈయూరికి వచ్చెను. ఈయూర బందిపోటుదొంగల రాయఁడు వసుభూతి యని నామమాత్రబ్రాహ్మణుఁ డొకఁ

డున్నాఁడు. ఆపాపాత్ముఁడు తనబంట్లతోఁ గూడ వచ్చి మాతండ్రి మేనం గలబంగారమును బ్రాణమునుం గూడ హరించెను. నన్ను బందిం జేసి తనయింటికిం గొనిపోయి తనకుమారునికి వసుభూతి యను వాని కిచ్చి పెండ్లి సేయ నిశ్చయించుకొని యున్నాఁడు. ఆకుమారుఁడు ఒకబిడారును దోఁచుటకై యెటకో పోయి యున్నాఁడు. నాపుణ్యంబున నింకను రాలేదు. ఇఁక దైవమే నాకు శరణము, ఈదొంగలరాయఁడు మీసవ్వడి నెఱుంగు నేని మిమ్ము ఉంపఁడు. కావున ఈయాపదం దప్పించుకొనునుపాయమును ఆలోచించుకొనుఁడు.'

ఇట్లు పశ్రిష్ఠ పలుకఁగా ముఖరకుఁడు క్రమముగా ఆనవాలుపట్టి తన్నుఁ దెలుపుకొని 'అమ్మాయీ, నేనే సుమా యా బంధుద్రోహిని ముఖరకుఁడను, అయ్యో! ఎంత నిర్భాగ్యుఁడను! హా! హా!' అని యేడ్వం దొడంగెను. కని పశ్రిష్ఠయు అన్న నెఱింగి బెగ్గిల్లి ఎల్లనెగుళులచేతను ఒక్కమ్మడి కనికరమున పట్టుకొనఁబడినదియుంబోలె వనటకడలిలో మునింగెను. గతించిన తల్లిదండ్రులంగూర్చి యిట్లు శోకించుచున్న యాయిరువురను అన్నను చెల్లెలిని శ్రీదర్శనుఁడు ఓదార్చి సమయోచితము నిట్లు తెలియఁ జెప్పెను. 'ఇది దుఃఖమునకుం గాలము గాదు. ఆత్మరక్షణోపాయ మిపు డరయవలయును. మున్నుగా ధనము నేనియు నిచ్చి ప్రాణములం గాచికొని, యీ చోరునికి ప్రతిక్రియను పిమ్మట చేయవలయును.' ఇట్లు శ్రీ

దర్శనుఁడు పలుక వా రిరువురు ధైర్యము తెచ్చుకొనిరి. అంతట ముప్వురును చేయవలసిన పన్నాగ మొకటి ఆలోచించుకొనిరి. శ్రీదర్శనుఁడు పూర్వభోజనములచే కృశించియున్నవాఁడు ఇపుడు మాంద్యవ్యాధి గలిగినట్లు నెపముపెట్టి, యా చెఱువు గట్టుననే పడియుండెను. ముఖరకుడు అతని కాళ్లు పట్టుచు ఏడ్చుచుండెను. అంతట పట్టిష్ఠ వడిగా దొంగలరాయనికడ కేఁగి 'చెఱువుకడ మాంద్యవ్యాధివాఁడు బాటసారి యొకఁడు వచ్చియున్నాఁడు. వానితో రెండవవాఁడు పరిచారకుఁ డొకఁడున్నాఁడు. అని తెలియఁజేసెను. అతఁడు తనబంటుదొంగలను పంపెను. వారు పోయి ఆమె చెప్పినయట్ల యచటం గాంచి, అందు ముఖరకుని 'అయ్యా, ఈయనకేమి? ఈయనకై ఏల యిట్లు ఏడ్చెదవు?' అని యడిగిరి. ముఖరకుఁడు దుఃఖ మభినయించుచు నిట్లు త్తర మిచ్చెను.

"అయ్యలారా, ఈయన నాయన్న, బ్రాహ్మణులము, తీర్థయాత్రలు సలుపుచున్నారము, అందువలన ఈయనకు రోగము వచ్చినది. మేము అక్కడక్కడ తిరిగి యిటం జేరితిమి. ఇటకు వచ్చియు రాక ముందే, ఈయన ఇట్లు నిశ్చేష్టుఁడై నాతో 'ఓరీ, లే, లే. త్వరగా నాకు దర్భశయనము సేయుము. ఈ గ్రామమునకుం బోయి గుణవంతు నొక బ్రాహ్మణుం గొని రమ్ము. అతనికి నా సర్వధనము దానము చేసెదను. ఈరాత్రి నేను గడచుట యబద్ధము.' అని పల్కినాఁడు. అంతట విదేశ

ములో సూర్యాస్తమయ మయినపిమ్మట నిప్పుడు నేను ఏమి చేయనుం దెలియక దుఃఖావిష్టుఁడనై యేడ్చును శరణుఁ జొచ్చితిని. సాధువులారా, మీరు దయచేసి ఎవనినేని మంచి బ్రాహ్మణుని ఈయన ప్రాణముతో నుండగానే కొని రండు. ఈయన తనచేతిమీఁదుగానే మాకున్న దానిని బ్రాహ్మణుని కిచ్చుకొనును గాక. ఈయన యెట్లును ఈరాత్రిని దాటఁ జాలఁడు. ఈయన నెడఁబాసి నేను బ్రదుకఁజాలను. రేపు నే నగ్నిప్రవేశము కావించెదను. మహాత్ములారా, మా యీ వేఁడి కోలును నెఱవేర్పుఁడు. మీరే కదా ఇట కనికర మూని మమ్ము గనవచ్చినయకారణబాంధవులు."

దొంగలు జాలిగొని, తమదొరకడ కేఁగి వృత్తాంతముఁ దెలిపి 'సామీ, చంపి కొనవలసినదానిని దానముగాఁ గొందువు రమ్ము.' అని పిలిచిరి. 'ఇ దెట్లు సరిపడును? చంపక ధనము గొనుట మనకు నీతివిరుద్ధము. హృతధనుఁడు మిగిలి యున్నచో తప్పక ముప్పు దెచ్చును.' అని వసుభూతి వచించెను. ఇట్లు పలికిన యా పాపాత్మునితో బంట్లు 'సామీ, తమ కేల ఇంతసందేహము? హరించుట యెక్కడ, చావనున్నవానివలన దానము గొనుట యెక్కడ? రేపు వా రిరువురు బ్రదికియుండిరేని చంపి వేయుదము. వృథాగా బ్రహ్మహత్య యేలకట్టుకొనవలయును?' అని పల్కిరి. వసుభూతి వారిమాట కంగీకరించి రాత్రియే ప్రతిగ్రహార్థము శ్రీదర్శనుకడకు వచ్చెను. శ్రీదర్శనుండును దాఁచి

దాఁచి కొంచెకొంచెముగా నిట్టూర్పులు విడుచుచు కొడుకుగా నుడువుచు తల్లియాభరణముల నతని కిచ్చెను. ముడియవిడుపు రాయఁడు కృతార్థుఁడై బంట్లతోఁగూడ నింటి కేఁగెను.

అనంతరము దొంగ లెల్ల రాత్రి నిద్రించుచుండఁగా నెట్లో తప్పించుకొని పద్మిష్ఠ ముఖరకునికడకు వచ్చెను. తత్క్షణమే మువ్వురును లేచి దొంగలు లేనిదారిం బడి మాళవమును గూర్చి తరలిరి. ఆరాత్రియే దవ్వు గడచి, యట గర్జిల్లుచున్న సింహవ్యాఘ్రాది జంతువులకు ఉలికియుంబోలె కరము కంటకవతియు, సంచారికృష్ణసారమృగేక్షణయు, శుష్యత్తనువల్లియు, ఝార చీర చీత్కార పరిదేవనయు, నగు నొక మహాటవిం జొచ్చి మఱునటి పవలెల్ల దాననే నడచుచుండిరి. ఆ శ్రమను చూడ నొల్లమిచేతం బోలె భానుమంతుఁ డస్తాద్రి కేఁగెను. వారు అలసి యాఁకలి గొని ఒక చెట్టుక్రిందం గూర్చుండిరి. రాత్రి యటకు దూరమున గొప్పయగ్నిజ్వాలవలె నగపడెను. 'అది యొక యూరు గావలయు, పోయి చూచెదను.' అని చెప్పి శ్రీదర్శనుఁడు దాని దిక్కుగా నేఁగెను. సమీపించి కనునంత నది యొక రత్నమందిరము, ఆ జ్వాల దాని ప్రభ. అందు దివ్యరూప యక్షిణి యొకతె యుండెను. వెనుకకుఁ దిరిగిన యడుగులును అరమూఁతలు వడినకన్నులును గలవారు యక్షులనేకులు ఆమెచుట్టు నూడిగములు సేయుచుండెరి. అట వారు నానావిధాన్నపానములు తెచ్చి యిడుచుండుటం గాంచి శ్రీదర్శ

నుఁడు యక్షిణిచెంగటి కేఁగి యతిథిభాగ మడిగెను. అతని సత్త్వమునకు నలరి యామె యతఁడు కోరినట్లు ముప్పురకును చాలినంత యన్నపానములు పెట్టించెను. ఆమె యాజ్ఞచే యక్షుఁ డొకఁడు ఆయోగిరంబును బుజంబునం గొని వెంట రా, శ్రీదర్శనుఁడు పద్మిష్ఠాముఖరకులకడకు వచ్చి యక్షునికి సెల విచ్చి, వారితోఁగూడ నానావ్యాన్నములను భుజించి, చల్లని తేటనీరు గ్రోలెను. అంతట నితఁ డెవరో సత్త్వప్రభావ వంతుఁడు దేవాంశుఁడని తలఁచి తనకు ధన్యత గోరి ముఖర కుఁడు శ్రీదర్శనునితో 'మిత్త్రా, నీ వెవరవో దేవాంశజుఁడవు, నాచెల్లెలు పద్మిష్ఠ లోకైకసుందరి, నీకుఁ దగినది, కాన నిదె యీమెను నీ కిచ్చితిని.' అనెను. శ్రీదర్శనుఁడు తద్దయు నలరి మిత్త్రునితో మిత్త్రమా, నీవు నేను కోరినదానినె చేసితివి. నెలవు చేరి యీచెలువను యథావిధి వివాహ మయ్యెదను.'అని చెప్పెను. వా రట్లు సంతుష్టులై యారాత్రి యటనే గడపిరి. వేవఁగానే ముప్పురుం దరలి మాళవములో ఆ శ్రీసేన భూపా లుని రాజధాని కరిగి, నగరమున నలపు దీఱ నొకముసలి బాపనమ్మయింట బసచేసిరి.

అట ప్రస్తావవశమున వారు తమ నామవృత్తాంతములు చెప్పఁగా నామె దిగులుపడిన ట్లగపడెను. వారు కారణ మడుగఁగా నామె యి ట్లనియె:—"నాయనా, నాభర్త సత్యవ్రతుఁడను బ్రాహ్మణుఁడు ఈ రాజును గొలుచుచుండెను. నా పేరు

యశస్వతి, నేను మంచి కులమునం బుట్టితిని. నా పెనిమిటి కాలము చేసిన తర్వాత నాకు ఈ ప్రభువు పరమదయాళువు, ఆయన జీతములో నాలవపాలు జీవనార్థ మిచ్చుచున్నాఁడు. ఇప్పుడు నా పుణ్యముచేత లోకోపకారి కీరాజచంద్రునికి మందులకును మంత్రములకును కుదురని క్షయజాడ్యము వచ్చినది. ఈతనియొద్దల నొక మంత్రవాది తనకు తగినవీరుఁ డెవఁడేని తోడు దొరకినయెడల తాను బేతాళుని సాధించి యీవ్యాధిని మాన్పునట్లు ప్రతినపట్టియున్నాఁడు. ఊరెల్ల నీమాట దండోరా వేసినను వీరుఁ డెవ్వఁడును బయటఁ బడలేదు. అంతట రాజు మంత్రులతో నిట్లు చెప్పినాఁడు 'జూదగాండ్రకై ప్రసిద్ధమయిన మహామఠమున్నది గదా? అక్కడికి వచ్చెడు కితవులలో వీరు నెవ్వనినేని కనిపట్టుఁడు. కితవులు అన్నిటికిం దెగించి జాయాబంధుధనవిహీనులై, భయ మెఱుంగక యోగులవలె తిరుతలవాసులై యుందురు?' ఆ యాజ్ఞను మంత్రులు మఠాధిపతికి తెలియఁజేసిరి. అది మొదలు మఠాధిపతి ఆగంతుకులలో వీరుని వెదకుచున్నాఁడు. మీరును జూదరులు. శ్రీదర్శనా! నీవు ఆపనికి దంటవేని యిపుడే నిన్ను మఠాధిపతి కడకు నేను గొనిపోయెద. తేనివలన నీకును సత్కారము కలుగును. నాకు నుపకారి వగుదువు. ఏలికకైనయీదుఃఖము నాప్రాణములను హరింపనున్నది సుమా" ఆమాట విని శ్రీదర్శనుఁడు 'అవ్వా, నేను ఇందులకు వలంతిని, నన్ను మఠమునకుం గొనిపొమ్ము.' అని యడిగెను.

ఆమె వెంటనే పద్మిష్ఠాముఖరక సమేతముగా శ్రీదర్శనుని కొనిపోయి మఠాధిపతికి 'ఇతఁడు బ్రాహ్మణుఁడు జూదగాఁడు, వైదేశికుఁడు, ఇతఁడు రాజుకై మంత్రవాదికి సాహాయ్యము సేయ సమర్థుఁడు. సిద్ధముగా నున్నాఁడు.' అని తెలియఁజేసెను. మఠపాలుఁడు శ్రీదర్శను నడుగ నతఁ డొప్పుకొనెను. అంతట మఠపుఁడు శ్రీదర్శనుని సత్కరించి రాజు కడకుం గొని పోయెను. శ్రీదర్శనుఁడు కృష్ణచతుర్దశీ చంద్రునివలె పాండుకృశుని రాజును గని వినయవినతి సేసి కూర్చుండెను. ఇతని భవ్యాకారముం గాంచి రాజు ఇతనివలన తనకార్యము నెఱవేఱు నని యూరట గొని, 'సౌమ్యా, నీజతనంబున నిక్కంబుగా నా తెవులు శమిల్లును. నీదర్శనము కాఁగానే నామేన నొవ్వు రూపఱినది. అందులకిదియే తార్కాణము. కావున ఆర్యా, నీవు సాహాయ్య మొనర్పుము.' అని పల్కెను 'దేవా, ఇ దేపాటి?' అని శ్రీదర్శనుఁడుత్తరము చెప్పెను. అంతట రాజు మంత్రవాదిని రప్పించి 'వీఁడుగో నీకు తోడు ఇఁక నీ వాపని నెఱవేర్పుము.' అని యానతిచ్చెను. మంత్రవాది శ్రీదర్శనునితో 'భద్రా, బేతాళుని రావించుటకు తోడ్పడ సమర్థుఁడవేని ఈకృష్ణచతుర్దశి రాత్రి చీఁకటి పడిన తర్వాత ఈయూరి వల్లకాటిలో కార్యసిద్ధికై నన్నుం గలసికొమ్ము.' అని నియమించి వెడలిపోయెను.

శ్రీదర్శనుఁడు తేనివలని సెల వొంది మఠమునకుం బోయెను. అట పద్మిష్ఠాముఖరకులతో భోజనము సల్పి, రాత్రి

ఒంటరిగా కత్తి చేకొని వల్లకాటి కేఁగెను. భూతాకులం బయ్యు శూన్యం బై, అశివం బయ్యు నదచ్ఛివం బై, అంధకార బంధురం బయ్యును ఆలోకోపచితంబై, విరుద్ధముల కాటపట్టయిన యాశ్మశానంబున వీరుఁడు శ్రీదర్శనుఁడు గ్రుమ్మరి తన్మధ్యప్రదేశంబున నామంత్రసాధకునిం గాంచెను. అతఁడు మేనెల్ల బూది యలంది పెంద్రుకలజన్నిదంబు వైచికొని పీనుఁగుకట్టు వలువం దలపాగ చుట్టుకొని నీలిగుడ్డందాల్చి యుండెను. శ్రీదర్శనుఁ డతనిం దఱియం జని తన్నెఱుకపఱిచి నడికట్టుకొని సాధకుని 'నీ కేమి చేయవలయును ?' అని యడిగెను. సాధకుఁడు హృష్టుఁడై 'ఇక్కడికి పడమట అరకోసుదూరమున పాడెచిచ్చు వేఁడిచే నాకులు మాఁడిన శింశుపాతరు వొకటి యున్నది. దానిమూలమున నుండు శవమును గాయపఱుపక యిటకుం గొనిరమ్ము.' అని నియమించెను. శ్రీదర్శనుఁడు వల్లెయని వడిం బోయి యాచెట్టుకడ శవము నిం కొకఁడు కొని పోవుచుండం గని, పరుగెత్తి వానిబుజమునుండి శవమును లాగెను. వాఁడును వదలఁ డాయెను. 'వదలు. నేను కాలువనున్న నామిత్త్రుని నీ వెచటికిఁ గొనిపోయెదవు?' అని శ్రీదర్శనుఁడు వాని నదలించెను. వాఁడును శ్రీదర్శనునితో 'వదలను, వీఁడు నామిత్త్రము, వీనికి నీ వెవ్వఁడవు?' అనెను. ఇట్లు ఇరువురును ఆపీనుంగును ఒక్కొక్కబుజము పట్టిలాగుచుండఁగా నా పీనుఁగు భేతాళావిష్టమై భయంకరముగా నఱచెను. అంతట నా రెండవ

వాఁడు గుండె బ్రద్దలై చచ్చెను. అంతట శ్రీదర్శనుఁడు ఆశవ మును గొని నడువ సాగెను. ఇంతలో ఆద్వితీయుఁడు చచ్చియు బేతాళాధిష్ఠితుఁడై లేచి శ్రీదర్శను నడ్డగించి 'నిలునిలు, నా మిత్త్రుని బుజమునం గొని ఎట కేఁగెదవు? కదలకుము.' అని నిరోధించెను. వాఁడు భూతావిష్టుఁడై యుండుట శ్రీదర్శనుఁ డూహించి 'ఓయి, ఇతఁడు నీమిత్త్రుఁ డనం బ్రమాణ మేమి? ఇతఁడు నామిత్త్రుఁడే' అనెను. 'అట్లని యితఁడే మన కిప్పుడు బ్రమాణము.' అని ద్వితీయుఁడు పలికెను. అంత శ్రీదర్శనుఁడు 'అట్లయిన నితఁడే ఎవఁడు తనమిత్త్రమో చెప్పునుగాక.' అనెను. అంతట శ్రీదర్శనుని బుజమున నున్న శవము బేతాళావిష్టమై ఇట్లనియె;— 'నే నను మాట యిది. నే నాఁకలిగొని యున్నాను, నాకు ఎవఁడు తిండిపెట్టునో వాఁడు నామిత్త్రుఁడు. వాఁడు నన్ను తనయిచ్చ వచ్చినట్లు కొనిపోవచ్చును.' ఆశవ మిట్లు పల్కఁగా ద్వితీయుఁడు నాకడ నాహారము లేదు. ఇతని కున్న దేని యితఁడే నీ కిడుఁగాక.' అనియెను. 'ఇదే నే నిడియెద' అని శ్రీదర్శనుఁడు ఆద్వితీయునే తనబుజముమీఁది బేతాళుని కాహారముగా నిడుటకై కత్తి దూసి వేయునంతలో రెండవవాఁడు బేతాళాధిషితుఁడు తత్సిద్ధిచేత అదృశ్యుఁడై పోయెను. అంతట శ్రీదర్శనునిబుజమున నున్న బేతాళుఁడు 'ఏదీ, నాకిడియెద నని యొప్పుకొంటివే ఆభోజనమును పెట్టుము.' అని యడిగెను. అంతట శ్రీదర్శనుఁడు మాంసాంతరము దొరకమిచే తనమాంస

మునే కత్తితో నఱికి యతని కాహార మిడెను. అంత బేతా ళుఁడు తనివిఁ జెంది యి ట్లనియె:— 'ఓయి మహాసత్త్వుఁడా, నిన్ను నేను మెచ్చితిని. నీయోఁడలు అక్షత మగును. నన్నుంగొని పొమ్ము. ఈకార్యము నీకే సిద్ధించునులే, ఆసాధకుఁడు స్వల్ప సత్త్వుఁడు. వాఁడు నశించును. అట్లు బేతాళుఁడు పలికిన మా త్రాన శ్రీదర్శనుఁడు స్వస్థదేహుఁడై బేతాళుని గొనిపోయి సాధకుని కిచ్చెను. సాధకుఁడు సంతోషించి విరిదండలతోను మైపూఁతలతోను ఎఱ్ఱవానితోఁ బూజించి, మానిసియెమ్ముల సున్నంపు ముగ్గుతో గొప్పమండల మొకటి లిఖించి దాని మూలల నెత్తుటికుండ లుంచి మానిసిక్రొవ్వుతైలంబున దీపము వెలిగించి నడిమి గొప్పవిరివిలో బేతాళాధిష్ఠిత మైన యా శవమును వెదకిలం బడుండఁ బెట్టి తాను దాని ఱొమ్ము పైఁ గూర్చుండి మనుష్యాస్థినిర్మితము లైన స్రుక్స్రువములతో దానినోట వేల్వఁ దొడంగెను. నిముసములో ఆబేతాళునినోటి నుండి బెట్టిదంపుజ్వాల యొకటి బయలువెడలెను. దాన నాసా ధకుఁడు వెఱ గొని లేచి యవలికి జరిగెను. బమగొని చేతిస్రు క్స్రువముల జాఱవిడిచెను. అంతట సత్త్వ మెడలిన యాసాధ కుని తలముకొనిపోయి బేతాళుఁడు నోఱు తెఱచి సాంగో పాంగముగాఁ దిగఁబొఱ మ్రింగెను. దానిం గని శ్రీదర్శనుఁడు కత్తి యెత్తి మీఁదికి రాఁగా బేతాళుఁడు 'ఓయి శ్రీదర్శనుఁడా ఇట్టి నీధైర్యమునకు సంతసించితిని. నానోటి యీ యావాలను

నీవు గైకొమ్ము. వీనిని తలకు కట్టుకొని చేత నుంచుకొన్న మా త్రాన రాజు యక్ష్మరోగము శాంతించి సేమ మొందును. నీవును త్వరలో సర్వభూమికి ఏలిక వగుదువు.' అని వక్కాణించెను. ఆమాటకు శ్రీదర్శనుఁ డి ట్లనియె;— 'సాధకుఁడు లేక నే నొంటిగా రాజుకడ కెట్లు పోదును? స్వార్థపరత్వముచేత నీతఁడు, సాధకునిం జంపివేసినాఁడు. అనిగదా రాజు పలుకును' శ్రీదర్శనుఁ డి ట్లనఁగా బేతాళుఁడు, 'నీకు నేను తారాణ్యము చెప్పెద, దాన నీమీఁది దోషము దొలంగును. నేను మ్రింగిన యీ సాధకుని శవము కడుపు చించి రాజాదులకు చూపుదువు గాక.' అని పలికి ఆవా లిచ్చి శవమును వదలి యెటకో పోయెను. అంత నాశవము నేలం గూలెను. అంతట శ్రీదర్శనుఁడు ఆయావాలు గొని తనవారున్న యామఠమున నారాత్రి శేషముం గడపి తెల్ల వాఱఁగానే రాజు సన్నిధికిం బోయి రాత్రి వృత్తాంతమంతయు నివేదించి మంత్రులను వెంటం దెచ్చి పీనుఁగు కడుపు చీల్చి అందలి యాసాధకుని మృతుని వారికిఁ జూపెను. అనంతరము రాజునకు తలను చేతను ఆయావాలు కట్టెను. దాన రాజు సకలవ్యాధియుం దీఱి హాయిం బొందెను. అంతట ప్రాణదాతయైన శ్రీదర్శనుపై శ్రీసేనమహారాజు కరము తుష్టుఁడై సంతతిలేనివాఁ డగుటచే నతనిని పుత్త్రునిగాఁ గైకొని అప్పుడే యతనికి యౌవరాజ్య పట్టాభిషేకము చేసెను. సుక్షేత్రమందు చల్లిన సుకృతబీజము మహాఫల మొసంగును.

గదా. అనంతరము మహాభాగుఁడు శ్రీదర్శనుఁడు పూర్వసేవార్థము తోడ వచ్చిన లక్ష్మీనో యనఁ బద్మిష్ఠను యథావిధి పెండ్లియాడెను. అనంతర మావీరుఁడు పద్మిష్ఠతోఁ గూడ భోగములనుభవించుచు, ఆమెయన్న ముఖరకునిఁ గూడ తనయొద్దనయుంచుకొని పుడమి నెల్ల నేలుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు ఉపేంద్రశక్తి యను గొప్పవర్తకుఁడొకఁడు సముద్రతీరమున తనకు రత్నవినాయకమూర్తి యొకటి దొరకఁగా తెచ్చి యువరాజునకు కానుక చేసెను. వెలలేని యావిగ్రహముం గని యువరాజు భక్తితో దానిని మహావిభవముతోఁ బ్రతిష్ఠ సేయించెను. వినాయకస్వామికి నిత్య భోగార్థము వేయి గ్రామము లిచ్చెను. సర్వజనులును వచ్చి దర్శింప యాత్రోత్సవము చేయించెను. ఇట్లు ఉత్సవంబున నతఁ డొనఁగూర్చిన నృత్తగీతవాద్యములకు మెచ్చి రాత్రి గణనాయకుఁడు, గణములతో నిట్లనియె:—'ఈ శ్రీదర్శనుఁడు నా ప్రసాదమున భూమిలో సమ్రాట్టగును. పడమటి సముద్రములో హంసద్వీపమని ప్రసిద్ధమైన ద్వీపము కలదు. అందు అనంగోదయుఁ డని రాజు. ఆయనకు అనంగమంజరి యని స్త్రీరత్నము కూఁతురు, నాభక్తురాలు. ఆకన్య నన్నుఁ గొలుచుచు నిత్యము సర్వపృథ్వీపతి తనకు భర్త గావలయు నని వేఁడుచున్నది. కావున ఆకన్నియను శ్రీదర్శనునికి భార్యగాఁ గూర్చెద. ఇట్లు చేసిన నిరువురకును నాభక్తి ఫలించినదగును. కావున మీరు త్వరగా శ్రీదర్శను

నచటికిం గొని పోయి యుక్తిగా ఇరువురకు నన్యోన్యసందర్శ
నము కలిగింపవలసినది. సంయోగము వీరికి కాలక్రమమునం
గాఁగలదు. ఇప్పుడే అది కలుగదు, భవితవ్యత యట్లున్నది.
మఱియు దీన నాప్రతిమ నిచటికి తెచ్చి యిచ్చిన యీయుపేంద్ర
దత్తునికిని ఉపకారము అగును.' ఇట్లు గణాధిపతి ఆనతీయఁగా
గణపురుషులు రాత్రియే నిద్ర నున్న శ్రీదర్శనుని హంసద్వీపము
నకుఁ గొనిపోయి, అచట అనంగ మంజరి పడుకటింట ఆమెసెజ్జ
మీఁద పెట్టిరి.

క్షణములో శ్రీదర్శనుఁడు మేల్కొని రత్నదీపములు
వెల్గుచుండ వెలలేనితోరంపు మానికంబుల మేలుకట్టు డాలో
లయు తెలిగంటిదొరపచ్చరాకట్టునేల చీఁకటు లల్లిబిల్లి గొన్న
పడుకటింట మంచముపై వెన్నెలలు వెదచల్లు వెలిపట్టుపుట్టంపు
దువ్వలువ గప్పినసెజ్జపై నిదురించుచున్న యనంగమంజరిని
సర్వతః ప్రస్ఫురత్తార తారావళీ మనోరమ మైన గగనంబున
తెల్ల మబ్బు తునియమీఁద నున్న శరచ్చంద్ర మూర్తివోలె
నేత్రానంద కరిని అమృతస్యందసుందరద్యుతికలాపను గాంచెను.
కాంచి శ్రీదర్శనుఁడు సంతసించి వింతపడి కలంగి క్షణ మిట్లు
చింతిల్లెను:—'ఎక్కడ నిద్రించితిని, ఎక్కడ మేలుకొంటిని?
ఇ దేమి? ఈయెలనాగ ఎవ్వతె? ఇది నిశ్చయంబుగా కలయేని,
అది యిట్టి దగుట మేలే? కావున ఈవెలందిని మేల్కొలిపి
కాంచెద' అని యెంచి యాతఁడు అల్లన కేల ననంగమంజరి

బుజముం గదలించెను. ఆమెయు నతనికేలు సోఁకినంత నెలకరము సోఁకిన కలువతీవియవోలె తత్క్షణమే కనుఁదెంట్లు అల్లన రేఁగ మెలఁకువంగాంచెను. అతనింగని, 'ఇతఁడెవఁడో దివ్యరూపుఁడు, నిక్కముగా నెవఁడో దేవుఁడు గావలయు, ఒండేని చోర నలవి గాని యిచ్చోటి నెట్లు ప్రవేశించినాఁడు" అని క్షణము తలపోసి, లేచి వినయసంభ్రమంబులు పెనఁగొన 'ఎవరు మీరు, ఇట నేల ప్రవేశించితిరి ? ఆనతీవలయును.' అని శ్రీదర్శను నడిగెను. శ్రీదర్శనుఁడు తనవృత్తాంతముం దెల్పెను. ఆమెయు నతఁ డడుగ తన పేరు కులము దేశముం దెలిపెను. వా రిట్లు ఒండొరుల మాటలచేతనే అది కల గా దని యెఱింగియు నిశ్చయార్థము నగలను మార్చుకొనిరి. అంత నయ్యిరువురును గాంధర్వవివాహమునకు తమకపడుచుండ గణపురుషులు ఇరువు రను మోహపెట్టి నిద్రపుచ్చి నిద్రితుఁ డయినంత శ్రీదత్తుని అతనియింటం దెచ్చి యుంచిరి,

అనంతరము శ్రీదత్తుఁడు తనయింట మేలుకాంచి యింతి తొడవుల నున్న తనమేనిం జూచికొని యిట్లు తలంచెను:—

'అహో ! ఇ దేమి, హంసద్వీపేశ్వరుని కూఁతురు ఆకోమలాంగి యేది ? దివ్య మయిన యాపడుక టి ల్లేది? నేను మరల నిచటనే యుండుట యెట్లు ? కలగాదు. ఇవే యాకొమ్మ తొడవులు తార్కాణము. కావున నిశ్చయముగా ని దేమో విధివిలాస విశేషము.' ఇవ్విధమున చింతించుచు, శ్రీదర్శనుఁడు భార్య సాధ్వి

శుని ఇట్లు స్తుతింపసాగెను:— ‘సుమేరుశిఖరమువలె కల్యాణ మయమూర్తివై నక్షత్రమాలాలంకృతోత్తమాంగుండ వగు నీకు నమస్కారము ; నృత్యోత్సవమందు నీవు సరళముగాఁ బైకెత్త నాకసము డుయ్యూచు త్రైలోక్యభవనంపునిట్రాడువోలె నొప్పు నీకరమునకు నమస్కారము ; ఓవిఘ్ననాశకా, సర్వ సిద్ధులకును మూలకారణ మయిన నీపాపసొమ్ముల పెద్దబొజ్జకడుపునకు నమసార్కము.’ ఈతీరున నట బ్రహ్మసోమ మహాయోగి గణేశుని స్తవము సేయుచున్నతఱిని ఆవినాయకప్రతిమ నటకుం దెచ్చిన యుపేంద్రశక్తి కుమారుఁడు మహేంద్రశక్తి యను వాఁడు పిచ్చియెత్తి యథేచ్ఛము తిరుగుచుండువాఁడు అచటికి దైవవశంబున వచ్చి యా మహాయోగిం గని అతని మీఁదికి పరువెత్తి పట్టుకొనఁ బోయెను. అంతట నాయోగి యాతనిని సమంత్రకముగా చేత నడిచెను. అంత నావణిక్కుమారుఁడు వెఱ్ఱి కుదిరి తెలివి వచ్చి తన దెసమొలతనమునకు లజ్జితుఁడై చేతితో గోచి మూసికొని తన యింటికిం బోయెను. వాని రాకను మున్నుగా లోకులవలన విని తండ్రి ఎదురు వచ్చి ఆనందపూరితమానసుఁడై పుత్త్రుని ఇంటికిం గొని పోయెను. ఇంట వానిని స్నాన మాడించి వస్త్రాదికముల నలంకరించి వెంటం బెట్టుకొని ఆబ్రహ్మసోమ మహాయోగికడకు వచ్చెను. పుత్త్రదాత యయిన యాతాపసునికి విస్తారము ధనము తెచ్చి

సమర్పించెను. దివ్యసిద్ధి సంపన్నుఁ డాయోగి దానిం దాఁకఁ డాయెను.

ఇంతలో ఈవృత్తాంతము తెలిసి శ్రీదర్శన సమేతుఁడై శ్రీసేనుఁడు వచ్చి యా తపస్విని దర్శించి పాదములకు ప్రణమిల్లి స్తుతించి 'ఓ మహాత్మా, తమరాకచేత పుత్త్రుఁడు స్వాస్థ్యము పొందుటం జేసి ఈ వర్తనునికి ఉపకారమైనది. అట్లే నన్నును అనుగ్రహింపుఁడు, నా తనయునికి ఈ శ్రీదర్శనునికి కుశల మగు నట్లు సేయుఁడు.' అని వేఁడుకొనెను. అంతట తాపసుఁడు చిఱు నగవుతో 'రాజా, ఈదొంగకా నన్ను అభీష్టసిద్ధి సేయు మని యెదవు ? ఇతఁడు రాత్రి అనంగమంజరి యనురాజకన్య హృదయంబును ఆభరణములను మ్రుచ్చిలి హంసద్వీపమునుండి యిట కేతెంచినవాఁడు గదా. అయినను నీ మాటను నే నెఱవేర్ప వలసినది.' అని పల్కి శ్రీదర్శనుని ముంగిటికిం గొనిపోయి ఆతనితోఁ గూడ నంతర్ధాన మాయెను. అట నుండి హంసద్వీపమున కేఁగి శ్రీదర్శనుని రాజధానికిం గొనిపోయి అనంగోదయునికి అతని కొమారిత యాంభరణములతోఁ నప్పగించెను. రాజు సంతసించి తాపసునిపాదములకు మ్రొక్కి శ్రీదర్శనుని గారవించి మంచిదినమున నతనికి అనంగమంజరిని రత్నౌఘ మాలాలంకృతను పంటవలంతినింబోలె నిచ్చి వివాహ మొనర్చి నవవధూసమన్వితు నతని తాపసునిప్రభావముచేత మాళవము సేర్చెను, ఇట్లు ఇల్లు సేరి శ్రీదర్శనుఁడు రాజునకు సంతసముగా

భార్యాద్వయాన్వితుఁ డై సుఖ ముండెను. కాలక్రమమున శ్రీసేనభూపతి పరలోకప్రాప్తుఁడు కాఁగా శ్రీదర్శనుఁడు ఆ రాజ్యము నేలుచు భూమి నెల్ల జయించి సామ్రాజ్య మొంది పద్మిస్థానంగమంజరు లిరువురయందును ఇరువురు పుత్త్రులను పద్మసేనానంగసేనులను బడసెను.

ఇట్లు కాలము గడచుచుండఁగా నొకనాఁడు శ్రీదర్శనరాజు అంతఃపురమున దేవేరు లిరువురతోను ఉండఁగా బయట నొక బ్రాహ్మణుఁడు ఏడువ సాగెను. అతసిని శ్రీదర్శనుఁడు తన యెదుటికి రప్పించి యాక్రందకారణ మడుగఁగా, నతఁడు దిగులు దోఁప నిట్లు మొఱ యిడెను: 'ఓరాజా, నా పావకుఁ డుండెనే దీప్తశిఖుఁడు, అతని నిప్పుడు కాలమేఘుఁడు అట్టహాసమోచనుఁడు జ్యోతిర్లేఖా ధూమలేఖా సమేతముగా నాశము చేసినాఁడు.' ఇట్లు పలికి ఆ బ్రాహ్మణుఁడు తత్క్షణమే అదృశ్యుఁ డాయెను. 'ఇతఁడు చెప్పిన దేమి ? ఇతఁ డెటు పోయినాఁడు ?' అని రాజు ఆశ్చర్యమునం బలుకుచు దేవేరులవంకం గనునంత నా యిరువురును కన్నీళ్లు జడిగా నేడ్చుచు మృతినొందిరి. పిడుగుఁబాటువంటి యాఘోరమరణముం గని రాజు 'అయ్యయ్యో ! ఇ దేమి ?' అని యేడ్చుచు మూర్ఛిల్లి నేల వ్రాలెను. అంత నతసి ననుచరులు అవలికిం గొనిపోయిరి. దేవేరులను వెలువరించి ముఖరకుఁడు అగ్ని సంస్కారము గావించెను. మూర్ఛ తీఱి తెలివి వచ్చినంతట రాజు కడుంగడు నిల్లాండ్ర మృతికి వందురి, నెయ్య

ముచే నౌర్ధ్వదైహిక క్రియలను జరిపించెను. కన్నీటిమునురు వలనిచీఁకటిలో నొకయేడు గడపి, రాజ్యమును ఇరువురుకొమారులకును పంచి యిచ్చి నగరము వదలినవాఁడై తనవెంటవచ్చు వారలను నివారించి తపోవన మాశ్రయించెను.

శ్రీదర్శనుఁ డచట కందమూలఫలములు ఆహారముగా వసించుచుండి యొకనాఁడు తిరుగుచు సమీపమున నొకమఱ్ఱి చెట్టు కానరాఁగా, దానికడకుం బోయెను. ఆకస్మికముగా నతఁడటకు రాఁగా ఆమ్రానినుండి దివ్యాకారలు ఇరువురు తరుణులు ఫలమూలములు చేత నిడుకొని వెలువడి 'రాజా, రమ్ము, మా యొసంగు నీఫలమూలములను గయికొమ్ము.' అని వేఁడిరి. 'ముందుగా మీ రెవరో చెప్పుఁడు' అని శ్రీదర్శనుఁడు అడిగెను.

'మాయింటికి రమ్ము. అచట చేరి నీ వడిగినవిషయమును యథాతథముగాఁ జెప్పెదము.' అని యా దివ్యాంగనలు వల్కిరి. శ్రీదర్శనుఁడు వల్లె యని వారితోఁగూడ చెట్టుం జొచ్చి అందు దివ్యమయిన యొక బంగారునగరమును గాంచెను. అట విశ్రమించి దివ్యఫలములు భుజించెను. అంతట నాచెలువలు ఆతనితో తమ వృత్తాంతము నిట్లు వక్కాణించిరి. ' వినుము మహారాజా,' పూర్వము ప్రతిష్ఠానపురమందు కమలగర్భుఁ డని బ్రాహ్మణుఁ డుండెను. ఆయనకు పథ్యయు బలయు నని ఇరువురు భార్య లుండిరి. కాలక్రమమున ముదిమి గ్రమ్మఁగా నామువ్వురు

నొండొరులమీఁది యనురక్తిచేత నొక్కట నగ్నిప్రవేశము చేసి, ఆసమయమున వారు 'మాకు ఇట్లే జన్మజన్మమందును భార్యాపతిత్వము కలిగింపుము స్వామీ' యని అగ్నిదేవుని వర మడిగిరి. అంతట కమలగర్భుఁడు తీవ్రతపోమహిమచే యక్ష జాతియందు ప్రదీప్తాక్షునికి పుత్త్రుఁడుగా అట్టహాసునికితమ్ముఁడుగా దీప్తశిఖుఁ డనుపేర జనించెను.ఆతనిభార్యలు పథ్యాబలలు ధూమ కేతుఁ డనుయక్షపతికి కొమార్తెలుగా పుట్టి జ్యోతిర్లేఖా ధూమ లేఖా నామములం బరఁగిరి. కాలమున నాకన్నియలు జవ్వ నము రాఁగా అరణ్యమున కేఁగి మంచిభర్త కలుగుకొఱకు హరుఁడు మెచ్చ తపము సల్పిరి. ఆదేవుఁడు మెచ్చి యగపడి ఇరువురకు ని ట్లానతిచ్చెను. 'కన్యలారా, మీరు పూర్వజన్మ మున ఎవనితోడ భార్యాపతిత్వమును సకలజన్మములకును వేఁడి కలసి చిచ్చుం జొచ్చితిరో, ఆమీపతి యిపుడు అట్టహాసుని తమ్ముఁడుగా దీప్తశిఖుఁ డనుపేర యక్షుఁడై పుట్టియున్నాఁడు. వాఁ డిపుడు ఘోరశాపముచేత మనుష్యజాతిలో శ్రీదర్శనుఁ డనుపేరఁ బుట్టియున్నాఁడు. కావున మీరును మర్త్యలోక మున జన్మించి యతని కచట భార్య లగుఁడు. శాపాంతమున నెల్లరును మరల యక్షుల రయ్యెదరు.' ఇట్లు గౌరీపతి యాన తీయ నారువురు యక్షకన్యలును పద్మిష్ఠానంగమంజరులుగా భూలోకమున జన్మించి శ్రీదర్శనునికి భార్య లయిరి. అట్లుండ నట్టహాసుఁడు బ్రాహ్మణరూపమున వారికడకు వచ్చి యుక్తిగా

శ్లిష్టవాక్కుల నామములు పలికి పూర్వజన్మమును జ్ఞప్తికి తెచ్చెను. అంత నాయంగన లిరువురును మర్త్యదేహము విడిచి యక్షాంగన లయిరి. మేమే ఆయిరువురము. నీవే ఆదీప్తశిఖుఁడవు." ఇట్లు వారు చెప్పఁగా శ్రీదర్శనుఁడును తనపూర్వజన్మము జ్ఞప్తియై వెంటనే దీప్తశిఖుఁడై విధికృపచేత మరల ఆ భార్యలతో కూడుకొనెను.

ఓయి విచిత్రకథకుఁడా, నేనే సుమా ఆయక్షుడను దీప్తశిఖుఁడను, ఈయిరువురే ఆనాప్రేయసీమణులు జ్యోతిర్లేఖయు ధూమలేఖయును. దేవాంశజుల మైన మాబోంట్లకు సుఖదుఃఖములు కలుగు చుండ మనుష్యులమాట చెప్ప వలయునా? మీకును త్వరలో మీదొర మృగాంకదత్తునిదర్శనము కలుగును, కావున ఖేదము మానుము. నేను నిచట నీ కాతిథ్యము సేయ నిలిచియున్నాఁడను, ఇది భూలోకములో నానివాసము. ఇట నుండుము. నీకోరికను నేను నెఱవేర్చెదను. అనంతరము నాతావయిన కైలాసమునకుఁ బోయెదను — ఇట్లు పలికి యక్షుఁడు నన్ను కొన్నిదినము లట నిలుపుకొని యుపచరించు చుండెను. నేఁటిరాత్రి ఆసుమతి మీరిటకువచ్చి యుంట యెఱింగి, మీరెల్ల నిదురగూడి యుండ నిద్రితుని నన్నుం దెచ్చి మీనడుమ పెట్టినాఁడు. మీరు నన్నుఁ గంటిరి, నేనును మిమ్ముం గంటిని. దేవా, ని న్నెడఁబాసిన కాలమున నావృత్తాంత మిది.

సార్థకనాముఁ డగు విచిత్రకథకమంత్రివలన మృగాంక దత్తుఁడు కడమవారితోఁగూడ నత్యానందము౦ బొంది ఆరాత్రి ఆయడవిలోనే గడపి తదనంతరము నాగశాపవియోజితులను ఇంకను కలసికొనని కడమమంత్రులను వెదకుచు శశాంకవతికై యుజ్జయినికి పయనము సాగించెను.

---

## ౭-వ తరంగము.

### ప్రచండశక్తి కథ.

అనంతరము ఆనలువురుమంత్రులతోను ఉజ్జయినిం గూర్చి వింధ్యారణ్యములో పయనము నడచుచు మృగాంక దత్తుఁడు దారిలో కాయలు పండ్లు దట్టంపునీడ తియని చల్లని తేటనీటి తటాకములుం గలిగి సకలేంద్రియములకుం బందువు గా నున్న యొకకానం గని అందు విడిసెను. అందు సచివులతోఁ గూడ స్నాన మాడి, ఫలములు భుజించి, ఒక్కప్రక్క తీవ గుబురులో సంభాషణంబోలె విని కుతూహలముచేత పోయి చూచునంత నట తీవలలోపల నొక గొప్పయడవియేనుఁగు దారి నడకచే నలసినయొకపురుషునికి అంధునికి తొండముతో నీళ్లు పండ్లు తెచ్చి యిడుచు చెవివీవనలతో చల్ల గాలి వీచుచు, సేద దేర్చుచు, స్ఫుటముగా మనుష్యవాక్కులతో 'అయ్యా,

కొంచెము మాయాసము తీఱినదా?' అని మాటిమాటికి సౌజన్యముతో నూఱడించు చుండెను. దానిం గని వింత గొని మృగాంకదత్తుఁడు చెలికాండ్రం బిలిచి చూపి, 'చూడుఁడు వన్యగజమేమి? మనుష్యునివలె నిట్లాచరించుట యేమి? అవశ్యముగా నీ యేనుగు ఎవరో మహాపురుషుడు, కారణవిశేషముచే నిట నీతీరున నున్నాఁడు. ఈ రెండవవాఁడు మనచెలికాఁడు ప్రచండశక్తివలె నున్నాఁడు. మఱి గ్రుడ్డి యేమి? కావున త్వరగా తెలిసికొందము.' అని మిత్రులతోఁ బలికి అటనే చాటుగా నిలిచి పరికించు చుండెను. అంతట నేద దేరిన యంధుని ఏనుఁగు 'అయ్యా, నీ వెవరవు? గ్రుడ్డి వయ్యును ఇక్కడి కెట్లు వచ్చితివి? చెప్పుము.' అని యడిగెను. అంత నాయంధుఁడు గజేంద్రునితో నిట్లు పలికెను. 'అమరదత్తుఁడని అయోధ్యను రాజు ఏలుచున్నాఁడు. ఆయనకు మృగాంకదత్తుఁ డని గుణోత్తముఁడు కుమారుఁ డున్నాఁడు. ఆపుణ్యజన్ముని బంటను నేను ప్రచండశక్తి యనువాఁడను. ఒకప్పుడు కారణవిశేషముచే నేను లోనగు పదుగురు సహాయులతోఁ గూడ ఆరాజకుమారుని తండ్రి దేశము వెడల నడిచెను. అంతట మే మందఱము శశాంకవతికై ఉజ్జయినికిఁ దరలి దారిలో పారావతనాగునిశాపముచే అడవిలో ఒండొరుల నెడఁబాసితిమి. నేను ఆశాపముననే గ్రుడ్డినై తిరుగుచు ఫలమూలజలములు దొరకిన నాహారము గొనుచు క్రమముగా నిటకు వచ్చితిని. బ్రహ్మదేవుఁడు నాకు గోడువెట్టు

వాఁడై, గోతులలోఁ బడుట, ఆహారము లేమి, ఇట్టిఖేదములు తీర్చిన దగుటచే నా కెంతయు నిష్టమైనను మృత్యువును మాత్ర మెంత వేఁడినను ఒసంగఁ డాయెను. నాయొంకటిబాధ యిపుడు నీవలనం దీఱుటం బరికింప నా గ్రుడ్డితనమును నీకృపవలననే తీఱు నని తలంచెద. నీ వెవరో దైవత మవు.' ఇట్లు అతఁడు పలుకఁగా నిశ్చయము తెలిసి మృగాంకదత్తుఁడు హర్షశోకము నడుమం బడినవాఁడై మంత్రులతో ని ట్లనియె.—'ఇతఁడు ప్రచండశక్తియే. అయ్యో! ఎట్టికష్టదశకు వచ్చినాఁడు, ఇపుడే త్వరగా నితని మనము సంభావించుట సరిగాదు. ఒకవేళ నితని కీయేనుఁగు నేత్రోపకారము గూడ చేసినం జేయును మనలం గనిన నిది యవలికి తొలంగి పోయినం బోవును. కాన ఈవిషయమున తుదిం గనవలయును.' ఇట్లు పలికి యనుచరసహితుఁ డై వినుచు నచటనే యుండెను. అంతట ప్రచండశక్తి ఆవారణరాజమును 'అయ్యా, మహాత్మా, నీ వెవరో, నీకు ఈగజత్వ మేల కలిగెనో, సమదునికి నిర్మద మైన యీ వా క్కెట్లు గలిగెనో, నాకుం దెలియఁ జెప్పుము.' అని యడిగెను. నిట్టూర్పు నిగిడించి గజేంద్రుఁ డిట్లు చెప్పం దొడంగెను.

### వారణకథ.

నావృత్తాంతము నామూలముగాఁ జెప్పెదను వినుము. ఏకలవ్య యను నగరమున శ్రుతధరుఁ డని రా జుండెను. ఆయన కిరువురు భార్యలు, ఇరువురకు నిరువురు కుమారులు. తండ్రి

పరలోకగతుఁ డయినతర్వాత పెద్దకుమారుని శీలధరుని చిన్నవాఁడు సత్యధరుఁడు తఱిమి వేసి రాజ్యమును తాఁ గైకొనెను. అంతట నా పగచేత శీలధరుఁడు శంకరుం గూర్చి తపస్సు చేసి మెప్పించి ప్రత్యక్షము చేసికొని 'దేవా, నేను గంధర్వుఁడను గావలయు, దాన నాకాశగామినై నాదాయాదుని సత్యధరుని అవలీలగా జయింప నగును. నాకట్లను గ్రహింపుము' అని వరమడిగెను. శంభుఁ డి ట్లానతిచ్చెను:— 'మంచిది నీవు కోరినట్లే యగును, కాని నీశత్రువు ఇపుడు మృతుఁ డైనాఁడు. రాఘానగరములో ఉగ్రభటుఁ డనురాజునకు సమరభటుఁ డనుపేర కుమారుఁడుగా జన్మించును, నీవును వానికి అన్నవుగా సవతితల్లికడుపునం బుట్టుదువు, వానిం బరిమార్చి నీవు రాజ్య మేలుదువు. నీవు పగఁబూని తపస్సు చేసితివిగాన మునిశాపమున పదభ్రష్టుఁడవై వనగజమ వవుదువు. నీకు పూర్వజన్మజ్ఞానమును వ్యక్తవాక్కును గలుగును. నీవు అట్లుండి బడలినయతిథిని ఎప్పుడు ఉపచరించి సేద దేర్చి యాతనికి నీవృత్తాంతము చెప్పుదువో అప్పుడు గజత్వము పోయి గంధర్వుఁడ వగుదువు, అపుడే ఆయతిథికిని ఉపకార మగును.' ముక్కంటి యీవిధమున నానతిచ్చి యంతర్ధానము కాఁగా, శీలధరుఁడు చిరతపఃక్షీణమయిన తన దేహమును గంగలో వైచెను.

తర్వాత రాఘానగరమందు ఉగ్రభట భూపాలుఁడు సవర్ణ యగుపట్టపుదేవి మనోరమతో సుఖం బుండ నొకనాఁడు

లాసకుఁ డను నట్టుగుఁడు వచ్చి పూర్వము దైత్యులచేతి యమృతమును హరి స్త్రీరూపమున హరించిన కథను నాటక మాడించెను. అందు వాని కూఁతురు లాస్యవతి యనునది అమృతికావేషమును ధరించెను. రాజు ఆవేషమున వాస్తవమోహినీ రూపంబునోలె విశ్వక్షోభితదానవం బయిన యా లాస్యవతి రూపంబు గాంచి, చిగురువిలుకాని ములుకులకు గుఱియై, తల్లడిల్లి వర్తకునికి విస్తారము ధన మిచ్చి, కూఁతును లాస్యవతిని తన యంతిపురమునం జేర్చుకొని, దానిని వివాహ మాడి, దాని మోమున కన్నులు గ్రుచ్చి కాలము పుచ్చుచుండెను. చిరకాలము పుత్త్రులు కలుగ కుండఁగా నొకప్పుడు రాజు యజుఃస్వామినాముని నిజపురోహితుం బిలిచి, తనకై పుత్త్రకామేష్టి చేయు మనెను. అంత నతఁడు విద్వాంసు లయిన బ్రాహ్మణులను రావించి పుత్త్రేష్టి కొనసాగించి, మంత్రపూత మయిన పాయసములో నగ్రభాగమును తనయందు భక్తురా లయిన పెద్దదేవేరి కొసంగి, మిగత ఆ రెండవదానికి లాస్యవతి కిచ్చెను. దాన నాయిరువుర గర్భంబులను మున్ను వాకొన్న శీలధర సత్యధరు లుద్భవించిరి. కాలమున పట్టపుదేవి మనోరమ కల్యాణలక్షణుని కుమారునిఁ గనియెను. అతఁడు పుట్టిన యాసమయమున నాకసమునుండి 'ఈ శిశువునకు భీమభటుఁ డనిపేరు. ఇతఁడు మహాఖ్యాతితో రాజ్య మేలును.' అని వాక్కు స్పష్టముగా వినఁబడెను. మఱునాఁడు లాస్యవతి కుమారుం గనెను,

వానికి తండ్రి సమరభటుఁడని పేరిడెను. కుమారు లిరువు రును కృతసంస్కారులై క్రమముగా వర్ధిల్లుచుండిరి. వారిలో భీమభటుఁడు సమరభటునికన్న గుణాధికుఁడై యుండెను. ఆ కారణమున వారిరువురకును ఘర్షణ కలుగుచు వైరము పెరుఁగుచుండెను.

ఒకనాఁడు క్రీడాపోరియాటలో సమరభటుఁడు బలాత్కారమున భీమభటుని గొంతుమీఁదం గొట్టెను. అంతఁ గినిసి భీమభటుఁడు వానిని తనరెండుచేతులతోను బిగియఁబట్టి యెత్తి నేలం గొట్టెను. దాన సమరభటుఁడు నలంగి నవరంధ్రముల నెత్తురు గ్రక్కుచుం బడి యుండ, తదనుచరులు అతనిని లేపి కొనిపోయి తల్లి కప్పగించిరి. ఆమె ఆయవస్థలో నున్నపుత్త్రుం గని, అది భీమభటకృత మని విని, దిగులు కొని, నెయ్యంబున సుతుని మోమున మోము చేర్చి, బిగ్గరగా నేడ్వ సాగెను. అంతలో రాజు వచ్చి కని చిత్తము బిత్తరపోయి లాస్యవతిని కత మడుగ నామె యిట్లు చెప్పెను. 'నా తనయునికి భీమభటుఁడు పెట్టిన యవస్థ యిది. వాఁ డెప్పుడును వీనిని కొట్టుచునే యుండును. నేను తమతో చెప్పుట లేదు. వాఁ డిట్టివాఁ డయిన పిమ్మట నిఁక తమకు మాత్రము నేమ మెట్లో నే నెఱుంగఁ జాలను. తమరే ఆలోచింపుఁడు.' ఇక్కరణి ప్రాణప్రియ పలుకఁగా విని యుగ్రభటుఁడు కోపగించి భీమభటుని తనచెంత నుండి దవ్వు చేసెను. అంతట నతని తల్లి మనోరమ అతనిం

బిలిచి 'పుత్త్రా, నట్టువదానివలపుగాఁడై తండ్రి నిన్ను త్యజించినాఁడు, నీవు పాటలీపురమునకు మీమాతామహుని యింటికిం బొమ్ము. ఆయనకు పుత్త్రులు లేరు. ఆయన నీకు తన రాజ్యమిచ్చును. ఇట బలవంతుఁడు శత్రువు సమరభటుఁడు నీకు ప్రాణాపాయము సేయును' అని బోధించెను. 'అమ్మా, క్షత్త్రియుఁడ నయ్యు నేను పందవలె వెఱచి దేశము వదలి పోవుదునా? అమ్మా, నీవు ధైర్యముతో నుండుము, ఈ క్రించు నన్నేమి సేయగలఁడు!' అని భీమభటుఁడు తల్లి కుత్తర మీయ, ఆమె వెండియు 'అట్లేని పుత్త్రా, నాధనములం గొని నీవు పెక్కురను సహాయులం గూర్చుకొమ్ము.' అని చెప్పెను. భీమభటుఁడు అది సరిగాదనియు, అట్లు చేసిన తండ్రిపై శత్రుత్వము వహించిన ట్లగు ననియు, ఆమెదీవనలచేతనే తనకు మేలగు ననియు, చెప్పి సమాధానపఱచి, ఆమెను వీడ్కొనెను. అంత నీవృత్తాంత మెఱిఁగి పౌరు లందఱును 'ఓహో, భీమభటువిషయమై రాజు కర మనుచిత మాచరించినాఁడు. ఇతని రాజ్యమును హరించుటకు సమరభటుఁడు సమర్థుఁడు గాఁడు, కావున భీమభటునికి పూర్వసేవ సేయుటకు మన కిది సమయము.' అని కలయఁ బలికికొని, రహస్యముగా నతనికి భృత్యవర్గసమేతముఁగా సుఖం బుండఁ జాలినంత ధనము నొసంగిరి. తమ్ముఁడితనిం జంప నుపాయమునే వెదకు చుండెను. తనకై పరివారాది సామగ్రీసమృద్ధి నిడిన తండ్రికిని అదే యాలోచన పుట్టిం

చెను. ఇట్లుండ శంఖదత్తుఁ డనెడి బ్రాహ్మణ కుమారుఁడు శూరుఁడు ప్రాయమువాఁడు ధనవంతుఁడు ఆయన్నదమ్ముల కిరువురకును చెలికాఁడు ఒకనాఁడు సమరభటుని కడకు వచ్చి 'మిత్త్రమా, అన్నతో ఈపోరాటము నీకు తగదు, ఇది ధర్మము గాదు, మఱియు పెద్దవాని నతని నీవు బాధింప సమర్థుఁడవు కావు. నీకు కేవల మపకీర్తి కలుగును.' అని హితము చెప్పెను. అంత సమరభటుఁ డతనిని నిందించి చీవాట్లు పెట్టి పంపెను. మూర్ఖునికి హితము చెప్పుట కోపమునకే గాని శాంతికిఁ గాదు. అంతట శంఖదత్తుఁడు వీరుఁడు కోపంబున వానిమీఁద పగఁ బూని వాని జయించుటకై భీమభటునితో ఏకసఖ్యము చేసి కొనియెను.

ఇట్లుండ మణిదత్తుఁ డని యొక వర్తకుఁడు దేశాంతరము నుండి యొక తేజోహయమును విక్రయార్థము కొనివచ్చెను. ఆహయము చంద్రధవళంబును శుద్ధశంఖాదిమనోహర నిస్వనం బును నై ఎత్తుగా లేచిన పాలకడలియలవోలె విరాజిల్లుచుం డెను. గంధర్వకులంబునం బుట్టుటం గలిగినవో యన రోచ మాన చూడామణ్యంగదాదులతో నలంకృత మై యుండెను. దాని రాకను శంఖదత్తునివలన నెఱింగి వెల యిచ్చి ఆవర్తకుని వలనం గొనునంతలో ఆవృత్తాంత మెఱిఁగి సమరభటుఁడు వచ్చి వర్తకుని రెట్టివెలకు తన కమ్ము మని యడిగెను. అమ్మక మయి అప్పటికే గుఱ్ఱము పరుని సొమ్మయినందున వర్తఁకుడు సమ్మ

భటుని కీయఁ డాయెను. అంత సమరభటుఁడు గుఱ్ఱమును బలిమిని హరింపఁ జొచ్చెను. అంతట వాని యనుచరులు కత్తులు దూసికొని పై కొనఁగా నిరువురకును రాజపుత్త్రులకు పోరు ఘటిల్లెను. అందు భీమభటుని బాహుదండంపు ఘాతములకు అనుచరు లెల్లం గూలఁగా, సమరభటుఁడు చావునకు వెఱచి విఱిగి పలాయితుఁ డాయెను. అతనిం బలాయమానునిఁ దఱిమి జుట్టుపట్టుకొని శంఖదత్తుఁడు పగ మీఱ మడియింప నుండఁగా, భీమభటుఁడు పోయి యతనితో 'వీని నింకను బ్రదికియే యుండ నిమ్ము, ఒండుచో మానాయనకుం దగును.' అని చెప్పి నివారించెను. అంతట సమరభటుఁడు శంఖదత్తునివలననుండి విడుపు పొంది భయమునం బలాయితుఁడై గాయములవెంట నెత్తురులు దొరుఁగ తండ్రి పజ్జకుఁ బోయెను. ఈ వడువున క్షణములోఁ గుఱ్ఱమును గైకొన్న భీమభటునికడకు నొక బ్రాహ్మణుఁడు వచ్చి ఏకాంతమునకుఁ గొనిపోయి యి ట్లనియె. "అయ్యా, నీతో మాయమ్మ మనోరమాదేవి, పురోహితుఁడు యజుఃస్వామి, మాతండ్రి మంత్రియు, నిట్లు చెప్పుమన్నారు.— 'వత్సా, నీయం దెట్టి మనస్సుతో నున్నాఁడో యెఱుంగుదువు గదా, ఇప్పుడు ఈ పెనఁకువచే నీకు కేవలము శత్రువే అయి నాఁడు. కావున నిన్ను కీర్తిని ధర్మమును కాపాడుకొందువేని భవిష్యత్తు నాలోచింతు వేనియు, మమ్ము హితులనుగాఁ దలంతు వేనియు, ప్రొద్దు క్రుంకఁగానే ఎవ్వరికిం దెలియనీయక ఊరు

వదలి కార్యసిద్ధికై మీతాత యింటికి పొమ్ము.' ఇట్లు నీకు వార్త పంపుచు ఈభాండమును మేలి రత్నములతోను బంగారములతోను నిండించి నీకు నాచేత పంపినారు. దీనిం గయికొమ్ము." ఆబ్రాహ్మణునివలన నీమాట విని యంగీకరించి యారత్నభాండమును గైకొని వారికి తగిన యుత్తరము ఆతనికి చెప్పి పంపి భీమభటుఁడు అట్లే చీఁకటి పడఁగానే కత్తి కేలఁగొని ఆగుఱ్ఱమునే యెక్కి, వేఱుగుఱ్ఱముపై హేమరత్నములు పదిల పఱుచుకొని శంఖదత్తుఁ డెక్కి కూడ రా, అచట నుండి తరలెను.

ఆ రాత్రి చాల దూరము గడచిన రాజకుమారుఁడు దారిలో నెల్లువనములో ప్రవేశించెను. దుముకుచుం బోవుచున్న గుఱ్ఱముల గొరిజలు తాఁకి నెల్లు చప్పుడు కాఁగా ఆ చప్పుడునకు మేల్కొని అందు సింగపుదంపతులు కొదమలతోఁ గూడ లేచి గర్జించుచు గుఱ్ఱములను గోళ్లతో కడుపుక్రింద చీల్చినవి. అంతట భీమభటుఁడు తానును మిత్త్రుఁడును ఆ సింగంపుఁగుటుంబమును కత్తిపోటుల రూపుమాపి, గుఱ్ఱములను చూచుకొను నంతలో నవి రెండును ప్రేవులు తెగి నేల వ్రాలి మడిసినవి. దానిం గని దుఃఖితుఁడై భీమభటుఁడు శంఖదత్తునితో 'మిత్త్రమా, ద్వేషు లయిన దాయాదులనుండి తప్పించుకొని పోఁగలము గాని వేచగల జతనపడినను విధి నెట్లు తప్పించుకొందుము ! మనకు వాహనమాత్రముంగూడ నోర్వక

విధి యిచట మనల నిట్లు గీడ్పడఁ జేసెఁగదా. దేనికై మనము దేశత్యాగమే చేసి వచ్చితిమో ఆగుఱ్ఱమే చచ్చినది. ఇఁక నీ యడవిని ఈరాత్రి వేళ కాలినడకను ఎట్లు దాఁటుదుము?' అని పలికెను. అందులకు శంఖదత్తుఁడు 'మిత్రమా, పురుష కార మును విపరీతదైవ మడంచు ననుమాట క్రొత్తగాదుగదా. ఇది దానికి స్వభావమే. అట్లే ధైర్యమున కది యోడిపోవుటయు స్వభావమే. కొండను గాలివోలె కదలనిధీరుని విధి యేమి సేయఁగలదు. కావున రమ్ము ధైర్యహయముల నెక్కి పోవు దము.' అని ప్రోత్సాహము సేయఁగా, సరియే యని భీమ భటుఁడు అటనుండి యతనితోఁ గూడ తరలెను. తెల్లుచే పాదములు చీలుచు నతఁడు అడవిని దాఁటునంతటికి పలపల వేగినది. అంతట జగద్దీపము సూర్యుఁడు ఉదయింపఁగా, 'ఆహా! ఇతఁడు పుణ్యముచే సింహాదివ్యాకీర్ణ మయిన యీ యడవిని దాఁటినాఁడు.' అని అతనిం గని యొండొకటితో నోరు తెఱచి పలుకుచున్నవి వోలె తేంట్లమ్రోఁతతో విరియుచున్న తామరలచే దారిలోని పద్మినులు ఒప్పు మీఱుచుండ, నతఁడు క్రమముగా వయస్యునితో నడచి, తాపసులయాకుటింట్లు గల జమ్మేటి యిసుకతిన్నెం జేరెను. అందు వలిమలల్లుని యాదలం గాఁపుర మున్న తఱి తనలోఁ గలసిన జాబిల్లియమృతంపు కాలు నలచేతనుంబోలె తియ్యనైన యాచల్లనినీళ్లలో స్నానము చేసి రాకొమరుఁడు విశ్రమించి యుండి, బోయయొద్ద శంఖదత్తుఁడు

లేడియొకటిచ్చి విలిచి వేచి యుడ, దాన దేహావృత్తిం గావించెను. గంగ నిండి దాటఁగూడక అలచేతు లెత్తి వల దని మాటిమాటికి వారించునదివో లె తోఁచుచుండం గని భీమభటుఁడు గట్టున మఱికొంతదూర మేఁగి యట నొకయాకుటింటిముంగిట విజనంబున నొంటరిగా వేదపారాయణము సేయుచుం గూర్చున్న యొక బ్రాహ్మణకుమారుం గని 'అయ్యా, నీ వెవరవు? ఈనిర్జన ప్రదేశంబున ఒంటరిగా నేమి సేయుచున్నావు?' అని యడిగెను.

అతఁ డి ట్లనియె: "నేను కాశీవాసిని, శ్రీకంఠుఁ డను బ్రాహ్మణునికుమారుఁడను, నాపేరు నీలకంఠుఁడు. నాకు మానాయన సంస్కారము లెల్ల గావించినాఁడు, తర్వాత నేను గురుకులవాసము చేసి విద్యలు గఱచి ఇంటికి మరలి వచ్చునంతటికి నాబంధువు లందఱు మృతిఁ బొందియుండిరి. అంత నే ననాథుఁడను ధనహీనుఁడను గావున స్వార్థసిద్ధి లేమికి ఖిన్నుఁడనై యిట కేతెంచి తీవ్ర మయిన తపం బొనర్చితిని. అంత గంగాదేవి నాకు స్వప్నములో దర్శన మిచ్చి పం డ్లిచ్చి 'పుత్త్రా, ఈపండ్లను భుజించుచు ఇటనే యుండుము, నీకోరిక నెఱవేఱును.' అని యనుగ్రహించెను. నే నంతట మేల్కాని వేగుజా మగుట గంగలో స్నానము చేసి నీటం గొట్టుకొనివచ్చిన పండ్లం గని కయికొని యాకుటింటికి వచ్చి యట నమృతమధురములను ఆ పండ్లను భుజించితిని. ఇట్లు ప్రతిదినమును ఫలములు వచ్చుచుండును, నేను వానిని భుజించుచు నిట నున్నాఁడను. ఇది

నా వృత్తాంతము.'' దీని విని భీమభటుఁడు శంఖదత్తునితో 'మిత్త్రమా, ఇతనికి గుణవంతునికి గార్హస్థ్యమునకు చాలినంత ధన మిచ్చెదను.' అనెను. అతండును అంగీకరించెను. అంతట భీమభటుఁడు తనకు తల్లి పంపినయాధనమును ఆబ్రాహ్మణ కుమారుని కిచ్చెను. తలుఁగని సత్త్వధనము కలమహాత్ములు ఒరులయార్తిని విని నంతనే తీర్పరేని మఱి వారిమహత్త్వ మేమి? ఆవిప్రుని అట్లు ధన్యుం జేసి గట్టువెంబడినే ఎంతదూర మేఁగినను భీమభటునికి దాఁట నుపాయ మేమియుఁ గాన రాదాయెను. .

అంత భీమభటుఁడు కత్తిని తలకు తోడవువోలెఁ గట్టుకొని, శంఖదత్తునితోఁగూడ ఏట దిగి అడ్డముగా నీఁద సాగెను. నడిదారిలో ఏటివడిచే మిత్త్రుఁ డితనికి దూరమై పోయెను. ఇతఁడు నీటివడియందు కొట్టుకొనిపోయియు ఎట్లో అవలిగట్టు చేరి అట మిత్త్రునిం గానక గట్టుపొడుగునను వెదకు చుండెను. ఇంతలో ప్రొద్దు గ్రుంకెను. అంతట భీమభటుఁడు నిరాశుఁడై, 'ఓ మిత్త్రుఁడా' యని బిగ్గరగా పేర్కొనుచు, ఎట్లును అతనిం బడయనేరక దుఃఖాతిరేకమున గంగలోఁ బడ నుద్యుక్తుఁడయి 'ఓ గంగాదేవీ, నాచెలికాఁడు శంఖదత్తుఁడే నాప్రాణము, అతనిని హరించితివి గదా, అతఁడు లేమిచే శూన్య మయిన యీదేహమును నీవే కొనుము.' అని పలికి నీటిలో దుముకఁ నుండఁగా నీటిలోనుండి గంగాదేవి సాక్షాత్తుగా

ఆవిర్భవించి అతని తీవ్రసంవేగమునకు సంతోషించి 'పుత్త్రా, సాహసము చేయకుము, నీమిత్త్రుఁడు బ్రతికియున్నాఁడు, త్వరలోనే నిన్నుఁ గలసికొనును. ప్రతిలోమానులోమముల ఈ విద్యను నావలనఁ గయికొమ్ము, దీనిని అనులోమముగాపఠించువాఁడు ఒరుల కదృశ్యుఁ డగును ప్రతిలోమముగా పఠించిన తాఁ గోరినరూపమున నొరుల కగపడును ఇది ఏడక్షరముల మంత్రము. దీనిప్రభా ం బిది. దీనిప్రభావంబున నీవే ఈభూమిలో రాజ వగుదువు.' అని యనుగ్రహించి, అదృశ్య ఆయెను.

అంతట చెలికాఁడు దొరకునని యాసగొని భీమభటుఁడు మరణోద్యోగము మాని స్వప్నమువోలె మిత్త్రప్రాప్త్యుత్సుకుఁడై రాత్రియెల్లఁ గడపి, వేకువ అతనిని వెదకికొనుచు ఆచోటినుండి తరలి ఒంటరిగా తిరుగుచు క్రమమున లాటదేశము చేరెను. అచట జనులు అసంకీర్ణవర్ణు లయ్యును చిత్రోజ్జ్వలస్థితి కలవారు. ఆదేశము కళలకు నిలయ మయ్యును దోషాకరనామ మొంద దాయెను. దానిరాజధానిలో భీమభటుఁడు దేవాలయములను లోఁగిండ్లను చూచుచు తిరుగుచు ఒకచోట ద్యూతకారులశాలం గని లోనికి పోయి జూదగాండ్రం గాంచెను. వారు మొలకుమాత్రమే గుడ్డగలవా రయినను ధనార్జనకై ఆ కళ నాశ్రయించిరేగాని గూఢైశ్వర్యసంపన్నులే యని మృదువులై సరిగా విభాగములు గలవై పుష్టిగలవై భోగవ్యాయామములను సూచించుచున్న వారి యవయవములచేత

తెలియ వచ్చుచుండెను. భీమభటుఁడు వారితో భాషించి జూద మాడఁ దొడంగెను. వారును ఇతఁడు నగలు గలవాఁడు తమవాతఁ బడినభక్ష్య మని తలంచి యాడం దొడంగిరి. పాచికలచే భీమభటుఁడు వారిధనమును, ఒండ్లమోసపుచ్చి వారు ఆర్జించినదాని నెల్లను, పుచ్చుకొనెను. అట్లు ధన మోడి పోయి యాజూదరు లిండ్లకు లేవఁగా వారిని ద్వారమునకు చేతు లడ్డముంచి పో నీయక నిలిపి, భీమభటుఁ డి ట్లనియె:—'మిత్రులారా, ఎట కేఁగెదరు? ఇదె యీధనమును గైకొనుఁడు. ఇది నా కేల, నేను దీనిని నాయిష్టుల కియ్యవలసినదే గదా, మీరు నాయిష్టులు గారా? మీకు సాటివారు ఇష్టులు నా కెక్కడ దొరకుదురు!' ఇ ట్లతఁడు బతిమాలినను వారు లజ్జచే పుచ్చుకొన కుండఁగా, వారిలో అక్షక్షపణకుఁ డనువాఁడు ఇ ట్లనియె:—'గెలుచుకొన్నదానిని మరల నియ్యఁ గూడ దని ద్యూతమర్యాద వాస్తవమే, అట్లయినను ఇతఁడు తా గెలుచు కొన్న ధనమును తన యిచ్ఛప్రకారము మైత్రిచే మన కిచ్చునేని మన మేల కొనఁగూడదు?' ఆమాటకు ఇతరు లి ట్లనిరి:—'ఇతఁడు మనతో నిట్టిశాశ్వతసఖ్యము చేయునెడల మనము పుచ్చుకొనవచ్చును.' వా రట్లు చెప్ప భీమభటుఁడు వారిని వీరపురుషులనుగా నెంచి, అట్లే వారితో సఖ్యము చేసి వారికి ఆధనము నిచ్చివేసెను. అనంతరము వారు ప్రార్థింపఁగా వారితోఁ గూడ నుద్యానవనమునకుఁ బోయెను. అచటికి వా

రును సకుటుంబముగా వచ్చిరి. అట భీమభటుఁడును వారు తెప్పించిన భోజనపానాదికములను గ్రహించి విహరించు చుండెను. అంతట వారడుగఁగా తనకులమును పేరును వృత్తాంతమును చెప్పెను. అతఁడు నడుగఁగా వారిలో అక్ష క్షపణకుఁడు నిజవృత్తాంతము నిట్లు వక్కాణించెను.

### అక్షక్షపణకునికథ; ఒంటె, అత్తా కోడండ్ర కథ.

హస్తినాపురములో శివదత్తుఁ డని బ్రాహ్మణుఁడు మహా ధనికుఁ డుండెను. నేను ఆయనకొమారుఁడను, నాపేరు వసు దత్తుఁడు. నేను చిన్నతనముననే శస్త్రవిద్యలను వేదవిద్యలను నేర్చితిని. మాతండ్రి సమాన మయిన యింటివారిపిల్లను నాకు పెండ్లిచేసినాఁడు. మా తల్లి యతికోపన, అతిక్రూరురాలు, ఆమెమనసుప్రకారము నడచుకొన నెవ్వరికిని తరము గాదు. ఆమెబాధ పడలేక మాతండ్రి నాభార్యయింటికి వచ్చునటు కుండి తర్వాత మా కెవరికిం దెలియనీక యెటకో పోయెను. అంతట నేను భయపడి మాయమ్మ యిచ్చుచొప్పున నడచుకొన మిక్కిలి జాగ్రత్త వహించి నాభార్యను కూడ నట్లే నడచు కొమ్మని బోధించితిని. అదియును అట్లే చేయుచుండెను. తల్లి మాత్రము ఎట్లును తనియక నిరంతరము కలహించుచునే యుండెను. ఊర కుండుట యవమానించుటగా, దీనముగా పల్కుట వంచనగా, నమ్మజెప్పుట వివదించుటగా, ఆమె తలం చుచుండెను. ఎరగలికి వేఁడి మాన్పఁగలవాఁడు కలఁడా! ఆమె

విరుద్ధచేష్టలకు తాళఁజాలక దిగులుపడి నాభార్య ఎటకో లేచి పోయెను. నేను దుఃఖితుఁడ నై యిల్లు వదల నుంకింపఁగా పాపాత్ములు బంధువులు కూడి నాకు మరల పెండ్లి కావించిరి. ఆ రెండవభార్యనుగూడ మాయమ్మ వేధించినది. ఆవేధ పడలేక అది ఉరిఁబోసికొని చచ్చినది. నేను మఱియు ఖిన్నుఁడనై దేశత్యాగము సేయ సమకట్టఁగా మరల బంధువులు నన్ను నివారింప వచ్చిరి. వారికి నేను తల్లిదుశ్చేష్టితమును వర్ణించితిని. నేనెంత చెప్పినను వారు నామాటలను నమ్మరు. మాతండ్రి దేశత్యాగి యై పోయినందులకు ఏ మేమో వేఱు కారణములు కల్పించి చెప్పసాగిరి.

అనంతరము వారిని నమ్మించుటకొఱకు నే నొక యుపాయము చేసితిని. కొయ్యబొమ్మ నొకదానిం జేయించి రహస్యముగా వివాహము చేసికొన్నట్లు అభినయించి దానిని తెచ్చి వేఱుగృహంబున నుంచి బయట రానీక యడ్డుగడియ వేయించితిని. దానికి పనికత్తెగా నొకకావలిదానిని పెట్టితిని. నేను అమ్మతో 'అమ్మా, నాక్రొత్తభార్యను వేఱుగా నిం కొకయింట నుంచితిని. మన మిరువురము మనయింట నిట వేఱుగా నుందము. నీవు దానియింటికి పోవలదు. అది మనయింటికి రావలదు. అది యేమియుం దెలియనిది, నిన్ను చక్కఁగా సేవించుకొననేరదు.' అని చెప్పితిని. అమ్మయు నట్లే యంగీకరించెను. కొన్నాళ్లతర్వాత, బయటగడియ వైచిన యింటిలో నున్న

యా హాలిక్కోడలిని ఏవిధమునను తనబారిని వైచికోనేరక, ఒకప్పుడు అమ్మ తానె రాతితో తనతలం గొట్టుకొని, నెత్తి నుండి నెత్తుటిపెల్లు ఒడ లెల్ల ముంప, తనయింటిముంగిటంబడి బిగ్గరగా నేడ్వ సాగినది. ఏడ్పు విని నేనును సకల బంధువులును వచ్చి చూచి ఆమెను యి దే మని యడుగఁగా, ఆమె యీా సుతో ' అయ్యా, కోడలు వచ్చి నిర్హేతుకముగా నన్నిట్లు చేసి పోయినది. ఇఁక నిపుడే నాకు చావు తప్పదు ' అని మొఱ పెట్టెను. అంతట బంధువు లెల్ల కడుం గినిసి ఆమెను నన్నును వెంటఁగొని యాకొయ్యబొమ్మ యున్నతావునకు వచ్చిరి. అడ్డు గడియం దివిచివైచి తలుపు దెఱచి వారు లోనికిఁ బోయి చూచు నంతట నా బొమ్మపెండ్లాము తప్ప వే ఱేమియు లే దాయెను. అంతట మోసపోయి బెగ్గిలి యున్న యమ్మను అందఱుం బరి హాసించుచు నామాటయందు ప్రామాణ్యము నొంది వచ్చిన దారిం బోయిరి.

అనంతరము నేనును ఆదేశమును వదలి త్రిమ్మరుచు ఈ దేశమునకు వచ్చి ఇచట దైవవశమున నీద్యూతశాలలో నడు గిడితిని. ఇట పాచికతోడ జూద మాడుచున్నట్టి వీరిని—చండ భుజంగుఁ డను నితని, పాంసుపటుఁ డనువాని నీతని, ఈశ్మశాన బేతాళుని, ఈ కాలవరాటకుని ఈశారిప్రస్తరుని,—ఈయే వు రను గని వీరితో జూద మాడితిని. గెలిచినవానికి ఓడిన వాఁడు దాసుఁడు కావలసినది, అని పందెము వేసితిని. జూదమున నా

కోడి వీ రెల్ల నాకు దాసులయినారు. గుణములచే వీరి కోడి నేను స్వయముగా వీరికి దాసుఁడ నయితిని. వీరిసంగాతములో నాదుఃఖము మఱుగుపడిపోయినది. ఇపుడు నేను ఇప్పటియవస్థకు తగినపేర అక్షక్షపణుఁడు అని పరఁగుచున్నాఁడను. ఇవ్విధమున నేను గొప్పకులమువారై ప్రచ్ఛన్న వృత్తి నున్న వీరితోఁ బుణ్య వశమునం గలసితిని. నీవును ఇపుడు వచ్చి కూడితివి. కావున నీవు ఇఁకను మాకు దొరవు. ఈబుద్ధిచేతనే గుణానురాగముచే నీధనమును గైకొంటిమి.

## శంఖదత్తుని చేఁప మ్రింగుట.

ఇట్లక్షక్షపణకుఁడు తనవృత్తాంతము చెప్పఁగా నితరులును భీమభటునికి తమతమ వృత్తాంతములం జెప్పిరి. ఇట్లు ప్రయోజనాపేక్షితచే నవలంబించిన కళలచే ప్రచ్ఛన్నులయియున్న యావీరపురుషులను తన సంగాతకాండ్రను నమ్మి, వారితో నానాకథలు సల్పుచు, విహారముల పగలు పుచ్చి, వేల్పుతేని దెస నెమ్మోము చలివెలుంగుబొట్టుతో వెలుంగం గాంచి, భీమభటుఁడు ఉద్యానవనమునుండి వెడలి యక్షక్షపణ కాదులతోఁ గూడ వారినెలవునకుం బోయెను. వారితోఁగూడ నట నతఁడు నివసించి యుండఁగా, వాన గురియుచున్న మబ్బుల యుఱుములచే మిత్త్రప్రాప్తిని చెప్పుచున్నదివోలె వానకారు ఏగుదెంచెను. అంతట నట మత్తుగొని పెనిమిటిపై నలిగిన దయితవోలె విపాశానది కడలి నీ రెదు రెక్కి వెనుకకుం బ్రవహింపసాగెను. నీరు

ఇసుకతిన్నెలను ముంచి పొరలి పాఱెను. వెల్లువ తగ్గినంతట నది అలుక తీఱినదియుంబోలె సముద్రంగూర్చి పోయెను. ఆ పెను వెల్లిలో కడలినీటిపోటుతో నొకమహామత్స్యము వచ్చి ఏటిగట్టున తగుల్కొనెను. దానిం గని జనులు పరుగున నానా యుధములు తెచ్చి దానికడుపుం జీల్చిరి. అందునుండి ప్రాణముతో బ్రాహ్మణకుమారుం డొకఁడు వెడలి రాఁగా ఆవింతకు ఊరెల్ల పెద్దకోలాహల మాయెను. అది విని భీమభటుఁడు పోయి ఆవిప్రకుమారుని శంఖదత్తుని కనుంగొని, పరుగునఁ బోయి కవుంగిలించుకొని, చేఁపకడుపుఁదొలుట కాపురమునం గలిగిన నీచువాసనను కడుగువాఁడుంబోలె నాతని ఆనందాశ్రుపూరంబులలో ముంచెను. శంఖదత్తుఁడును తిమికడుపునుండి వెలువడుటయగాక మిత్రునిం గనుటచేత పండువుపై పండువుం బొందినవాఁ డాయెను. అనంతరము భీమభటుఁడు వేడుకకై యడుగ, శంఖదత్తుఁడు తనవృత్తాంతమును సంక్షేపముగా నిట్లు వక్కాణించెను.

'మిత్రా, అప్పుడు నేను గంగాప్రవాహములో నీ కగపడక కొట్టుకొనిపోయి నాయెఱుక లేకయే యొకగొప్పతిమిచే మ్రింగఁబడితిని. దానికడు పను గొప్ప లోఁగిటిలో ప్రవేశించి నేను ఆఁకటికి దానిమాంసములు సురియతో కోసి భక్షించుచు చిర కాల ముంటిని. దాని నిపుడు దైవము తెచ్చి యిచ్చుట వైచినది. ఈజనులు దానిం జంపిరి, దానికడుపునుండి నన్ను వెలువ

రించిరి. నిన్నును సూర్యునిని నేఁ గంటిని; నా దిక్కులు వెలుతురుం బొందినవి. ఇది నావృత్తాంతము, నే నింతకన్న నెఱుంగను.' ఇట్లు శంఖదత్తుఁడు చెప్పఁగా, భీమభటుఁడును కడమవారును ఆశ్చర్యంబున నిట్లు వాక్రుచ్చిరి. 'గంగలో తిమి మ్రింగుట, పిమ్మట నది సముద్రమునకుఁ బోవుట, ఆదారి నది విపాశ గట్టునఁ బడుట, దానిం జంపుట, దానికడుపునుండి ప్రాణముతో నితఁడు బయట వచ్చుట; ఆహా! విధి నేసిన వింతల గొలుసు!' ఇట్లు అక్షక్షపణకాదులును దానును వాక్రుచ్చుచు భీమభటుఁడు శంఖదత్తుని ఇంటికిం గొనిపోయెను. అచట చేఁపకడుపునుండి ఆయొడలితోనే పుట్టినాఁడో యన నున్న యాతనికి స్నానవస్త్రధారణాదికము లొనర్చి యుత్సవము చేసికొనెను.

ఆతనితోఁ గూడ నట నివసించియుండఁగా నాగరాజు వాసుకికి జాతర వచ్చెను. జాతరం గన మిత్రసమేతుం డై భీమభటుఁడు ప్రజలు మూఁగుచున్న యానాగేంద్రుని దేవళమునకుం బోయెను. విరులదండలతో సురగగణముతోసుంబోలె నిండి పాతాళోదరముఁవోలె నొప్పుచున్న యాదేవళములో నాగేంద్రునికి మ్రొక్కి యటనుండి దక్షిణముగాఁ బోయి, యట నాగేంద్రునిమడుగుం గాంచెను. నాగేంద్రుని పడగలమణుల ప్రభలుం బోలె ఎఱ్ఱదామరలు నిండ, విసపుఁజిచ్చుపొగలమొత్తములు వోలె నల్లగలువలు వెలుంగ, అర్చించుచున్నవియుం బోలె గాలికి రాలుచున్న పువ్వులతోడి పాదపములు గట్టున నొప్పు

మీఱ, మడుఁగు సర్వేంద్రియములకుం బండువుగా నుండెను. 'ఆహా! స్వల్ప మయిన సముద్రము అముద్ర మయినదీనిముందఱ, శౌరిహృతలక్ష్మి అనన్యహార్యలక్ష్మి యగుదీనిముందఱ, ఏపాటి?' అని దానిం గని భీమభటుఁడు తలఁచుచు ఆశ్చర్యపడుచుండఁగా నటకు లాటరాజు చంద్రాదిత్యుని కూఁతురు, కువలయావళి యను పట్టపుదేవి గర్భమున జనించినది, హంసావళి యను కన్య జలక మాడవచ్చెను. దివ్యరూపములైన యంగకములు దాఁచినను ఆమె మర్త్యాంగనయు యని చపల మయిన కనుఁగవ తెప్పపాట్లచే తెలియఁజేసెను. కోటినంటినగుణంబును పిడికిట నిముడు నడుమును గలిగి యావిరిఁబోణి పూవిలుకానివిల్లో యన విరాజిల్లు చుండెను. ఆమె క్రేగంటిచూడ్కికోలతో భీమభటుని యెదను వ్రక్కలించిమోహమునం బడఁద్రోచెను. జగత్సౌందర్యచోరుఁ డతఁడును ఆచూడ్కిదారినే ఆమె హృదయకోశముం జొచ్చి ధైర్యధనమును మ్రుచ్చిలెను. అంత నామె రహస్యముగా ఆప్తచేటిని బంపఁగా అది వచ్చి భీమభటుని నామ నిలయాదికములు తన్మిత్రుల నడిగి తెలిసికొని పోయెను. అంత నారాజకన్య జలకమై పరివారసమేతయై నగరికిం బోవునది మోము వెనుకకు ద్రిప్పి భీమభటుని మరలఁ గాంచుచు దవ్వాయెను.

భీమభటుండును ప్రియాప్రేమపాశమున బందముపడిన వాఁడుంబోలె నడుగులు తడఁబడ నెట్టకేలకు మిత్త్రులతోఁ

కూడ నింటి కేఁగెను. ఇలు సేరినంతనే అతనికడకు రాజకన్య కడనుండి దూతిక వచ్చి ఏకాంతమున "దేవా, రాజకుమారిత హంసావళి నిన్ను వేఁడుచున్నది. 'మదనప్రవాహమునం గొట్టు కొనిపోవుచున్న యీ సంగాత కత్తియను ఒప్పరికించి యిట్లు గట్టున స్వస్థముగా నుంట నీకుఁదగునా?' అని దయిత పంపిన యీవచనామృతమును దూతివలనం గ్రోలి తనకు ప్రాణము దక్కెఁగదా యని సంతసిల్లి భీమభటుఁడు ఇట్లనియె:— 'ప్రవాహంబునం బడిపోవుచున్నవాఁడను గాని గట్టున నున్న వాఁడంగా నని ప్రేయసి నన్నెఱుంగదా, అయినను పట్టు దొరకినదిగదా, ఇఁక ప్రేయసియాజ్ఞను నెఱవేర్చెదను. ఈ రాత్రి యంతఃపురమునకువచ్చి ప్రేయసిని గారవించెదను. విద్యాప్రభా వముచేత మఱెంగి ప్రవేశించు నన్నెవరును గనఁజాలరు.' ఆయు త్తరముం గొని చేటి పోయి హంసావళి కప్పగించెను. ఆమెయు భీమభటునికై యువ్విళ్లూరుచు ఎదురు సూచుచుండెను. భీమ భటుండు రాత్రి కాఁగానే దివ్యాభరణములను దాల్చి గంగా దేవీదత్తమయినవిద్యను అనులోమమునం బఠించి యదృశ్యుఁడై రాజకన్యాంతఃపురము సొచ్చెను. అంతకుముందే యీ ప్రదేశము విజనీకృతం బై యుండెను. కాలాగురుసుగంధియై అయిదు వన్నెలవిరుల మొత్తములచే శోభిల్లుచు కామోద్యానమువోలె రతిప్రీతికరం బయిన యాయుప్పరిగయందు దివ్యసౌరభలహరీ పరీతయై గంగాదత్త విద్యాలతా ప్రథమప్రసూనంబుం బోని

కాంతామణిని హంసావళిని గాంచి ప్రతిలోమముగా మంత్రము నుచ్చరించి యాసొబగుఁడు ఆకస్మికముగా నామె కగపడెను. ఆమెయు నతనిం గని యానందంబున మై గగుర్పొడువ, వణఁకును భయంబును గదుర, మైతొడవులు గణిల్లన, నాక్షణంబున నర్తన మొనర్చు నట్లొప్పు మీఱెను. కన్నెఱికపు సిగ్గున తలవాంచి యామె అట్లు తన్ను ప్రేరించినయెడను కర్తవ్య మడుగుచున్నదివోలె నూరకుండెను. అంతట భీమభటుఁడు ఇట్లు పల్కెను; "ముద్దరాలా, వెల్లడి యైనమనస్సును ఇప్పుడు సిగ్గుచే దాఁపరికము చేసిన నేమి ఫలము? దానిని దాఁచినను దాఁతువుగాక, మేనం బొటమరించిన యీగగుర్పాటు నెట్లు దాఁచెదవు? కుట్టులం బిక్కటిల్లుచున్న యీఱవిక నేమి సేయుదువు?' ఇట్లు వలపులు గులుకు పలుకులచే రాజకుమారుఁడు సిగ్గు నొత్తిగిలఁజేసి గాంధర్వవిధానమున హంసావళిం బరిణయ మయ్యెను. ఆమె యొక్క నెమ్మోముఁదామర నంటిన తేఁటియై యారాత్రిగడపి మరల రాత్రి వచ్చెద నని చెప్పి యొట్టకేలకు నిజావాసమునకుం బోయెను.

తెల్లవాఱఁగానే కంచుకులు వచ్చి యామెతీరు గని రాత్రిసంభోగము నూహించిరి. రేఁగినముంగురులను, వీడ్వడిన కీల్జడయు, కెంపు మాయని గోటినొక్కులును వలపుదొర ములుకుల గాయములకు డిల్లవోయిన లెఱుంగు నెఱింగింపవా? వెంటనే వారు పోయి ఆవృత్తాంతము నామెతండ్రికి నివేదించిరి.

అతఁడు మఱుసటిరాత్రి కనుపెట్టుఁ డని వేగుల నుంచెను. భీమభటుఁడు పవలెల్ల మిత్త్రులతో సుఖముండి, రాత్రి మరల ప్రియాంతఃపురముం బ్రవేశించెను. తమకంటి కగపడకయే యా తఁడు ప్రవేశించె నని యెఱింగి వేగులు అతఁడెవరో సిద్ధుఁ డని తలంచి యటనుండి పోయి రాజుతో చెప్పిరి. రాజిట్లాజ్ఞాపించెను. "సురక్షితమయినయీ ప్రదేశము అలక్షితుఁడై ప్రవేశించినవాఁడు సిద్ధుఁడు గాక మానుషుఁ డెట్లగును? కావున అతని నిటకే గొనికండు, నేఁ గాంచెద. మఱి సవినయముగా మృదులముగా నతనితో నామాటగా నిట్లు పల్కుఁడు: 'ఓ మహాపురుషా, బహిరంగముగా నాకొమారితను న న్నెల యడుగవైతివి. నీవంటిగుణవంతుఁడు వరుఁడు నా కెవఁడు దొరకును? రహస్యమేలచేసితివి?' అని." ఇట్లు రాజు పంప వారు పోయి ద్వారముకడ నిలిచి రాజు చెప్పినట్లే ఆమాట భీమభటు నడిగిరి. రాజు తెలిసికొనె నని భీమభటుఁడు గ్రహించి లోపలన యుండి ధైర్యముతో వారికి బదు లిడెను. ఓరీ, మామాటగా రాజుతో చెప్పుఁడు. రేపు ఆస్థానికి వచ్చి సర్వము విశదము చేసెదము. ఇపుడు రాత్రి గ్రుడ్డిది గదా.' ఈయుత్తరమును వారు రాజున కందించిరి. ఆయనయు వేచి యూరకుండెను. మఱునాఁడు వేకువ భీమభటుఁడు తనచెలికాం డ్రకడ కేఁగి ఆయేఁడుగురు వీరులుందానును వెలలేని వస్త్రాలంకారాది నేపథ్యముం దాల్చి, చంద్రాదిత్యుని యోలగంబునకుఁ బోయెను. అతనితేజుం దెగువ

యు నొకప్పుం గని రాజు మెచ్చి గారవించి యుచితాసనంబున వారినెల్లఁ గూర్చుండఁబెట్టినతర్వాత అతనిచెలికాఁడు బ్రాహ్మణుఁడు శంఖదత్తుఁడు రాజుతో 'మహారాజా, ఈయన రాఢాపతి యగు నుగ్రభటుని పెద్దకుమారుఁడు, అతర్కణీయ విద్యాప్రభావముచే నొరులకు కలఁగని పరాక్రమము గలవాఁడు. ఈయననామము భీమభటుఁడు; మీకొమారితకై యిటకు వచ్చినాఁడు.' అని తెలియఁజేసెను. ఆమాట వినియు రాత్రివృత్తాంతమును స్మరించియు చంద్రాదిత్యుఁడు, ఆహా! ధన్యుఁడ నైతిని, అని విశ్వసించి, వెంటనే హంసావళిని భీమభటుని కిచ్చి మహావిభవంబున వివాహోత్సవము నడిపించెను. భీమభటుఁడు లెక్కలేని హస్త్యశ్వగ్రామములు అరణమొంది హంసావళితోడను లక్ష్మితోడను అట సుఖ ముండెను. క్రమముగా లాటరాజ్యము నతని కిచ్చివేసి చంద్రాదిత్యుఁడు అపుత్త్రుఁడు తపోవనమునకుఁ బోయెను.

అట్లు కృతార్థుఁడై భీమభటుఁడు శంఖదత్తాదిమిత్త్రులేడుగురతోఁగూడ చక్కఁగా నా లాటరాజ్య మేలుచుండెను. ఇట్లు కాలము గడచుచుండఁగా, తన తండ్రి యుగ్రభటుఁడు ప్రయాగలో మృతిఁబొందెననియు, ప్రాణోత్క్రమణకాలమందు నర్తకీసుతుని సమరభటుని రాఢారాజ్యమున కభిషేకము చేసెననియు వేగులవలన భీమభటుఁ డెఱిఁగి, తండ్రికి వగచి భక్తితో నౌర్ధ్వదైహిక క్రియలు గావించి, తమ్మునికి సమరభటుని కిట్లు

దూతచే కమ్మ పంపెను. 'మూర్ఖా, ఆటకత్తె కొడుకా, మా నాయన సింగంపుగద్దియపైఁ గూర్చుండ నీవెవఁడవు? ఈలాట రాజ్య మున్నను ఆగద్దియ నాది, కావున నీవు దానిం దఱియకుము.' దూతవలన నీకమ్మం గొని చదువుకొని సమరభటుఁడు క్రోధము మీఱ 'అయోగ్యుఁడ వనియే గదా నాయన నిన్ను దేశము వెడల నడిచెను. అట్టిదుర్వినీతునికి నీకీకుత్స్యాభిమానము సరియే. తనగవిలో నక్కయు సింగమువోలె పరాక్రమించును, సింగముం గన్నంగదా దానినక్కతనము బయటఁ బడుట.' అని యివ్విధంపు బొబ్బరింత ప్రతిదూత్యముగా కమ్మ వ్రాసి ప్రతిదూతచేత భీమభటునికిం బంపెను. ప్రతిదూతయు బోయి అకమ్మను భీమభటుని కంపఁజేసెను. అతఁడు దానిం జదివించి విని బొబ్బనవ్వునవ్వి దాయాదునిప్రతిదూతతో ని ట్లనియె:—
"ఓరీ, పోయి మామాటగా ఆ నట్టుగుదాని కొడుకుతో పల్కుము.—'మున్ను గుఱ్ఱముకై పోరినప్పుడు శంఖదత్తుఁడు నిన్ను రూపుమాపనుండ, బాలుఁడ వనియు నాయనకు నీయందు మక్కువ యనియుం దలంచి నేనడ్డపడి కాచితినిగదా, మాటిమాటికి నట్లు నిన్ను క్షమింపను. నిక్కముగా నీమాఱు నిన్ను నీపై ప్రేముడిగలవాఁడగు నాయనకడకుం బంపెదను. సిద్ధముగా నుండుము, దినములలోనే నే నచటికి వచ్చితి నని యెఱుంగుము.' అని."

ఇట్లు చెప్పి యాదూత నంపివేసి భీమభటుఁడు దండ యాత్ర చాటించెను. అంతట భీమభటేంద్రుఁడు గజేంద్రపూర్వాద్రి నెక్కఁగానే రాణువకడలి కలంగి ఉబుకసమకట్టెను. పోరికై కూడ తరలినసామంతులయు రాజపుత్త్రులయు దండులతో దిక్కులు పిక్కటిల్లినవి. నణకఁజొచ్చినదై పుడమి నడచుచున్న గజవాజిభరముచే బ్రద్ద లగుదు నని యేమో యులియుచుండెను. ఇట్లు తరలి దండుదుమారములో సూర్యుని దాఁచుచు భీమభటుఁడు రాధానగరము చేరెను. సమరభటుఁడెదిరింగి యోధ్వజాలక సేనతో సన్నాహమై వెలువడి తాను ముందుపడి యుద్ధమునకు వచ్చెను. ఇరువాఁగును పూర్వపశ్చిమాంభోధులువోలె తలపడెను. శూరప్రళయము వేచుచుండెను. బెడిదపుశబ్దములతో నొండొంటిం దాఁకునడిదములవలన జనించునిప్పు, కోపమున కృతాంతుఁడు కోఱలం బటపట కొఱుక నుప్పతిల్లినదియుంబోలె ఆకసముం బొదువుకొనెను. వాఁడికొనలు గలిగి నిడుపులై పక్షులంబులయిన నారసములు వీరులం గాంచెడు నాకతరుణీ కటాక్షపాతము వోలె సాఁగుచుండెను. అంతట దుమారంపు మేలుకట్టును పరిసద్దువాద్యంబులును ఆడునట్టలుం గలిగి కలనిపాలము వెలుంగుచుండెను. నెత్తుటితరంగిణి కరంకవాహినియు ప్రమత్తయు శిరోమాలినియునై కాళరాత్రివోలె జంతువులను హరించుచుండెను. క్రమముగ శంఖదత్తునితోను, అకుశపణునితోను,

కై పోర నేర్పరు లయిన చండభుజంగాది వీరాగ్రేసరులతోను, దుర్మదద్విరదములతోనుంబోలె విలుకాఁ డగు భీమభటుఁడు సమరభటునిదండును విఱిగి పరారి అగునట్లు కొట్టెను. సైన్య మిట్లు విఱిగిపోవ సమరభటుఁడు రథస్థితుఁడై కోపమున పోరి మున్నీటిలో కవ్వంపుమలవోలె తిరుగసాగెను. అంతట భీమ భటుఁడు ఏనుంగుమీఁద వానిం బయికొని వానివింటిని త్రుంచి యలుఁగుల తేరిగుఱ్ఱములునాలుగింటిని గెడపెను. అంతట సమర భటుఁడు తేరు వదలి పరువున వచ్చి తోమరముతో భీమభటుని యేనుఁగును కుంభముపైఁ గొట్టెను. ఆదెబ్బకు ఏనుఁగు నేలఁ గూలెను. అంత నిరువురు పదాతులై కత్తిపో రారంభించిరి. సమరభటునిం గొట్టుటకు విద్యాప్రభావముచేత కంటి కగపడ కుండ మఱుఁగుపడ శక్తుఁడయ్యును, ధర్మ మాలోచించి భీమ భటుఁడు శత్రువు నట్లు చంపలేదు. కత్తిపోర దంటయై యా సత్తికసుతునితలం దునిమెను. అంతట నింగిని సిద్ధచారణుల సాధువాదములు వెలయ, యుద్ధము తుదముట్టఁగా, వందిమా గధులు జయమునుపొగడుచుండఁగా, మిత్రులతోఁగూడ భీమ భటుఁడు రాధాపురీప్రవేశ మొనర్చెను. చిరకాల మెటకో పోయియుండి అరిని రూపుమాపి వచ్చి తల్లిని తనకై తహతహ పడుచున్న దానినిభీమభటుఁడు అలకౌసల్యనుశ్రీరాముఁడువోలె దర్శించి యానందాంబుధిం దేల్చెను. తనజయమునకు పౌరు లలర గుణానురక్తులై పూర్వమంత్రులు తన్ను గారవింప భీమ

భటుఁడు తనతండ్రి సింహాసనము నెక్కి ప్రకృతులను సమ్మా నించి మహోత్సవము చేసెను. అనంతరము శుభదినంబున శంఖదత్తునికి ఆలాటరాజ్యము నిచ్చి యతనిని ఆ దేశపురదండుతోఁ గూడ నచటికి పంపివేసి, ఆయత్తపణకాదులకు పెక్కు గ్రామములును ధనములు నొసంగి వారిని తనయొద్దనే యుంచు కొని లాటరాజకుమారి హంసావళితో తనతండ్రిస్థానముననే సుఖముండెను. క్రమముగా భూమండల మెల్ల జయించి నృప కన్యలను గైకొని తత్సంభోగలంపటుఁడై రాజ్యము మంత్రుల వశము చేసి యెప్పుడును అంతఃపురము వెలువడకయే యుండెను.

ఇట్లుండ నొకనాఁడు యాదృచ్ఛికముగా సుత్తంకుఁ డనుమహర్షి యొకఁడు పూర్వము శంభుఁ డిచ్చినయానతికి విపా కకాలమువోలె నరుదెంచి ద్వారమున నిలిచెను. అతనిరాకను దౌవారికులు వచ్చి విన్నవించినను రాగమదైశ్వర్యదర్పాంధుఁడై భీమభటుఁడు వినిపించుకొనఁడాయెను. అంతట కుపితుఁడై ముని 'ఓరీ మదాంధుఁడా, నీవు రాజ్యము పోఁగొట్టుకొని యడవియేనుంగ వవుదువు పో.' అని యతని శపించెను. దాని విని భయముచే మద ముడిగి భీమభటుఁడు వెలికి వచ్చి మునిపాద ములం ద్రెళ్లి దీనముగా మనవి చేసికొనఁగా కోపము శమించి ముని 'ఓయి, నీవు ఏనుఁగవేమో అగుదువు, అది తప్పదు. మఱి ప్రచండశక్తి యనువానిని మృగాంకదత్తునిమంత్రిని నాగ శాపమున కీడ్వడి కన్నులు కోలుపోయినవానిని ఎప్పుడు ఓదార్చి

ప్రీతితో అతిథిసత్కారము చేసి యతనికి నీవృత్తాంతమెల్ల చెప్పుదువో, అప్పుడు ఈశాపమునుండి మోక్షము పొందుదువు. అప్పుడే పూర్వము శివుఁడొసఁగిన యాగంధర్వత్వము నీకు కలుగును. ఆ నీయతిథికిని అపుడే మరల దృష్టికలుగును.' అని చెప్పి తనదారిని పోయెను. వెంటనే భీమభటుఁడు ఏనుఁగాయెను. మిత్త్రమా, నేనే ఆభీమభటగజమను, నీవే ప్రచండశక్తివి. ఇపుడే నాశాపము తీఱినది. ఇట్లు పలికి యాగజము పోయి తత్క్షణము దివ్యరూపముతోడి గంధర్వుఁడాయెను. ప్రచండశక్తియు కన్నులు వచ్చి నేత్రోత్సవముగా నుపకారి నాగంధర్వునిఁ గాంచెను.

అంతట తీవలచాటునుండి వారివృత్తాంతమెల్ల నరయుచుండిన మృగాంకదత్తుఁడు నిశ్చయ మెఱింగినవాఁడై తనసచివులతోఁగూడ బయలుపడి పరుగున వచ్చి హర్షోత్కర్షంబున ప్రచండశక్తిని కవుంగిలించుకొనెను. అతఁడును అకాలామృతవర్షమునఁ దోప్పదోఁగినవానివలెనై అతనిం గని పాదములకు సంభ్రమంబున ప్రణమిల్లెను. వారిరువురు చిరవిరహక్లేశము ప్పొంగి ఒండొరులం గవ్వుకొని పరిదేవించుచుండ గంధర్వుఁడు వారి నోదార్చెను. అంతట మృగాంకదత్తుఁడు గంధర్వునికి మ్రొక్కి యిట్లనియె:— 'మాకు మామిత్త్రుఁడితఁడు దొరకుటయు, ఇతనికి మరల దృష్టి కలుగుటయు ఇది యెల్ల, మహాత్మా, నీప్రసాదంబకదా, కాన నీకు నమస్కారము.' గంధర్వుఁ

డి ట్లనియె:—'రాజపుత్రా, కడమమంత్రులును త్వరలో దొరకుదురు, శశాంకవతిని సాధింతువు, సామ్రాజ్యముం బొందుదువు. అధైర్యపడకు. నేను పోయెదను. నీవు న న్నెప్పుడు రమ్మని తలంతువో అప్పుడు వచ్చెదను.' ఇవ్విధమున నతఁడు శాపము తీఱి మేలొంది రాజపుత్త్రునికి నఖ్య మొసంగి, హారకేయూరముల శింజితంబులు దిక్కులనిండఁగ నింగి కెగసి పోయెను. ప్రచండశక్తి దొరకినందులకు సంతసించి మంత్రులతో మృగాంకదత్తుఁడు ఆపగలు అటనే గడపెను.

---

## ౮-వ తరంగము.

## విక్రమకేసరికథ.

క. ఎవ్వని తొండపు దెబ్బకుఁ
బువ్వుల జడినోలె రక్కమొత్తములు దివిఁ
రివ్వనఁ గ్రిందికి రాలునొ
యవ్విఘ్నేశ్వరుఁడు మమ్ము నాదటఁ గాచుఁ.

ఆరాత్రి యటం బుచ్చి మృగాంకదత్తుఁడు తెల్లవాఱఁగానే ప్రచండశక్త్యాదిమంత్రిసమేతుఁడై శశాంకవతికై మరల నుజ్జనిం గూర్చి పయన మారంభించి యితరమంత్రులను వెదకుచుం బోవు చుండెను. పోవు చుండఁగా నొకచోట దాగిలో విక్రమకేసరి యనుమంత్రిని ఆకాశమార్గమున నత్యంత వికృత

రూపుఁ డొకఁడు మోచి తెచ్చుచుంటం గని మృగాంకదత్తుఁడు ఆవింత నితరులకు చూపునంతలో విక్రమకేసరి వాని బుజము నుండి మృగాంకదత్తుని చెంత దిగి తనమోమున ఆనందాశ్రువులు వెల్లిగొన ఏలికపాదములకుం బ్రణతిసేసెను. అతండును హృష్టుఁడై యతనిం గవుంగిలించెను: ఇట్లు కడమ మంత్రులును అతని సంభావించిన యనంతరము విక్రమకేసరి యాపురుషుని తాను స్మరించినప్పుడు రావలసిన దని యాజ్ఞాపించి పంపి వేసెను. అందఱును కూర్చుండిరి. అంతట మృగాంకదత్తుఁ డడుగఁగా విక్రమ కేసరి తనవృత్తాంత మిట్లు చెప్పసాగెను. అపుడు నాగ శాపమున మి మ్మెడఁబాసి పెక్కుదినములు వెదకియు మి మ్మెచటనుం గానక, మీ రెల్ల నుజ్జయినికే గదా పోవుదురు, అటకే పోయిన మిమ్ముఁ గందు నని, నేను ఉజ్జయినికి పయనమై దానిచెంత బ్రహ్మస్థల మను నొక యూరిపజకుం బోయి అచట నొక బావి గట్టున చెట్టునీడలో కూర్చుంటిని. అంత నటకు పాముకాటున నొగులుచు నొక ముసలి బ్రాహ్మణుఁడు వచ్చి నన్నుఁ గని 'పుత్రా, ఇక్కడ నుండకు, లే, నాగతి నీకు నయ్యెడిని. ఇట నొకమహాసర్ప మున్నది అది నన్నుఁ గఱవఁగ నోవు సైఁపజాలక నే నీనీట దేహము విడువ వచ్చితిని.' అని పెచ్చరించెను. అంత నేను కనికరించి యతని మరణోద్యోగ మును మాన్చి విషవిద్యచే నతని నిర్విషునిఁ జేసితిని. అంతట నావిప్రుఁడు నావృత్తాంతము అక్కఱగా నడిగి విని ప్రీతుఁడై

'నాయనా, నీవు నాకు ప్రాణదానము చేసితివి. కావున, మా తండ్రి నా కిచ్చినది బేతాళసాధనమంత్రము నేను నీ కిచ్చెదను, మహావీరుఁడవు నీవు గ్రహింపుము. ఇది మీబోఁటిమహాసత్త్వలకు ఫలించును, ఉపయోగపడును, మముబోఁటియల్పసత్త్వలు దీన నేమి ఫల మొందఁగలరు?' అని పల్కెను. అంత నేనంటిని: 'ద్విజోత్తమా, మృగాంకదత్త వియుక్తుఁడను, బేతాళుఁడు నాకేల?' ఆమాటకు బ్రాహ్మణుఁడు నవ్వి యిట్లనియె:-వత్సా, ఏమి? బేతాళునివలన ఎట్టి కోరికలం బొంద వచ్చునో యెఱుఁగవా? పూర్వము త్రివిక్రమసేనుఁ డనురాజు బేతాళునిప్రసాదమున విద్యాధరైశ్వర్యము సయితము పొందలేదా ? ఆకథను చెప్పెదను వినుము.

## త్రివిక్రమసేనుని కథ.

గోదావరీతీరమున ప్రతిష్ఠాన మని దేశ మొకటి యుండెను. దాని విక్రమసేనుని కుమారుఁడు త్రివిక్రమసేనుఁడు కీర్తిమంతుఁడు పూర్వ మేలుచుండెను. అతని యోలగమునకు ప్రతిదినమును సేవార్థము క్షాంతిశీలుఁ డను పేరి శ్రమణభిక్షుఁ డొకఁడు వచ్చి పం డొకటి కానుక పెట్టుచుండెను. ప్రతిదినము రాజు అట్లు పండుం గఱకొని చెంతనుండు కోశాగారాధ్యక్షునిచేతి కిచ్చుచుండెను. ఇట్లు పదివత్సరములు గడచినవి. అంతట నొకనాఁడు భిక్షువు పం డిచ్చి పోయిన తర్వాత రాజు కావలి వారిచేతినుండి తప్పించుకొని తనకడకు వచ్చిన

యాంటక్రోఁతిపిల్లకు ఆపం డిచ్చెను. క్రోఁతిపిల్ల దానిం దినుచు పగుల్పఁగా అందుండి వెలలేని మేలిరత్న మొకటి క్రిందఁబడెను. దానిం గని కైకొని రాజు భాండాగారికునిం బిలిపించి 'ఓయి, ఈ సన్న్యాసి నిత్యము నిచ్చుచుండిన పండ్లు నీచేతి కిచ్చుచుంటినే అవియేవి?' అని యడిగెను. అతఁడు భయముతో 'దేవా, వానిని తలుపు తీయకయే నేను దిడ్డిదారిని గంజములోఁబల వేయుచుంటిని. ఇపుడు దేవరయాజ్ఞయేని తలుపు తెఱచి చూచెదను.' అని విన్నవించెను. అందులకు రాజు అంగీకరింపఁగా కోశాధ్యక్షుఁడు పోయి క్షణములో మరల వచ్చి 'దేవా, ఆపండ్లు క్రుళ్ళిపోయినవి, అవి యగపడలేదు గాని యిపు డచ్చోట గొప్పరత్నాలప్రోవు జ్వలించుచున్నది.' అని విన్నవించెను. విని సంతసించి రాజు ఆమణులు ఆకోశరక్షకుని కిచ్చివేసెను. మఱునాఁడు మరల భిక్షువు యథాపూర్వము వచ్చి పండు కానుకపెట్టఁగా, రాజు ఇతనితో 'ఓభిక్షూ, ప్రతి దినము నిట్లు ధనము వ్యయించి నన్నుఁ గొలిచెద వేల? కారణము చెప్పువఱకు ఇపుడు నీఫలమును నేను గ్రహింపను.' అనెను. భిక్షువు రాజుతో ఏకాంతమున 'రాజేంద్రా, వీరుని సాయము వలసిన మంత్రసాధన మొకటి నాకుంగలదు. అందు నీవు వీరవతంసుఁడవు నాకు సాయ మొనర్తు వని నాప్రార్థన.' అని విన్నవించెను. రా జందుల కంగీకరించెను. 'అట్లయిన ఈఁరాగలకృష్ణచతుర్దశి రాత్రి ఈ యూరి పెద్ద వల్లకాటిలోని మఱ్ఱి

చెట్టుక్రింద నే నుందును, అచటికి నీవు వచ్చి నాకెలుకపలుచు కొనవలయును.' అని శ్రమణుఁడు వక్కాణించెను. అట్లే చేసెద నని రాజు ఒప్పుకొనెను. అంత క్షాంతిశీలుఁడు సంతసించి తనయిక్కకు పోయెను. అనంతరము కృష్ణచతుర్దశినాఁడు మహా సత్త్వుఁడు త్రివిక్రమసేనుఁడు భిక్షునికిచ్చినమాటను జ్ఞప్తిచేసికొని రాత్రి నల్లపలువలు దాల్చి చీఁకటిమ్రాని పువ్వులు సిగం జుట్టు కొని, కైదువు కేలం గొని రాజధాని వెలువడి, ఘోరాంధ తమసనివహమలీమసంబును, చితానలోగ్రనయనజ్వాలాదారుణ దర్శనంబును, అసంఖ్య నరకంకాళకపాలాస్థి వికంకటంబును, హర్షమాణ సన్నిహిత తోత్తాల భూత బేతాళ సంవేష్టితంబును, స్ఫూర్జన్మహాశివారావంబును నై, మహాభైరవావరావతారం బుంబోలె గంభీరభీషణం బయిన శ్మశానంబును బెగడు వడక చొచ్చి వెదకి యాభిక్షువును మఱ్ఱిచెట్టుక్రింద మండలన్యాసము సేయుచున్న వానిఁ గాంచి తలిసియం జని 'భిక్షుఁడా, ఇదె వచ్చి తిని, నీకేమి చేయవలయును చెప్పుము.' అని యడిగెను. ఆ మాట విని భిక్షువు రాజుం గని సంతసించి 'రాజా, దయసూపుదువేని, ఇటకు దక్షిణముగా దూరమున ఒంటిగా నొకశింశు పావృక్ష మున్నది. అందు ఉరిఁదివియఁబడి చచ్చిన మగశవ మొకటి వ్రేలు చున్నది. వీరాగ్రణీ, దాని నిటకు దెత్తువేని నా కుపకార మగును.' అనెను. మహావీరుఁడు రాజు వల్లె యని యందుచున్న సొదకొలవియొకటి దివ్విటిగా కేలఁ గొని యంధ

కారములో దక్షిణాభిముఖుఁడై పోయి ఎట్లో యా శింశుపా వృక్షంబు నన్గొనియెను. సొదపావలచే కాలి పొలవల్చుచు బూతమువోలె నున్న యాశింశుపాతరువున స్కంధమున వ్రేలుచున్న పీనుంగుం గని చెట్టెక్కి త్రాడు తెంచి క్రిందఁబడవైచెను. పడుచునే యాశవము నొప్పి తగిలినదివోలె ఏడ్వం దొడంగెను. అంత రాజు చెట్టు దిగి వచ్చి ప్రాణ మున్నదో యని కనికరముతో దానిదేహమును తడవెను. అంత నది బొబ్బనవ్వు నవ్వెను. అంతట రాజు దానిలో బేతాళుఁడు ప్రవేశించియున్నాఁడని యెఱింగి బెగ్గడిలక దానితో 'ఏల నవ్వెదవు? పోదము రమ్ము' అని పిలుచునంతలో నది భూమిమీఁద మాయమై ఎప్పటిలెనే చెట్టున వ్రేలుచుండెను. రాజు మరల చెట్టెక్కి దానిని దింపెను. వీరపురుషుల చిత్తరత్నములు వజ్రముకన్నం గఠినములు గదా. అనంతరము బేతాళాధిష్ఠితమయిన యాశవమును బుజమునఁ బెట్టుకొని శ్మశానంబున త్రివిక్రమసేనుఁడు నడువసాగెను. అతఁడు పోవుచుండ బుజముమీఁదిపీనుఁగునందున్న బేతాళుఁడు ఇట్లనియె:—రాజా; దారియలఁత తెలియకుండ నొకకథ చెప్పెదను వినుము.

**UNIVERSITY OF HYDERABAD LIBRARY**

Acc. No. 312

Call No. ______________

Author వెంకటరాయశాస్త్రి, వేదము

Title శ్రీ కథాసరిత్సాగరము.
భాగము - 4.

| Due on | Borrower's Signtaure | Returned on |
| --- | --- | --- |
| | | |

**UNIVERSITY OF HYDERABAD**

**LIBRARY**

**HYDERABAD ( A. P. )**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**